ఆర్. యస్. యస్. కథ

ఆంగ్లమూలము :

కె. ఆర్. మల్కానీ

తెలుగుసేత :

పిరాట్ల వెంకటేశ్వర్లు

స్నేహలతా పబ్లిషర్స్

హైదరాబాద్

ద్వితీయ ప్రచురణ : నవంబరు 1988.

వెల : రూ. 40-00

ముఖచిత్రం : అమర మోహన్

ముద్రణ : స్నేహలతా ప్రింటర్స్
బరకత్‌పురా
హైదరాబాద్-27
ఫోన్ : 66618

ప్రచురణ : స్నేహలతా పబ్లిషర్స్
2-1-406, నల్లకుంట
హైదరాబాద్-44

పంపిణీదారులు: సాహిత్యనికేతన్
3-4-852, బర్కత్‌పురా
హైదరాబాద్-27

‘పరిపూర్ణ స్వయం సేవక్’

దీనదయాళ్ ఉపాధ్యాయ

పవిత్ర స్మృతికి

ఉపక్రమణిక

దశాబ్దాల క్రితం సంఘంలో పాడుకుంటుండే ఒక పాటలో మొదటి చరణమిది.

వృత్త పత్రమె నామ ఛపేగా, పహనూంగా స్వాగత సముహార్ ।
ఛోఢ చలో యహ క్షుద్రభావనా, హిందూరాష్ట్రకీ తారణ హార్॥

(నా పేరు వార్తాపత్రికలలో పడుతుంది. నాకు స్వాగత పుష్పహాలలు వేయబడతాయి. అట్టి క్షుద్రమైన ఆలోచనలను వదిలివేయి. హిందూ రాష్ట్రాన్ని రక్షించు.)

సంఘాన్ని అర్థంచేసుకొనడానికి ఒకసారి డాక్టర్‌జీ స్నేహితులొకరు తమ ఊరు నుండి నాగపూర్ వచ్చి, డాక్టర్‌జీ ఇంట్లో వున్నారు. సంఘం ఆయనకు ఎంతగా నచ్చిందంటే ఆయన తన తిరుగుప్రయాణాన్ని వాయిదా వేయదలచి, తన కుటుంబ సభ్యులకు తెలియపర్చడంకొరకు డాక్టర్‌జీని కాగితం, కలం యిమ్మని అడిగారట. ఆశ్చర్యకరమైన విషయమేమంటే డాక్టర్‌జీ వద్ద కాగితం కాని, కలంకాని దొరకలేదు. ప్రచారానికి సంబంధించిన ప్రాథమిక వస్తువులపట్ల ఒకరకమైన నిర్లక్ష్యం అనండి లేదా జుగుప్స అనండి డాక్టర్‌జీలో వుండేది. అయితే ప్రజాజీవనంలో డాక్టర్‌జీ చాలాకాలం ఉన్నారు. ఒక్కొక్కసారి ప్రచారంమాత్రమే సంస్థలుచేసేపని అని తెలుసు. పనికి బదులుగా ప్రచారం మాత్రమే జరగడం కూడా వారికి తెలుసు. కనుకనే డాక్టర్‌జీ ప్రచార సంరంభాన్నంతటనూ ప్లేగు వ్యాధిని దూరంగా ఉంచినంత దూరంగా వుంచారు.

ఫొటోల ప్రచారాన్నికూడా ఆర్.యస్.యస్. దూరంగానే వుంచింది. డాక్టర్‌జీవి అరడజను ఫొటోలుకూడా లభించలేదు. "నన్ను ఫొటో తీయడానికి ప్రయత్నించడం నా ఆయుష్షును తగ్గించడం" అని అంటూ శ్రీ గురూజీ ఫొటోగ్రాఫర్లను నిరుత్సాహపరచేవారు. వినడానికి విచిత్రంగా కనపడుతుందిగాని ప్రముఖ ఆర్.యస్‌యస్. కార్యకర్తల గూర్చిపు ఫొటోలు ఎక్కడా లేవు. వారిలోని ప్రచారోన్ముఖతకు మనకు ఆనందంవేసినప్పటికీ తర్వాత తరాలవారికి నష్టదాయకమైంది.

ప్రారంభంలో 'మాట'(Word) అనే పదం ఉందని బైబిలు చెప్తుంది. మృదువైన ఆత్మీయతతో కూడిన 'మాట' పట్ల డాక్టర్‌జీకి విశ్వాసముంది. బహిరంగంగా, ఆర్భాటంతో జరిగే ప్రచారంకన్నా హృదయాలు కలిసి మాట్లాడుకోనడంలోనే ఎక్కువగా సాధించవచ్చునని డాక్టర్‌జీకి తెలుసు. వ్యక్తి సౌశీల్యాన్ని జాతీయశీలాన్ని నిర్మాణంచేయడం ఆయన లక్ష్యం. పత్రికలలో లభించే ప్రచారం కంటే నిశ్శబ్దంగా జరిగేపని అట్టి మహత్తరకార్యానికి పనికివస్తుందనికూడా ఆయనకు తెలుసు. అయితే సమయం ఎక్కువ పడ్తుంది కాని తప్పనిసరిగా పనిజరుగుతుంది. 'వేచియుండండి, గమనించండి, ప్రార్థించండి' అనే వాక్యం ఆయనకు చాలా ఇష్టమైనది. డాక్టర్‌జీ సంఘ కార్యాన్ని ప్రారంభించడానికి వారణాశివెళ్ళి, ఆయన స్నేహితుడు బాబాసాహెబ్ సావర్కార్ ఇంటికి వెళ్ళి తలుపు తట్టారు. ఆ సావర్కార్ తలుపు తీయకుండానే, కిటికీలోనుండి కొంటెగానవ్వుతూ "వేచియుండండి, గమనించండి. ప్రార్థించండి' అని అన్నాడట.

ప్రతివారము బౌద్ధిక్ (ఉపన్యాసము)లు, చర్చలు ఆర్.యస్.యస్.లో జరుగుతాయి. ఇంతకంటే సంఘాన్ని అర్థంచేసుకొనడానికి పనికివచ్చే సాహిత్యం కావాలంటే వేదాలనుండి వివేకానంద వరకు కాని హిందూచరిత్రలో ఏ ఘట్టమైనా చదివితే సరిపోతుంది.

ఇంకా ఎక్కువ ఆసక్తికలవారు సావర్కార్ రచించిన "ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామము' 'హిందూ పదపాదశాహి' భాయీ పరమానంద వ్రాసిన 'హిందూ సంఘటన' లాలాహరదయాల్ వ్రాసిన "హిందూజాతి సామాజిక విజయం", సావిత్రిదేవి వ్రాసిన "హిందువులకు హెచ్చరిక" 'మహాత్ముల జీవన చరిత్రలు" వగైరా చదువుతారు. కాని ఆర్.యస్.యస్. సాహిత్యమంటూ ప్రత్యేకంగా ఏమీలేదు. పత్రికలలో ప్రచారము వగైరాలసలే లేవు. ఏవిధమైన పత్రికాప్రచారం లేకుండా వ్యతిరేక ప్రచారాల దుమారాన్నిసైతం తట్టుకొని ఆర్.యస్.యస్. నేటి స్థితికి పెరిగిందంటే డాక్టర్‌జీ కల్పనలోగల నిశ్శబ్దంగా పనిచేయడంలో ఉండిన మహత్తర విశేషమే కారణం.

నిశ్శబ్దంగా పనిచేసే ప్రవృత్తిగల ఆర్.యస్.యస్. కార్యాన్ని కొందరు "రహస్యంగా" జరిగే కార్యంగా అర్థంచేసుకొన్నారు. "బహిరంగంగా పనిచేసే

ఒకే ఒక సంస్థ ఆర్.యస్.యస్. మాత్రమే. బహిరంగంగా ఆట స్థలాలలో నిత్యమూ ఆర్.యస్.యస్. పనిచేస్తుంది" అని గురూజీ స్పష్టంచేశారు.

ఆర్.యస్.యస్. అన్ని ప్రాంతాలకు విస్తరించిన (1939) పిదపనే ఆనాటి సర్ కార్యవాహ(ప్రధానకార్యదర్శి) శ్రీగురూజీ 'మనము-మన జాతీయత నిర్వచనం 'అనే చిన్న పుస్తకం వ్రాశారు. ఆ తర్వాత రెండు దశాబ్దాలకుగాని 1956లో శ్రీగురూజీ 51వ జన్మదినోత్సవ సందర్భంగా "వ్యక్తి-ఆయన జీవన కార్యం" (The Man and his Mission) అనే పుస్తకంలో శ్రీగురూజీ జీవితాన్ని, ఆయన కార్యాన్ని సంక్షిప్తంగా భారత ప్రకాశన్ వారు ప్రచురించారు. అయినా ఈ పుస్తకం ఏ భారతీయ భాషలోనికి అనువదింపబడలేదు. ఇరవై సంవత్సరాల వరకు ఆ పుస్తకంకూడా తిరిగి ముద్రింపబడలేదు కూడాను.

ఇంతకాలము కూడా కనీసం డాక్టర్‌జీ జీవనచరిత్రకూడా లేదు. చిట్టచివరకు నానాపాల్కర్ మరాఠీలో వ్రాస్తే, దానిని హిందీలోనికి అనువదించడం జరిగింది. కాని అంత చక్కటి జీవిత చరిత్ర ఇంగ్లీషులోనికి అనువదించబడనేలేదు.

1960 ఆ ప్రాంతాలలో బెంగుళూరు విక్రమ ప్రకాశన్‌వారు శ్రీగురూజీ అప్పుడప్పుడు వెలువరించిన అభిప్రాయాలను **Bunch of Thoughts** (తెలుగులో పాంచజన్యము)గా వెలువరించారు. అందులో ఎక్కువగా తాత్కాలిక విషయాలనిపించినప్పటికీ శాశ్వత కాలీనసత్యాలుగా కనిపిస్తాయి. జీవితగమనాన్నంతటిని ఆద్యంతాలుగా వారు దర్శించారు. పిన్న వయసులో మరణించేవారికి జీవితభీమా లాభదాయకంగాని, తక్కినవారికి నష్టదాయకమని స్పష్టంచేశారు. వేసవికాలంలో వేడెక్కి, శీతాకాలంలో మరింత చల్లబడే సిమెంటుకన్నా పూర్వకాలంలో వాడబడిన సున్నం మన మైదాన ప్రాంతాల కట్టడాలకు తగినటువంటిదని వారు అభిప్రాయపడ్డారు. పట్టణాలను పరిశుభ్రం చేయడానికి ప్రవేశించే నదులు కాలుష్యానికి గురౌతున్నాయి. పట్టణాలను వదలగానే ఆ నదీప్రవాహాలను సూర్యుడు, వాయువు, భూమి తిరిగి పరిశుభ్రం చేస్తున్నాయని ఒకసారి అన్నారు.

శ్రీగురూజీ మరణానంతరం "సంఘదర్శన్" అనే పేరిట ఆయన భావాలన్నింటినీ సమగ్రంగా ప్రచురించాలనే ప్రయత్నం జరిగింది. ఇప్పటికే ఐదు

సంపుటాలు వెలువడ్డాయి. నవీన భారతవర్షాన్ని అర్థంచేసుకొనడానికి స్వామి వివేకానంద సంపూర్ణ గ్రంథావళిని చదువవలసినట్లే సంఘాన్ని శ్రద్ధగా అర్థం చేసుకోడానికి ప్రయత్నించేవారికి "సమగ్ర దర్శన్" అంత అవసరం. అయితే అవి అందరకూ సులభంగా అర్థమయేవికావు. పైగా ఇంగ్లీషులో వెలువడలేదు కూడాను.

విచిత్రమైన పరిస్థితి ఏమంటే ఆర్.యస్.యస్. ప్రముఖంగా వార్తలలో వుంటూనేవచ్చింది. తీవ్రమైన జిజ్ఞాసతో సంఘాన్ని గూర్చి తెలుసుకోవాలనే కుతూహలంగలవారిని సంఘ శాఖకు వెళ్ళి అర్థంచేసికొనమంటే సరిపోదు. సంఘాన్ని గూర్చిన సమాచారం వారికి తప్పనిసరిగా అందచేయాలి. ఆ అవసరాన్ని తీర్చడంకొరకు చేస్తున్నప్రయత్నం ఈ చిన్న గ్రంథం.

దాదాపు 20 సంవత్సరాల క్రితం సంఘ నిర్మాతలలో ఒకరైన దాదారావు పరమార్థ నన్ను డాక్టర్ హెడ్గేవార్జీ జీవిత చరిత్రను వ్రాయమని సూచించారు. కాని నాకు వారి పాదాల వద్ద కూర్చుని సంఘాన్ని అర్థంచేసుకునే అదృష్టం లభించలేదు కనుక స్పష్టమైన సమాచారం ఈయలేనేమోనని సమాధానం యిచ్చాను. అనుకుంటే పెద్దకష్టమైనపనికాదని శ్రీ దాదారావుజీ అన్నారు. నామటుకు నేను ఆ విషయాన్ని మనస్సులో గుర్తుపెట్టుకున్నాను.

ఎమర్జెన్సీ సమయంలోనూ, ఆ తర్వాతకూడా ఆర్.యస్.యస్.ను గూర్చిన సమగ్ర సాహిత్య అవసరం కన్పడింది. కొందరు స్వయంసేవకులు కొంత తయారుచేశారుకాని వివిధములైన అంశాలపైననే కేంద్రీకరింపబడింది. ఆ దృష్ట్యా సంఘాన్ని గూర్చి సమగ్రమైన వివరణ రాలేదు.

గత సంవత్సరం అకస్మాత్తుగా ఆర్.యస్.యస్. రాజకీయ విమర్శలకు కేంద్రమైంది. 1979 జూన్ నెలలో ఒక ప్రచురణకర్త ఆర్.యస్.యస్.పై సమగ్రమైన గ్రంథాన్ని అతిత్వరలో ఈయమని అడిగారు. లోగడ నేను చేసిన కృషికి తోడుగా కావలసిన సమాచారాన్ని సేకరించడానికై ఒక నెల, ఆతర్వాత వ్రాతప్రతి తయారుచేయడానికై ఇంకొక నెల సమయం పట్టింది. ఈలోగా జనతా ప్రభుత్వం పతనమైంది. ఆ ప్రచురణకర్తకు కూడా "ఆసక్తి" సన్నగిల్లింది.

ఈలోగా ఇంకొక ప్రచురణకర్త వచ్చారు. "సామాజిక దృక్పథం"అనే కొత్త అధ్యాయాన్ని సూచించారు. గ్రంథం ప్రెస్‌కు వెళ్ళేలోగా జనవరి ఎన్నిక

లలో జనతాపార్టీ ఓడిపోయింది. ఆర్.యస్.యస్. పాత్రనుదుర్మార్గంగా చిత్రించిన వారంతా కాగితంపులిగా చిత్రించడంతో ఈ ప్రచురణకర్తలోకూడా ఆసక్తి తగ్గిపోయింది. బహుశః ఈ యిద్దరు ప్రచురణకర్తలకూ ఆర్. యస్. యస్. పతాకశీర్షికలలో వుంటేతప్ప ప్రాధాన్యత కలుగదుకాబోలు. గమ్మత్తయినవిశేష మేమంటే అవిధమైన ప్రచారానికి ఆర్.యస్.యస్. ఇంతకాలం విముఖంగానే ఉన్నది.

ఈస్థితిలో నా స్నేహితుడు ఇంపెక్స్ ఇండియా ప్రచురణకర్త, శ్రీ శీతారామ గోయల్ ప్రచురిస్తానని ముందుకువచ్చారు. ఆయన కేవలం ప్రచురణకర్తమాత్రమేకాదు. పేరొందిన రచయిత, మేధావికూడాను. ఆయన ఇచ్చిన అనేక విలువైన సలహాలకు నేను చాలా కృతజ్ఞుడిని. నాకు చాలాప్రేరణకల్గించి వ్రాయడానికి ప్రోత్సహించిన మొదటి ప్రచురణకర్తకు ధన్యవాదములు. ఇంకొక అధ్యాయాన్ని జతచేయించిన రెండవ ప్రచురణకర్తకు కూడా కృతజ్ఞతలు.

ఈ గ్రంథం ఆర్.యస్.యస్. అధికారికమైన గ్రంథంకాదు. కాని సర్ సంఘచాలక్ బాలాసాహెబ్ దేవరస్, సర్ కార్యవాహ రజ్జూ భయ్యాగార్ల పరిశీలనతో కూడిన అదృష్టం లభించింది. వారిద్దరిచ్చిన అనేక విలువైన సూచనలకు హృదయపూర్వక కృతజ్ఞతలు. మొదటి రెండు అధ్యాయాలు అంత పటిష్టంగా లేవని అన్న రజ్జూభయ్యాకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు. శ్రీ దాదారావ్ పరమార్థతో ఆనాడు నేను వెలిబుచ్చిన భయం ఆధారరహితమైనది కాదన్న మాట.

నాగపూర్‌కు చెందిన ప్రొ॥ వరాట్‌పాండే, ఢిల్లీకి చెందిన శ్రీ చమన్ లాల్‌జీలు విలువైన సమాచారాన్ని అందజేశారు. సరైన సంస్కృత శ్లోకాలను అందజేసిన రాజభావ్ దిగ్వేకర్‌జీ, దీనదయాళ్ పరిశోధనా సంస్థలో గ్రంథం వ్రాయడం జరిగినందులకు, ఫొటోలను ఏరికూర్చిన భవాన్‌సింగ్‌కు, టైప్‌చేసిన సురేష్, విజయ్‌లకు, హిందీలో సమాచారాన్ని అందజేసిన అరవింద్, 'విషయ సేకరణ'కు తోడ్పడిన ఆర్.సి. చాతురే "ఇండెక్స్" తయారుచేసిన సుందరికి అందరకూ నా ధన్యవాదములు.

పాత కార్యకర్తలకు కొందరికి ఈ గ్రంథాన్ని చదివిన పిమ్మట అనేక ముఖ్యమైన సంఘటనలు, విశేషాలు, ఫొటోలగూర్చి గుర్తుకువచ్చియుండవచ్చును. వాటితో ఈగ్రంథం యొక్క విలువ మరింత పెరుగుతుందని వారు భావించిన యెడల వాటిని నాకు పంపవలసినదిగా, విజ్ఞప్తిచేస్తున్నాను. మున్ముందు ఇంకొక ముద్రణలో ఉపయోగపడతాయని భావిస్తున్నాను.

జన్మాష్టమి 1980. కె. ఆర్. మల్కానీ

అనువాదకుని మాట

ఆధునిక భారతావనిలో అపూర్వమైన ఉద్యమాన్ని గురించిన చరిత్ర వ్రాయడం గొప్పసాహసవంతమైన కార్యం. శ్రీ కె.ఆర్. మల్కానీ లాంటివారు కనుక అందులో విజయం సాధించారు. ఆయనకున్న రచనా చాతుర్యాన్ని మొత్తం రంగరించి అత్యంత సరళంగా, ఆలోచించగల ప్రతివారికి హృదయానికి హత్తుకునేలా చిత్రించగల్గారు. చదివినవారెందరో ప్రభావితులై యుంటారు. మున్ముందుకూడా సమాజంలో ప్రభావం కల్గిస్తూనే వుంటుంది ఈ గ్రంథం.

అట్టి గ్రంథాన్ని చదివినపిమ్మట తెలుగులో కూడా ఉంటే సంఘకార్యానికి ఉపకరణంలాగ తోడ్పడుతుందని అనిపించింది. కాని నాకున్న శక్తిసామర్థ్యాలు పరిమితమని నాకు తెలుసు కనుక ఇంకెవరన్నా ఈపనికి పూనుకుంటే బాగుంటుందని ఆశపడ్డాను. కాని నామూలంగా ఈ గ్రంథం తెలుగులో రావడం విధాత సంకల్పమని ఇప్పుడు అనిపిస్తున్నది.

ఈ గ్రంథం విశేషంగా మిమ్ములను హత్తుకునేలా చేస్తే ఆ ఘనత శ్రీ మల్కానీకే దక్కుతుంది. లోపాలు కన్పడితే నావిగా భావించి మన్నించవలసినదిగా కోరుతున్నాను.

ఈ అనువాదంలో ప్రధానపాత్రధారి శ్రీ శాయిరంగన్. ప్రాథమికంగా చాలాభాగం అతనితోనే జరిగింది.

అనువాదమంతటనూ శ్రద్ధగా చదివి, సవరణలు సూచించినవారు శ్రీ ఆర్. యస్. కె. మూర్తిగారు,

తెలుగులో ప్రచురిస్తామంటే ఆనందంగా అంగీకరించింది శ్రీ కె. ఆర్. మల్కానీ,

ఈ ప్రయత్నం గూర్చి తెలుపగానే ముందుకువెళ్ళమని ప్రోత్సహించింది సంఘ ప్రాంతప్రచారకులు శ్రీ సోమయ్యగారు,

ఈ గ్రంథం అనుకున్నసమయానికి రావడంలో ప్రెస్‌లో తోడ్పడిన శ్రీ ఎన్. గురుమూర్తి, పి. రామకృష్ణ, జాన్ తదితరులకు,

ఇంకా ఎందరో మహానుభావులు అందరకూ కృతజ్ఞతలు.

ఈ గ్రంథం అచ్చుపూర్తవుతున్న సమయంలో ఫొటో బ్లాకులు రావడం వలన అనుకున్న ఫొటోలను ఈయలేకపోయాము.

తమ

16-10-1983 పిరాట్ల వెంకటేశ్వర్లు

వి ష య సూ చి క




[ఆర్.యస్.యస్. సంస్థాపకులు
డా॥ కేశవ బలీరామ్ హెడ్గేవార్




శ్రీ గురూజీ
మాధవ సదాశివ గోళ్వాల్కర్




ప్రస్తుత రసంఘ్‌చాలక్
బాలా సాహెబ్ మధుకర దత్తాత్రేయ దేవరస్



రాష్ట్రీయ సేవికా సమితి శిక్షణ శిబిరము (పైన) బ్యాండ్ (ఘోష్)
సమితి సంస్థాపకురాలు మౌసీజీ కేల్కర్



అవనిగడ్డ దగ్గరలో దీనదయాళపురం నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న శ్రీ నానాజీ దేశముఖ్ (1978)




ఆర్.యస్.యస్. 1978లో ఆంధ్రుల తుఫాన్ బాధితులకొరకు అనకాపల్లి లో శ్రీ రామ్‌నగర్‌ను నిర్మించిన కాలనీని పరిశీలిస్తున్న శ్రీ బాలాసాహెబ్ జీ



గుజరాత్ మోర్వి వరదలలో శవాల తీసివేత




1977లో వరదబాధితుల సేవలో (ఢిల్లీ)



1978లో న్యూఢిల్లీలో నేషనల్ స్టేడియంవద్ద 15వేలమంది (9-11 సం॥)
బాలబాలికలతో జరిగిన విద్యాభారతివారి శిశుసంగమ దృశ్యాలు















సంఘ నిర్మాతలలో కొందరు : ప్రారంభం కుడి నుండి: అప్పాజీ జోషి, దాదారావ్ పరమార్థ, బాబాసాహెబ్ ఆప్టే, మాధవరావ్ మూలే, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, భయ్యాజీ దాణే, ఏకనాథ్ రానడే, బాపురావ్ దేవరస్, యాదవరావ్ జోషి, రజ్జూభయ్యా, దత్తోపంత్ ఠేంగ్డీ, వసంతరావ్ ఓక్.

కేశవుడు

విజయదశమి మంగళ ప్రభాతం. 1925 సెప్టెంబరు 27వ తేదీ నాగపూర్‌లో నయా శుక్రవారిలోని ఒక చిన్న పూరింట్లో సుమారొక యిరవైమంది ఉత్సాహవంతులైన యువకులు గుమిగూడి కూర్చొని ఉన్నారు. ఆ విధంగా సమావేశమై మన దేశపు దైన్యస్థితిని గురించి అందులకై తాము నిర్వహించవలసిన కర్తవ్యాన్ని గురించి వారు చర్చించడం అది మొదటిసారి కాదు. కానైతే తమ భావాలకు కార్యరూపమిచ్చే ఒక సంస్థను నెలకొల్పడానికై వారిపుడు మొదటిసారిగా సమావేశమైనారు. శారీరక శిక్షణ, దేశభక్తి ప్రబోధాల ద్వారా యువకుల హృదయాలలో దేశభక్తిని పూరించి వారిలో అనుశాసనాన్ని నెలకొల్పవలసిన అవశ్యకత గురించి వారిలో ఒకరు ప్రసంగించారు. అందరూ దానిని ఆమోదించారు.

ఈ సన్నివేశాన్ని భావితరాలకు అందించడానికి, పత్రికావిలేఖర్లుగాని, ఫోటోగ్రాఫర్లుగాని లేరక్కడ. ఆ కొత్త సంస్థకు ఏ నిబంధనావళీ లేకపోవడం మాట అటుంచి కనీసం పేరైనా పెట్టడం అనేది జరుగలేదు. అయితేనేం ఒక మహత్తర సంఘటన జరిగిపోయింది. రాష్ట్రీయ స్వయంసేవక సంఘ ఆవిర్భవించింది.

ఈ మహోద్యమం వెనుకనున్న మహనీయుడెవరు? వారు పొందిన స్ఫూర్తి ఏమిటి?

1889 ఏప్రిల్ మొదటితేదీ ఆదివారం హిందువుల సంవత్సరాది అయిన ఉగాది పర్వదినాన జన్మించారు-డాక్టర్ కేశవ బలీరామ్ హెడ్గెవార్. ఆరుగురు సంతానంలో వారు ఐదవవారు-ముగ్గురు సోదరులలో కనిష్ఠులు. పూర్వాచార సంపన్నులైన ఆ బ్రాహ్మణ కుటుంబపు పూర్వీకులు ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణా ప్రాంతానికి చెందినవారు. గోదావరి, మంజీర, హరిద్రల త్రివేణీ సంగమం

2

లోని కందకుర్తి వీరి పూర్వీకుల స్వగ్రామం. మరాఠీ, కన్నడ, తెలుగు ప్రాంతాల సంగమానికి కూడ ఈ గ్రామం సంకేతంగా ఉండేది. వేలు సంవత్సరాలకు పూర్వం హెడ్గెవార్ కుటుంబాన్ని ఈ ప్రాంతపు ధర్మపరిరక్షకులుగా ఆదిశంకరులు నియమించి వెళ్ళారు. కాశ్యప గోత్రానికి చెందిన హెడ్గెవార్ వంశీయులు ఋగ్వేద పండితులుగా ప్రసిద్ధికెక్కారు.

1800 సంవత్సర ప్రాంతంలో హైదరాబాద్ నిజాం ఏలుబడిలో ఉన్న ...ను అనువంశిక స్వగ్రామాన్ని వదలి కేశవుని ముత్తాత తమ వేదపఠనానికి మరికొంచెం మెప్పుదల లభించవచ్చుననే ఆశతో నాగపూర్ చేరి అక్కడ స్థిరపడ్డారు.

తండ్రి బలీరామ్ పురోహితుడిగా ప్రసిద్ధుడు. అగ్నిహోత్రాలకు లోటులేని కుటుంబం వారిది. ప్రాంగణంలో గోమాత తిరుగాడుతుండేది. బలీరాం కాస్త కోపిష్టి అయినప్పటికీ తల్లి రేవతీబాయి అంత నెమ్మదస్తురాలు, సౌమ్యశీల. పెద్దన్న మహాదేవుడు పహిల్వాన్. ఇంట్లోనే వ్యాయామశాల. చాలమంది పహిల్వానుల మాదిరిగానే అతనికీ గంజాయి అంటే ప్రీతి. రెండవ అన్న సీతారాముడు వేదాధ్యయనం చేసేవాడు. కేశవుడికి చిన్నతనంలో మశూచి సోకింది. ఆ మచ్చలు జీవితాంతం తోడుగా ఉండినాయి.

హెడ్గెవార్ సోదరులు పొడుగ్గా, సన్నగా ఉండేవారు. వారందరూ స్నేహ ప్రియులు. వారెంతటి లౌకికులుగా ఉండేవారో అంత ఆత్మీయతను నెరపేవారు.

వారు ఒక కొత్త బావిని తవ్వించారు. దాని నీటి వాడకం ప్రారంభించే ముందు అందులోని అపరిశుభ్రపు నీటిని ఖాళీ చేయాలని సోదరులు నిశ్చయించారు. ముగ్గురూ కలిసి ఒక్కరాత్రిలో బావినంతటినీ ఖాళీ చేసేశారు.

కేశవుని మొదట ఒక సంస్కృత పాఠశాలకు పంపించారు. అక్కడాయన చక్కని సంస్కృత ఉచ్చారణ నేర్చుకున్నాడు. తరువాత నాగపూర్‌లోని నీల్ సిటీ హైస్కూలులో చేరాడు. సహపాఠులలో చిన్నవాడు అవటంతో అందరి

ఆయనను అల్లారుముద్దుగా చూసుకునేవారు, కాని పదేండ్లు నిండకముందే కేశవుడు కుటుంబాన్ని ప్రేమించే స్థాయినుంచి దేశాన్ని ప్రేమించే స్థాయికి ఎదిగాడు. లోకమాన్య తిలక్‌గారి 'కేసరి' పత్రికకు పాఠకుడైనాడు. స్వేచ్ఛకై పోరాడుతున్న భారతావని వాణిగా ఆ పత్రిక ఉంటుండేది.

1897లో విక్టోరియారాణి వజ్రోత్సవాలు. కేశవుడికి స్కూల్లో మిఠాయిలు ఇచ్చారు. ఇంటికివస్తూ ఆ మిఠాయిలను దారిలో ఒక చెత్తకుప్పమీదకి విసిరి పారేశాడు. ఈ విషయం ఇంట్లోని వారికి తెలిసి కారణం అడిగితే కేశవుని సమాధానం "ఆవిడ రాణి మనకు కాదు గదా".

మరోనాలుగు సంవత్సరాల తరువాత, ఏడవఎడ్వర్డు సింహాసనాన్ని అధిష్ఠించిన సందర్భంగా, నాగపూరులో బాణసంచా వేడుకలు జరిగినై. తోటి బాలురంతా ఉత్సాహంతో వేడుకలు తిలకించడానికి వెళితే కేశవుడు మాత్రం నిరాసక్తంగా ఉండిపోయాడు. అదేమంటే "ఆయన మనకు ప్రభువు కాదుగా" అనేది కేశవుని నోటి సమాధానం.

అంతేకాదు నాగపూరును పాలించిన కడపటి భారతీయ ప్రభువులైన భోంస్లేలకు ఒకనాటి స్థావరం సీతాబర్డి. ఆ కోటమీద బ్రిటిషువారి యూనియన్ జాక్ ఎగరటం చూసిన కేశవుడికి, అతని భావాలను అభిమానించే మిత్ర బృందానికీ తీరని వ్యథ కలిగింది. మరి ఆ విదేశీ పతాకాన్ని దించటమెట్లా? యువజన సహజమైన ఉత్సాహంతో వారంతా వజేగురుగారింట్లో ఒక గదిలో చేరి తలుపులు బిగించుకున్నారు, అక్కడినుంచి సరిగ్గా సీతాబర్డీ వేపుకు సొరంగం తవ్వటం మొదలుపెట్టారు. ఏదో ఒకనాటికి ఈ సొరంగంద్వారా కోటలో చేరుకోగలమని, అక్కడ యూనియన్ జాక్‌ను దించివేసి ప్రాచీన భారత జాతీయ పతాకమైన భగవాధ్వజాన్ని ఆ స్థానంలో ఎగురవేయగలమని వారు ఆశించారు. ఇలా మూడు రోజులు తవ్విన తర్వాత పట్టుబడటం మందలించి పంపివేయబడటం జరిగింది

అటు తర్వాత కొద్ది కాలానికి కేశవుని సుఖప్రదమైన కుటుంబం విషాదాలపాలైంది. 1902-1903లలో నాగపూరు ప్లేగు వ్యాధి విలయ తాండవం

చేసింది. ప్లేగు వాతబడిన అనేకుల అంత్యక్రియలను నిర్వహించడం పురోహితుడుగా బలీరాంగారికి బాధ్యత అయింది. ఒక రోజున వారు, వారి భార్య ప్లేగు వ్యాధికి గురి అయినారు. ఇద్దరినీ ఒకేరోజున మృత్యువు వరించింది. ఒకే చితి మీద ఇద్దరూ దహనం చేయబడ్డారు. బాలకేశవుడి భవ్య జగత్తు [illegible] నష్టమయింది.

సోదరులు ముగ్గురు ఇంటిపనులు, వంట వార్పు తమకు తామే చేసుకొనే వారు. మహాదేవుడు అల్లరి చిల్లరగా తిరుగసాగాడు. రాజకీయ సమావేశాలలో పాల్గొంటున్నందుకు, తనకు భంగు సిద్ధం చేయనందుకు ఉగ్రుడై చిన్నారి కేశవుడిని అడపా దడపా బాదుతుండేవాడు. దుఃఖభాజనమైన ఇంటిని వదిలిపెట్టి, సీతారాముడు వేదాధ్యయనంకోసం ఇండోర్ వెళ్ళిపోయాడు.

ఆ రోజుల్లో పస్తులతో, చినిగిన గుడ్డలతో తిరుగుతూ కేశవుడు కనిపించే వాడు. అయినా అతడు నిరాశను దరిచేర నీయలేదు. చదువుకోవటం, రాజకీయ సమావేశాల్లో పాల్గొనటం — యథాప్రకారంగానే కొనసాగించాడు. భారతీయ పత్రికల సముద్ధరణకు తిలక్ "పైసానిధి" సేకరణ ప్రారంభించినప్పుడు కేశవుడు ఉత్సాహంగా ఆ కార్యక్రమానికి చేయూతనిచ్చాడు. అప్పటికే నాయకునిగా పేరు గడించిన మహర్షి మూంజే ఇంట్లో మార్చురి నాటుబాంబుల తయారుచేయడంకూడ నేర్చుకున్నాడు.

ఆ గడ్డు దినాల్లో కేశవుడికి ఎంతగానో, ఊరట నిచ్చినవారు — అతడి దూరపు బంధువు, పినతండ్రి అయిన, ఆబాజీ హెడ్గెవార్. ఆబాజీ నాగపూర్ దగ్గరలో గల రాంపాయలీలో రెవిన్యూ ఇన్స్పెక్టరుగా ఉండేవారు. కేశవుడు ఎప్పుడు వచ్చినా ఆయన ఆప్యాయతతో ఆదరించేవాడు. 1907 లో దసరా సందర్భంగా కేశవుడు రాంపాయలీ వెళ్ళాడు, ప్రాచీన భారతంలో సేనాపతులకు విజయదశమి సందర్భంగా విజయాన్వేషులై "సీమోల్లంఘనం" చేయటం (సరిహద్దులు దాటడం) పరిపాటిగా వుండేది. ఆనాడు రాంపాయలీ గ్రామస్థుల నుద్దేశించి కేశవుడు ప్రసంగిస్తూ సీమోల్లంఘనం యొక్క ప్రాశస్త్యాన్ని వివరించి, "వందేమాతరం" పతాకం క్రింద సమీకృతులమై దాసత్వపు సీమలను

నాటి స్వతంత్ర రాజ్యంలోకి సాగిపోదామని ఉద్బోధించాడు. అగ్నిస్ఫోరకమైన ఈ ప్రసంగపు వార్త ప్రాంత రాజధాని నాగపూరుకు చేరింది. "రాజద్రోహ" నేరం క్రింద కేశవుడి మీద విచారణ జరపడానికి ఆర్మ్‌స్ట్రాంగ్ అనే ప్రభుత్వ న్యాయవాది వచ్చాడు. కాని భండారాకు పంపిన న్యాయవాది పురుషోత్తమ సీతారామదేవ్ "వందేమాతరం నేరం కాద"ని కలెక్టరు రుస్తుమ్‌జీకి నచ్చజెప్పాడు. ఆర్మ్‌స్ట్రాంగ్ కుయుక్తులు ఫలించలేదు. అయితే ఆరోజు నుంచి చివర వరకు బ్రిటిష్ పోలీసులు కేశవుని నీడలా వెన్నంటి ఉండేవారు.

కేశవుడి రాజకీయ కార్యకలాపాలవల్ల ప్రభుత్వం ఆబాజీని సైతం ఎంతగానో వేధించింది. దాంతో వారు తమ ఉద్యోగానికి రాజీనామా చేయవలసి వచ్చింది. ఆబాజీ నాగపూర్ చేరుకున్నారు. అక్కడ ఏదైనా స్వదేశీ వస్తువుల అంగడి నెలకొల్పుదామని ప్రయత్నించారు. అయితే పోలీసులు అది పడనీయలేదు. ఆయనకు గది అద్దెకివ్వబోయిన యజమానులందరిని "బ్రతిమాలి" ఈ "ప్రమాదకరమైన" వ్యక్తికి గది అద్దెకు దొరకకుండా చేశారు. ఆబాజీ హెడ్గేవార్ అంగడి తెరవనేలేదు అంతమాత్రాన కేశవునితో వారి సంబంధాలు దెబ్బతినలేదు. వారి మధ్య పరస్పర ఆదరాభిమానాలు కొనసాగుతూనే వచ్చాయి. సంవత్సరాలు గడిచిన పిమ్మట, ఆర్. యస్. యస్. స్థాపించ బడినప్పుడు అందులో ఆబాజీ డా॥ హెడ్గెవార్‌కు పెట్టని కోటగా నిలిచారు.

"వందేమాతరం" అని ఎవరూ నినదించ రాదని రిస్లే సర్క్యులర్ కట్టడి విధించింది. నీల్‌సిటీ స్కూల్లో చదువుతున్న కేశవుడు, అతని మిత్ర బృందం ఆ వద్దన్నమాటే అని తీరాలని తీర్మానించు కున్నారు. 1908 లో ప్రభుత్వ ఇన్‌స్పెక్టరు స్కూలును సందర్శించినపుడు వారిని చూస్తూనే ప్రతి తరగతి "వందేమాతరం" నినాదంతో దద్దరిల్లి పోయింది. ప్రభుత్వం నిర్ఘాంత పోయింది – విద్యార్థులంతా క్షమాపణలు చెప్పుకొనే వరకు స్కూలు మూసి వేయాలని ఆజ్ఞలు జారీ అయినై. కేశవుడు డా॥ మూంజీ ప్రభృతులను సంప్రదించాడు. రెండు నెలలపాటు అసందిగ్ధ పరిస్థితి కొనసాగింది. ఈ సమయంలో స్కూలుకు "పహరా" కాస్తున్న పోలీసులకు విద్యార్థులు గాజులు బహుకరి

స్తుందేవారు. నీల్‌సిటీ స్కూలును నిర్వహించే విద్యాసంస్థ కార్యదర్శి సర్ బిపిన్ కృష్ణబోస్. వారెంతగా కలవర పడ్డారంటే ప్రశాంతత కోసం అదే పనిగా తల తడుము కుంటూ ఉండేవారు. అటు అధికారులకు, ఇటు విద్యార్థుల తల్లితండ్రు లకూ విసుగెత్తిపోయి ఒక నిర్ణయానికి వచ్చారు – జరిగినదానికి పశ్చాత్తాప పడుతున్నారా లేదా అని ప్రతి విద్యార్థినీ అడిగి, అవునన్నట్లు తలవూపితే అత డిని స్కూల్లో చేర్చుకోవాలని ఆనిర్ణయం. అలా, తల వూపడానికయినా కేశ వుడు రాజీపడక పోవడంతో అతడిని స్కూలునుంచి బహిష్కరించారు. వెన్వెం టనే కేశవుడు యవత్‌మాల్ వెళ్ళి అక్కడ లోకనాయక్ అనే జాతీయ పాఠ శాలలో చేరిపోయాడు.

తన దేశభక్తి ప్రపూరితమైన కార్యక్రమాలను కేశవుడు అక్కడ కూడా కొనసాగిస్తూనే ఉండేవాడు. ఒక రోజు స్థానిక పోలీసు స్టేషను వద్ద ఒక బాంబు పేలింది. కేసు పరిశోధించడానికి ప్రభుత్వం క్రీవ్‌లాండ్ అనే గూఢచార శాఖ అధికారిని పంపింది. సరిగ్గా కేశవుడి స్కూలునుండే అధికారులు పోలీస్ స్టేషను ఏర్పాటు చేశారు. మరి కొద్ది నెలలకే స్కూలును బలవంతంగా మూసి వేయించారు.

కాని "విప్లవం" ఒక్కటే కేశవుడి కార్యక్రమం కాదు. జాతి సమస్యపై సమగ్రమైన దృక్పథాన్ని స్వీకరించేవాడు. రాంటేక్‌లో జరిగే రామనవమి ఉత్సవాలలో కొందరు పాలకోవా అమ్ముతుండేవారు. దిగుమతి చేసిన విదేశీ పంచ దారతో వీటిని తయారు చేసేవారు. అందువల్ల కేశవుడు వీటిని విడిగా బెల్లంతో తయారు చేసే ఏర్పాట్లు చేశాడు.

విప్లవకారుడైన మాధవదాస్ అనే సన్యాసి నాగపూరులో అజ్ఞాతంగా వుంటున్నాడు. జపాన్‌కు నౌకలో వెళ్ళడం సాధ్యపడే వరకు అక్కడే ఆరు నెలలున్నాడు. అతని కోసం కేశవుడు నిధి సేకరించి యిచ్చాడు. దోగ్రే అనే ఒక అడ్వొకేటునుంచే వందరూపాయల్లు వసూలు చేశాడు.

అరవిందఘోష్‌ను యిరికించి, ఆలిపూరు బాంబు కేసు పెట్టబడినపుడు కేశవుడు ఖర్చుల నిమిత్తం ధనం సేకరించి కలకత్తా పంపాడు.

7

1909 లో కేశవుడు పూనా నుంచి మెట్రిక్యులేషనుతో కృతార్థుడయి కలకత్తా జాతీయ విశ్వ విద్యాలయానికి చెందిన రాస బిహారీఘోష్ సంతకంతో సర్టిఫికెట్ అందుకున్నాడు. ఆ రోజుల్లో భారత విప్లవకారు లందరికి కాశీవంటి దైన కలకత్తాకు కేశవుణ్ణి పంపాలని విప్లవకారులైన కేశవుని మిత్రబృందం నిశ్చయించారు. కేశవుని సన్నిహిత మిత్రుడు, గొప్ప క్రాంతికారుడు, తరువాత రోజులలో అమెరికాలో స్థిరపడిన శ్రీ రామలాల్ వాజపేయి తన ఆత్మ కథలో యీ విషయం ప్రస్తావిస్తూ ఆర్. యస్. యస్. స్థాపకుడయిన శ్రీ కేశవరావు హెడ్గెవార్ను డాక్టరు డిగ్రీ మిషమీద పులిన్ బిహారీదాసుతో పాటు కలిసి విప్లవోద్యమాన్ని సంఘటితం చేయడానికై డాక్టరు మూంజే, దాజీసాహెబ్ వంటి ప్రభృతుల ఆర్థిక సహాయంతో కలకత్తాకు పంపడం జరిగింది." అని వ్రాశారు.

అలా కేశవుడు 1910 లో కలకత్తా వెళ్ళి నేషనల్ మెడికల్ కాలేజిలో చేరాడు. తాను వుండేది మహారాష్ట్రీయుల బసలోనే అయినా, తరచుగా పంజాబ్ వసతి గృహం మొదలైన యితర విద్యార్థి వసతి గృహాలను సందర్శించి వస్తుండేవాడు. కొద్ది రోజుల్లోనే ఆ వసతి గృహాలన్నింటిలో గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠింప చేశాడు. మాండలేలో తిలక్ దేశాంతరవాస శిక్ష అనుభవించిన ఆరు సంవత్సరాలపాటు – కేశవుడు ఏకాదశీ వ్రతం పాటించాడు.

అనతి కాలంలోనే విప్లవకారుల అనుశీలన సమితిలో కేశవుడు అగ్రశ్రేణి సభ్యుడై ఎన్నో ప్రమాదభరితమైన బాధ్యతలు నిర్వర్తించాడు. "కోకెన్" అనేది అతని సంకేతనామం. మధ్యప్రాంత ప్రభుత్వం కేల్కర్ అనే వ్యక్తిని నేషనల్ మెడికల్ కాలేజిలో చేర్పించింది. తన మీద, మహారాష్ట్రకు చెందిన యితర విప్లవకారుల మీద కన్నువేసి వుంచడానికే అతడు చేరినట్లు కేశవుడికి స్పష్టంగా తెలుసు. కేల్కర్ పెట్టె తాళం పగులగొట్టి తెరిచిచూస్తే, కేశవుడు ఊహించిన విధంగానే, గూఢచారి చర్యలకోసం అతనికివ్వబడిన సూచనా పత్రాలు దొరికినై - గుట్టు బయల్పడిన అవమానం భరించలేక కేల్కర్ అక్కడినుంచి పారిపోయాడు. మళ్ళీ కనిపిస్తే ఒట్టు.

ఒకసారి సెలవుల్లో కేశవుడు యవతమాల్ వచ్చాడు. ఇద్దరు మిత్రులతో కలిసి ఒక వీధిలో నడుస్తున్నాడు. అదే సమయంలో వారికి ఎదురుగా ఇంగ్లీషు కలెక్టరు తన స్నేహితులిద్దరితో వస్తున్నాడు. కలెక్టరును చూస్తూనే కేశవుని మిత్రులు అభివందనం చేసి ప్రక్కకు తొలిగారు. కేశవుడు మాత్రం తిన్నగా సాగిపోయాడు. బ్రిటిష్ అధికారులే ప్రక్కకు తొలిగి దారి యివ్వవలసివచ్చింది. తరువాత వారే వెనుకకు తిరిగి "ఏమోయ్, మాకెందుకు అభివందనం చేయలేదు?" అని అడిగారు. కేశవుడు తొణకకుండా "అపరిచితులకు మేం అభివందనం చేయం" అని సమాధానమిచ్చి జేబుల్లో చేతులు వుంచుకుని, సూటిగా సాగిపోయాడు. యీ సంఘటన డా॥ మూంజేను తెలిసి సంతోషంతో కేశవుని అభినందించారు.

ఒకరోజు కేశవుడు బెంగాలీ పాటలు పాడుకుంటూ కలకత్తాలోని ప్రధాన ఫేరీలో తిరుగుతున్నాడు. అంతలోనే ఒక ఇంగ్లీషు వ్యక్తి వచ్చి ఘుఱం ఆపి, అతనితో మరాఠీలో మాట్లాడటం మొదలుపెట్టాడు. ఆ వ్యక్తి కలకత్తా పోలీసు సూపరింటెండెంట్ టోమాన్. బహుశా టోమాన్ కొంతకాలం మహారాష్ట్రలో పని చేసి మరాఠీ నేర్చుకుని వుంటాడు. అయితే మాత్రం కేశవుడు మహారాష్ట్రీయుడని అతడికెలా తెలిసింది? అప్పుడుగాని కేశవుడికి అర్థంకాలేదు. తాను బెంగాలీల వేషధారణతో, బెంగాలీయే మాట్లాడుతూవున్నప్పటికి తన పిలక మాత్రం మహారాష్ట్రీయుల పద్ధతిలో, బాగా పొడుగ్గా వుంది, దాంతో కేశవుడు తన పిలకను బెంగాలీ సైజుకు తగ్గించాడు.

నేషనల్ మెడికల్ కాలేజీలో ఆనాటి అనుభవాలను స్మరణకు తెచ్చుకుంటూ అమూల్య రత్న ఘోష్ 'మోడరన్ రివ్యూ'లో ఒక సంఘటన ఉదాహరించారు. ఒకరోజు ప్రొఫెసరుగారు ఎంతకీ క్లాసుకి రాలేదు. "ఎవరు తమ చేతి మీద ఎక్కువ దెబ్బలు సహించగలరో చూద్దాం" అన్నాడు ఘోష్. వెంటనే కేశవుడు చొక్కామడిచి, చెయ్యి చాపాడు. హౌరాబాబు (ఆ రోజుల్లో ఘోష్‌ను స్నేహితులు పెట్టిన పేరు అది) తన బలంకొద్ది కేశవుడి చేతిమీద పిడిగుద్దులు గుద్దాడు. కొట్టి కొట్టి ఘోష్ అలిసిపోయి చతికిలపడ్డాడు గాని, కేశవుడు మాత్రం పెదవులమీద దరహాసం నాట్యం చేస్తుండగా, తన చేతిని యింకా దృఢంగా అలాగే చాచి ఉంచాడు.

1913లో దామోదర నదికి వరద వచ్చి అనేక ప్రాంతాలు జలమయ మైతే బాధితులను ఆదుకోవడానికి కేశవుడు ఇతర వైద్య విద్యార్థులతోపాటు అక్కడికి వెళ్ళాడు. గంగానది సముద్రంలో సంగమించే చోట జరుపబడే మకర సంక్రాంతి మేళాలో కలరా ప్రబలుతూ ఉండేది. కేశవుడు అక్కడకు వెళ్ళి పూరి గుడిసెలలోని వ్యాధిగ్రస్తులకు సపర్యలు చేస్తుండేవాడు.

వైద్యవిద్య, విప్లవాలమాట అటుంచి కేశవుడు బెంగాలీ ప్రజా జీవితంలో భాగమైపోయాడు. 1911లో "ఢిల్లీ దర్బారు బహిష్కరణ" ఉద్యమంలో కృషి చేసి, అందుకు అరెస్టయినాడు. ఒక సందర్భంగా అతనిని నాలుగు గంటలపాటు పోలీసులు ప్రశ్నించారు.

డా॥ శ్యామప్రసాద్ తండ్రి సర్ అశుతోష్ ముఖర్జీని కేశవుడు తన తండ్రిగానే భావించేవాడు. పలుమార్లు వారినుంచి సలహా తీసుకొనడానికి వెళు తుండేవాడు. 'అమృత బజార్ పత్రిక' సంపాదకుడైన మోతీలాల్ ఘోష్‌కు కేశవుడంటే వల్లమాలిన ప్రేమ. కేశవుడు వచ్చి చదువుకొనడానికై "కేసరి" పత్రిక సంచికలను ఆయన జాగ్రత్తపరచి వుంచేవాడు.

నేషనల్ మెడికల్ కాలేజి ఇచ్చే డిగ్రీలకు విలువలేకుండా చేసే ఉద్దే శంతో బ్రిటీషు ప్రభుత్వం "బోగస్ మెడికల్ డిగ్రీల చట్టం" ఆమోదించింది. నేషనల్ మెడికల్ కాలేజినుంచి పట్టభద్రులయినవారు, సరికొత్తగా మరొక పరీక్ష వ్రాసి, ప్రభుత్వం ఆమోదించిన డిగ్రీ పొందాలని ఆదేశించారు, జాతీయ భారతదేశానికి ఇదొక అవమానంగా కేశవుడు భావించాడు. అశుతోష్ ముఖర్జీ మోతీలాల్ ఘోష్, సురేంద్రనాథ్ బెనర్జీల సహాయంతో ఈ చట్టానికి వ్యతిరే కంగా విజయవంతమైన ఉద్యమాన్ని నడిపి, దాన్ని ఉపసంహరింపజేయ గలిగాడు.

పులిన్ బిహారీదాస్, త్రైలోక్యనాథ చక్రవర్తి ప్రభృతి అనుశీలన సమితి విప్లవోద్యమ నేతలకు మాత్రమేగాక, గొప్ప దేశభక్తుడయిన శ్యామసుందర చక్రవర్తికి కూడ కేశవుడు ఎంతో సన్నిహితుడు. శ్యామసుందర్‌జీ దుర్భరమైన

దారిద్ర్యంతో మగ్గుతుండేవారు. ఎన్నోసార్లు వాళ్ళకి చెప్పయినా లేకుండా చినిగిన బట్టలతో దర్శన మిస్తుండేవారు. వారికై అప్పుడప్పుడు ఒక విద్యార్థి వసతి గృహంలో భోజనం ఏర్పాటు చేస్తుండేవాడు. స్నేహితులనుంచి డబ్బు సేకరించి శ్యామసుందర్ జీకి ఇస్తుండేవాడు. అయితే ఆ డబ్బు కాస్తా తనకంటే పేదలుగా అనిపించిన వారికి శ్యామసుందర్ జీ ఇచ్చివేసే వారు.

కలకత్తాలోనే కేశవుని మరొక మిత్రుడు మౌల్వీలియాకత్ హుస్సేన్ గొప్ప ఉదాత్తవ్యక్తి. మౌల్వీసాహెబ్‌కు జబ్బుచేయగా ఆరు వారాలపాటు కేశవుడే సపర్యలు చేసి, తిరిగి స్వస్థత చేకూర్చాడు. దేశభక్తుడైన విప్లవకారుడు లియాకత్ హుస్సేన్ విదేశీయమైనదని ఫెజ్‌టోపీని ఆయన పరిత్యజించి, భగవాధ్వజాన్ని జాతీయ పతాకంగా స్వీకరించాడు.

1914 లో తన వైద్య విద్యను పూర్తిచేసి కేశవుడు ఎల్. ఎమ్. ఎస్. పట్టా తీసుకున్నాడు. అంతలోనే మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. కేశవుడు వైద్యవిద్య పూర్తి చేసిన మరి కొందరు విప్లవకారులు కలసి మిలిటరీ మెడికల్ సర్వీస్‌లలో చేరబడే ఉద్దేశ్యంతో డా॥ సుబ్రహ్మవర్దీని కలుసుకున్నారు. కాని రాజకీయ కారణాలవల్ల వీరికి ప్రవేశం నిరాకరించ బడింది.

రెండేళ్ళు పాటు సర్జన్‌గా పనిచేసి డా॥ హెడ్గేవార్ నాగపూర్ వచ్చాడు. ఇప్పుడాయన అనుభవజ్ఞుడయిన డాక్టరు మాత్రమే కాదు, విప్లవకారుల నాయకుడు కూడ. కొద్దికాలంలోనే తిలక్ విడుదలయినారు. ఆ సందర్భంగా నాగపూర్ లోని తన గురువు డా॥ మూంజే గృహాన్ని దీపాలతో అలంకరించి ఆనందోత్సవం జరిపాడు — కేశవుడు.

డా॥ కేశవ హెడ్గేవార్ నాగపూర్ తిరిగి వచ్చిన నాటికి మొత్తం మధ్య ప్రాంతం బేరారులలో కలిసి 75 మంది మాత్రమే అల్లోపతి వైద్యులున్నారు. ఆయన ప్రాక్టీసు పెట్టినట్లయితే ఎంతో ఆర్జించగలిగి వుండేవాడు. 5 వేలు కట్నం ఇస్తామంటూ పెళ్ళి సంబంధాలు కూడ వచ్చినై. ఆ రోజుల్లో అయిదు వేలంటే మాటలు కాదు మరి. అయితే కేశవుని హృదయం మాత్రం గృహస్థ జీవనాన్ని గాని వృత్తి విజయాన్ని గాని కాక్షించడం లేదు.

వారి గమ్యము, ఆకాంక్ష వేరు. తరువాత నాలుగు సంవత్సరాల పాటు పత్రికలు నడపడం, హోంరూల్ లీగ్‌లో చేరటం, గణేశోత్సవాలు నిర్వహించటం – ఇలా ప్రజాకార్యక్రమాలు, ఉద్యమాలన్నిటితో పాలు పంచుకుంటున్నాడు. అన్నింటికి మించి నిశ్శబ్దంగా విప్లవ కార్యకలాపాలలో నిమగ్నమై వున్నాడు. అనుమానం రేకెత్తకుండా మందుగుండుసామగ్రిని చేరవేయటానికై ఒకమారు కొందరు బాలురకు స్త్రీ వేషాలు వేయించి పనికానిచ్చాడు. మరొక సందర్భంలో కొందరు మిత్రులకు పోలీసులుగా మారువేషం వేయించాడు. వారు ఆయుధాల వ్యాగన్లను తెరచి కొన్ని ఆయుధాల పెట్టెలను టాంగాలో తరలించుకువచ్చారు. కేశవుని విప్లవకార్యక్రమాలలో భావూజీ కావ్రే, షమీముల్లాఖాన్ తోడ్పడ్డారు.

ఒకమారు లోకనాయక్ అణే అధ్యక్షతన కాంగ్రెస్ సమావేశమొకటి జరుగుతున్నది. విప్లవకారుల కార్యకలాపాలను నిరసిస్తూ సమావేశంలో ఒక ప్రతిపాదన వచ్చింది. వెంటనే డా॥ కేశవ్ లేచి "నేను దీన్ని వ్యతిరేకిస్తున్నాను" అన్నాడు, ఆపైన అణే ఇలా అన్నారు. "డా॥ హెడ్గెవార్ అన్నదానిలో ఔచిత్యం వుంది. విప్లవకారులను నిరసించటాన్ని ఆయన ఏమాత్రం సహించరు, విధానాలు ఏవయినప్పటికీ విప్లవకారులది – ఉజ్జ్వలమైన దేశభక్తుల బృందం. మహా అయితే మీరు వారి విధానాలను తృణీకరించగలరు. కాని వారి మహోన్నత త్యాగాలకు మీరంతా కృతజ్ఞత కనబరచక తప్పదు".

ప్రతిపాదించబడిన తీర్మానం అంతటితో సద్దుమణిగింది.

అనేక సంవత్సరాల పిమ్మట కేశవుడు తన మిత్రులతో మాట్లాడుతూ తాను ఎప్పటికప్పుడు పేర్లు, వేషాలు మార్చుకుంటూ వున్నందున, విప్లవ విషయాలమీద ఎన్నడూ ఎవరికీ ఒక్క లేఖ అయినా వ్రాయనందున, ఇతర విప్లవకారుల చిరునామాలేవీ తన వద్ద వుంచుకోనందున, తాను ఎన్నడూ పట్టుబడలేదని చెప్పాడు. కాని ఇరవై సంవత్సరాలు గతించిన పిమ్మట కూడా తన స్మృతి భాండారంనుంచి ఎందరెందరో విప్లవవీరుల చిరునామాలను తీసి వారి గురించి ప్రస్తావించ గలిగేవాడు.

మొదటి ప్రపంచయుద్ధం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పరిణమిస్తున్న దున, బ్రిటిష్, భారతీయ సేనలు విదేశాల్లో వున్నందున భారతదేశం ఏక పక్షంగా స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకోవాలని కేశవుడు డా॥ మూంజేకు సూచించాడు. కాని మూంజేకు యిది సమంజసంగా తోచలేదు.

కేశవుడు పూనా వెళ్ళి అక్కడ కొన్నాళ్ళు తిలక్‌తో వున్నాడు. అక్కడ నుంచి శివాజీ జన్మస్థానమైన శివనేరికి వెళ్ళాడు. నిర్లక్ష్యం చేయబడిన ఆ చారిత్రాత్మక ప్రదేశంలో ఒక మసీదు, దర్గా దర్శన మిచ్చినై. ఈ దృశ్యం అతనికి ఎంతో వ్యథ కలిగించింది.

ఆ సమయంలో చరిత్రాత్మకమైన నాగపూర్ కాంగ్రెస్ మహా సభలు జరిగినై.

1920 డిసెంబరు చివరి వారంలో జరిగిన ఈ సభలలో ఎన్నడూలేనంత ఎక్కువ సంఖ్యలో (14 వేలమంది) ప్రతినిధులు పాల్గొన్నారు. స్థానిక ఆహ్వాన సమితి వేయిమందితో వలంటీర్ల దళాన్ని ఏర్పాటు చేసింది. వసతి, భోజన సౌకర్యాల పర్యవేక్షణకు కేశవుడు నియమించ బడ్డాడు. అయితే సభా కార్య క్రమాల యందు కూడా కేశవుడు ఎంతో ఆసక్తి కనపరిచాడు. తిలక్ మర ణించడం, సభకు అధ్యక్షత వహించలేక పోవడం వలన విచారంతో ఉద్విగ్ను డయినాడు. అందువలన అరవిందులను ఏకాంతవాసం నుంచి బయటకు రమ్మని బ్రతిమాలడానికి మూంజేతో కలిసి పాండిచేరి వెళ్ళాడు. అరవిందుల అంగీకారం లభించలేదు. చాలా రాష్ట్రాలు కాంగ్రెస్ అధ్యక్ష పదవికి విజయరాఘవాచారి యర్‌ను ప్రతిపాదించినై. కాని ఆ మధ్యనే గవర్నరు చేసిన విందులో పాల్గొన్న విజయరాఘవాచారియర్ మీద కేశవునికి సదభిప్రాయంలేదు. విప్లవోద్యమపు వీరవరేణ్యుడయిన శ్యామసుందర చక్రవర్తి అయితే బాగుంటుందని కేశవుని అభిప్రాయం.

సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని లక్ష్యంగా ప్రకటించాలని కేశవుడు, మరి ముగ్గురు సభ్యులు తీర్మానాల సభలో ఒత్తిడి చేశారు. కాని గాంధీజీ అందుకు

సమ్మతించ లేదు. ఖిలాఫత్‌ను పునరుద్ధరించడంతో పాటు గోసంరక్షణకు కాంగ్రెస్ గట్టి చర్యలు తీసుకోవాలని కేశవుని మిత్రుడు ఒకరు సూచించారు. దీనికి కూడా ఆ సమయంలో గాంధీజీ నుంచి అనంగీకారమే వచ్చింది. కాని త్వరలోనే గాంధీజీ తనకు స్వరాజ్యంకంటె కూడ గోరక్షణ మరెంత ముఖ్యమని ప్రకటించడంతో బదే, కేశవ్ ప్రభృతులకు యీ విషయంలో విజయం లభించి నట్లయింది.

"సామ్రాజ్య వాదానికి తావులేని ప్రజాస్వామ్యాన్ని" గమ్యంగా స్వీక రించాలని కూడా కేశవుని బృందం ఒత్తిడి చేశారు. కాని సమితి దీనిని కూడా నిరాకరించింది. ఈ ప్రతిపాదనకయినా కాస్త ఆదరణ లభించివుండ వలసిందని 1921 మార్చి 21 నాటి "మోడరన్ రివ్యూ" వ్యాఖ్యానించింది.

కాంగ్రెసు మహాసభలు పూర్తి అవుతూనే సహాయ నిరాకరణోద్యమం మొదలయింది. ముస్లిము లందరికి ఖలీఫాగా టర్కీదేశపు మాజీ సుల్తానును పున రధిష్ఠింప జేయాలనే డిమాండు కేశవ్‌కు ఏ మంత నచ్చలేదు. కాని యీ ఉద్య మంలో దేశం ఉవ్వెంగి స్వాతంత్ర్యానికి చేరువవుతుందని ఆయనకు తెలుసు. పరాయి పాలన అనే తలంపే ఆయన తత్త్వానికి వ్యతిరేకం. బ్రిటిషు పాలనకు సంబంధించిన ప్రస్తావన వస్తే చాలు - కేశవునికి నిజంగానే ఒళ్ళు కంపర మెత్తేది. కనుక మనస్ఫూర్తిగా ఉద్యమంలోకి దూకారు. రాజద్రోహ కరమైన ప్రసంగం చేశారనే ఆరోపణ మీద వారిని కోర్టులో స్మెల్లీ అనే మేజిస్ట్రేటు ముందు హాజరుపరిచారు. కోర్టుయొక్క మూర్ఖత్వం కారణంగా కేశవుని తరఫున వున్న ఆరుగురు న్యాయవాదులు నిరసనగా కోర్టును బహిష్కరించవలసి వచ్చింది. తరువాత కేశవ్ కోర్టులో పిడుగులు వర్షించునట్లు ఒక ప్రసంగం చేశాడు. ఆ ప్రసంగం యిలా సాగింది -

"బ్రిటిషు ప్రభుత్వం న్యాయబద్ధంగా ప్రతిష్ఠించ బడిందని, అట్టి ప్రభు త్వంపట్ల నేను విద్వేషాన్ని, వ్యతిరేకతను రెచ్చగొట్టే విధంగాను, భారతీయులు, యూరోపియనుల మధ్య శత్రుత్వాన్ని రేపే విధంగాను ప్రసంగాలు చేస్తున్నట్లు ఆరోపించి అందుకు సంజాయిషీ యివ్వవలసిందిగా నన్ను యిక్కడకు పిలిపిం

చారు. భారతదేశంలో ఒక భారతీయుడు చేసినదానిపై ఒక విదేశీ ప్రభుత్వం తన తీర్పు యిచ్చేందుకు కూర్చున్నదంటే అది నాకు, నా మహత్తర మాతృదేశానికే అవమానకరం. న్యాయబద్ధంగా స్థాపించబడిన ప్రభుత్వం ఒకటున్నట్లు నాకు ఎక్కడా కనిపించడం లేదు. అలాంటిది వున్నదని మీరనడం నాకు ఆశ్చర్యం కలిగిస్తున్నది. ఇక్కడ వున్నదల్లా న్యాయాన్ని పనిమనిషిగా, న్యాయస్థానాలను పనిముట్లుగా పాశవిక శక్తిమీద ఆధారపడి మాపై బలవంతంగా రుద్దబడిన హింసా రాజ్యం మాత్రమే. ఈ భూగోళంలో పరిపాలించే హక్కువున్న ప్రభుత్వం ఏదైనా వుంటే అది ప్రజలచేత ఎన్నికయి ప్రజల కొరకు వున్న ప్రజల ప్రభుత్వం మాత్రమే. ఇతర రకాల ప్రభుత్వాలు ఏవి వున్నా అవన్నీ అయా దేశాలను దోచి పీడించడానికై దుండగిండ్లు పన్నిన పన్నాగాలు తప్ప వేరు కాదు.

"మా నిరుపేద మాతృభూమిపై నాదేశీయులలో ప్రేమాభిమానాలను రేకెత్తించడానికి నేను ప్రయత్నించాను. భారతదేశం భారతీయులదే అనే సూత్రం వారి మనస్సులలో హత్తుకునేట్లు చేయడానికి నేను ప్రయత్నించాను, ఒక భారతీయుడు యిలాంటి దేశభక్తి ప్రపూరితమైన భావాలను ఉద్బోధించినంత మాత్రాన అది రాజద్రోహంగా పరిగణించబడే స్థితి వచ్చిందంటే, పచ్చి నిజాలు పలికినంత మాత్రాన భారతీయులకు యూరోపియనులకు మధ్య శత్రుత్వం రేగుతుందని భావించబడే స్థితి వచ్చిందంటే తాము యికనైనా హుందాగా నిష్క్రమించ వలసిన కాలం వచ్చిందని యూరోపియనులు, తామే భారత ప్రభుత్వమని భావిస్తు కుంటున్నవారు గ్రహించాలి.

"నా ప్రసంగాలను పూర్తిగా, ఉన్నదున్నట్లుగా మీరు వ్రాసుకొనక పోవడం గమనిస్తున్నాను. నా మాటలను అతుకులుగా, ఉదాసీనంగా, వక్రంగా చిత్రించి యీ నివేదికలు తయారు చేశారు. అయినా ఈ విషయాలు నేను పట్టించుకోను. ఒక జాతికి మరో జాతికి మధ్య పరస్పర సంబంధాలను నిర్దేశించే సూత్రమేది వున్నదో, ఆ సూత్రమే బ్రిటిషు సామ్రాజ్యం పట్ల యూరోపియనుల పట్ల నా ప్రవర్తనకు మార్గదర్శకంగా వుంటుంది. ఏది ఏమైనా ప్రసంగించినదంతా నా దేశ ప్రజల హక్కులకు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు అను

సత్యంగానే వున్నవి. నేను మాట్లాడిన ప్రతి మాటకు బాధ్యత వహించడానికి నేను సిద్ధంగా వున్నాను."

అసలు ప్రసంగంకంటె దానిని సమర్థించుకుంటూ చేసిన ప్రకటన మరెంత రాజద్రోహకరంగా వున్నదని స్మెల్లీ వ్యాఖ్యానిస్తూ కేశవునికి ఒక ఏడాది కఠిన శ్రమతోకూడిన కారాగారవాస శిక్ష విధించాడు.

న్యాయస్థానం నుంచి అతనిని బయటకు తీసుకొని పోతుండగా వేయి మందికి పైగా ప్రజలు జయజయ ధ్వానాలు చేశారు. డా॥ మూంజే, బారిస్టర్ అభ్యంకర్, షమీముల్లాఖాన్ మొదలయిన కాంగ్రెసు నాయకులు పూలదండలతో ఆయనను ముంచెత్తారు. ఆ రోజు 1921 ఆగస్టు 19 వ తేది.

జైలుకు వెళ్ళగానే ముందుగా జంధెం తీసి యివ్వమన్నారు. కేశవుడు అందుకు నిరాకరించాడు. భారతీయుల మనోభావాల పట్ల గౌరవం వున్న జైలు సూపరింటెండెంటు-ఫోర్డు అనే బ్రిటిష్ వ్యక్తి-జంధెం వుంచుకునేందుకు కేశవుడికి అనుమతి యిచ్చాడు.

కఠిన శ్రమ క్రింద చేతి తయారీ కాగితానికి పాలిష్ చేసే పని ఇచ్చారు కాగితానికి మెరుపు ఇవ్వడానికై ఆ రోజుల్లో ఉపయోగించబడే మోటు రసాయనాలవల్ల కేశవుని చేతులు కొద్ది కాలంలోనే మారినై. అయినా అలాంటి విషయాల్ని ఖాతరుచేసే మనిషి కాడతడు.

అదే జైలులో ఉన్న ఇనాముల్లా అనే ఖిలాఫత్ వాదితో మాత్రం కొన్ని చేదు అనుభవాలు కలిగినై తతిమావారంతా తెల్లవారుఝామున నిద్రిస్తున్న సమయంలో ఇనాముల్లాఖాన్ గొంతుచించుకుని ఖురాన్ చదవడం మొదలుపెట్టేవాడు. ఇతరుల నిద్రకు భంగం కల్గించకుండా ఇనాముల్లాను ఒప్పించడానికై రాధా మోహన్ అనే ఆర్య సమాజ సత్యాగ్రహి మరింత బిగ్గరగా రామాయణం పఠించవలసి వచ్చింది.

ఇనాముల్లాకు పుస్తకాలు బైండు చేసేపని ఇవ్వబడింది. ఒకనాడు అతడు భారతం తీసుకుని తాను బైండు చేసే పుస్తకాలమీద బరువుగా పెట్టాడు. అంత

టితో సంతృప్తి కలగక వాటికి మరింత వత్తిడి అవసరమని భావించి మహా భారతం మీద తను సుంచుకున్నాడు. ఈ అమర్యాదకరమైన ప్రవర్తనకు కేశ వుడు నిర్ఘాంత పోయాడు.

ఆ తర్వాతిరోజు జైలు గదిలో ఖైదీలు మాట్లాడుకుంటున్నారు. ఎప్పటి మాదిరిగానే కేశవుడు టేబిల్‌మీద కూర్చుని ఉన్నాడు. చాపమీద పడిఉన్న ఖురాన్ కంటే ఎత్తైన ప్రదేశంలో కేశవుడు కూర్చొని ఉన్నందుకు ఇనాముల్లా అభ్యంతరం చెప్పాడు. ఖురాను ఎప్పుడూ చాపమీదే ఉంటున్నదని తాను రోజూ టేబులు మీదే కూర్చుంటున్నానని, అయినా ఇనాముల్లా అంతకుముందెన్నడూ అభ్యంతరం తెలుపలేదని కేశవుడు గుర్తు చేశాడు. తాను ఖురానుకు 10–15 అడుగుల దూరంలో ఉన్న విషయంకూడా చెప్పాడు. కావాలంటే ఖురానును ఎంత ఎత్తులోనయినా పెట్టుకోవచ్చునని సూచించాడు. అంతటితో ఇనాముల్లా నోరుమూసుకున్నాడు.

ఈ విషయాలు అలా ఉంచి కేశవుడు శ్రమకు వెనుదీయక సౌకర్యాలు అభిలషించక నిశ్చింతగా జైలు జీవితం గడిపాడు. 1922 జులై 12న జైలు బయటకు వచ్చేసరికి 25 పౌన్లు బరువు పెరిగాడు. జైలుద్వారంవద్ద డా॥ముంజే, డా॥ ఖారే, డా॥ పరంజపే స్వాగతం చెప్పారు. ఆ రోజు కాంగ్రెసు వర్కింగు కమిటీ నాగపూరులో సమావేశమవుతున్నది. నాటి సాయంకాలం కేశవుని సన్మా నించిన సభకు మోతీలాల్ నెహ్రూ, డా॥ అన్సారీ, రాజాజీ అజ్మల్‌ఖాన్, విఠల్ భాయి పటేల్‌లు కూడా హాజరయ్యారు.

నాటి దేశ పరిస్థితి ఆశాజనకంగాలేదు. "ఏడాదిలో స్వరాజ్యం" అన్న గాంధీజీ ఆశాభావం ఫలించలేదు. అంతటా నిరాశ నిస్పృహలు ఆవరించినై. కేశ వుడు మాత్రం వెంటనే వివిధ ప్రజాహిత కార్యక్రమాలలో నిమగ్నమైపోయాడు. క్రైస్తవ మిషనరీలనుండి అనాదలను కాపాడటానికి, అజ్ఞానవాసంలో ఉండే విప్లవ కారులకు రక్షణ కల్పించడానికి, 1922లో అనాధ విద్యాలయ గృహాన్ని నెల కొల్పడంలో ఎంతో శ్రద్ధ వహించాడు. రైఫిల్ అసోసియేషన్‌లోను, స్వాధ్యాయ

మండలిలోను సభ్యుడయినాడు. ప్రాంతీయ క్రీడా సమితిలో కూడా సభ్యత్వం సంపాదించాడు. నాగపూర్ ప్రాంత కాంగ్రెస్ కమిటీకి సంయుక్త కార్యదర్శి అయినాడు.

ఇటు దేశపు పరిస్థితి మాత్రం అధ్వాన్నంగా తయారవుతున్నది. ఖిలాఫత్ గాలినుండి మతతత్వపు భూతం పుట్టింది.

మొదటి ప్రపంచయుద్ధం వచ్చిన నాటికి వంశపారంపర్యంగా టర్కీ సుల్తాను ముస్లిములందరికీ ఖలీఫాగా ఉండేవాడు. యుద్ధంలో టర్కీ పరాజయం పొందటంతో సుల్తానును పదవీ భ్రష్టుణ్ని చేసి టర్కీ దేశపు క్రొత్త మహా నాయకుడు కమాల్ పాషా అధికారంలోకి వచ్చి అసలు ఖలీఫా పదవినే రద్దు చేశాడు. ఖలీఫా పోయినందుకు టర్కీవారు, అరబ్బులు సంతోషించగా భారతదేశంలోని ముస్లిములు అందుకు వ్యతిరేకంగా ఆందోళన లేవదీశారు. ఖలీఫా తొలగింపు ఇస్లాంమీద, ముస్లిములమీద దాడిగా పేర్కొన్నారు. ఈ పరిస్థితిలో గాంధీజీ భారతదేశపు ముస్లింల పక్షం వహించి "లెండి మేల్కొని ఖలీఫాను నిలబెట్టండి లేకుంటే మీకింక ముక్తి లేదు" అని వారికి ఉపదేశించారు.

జిన్నాను అభినందించవలసిన విషయం - ఆయన ఖిలాఫత్ ఉద్యమాన్ని వ్యతిరేకించడం. గాంధీజీ నిప్పుతో చెలగాట మాడుతున్నారని ఆయన హెచ్చరించాడు. డా॥ అన్సారీకూడా ఈ ఉద్యమానికి అసమ్మతి తెలిపారు.

యుద్ధంవల్ల భారత రాజకీయ పరిస్థితిలో పెద్ద మార్పులు వచ్చినై. ఖిలాఫత్ సమస్యవల్ల అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. హిందూ ముస్లిముల సభ్యతా దృశ్యాలు కొన్ని చిరకాలం గుర్తుంచుకో దగినవే కనిపించినై. జుమ్మా మసీదు వేదిక నుండి స్వామి శ్రద్ధానంద ప్రసంగించడం వాటికి పరాకాష్ఠ. ఇరవై వేల మంది జైళ్ళకు తరలి వెళ్ళారు. అంతా బాగానే ఉందికాని అసలు ఉద్యమపు పునాదే లోపభూయిష్టమైనట్టిది. అది మత మౌఢ్యం మాత్రమే. అందువల్ల అది పరాభూతం కాక తప్పదు, రాజకీయ సమావేశాలలో "అల్లా హో అక్బర్" అన్న నినాదం ఇవ్వబడేది. అల్లా అనగా భగవానుని నామస్మరణ కాబట్టి "భారత

"మాతాకీ జై" అన్న నినాదంకంటే, అదే గొప్పదని ప్రకటించారు-గాంధీజీ. అదేమైనా ఆ నినాదం (అల్లాహో అక్బర్)కు ఉన్న చారిత్రకపు సంబంధాలు కారణంగా అవంటే హిందువులకు అసౌకర్యం కలిగింది. మొత్తం ఉద్యమం ముస్లింల్లో దాగిఉన్న మత మౌఢ్యం సంతతిని రెచ్చగొట్టింది. వాతావరణాన్ని పిచ్చితనం కమ్ముకొన్నది. నరకప్రాయమైన భారతదేశాన్ని వదిలిపెట్టి వేలాది ముస్లింలు 'ఇస్లామిక్' ఆఫ్ఘనిస్తాన్‌లో ప్రవేశించారు. మత వలసలు కట్టారు. కానీ వారు త్రోసివేయబడ్డారు.

బలియమైన 'ఆట్టోమాన్' సామ్రాజ్యాన్ని "ఐరోపా రోగిష్టి"గా మార్చిన టర్కీ సుల్తానును వదిలించుకోవాలని యంగ్ టర్కీలు చాలాకాలం ప్రయత్నించారు. టర్కీషు సామ్రాజ్యంలోని అరబ్బులకు టర్కీ వేడి నుంచి విముక్తి లభించడం ఎంతో సంతోషదాయకమైంది. కాని భారతీయ ముస్లింలు మాత్రం తమ స్వంత ప్రపంచంలోనే నివసించారు.

పాత ఖలీఫా వెళ్ళిపోయారు కాబట్టి, కమల్ పాషాను కొత్త ఖలీఫాకమ్మని భారతీయ ముస్లింలు అర్థించారు. అటాటుర్క్ అనగా "టర్కీయులందరికీ తండ్రిగా" రూపొందిన కమల్‌పాషా ఇందుకు అనందించలేదు. తనను చూడవచ్చిన భారతీయ ముస్లిం ప్రతినిధి బృందానికి ఆయనొక ప్రశ్న వేశారు - బ్రిటిషు వారి బానిసలై ఉన్నవారు తనకెట్లా విధేయులై ఉండగలరని.

అలీ సోదరులు అప్పుడు వెళ్ళి అరేబియా రాజు - అబ్దుల్ అజీజ్ ఇబిన్ - సౌద్ దగ్గర పడిగాపులు పడ్డారు. ఆయనైనా ఖలీఫా కాగలరని వారు ఆశించారు. కానీ మరొక ముస్లిం ఎవరూ దీనికి అంగీకరించరని సౌద్‌కు ఎలాగూ తెలుసు. పైగా యిది బ్రిటిషువారు పురమాయించిన సలహా అనీ తెలుసు. అందువల్ల నింపాదిగా వారితో యిలా అన్నాడు. "మీ ఉత్సాహమంతా ఇస్లాంకోసమే అయితే, మీరు ముందుగా గాంధీతో చేతులు కలిపి బ్రిటిష వాళ్ళ నుంచి భారత దేశాన్ని ఎందుకు విముక్తం చేయరు? ఇస్లాం మీకు బోధించేది అదే. బ్రిటిషు వారి బానిసలుగా యిక్కడకు వచ్చారు మీరు. చూడబోతే నన్ను బ్రిటిషు వారి వలలో చిక్కించడానికి వచ్చినట్లున్నారు." అరబ్బుల ఆచారం ప్రకారం మూడు

రోజులు ఆతిథ్యమైన తరువాత తిరిగిపొమ్మని, గాంధీకి 'సలాములు' చెప్పమని వారితో అన్నాడు రాజుసౌద్.

అవమానంతో షౌకతాలీ ఏదో అభ్యంతరం తెలుప బోయాడు. రాజు అబ్దుల్ అజీజ్ లేచి, అలీ సోదరుల గడ్డాలు పుచ్చుకొని, ఒకరి తల ఒకరికి తగిలే విధంగా ఠకీమని కొట్టి వదిలాడు!

టర్కీలోను, అరేబియాలోను విఫలమైన ఖిలాఫత్ నాయకులు ఇరాన్‌కు క్రొత్త ప్రభువయిన రెజాషా పహ్లవీని కలుసుకున్నారు. ఇరాన్ చక్రవర్తికి ఏరకమైనా ఇస్లాంతోనూ - సున్నీగాని షియైత్ గాని - ఆసక్తి లేదు. అహుర్ మజ్దాను నమ్మే "ఆర్యన్ ఇరాన్" ను ఆకాంక్షిస్తున్నాడు షా.

ఈ విధంగా ఖిలాఫత్ ఉద్యమం పూర్తిగా నీరుకారి పోయింది. విఫలమైన ఉద్యమాలు సహజంగానే ప్రతికూల పరిణామాలకు దారితీస్తయి. ఖిలాఫత్ వంటి ఉద్రేక పూరితమైన ఉద్యమం భయంకర పరిణామాలు కల్పిస్తుంది. ముస్లింలు దేశ స్వాతంత్ర్యం కోసం కాక ఒక ఖలీఫా కోసం ఆందోళన జరుపుతున్నారని హిందువులు వారిని అసహ్యించు కొనసాగారు. బ్రిటిషు వారితో పోరాడటానికి తమను ఉపయోగించుకుని, తాము అల్ప సంఖ్యాకులుగా జీవించవలసి వచ్చే స్వరాజ్యాన్ని సాధించుకొనే ప్రయత్నం చేస్తున్నారని, ముస్లింలు హిందువులపై ప్రత్యారోపణ చేశారు. బ్రిటిషువారి మీదగాని, "అటాటర్క్" కమాల్‌పాషా మీదగాని పోరాడటం వారికి సాధ్యమయే పని కాదు కనుక, ముస్లిములు తమ ప్రతాపాన్ని హిందువుల మీద ప్రదర్శిస్తూ విరుచుకు పడ్డారు. ఫలితంగా కోహట్, మలబార్ మొదలయిన చోట్ల కనీ వినీ ఎరుగని హింసాకాండ తాండవ మాడింది.

సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ నివేదిక ప్రకారం మలబార్‌లో జరిగిన మోప్లా తిరుగుబాటులో 1500 మంది హిందువులను హతమార్చడం, 20 వేల మందిని యిస్లాంలోకి మతాంతరీకరించడం జరిగింది. మూడు కోట్ల రూపాయలకు మించిన ఆస్తికి నష్టం వాటిల్లింది. ప్రభుత్వం తన శక్తియుక్తు లన్నీ

సమీకరించి మోప్లా తిరుగుబాటును అణచివేసింది. ఈ సందర్భంగా 2,339 మందిని వధించడం, 24,167 మందికి శిక్షలు విధించడం జరిగింది. మలబారు నుంచి మద్రాసుకు గూడ్సు వ్యాగనులో తరలించ బడుతున్న 150 మంది మోప్లాలలో 66 మంది ఊపిరాడక మరణించారు. మోప్లాల హింసాకాండ, దానికి ప్రతిగా బ్రిటిషువారు జరిపిన దౌర్జన్యకాండ దేశాన్ని కలచి వేసినై.

మానసిక ప్రభావాన్ని బట్టి చూస్తే కోహాట్‌లో జరిగిన మారణ హోమం మరింత వినాశకరంగా పరిణమించింది. "హిస్టరీ ఆఫ్ ద కాంగ్రెస్"లో పట్టాభి సీతారామయ్య యిలా వ్రాశారు. "పలుచోట్ల, ప్రత్యేకించి ఢిల్లీ, గుల్బర్గా, నాగపూర్, లక్నో, షాజహాన్‌పూరు, అలహాబాద్, జబల్పూరులలోను, అన్నిటికి మించి కోహాట్‌లోను, మత కలహాలు, జరగడం ఈ సంవత్సరపు (1924) విషాద ఘట్టం. కోహాట్‌లో జరిగిన హింసాకాండతో నిజంగా భారతదేశపు వెన్నెముకే విరిగి పోయింది."

వాయువ్య సరిహద్దు ప్రాంతంలోని యీ పట్టణంలో హిందువుల జనాభా అయిదు శాతం మాత్రమే. అక్కడ 155 మంది హిందువులు హత్యలకు గురియైనారు. ఈ మారణహోమం ఫలితంగా మొత్తం హిందువుల జనాభా 320 కి. మీ. దూరాన వున్న రావల్పిండికి తరలి వెళ్ళి ఆశ్రయం కోరింది. గాంధీజీ 21 రోజుల నిరశన దీక్ష పూనారు.

మహాదేవ దేశాయి వారించబోగా గాంధీజీ "అంతా నా ప్రారబ్ధం. హిందువులు నామీద వుంచిన విశ్వాసానికి వారిని దగా చేశానని నామీద ఆరోపణ రావచ్చు. వారిని ముస్లిములతో స్నేహం చేయమని చెప్పాను. ముసల్మానుల పవిత్ర స్థలాలను రక్షించడానికై, తమ ప్రాణాలను ఆస్తులను వారికోసం ధారపోయ వలసిందిగా హిందువులతో అన్నాను. అహింసను పాటించమని, చంపడం ద్వారా కాక చావడంద్వారా తగాదాలు పరిష్కరించుకోమని యీనాటికీ ఉద్బోధిస్తున్నాను. కాని ఫలితం ఏమయింది? ఎన్ని దేవాలయాలు ధ్వంసమైనాయి, ఎందరు అభాగినులు నా వద్దకు వచ్చి గోడు విన్నవించుకున్నారు? నేను నిన్న హకీమ్‌జీతో అన్నట్లు ముసల్మాను గూండాలనుంచి తమకు హాని కలుగుతుందని

హిందూస్త్రీలు భయపడు తున్నారు, చాలా చోట్ల ఒంటరిగా కదలడానికి వారు భయపడుతున్నారు. ......నుంచి నాకు ఒక లేఖ వచ్చింది, అతని పసిపాపలు అవమానించ బడుతున్న విధం చూసి ఎలా సహించ గలను ? ఏమి జరిగినా సహించి వుండమని యింకా హిందువులను ఎలా అడగగలను ? అని ఆక్రోశించారు-గాంధీజీ.

అంతకుముందు 1923 డిసెంబరులో జరిగిన కాకినాడ కాంగ్రెసు మహాసభలో విష్ణు దిగంబర్ 'వందేమాతరం' గీతాన్ని ఆలాపిస్తుండగా కాంగ్రెసు అధ్యక్షుడు మౌలానా మహమ్మదాలీ నిరసనగా సభాస్థలినుంచి బయటకు వెళ్ళాడు. హరిజనుల్లో 50 శాతం మందిని ఇస్లాంలోకి మతాంతరీకరణకు అనుమతించాలని తన అధ్యక్షోపన్యాసంలో సూచన చేశాడు!

దేశభక్తి ప్రపూరితులయిన భారతీయులకు యీ సంఘటనలన్నీ బాధ కల్గించినాయి. అకస్మాత్తుగా నాగపూరులోకూడ ముస్లిములు తమకు గోవులను చంపేహక్కు వుందని వాదించడం, మసీదులముందు మేళతాళాలు వాయించగూడదని అభ్యంతరం పెట్టడం కేశవ్ గమనించాడు. ఖిలాఫత్ ఉద్యమం జరిగిన తరువాతనే యీ తగాదాలు ప్రారంభమయినాయి. హిందువుల సహాయంతో నిర్మాణమయిన మసీదుల ముందుకూడ మేళ తాళాలు అనుమతించకపోవడం విశేషం.

బహిరంగంగా వాద్యాలు ఉపయోగించే హక్కు పునరుద్ధాటించడానికై డా॥ హెడ్గెవార్, రాజా లక్ష్మణరావు భోంస్లే మొదలయినవారు "జై విఠల జై జై విఠల" అంటూ దేవుని విగ్రహాన్ని ఊరేగిస్తూ దిండి సత్యాగ్రహంలో పాల్గొన్నారు. యిదంతా హెడ్గెవార్లో ఆలోచనలను రేకెత్తించింది. ఏమిచేస్తే యీ దేశం బాగుపడుతుంది ?

బ్రిటిషువారిని కూలద్రోయాలి. మితవాదుల అర్జీలతో లాభం కనిపించ లేదు. విప్లవం తేవడానికి విప్లవ కారుల సంఖ్య తగినంతగాలేదు. ఈలోగా చాల మంది ముస్లిములు ఐశ్వర్యాలకు తలపడుతున్నారు. ఎనభై శాతం మంది హిందు

వృలేవున్న నాగపూరువంటి పట్టణంలో సహితం వారు గొడవలురేపి, హిందువు లకు అపారనష్టం కలిగించగలుగుతున్నారు. గాంధీజీ నేతృత్వంలో కాంగ్రెసు గొప్ప ప్రజా ఉద్యమంగా మారినమాట నిజమే. కాని అప్పటికి కాంగ్రెసు ధోరణి యింకా చప్పగానే వుంది- (1929 వరకు). సంపూర్ణ స్వాతంత్ర్యం కోరనయినా లేదు. ముస్లింల విషయంలో మెతకగావుంటున్నది. ఈ పరిస్థితుల్లో కర్తవ్య మేమిటి?

తనవలె ప్రజాసేవాదృక్పథంగల యితర వ్యక్తులతో యీ విషయాలను ప్రతిరోజు, నెలల తరబడి, సంవత్సరాల తరబడి చర్చిస్తూ వచ్చారు. డాక్టర్ హెడ్గెవార్. కొన్నివందల సంవత్సరాల క్రిందట, వివిధ సందేహాలకు సంతృప్తి కరమయిన సమాధానాలను రాబట్టుకొనడానికి సోక్రటీసు యువకులతో పలు విషయాలు చర్చిస్తుండేవాడు గదా! డా॥ హెడ్గెవార్ కూడ సరిగా అదే తీరులో చర్చలు జరిపారు. ముస్లిముల తాకిడిని తట్టుకోగలగాలంటే హిందువులు సమైక్యంగా వుండాలని, భారతదేశం నుంచి బ్రిటిషువారు త్వరగా నిష్క్రమించేవిధంగా హిందువులలో తీవ్రమైన పరివర్తన రావాలనే నిర్ణయాలకు వారు వచ్చారు. ఈ రెండు లక్ష్యాలను సాధించడానికే 1925లో ఆర్. యస్. యస్. ప్రారంభింప బడింది.

ఆర్. యస్. యస్. అవతరణ

దేశభక్తి ప్రపూరితులైన నాగపూర్ యువకులు కొందరు డాక్టరు హెడ్గేవార్ నాయకత్వంలో సమావేశమై - దేశభక్తి యుతమైన సంస్థ కావాలని నిర్ణయించారు. అట్టి సంస్థను నిర్వహిస్తూ పోవడమెట్లాగో మాత్రం వారికి స్పష్టమైన కల్పనలేదు. వాస్తవానికి......1925 విజయదశమి నాటి ఆర్. యస్. యస్. కు, తర్వాతి సంవత్సరాలలో ఆర్. యస్. యస్. కు మామిడి టెంకకు, మొక్కకూ ఉన్నంత తేడా ఉంది. మొత్తమంతా నెమ్మదిగా సంభవమైన క్రమ వికాసం.

ప్రారంభంలో - ఈ యువకులందరినీ తమ తమ వ్యాయామ శాలలకు ఎప్పటి వలెనే పోతూనే ఉండవలసిందని చెప్పారు. వీరిలో ఎక్కువ మంది అన్నాభోటే గారి నాగపూర్ వ్యాయామశాలకు వెళ్తుండేవారు. వీరు నిర్వహించే విశేష కార్యక్రమమల్లా......ఆదివారం ఉదయం 6 గంటలకు ఇత్వార్ దర్వాజా వద్ద కలుసుకొనడం. ఆ సందర్భానికై వీరు ధరించిన గణవేషం- 1920 నాగపూర్ కాంగ్రెసు సభల్లో వలంటీర్లకు నిర్దేశించబడి నట్టిది మాత్రమే. అంటే ఖాకీ చొక్కా, మోకాళ్ళ వరకు వచ్చే ఖాకీ నిక్కరు, రెండు గుండీలు గల ఖాకీ టోపీ (సంఘంలో నల్లటోపీ వాడకం మరో అయిదు సంవత్సరాల తర్వాత గాని ప్రారంభం కాలేదు.) ఈ బృందంలోని పెద్దలొకరు ప్రతి గురువారం దేశపరిస్థితి మీద సమీక్షాత్మకమైన ప్రసంగం చేసేవారు. మరి రెండు సంవత్సరాల పిమ్మట వీటికి "బౌద్ధిక్" అనే వ్యవహార నామం వచ్చింది. సభ్యులు పెరగడంతో మహారాష్ట్ర వ్యాయామశాల, ప్రతాప్ అఖాడాలు అవతరించినై. వ్యాయామశాలల మధ్య ఉండే పోటీ తమకు హానికరం కావచ్చునని యువకుల బృందం గుర్తించింది. మరుసటి సంవత్సరం నుంచి నిత్య శాఖను నడపడం మొదలు పెట్టారు. అప్పుడు "దండ" ప్రవేశపెట్టబడింది.

ఒక శాఖను నడపటం—దానిని ప్రారంభించటమంత తేలిక కాదు. తొలి శాఖ మొహితేవాడలో ఆరంభించబడింది, నాలుగు గోడల మధ్య - ఎత్తు పల్లాలుగా ఉన్న నేల అది, పైన కప్పు లేదు, దయ్యాల కది విహార స్థలమని ప్రతీతి. చలాకీగా తిరుగాడుతూ ఉండే స్వయం సేవకులు అడుగు పెట్టిన తర్వాత మాత్రం అక్కడిక దయ్యాల ఆచూకీ లేదు. సర్దార్ మొహితే ఆ స్థలాన్ని ఒక వడ్డీ వ్యాపారికి తాకట్టు పెట్టాడు. సి. ఐ. డి. లు ఆ స్థలం ఖాళీ చేయించమని ఆ వ్యాపారికి చెప్పారు. అంతలో రాజలక్ష్మణరావు భోంస్లే-సహృదయంతో - తన ఏమ్రుల శాలను శాఖకోసం వాడుకోమన్నారు. వారి మరణం తర్వాత, శాఖను తులసీబాగ్‌కు తరలించ వలసి వచ్చింది. ఆ తులసీ బాగ్‌ను దున్నించి, వ్యవసాయానికి వాడమని పోలీసులు రాజాగారి వారసులకు "సలహా" యిచ్చారు!

చివరకు-1934 నాటికి-శాశ్వత కేంద్ర సంఘస్థాన్‌గా రేషంబాగ్‌ను వాక్టరుజీ కొనుగోలు చేశారు. అది ఊరికి వెలుపల అడవి మధ్యలో ఉండేది. చుట్టూరా ఎంతో స్థలం ఉన్నప్పటికీ...యీ చోటులోనే సినిమాహాలు, స్టేడియం కట్టాలంటూ...1944లో ప్రభుత్వం దానిని స్వాధీనం చేసుకొనే ప్రయత్నం ఒకటి చేసింది. నాగపూర్ పుర ప్రముఖులందరూ ముక్త కంఠంతో దానిని ప్రతి ఘటించినందువలననే ఆర్. యస్. యస్.కు ఆ స్థలం దక్కింది.

మరి కొంత కాలం తర్వాత మోహితీవాడ కూడ ఆర్. యస్. యస్. ఆధీనంలోకి వచ్చింది. ఈ స్థలాన్ని తన క్రింద వుంచుకొన్న వడ్డీవ్యాపారి 1940-41 ప్రాంతంలో యిబ్బందులపాలైనాడు. మూడురోజులలో 12 వేల రూపాయలు చెల్లించకపోతే దివాలా తీసే పరిస్థితి ఏర్పడింది. అతని న్యాయవాది ఆర్. యస్. యస్.ను అభ్యర్థించారు. శ్రీ గురూజీ తన మిత్రులద్వారా అతనికి అవసరమైన సొమ్మును అప్పటికప్పుడు సేకరించి యిచ్చారు. అందుకు కృతజ్ఞతతో ఆ షావుకారు మోహితేవాడను ఆర్. యస్. యస్. కు విక్రయించారు. ఈ స్థలంలోనే నేటి ఆర్. యస్. యస్. కేంద్ర కార్యాలయం "హెడ్‌గేవార్ భవన్" నిర్మాణమై ఉంది.

చాల నెలల వరకు క్రొత్త సంస్థ పేరు లేకుండానే నడిచింది. చివరికి పేరు నిర్ణయించడానికి 1926 ఏప్రిల్ 26న ఒక సమావేశం నిర్వహించారు. అనేక పేర్లు సూచించబడినై. జరీపటకా మండల్ (బంగారు అంచుగల కాషాయ పతకం) అని...... భారత ఉద్ధారకమండల్ అని, హిందూ సేవక సంఘ్ అని. రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ అని వివిధ వ్యక్తులు ప్రతిపాదనలు చేశారు. కొంత చర్చ నడిచిన పిమ్మట చివరి పేరు ఆమోదించబడింది.

ఎంత చిన్న సంస్థకయినా కొంత డబ్బు అవసరమవుతుంది. డా. హెడ్గేవార్ స్వయంగా కొంత విరాళం సమర్పించి, మిత్రులవద్దనుంచి మరికొంత సమకూర్చేవారు. వారందరికీ యీ పద్ధతి ఏమంత సంతృప్తికరమైన సమాధానంగా కనిపించలేదు. లాటరీ నిర్వహిస్తే బాగుంటుందని ఒకరు సలహా యిచ్చారు. కొందరేమో అది బాగుండదన్నారు. మరొకరు డ్రామా టికెట్లు అమ్ముదామన్నారు. అదీ కాదన్నారు మరికొందరు. సభ్యులే స్వయంగా విరాళమిస్తే బాగుంటుందిగదా అనే ఆలోచన అప్పుడు వచ్చింది. అలాగయితే ఒక్కొక్కరూ ఎంత చెల్లించాలి? ఇదంతా ఎవరికి యివ్వాలి? అనే సందేహాలు వచ్చినై. ఎంతో చర్చించినమీదట, ఎవరికి శక్తిమేరకు వారు పవిత్ర భగవాధ్వజానికి సమర్పణ చేయాలనే నిర్ణయానికి వచ్చారు. ఆవిధంగా 1928లో తొలిసారి గురుదక్షిణ ఉత్సవం జరిగింది. ఆనాడు సమర్పించబడిన నిధి మొత్తం రు. 84 (ఎనభై నాలుగు రూపాయలు మాత్రమే).

న్యాయస్థానాల తీర్పులు ప్రచురించబడే "ఆలిండియా రిపోర్ట్స్" సంపాదకులయిన రావుసాహెబ్ చాతక్‌ను ఒకసారి విరాళంకోసం అభ్యర్థించడం జరిగింది. కాని సంస్థయొక్క జమాఖర్చులు పరిశీలించాలని ఆయన అన్నారు. వెంటనే హెడ్గెవార్ – అంతకుముందునాటి సాయంకాలంవరకు, చివరి దమ్మిడీదాకా లెక్కలు నమోదుచేసివున్న – ఖాతాపుస్తకాలు ఆయనకు పంపించారు. ఆతరువాత రావ్ సాహెబ్ తన శక్తిమేరకు సంతోషంతో విరాళం యిచ్చారు.

అఖిలభారత గురుదక్షిణ వసూళ్లు రు. 25 లక్షలవరకు ఉండవచ్చునని ఆర్. యస్. యస్. వ్యతిరేకి శ్రీమతి సుభద్రాజోషి కొద్ది సంవత్సరాల క్రిందట

అంచనవేశారు. వేయిమంది పైగా ఆజీవన కార్యకర్తలువున్న సంస్థకు ఇదేమంత పెద్ద మొత్తంకాదు.

ఆర్. యస్. యస్.కు ఒక ప్రార్థనకూడ వుండేది-సగం హిందీలో (ఆర్యసమాజ్ ప్రార్థనలో భాగం) సగం మరాఠీలో-బహుశా అది మధ్యప్రాంతం. నివాసుల ద్విభాషా సమ్మిశ్రానికి ప్రతిరూపం కావోలు. 1939లో దాని స్థానంలో నేటి సంస్కృత ప్రార్థన వచ్చింది.

మొట్టమొదటి సంఘశిక్షావర్గ 1929లో నిర్వహించబడింది. అప్పుడు శిక్షార్థులు 17 మంది మాత్రమే. నెమ్మదిగానే అయినా నిశ్చయంగా శాఖలు పరిమాణంలోను సంఖ్యలోను, పెరగటం మొదలయింది. క్రొత్త శాఖలకు అభిమన్యుడు, ధ్రువుడు, ప్రహ్లాదుడు, భీముడు, భీష్ముడు మొదలయిన మహాపురుషుల పేర్లు పెట్టబడినై. నాగపూరునుంచి సంఘకార్యం మొదట విదర్భ, మహాకోసల, పశ్చిమ మహారాష్ట్ర ప్రాంతాలకు విస్తరించింది. 'నాగపూరు కమలాలు పూనాలో అమ్ముడుపోవని' పూనా పెద్దమనుషులు డాక్టరుజీని హెచ్చరించారు. నిజమేకావచ్చు-కాని సంఘం కమలాఫలం కాదుగా! ఆనాటి మహా సంకల్పం-పూనా ప్రముఖ వ్యక్తులందరిని అతిత్వరలోనే సంఘభావం ఆకట్టుకుంది. అంతలో బొంబాయి ప్రభుత్వం మధ్యప్రాంతం బేరారు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది- మీరు నాకొక క్రొత్త తలనెప్పి పంపించారు. ఏమిటిది? అని.

మరో ముఖ్య కేంద్రం-బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం నెలకొనివున్న కాశీ పట్టణం. ఇక్కడ మాలవ్యా ఎంతగానో చేయూత ఇచ్చారు. లాఠీలు మొదలైనవి వుంచుకోవడానికి ఆర్. యస్. యస్. ఒక చిన్న గది కట్టుకోవడానికి కూడా ఆయన అనుమతించారు. (ఎమర్జెన్సీ రోజుల్లో యిది ధ్వంసం చేయబడింది). తరువాతి సర్‌సంఘచాలక్ శ్రీ గురూజీ ఆర్. యస్. యస్.లో చేరింది కూడ యిక్కడనే. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయానికి డా॥ రాధాకృష్ణన్ వైస్-ఛాన్సలర్ అయినప్పుడు వారానికొకమారు శాఖను సందర్శిస్తుండేవారు. శాఖ శక్తిని ద్విగుణీకృతంచేస్తే అనుదినంవచ్చి సందర్శిస్తానని ఆయన అంటుండేవారు.

శరీర వ్యాయామం, సంగీతం జోడయితేనే అసల్యవిద్య అవుతుందని ప్లేటో భావించేవాడు. ఆర్. యస్. యస్. కూడ క్రీడలతో గానాన్ని సమ్మిళితం చేసింది.

డా॥ హెడ్గెవార్ మొదటినుంచి క్రీడలు, వ్యాయామము, విన్యాసాలకు ప్రాముఖ్యత గురించి నొక్కి చెపుతుండేవారు. సమగ్రమైన అనుశాసనానికి శారీరక క్రమశిక్షణ ముఖ్యప్రాతిపదికగా వుంటుంది. వాటర్లూ యుద్ధాన్ని ఈటన్ ఆటస్థలాల్లోనే గెలుచుకున్నామని వెలింగ్టన్ ఊరికే అనలేదు. ప్రాచీన ఆశ్రమాలలో శాస్త్రాభ్యాసానికి యివ్వబడిన ప్రాముఖ్యతే శస్త్రాభ్యాసానికి కూడా యిచ్చేవారు. వివేకానందుడన్నట్లు ఫుట్ బాల్ ఆడి కండరాలు కాస్త దృఢపరచుకొనగలిగితే భగవద్గీతను మనం అర్థంచేసుకొనగలుగుతాము. అరవిందుడు సహితం తమ పాండిచేరి ఆశ్రమవాసులకు పథసంచలనం, డ్రిల్లు వంటి శరీర వ్యాయామాలను విధించాడు. ఆయన అన్నట్లు" ...యివన్నీ స్థూలదృష్టికి వట్టి ఆటపాటలుగానే కనిపించవచ్చు. కానీ వాటి అసలు ప్రాముఖ్యం మరెంతోవుంది. వుంటుంది. యుద్ధ సమయంలోను, శాంతిసమయంలోను, రాజకీయ కార్యకలాపాలలోను, సామాజిక కార్యకలాపాలలోను ఒక జాతికి అత్యవసరంగా కావలసిన సంస్కారాలను సామర్థ్యాలను,గుణగణాలను నిర్మాణంచేసే క్షేత్రాలు యివే.వాటి వలన శారీరక ఆరోగ్యము, శక్తిసామర్థ్యాలకు పునాది ఏర్పడే మాట అటుంచి అంతకంటే ముఖ్యంగా అనుశాసనము, ధైర్యోత్సాహాలు, జాతీయ సౌశీల్యాల నిర్మాణానికి యీ కార్యక్రమాలు తోడ్పడుతాయి."

ఈ అణుయుగంలో లాఠీ త్రిప్పటంవల్ల లాభంలేదని అనడానికి వీలులేదు. స్వయంసేవకుని బాహ్యవ్యక్తిత్వంలో లాఠీ ఒక భాగమైపోయింది. బంకిమ్ వ్రాసిన "లాఠీ ప్రస్తుతి" నేటికీ ఎంతో యధార్థాన్ని ధ్వనిస్తుంది.

"ఓ లాఠీ ! నీ రోజులు గతించిపోయినవే! నీవు వెదురు కుటుంబంలో పుట్టిన మాట నిజమే. కాని విద్యావంతుని చేతినలంకరించినపుడు నీకు అసాధ్యమనేదే లేదు గదా ! ఎన్నెన్ని ఖడ్గములో నీ వలన రెండుగా విరిగినవి ఎన్ని కత్తులను, ఎన్ని డాళ్లను

నీవు ముక్కలు చేయలేదు ? నీ దెబ్బకు తెల్ల దొరల చేతుల నుండి రైఫిళ్లు, బాయొనెట్లు జారిపడినవి.

"ఓ లాఠీ ! వంగ దేశమున నీవు మానాభిమానములకు, గౌరవప్రతిష్ఠలకు, ధనధాన్యములకు, మనుష్యులకు. మానసములకు రక్షగానుండెడి దానవు. పీడకులైన ఆక్రమణదారులు నిన్ను జూచి తోకముడిచెడివారు. నీవనిన బందిపోట్లు సైతము పలాయనము చిత్తగించెడివారు. నీవలననే నీలిమందు తోటపనివారు నిలువుదోపిడి నుండి విముక్తులైనారు.

"అయ్యో ! ఓ లాఠీ ! నీ వైభవములెల్ల నేడు గతించినవి గదా ! ఇంక నీవు లాఠీవి కావు, వట్టి వెదురు ముక్కవు. నీ విపుడు పనికిమాలిన చేతికర్రవై, కుక్కలకు నక్కలకు వెరచెడి 'బాబు'ల చేతులకు అలంకారమైతివి ! కుక్క మొరుగుళ్లకు వారు వణికినంతనే వారిబలహీనమైన చేతుల నుండి జారి క్రిందపడి పోవుచున్నావు.

"అయ్యో, నీ ప్రాచీన శౌర్యమును నేడు పోగొట్టుకొంటివి. నీవిపుడు అమరమైన దివ్యలోకమున పాదుకొనేవుంటివి కాబోలు. అమరేంద్రుని నందనోద్యానమున పారిజాత తరువునకు ప్రాపువై నిల్చితివికాబోలు. అప్సరసలు నీపై తమ మృదు పాదములమోపి కల్పవృక్షము నుండి ధర్మార్థ కామ మోక్ష ఫలములను కోయుచుంటిరి కాబోలు. నీ కృపవలన ఆ ఫలములందు ఒకటి రెండు మా భూమిపై పడుగాక !

ఈ క్రీడలు, వ్యాయామం, విన్యాసాలు పాల్గొనేవారికి ఆనందోత్సాహాలు కలిగించడమేగాక, ప్రేక్షకులకుకూడా కనువిందుకలిగించినై. సమాజంలో ఒక నవజీవనం తొణికిసలాడ నారంభించింది.

నాగపూరులో మరాఠీ సాహిత్య సమ్మేళన్ సమావేశం జరుగుతున్నది. తొలుత తిలక్ ముఖ్యానుచరుడుగా, తదుపరి గాంధీజీ ముఖ్యానుచరుడు అయిన శ్రీ ఖాదిల్కార్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఆయనను, మరికొందరు ప్రతినిధులను స్థానిక ఆర్. యస్. యస్. శిబిరాన్ని సందర్శించవలసినదిగా డాక్టర్‌జీ ఆహ్వానించారు. అక్కడ అనుశాసనబద్ధమైన ప్రదర్శనలను, స్వయంసేవకుల ఉత్సాహాన్ని, ఉద్యమశీలతను చూచినతరువాత వారిలో కొందరు యిలా వ్యాఖ్యానించారు. "మూన్నాళ్ళుగా మేము పుస్తక సాహిత్యంలో తలమునకలై వున్నాము. ఈరోజు సజీవ సాహిత్యపు స్ఫూర్తివంతమైన వాతావరణంలోకి వచ్చాము." ఖాదిల్కార్ మాత్రం నిశ్శబ్దంగా వుండిపోయారు. ఆయన కనుల నుండి ఆనందాశ్రువులు జాలువారసాగినై. స్వయంసేవకుల నుద్దేశించి ప్రసంగించవలసిందిగా డాక్టర్‌జీ ఆయనను అభ్యర్థించారు. 'నవాకాల్' పత్రికకు స్వయంగా సంపాదకుడై వుండి, గొప్ప సాహితీవేత్త అయివుండికూడా ఆయన నోరు పెగలక భావావేశంవల్ల గద్గదమైన స్వరంతో–"డాక్టర్ సాహెబ్! మీ కార్యాన్ని ఏమని వర్ణించను? ఇది మాటలతో చెప్పలేము. ఈ దృశ్యమే దీనికి నిర్వచనంగా వుంది. ఇది దివ్యశక్తి మూర్తీభవించిన దుర్గావతారం. ఆమెను గ్రహించడానికి ఆమె దర్శనమే చాలు"–అన్నారు.

ఒకే స్థలానికి చెందిన స్వయంసేవకులు, నిర్దిష్ట సమయంలో, ఒక గంట సేపు కలిసివుండటమే ఆర్. యస్. యస్. దైనందిన కార్యక్రమం. ముఖ్యశిక్షకుడు విజిల్ వేయగానే స్వయంసేవకులు పంక్తులలో నిలబడుతారు, భగవాధ్వజం ఎగురవేయబడుతుంది. ఛాతీఎదుట కుడి ముంజేతిని అడ్డంగా నిలిపి అరచేయి నేలవైపు తిరిగివున్న స్థితిలో ఆ ధ్వజానికి అభివందనం అర్పిస్తారు. తరువాత డ్రిల్లు, దండతో (లాఠీ) వ్యాయామం, క్రీడలు. ఇవి అయిన తరువాత వర్తులాకారంలో కూర్చుంటారు. రానివారెవరో ఎందుకు రాలేకపోయారో తెలుసుకుంటారు. ఎవరయినా అతిథిగాని, క్రొత్త స్వయంసేవక్‌గాని వస్తే పరిచయం చేసుకుంటారు. మరునాడు చేయవలసిన వాటిగురించి అవసరమైతే సూచనలు యివ్వబడుతాయి. తరువాత ఒకటిరెండు గీతాలు పాడుతారు. గంట ముగిసే సమ

యంలో తిరిగి పంక్తులవారీగా సావధాన స్థితిలో నుంచుంటారు. ప్రార్థనచేసి ధ్వజాన్ని అవరోహణ చేసేముందు మరొకమారు ప్రణామం చేస్తారు.

ఇంతటితో శాఖ అయిపోయినట్లే. కాని చాలమంది వెంటనే ఇళ్ళకు వెళ్ళిపోరు. కొంతసేపు అక్కడే వుంటారు. ప్రజలగురించి, పరిస్థితులగురించి చర్చిస్తారు. నాటి వార్తా విశేషాలమీద చక్కని వ్యాఖ్యలు వినవస్తాయి. వీటికి చారిత్రక సమీకరణల ప్రస్తావన వస్తుంది. ఎంతో విజ్ఞానం, ఎంతో వినోదం, కేరింతలు శాఖాస్థలం వదిలిన తరువాత వారితో కొందరు అస్వస్థులయివున్న స్వయంసేవకులను పరామర్శించడానికి వెళ్తారు. వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తారు. ఇంటికి చేరేసరికి ఏదో దేశభక్తి గీతపు పల్లవి అసంకల్పితంగా పెదవులమీదికి వచ్చేస్తుంది. ఈ సంస్కారాలే స్వయంసేవకుణ్ణి జాతీయవాద కార్యదీక్షాదక్షుడిగా నిర్మాణం చేస్తాయి.

స్థానిక నాయకులే కాక, సర్దార్ పటేలుకు అన్నగారు నాటి కేంద్ర శాసనసభాధ్యక్షుడు అయిన శ్రీ విఠల్ భాయి పటేలుకూడ ఆర్. యస్. యస్. వైపు ఆకర్షితులయినారు, 1928లో మోహితేవాడలోని ఆర్. యస్. యస్. శాఖను ఆయన సందర్శించారు. నాడు అదొక్కటే శాఖ వుండేది. స్వయంసేవకుల నుద్దేశించి ప్రసంగిస్తూ "ఈ దేశంలో మరో చోటికి ఎక్కడికి వెళ్ళినా, జీవం లేకుండా, నిశ్చేతనమైన పరికరాలవంటి సంస్థలే నాకు కనిపించినై. కాని యిక్కడ మన దివ్య మాతృభూమి భవిష్యత్తును రూపుదిద్దే సామర్థ్యంగల శక్తివంతము, చైతన్యపూరితము అయిన హస్తాలను, మానవులలో మహోన్నత మూర్తులను చూచి నాకు సంతోషం కలుగుతున్నది. వీరే ఆశారేఖలుగా నాకు దర్శనమిస్తున్నారు" అన్నారు.

ఆ తొలి సంవత్సరాలలో ఆర్. యస్. యస్.ను సందర్శించిన మరొక విఖ్యాత నాయకుడు డా॥ అంబేద్కర్. పూనాలో జరుగుతున్న ఒక శిక్షణా శిబిరాన్ని పరిశీలించి అక్కడ కులప్రసక్తి లేకపోవడంచూచి ఎంతో ముగ్ధులయినారు.

అప్పటికే విఠల్‌భాయిపటేల్ వంటి మహా నాయకులకు ఆశారేఖగా తయారయినా, ఆర్. యస్. యస్.కు కార్యాలయమంటేదు. అధికారులు లేరు. 1930లో

హెడ్గెవార్ సత్యాగ్రహంచేసి జైలుకు వెళ్ళేవరకు వారి మట్టిగోడలయిల్లే 'కార్యాలయం'గా వుంటూవచ్చింది. 1929లో ఒకనాడు డా॥ హెడ్గెవార్ సంఘస్థాన్‌లోవున్న వార్ధా ప్రాంత కాంగ్రెసు నాయకులు అప్పాజీ జోషి ఆకస్మికంగా స్వయంసేవకులను 'సావధాన్'గా నిలిపి బిగ్గరగా "సర్‌సంఘ చాలక్ ప్రణామ్-ఏక్...దో" అని ఆజ్ఞ యిచ్చారు.

ఆజ్ఞానుసారంగా స్వయంసేవకులు తమ నాయకుడికి ప్రణామం చేశారు. శాఖ ముగిసిన మీదట డా॥ హెడ్గెవార్ మిత్రులందరిని పిలిచి, వారి ప్రవర్తనకు అర్థమేమిటని అడిగారు. సంస్థకు కార్యవర్గం ఒకటి అవసరమని, అధికార విభజన ప్రకారం ఎవరి బాధ్యతలు వారు నిర్వర్తించడం మంచిదని వారంతా పట్టుపట్టారు. కొద్దికాలంలోనే బాలాజీ హుద్దార్‌ను సర్ కార్యావాహగా, మార్తాండరావుజోగ్‌ను సర్ సేనాధిపతిగా నియమించారు.

తరువాత హుద్దార్ పత్రికారచనలో ప్రావీణ్యం సంపాదించడానికి బ్రిటన్ వెళ్ళారు. అక్కడనుంచి స్పానిష్ అంతర్యుద్ధంలో రిపబ్లికనుల పక్షాన పోరాడడానికి వెళ్ళారు.

ఆర్. యస్. యస్. మిలిటరీ వంటిదిగా కొంతవరకు పైకి కనుపించినా-"సర్ సేనాపతి" కూడా ఒకరు వున్నప్పటికీ-ఏవిధంగాను యిది ఉద్యమం కాదు. పైన కనిపించేదంతా ఉత్సాహవంతులయిన యువకులను ఆకర్షించి, వారిలో క్రమశిక్షణను రూపొందించడానికి మాత్రమే ఉద్దేశించినట్టిది. రెండవ ప్రపంచయుద్ధం వచ్చి మిలిటరీ పద్ధతి యూనిఫారాలను ప్రభుత్వం నిషేధించినప్పుడు, వెంటనే ఆర్. యస్. యస్. బూటు-పట్టీలను మానేసింది. అయినా సంస్థ గతంలోకంటె త్వరితంగా పురోభివృద్ధి సాధించింది.

మారువేషాలలో అజ్ఞాతంగా ఉండిన, ఆపదలోవున్న విప్లవకారులను డా॥ హెడ్గెవార్ ఎప్పటిలాగానే ఆదరిస్తుండేవారు. భగత్‌సింగుకు కుడిభుజంగా నిలిచిన రాజగురుకు ఉమరేర్‌లోవున్న ఆర్. యస్. యస్. నాయకుడు భయ్యాజీ దాణీగారి వ్యవసాయ క్షేత్రంలో అజ్ఞాతంగా ఉండడానికి ఏర్పాట్లుకూడ చేశారు.

అక్కడనుంచి రాజగురు పూనాకు వెళ్ళడం వలననే పట్టుబడ్డాడు. సతారాలో ప్రముఖ విప్లవకారుడు, "గురూజీ"గా వ్యవహరింపబడే దామోదర బల్వంత భిడేను కలిసినపుడు డా॥ హెడ్గెవార్ సాష్టాంగ ప్రణామం ద్వారా అభివందనం తెలిపారు.

అంతమాత్రాన విప్లవవాదుల సంస్థలకు ఆర్. యస్. యస్.ను అనుబంధంగా నడిపించే ఉద్దేశం డాక్టర్‌జీలో ఏ కోశాన లేదు. విప్లవకారుల ఆయుధ సామగ్రి ఎక్కడ వుందేదో వారికి తెలుసు. "అన్ని ఆయుధాలు మీ అధీనంలోనే వున్నాయి" అంటూ నాగపూరు కలెక్టరు ఆహ్వానించిన అభియోగంచేశారుకూడాను. కాని స్వయంసేవకులు, ఆయుధాలు వేరువేరు పరిధుల్లో వుండేవిధంగా హెడ్గెవార్ జాగ్రత్త వహించారు. హింగన్ ఘాట్‌లో జరిగిన బందిపోటు దోపిడీలో తనకు తెలియకుండా విప్లవకారుల నాయకుడైన పాండేగారి పిస్టలును ఉపయోగించడం వారికి కలవరం కలిగించింది. తాను జైలులోవుండగా 1931 జనవరిలో బాలఘాట్‌లో హుద్దార్ రాజకీయ బందిపోటుదాడి నిర్వహించడం వలన వారికి మరింత ఆందోళన కలిగింది. జైలునుంచి విడుదల కాగానే విప్లవకారుల ఆయుధాలన్నిటిని ధ్వంసంచేయవలసిందిగా ఆజ్ఞయిచ్చారు. హుద్దార్ అంతటితో నిష్క్రమించాడు.

1935 మే 24న నాగపూరులోని మధ్యప్రాంత-బేరారుల సచివాలయంలో అనుమానాస్పద కారణాలవల్ల అగ్నిప్రమాదం చెలరేగింది. ఈ ప్రమాదంలో సి. ఐ. డి.ల పాత నివేదికలన్నీ దగ్ధమైపోయినై. హెడ్గెవార్ నవ్వుతూ "నామీద యింక ఎవరూ ఆరోపణలు చేయలేరు" అన్నారు.

సంపూర్ణ స్వరాజ్యమే తన లక్ష్యంగా 1929 జనవరి 26న కాంగ్రెస్ ప్రకటించినప్పుడు డా॥ హెడ్గేవార్ ఆనందానికి అవధిలేదు. ఆరోజు పెరేడ్‌లు, ప్రతిజ్ఞలు, ఉద్బోధనలు, దేశభక్తి గీతాలతో ఉత్సవంగా జరుపవలసిందిగా ఆయన అన్ని శాఖలకు ఆదేశమిచ్చారు. దీనితో బ్రిటిషువారు ఆర్. యస్. యస్.ను నిషేధిస్తారేమోననే అనుమానం ప్రబలమైంది. ప్రభుత్వం ఈ విషయాన్ని తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు అనిపించింది. డా॥ హెడ్గెవార్ మాత్రం అలాంటిదేమీ

జరిగే అవకాశంలేదనే దృఢవిశ్వాసంతో నిబ్బరంగా వున్నారు. "ప్రభుత్వం ఆర్. యస్. యస్.ను నిషేధించడమే జరిగితే, ఈ 16 శాఖలు 200 శాఖలుగా విస్తరిస్తాయి" అన్నారు.

1930లో ఉప్పు సత్యాగ్రహానికి పిలుపు రాగానే, అందులో పాల్గొనటానికి కేశవరావు నిశ్చయించారు. ఈ సత్యాగ్రహంతో స్వరాజ్యం ఊడిపడదని వారికి తెలుసు. కాని స్వరాజ్య సంగ్రామ సోపాన పంక్తిలో యిది మరో మెట్టుగా ఆయన భావించారు. కనుకనే సంస్థగా ఆర్. యస్. యస్. సత్యాగ్రహంలో పాల్గొనకూడదని నిర్ణయించారు. సంఘకార్యం ద్విగుణీకృత ఉత్సాహంతో కొనసాగితీర వలసిందేనని, స్వయంసేవకులు మాత్రం వ్యక్తిగత హోదాలో సత్యాగ్రహం జరిపి అరెస్టుకావచ్చునని అన్నారు. పండలాదిమంది స్వయంసేవకులు ఆవేవిధంగా అరెస్టయినారు. వారందరిలో కేశవరావు అగ్రగాములై నిలిచారు.

మధ్యప్రాంతానికి సముద్ర తీరంలేదు కనుక, ఉప్పు శాసనాన్ని ఉల్లంఘించి ఉప్పు సత్యాగ్రహం జరిపే అవకాశం లేదు. అందువల్ల వనవాసులకు వ్యతిరేకంగా రూపొందించబడిన అడవి పన్నును ఉల్లంఘించి అడవి సత్యాగ్రహం జరపడానికి ఆయన నిశ్చయించారు. అందుకై లోహరా అడవికి ప్రయాణమై మార్గమధ్యంలో యవత్‌మాల్ చేరుకున్నారు.

యవత్‌మాల్‌లో ఒక గోవును కసాయిశాలకు తోలుకొనిపోవడం ఆయన కంటబడింది. గోవధ అనే ఆలోచనే ఆయనకు సహించరానిది. కసాయివాణ్ని దారిలో ఆపారు. అంతలో జనం పోగయినారు. సత్యాగ్రహం చేయడానికి వచ్చిన వ్యక్తి యిలాంటి పనికిమాలిన పనులు పెట్టుకొనకూడదని చెప్పారు. అందుకు హెడ్‌గెవార్ "గోవు మీకు పనికిమాలినది అయ్యుండవచ్చు. నా అభిప్రాయం వేరు" అని చెప్పారు. కొంత వాగ్వాదం జరిగిన మీదట కసాయివాడికి కొంత డబ్బిచ్చి గోమాతను రక్షించారు.

మరునాడు-1930 జులై 21. డా॥ హెడ్‌గెవార్, అప్పాజీ జోషి, దాదారావు పరమార్థ మొదలయినవారు పదివేలమంది అనుచరులతో సత్యాగ్రహం

జరిపి అడవి శాసనాన్ని ఉల్లంఘించి గడ్డి కోశారు. (హెడ్గెవార్ కోసిన గడ్డి ఆ మరుసటి రోజు నాగపూరులో భగవాధ్వజంముందు సమర్పించబడింది.) ఫలితంగా హెడ్గెవార్‌కు కఠిన శ్రమతో కూడిన 9 నెలల కారాగారవాసాన్ని విధించారు. కాని అప్పటికే వారి ప్రఖ్యాతి గురించి తెలిసిన స్థానిక పోలీసుసబిన్‌స్పెక్టరు వారికి మంచి ఆహారం యివ్వవలసిందిగా ఆజ్ఞ చేశారు. అక్కడి సివిల్ సర్జన్ ఒకరు మిఠాయిలు పెట్టించారు. ప్రారంభం భేషుగ్గా వున్నదని కేశవరావు చమత్కరించారు.

యవత్‌మాల్ నుంచి అకోలా జైలుకు తీసికొని పోతుండగా దారిలో వివిధ స్టేషనులవద్ద దిగి, అక్కడ సమావేశమైన జనసమూహాలనుద్దేశించి ప్రసంగించారు. ఇదంతా వారివెంట వస్తున్న పోలీసు అధికారికి నచ్చలేదు. సత్యాగ్రహులందరికి బేడీలువేయమని ఆయన తన జవానులకు ఆజ్ఞ యిచ్చారు. తమకు బేడీలు వేసే ప్రయత్నాలు జరిగితే పోలీసులందరిని సత్యాగ్రహులు బయటికి త్రోసివేయగలరని హెడ్గెవార్ హెచ్చరించారు. సత్యాగ్రహులమైన తాము స్వయంగా అరెస్టయినామని, కనుక ఎక్కడికీ పారిపోమని అభయం యిచ్చారు. అంతటితో పోలీసు అధికారి వెనుకకి తగ్గాడు. చివరకు యిదంతా నవ్వులతో ముగిసి, అంతా మిఠాయిలు ఆరగించారు.

జైలులో హెడ్గెవార్ ఇతర సత్యాగ్రహులందరి హృదయాలను చూరగొన్నారు. అందరికీ అవసరాలలో తోడ్పడుతూ, తనకై ఎట్టి సదుపాయాలను అభిలషించక వారందరి ప్రేమాభిమానాలకు పాత్రులయినారు. జైలులో బి-క్లాసులోవున్న సహచరులలో అనేకులు తరువాత ఆర్. యస్. యస్. ప్రముఖ కార్యకర్తలయినారు.

ఇతర సత్యాగ్రహులు, జైలు అధికారులు కూడ ఒకే విధంగా వారిని గౌరవించారు. తమకు యివ్వబడుతున్న నెయ్యి కల్తీగావున్న విషయం జైలు పర్యవేక్షకుడికి ఫిర్యాదు చేయవలసిందిగా సత్యాగ్రహులు ఒక సందర్భంగా ఆయనను ప్రతిమిలాడారు. ఫిర్యాదులుగాని, అభ్యర్థనలుగాని చేయడమంటే హెడ్గెవార్‌కు పరమ చిరాకు. ఆయన ససేమిరా అనడంతో వారంతా చివరకు

ఒక నిర్ణయానికి వచ్చారు. ఫిర్యాదు తామే చేస్తామని, తాము చెప్పేది నిజమో కాదో హెడ్గేవారును కనుక్కోనమని మాత్రమే తాము జైలు సూపరిండెంటుకు చెప్తామని, ఆయన కనుక్కోనడానికి వచ్చినపుడు అవునన్నట్లు తలవూపితే చాలునని, చెప్పి, ఒప్పించారు. అంతా అదేవిధంగా జరిగింది. జైలు సూపరిండెంటు ఫోర్డు హెడ్గేవార్ అభిప్రాయాన్నే తుది అభిప్రాయంగా స్వీకరించాడు. తరువాత మరెన్నడూ నేయిని గురించి ఫిర్యాదు చేయవలసిన అవసరం సత్యాగ్రహులకు కలగలేదు.

ప్రతి సాయంకాలం సత్యాగ్రహులు ఆరుబయట కూర్చొని వుండగా. గ్రహాలు, నక్షత్రాల గురించి అనేక అద్భుతమైన విషయాలుచెప్పి హెడ్గేవార్ వారిని సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తేవారు. వారలా ఖగోళశాస్త్రాన్ని ఎంతో ఆసక్తితో అధ్యయనం చేసేవారయిప్పటికీ, జ్యోతిష్కులను, హస్త సాముద్రికులను మాత్రం ఎన్నడు సంప్రదించేవారు కాదు.

జగన్నాధశాస్త్రి అనే సత్యాగ్రహికి హస్తసాముద్రికంచెప్పడంలో ఉత్సాహం వుండేది. అతని జ్యోతిష పరిజ్ఞానపు బండారాన్ని బయట పెట్టాలని హెడ్గేవార్, ఆయన మిత్రుడు బిదార్కర్ నిశ్చయించారు. వారి పథకం ప్రకారమే ఒక రోజున శాస్త్రికి వినపడేట్లు హెడ్గేవార్ను బీదార్కర్ ఎన్నో ప్రశ్నలు వేశాడు-మీ భార్య క్షేమంగా వున్నారా ? మీ మొదటి భార్య సంతానం ఎలా వున్నారు "ఇత్యాది. తరువాత ఒక నాడు హెడ్గేవార్ తన చెయిచూడమని చెప్తే శాస్త్రీజీ ఆనందానికి అంతులేదు. వారి ప్రతిభ చూడటానికి అందరూ వారిచుట్టూ గుమిగూడారు. చెయ్యి ఎంతో నిశితంగా పరిశీలించి శాస్త్రీజీ చెప్పకుపోతున్నాడు "తమరు రెండుమార్లు వివాహం చేసుకున్నారు. తమకు పిల్లలు నలుగురు"... అంటూ. అందరూ పక పక నవ్వడంతో శాస్త్రీజీకి విషయం తెలిసివచ్చింది. తరువాత ఎన్నడూ ఎవరిచేతులూ శాస్త్రీజీ చూడలేదు.

1931 ఫిబ్రవరిలో డా॥ హెడ్గేవార్ విడుదలయినప్పుడు నాగపూరులో బ్రహ్మాండమైన స్వాగతం లభించింది. సన్మానం కాగానే సరాసరి హాధీఖానాలోని

శాఖకు వెళ్ళారు. అక్కడినుంచి అస్వస్థులయివున్న స్వయంసేవకులను పరామర్శించడానికి వెళ్ళారు. ఆ తరువాతనే తమ యింటికి వెళ్ళారు.

కొన్ని దశాబ్దాలుగా రకరకాల త్రివర్ణ పతాకాలను వాడుతున్నందున, జాతీయ పతాకాన్ని నిర్ధారించడానికి కరాచీ కాంగ్రెసు సమావేశంలో 'ఝండా కమిటీ'ని నియమించారు. కమిటీలో సర్దార్ పటేల్ (అధ్యక్షుడు), మౌలానా ఆజాద్, పండిట్ నెహ్రూ, మాస్టర్ తారాసింగ్, కాకా కాలేల్కర్, పట్టాభి సీతారామయ్య (కన్వీనరు) సభ్యులుగా వున్నారు. కాషాయరంగు "ఏ ప్రత్యేక వర్గానికి చెందదు **(non - communal)**" కనుక, "ఈ ప్రాచీన దేశపు సుదీర్ఘ పరంపరతో యిది ముడిపడివుంది" కనుక, "జాతీయ పతాకం కాషాయరంగులోనే వుండాలి. దాని పైభాగంలో నాలుగవవంతు స్థలంలో నీలపురంగు చరఖా గుర్తును ముద్రించాలి" అని ఈ కమిటీ ఏకగ్రీవంగా ప్రకటిస్తూ నివేదిక సమర్పించింది. (న్యూఢిల్లీ తీన్‌మూర్తి భవనంలో నెహ్రూ స్మారక ప్రదర్శనశాల-గ్రంధాలయంలో ముఖ్య కరపత్రాలు, పథకాలు 79-F విభాగంలోవున్న ఫైలు నెం. 11/27-1927 చూడండి).

ఈ నివేదికను ఆమోదించవలసిందిగా ఒత్తిడిచేయటానికి డా॥ హెడ్గెవార్ ఢిల్లీలోను, బొంబాయిలోను కాంగ్రెసు నాయకులను కలిశారు. కాని మతతత్వవాదుల ఒత్తిడి కారణంగా, కాంగ్రెసు తన పాత జెండానే కొనసాగించింది. కాకపోతే ఎర్రచార వున్నచోట నారింజరంగు చారపెట్టి, యీ భాగం పైకి వచ్చేట్లు మార్చింది. భారత జాతీయత యొక్క మౌలిక స్వరూపాన్ని కాంగ్రెసు అవగాహన చేసుకొనలేకపోయినందుకు డా॥ హెడ్గెవార్ బాధపడ్డారు.

ముస్లింలలో సరయిన పరిజ్ఞానం లేనివారు మాత్రమే భగవాధ్వజానికి అధిక్షేపణ తెలుపుతారు. అటువంటివారే ఆకుపచ్చజెండాను "ఇస్లామిక్"గా పరిగణిస్తారు. మహమ్మదు ప్రవక్త కాషాయ జెండాతోసహా ఎన్నో జెండాలను యుద్ధాలలో ఉపయోగించాడుకాని, ఆకుపచ్చ జెండాను ఎన్నడూ ఉపయోగించ లేదు.

ఈ సమయంలో కాంగ్రెసువారు, హిందూమహాసభవారు, విప్లవకారులు అందరూ ఆర్. యస్. యస్. నుంచి సహాయాన్ని ఆశించినవారే, కాని డా॥ హెడ్గెవార్, వారి మిత్రులు తమ స్వతంత్ర విధానానికే కట్టుబడివున్నారు. యువకులకు స్ఫూర్తినిచ్చి, వారి భావాలను ఆమూలాగ్రంగా సంస్కరించడంలో ఆర్. యస్. యస్. స్వతంత్రము, ఉన్నత పాత్రను నిర్వహించవలసివుంది. ఉద్రేకాలతో ఉబుసుపోకలతో తన కార్యక్రమం దెబ్బతినడానికి ఆర్. యస్. యస్. సిద్ధపడలేదు.

1932 దసరా ఉత్సవంలో 1200 మంది స్వయంసేవకులు గణవేషం (యూనిఫారం)తో పాల్గొన్నారు. చుట్టుప్రక్కల జిల్లాలలో సంతృప్తికరంగా సంఘకార్యం వృద్ధి చెందుతున్నది. దానితో బ్రిటీషువారికి కన్నుకుట్టింది. ప్రభుత్వోద్యోగులు ఆర్. యస్. యస్. శాఖలకు వెళ్ళడాన్ని నిషేధిస్తూ 1932 డిసెంబరు 15 న మధ్యప్రాంతం గవర్నరు ఉత్తరువులు జారీచేశాడు. మరికొంత కాలం తరువాత ఈ ఉత్తరువులను మునిసిపల్ ఉద్యోగులకు, జిల్లాస్థానిక బోర్డు ఉద్యోగులకు కూడ వర్తించేట్లు విస్తరింపజేశారు. ఎన్నో మునిసిపల్ కమిటీలు, జిల్లాస్థానిక బోర్డులు యిందుకు నిరసన వ్యక్తం చేసినై. ఈ విషయం మీద అసెంబ్లీలో కొత్తే అనే శాసన సభ్యుడు 1934 మార్చి 7 వ తేదిన 7 వ నెం. డిమాండులో ఒక రూపాయి కోతకు తీర్మానాన్ని ప్రతిపాదించాడు. హోంమంత్రి ఇ. రాఘవేంద్రరావు, ఆయన ఆంగ్లేయ సహచరులు ముగ్గురు-(ఎన్.జె. రఫ్టన్, ఇ.ఎ. మెక్‌నీ, ఇ. గోర్డాన్‌లు) మినహా ప్రసంగించిన ప్రతి ఒక్కరూ కోత తీర్మానాన్ని బలపరిచారు. ఆర్.యస్.యస్. మతతత్వంతో కూడివుందని ఫాసిస్టు సంస్థ అని రాజకీయ సంస్థ అని యింకెన్నో విధాల ఆరోపణలు అధికార పక్షం వారు చేశారు. కాని ఏడు సంవత్సరాలుగా నడుస్తువున్న ఆర్.యస్.యస్. మీద ఏ ముస్లిం సంస్థ అయినా ఎట్టి అభ్యంతరం చెప్పలేదని, బీరారు మునిసిపాలటీ ముస్లిం నాయకుడు ఎస్. ఎమ్. రహమాన్ గుర్తుచేశాడు.

సి.బి. పారీఖ్ యిలా అన్నారు. "నేను హిందువును కాదు. కనుక హిందువుల అభిప్రాయలు నా అభిప్రాయాలు వేరు. కాని హిందువులు కనీసం తమను

తాము యితరుల దాడి నుంచి కాపాడుకొనలేని విధంగా ఆత్మరక్షణను పోర్తిగా నిర్లక్ష్యం చేశారని నేను అభిప్రాయపడుతున్నాను. తాము ప్రతిఘటిస్తే చాలు హిందువులు పారిపోతారని ముస్లింలు భావించేస్థాయికి యీ నిర్లక్ష్యం చేరుకుంది.

బిలాస్‌పూరులో ఆర్. యస్. యస్. కు కేంద్రం వంటిదయిన వ్యాయామ శాల 1929 లో హోంమంత్రి రాఘవేంద్రరావే శంకుస్థాపన చేసిన సంగతి నాగ పూరు విశ్వవిద్యాలయానికి చెందిన డా॥ బి.టి. మంగళమూర్తి ఆయనకు గుర్తు చేశారు.

అందరిలోను రమాబాయి తాంబే మంచి ప్రసంగం చేశారు ; "ఈ రాష్ట్రీయ సంఘం ప్రశంసనీయమైన ఉద్యమం. మధ్యప్రాంతాలలో ప్రారంభమైన యీ సంస్థ భారత దేశమంతటా విస్తరించి అన్ని వర్గాలను సమైక్యం చేయగలదని నేను చెప్పగలను."

"మీరు ఏ పాఠశాలకు వెళ్ళిచూచినా అక్కడి బాలుర మధ్య లేడా స్పష్టంగా కనిపిస్తుంది. మహమ్మదీయ బాలుర కంటే క్రైస్తవ బాలురు మెరుగ్గా వుంటున్నారు. హిందు బాలురు మహమ్మదీయ బాలుర కంటే కూడ వెనుకబడి వుంటున్నారు. వారి దేహదారుఢ్యము, కదలికలు, వారు నిలిచే పద్ధతుల గురించి చెప్తున్నాను. ఈ విషయాలలో మన బాలుర కంటే యితర వర్గాలకు చెందిన బాలురు పురోగమించివున్నారని, ఈ పరిస్థితిలో యీ రాష్ట్రీయ సంఘం సహాయ కారిగా వుండగలదని అభిప్రాయ పడుతున్నాను. సంఘంలో బాలురు సుశిక్షితులై వృద్ధిలోకి రావాలని ఆకాంక్షిస్తున్నాను. వారిని సంఘం అరాచకవాదులుగా చేస్తుందని నేను నమ్మను. ఎవరో అవసరమైన వివాదాన్ని సృష్టించడానికి యత్ని స్తున్నారు" అని వివరించారు శ్రీమతి తాంబే.

రెండు రోజుల చర్చ జరిగినమీదట కోత తీర్మానాన్ని ఓటింగుకు పెట్టారు. ప్రభుత్వం పరాజయం పొందింది. ప్రభుత్వ ఉత్తర్వులుచెల్లనివి అయిపోయినవి.

ఆర్. యస్. యస్. రంగంలోకి వచ్చింది.

ఆ సంవత్సరమే మహాత్మాగాంధీ, డా॥ హెడ్గేవార్ల మధ్య చారిత్రాత్మకమైన సమావేశం జరిగింది. 1934 డిసెంబరు 22 నుంచి 25 వరకు జమ్నాలాల్ బజాజ్ గారికి చెందిన ఒక సువిశాల క్షేత్రంలో ఆర్. యస్. యస్. వార్ధాజిల్లా వార్షిక హేమంత శిబిరాన్ని నిర్వహిస్తున్నది. సమీపంలోనే సత్యాగ్రహాశ్రమంలో గాంధీజీ విడిది చేసివున్నారు. తన గది నుంచి ఆర్. యస్. యస్. శిబిరాన్ని తిలకించిన గాంధీజీ, ఎంతగా ముగ్ధులయినారంటే, తాను స్వయంగా శిబిరాన్ని సందర్శించాలన్న అభిలాషను వ్యక్తం చేశారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి చాల కాలం కార్యదర్శిగా వుండి, అప్పుడు ఆర్. యస్. యస్. ప్రముఖ నాయకుడుగా వున్న శ్రీ అప్పాజీ జోషిని కమలనయన్ బజాజ్ కలిసి గాంధీజీని వ్యక్తిగతంగా శిబిరానికి ఆహ్వానించవలసిందిగా అభ్యర్థించారు. అప్పాజీ జోషి అలాగే ఆహ్వానించారు.

డిసెంబరు 24 ఉదయం ఆరుగంటలకు గాంధీజీ తన సహచరులు మీరా బహన్, మహాదేవ దేశాయి తదితరులతో పాటు వచ్చి శిబిరాన్ని సందర్శించారు.

యోగ వ్యాయామ ప్రదర్శన చూచిన తరువాత గాంధీజీ అప్పాజీ భుజం తట్టి "నాకు యిదంతా అద్భుతమైన ఆనందాన్ని కలిగిస్తున్నది. దేశంలో మరెక్కడా యిటువంటి దృశ్యాన్ని నేను చూడలేదు" అన్నారు.

భగవాధ్వజాన్ని అవరోహింపజేస్తున్న సమయంలో గాంధీజీ కూడ యితరులందరివలెనే సావధాన స్థితిలో నిలిచి ధ్వజప్రణామం చేశారు. ఒక సమయంలో ఆయన ఒక స్వయంసేవకుని కులం అడిగారు. వారిలో ఒకరు మహర్ అని, ఒకరు తెలి అని, మరొకరు మరాఠా వ్యక్తి కాగా వేరొకరు బ్రాహ్మణుడని తెలుసుకున్నారు. వివిధకులాలవారు కలిసిమెలిసి ఉంటూ, కలిసిమెలిసి ఆటలాడుకుంటూ, కలిసి భుజించేట్లు ఆర్.యస్.యస్.చేయగలగడంగాంధీజీకి విభ్రమం కలిగించింది.

ఆర్.యస్.యస్. భాండారులో రాముడు, కృష్ణుడు, శివాజీ, రాణాప్రతాప్ గురుగోవింద సింగ్ల చిత్ర పటాలను ఆయన చూశారు "మీరు రామకృష్ణుల చిత్రాలను మాత్రమే ప్రదర్శిస్తున్నారేమిటి ? శివుణ్ని, గణపతిని దేవతలుగా

మీరు భావించరా?" అని ఆయన ప్రశ్నించారు, తాము "మహాపురుషుల" చిత్రాలను మాత్రమే ప్రదర్శిస్తున్నామని, "దేవతల "చిత్రాలు కాదని స్వయం సేవకులు జవాబిచ్చారు.

గాంధీజీ తిరిగి వెళ్ళనున్న సమయంలో అప్పాజీ వచ్చి ఏమైనా పొర పొట్లు కనిపిస్తే తెలియజేయమని ప్రార్థించారు. అందుకు గాంధీజీ "పొరపాట్లు ఏమీలేవు అన్ని విధాలుగాను అద్భుతమైన కార్యక్రమాన్ని మీరు నిర్వహిస్తు న్నారు. పొరపాటు అంటూ ఏదంటైనా వుంటే ఇతర మతాల వారిని యీ సంస్థలో అనుమతించక పోవడం మాత్రమే" అన్నారు. అందుపై అప్పాజీ ప్రత్యుత్తరమిస్తూ, హిందూ సమాజంలోని బలహీనతలు, అనైక్యతే యీ దేశా నికి అనర్థదాయకంగా పరిణమించినవని కనుక ఆర్. యస్. యస్. కార్య క్రమం హిందూ సంఘటన మీదనే కేంద్రీకృతమై వున్నదని చెప్పి, ఇతర మతాల మీద తమకు ఎట్టి విద్వేషము లేదని వివరించారు.

అంతా విని గాంధీజీ "ఇతరులను ద్వేషించకుండా హిందువులను సంఘ టితం చేయడం జాతీయ ప్రయోజనాలకు విరుద్ధం కాదు. అయినా యీ సిద్ధాంతపు పూర్వరంగం గురించి మీ నాయకుడితో చర్చించడం నా అభిమతం" అని చెప్పారు.

డిసెంబరు **25** వ తేది రాత్రి గం. 8-30 లకు డా॥ హెడ్గెవార్, అప్పాజీజోషి, పూనాకు చెందిన ఎల్. బి. భోపట్కర్ గాంధీజీని కలుసు కున్నారు. పరామర్శలు అయిన తరువాత గాంధీజీ "శభాష్, డా॥ హెడ్గెవార్! భారతదేశంలో నేనొక్కడినే సంఘటనా కార్యం చేస్తున్నానని అనుకుంటుండే వాణ్ని. కాని మరో వ్యక్తికూడా ఒకరు యిదేపని చేస్తున్నారని తెలిసింది. ఆయనే డా॥ హెడ్గెవారు" అని ప్రశంసించారు.

"మీకు చక్కని వాద్యబృందం వుంది. సంగీతం వినడమంటే నాకు చాల యిష్టం. రాత్రి తొమ్మిదిగంటల తర్వాత మీ వాద్య ధ్వని వినవస్తుంది-నేను నిద్రించే సమయం అదే. అయినా ఆవరణలోకి వచ్చి నేను మీ మధుర వాద్య ధ్వని ఆలకిస్తాను" అనికూడా అన్నారు.

ఇతర వలంటీరు సంస్థలకు సకల సదుపాయాలు ఉచితంగా కలుగజేసినా ఎక్కడ క్రమశిక్షణ కానరాదని, కాని ఆర్. యస్. యస్. స్వయం సేవకులు తమ భోజనానికి, యూనిఫారానికి, ప్రయాణానికి ఖర్చులు తామే భరిస్తూ నిర్దుష్టమైన అనుశాసనాన్ని పాటించగలగడం ఎలా సాధ్యమవుతున్నదని గాంధీజీ ఆశ్చర్యం వెల్లడి చేశారు.

"జాతీయ సమైక్యతను, సౌశీల్యాన్ని, ధర్మం - సమాజం - సంస్కృతి రాష్ట్రం పట్ల ప్రేమాభిమానాలను పెంపొందించే భావాలను మేము ఆర్. యస్. యస్. ఉపన్యాసాలలో ఉద్బోధిస్తాం. వారికి చారిత్రక కథలు, రామాయణ మహాభారతాలలోని సన్నివేశాలను వివరిస్తాం. వీటివల్ల స్వయంసేవకుల హృదయాలలో ఉదాత్త భావనలు, తీవ్రమయిన ఆదర్శవాదము హత్తుకుంటాయి" అని డాక్టర్ జీ వివరించారు.

ఇతర సంస్థలు తమ వలంటీర్లను, జీతభత్యాలు లేని పని వారిగా భావిస్తాయని, కాని ఈ దేశంకోసం ఏదైనా చేయగలిగిన అగ్రశ్రేణి దేశభక్తులుగా తన స్వయంసేవకులను ఆర్. యస్. యస్. పరిగణిస్తుందని చెప్పారు.

"మీ కార్యం నిజంగా దేశానికి శ్రేయోదాయకం" అని గాంధీజీ ప్రశంసించారు. ఆర్. యస్. యస్. నిబంధనావళి ప్రతి ఒకటి తనకు కావాలని ఆయన అడిగారు. అవసరం కలుగనందున ఎట్టి నిబంధనావళి రూపొందించడం జరగలేదని ఆయనకు చెప్పగా, "నాకూ సరిగా యిలాంటి ఆలోచనే వుండె కాని అది ఆచరణ సాధ్యంగా కనిపించలేదు. నేను వ్రాయవలసింది నిజంగా ఎంతో వుంది. ఏదో ఒకనాడు మీకూ తప్పకపోవచ్చు. కాని సంస్థను నిర్వహించడంలో మీ ఉదాత్త ఆశయాలకు, మీరు నిర్మాణం చేసిన అద్భుతమైన అనుశాసనానికి, నాకెంతో ఆనందంగా వుంది. మీ కార్యం సఫలీకృతం కావాలని హృదయపూర్వకంగా అభిలషిస్తున్నాను" అని గాంధీజీ అన్నారు.

"మీవంటి మహనీయుల ఆశీస్సులే మాకు శక్తి సామర్థ్యాలను ప్రసాదిస్తాయి" అని డాక్టర్ జీ కృతజ్ఞత వ్యక్తం చేశారు.

చిల్లిగవ్వయినా నిధి లేకుండా కేవలం ప్రజల ఆదరాభిమానాల నిధితోనే ఆర్. యస్. యస్. గణనీయమైన ప్రగతి సాధించింది. పురోహితుడైన తన సోదరునితో పాటు, పేదరికంలోనే డా॥ హెడ్గెవార్ జీవించారు. వదిన గారికి నెలకు రు. 50 లు యిద్దామని ఒక దశలో వారి మిత్రులు నిశ్చయించారు, కొద్ది నెలలలోనే యీ సంగతి డాక్టర్‌జీకి తెలిసి సహాయాన్ని ఆపించారు. వారి జీవనోపాధికై కొంత భూమిని యిస్తానని రాజా లక్ష్మణరావుభోంస్లే పలుమార్లు అభ్యర్థించినా డాక్టరుజీ త్రోసి పుచ్చారు, ఈ దశలో కొందరు మిత్రులు కలిసి "ఆదర్శ ప్రజాస్వామిక భీమాసంస్థ"ను స్థాపించి దానికి ప్రధాన వైద్యాధికారిగా రు. 500 ల వార్షిక రుసుము మీద డా॥ హెడ్గెవార్‌ను నియమించారు,

సంఘ కార్యాన్ని చూచి పండిత మదన మోహన మాలవ్యా ఎంతో ముగ్ధులయినారు. నాగపూరులో ఆర్. యస్. యస్. కు ముఖ్య సంఘస్థానమైన మోహితేవాడ యొక్క శిధిలావస్థను చూచినపుడు సంఘానికి నిధులు లేవనే విషయం వారికి తెలిసింది. ఎమ్ ఎమ్ ఎమ్ అనే పొడి అక్షరాలున్న మాలవ్యా గారిని "మనీ మేకింగ్ మెషిన్" అనే పరిహాస నామంతో వ్యవహరిస్తుండేవారు. ఆర్. యస్. యస్. కోసం నిధులు సేకరించి పెడతామని ఆయన అన్నారు. కాని డా॥ హెడ్‌గెవార్ వినయంగా ఆ ప్రతిపాదనను తిరస్కరించారు. తనకు నిధులు అక్కరలేదని, వ్యక్తులు కావాలని చెప్పారు.

ఆ విధంగా దమ్మిడీ లేని పరిస్థితిలో జీవిస్తూకూడ, వచ్చిన వారందరికి ఎప్పుడూ టీ యిస్తుండేవారు డా॥ హెడ్‌గెవార్. ఒకమారు టీ చేద్దామంటే పొయ్యిలోకి కట్టెలు లేని పరిస్థితి ఏర్పడింది. వెంటనే హెడ్‌గెవారు యింటిలోని రెండు పాత కొయ్య పలకలను పగులగొట్టి, ఆ ముక్కలతో టీ కాచి యిచ్చారు.

స్వయంసేవకులు కూడ వారివలెనే పేదరికం అనుభవిస్తున్నవారే. ఆర్. యస్. యస్. పేరేడ్‌లు నిర్వహించేది. కాని వాద్యాల అనుస్వరం లేని పెరేడులో సొగసు ఏముంటుంది ? అయితే ఆ రోజులలో బ్యాండును సంపాదించడం మాటలు కాదుగదా ! అందువల్ల బాబాసాహెబ్ ఆప్టే, దాదారావు పరమార్థ, కృష్ణరావు మొహరీర్! నేటి సర్‌సంఘచాలక్ బాళాసాహెబ్ దేవరస్

ఒక గోపాష్టమినాడు నాలుగు మైళ్ళ దూరాన వున్న శ్రీమంత్ బూటీగారి ఇంటికి కాలి నడకన వెళ్ళి రావడానికి మూడు గంటలు పట్టింది. కనీసం ఒక బిగిల్ (శంఖవాద్యం) అయినా కొనేందుకు తగినంత సొమ్ము దక్షిణగా రాబట్ట డానికి! మొదటి సారిగా ఆ శంఖాన్ని నినదించినపుడు వారిలో కలిగిన ఆనందా నికి అవధి లేదు. సంఘ పురోగమన పథంలోని కార్యదీక్ష అలాంటిది!

సంఘ కీర్తి పంజాబ్ ప్రధానమంత్రి సర్ సికిందర్ హయత్ఖాన్ దాకా ప్రాకింది. 1938 లో రావల్పిండిలో రాయ్‌బహదూర్ సోహన్ సింగ్ గృహంలో ఆయన విడిదిచేసి తనను కలువ వలసిందిగా కొందరు స్వయంసేవ కులకు కబురు పెట్టారు. ప్రస్తుతం 'డిఫెన్సు న్యూస్ సర్వీసు' లో వున్న శ్రీ కృష్ణకుమార్‌తో సహా ఆ స్వయంసేవకులు రాగానే, వారితో సర్ సికిం దర్ మాట్లాడుతూ "భారతదేశంలో ఒక మహా శక్తిగా ఆర్. యస్. యస్. కు ఒక నాటికి పరిగణన లభిస్తుంది. యువకులారా! మీకు నా ఆశీస్సులు ఎప్పుడూ వుంటాయి" అని చెప్పారు.

ఇంతటి వికాసంలో సంస్థాపకుని వ్యక్తిత్వమే కీలక పాత్ర వహించింది. డా॥ హెడ్గెవారుకు చక్కని విజ్ఞానమే కాక చక్కని సామరస్య స్వభావం వుండేది. రాజకీయ నిందాప్రచారాల ఎత్తుగడలు మాత్రం వారికి ఇష్టముండేది కాదు. మొదటి రౌండు టేబిలు సమావేశానికి హాజరవాలన్న డా॥ మూంజే నిర్ణ యాన్ని గాంధేయులు ప్రతిఘటించినపుడు ఒక వ్యక్తి తన నమ్మకాల ప్రకారం నడుచుకుంటే పోయేదేమిటని డా॥ హెడ్గెవార్ ఆశ్చర్యం వెల్లడించారు. కొందరు గాంధీ, సావర్కారుల గుణగణాలను బేరీజు వేస్తూ వివాదంలోకి దిగినపుడు గులాబీకి, పూబంతికి మధ్య వివాదం అనవసరం" అంటూ వాదోపవాదాలను త్రుంచి వేశారు.

1936 ఫైజ్‌పూరు కాంగ్రెసు మహాసభలలో పండిట్ నెహ్రూ జెండాను ఎగురవేస్తుండగా కప్పీవద్ద అది చిక్కుపడింది. అక్కడ వున్నవారంతా ఏమీ తోచని స్థితిలో పడిపోయారు. చివరకు షిర్పూరు గ్రామానికి చెందిన కిషన్ సింగ్ రాజపుట్ అనే యువకుడు ఆ ఎనభయి అడుగుల జెండా స్తంభం కొన

పరకు చరచరా ప్రాకి త్రాడు సరిచేసి తిరిగి కప్పీ మీద సరిగా వుండేట్లు అ... ల్చాడు. వేలాదిమంది సెహబాష్ అంటూ హర్షధ్వానాలతో అతనిని అభినంది... చారు. బహిరంగ సమావేశంలో అతనిని సన్మానించాలని కూడా వారు నిర్ణయి... చారు. తీరా అతనొక ఆర్. యస్. యస్. కార్యకర్త అని తెలిసిన తరువా... ఆ విషయంలో ఏమీ జరగనట్లు వుండిపోయారు.

ఈ రకమైన నీచ ప్రవృత్తి డా॥ హెడ్గెవార్జీకు అర్థమయ్యేది కాదు తరువాత గ్వాలియాలోని దేవపురశాఖలో కిషన్ సింగ్‌ను అభినందించి, అతడు ఫైర్‌పూరులో చేసిన సాహసానికిగాను వెండి కప్పును బహూకరించారు.

ఒకమారు నాగపూరులో ఉద్రిక్తత నెలకొని వున్న సమయంలో డా॥ హెడ్గెవార్‌కు ఎవరో సలహా యిచ్చారు—ముస్లింలను సవాలు చేయడానికి ప్రతి శుక్రవారంనాడు ముఖ్యమైన మసీదుల ముందుగా ఆర్. యస్. యస్. పథ సంచలనం (రూట్ మార్చ్) నిర్వహించాలని. కాని డాక్టరుజీ ఆ సూచనను నిరాకరించారు శుక్రవారాలను, మసీదులను ప్రతిఘటించే ప్రతి క్రియవాదులం కాదు మనం" అన్నారు. సంఘం క్రియాశీలకమైన దేశభక్తి సంస్థ అని, ఇది సహజమైన ప్రవృత్తిలో, సాధారణ రీతిలో వ్యవహరిస్తుందని చెప్పారు.

1937 లో నాగపూరులోని అంబాజరీ ప్రాంతంలో వున్న ఒక స్థలంలో ఆర్. యస్. యస్. హేమంత శిబిరం జరిగింది. ఆ స్థలం ప్రక్కనే దిలావర్ ఖాన్ అనే వ్యక్తికి చెందిన కమలాల తోట ఒకటి వుంది. ప్రత్యేక అనుమతి మీద స్నానం కోసం స్వయంసేవకులు ఆ తోటకు వెళ్తుండేవారు. దిలావర్ ఖాన్ అనుమతి అయితే యిచ్చాడు కాని, శిబిరం ముగిసే సమయానికి తన తోటలో ఒక్క పండయినా మిగలదని లోపల భయపడుతున్నాడు. అయితే శిబిరంలో పాల్గొంటున్న రెండువేలమంది రోజూ ఆ తోటలో స్నానం చేసినా, మూడు రోజుల శిబిరం ముగిసే సమయానికి ఒక్కగానొక్క పండయినా ఎవరూ ముట్టుకోకపోవడం చూచి ఆశ్చర్య చకితుడైనాడు, అతడు డాక్టరుజీని కలిసి సంఘ కార్యకర్తల క్రమశిక్షణను ప్రశంసించి, బుట్టలనిండా కమలాఫలాలు తెచ్చి బహూకరించాడు.

డాక్టర్‌జీ ఒకసారి కొల్హాపూరు వచ్చారు. కొల్హాపూరు రాజవంశీకుల పాలనలోవుంది. డాక్టర్‌జీ పాల్గొనే సభకు అధ్యక్షత వహించవలసిన పెద్దమనిషి మహారాజా వారికి ఆగ్రహం కలుగుతుందేమోనని, సభకు హాజరుకాలేదు. ఆయన భయానికి కారణమేమంటే [జె. ఏ. కర్రన్ (జూనియర్) మాటలలో] "రాజ వంశీకులు చాలా ముందే ఆర్.యస్.యస్. అంటే కేవలం మరొక జాతీయ వాదుల ముఠాగా భావిస్తుండేవారు." వారికి ఆందోళన కలగకుండా ఉండటానికే ఆర్.యస్. యస్. కొల్హాపూరులో "రాజరామ్ యస్.యస్." అని, గ్వాలియర్‌లో రాణోజీ యస్ యస్. అని వ్యవహరించబడుతుండేది. అధ్యక్షులవారు రాకపోవడంతో డాక్టర్‌జీ వేరే ఆర్భాటం లేకుండా శివాజీ చిత్రాన్ని అధ్యక్షపీఠంమీదవుంచి "శివాజీ మహారాజే నేడు మనకు అధ్యక్షత వహించగా, మనకు కావలసిందేముంది!" అంటూ ఉపక్రమించి తన ప్రసంగాన్ని యథావిధిగా కొనసాగించారు.

అట్టి మహనీయ సంఘటనా ధురంధరుడు సరిగా వాకిలి పక్క భోజనం చేస్తుండేవారు. వచ్చే పోయే పరిచయస్తులకు "నమస్తే" చెప్పి వారితో వార్తలు విశేషాలు సంభాషించడానికి అనువుగా వుంటుందని! బారిస్టర్ల దగ్గరనుంచి, రిక్షాలాగేవారివరకు అందరూ వారిని ఎరిగినవారేనని, ప్రేమాభిమానాలతో పలకరించేవారని అంటే విచిత్రమేముంది?

అప్పటికి ఆర్. యస్. యస్. ప్రారంభమై రెండు సంవత్సరాలే అయింది. కేశవరావు చాందా సందర్శించడానికి వచ్చారు. ఒక మధ్య తరగతి కుటుంబం వారికి "పోహే" (వంటకం) పెట్టి, టీ యిచ్చారు. ఆయన "పోహే" మాత్రమే ఆరగించి టీ మాత్రం ముట్టుకోకుండా వదిలేశారు. అప్పట్లో వారికి టీ త్రాగే అలవాటు లేదు. టీకి బదులుగా యివ్వడానికి పాలు లేకపోవడంతో ఆ కుటుంబం వారికి ఏమీ 'పాలు పోలేదు'.

తరువాత డాక్టర్‌జీ తన పొరపాటు తెలుసుకొని, దాని వల్ల ఆ కుటుంబం వారికికలిగిన యిబ్బంది గ్రహించారు. అదేసాయంకాలం మళ్లీ వారి యింటికి వెళ్లి టీ అడిగి యిప్పించుకొని త్రాగారు. ఆ తరువాత-తనకు ప్రత్యేకంగా అభిరుచి లేక

పోయినప్పటికీ తాను టీ త్రాగటం, ఇతరులకు యివ్వడం ప్రారంభించారు. అంద రితో ఒకరుగా మెలగాలంటే ఆ విధమైన వ్యవహారం అవసరమని గుర్తించారు.

ఉత్తేజకరమైన ప్రసంగంచేసి తదుపరి, సంఘకార్యకర్తలతో సరదాగా దిండ్ల యుద్ధం చేసేవారు. దూదిదిండ్లు అంత గట్టిగా వుండవు కనుక గరీబులతో ఒకరకం పప్పుగింజలనింపి ఉపయోగించేవారు. ప్రతి కార్యకర్తకు నవ్వుతెప్పించే ఒక తమాషా పేరు పెడుతుండేవారు. పిల్లలతో ఏమి సాధిస్తారని కొందరు పెద్ద మనుషులు అధిక్షేపించినపుడు డా॥ మూంజేగారి హాస్య కవితను వినిపిస్తుండేవారు.

జహాఁబాలోంకా సంఘ, వహాఁబాజే మృదంగ ;
జహాఁబూడోంకా సంఘ, వహాఁఖర్చే సే తంగ .

(పిల్లలు కలిసిన చోట ఆనందపు కేరింతలు ;
వృద్ధులు చేరిన చోట ఖర్చులు యింతింతలు).

వ్యాపకశీలియైన డాక్టర్‌జీ హాస్యం స్వయంసేవకులకే పరిమితంకాలేదు. కార్మిక నాయకుడు ఆర్. యస్. రూయికర్ అంటే వారికి ప్రత్యేక అభిమానం వుండేది. మిత్రులకు టీ పార్టీయిచ్చిన తరువాత ఆయన అనేవారు "టీ పార్టీ అయిపోయింది 'శ్రామిక' నాయకుడు రూయికర్ మాత్రం యిక్కడే వుంటారు. పాత్రలు శుభ్రం చేయడానికి".

మరొక సందర్భంలో బ్రిటిషు పార్లమెంటులోని భారతీయ సభ్యుడైన సక్లత్‌వాలా గౌరవార్థం ఏర్పాటయిన విందుకు ఐదు రూపాయల టికెట్టు కొనమని రూయికర్ అడిగాడు. అప్పుడు డాక్టర్‌జీ "మహాశయా! తమరు ధనవంతులయిన కార్మికులు. నేను నిరుపేద నయిన పెట్టుబడిదారును" అంటు తాను టికెట్టు కొనలేనని చెప్పారు.

ఒకనాడు ఉదయం డా॥ హెడ్గేవార్ రూయికర్ యింటికి వెళ్ళారు. ఉభయ కుశలోపరిఅయిన పిమ్మట "మీరు నిజాయితీతో సమాధానమిస్తానంటే నేను ఒక ప్రశ్న అడగదలుచుకున్నాను" అని హెడ్గేవార్ అన్నారు రూయికర్

ఒప్పుకోనగా హెడ్గేవార్ ఇలాఅడిగారు. "గతరాత్రి ఛత్రపతి శివాజీ పునర్జన్మిం-చాడని, దేశమంతా అతని పాలన క్రిందకి వచ్చిందని నేను తెలియజేస్తే మీరుఎలా అనుభూతి చెందుతారు" ?

"సందేహం దేనికి, ఆనందిస్తాను".—రూయికర్ జీ సమాధానం.

"నిజంగా ? ఆయన పాలనకు వ్యతిరేకంగా ఉద్యమం లేవదీయరా ?" డాక్టర్ జీ మళ్లీ ప్రశ్నించారు.

"ఏమిటి డాక్టర్ జీ మీరనేది ?" రూయికర్ అభ్యంతరం చెప్పాడు "నేను మతిలేని మనిషినా, లేక దుర్మార్గుడినా ? నేనెంత ఆనందిస్తానంటే తప్పకుండా మిఠాయిలు కూడా పంచిపెడతాను"

అప్పుడు డాక్టర్ జీ అన్నారు: "మీరు నిజాయితీతోనే చెప్పాలంటే, ఛత్రపతి శివాజీ రాజ్యాన్ని పోలిన ప్రభుత్వాన్ని భారత దేశంలో పునరుద్ధరించ డానికి పనిచేస్తున్నందుకు మమ్మలను రాత్రింబవళ్లు అదే పనిగా ఎందుకు నిందిస్తారు ?"

రూయికర్ ఏమీ సమాధానం యివ్వలేకపోయాడు. అంతలో టీ రావడంతో చిరాకు పరిస్థితి నుంచి ఇద్దరూ తేరుకోగలిగారు.

"మరణించడం ఎలాగో నాకు నేర్పండి" అనే శీర్షికతో వున్న ఛాయా చిత్రం ఒకటి ఒకసారి డాక్టర్ జీ దృష్టిలో పడింది. వెంటనే వారు దానిని "జీవించడం ఎలాగో నాకు నేర్పండి" అని మార్చారు. సాహసంతో మరణించడం కంటే సాహసోపేతంగా జీవించడం ఎన్నోరెట్లు గొప్పదిగా వారు భావించేవారు.

ఎంతో ఉత్సాహంతో రామాయణ, మహాభారతాలు చదువుతూ కూడ, అనేకులు వాటిలోని గుణపాఠాలు వంటబట్టించుకొనక పోవడం వారికి ఆశ్చర్యం కలిగించేది. అటువంటి వారికి రామకృష్ణాదులను మహాపురుషులుగా పరిగణించి

వారి ఆదర్శాలను అలవరచుకోమని, కేవలం పూజకు మాత్రమే పనికివచ్చే దేవ తలుగా భావించవద్దని సలహా యిస్తుండేవారు.

రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభర నాటికే అన్ని ప్రాంతాలలోను ఆర్. యస్. యస్. శాఖలు నెలకొల్పబడినై. ఆర్. యస్. యస్. కార్యం వేగంగా పురోగమించాలని డాక్టర్ జీ ఆతృతతో వుండేవారు. సంఘం యొక్క స్వర్ణోత్సవాల వంటివి నిర్వహించడంలో తనకు ఆసక్తి లేదని వారు అంటుండే వారు. గ్రామాలలో నూటికొక్కరు, నగరాలలో నూటికి ముగ్గురు సంఘ స్వయం సేవకులు అయిన రోజున జాతీయ జీవనానికి ఆర్. యస్. యస్. ఒక క్రొత్త మలుపును ఇవ్వగలదని వారు ఎన్నోమార్లు అనేవారు.

1939 చివరి రోజులలో వార్ధాజిల్లాలోని సింధీలో ఆర్. యస్. యస్. పదిరోజుల సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది. ఆ సమయంలోనే సంస్కృ తంలో క్రొత్త ప్రార్థనను రూపొందించారు. అప్పటి వరకు యింగ్లీషులో వున్న కొన్ని డ్రిల్లు ఆజ్ఞలకు బదులుగా సంస్కృతంలోని సమాన పదాలను తయారు చేశారు. దేశమంతటా పలుమూలలకు సంఘ కార్యాన్ని విస్తరింప జేయడానికి పథకాలను కూడా రూపొందించారు.

నిర్విరామంగా పరిశ్రమిస్తూ, నిరంతరం మూడవ తరగతిలో ప్రయా ణిస్తూ, సంఘ కార్యంలో నిద్రాహారాలు సైతం లక్ష్యం చేయనందున 1934 నుంచి వారి ఆరోగ్యం క్షీణించ సాగింది. తాను యిక ఎక్కువకాలం జీవించనని వారికి తెలిసింది. కనుక ప్రధాన కార్యదర్శిగా వున్న శ్రీ గోళ్వాల్కర్‌ను తన తరువాత సర్ సంఘచాలక్‌గా నిర్ణయించ వలసిందిగా ఆర్. యస్. యస్. కేంద్రకార్యకారీమండలికి సూచించారు. ఈ నిర్ణయాన్ని ప్రతి ఒక్కరు హర్షించారు.

ఆ తరువాత వారి ఆరోగ్యం మరింతగా క్షీణిస్తూనే వచ్చింది. డబుల్ న్యుమోనియాతో పాటు విపరీతమైన వీపునొప్పి మొదలయింది. శరీరంలో సగ భాగం వెచ్చగా, మిగతా సగం చల్లగా వుంటుండేది. గంధక జలాశయాలలో

స్నానం చేయడానికి బీహారులోని రాజగిర్ కు వెళ్ళవచ్చినా ఫలితం లేక పోయింది.

వారి అంతిమ దినాలలో చూడవచ్చిన ప్రముఖ వ్యక్తులలో సుభాష్‌చంద్ర బోస్, డా॥ శ్యామప్రసాద్ ముఖర్జీ వున్నారు. డా॥ ముఖర్జీ 1940 మే 20 న వచ్చారు. వారిని ఆలింగనం చేసుకోవడానికి డా॥ హెడ్గెవార్ లేవగా "మీరు విపరీతమైన జ్వరంతో వున్నారని విన్నానే!" అన్నారు ముఖర్జీ. హెడ్గెవార్ నవ్వేసి "మీవంటి గొప్ప డాక్టరును చూస్తూనే నా జ్వరం పారిపోయింది" అన్నారు. అప్పుడు వారి ఉష్ణోగ్రత 103° ఉన్నది.

పూర్వ బెంగాల్ లోని హిందువుల దుస్థితి గురించి డా॥ ముఖర్జీ వివరించి ఒక 'హిందూ రక్షాదళాన్ని' ఏర్పాటు చేయడానికి ఆర్. యస్. యస్. సహాయాన్ని కోరారు. ఇద్దరు డాక్టర్ల కన్నులూ అశ్రుపూరితాలయినై. డా॥ హెడ్గెవార్ సమాధానమిస్తూ ఉవ్వెత్తున ఎగిసిపడే హింసా తరంగాలలో 'రక్షాదళాలు' కొట్టుకొని పోతాయని ఆర్. యస్. యస్. వంటి దూరదృష్టి గల సంస్థ మాత్రమే సంక్షోభాన్ని తట్టుకొని నిలిచి ప్రజలకు సేవచేయ గలుగుతుందని అన్నారు. డా॥ ముఖర్జీ ఆర్. యస్. యస్. రాజకీయాలలో ప్రవేశించాలని సూచించగా, రాజకీయాలకన్నా సమాజ సంఘటన ఎంతో ముఖ్యమని డా॥ హెడ్గెవార్ అన్నారు.

సుభాష్‌బోస్, హెడ్గెవార్‌ల తొలి సమావేశం 1928 లో కలకత్తా కాంగ్రెసు మహాసభలో జరిగింది. అక్కడ రు. 65,000 ఖర్చుతో 3,000 మంది వలంటీర్లను నియోగించడం జరిగింది. వారి క్రమశిక్షణారాహిత్యం ఫలితంగా, సభాస్థలం నుంచి వారినే బయటికి నెట్టివేయవలసి వచ్చింది. నాగపూరులోను, ఆ పరిసర ప్రాంతాలలోను తాను నిర్మాణం చేస్తున్న జాతీయ స్వయంసేవక దళం ఎటువంటిదో డా॥ హెడ్గెవార్, సుభాష్‌బోస్‌కు వివరించారు. హెడ్గెవార్ ఉద్యమం పట్ల తన ఆసక్తిని బోస్ వెల్లడిస్తూ "అట్టి కార్యక్రమం ద్వారానే జాతీయ పునరుజ్జీవనం సాధ్యమవుతుందని" అన్నారు.

1938 లో కాంగ్రెసు అధ్యక్షుడుగా బోస్ నాగపూరు వచ్చారు. ఆ సందర్భంగా డా॥ హెడ్గెవార్‌ను చూడాలనుకున్నారు కాని ప్రాంత కాంగ్రెసు కమిటీ అందుకు నిరాకరించింది.

1939లో బోస్ తాను సాయుధ విప్లవానికై యోజన చేస్తున్నట్లు డా॥ సంజీవి, హుద్ధారులద్వారా హెడ్గెవార్ కు తెలియజేశారు. డబల్ న్యూమోనియా తరువాత దేవలీలో డా॥ హెడ్గెవార్ చికిత్స పొందుతూ వున్నందున ఆ సమయంలో బోస్‌ను కలవలేవపోయారు. కాని బోస్‌కు తిరుగు సందేశం పంపించారు - కనీసం యాభయిశాతమైనా విజయావకాశాలు కనిపించనిదే సాయుధ విప్లవానికి పూనుకోవద్దు అని.

పాత విప్లవకారులలో డా॥ హెడ్గెవార్ కు మిత్రుడైన త్రైలోక్యనాథ చక్రవర్తి 25 సంవత్సరాల తరువాత బోస్ తరఫున వచ్చి కలుసుకున్నాడు. ఆ సమావేశపు వివరాలు ఎవరికీ తెలియవు.

జూన్ 20 న మృత్యుశయ్యమీద వున్న హెడ్గెవారును చూడటానికి ఫార్వర్డు బ్లాక్ నాయకుడు రూయికర్‌తో కలిసి బోస్ వచ్చాడు. అంతకు ముందు రాత్రి వేదనాభరితంగా గడిపిన హెడ్గెవార్ అప్పుడే నిద్రలోకి వెళ్ళారు. వారిని నిద్రలేప వద్దని సుభాష్ చెప్పి, చేతులు జోడించి ప్రణామం చేసి తిరిగి వెళ్ళారు. కొద్ది నిమిషాల తరువాత డా॥ హెడ్గెవార్ నిద్ర మేలుకున్నారు. బోస్ వచ్చి వెళ్ళిన సంగతి వారితో చెప్పగానే లేచి కూర్చొని, అపార ప్రేమాదరాలు ముప్పిరిగొనగా "సుభాష్" అని పలుకుతూ ప్రణామం చేశారు.

మరునాడు వారి ఉష్ణోగ్రత 106° డిగ్రీలకు చేరుకుంది. లంబర్ పంచర్ ఆపరేషన్ చేశారు కాని లాభంలేక పోయింది. 1940 జూన్ 21 న ఉదయ గం॥ 9-27 లకు అంతిమశ్వాస విడిచారు.

వారి అంత్య సంస్కారాలకు అన్ని పార్టీలు, అన్ని వర్గాలకు చెందిన వ్యక్తులు వచ్చి పాల్గొన్నారు. అజాత శత్రువు వారు - శత్రువులే లేని మహాపురుషుడు - అట్టి వ్యక్తిని నేడు మృత్యువు కబళించింది.

చాలామంది ఆర్. యస్. యస్. ను "డా॥ హెడ్గెవార్ సంఘం" గా భావించారు. హెడ్గెవార్‌తో పాటే సంఘం మరణిస్తుందని వారు అనుకున్నారు. కాని పూర్తిచేయవలసిన మహాకార్యం మనకోసం ఎదురు చూస్తున్నది" అని ఆర్. యస్. యస్. యువ కార్యకర్తలు ఆ నాటి రాత్రే తమ తమ శాఖలలో ఓవరిస్తున్నారు.

ఆర్. యస్. యస్. కు శక్తివంతమైన సిద్ధాంతం వుంది. ప్రభావోపేతమైన విధానం వుంది. ఇవే, ఆ తరువాత సంవత్సరాలలో సంస్థయొక్క మహోన్నతికి కారణభూతమైనాయి.

పైకి సాధారణంగా కనిపించిన ఒక వ్యక్తి, అసాధారణమైన విజయాన్ని సాధించిన అద్భుత మిది.

శ్రీ గురూజీ

1940 శ్రీ గురూజీ సర్‌సంఘచాలక్‌గా బాధ్యత స్వీకరించారు అప్పటికి ఆర్. యస్. యస్. చిన్న మొక్కమాత్రమే. ఏడు సంవత్సరాల స్వల్ప వ్యవధిలో అది పెద్ద వటవృక్షమై దేశంలో మూలమూలలకు, అక్షరాలా అటక్ నుంచి కటక్ వరకు, కాశ్మీరం నుంచి కన్యాకుమారి వరకు శాఖోపశాఖలుగా విస్తరించింది. ఈ అభివృద్ధి మహాద్భుతం అనక తప్పదు: దేశంలోని శాసన సభలో తన ప్రతినిధులు లేకపోయినప్పటికీ, ప్రతి పాఠశాలలో, కళాశాలలో, ప్రతి కార్యాలయంలో, కార్మాగారాలలో-అన్నిటికిమించి ప్రజల హృదయాలలో-సంఘం చోటుసంపాదించుకున్నది. ఢిల్లీలో ఐ. సి. యస్. అధికారులు కూడా నిత్యమూ హాజరయినశాఖ ఒకటి ఏర్పడింది.

దేశవిభజన డిమాండుకు దేశంలో ప్రతిక్రియగా చెలరేగడం సంఘ అభివృద్ధికి కొంత వరకు దోహదం చేసిందనడంలో సందేహంలేదు. పాకిస్తాన్ నిర్మాణానికి ఒప్పుకొనకపోతే 'రక్తపుటేరులు' ప్రవహిస్తాయని 1945 లో ముస్లిం శాసన సభ్యులు బెదిరించారు. ముస్లింలు అధిక సంఖ్యాలుగావున్న ప్రతి ప్రాంతాన్ని, ముస్లిం రాజవంశీకులు పాలనలోవున్న ప్రతిప్రాంతాన్ని ముస్లిం రాజ్యంగా మార్చడానికి చౌధరి రహమత్ ఆలీ అంతకుముందే ఒక పథకం తయారుచేసిపెట్టాడు. ఇండియా పేరును 'దీనియా'గా మార్చడానికి కూడా అతడు ఒక ప్రతిపాదనచేశాడు. నిమ్నశ్రేణి జీవులమీద ఉన్నతశ్రేణి జీవులది పైచేయిగావుండటం స్వభావసిద్ధమని, కనుక మేకను సింహం ఆరగించినచందంగా హిందువులను అంతమొందించే హక్కు ముస్లింలకు వున్నదంటూ పంజాబ్ ముస్లిం విద్యార్థుల యూనియన్ ఒక వాదం లేవదీసింది. ముస్లింలీగ్ ప్రత్యక్షచర్య దినం నాడు (1946 ఆగస్టు 16) 'మాగుర్' అనే బెంగాలీ కరపత్రం చివర మతోద్రేకాన్ని రెచ్చగొడుతూ యిలా విజ్ఞప్తి చేయబడింది: "ముస్లింజాతి గర్వించదగిన బహిరంగపోరాటపు రోజువచ్చినది. స్వర్గమునకు పోదలచినవారు రండి. సామా

వ్యాధులు, మనశ్శాంతి కోరెడివారు, కష్టములందుండినవారు రండి. దొంగలు, చండాలు, గుణహీనులు, ప్రార్థనలు చేయనివారు అనేవారును రారండి. స్వర్గద్వారములు మీకై తెరువబడియున్నవి. మనము వేలాది మందిమి కలిసి ప్రవేశింతము, పాకిస్తానుకు జయము కలుగవలెనని, ముస్లింజాతికి జయముగుగాకయని, జీహాద్ ప్రకటించిన సైన్యమునకు జయముగుగాకయని ఎలుగెత్తిచాటుదము".

ఇదంతా హిందువుల మనస్సు మీద ప్రభావాన్ని చూపించింది. అయితే ఇన్నిన్ని హిందూ సంస్థలు వున్నప్పటికీ ఆ సమయంలో వృద్ధిచెందుతున్న హిందూ ఉద్యమం ఆర్. యస్. యస్. ఒక్కటే కావడం విశేషం. బెంగాలులో ముస్లిం సమస్య తీవ్రంగా వున్నప్పటికీ అక్కడమాత్రం ఆర్. యస్. యస్. అంతగా ఆదరణ పొందలేకపోవడం కూడా గమనించవలసిన విశేషమే. అందువల్ల ముస్లిం వేర్పాటువాదానికి ప్రతిక్రియగా మాత్రమేకాకుండా ప్రత్యేక కారణాలవల్లనే ఆర్. యస్. యస్. వృద్ధిచెందిందని స్పష్టంగా చెప్పవచ్చు.

'క్విట్ ఇండియా' ఉద్యమం వచ్చినపుడు ఎందరో ఎన్నో బాధలు అనుభవించారు. చాలమంది ఆర్. యస్. యస్. కార్యకర్తలు ఎప్పటిమాదిరిగానే తమ వ్యక్తిగత హోదాలో ఉద్యమంలోకి దూకారు. అష్టి- చిమూర్ ప్రాంతంలో కొందరు ఆర్. యస్. యస్. కార్యకర్తలు ఉత్సాహంగా ఉద్యమంలో పాల్గొని ప్రభుత్వవారు తీవ్రమైన కసితో అణచివేయడానికి విజృంభించేటప్పటికి, అక్కడ పోటీప్రభుత్వాన్ని ఏర్పరచేడంలో భాగస్వాములైనారు. ఢిల్లీ-ముజఫర్‌నగర్ రైల్వే లైనుమీద రెండునెలలపాటు రాకపోకలను ఆపివేయగలిగిన ఢిల్లీ యువకులలో అధిక సంఖ్యాకులు స్వయంసేవకులే. దక్షిణ మహారాష్ట్రకు చెందిన 'ప్రతి సర్కార్' వీరుడు నానా పాటిల్ కౌండ్ సంఘచాలక్, అయిన ప్రఖ్యాత సంస్కృత విద్వాంసుడు పండిత సాత్వలేకర్ యింటిలో వుంటుండేవాడు. సోషలిస్టు నాయకుడు సానే గురూజీ అజ్ఞాతంగా పూనా సంఘచాలక్ భావూసాహెబ్ దేశముఖ్‌గారి గృహంలో దాగివుండేవాడు. ఢిల్లీ చాందినీ చౌక్‌లోవున్న విక్టోరియా విగ్రహంమీది ఛత్రాన్ని శ్రీ చంద్రకాంత భరద్వాజ్ ధ్వంసం చేశారు. ఆయన నేడు ఢిల్లీ బౌద్ధిక్ ప్రముఖ్. జయప్రకాశ్ నారాయణ్, అరుణా అసఫాలీలకు ఢిల్లీలో లాలాహంస రాజ్‌గుప్తా ఆశ్రయమిచ్చారు.

ఇంత జరిగినా 1942 ఉద్యమం ఎక్కువకాలం నిలువక త్వరలోనే చల్లారిపోయింది. ఈ ఉద్యమ వైఫల్యాన్ని చూసిన ప్రజానీకం సంఘంవంటి శక్తివంతము, సంఘటితమైన సంస్థయొక్క అవశ్యకతను గుర్తించారు. అక్కడ నుంచి ఆర్. యస్. యస్. ప్రగతి వేగాన్ని పుంజుకుంది.

చరిత్రలో తమ పాత్ర గురించి హిందువుకు బాధాకరమైన అనుభూతి మిగిలింది. తన మహోన్నత ప్రాచీన వైభవము, అనైక్యమత్యం కారణంగా తన పతనము-యివన్నీ అతని స్మృతిలో వున్నాయి. కనుక ఆర్. యస్. యస్. ఉద్భవించి అన్ని కులాలను, తరగతులను, వర్గాలను, ప్రాంతాలను మహత్తర మైన జాతీయ హిందూ సంఘటనలో సమైక్యం చేయడానికి నడుంకట్టినపుడు, హిందూ మనస్తత్వం నుంచి చక్కని ప్రతిస్పందన వచ్చింది. ఉదాహరణకు సనాతనవాదులు ఆర్యసమాజవాదుల మధ్య అంతవరకు ఎడతెగకుండా నడిచిన వివాదాలు సంఘంయొక్క పునీత సమరస వాహినిలో చిటికలో సమసిపోయినై. స్వయంసేవకులు తాము తమ కుటుంబానికో, కులానికో మాత్రమే చెందినవారు కాక మొత్తం దేశానికి చెందినవారు అయినారు. ఒకే విధమైన వ్యాయామ విన్యాసాలుచేస్తూ, ఒకేవిధమైన బౌద్ధిక్‌లను వింటూ వున్నందున వారి ఆలోచనలు, అనుభూతులు కూడ ఒకేవిధంగా రూపుదాల్చినై. ఒక స్వయంసేవక్ మరొక స్వయంసేవకుని సాహచర్యం వున్నపుడు అతనిభాష ఒక్కొక్కపుడు వేరుగా వున్నప్పటికి తన సోదరునితోవున్న విధంగానే ఆత్మీయతను అనుభూతి పొందుతాడు. గురుదక్షిణ ఎక్కువగా సమర్పించగలగడానికై సినిమాఖర్చులు కూడా తగ్గించుకొని స్వయంసేవకులు పొదుపుచేస్తారు. వారిలో కొందరు తమ యింటి లోనే జరుగుతున్న వివాహాది శుభకార్యాలలో పాల్గొనకుండా ఉండటానికి సిద్ధపడతారు కాని, నిత్యశాఖకు వెళ్ళడంమాత్రం మానివేయరు. ఉత్సాహశీలురైన లక్షలాదిమంది యువకుల జీవితాలలో యిదొక విప్లవం అయింది. వారిని సంపూర్ణంగా మార్చివేసింది. అహింస, చరఖా అంటూ విధినిషేధాలు పెట్టే కాంగ్రెసు, స్వాతంత్ర్య సముపార్జనకు సరయిన సాధనం కాజాలదని భావించబడింది. వదులుకొనడానికి యిచ్చగించని బ్రిటిషువారి కబంధహస్తాలనుంచి శక్తివంతమైన తీవ్రవాదపు ప్రజోద్యమంద్వారా మాత్రమే భారత స్వాతంత్ర్యాన్ని చేజిక్కించుకొనడం సాధ్యపడుతుంది. ఈ పరిస్థితులలో అన్నింటికి సరయిన సమాధానంగా ఆర్. యస్. యస్. వారికి కనిపించింది.

ముస్లింల మొండి వైఖరిపట్ల కాంగ్రెసు అనుసరిస్తున్న అస్పష్ట విధానానికి అడ్డుకట్టు వేయడం ఆర్. యస్. యస్.కు మాత్రమే సాధ్యమవుతుంది. వర్తమాన పరిస్థితుల సవాలుకు సమాధానంగా లభించిన ప్రతిస్పందన యిది. ఆసేతుశీతాచలం ఆర్. యస్. యస్. ఒక జాతీయ శక్తి కేంద్రమయింది.

ఆర్. యస్. యస్. పిలుపు సామూహిక సమస్యలకు మాత్రమే పరిమితం కాలేదు. వ్యక్తులకు అది యిచ్చే స్ఫూర్తి మరింత శక్తివంతమైనది. సంఘంలోని విశుద్ధ నిష్కళంక వాతావరణం, ఎవరి వ్యక్తిత్వాల ననుసరించి వారి ఆత్మ వికాసానికి దోహదకారిగా కనిపించింది. కనుక కొందరు ఆరోగ్యాభివృద్ధికి ఆసనాలు అభ్యసించారు. కొందరు మాంసాహారం వర్జించారు, మరి కొందరు ధూమపానానికి స్వస్తి చెప్పారు. ఇంకొందరు సంస్కృతాధ్యయనం సాగించారు, ఇవన్నీ చేయవలసిందిగా ఎవరూ ఎవరినీ ఆదేశించలేదు, పవిత్రతను ప్రోత్సహించే వాతావరణంలో ఆత్మ వికాసానికై ఎవరికి వారు తమంతతాముగా చేసిన ప్రయత్నాలివి. చివరకు అందరూ సరికొత్త అనుభూతిని పొందారు. ఉత్తమ లక్ష్యశుద్ధిని సాధించారు.

వారం వారం జరిగే బౌద్ధిక్‌ల వల్ల స్వయంసేవకులు చరిత్ర, సంస్కృతి, సాహిత్యము, ధర్మం మొదలైన వాటిలో కొంత పరిజ్ఞానం సంపాదిస్తారు. ఎన్నో తెలియని విషయాలను తెలియజెప్పే స్పష్టమైన, శక్తివంతమైన సంపూర్ణమైన సిద్ధాంతబలం ఆర్. యస్. యస్. కు వున్నది. అన్ని రకాల ప్రశ్నలకు స్వయంసేవకుని వద్ద సమాధానాలు లభిస్తాయి. నిస్సంశయత అతని మనస్సులో నెలకొని వుంటుంది, "సంశయాత్మా వినశ్యతి" అని భగవద్గీత వచనం, ఆర్. యస్. యస్. లో సంశయాత్ములు కనిపించరు.

ఇట్టి జాతీయ, వ్యక్తిగత ప్రయోజనాల మాట అటుంచి ఆర్. యస్. యస్. యొక్క సామాజిక ప్రభావం చెప్పుకొన దగ్గది. సాధారణ వ్యక్తి తన దగ్గర బంధువులను, తోటి విద్యార్థులను, ఇరుగు పొరుగున వున్న కొద్దిమందిని మాత్రమే సన్నిహితులుగా భావిస్తాడు, కాని సంఘంలో తమకంటె పెద్దలను, చిన్నలను కూడా కలుసుకొనడం జరుగుతుంది. అనేక మైళ్ళ దూరంలో వుండే వాలురు సన్నిహితులవుతారు, జన్మరీత్యా, వృత్తిరీత్యా, ఎంతో దూరంలో వున్న

వ్యక్తులు దగ్గరికి వస్తారు సంఘంలోకి వారు వచ్చిన రోజునుంచే ఆ పట్టణం లోని ప్రతి సందులో ప్రతి వీధిలో వారికొక ఆప్తమిత్రుడు దర్శన మిస్తాడు. భారత దేశపు మూల మూలల్లో అలాంటి వ్యక్తులు కనిపిస్తారు. ఇదంతా వ్యక్తిలోను, సమాజంలోను ఏకాత్మతను, వికాసాన్ని కలిగించే ప్రభావాన్ని ప్రసరిస్తుంది.

"ఫేస్ టు ఫేస్" అనే తన ఆత్మ కథలో ప్రఖ్యాత భారతీయ ఇంగ్లీషు రచయిత వేద్ మెహతా యిలా వ్రాశారు. లాహోర్‌లో ఎమర్సన్‌లో వున్న ఏడు నెలల కాలం నేనెంతో ఆనందంగా వున్నాను. ఉదయం 7-20 లకు మొదలయి సాయంకాలం 5 గంటలకు యింటికి చేరుకునే దాకా తీరక లేకుండా వుండేవాణ్ని. ఆ తరువాత భారతదేశానికి రాజకీయ స్వాతంత్ర్యం సంపాదించడానికి కృత నిశ్చయమై వున్న హిందూ సంస్థ ఆర్. యస్. యస్. అనబడే రాష్ట్రీయ స్వయంసేవక సంఘానికి వెళ్ళేవాణ్ని. సర్ గంగారామ్ మెడికల్ హాస్పిటలులో విద్యార్థిగా వుండే సోహన్‌లాల్ అనే మిత్రుడు ప్రతిరోజు సాయంత్రం ఏడుగంటల వేళ నా కోసం వస్తుండేవాడు. ఇద్దరం కలిసి వారి ఇంటికి దాదాపు ఒక మైలు దూరానవున్న సమావేశ స్థలానికి నడచి వెళ్ళేవారం.

"రాత్రి తొమ్మిదింటి దాకా అక్కడే ఆట లాడుతూ, వ్యాయమం చేస్తూ, ముఖ్యంగా దేశభక్తిగీతాలు గానంచేస్తూ, ప్రార్థిస్తూ గడిపేవారం. అక్కడకు వచ్చేవారిలో దాదాపు అందరూ కాలేజీ విద్యార్థులే, 12 ఏళ్ళ వయసున్న నేనే అందరిలో చిన్నవాణ్ని, స్వాతంత్ర్యం వచ్చే రోజు త్వరితంగా దగ్గర పడుతూ వున్నందున ఎవరిని కదిలించినా ముఖ్యంగా విద్యార్థులు రాజకీయాల గురించే మాట్లాడుతుండేవారు. చివర గీతం ఆలాపించడం అయిన తరువాత అందరం నేల మీద గుండ్రంగా కూర్చొని వర్తమాన రాజకీయ పరిస్థితి గురించి చర్చించే వారం. కొందరు ఆశావాదులు వుండేవారు. మరి కొందరు నిరాశావాదులు వుండేవారు. స్వాతంత్ర్యం రాగానే భారతదేశం పశ్చిమ దేశాలతో సమానంగా వైభవ మార్గంలో పురోగమిస్తుందని కొందరు అనేవారు, మరి కొందరికి నిరాశ, నిస్పృహ తప్ప యింకేమీ కనిపించేది కాదు. ముస్లింలలో పెంపొందుతూ వున్న ప్రత్యేక జాతీయతా భావావేశం వల్ల మనం యింత కాలంగా పోరాడుతూ వచ్చిన స్వాతంత్ర్యానికి వినాశం కలిగి తీరుతుందని వారు చెప్తుండే వారు. ఎవ

ఓకి వారేగా వుంటున్న భారతీయులు పరిపాలనలో అసమర్థులుగా నిరూపించు కొనడం ఖాయమని, అందువల్ల బ్రిటిషువారు కాకపోతే మరేదైనా అగ్రరాజ్యం పెత్తనం తీసుకుంటుందని వారి అభిప్రాయం.

కొంత కాలం గడిచి, 1946 డిసెంబరు - 1947 జనవరి వచ్చే నాటికి వారు మాట్లాడే ధోరణిలో మార్పు వచ్చింది. భారతదేశాన్ని రక్తపాతం వైపు నడుపజూస్తున్న ఉన్మాదుల బారినుంచి రక్షించే ధీర పురుషులుగా తమను తాము పరిగణించుకొనడం మొదలు పెట్టారు.

మాకు కొంత సమయం యిస్తే రక్తపాతాన్ని అరికడతాం అంటుండే వారు. భారత విభజనకు ఒత్తిడి అధికమవుతున్న కొద్దీ, అన్ని విభేదాలు అవతల పెట్టి భారత భూమిని అఖండంగా నిలుపడమే తమ ఏకైక ధ్యేయంగా పెట్టుకు న్నారు - స్వయం సేవకులు. వారు విద్వేషానికీ, బెదిరింపులకు పాల్పడలేదు, ఈ పథకాలను అమలు చేయడానికి తయారీలేదు. కాని వారందరిలో తమ బాధ్యత గుర్తించి, కర్తవ్యాన్ని గురించి అవగాహన వుంది. సాహసించే స్వభావం ఉంది.

మహత్తరమైన అనుభవం అది. సంస్థ నిర్వహణ అంతా ప్రచారకులనబడే సుశిక్షితులైన ఆ జీవన కార్యకర్తల చేతిలో వుంది కనుక సరిపోయిందిగాని, లేకుంటే ఎంతగా ముస్లింల సవాలు ఉన్నా, ఎంతగా హిందువుల ప్రతిస్పందన వున్నా సంఘం ఏమీ సాధించివుండేదికాదు.

1930 లోనే డా॥ హెడ్గెవార్ దేశపునలుమూలలకు సుశిక్షితులైన కార్య కర్తలనుపంపి అక్కడ సంఘకార్యం ప్రారంభించవలసిన ఆవశ్యకత గుర్తించారు. డాక్టర్‌జీ దివంగతులు అయిననాటికే కొన్ని వందల మంది ప్రచారకులు వున్నారు. 1940 లలో వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. నేడు దాదాపుగా ఒక వేయి మంది వున్నారు.

కొంతకాలం స్వయంసేవక్ అయివుండి, సంఘకార్యాన్ని విస్తరింపజేయ డంలో కృషిచేస్తుఉండే ఒక యువచైతన్యమూర్తి - ప్రచారక్. అతడు ఇల్లు

వదిలి-ఒక్కొక్కపుడు జీవితంలో తిరిగి యింటిముఖం చూడక-ఏప్రాంతనికి, ఏపట్టణానికి తనను కేటాయిస్తే అక్కడకు వెళ్ళడం. సాధారణంగా ఆ క్రొత్త చోట కూడ తన చదువు కొనసాగించేవాడు-చదువును అర్థాంతరంగా వదిలి వేయడం యిష్టంలేకపోవడం కొంతవరకు కారణమైతే, ఆ ప్రాంతపు యువకులతో ప్రత్యక్ష సంబంధాలు పెంపొందించుకొనడానికి విద్యార్థి జీవితం తోడ్పడుతుందనేది మరొక కారణం.

ప్రచారక్ సాధారణంగా నవయువకుడే అయినప్పటికి, తన తెలివితేటలు, వ్యక్తిత్వం, కార్యతత్పరతలవల్ల, ఆ ప్రాంతపు ప్రముఖ పౌరులతో సమానమైన మన్నన పొందుతూ వారిలో ఒకడుగా వ్యవహరించగల్గుతాడు. నిజాయితీ, విశుద్ధ జీవనం, పరిశ్రమ, ప్రజాసేవలలో ఆతడు స్థానిక స్వయంసేవకులకు ఆదర్శ పురుషుడవుతాడు.

స్వవిషయానికి వస్తే ఒకరికంటే ఒకరు తక్కువ ఖర్చుతో జీవించడంలో చాలమంది ప్రచారకులు పోటీపడేవారు. నేటి అఖిల భారతీయ బౌద్ధిక ప్రముఖ్ శ్రీ బాపూరావ్ మోఘే లక్నోలో ట్యూషన్లు చెపుతూ నెలకు రు. 18 లు సంపాదిస్తుండేవారు. ఆ సంపాదనతో ఆయనేకాక నేటి అఖిలభారత సంయిక్త కార్యదర్శి భావూరావ్ దేవరస్‌కూడా కలిసి జీవనం సాగిస్తుండేవారు. తన పోషణవిషయంలో భావూరావ్ ఎంత తక్కువ ఖర్చుచేసేవారంటే, ఒక మారువారు నీరసంతో పడి పోయారుకూడ.

అరుదుగా తప్ప స్వవిషయాలు చెప్పని శ్రీ గురూజీ, అలాంటి సంఘటన ఒకటి ఒక సందర్భంలో వెల్లడించేరు: "నా జేబులో యిరవై రూపాయలతో నన్ను కలకత్తాకు పంపించారు. అందులో నుంచే రానుపోను ఖర్చులు భరించాలి. అయినా కొంతకాలం తరువాత నేను తిరిగి వచ్చేటపుడు అందులో మిగిలిన మూడుపైసలు నాగపూర్ కార్యాలయంలో యిచ్చివేశాను. కలకత్తాలో ఏ విధమైన వాహనంగాని ఉపయోగించే ఆలోచనే నాకు కలుగలేదు. రోజుకు ఇరవై ముప్పై మైళ్లు నడుస్తుండేవాణ్ని.

బాలాసాహెబ్ దేవరస్, ప్రొ॥ రాజేంద్రసింగ్ వంటి ఆర్. యస్. యస్. అగ్రనాయకులను మినహాయిస్తే, జాతీయజీవనంలో కొంత పేరుతెచ్చుకున్న

వాజ్‌పేయి, అద్వానీ, భండారీ, నానాజీ, జోషీ, ఠాక్రేలవంటి చాల కొద్దిమంది సంఘ ప్రచారకులు మాత్రమే ప్రజలకు తెలుసు. కాని ప్రచారకుల సంఖ్య అగణ్యం. సంఘాన్ని యిప్పుడున్న విధంగా తీర్చిదిద్దిన వ్యక్తులు వారే. వారి త్యాగ, సేవామయమైన జీవనమే ఒక వీరగాథ.

వారిలో డాక్టర్‌జీకి కుడి భుజంగా నిలిచిన అప్పాజీజోషి ఒకరు. మహర్షి విద్వాంసుడు, లక్షలాదిమంది స్వయంసేవకులకు పితృతుల్యుడయిన బాబాసాహెబా ఆప్టే ఒకరు. చిన్నప్పుడు తిలక్ ఒడిలో ఆడుకున్న భయ్యాజీ దాణీ బెనారస్ హిందూ విశ్వవిద్యాలయ శాఖను ప్రారంభించారు. ఆయన గొప్ప రాజకీయ వేత్తగా రాణించివుండేవారుకాని, సంఘానికే తన యావజ్జీవితాన్ని అంకితంచేయ నిశ్చయించారు. వారి కొద్దిపాటి వ్యవసాయ క్షేత్రంలో వారి కుటుంబం మనగలిగింది. అనేక సంవత్సరాలు సంఘ ప్రధాన కార్యదర్శిగా వున్నారు. మరొకరు దాదారావ్ పరమార్థ. నిప్పులుకురిపిస్తూ ప్రసంగించేవారు సంఘంలో ఎవరైనా వుంటే వారు దాదారావే. పంజాబ్, తమిళనాడు, అస్సాంలలో కార్యానికి పునాదులు వేసింది వారే.

ఏకనాథరానడేగారి ఏకాగ్రచిత్తం గురించి పరిహాసంగా చెప్పుకుంటుండే వారు: "కుతుబ్‌మినార్‌ను యింకేదయినా ప్రదేశానికి తరలించాలని ఎప్పుడయినా నిర్ణయం జరిగితే, ఆపని చేయగల వ్యక్తి అంటూ ఎవరయినావుంటే, ఆయన ఏకనాథ్‌జీయే." ప్రధాన కార్యదర్శి అవడానికి ముందు మహాకోసల, తూర్పు భారత్‌లలో ఆయన పనిచేశారు. కన్యాకుమారిలో భవ్యమైన వివేకానంద శిలా స్మారకాన్ని నెలకొల్పిన వివేకానంద కేంద్రానికి వారు ఆమరణాంతం-అధ్యక్షులు.

సాంప్రదాయిక గీతాలను గానంచేయగలవారు యాదవరావుజోషి. దక్షిణాన సంఘకార్యం విస్తరింపజేయడానికే తన జీవితాన్నంతటిని సమర్పించారు. వారి పర్యవేక్షణలో కర్ణాటక, ఆంధ్ర, కేరళలు చక్కని ఆర్. యస్. యస్. శాఖలుగా వృద్ధిగాంచినై.

నేటి సంయుక్త ప్రధాన కార్యదర్శి మోరోపంత్ పింగళే పశ్చిమ భారతాన ఆర్. యస్. యస్. ను నేటి స్థితిలో రూపు మలిచారు. భారతదేశ చరిత్రను

సక్రమమైన రీతిలో ప్రవాసే మహత్తర కార్యాన్ని నిర్వహించడంలోకూడా నేడు ఆయన నిమగ్నులైవున్నారు.

సాంప్రదాయక మార్వాడీ బ్రాహ్మణులైన బచ్‌రాజ్ వ్యాస్ రాజస్థాన్‌లో ఆర్. యస్. యస్.కు సుస్థిరము, సుదృఢము అయిన పునాది వేయడానికి కుటుంబాన్ని, నాగపూరులో న్యాయవాద వృత్తిని వదలివేసి వెళ్ళారు.

భావూసాహెబ్ భుస్కుటే ఇండోరులోని జమీందారీ కుటుంబానికి చెందిన వారు. వారి భూముల విషయంలో ప్రభుత్వం అదేపనిగా పీడిస్తూవచ్చింది. కాని పరిణామాలకు వెరవకుండా, మధ్యప్రదేశ్, ఒరిస్సాలలో సంఘంకోసం పూర్తి సమయాన్ని వెచ్చించి ఆయన పనిచేశారు.

శ్రీ భగవత్, శ్రీ ఇనామ్‌దార్ గుజరాత్‌లో ఆర్. యస్. యస్. కార్యానికి ప్రారంభం జరిపారు. బీహారులో మధుకర్‌దేవ్ సంఘ నిర్మాణం చేశారు. మాధవరావ్ వచ్చేవరకు పంజాబ్‌లో పాతోర్కర్ పనిచేశారు. సింధుప్రాంతంలో రాజపాల్ పూరి, ఒరిస్సాలో పాల్ధీకర్, తమిళనాడులో దక్షిణామూర్తి కార్య భారం నిర్వహించారు. హెచ్. వి. శేషాద్రి కర్ణాటకను ఆర్. యస్. యస్. కంచుకోటగా మలచగా, కర్ణాటకకు చెందిన కే. సుదర్శన్ నేడు తూర్పు భారతంలో సంస్థను శక్తివంతంగా రూపుదిద్దుతున్నారు. ఢిల్లీప్రాంతం బ్రహ్మదేవ్ ఆధ్వర్యంలో నడుస్తున్నది. సర్‌సంఘచాలక్‌కు కార్యదర్శిగా వైద్యునిగా వున్న డా॥ ఆబా థట్టేకూడ ఆ జీవన ప్రచారకులే: వేయిమందికిపైగా ప్రచారకులు వీరందరికి సహాయంగా నిలిచివున్నారు. ఈ వేలాది ప్రచారకుల కార్యదీక్షముందు ఎవరైనా నతమస్తకులవవలసినదే!

ప్రచారకులకు సహాయసహకారాలు అందిస్తూ వారికి మార్గదర్శనం చేసేవారు–సంఘచాలకులు. వివిధ ప్రాంతాల సంఘచాలకులలో అగ్రగణ్యులైన హంసరాజ్‌గుప్తా (ఢిల్లీ) బాబుదిలీప్‌చంద్ (పంజాబ్) నరేంద్రజీత్‌సింగ్ (ఉత్తర ప్రదేశ్) ఆర్. కె. రస్తోగి (రాజస్తాన్) కృష్ణవల్లభ నారాయణసింగ్ (బీహారు) సురేంద్రనాథశర్మ (అస్సాం), బాబాసాహెబ్ భిడే (మహారాష్ట్ర) బాబాసాహెబ్ ఘటాటే (నాగపూర్) డా॥ ప్రాణలాల్ దోషీ (గుజరాత్) పి. లింగయ్యచౌదరి

(ఆంధ్ర) కె. వి. గోపాలన్ (కేరళ) రంగస్వామి తేవర్ (తమిళనాడు) వీరంతా సంఘానికి మూల స్తంభాలు. శక్తి కేంద్రాలు.

ఈ ప్రచారకులను సంఘచాలకులను, మించి మురిపించే అద్భుత వ్యక్తిత్వం —శ్రీ గురుజీది.

మాధవ సదాశివ గోళ్వాల్కర్ 1906 ఫిబ్రవరి 18 న (శా.శ. 1827 మాఘకృష్ణ ఏకాదశినాడు) నాగపూర్‌లో జన్మించారు. వారి జనకులు తొలుత తంతి తపాలాశాఖలో గుమాస్తాగాను, తరువాత ఒక ప్రభుత్వ పాఠశాలలో అధ్యాపకుడుగాను పనిచేశారు. ఈ వృత్తిలో వారిని మధ్యప్రాంతం బీహారులోని హిందీప్రాంతాలకు ఎన్నోమార్లు బదిలీ చేశారు, ఈ అవకాశాలను వినియోగించుకొని బాలమాధవుడు ఎన్నో ప్రదేశాలు సందర్శించి ఎన్నెన్నో విషయాలు నేర్చుకున్నాడు. మాతృభాష మరాఠీఅయినప్పటికీ దానితో సమానంగా హిందీలో కూడ ప్రావీణ్యం సంపాదించారు.

గోళ్వాల్కర్ దంపతులకు కావడానికి తొమ్మిదిమంది సంతానం. కాని మాధవుడొక్కడే బ్రతికాడు. సహజంగానే అతనిని తల్లిదండ్రులు గారాబంగా చూచుకునేవారు. 1922 లో మెట్రిక్యులేషన్ పరీక్షలో కృతార్థుడయిన పిమ్మట యువకుడైన "మధు" నాగపూర్‌లో ప్రసిద్ధిచెందిన హిస్లాప్ కాలేజిలో చేరాడు. ఈ కళాశాల విదేశీ మిషనరీల నిర్వహణలో వుండేది. బైబిలును తప్పనిసరి పాఠ్యాంశంగా బోధించేవారు. ప్రిన్సిపాల్ గార్డినర్ ఒకరోజు ప్రసంగిస్తున్న సమయంలో అలవాటుగా బైబిలులోని వాక్యాన్ని ఉటంకిస్తూ, పొరపాటున ఒక సందర్భం బదులుగా వేరొకటి ఉదహరించాడు. మాధవ్ వెంటనే లేచి ప్రిన్సిపాల్ పేర్కొంటున్న సందర్భం సరైనదికాదని ధైర్యంగా చెప్పాడు. తన జ్ఞాపకశక్తితో బైబిలులోని సరయిన వాక్యాన్ని చెప్పాడు. అప్పటికప్పుడు క్లాస్‌రూంలోనే బైబిలు తెప్పించి పరిశీలించి చూడగా మాధవ్ చెప్పింది నిజమేనని తేలింది. యువకుడైన మాధవుని అద్భుత ధారణాశక్తికి ప్రిన్సిపాల్ గార్డినర్ అబ్బురపడ్డాడు. క్లాసుఅయిన తరువాత తన గదికి పిలిపించి మాధవుని అద్భుతమైన జ్ఞాపకశక్తిని, సునిశిత మేధాసంపత్తిని ఎంతగానో అభినందించాడు.

1924లో మాధవ్ బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో జంతుశాస్త్రంలో ఎమ్.ఎస్.సి. విద్యార్థిగా చేరాడు. అక్కడ వట్టి పాఠ్యపుస్తకాలతో తనవి చెందకో మనస్సును, వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకొనడంలో శ్రద్ధవహించాడు. విశ్వవిద్యాలయంలో వున్న రోజులలో వివిధమైన అంశాలమీద 2,000 పైగా గ్రంథాలను వారు చదివినట్లు తెలుస్తున్నది. అనంతర జీవితంలో ఏ విషయానికి సంబంధించిన ప్రసక్తివచ్చినా-విజ్ఞానం, కళ, సాహిత్యం, చరిత్ర, వేదాంతం, మనస్తత్వశాస్త్రం మొదలైనా ఏ అంశంమీద సంభాషణ నడిచినా- వారి విశేష ప్రజ్ఞ ప్రస్ఫుటమయేది. మనందరికీ ఏవిషయాలు తెలుసునో అవి వారికి మరింత బాగా తెలిసిన విషయాలు. ఏ చర్చజరిగినా దానిని ఉదాత్తమైన స్థాయికి కొనిపో గలిగేవారు. ఆ కాలంలో జరిగిన ఒకచిన్న సంఘటనను పరిశీలిస్తే వారి వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకొనగలుగుతాము.

వారు బి.యస్.సి. (చివరి సంవత్సరం) పరీక్షలకు హాజరుకావలసివుంది. పరీక్షకు ఇంక 25 రోజులే మాత్రమే మిగిలివున్నా అంతవరకు పాఠ్యపుస్తకాలు కొననైనాలేదు. తమ సాధారణ అధ్యయనంలో అంతగా వారు నిమగ్నులై వున్నారు. ఆ సంవత్సరం పరీక్ష మానివేయడానికి అనుమతికోరుతూ తండ్రిగారికి తంతి వార్త పంపించారు. తనకుమారుడు చదువు నిర్లక్ష్యం చేయటం తండ్రిఅయిన భావూజీకి నచ్చలేదు. అయన సమాధానమే పంపలేదు. తండ్రి భావాలను మాధవ్ రావ్ అర్థం చేసుకున్నారు. ఇక 20 రోజులే వున్నాయి. అప్పటికప్పుడు అన్ని పాఠ్యపుస్తకాలు కొన్నారు. అక్షరాల ఆ పుస్తకాలలో మునిగిపోయారు. ఆ ఇరవై రోజులో వారి గదిలోని దీపం ఆరలేదు. నిద్రాదేవి అటువైపు రాలేదు. వారి తపస్సు అలాంటిది. ఒకనాడు తేలు కుట్టింది. వారు పూర్తిచేయదలచిన చదువుకు ఏదీ అంతరాయంకాజాలదు. తేలు కుట్టిన చోట గాటుపెట్టి విషపూరిత మైన రక్తాన్ని బయటికి పోనిచ్చారు. తరువాత ఒక మట్టి పాత్రలో నీరుపోసి అందులో పొటాషియం పెర్మాంగనేట్ కలిపి ఆ నీటిలో పాదంముంచి వుంచారు. దిగ్భ్రాంతులై చూస్తున్న మిత్రులతో "తేలుకుట్టింది నా పాదాన్నే తప్ప బుర్రను కాదుగదా! కనుక నా చదువుకు అదేమీ అంతరాయం కలిగించవలసిన అవసరం లేదు" అన్నారు.

కొద్దికాలం మద్రాసులో మత్స్యశాఖ వారి అక్వేరియంలో వారు పని చేశారు. నైజాంను సైతం టికెట్ లేదని ఆపివేశారు. 1930 లో బెనారస్ హిందు విశ్వవిద్యాలయంలో అధ్యాపకులుగా చేరారు. ఇక్కడ వారి నిరాడం బరతను, అపార మేధా సంపత్తికి ప్రభావితులైన జూఆలజీ విద్యార్థులు వారిని గౌరవాభిమానాలతో గురూజీ అని పిలవడం మొదలు పెట్టారు. ఆ పేరే వారికి జీవితాంతం నిలిచిపోయింది. హిందూ యువకుల నాడి కేంద్రమన దగిన ఈ విశ్వవిద్యాలయంలో ఆర్. యస్. యస్. కార్యాన్ని ప్రారంభించడానికి నాగపూర్ నుంచి ప్రత్యేకంగా పంపబడిన భయ్యాజీ దాణీ యిక్కడనే 1931 లో గురూజీకి సంఘ పరిచయం చేశారు.

మూడేండ్లు హిందూ విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడిగా గడిపిన తరువాత నాగపూర్ తిరిగి వచ్చి తల్లిదండ్రుల ప్రోద్బలం మీద న్యాయశాస్త్రం చదివారు. స్వగ్రామమైన రామ్‌టేక్ వెళ్ళి వచ్చేటప్పుడల్లా బస్సు ప్రయాణాల్లో చదివి హిందూ న్యాయశాస్త్రం పూర్తి చేశారు. ముస్లిం న్యాయశాస్త్రంలో నేటి ఉపరాష్ట్రపతి హిదాయతుల్లా వారికి అధ్యాపకులు. ముస్లిం న్యాయశాస్త్రం ప్రకారం ఒక స్త్రీ విడాకులు తీసుకుంటే, తనకు తరువాత కలిగే సంతానపు పితృత్వం విషయంలో అనుమానానికి తావు రాకుండా వుండటానికి గాను రెండేండ్లు గడిచిన తరువాత మాత్రమే పునర్వివాహం చేసుకొనవచ్చును. శిశువు గర్భస్థమై వుండేకాలం సుమారుగా 270 రోజులని నేటి కాలంలో స్పష్టంగా తెలుసును కనుక, స్త్రీ పునర్వివాహానికి నిర్దేశించిన గడువు తగ్గించ వచ్చును గదా అని వైజ్ఞానిక దృష్టి గల శ్రీ గురూజీ ప్రశ్నించారు. శ్రీ హిదాయతుల్లా ఏ సమాధానమూ ఇవ్వలేదు.

ఎల్. ఎల్. బి. అయిన తరువాత కొంతకాలం న్యాయవాద వృత్తి చేశారు. ఇక వివాహం చేసుకోమని తల్లిదండ్రులు ఒత్తిడి చేశారు. ఆ సమస్యే లేదన్నట్లు వారు చిరునవ్వుతో కొట్టి పారేశారు. ఈ సమయంలో శ్రీ గురూజీని డా॥ హెడ్గెవార్ ఎంతో ఆశాభావంతో గమనిస్తూ వచ్చారు. కాని గురూజీ 1936లో ఆకస్మికంగా ఇల్లు విడిచిపెట్టి ఆశ్రమవాసులైనారు. రామకృష్ణ పరమహంస ప్రత్యక్ష శిష్యులు పదకొండుమందిలో ఒకరైన స్వామి అఖండా

సందంచే స్థాపించబడి, వారి ఆధ్వర్యంలోనే నడుస్తున్న సారగాఛి ఆశ్రమానికి చేరుకున్నారు.

స్వామి అఖండానంద శ్రీ గురూజీకి ఆశ్రమ జీవనంలో దీక్ష ఇచ్చారు. "యోగ" నియమాలన్నింటికి గురూజీ 'శుచ' తప్పకుండ పాటించారు. ఇక్కడే వారి గడ్డము, సుదీర్ఘ శిరోజాలు పెరిగినై. ఒక రోజు స్వామి అఖండానందులు తమ శిష్యుని తల నిమురుతూ "మాధవా ! నీ రూపుకు ఇదెంతో బాగుంది. ఈ శిరోజాలు ఎప్పుడూ అలాగే ఉండనీ" అని ప్రేమతో అన్నారు. గురూజీ తమ శిరోజాలను అలాగే వుంచి, గురువుగారి అభీష్టాన్ని నెరవేర్చారు.

1937 లో స్వామి అఖండానందులు ఆకస్మికంగా నిర్యాణం చెందారు. తదుపరి కొద్ది కాలానికి గురూజీ నాగపూర్ కు తిరిగి వచ్చారు. వారి తల్లిదండ్రుల ఆనందానికి అవధి లేదు. కాని డాక్టర్‌జీ అంతకంటె కూడ ఆనందించారు. వెను వెంటనే గురూజీ సంఘానికి సర్ కార్యవాహ (ప్రధాన కార్యదర్శి) గా నియమించారు. 1939 లో గురూజీ మూడురోజుల స్వల్ప వ్యవధిలో "మనము మన జాతీయత" **(We : Our Nationhood Defined)** అనే గ్రంథం రచించారు.

డా॥ హెడ్‌గేవార్ ఆరోగ్యం త్వరితంగా క్షీణించసాగింది. కాని యిక వారికి ఏ విచారమూ లేదు. కర్మయోగి అయిన మాధవుడు రానున్న విషమ సంవత్సరాలలో ఆర్. యస్. యస్. ను విజయవంతంగా ముందుకు నడిపించ గలడని వారు ప్రగాఢ విశ్వాసంతో వున్నారు.

తొమ్మిది సంవత్సరాల సుదీర్ఘ కాలంగా గురూజీని ఎంతో శ్రద్ధగా చూసుకుంటూ వచ్చారు డాక్టర్‌జీ. గురూజీ తమ ప్రతిభా విశేషాల అహంకారపు మాయలో పడకుండా క్రమంగా డాక్టర్‌జీ ప్రభావంలోనికి వచ్చారు. డాక్టర్ జీలో అంతగా ప్రభావితం జేసే పాండిత్యమేమీ కనిపించలేదని, కాని వారి సత్య సంధత, మొక్కవోని నిజాయితీ మనస్సును ఆకట్టుకునేవని అనేక సంవత్సరాల తరువాత గురూజీ చెప్పారు. "నేను నిర్మాణము చేయుటకై వచ్చితిని కాని వినాశనమునకు రాలేదు" అనే బైబిలు సూక్తి డాక్టర్‌జీకి అక్షరాలా వర్తిస్తుందని కూడా వారు అన్నారు.

సంఘ సిద్ధాంతం యొక్క శ్రేష్ఠత, సంఘ కార్య విధానం యొక్క ఆచరణ యోగ్యత ఎంత మహత్తరమైనవంటే ఆఖరికి ఒక రాతి ముక్కను సర్ సంఘచాలక్ గా ప్రతిష్టించినా సంఘ కార్యం నిర్విరోధంగా కొనసాగుతుం దని, ఈ పదవి విక్రమాదిత్యుని సింహాసనమని డాక్టర్‌జీ అంటూండేవారు. గురూజీ కూడ వ్యక్తి నిమిత్తమాత్రుడని నొక్కి చెపుతూ డాక్టర్‌జీ మాటలను ఉదహరిస్తుండేవారు. వారు చెప్పినట్లే జరిగింది, ఒక రాతిముక్కకు సర్ సంఘ చాలకత్వం వచ్చింది. కాని సంఘం పురోభివృద్ధి చెందుతూనే వుంది అనే వారు గురూజీ.

మహనీయులంతా యిట్టి వినయాన్నే ప్రదర్శిస్తుంటారు. కార్లయిల్ అన్నట్లు "ఏ మహాపురుషుని జీవితం వ్యర్థం కాదు. ప్రపంచ చరిత్ర అంటే మహాపురుషుల జీవిత చరిత్ర మాత్రమే. తాను జన్మించిన ప్రపంచపు రీతి నను సరించి ఆ మహాపురుషుడు కవిగా, ప్రవక్తగా. ప్రభువుగా, మతాచార్యుడుగా మరి యే విధంగానైనా రాణించ గలడు". శ్రీ గురూజీ విషయంలో ఇది అక్ష రాలా సత్యం. ఎక్కడయినా వారి ప్రతిభ వెలుగొంది తీరేది. ప్రజా జీవన రం గంలో వుంటూ జీవితాన్ని స్పష్టంగా, సమగ్రంగా దర్శించిన ద్రష్ట వారు. తమ విజ్ఞానంతో, మేధస్సుతో, అంతర్దృష్టితో హైందవ భారతానికి ఆంతరాత్మగా వినుతి కెక్కారు.

హిందువులను "ముస్లిమేతరుల" స్థాయికి దిగజార్చడం పట్ల శ్రీ గురూజీ ఆవేదన చెందారు - భారత్ కంటె పెద్దవైన అమెరికా, రష్యా, చైనాలకు లేని ఉపఖండం అనే విశేషణం భారతదేశానికి తగిలించడం దేనికని వారు ఆశ్చర్యం ప్రకటించారు. దేశ విభజనకు ప్రజలను మానసికంగా సన్నద్ధం చేయడానికే. దీనికి ఉపఖండం అని వ్యవహరించడం మొదలు పెట్టారని వారి నిశ్చితా భిప్రాయం.

భారతదేశాన్ని "నిర్మాణంలోవున్న జాతిగా'' అభివర్ణించడాన్ని వారు పరిహసించేవారు. ఈ సిద్ధాంతం ప్రతిపాదించినవారు "నిర్మాణంలోవున్న దేశ భక్తులు"గా కనిపిస్తున్నారని అనేవారు. వేదయుగంనుంచి భారతవర్షం "జాతిగా" వుంటూవచ్చిందని ఋజువు చేయడానికి వారు వేదంలోని అధ్యాయాన్ని శ్లోకాన్ని

ఉటంకించారు. ఆలయపు ఏనుగుకు V తిలకం దిద్దాలా, Y తిలకం దిద్దాలా అనే మత సంబంధమైన ఆచారాలకు సంబంధించిన వివాదాన్ని పరిష్కరించుకొనడం కోసం శైవులు, వైష్ణవులు వెళ్ళి,భారతదేశంగూర్చికాని హిందుమతం, గూర్చికాని ఏమాత్రం తెలియని బ్రిటిష్ ప్రివీకౌన్సిలుకు విన్నవించుకొనడం చూచి వారు ఆశ్చర్యం వ్యక్తంచేశారు.

భారతదేశం విభజింపబడినంతమాత్రాన అదొక సమస్య అవుతుందా అని "సింధ్ అబ్జర్వర్" పత్రిక సంపాదకుడు శ్రీ కె. పున్నయ్య ప్రశ్నించారు. గురూజీ సమాధానమిస్తూ "ఆ మాటకువస్తే ఒకమనిషి ముక్కు పోగొట్టుకొనడం కూడా సమస్య కాకపోవచ్చు" అన్నారు.

హిందువులందరూ ముస్లిములుగా మారితేమాత్రం పోయేదేముంది అని మరొకరు వ్యాఖ్యానించగా "హిందువులంతా మరణించినా పోయేదేమిలేదు. ఎందు కంటే భస్మరూపంలో వారు బ్రతికే వుంటారు. పదార్థం నాశనం కాదని ఆ పదార్థంకూడా ఒక విద్యుత్ చర్య మాత్రమేనని సైన్సు ఎలాగూ నిరూపించింది గదా ! అని గురూజీ జవాబు యిచ్చారు.

ఆర్.యస్.యస్.కు ఒక్కమాటలో నిర్వచనంచెప్పమని ఎవరో అడిగారు "హిందూత్వాన్ని ఓమ్ అనే ఒక్కమాటతో నిర్వచించవచ్చు. కాని దాని ప్రాము ఖ్యాన్ని అవగాహన చేసుకోవాలంటే ఎన్నో సంవత్సరాల అధ్యయనం అవసర మవుతుంది. అదే విధంగా అనునిత్యం శాఖకు హాజరవటం ద్వారా మాత్రమే ఆర్. యస్.యస్. ను అర్థం చేసుకొనగలుగుతాము" అని వారి సమాధానం. భారతదేశాన్ని అహింసానిలయంగా అభివర్ణించడం పరిహాసాస్పదమని వారు భావించారు. "మధ్యఆసియాలోకి మనంచొచ్చుకొని పోగలిగామంటే అది వట్టి కబుర్లతో ఉపన్యాసాలతో జరిగివుండదు. ప్రతి హిందూదైవం చేతిలోను ఏదో ఒక ఆయుధం వుండటం గమనించవలసిన విశేషం" భారతదేశానికి చెందిన రాజు పురుషోత్తముడిని (గ్రీకు చరిత్రకారులు పోరస్) అలెగ్జాండరు ఓడించాడనే వాదనను వారు పరిహసించారు. వాస్తవమేమంటే యుద్ధానంతరం పురుషోత్తముడు అంతకు ముందుకంటే ఎక్కువ ప్రాంతాన్ని ఏలుబడిలోకి తెచ్చుకున్నాడు-అలె గ్జాండరు తోక ముడిచి పరారుకావలసి వచ్చింది' అని చెప్పారు గురూజీ.

భారతదేశంయొక్క సరియైన చరిత్ర యింతవరకు వ్రాయబడలేదని వారు భావించారు. "మన జాతీయ చరిత్రను హిందూయుగం, ముస్లింయుగం, బ్రిటిషు యుగంగా విభజించడం పరిహాసాస్పదం. చరిత్రను పాలకుల పేర్లతో పిలవటం జరగదు. సరియైన చరిత్ర అంటే ప్రజల చరిత్ర. కనుక మన చరిత్ర మొత్తం హిందువుల చరిత్రయేతప్ప వేరుకాదు.

"మన చరిత్ర పుస్తకాలకు ఢిల్లీ కేంద్రంగా పరిభ్రమించే ధోరణి వుంది. కాని ఢిల్లీయే భారతదేశంకాదు. భారత చరిత్రలో అనేక సమయాలలో ఢిల్లీ రాజ్యంకంటె యితర రాజ్యాలు ఎంతో పెద్దవిగా వుండేవి. పాక్షిక వైఖరిగల చరిత్ర పుస్తకాల కారణంగా చోళులు, చేరులు, పాండ్యులు, హొయసాలులు, పులకేశనుల గురించి మన ప్రజలు ఏమి తెలియని స్థితిలో వున్నారు. భారత వర్షపు రాజాధిరాజులలో ఒకడై, ఆగ్నేయాసియాలో అత్యధికభాగాన్ని తన అధీనంలో వుంచుకొని పాలించిన ఉత్కళవీరుడు భారవేలుని విషయంలో కనీ సం పేరయినావిన్నవారు ఎందరున్నారు ? మొగలు దాడులను విజయవంతంగా త్రిప్పిగొట్టిన అస్సామీ ప్రతిఘటనోద్యమ శూరుడు లచిత్ బడ్‌ఫుకన్ గురించి తెలిసిన వారెందరు?" అని కూడా గురూజీ ప్రశ్నిస్తుండేవారు.

ఆర్. యస్. యస్. కార్యాన్ని శీఘ్రగతిన పూర్తిచేయడానికై ద్విగుణీ కృతోత్సాహంతో పరిశ్రమించవలసిందిగా కార్యకర్తలను ఉద్బోధిస్తూ అన్నారు. "ఒకసారి గోల్డ్‌స్మిత్ డా॥ జాన్సన్‌ను అడిగారుట. దాక్టరుగారూ చేపలతో ఒక గొలుసుచేస్తే దానితో యిక్కడనుంచి చంద్రమండలానికి చేరుకోవాలంటే ఎన్ని చేపలు అవసరమవుతాయండీ అని. డా॥ జాన్సన్ ఆలోచనలో పడ్డారుకాని గోల్డ్ స్మిత్ తనే సమాధానం చెప్పాడు, 'ఒక చేపచాలు- తగినంత పెద్దదయితేసరి' అని. అదేవిధంగా సంఘ కార్యం పూర్తి చేయడానికి ఒకే ఒక్క రోజు చాలు మనకు – అయితే మన శక్తి యొక్క అణువణువునూ అందుకు మనం వినియో గించ వలసి వుంటుంది.

ఇటువంటి పరిస్థితులలో, యిటువంటి నాయకత్వంలో, ఆర్. ఎస్. ఎస్. త్రివిక్రమునిలా వృద్ధి చెందింది. ఒక్కొక్క పట్టణానికి సంఘ ప్రచారక్ వచ్చే

వాడు - కాంగ్రెసు, హిందూమహాసభ, ఆర్యసమాజ్ యిత్యాది సంస్థలకు చెందిన స్థానిక నాయకులకు వ్రాయబడిన కొద్ది పరిచయ లేఖలతో వీటిలో ఏ సంస్థ భవనంలోనో, దేవాలయంలోనో, లేక ఎవరైనా శ్రేయోభిలాషి యింటి లోనో అతడు బస చేసేవాడు. సాధారణంగా అధ్యాపక వృత్తి చేపట్టేవాడు. వృత్తి రీత్యా ఎందరో విద్యార్థులతో, అధ్యాపకులతో ప్రత్యక్ష సంబంధ బాంధ వ్యాలు ఏర్పడేవి. స్థానికంగా ఏదయినా హిందూ వలంటీర్ సంస్థ వుంటే అది క్రొత్త ఆర్. యస్. యస్. శాఖలో విలీనమయేది. స్థానిక శ్రేయోభిలాషుల సహాయ సహకారాలతో, అతని కంటె పెద్దలయిన స్వయంసేవకుల మార్గదర్శ నంతో శాఖ త్వరితగతిన ఒక సామాజిక అయస్కాంతంగా వృద్ధిచెందేది. కులం, వర్గం, పంథా మొదలయిన విభేదాలకు అతీతంగా ఉత్సాహవంతులయిన యువకు లను, స్థానిక ప్రముఖ నాయకులను కూడ సమానంగా ఆకర్షించేది. త్వరలోనే పట్టణంలో కెల్లా శక్తివంతమైన సంస్థగా రూపొందేది. అనతి కాలంలో యితర పట్టణాలకు, గ్రామాలకు సయితం సంఘ సందేశాన్ని కొనిపోగల చైతన్యవంతు లైన యువజనులు శాఖలో నిర్మాణమయేవారు. ఒక దీపంతో మరో దీపాన్ని వెలిగించిన విధంగా వుండేది - యీ సరళి. ఈ పెరుగుదల చూచి గురూజీ 1947 లో యిలా అన్నారు. "ఒక్కొక్క శాఖలో ఒకే ఒక్క రోజు నేను గడుపుదామనుకున్నా దేశాన్నంతటినీ తిరిగి రావడానికి ఒక జీవితకాలమైనా సరిపోదు."

1947

ఆగస్టు 15, 1947. స్వాతంత్ర భానోదయమైంది. గాంధీజీలాగా ఆర్. యస్.యస్. కూడ దానిని ఉత్సాహంగా జరుపలేదు. స్వాతంత్ర్యమైతే వచ్చింది. కాని దేశం రక్తపుమడుగులో విభజించబడింది. అందువల్ల అదొక దుఃఖభాజనమైన రోజు. అయినప్పటికి ఆనాటి అనిశ్చిత పరిస్థితులతో భారత ప్రభుత్వానికి తన చేతనైన సాయమంతా చేసింది-ఆర్.యస్.యస్.

సెప్టెంబరు, 1964 తాత్కాలిక భారత ప్రభుత్వం అధికారం స్వీకరించింది. రాష్ట్రపతి భవన్‌కు కారులో వెళ్తున్న కాంగ్రెసు మంత్రులను వందలాదిగా ముస్లింగూండాలు తిట్టి అవమానించారు. వారిలో కొందరు నెహ్రూజీ కారులోకి సిగరెట్టు పీకలు విసిరేశారు. మరునాడు మంత్రులు తమతమ శాఖల బాధ్యతలు స్వీకరించేరోజు. ఆ రోజున ఎటువంటి దుర్ఘటనలు జరుగకుండా సాయం చేయవలసిందని ఢిల్లీప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ దేశబంధుగుప్త ఆర్.యస్.యస్. ఢిల్లీప్రాంత ప్రచారక్ శ్రీ వసంతరావుజీకి ఫోన్‌చేసి, అభ్యర్థించారు. (అప్పట్లో ఢిల్లీ ఆర్.యస్.యస్. కార్యాలయం కమలానగర్ ఆ-42 లో ఉండేది). అల్లరేదీ జరుగకుండా నివారించడానికై పెద్దసంఖ్యలో స్వయంసేవకులు సెక్రేటరియట్ భవన సముదాయంలో ఉండాలని వారు (శ్రీ గుప్త) సూచించారు. మరుసటిరోజు వేలాదిగా స్వయంసేవకులు అక్కడికి చేరుకున్నారు. అక్కడున్న ముస్లింలీగు అల్లరిమూకల సంఖ్యను వారి సంఖ్య మించిపోయింది. దానివల్ల జరుగరానిదేదీ ఆనాడు జరుగలేదు.

దేశవిభజన తర్వాత ఢిల్లీలో పెద్దఎత్తున హింసాకాండ ప్రజ్వరిల్లింది. ఆ సందర్భంగా హింసాత్మక శక్తులను బహిర్గతం చెయటంలోను, హింసను అదుపుచేయటంలోనుకూడ ఆర్.యస్.యస్. గణనీయమైన పాత్రను నిర్వహించింది. వారణాశి మహర్షులు, ప్రప్రథమంగా భారతరత్న బిరుదు బడసిన

వారునైన డా॥ భగవాన్‌దాస్ ఇలా అన్నారు : ఢిల్లీ ముస్లింలీగర్ల విశ్వాసం పొందగలందులకై, అసంఖ్యాకంగా ఆర్.యస్.యస్. యువకులు ఇస్లాం స్వీకరించినట్లు నటించారు. అగౌరవాన్ని, అవమానాన్ని-స్వయంకృతంగా-అనుభవించారు. తద్వారా సెప్టెంబరు 10, 1947న లీగర్లు తలపెట్టిన కుట్ర విషయాన్ని ఆఖరిక్షణంలో వారు సర్దార్‌పటేల్, నెహ్రూజీలకు తెలుపగలిగారు. ప్రభుత్వ సభ్యులు, హిందూ అధికారులందరితో పాటు, వేలాదిగా హిందూ పౌరులను హతమార్చి, ఆ సెప్టెంబరు 10న, ఎర్రకోటపై పాకిస్తాన్ పతాకాన్ని ఎగురవేసి, అటుపిమ్మట హిందూదేశాన్ని మొత్తాన్ని ఆక్రమించుకోవాలనేది లీగర్ల కుట్ర. "సెప్టెంబరు 7న ఈ ముఖ్య సమాచారం సర్దార్‌పటేల్, నెహ్రూజీలకు అందజేయబడినప్పుడు, చెప్పుకోదగిన విశ్వాసపాత్రుల దళాలు ఢిల్లీలో లేవు. వారప్పుడు నాటి కమాండర్-యన్-ఛీఫ్, యస్.యం. ఆచిక్‌లెక్‌తో హడావుడిగా సమాలోచనలు జరిపారు. సరిహద్దులకు తంతులు పంపించారు. అందుబాటులో ఉన్న సైనికదళాలన్నింటినీ పిలిపించారు. కొద్దివేలమంది మాత్రమే సైనికులు లభ్యమైనారు. వారు లీగర్ల రహస్య స్థావరాలన్నింటిని కనిపెట్టారు. వాటిలో ఒకటి వైస్‌రాయి భవనానికి సమీపంలోనే ఉంది. ఒక పెద్ద మసీదు క్రింద ఉన్న పెద్ద పెద్ద భూగర్భ గదులలో పెద్ద పెద్ద మొత్తాలలో మందుగుండు సామాగ్రి, రకరకాల ఆహార పదార్థాలు, పెద్దసంఖ్యలో లీగ్ సైనికులు దాచి ఉంచబడ్డారు."

వారు (శ్రీ భగవాన్‌దాస్) యింకా యిలా అంటారు. "ఆర్.యస్.యస్.తో ఎలా వ్యవహరించాలన్నది ప్రశ్నగా వచ్చిన ఈ సమయంలో, నేనిదంతా ఎందుకు చెపుతున్నాను ? ఎందుకంటే, ఆనాడు అట్లా ఉత్సాహ భరితులు, త్యాగనిరతులు అయిన ఆ పిల్లలు (స్వయంసేవకులు) నెహ్రూజీ, పటేల్ గార్లకు ఆ సమాచారం అందించకపోయినట్లయితే, ఈనాడు భారత ప్రభుత్వమన్నది ఉండేదికాదు. దేశం మొత్తం తన పేరు "పాకిస్తాన్"గా మార్చుకొని ఉండేది. కోట్లాదిమంది హిందువులు ఊచకోత కోయబడి ఉండేవారు. మిగతావారు యిస్లాం మతంలోకి మారిపోయి ఉండేవారు. లేదంటే సిగ్గుమాలిన బానిసత్వానికి లోనై పోయేవారు. ఆచార పరాయణులు, అహంకారులునైన పండిత ప్రముఖు

ఒందరూ చనిపోయి ఉండేవారు—కాదంటే, ఆనందంగా ఆపృహాంపంతింటూ ఉండేవారు."

స్వాతంత్ర్యం వచ్చినప్పుడు కాంగ్రెసు అధికారంలోకి వచ్చింది, కాని ఆర్.యస్.యస్. పలుకుబడి ఎక్కువగా ఉండేది. ఆర్.యస్.యస్. యొక్క ఈ పలుకుబడిని కాంగ్రెసువారు సహించలేకపోయారు. కులతత్వం, ఫాసిజం, అదీ అంటూ వారు సంఘాన్ని నిందించటం మొదలుపెట్టారు.

ఇక్కడో తమాషా ఏమిటంటే—ఆరోజులలోనే కేంద్ర శాసనసభలో ఒక ప్రశ్న వచ్చింది. ప్రశ్న నెం. 178 స్టార్ ప్రశ్న. 11 ఫిబ్రవరి, 1947 అడిగినవారు—అహ్మద్ యి. హెచ్ జాఫర్.

(ఎ) రాష్ట్రీయ స్వయంసేవక సంఘ కార్యకలాపాలగురించి దర్యాప్తు చేయడానికి ఒక కమిటీని నియమించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నదా ?

(బి) ఆర్.యస్.యస్. యిటీవల సాగిస్తున్న కార్యకలాపాలకు సంబంధించి ఏదైనా వివతి పత్రం ప్రభుత్వానికి అందినదా ?

(సి) భారతదేశమంతటా సంఘానికి శాఖలు వున్నమాట వాస్తవమేనా ? గౌరవనీయులైన హోంమంత్రి దయచేసి సమాధానం యిస్తారా ?

గౌరవనీయులైన హోంమంత్రి సర్దార్ పటేల్ యిచ్చిన సమాధానాలివి:-

(ఎ) రాష్ట్రీయ స్వయంసేవక సంఘ కార్యకలాపాలగురించి దర్యాప్తుచేసే నిమిత్తం కమిటీని నియమించాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదు.

(బి) అందలేదు.

(సి) చాల ప్రాంతాలలో సంఘానికి శాఖలున్నాయి.

పైసమాధానం యివ్వడానికి ముందు, శ్రీ జాఫర్ ప్రశ్నను అన్ని ప్రాంత ప్రభుత్వాలకు హోంమంత్రి పంపించారు. అన్ని ప్రాంతాలనుంచి జవాబులు అందినవి. పంజాబ్ మినహా ఏ ప్రభుత్వంనుంచి-ముస్లింలు అధిక సంఖ్యాకులుగావున్న సింధు, వాయవ్య సరిహద్దు ప్రాంతం, బెలూచిస్తాన్, బెంగాల్ ప్రభుత్వాలనుంచి సైతం-ఆర్.యస్.యస్.కార్యక్రమాలు ఏవిధంగాకూడ అభ్యంతరకరమైనవనే సమాధానం రాలేదు. "ఈ సరిహద్దు ప్రాంతంలో హిందువులు బొత్తిగా అల్పసంఖ్యాకులై వున్నారుకనుక, వారి కార్యక్రమాలు ప్రధానంగా ఆత్మరక్షణ విధానంలో శిక్షణ యివ్వడానికే ఉద్దేశించబడినట్లు కనిపిస్తున్నది. ఈ వలంటీర్లు తమంతగా ఇతరులపై దండెత్తుతారని అనుకొనడానికి ఏమాత్రం అవకాశంలేదు." అని వాయవ్య సరిహద్దుప్రాంతపు ప్రధాన కార్యదర్శి ఫార్గ్యూ తన జవాబులో పేర్కొన్నారు.

బీహారు ప్రభుత్వపు రాజకీయవిభాగానికి చెందిన శ్రీ టి. పి. సింగ్. ఐ.సి.యస్., 1947 జనవరి 23న తన నివేదికలో "సంఘానికి బీహారు ప్రాంతమంతటా అసంఖ్యాకంగా శాఖలు వున్నాయి. కాని యిటీవల యీ ప్రాంతంలో చెలరేగిన మతకల్లోలాలకు బాధ్యత వీరిదేనని నిరూపించడానికి ఎట్టి ఆధారాలు లేవు" అని వ్రాశారు.

పంజాబ్ విషయానికివస్తే ఈ ప్రాంతం ఆర్.యస్.యస్., ముస్లిం నేషనల్ గార్డ్స్-రెండింటిమీద ఆంక్షలు విధించదలిచింది.

దీనివెనుక ఒక కథవుంది. 1945 ఎన్నికల తరువాత ఖైజర్ హయాత్ ఖాన్ నాయకత్వంలోని యూనియనిస్ట్‌పార్టీ పంజాబ్‌లో అధికారంలోకి వచ్చింది. ముస్లింలీగ్ ప్రతిపక్షంలోకి వుంది. క్రొత్త ప్రభుత్వాన్ని పడగొట్టడానికి ఒక ఒక అసభ్యమైన ప్రచారాన్ని లీగ్ ప్రారంభించింది. "ఖైజర్ కవ్‌జార్ హాయ్

హాయ్" (నీచునికొడుకు ఖైజర్ నశించాలి) అనేది ఆ రోజుల్లో లాహోర్‌వీధుల్లో వినుపించిన నినాదం. ఒక సందర్భంగా లేడీ షఫీ నాయకత్వంలో ముస్లిం వనితలు ఇంటర్వ్యూ నెపంతో అతని డ్రాయింగురూంలోకి వెళ్లారు. లోపలికి వెళ్ళగానే యింటిపెద్ద మరణిస్తే ఏ విధంగా రోదిస్తారో అలా 'సంతాపకాండ' ప్రారంభించారు.

వీటితో పంజాబ్ ప్రధానిలోని సహనం నశించింది. లాహోరులో హిందువు లుండే బీడన్‌వీధిలో ముస్లింలీగు ఊరేగింపుజరిగే సమయంలో వారిమీద రాళ్లు రువ్వవలసిందిగా పంజాబ్ ఆర్.యస్.యస్. కార్యదర్శి అయిన శ్రీ ధర్మవీర్‌కు ప్రధాని సూచనలు పంపాడు. లీగ్‌వారు హిందువులను ప్రతిఘటిస్తారని, దానితో లీగువారిపై విరుచుకుపడి వారిని అణచివేయడానికి తగినసాకు ప్రభుత్వానికి లభిస్తుందని ఆయన ఆశించాడు. ఆ సూచనమీద పంజాబ్ ఆర్.యస్.యస్. నాయకులు చర్చజరిపారు. ఖైజర్‌మీద వారికి సానుభూతిఅయితే వుందికాని, అతడు చెప్పినవిధంగా ముస్లింలతో గొడవపెట్టుకుని రాజకీయాలు ఆడటం తగదని వారు నిర్ణయించారు. పంజాబ్‌లో అదీ దేశవిభజనజరిగిన సంవత్సరంలో సంఘం ప్రదర్శించిన నిగ్రహం అలాంటిది !

అటు తరువాత పంజాబ్ ప్రాంత ప్రభుత్వం ఆర్‌యస్.యస్., ముస్లిం నేషనల్‌గార్డ్స్ రెంటింటినీ నిషేధించింది. "నిష్పాక్షికంగా" కనిపించడానికే ఆర్.యస్.యస్., ను కూడా పంజాబ్ ప్రభుత్వం నిషేధించవలసివచ్చింది- ఈనాడు ఆర్.యస్.యస్.ను మాత్రమే దెబ్బతీయడానికి భారత ప్రభుత్వం ఆర్.యస్.యస్., జమాత్-ఎ-యిస్లామీలను రెండింటిని నిషేధిస్తున్నవిధంగా, ముస్లిం నేషనల్ గార్డ్సును మాత్రమే గుట్టురట్టుచేసి అణచివేయడం నాటి పంజాబ్ ప్రభుత్వంయొక్క అసలు ఉద్దేశం. విభజననాటి హింసాకాండమీద అధికారిక నివేధిక ' స్టెరన్ రెకనింగ్', అందులో జస్టిస్ జి.డి. ఖోస్లా యిలా వ్రాశారు. "ప్రభుత్వ ఆజ్ఞను రాష్ట్రీయ స్వయంసేవక సంఘం తలదాల్చి తన భవనాలను సోదాచేయడానికి, తాళంవేయడానికి అనుమతించిందిగాని ముస్లిం నేషనల్‌గార్డ్సు వైఖరి అందుకు భిన్నంగావుంది. వారి లాహోరు కేంద్ర కార్యా

లయం వద్దకు వద్దకు పోలీసులు వచ్చినపుడు వారు ప్రతిఘటించడానికి తల పడ్డారు. ముస్లిం లీగు కార్యాచరణసమితి సభ్యులైన మియాన్ ఇఫ్తిఖారుద్దీన్, సర్‌ఫిరోజ్‌ఖాన్‌నూన్, మియాన్ ముంతాజ్ దౌల్తానా, సర్దార్ షౌకత్ హయాత్ ఖాన్, మామ్‌దోత్‌కు చెందిన ఖాన్ ఇఫ్తిఖార్ హుస్సేన్‌ఖాన్‌లు ఆదరాబాదరా అక్కడికివచ్చి సోదాచేయడానికి అనుమతి నిరాకరించారు. వారందరిని అక్కడి కక్కడే అరెస్టుచేసి, కార్యాలయపు తలుపులు పగలగొట్టి తెరిచారు. వేయికి పైగా ఉక్కు శిరస్త్రాణాలు, సైనికదుస్తులు, విద్వేషపూరితమైన కరపత్రాలు, పుస్తకాలకట్టలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లీగ్‌నాయకుల నివాసగృహాలలో తుపాకులు, కత్తులు వున్నట్లు అప్పుడు చెప్పబడింది. లాహోరు మేయర్ అయిన మియాన్ అమీరుద్దీన్ పేరు ఈ సందర్భంలో ప్రత్యేకంగా పేర్కొనడం జరిగింది. ఈ అనుమానాలు ఆధారరహితంకాదని తరువాత జరిగిన సంఘటనలలో ఋజువయింది. ఎందుకంటే అల్లర్లు చెలరేగినప్పుడు మియాన్ అమీరుద్దీన్ యింటివైపు నుంచి ఎన్నో సందర్భాలలో తుపాకులు ఉపయోగించబడటం కనిపించింది."

అయినా కాంగ్రెసు మిత్రులుమాత్రం ముస్లింలీగు విషయంలోను, ముస్లిం నేషనల్‌గార్డ్సు, ఖాక్సర్స్ విషయంలోను ఆత్మవంచనాపూరితమైన మౌనం పాటిస్తూ ఆర్.యస్.యస్.పై దాడి కొనసాగించారు.

సంఘంయొక్క శక్తికి, ప్రజాదరణకు అసూయచెంది ఎలాగైనా ఆర్.యస్.యస్. మీద చర్యతీసుకోవాలని ఆలోచించారు. 1947 లో యు.పి. ప్రధానికి పార్లమెంటరీ కార్యదర్శిఅయిన గోవింద్ సహాయ్ ప్రచురించిన ఆర్. యస్.యస్. వ్యతిరేక కరపత్రంలో ఈ అసూయ ప్రస్ఫుటంగా కనిపించింది. విశేషమేమంటే, యీ కరపత్రం రాష్ట్రప్రభుత్వపు ముద్రణాలయంతో ముద్రించబడింది. ఈ కరపత్రంలో శ్రీ సహాయ్ యిలా వాపోయారు. "యు.పి. పశ్చిమ ప్రాంతంలోని జిల్లాలలో, ప్రత్యేకించి నా స్వంతజిల్లా బిజ్నోరులో హిందువులు గత ముప్పైసంవత్సరాలుగా కాంగ్రెసుకు యిచ్చినదానికంటె యెంతో పెద్ద మొత్తాలలో 1944 నుంచి నేటివరను సంఘానికి నిధులు సమర్పించారు. చిన్న పట్టణాలుకూడా సంఘానికి నాలుగయిదువేల రూపాయలదాకా నిధి సమర్పణ చేయడం జరిగింది."

కాని కాంగ్రెసువారు కొంచెం న్యాయబద్ధంగా వ్యవహరిస్తే మంచిదని సర్దార్ పటేల్ అభిలషించారు. 1948 జనవరి 6 న లక్నోలో ఆయన యిలా అన్నారు. "అధికారంలోవున్న కాంగ్రెసువారు తమ అధికారంద్వారా ఆర్.యస్.యస్.ను అణచివేయగలమని భావిస్తున్నారు. దండనీతితో ఏ సంస్థనూ మీరు అణచివేయలేరు. దొంగలకు, బందిపోట్లకుమాత్రమే దండం ఉద్దేశించబడింది. ఆర్.యస్.యస్. కార్యకర్తలు దొంగలుకాని, బందిపోట్లుకాని కారుగదా ! తమ దేశాన్ని ప్రేమించే దేశభక్తులువారు."

ఆర్.యస్.యస్. లోని ఈ విశిష్టతను సర్దార్‌పటేలు ఒక్కరే చూడలేదు. ఆ గడ్డుదినాలలో ఢిల్లీ ప్రాంత ప్రచారక్, శ్రీ వసంతరావు ఓక్, గాంధీజీని పలుమార్లు కలుసుకున్నారు. కేబినెట్ మిషన్ చర్చలసందర్భంలో భంగీకాలనీలో వుందామని గాంధీజీ నిర్ణయించుకొన్నప్పుడు వారికోసం ఆర్.యస్.యస్. రెండు గదులను ఖాళీచేసి యిచ్చింది. ఒకనాటిరాత్రి ముస్లింలీగ్ గుండాలు ఆప్రదేశాన్ని చుట్టుముట్టి గాంధీజీని అసభ్యమైన పదాలతో దూషించడం మొదలుపెట్టారు. ఆ మరుసటిరోజు కాంగ్రెసుకుచెందిన కృష్ణన్‌నాయర్ వచ్చి, అది చాల తీవ్ర విషయమని, జాతీయనాయకుల భద్రతకోసం అందరూ సమైక్యం కావాలని ఆర్.యస్.యస్. కార్యకర్తలతో అన్నారు. ఆ తరువాత దళాలవారీగా స్వయంసేవకులు గాంధీజీ గదులకు రాత్రిఅంతా పహరాకాయడం మొదలుపెట్టారు.

అంతలో మహాత్ముని కలవడానికి వసంతరావు ఓక్‌ను జి.డి. బిర్లా తీసుకొనిపోయారు. ఘనశ్యామదాస్‌జీ వారిని పరిచయంచేసి, ఘనంగా ఆర్.యస్.యస్.ను ప్రశంసించారు. "మా పనిలో చక్కని అధ్యాపకులయితేవున్నారు కాని విద్యార్థుల డ్రిల్లుప్రదర్శన ఏమంత బాగావుండదు. ఆశ్చర్యమేమంటే ఆ బాలురే ఆర్.యస్.యస్. శాఖను నిర్వహించినపుడు అద్భుతమైన క్రమశిక్షణను ప్రదర్శిస్తున్నారు." జాతీయఆదర్శవాదంవల్లనే డ్రిల్లుక్లాసుకు, ఆర్.యస్.యస్. శాఖకుమధ్య తేడా కనిపిస్తున్నదని శ్రీ వసంతరావు ఓక్ వివరించారు.

మరొక సందర్భంలో గాంధీజీని కలవడానికి వసంతరావు వెళ్ళారు. అప్పటికే మౌలానా ఆజాద్ గదిలోపల మాట్లాడుతున్నారు. గాంధీజీ ప్రార్థనా

సమావేశాలలో ఎప్పుడూ గొడవలు జరుగుతుండటం గురించి వసంతరావుతో చెపుతూ ఘనశ్యాందాస్‌జీ ఆందోళన వ్యక్తంచేశారు. ఉదాహరణకు అజాన్ వంటివారు గాంధీజీ వద్దకు రావడం తనకు నచ్చదని, కాని బాపూజీకోసం యిదంతా సహిస్తున్నానని చెప్పారు. అదేవిధంగా గాంధీజీ ప్రార్థనా సమావేశాలలో ఖురాన్ పఠనంపట్ల ఆసక్తి లేనివారుకూడా సమావేశానికి భంగంకలిగించ నవసరంలేదని చెప్పారు. అయనతో వసంతరావు పూర్తిగా ఏకీభవించారు. ఈ సందర్భంగా వసంతరావుతో గాంధీజీ మాట్లాడుతూ ముస్లింలకు వ్యతిరేకంగా హింసాకార్యకలాపాలను ఆర్.యస్.యస్. రెచ్చగొడుతున్నట్లు తనకు కిద్వాయి చెప్పారని, ఆర్.యస్.యస్. వారు భూగృహంలో దాచిపెట్టిన ఆయుధాలను కూడా తనకు చూపించారని చెప్పారు. అదంతా నిజం అయివుండదని వసంతరావు అన్నారు. కిద్వాయి తనతో అబద్ధం చెప్పరని గాంధీజీ అనగా, "కిద్వాయి మీతో అబద్ధం ఆడటంలేదు కాని ఆర్.యస్.యస్.కు వ్యతిరేకంగా మాత్రమే అబద్ధం ఆడుతున్నారు", అన్నారు శ్రీ వసంతరావు.

ఈ ఆయుధాల వెల్లడి కేసే యు.పి. ముజఫర్‌పూర్‌లోని కాండ్లా ఆయుధాలకేసుగా ప్రచారంలోకి వచ్చింది. జిల్లా సెషన్సు జడ్జి నిందితులనందరిని నిర్దోషులుగా విడుదలచేస్తూ "కొందరు అమాయకులను బాధించడానికి పోలీసులే తొలుత ఆయుధాలను పూడ్చిపెట్టి, తరువాత త్రవ్వితీశారని", అభిప్రాయపడ్డారు. ఈ విషయమై పరిశోధన కొనసాగిస్తున్న పోలీసు అధికారి ఈలోగా పాకిస్తాన్‌కు పరారయినాడు !

గురూజీని ఒకమారు కలవాలని గాంధీజీ తమ అభిలాష వ్యక్తంచేశారు. గురూజీ ఢిల్లీ వచ్చినపుడు బిర్లాభవనంలో బాపూజీని చూడటానికి వెళ్లారు. శాంతికోసం ప్రజలకు ఒక విజ్ఞప్తి చేయవలసిందిగా గురూజీని అభ్యర్థించారు. గాంధీజీ స్వయంగా చేసిన విజ్ఞప్తి చాలునని, అంతగా అవసరమయితే వారిమాట పాటించడానికి తాను ఎప్పుడూ సిద్ధంగానే వుంటానని గురూజీ అన్నారు. తరువాత ఒక విజ్ఞప్తి విడుదలచేసి ఆ మరునాడు పత్రికలలో ప్రకటించడం, ఆకాశవాణిద్వారా ప్రసారంచేయడం జరిగింది.

ఆర్.యస్.యస్. కార్యకర్తల నుద్దేశించి తాను ప్రసంగించాలని అను కుంటున్నాననికూడా గాంధీజీ తమ అభిలాషను గురూజీకి వెల్లడించారు. తమ యిష్టమైన సమయంలో తమకు అనుకూలమైనచోట ప్రసంగించవచ్చునని వారిని గురూజీ ఆహ్వానించారు.

1947 సెప్టెంబరు 14 న భంగీకాలనీలోని బహిరంగస్థలంలో దాదాపు 500 మంది ఆర్.యస్.యస్. కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించడానికి గాంధీజీ వచ్చారు. వసంతరావు వారికి స్వాగతంచెప్పి "ఆర్.యస్.యస్.లో మాకు వున్న దైవం ఒకటే—భారతమాత" అని చెప్పారు. ఆర్.యస్.యస్. యొక్క క్రమ శిక్షణను, ఆదర్శవాదాన్ని గాంధీజీ ప్రసంగించి, ఉన్నతాదర్శాలు, ప్రజాసేవ మీద ఆధారపడిన సంస్థ, శక్తివంతంగా దినదినాభివృద్ధి చెందడం ఆశీర్వదించారు తనను "సనాతన హిందువుగా" అభివర్ణించుకొంటూ.... ఆ కార్యక్రమ ప్రారంభంలో పాడబడిన దేశభక్తి గీతాన్ని ఎంతో మెచ్చుకున్నారు—గాంధీజీ.

గాంధీజీ ప్రశ్నలను ఆహ్వానించారు. సాయుధ గుండాల విషయం ఏమి చేయాలని ఒక స్వయంసేవక్ అడిగాడు. గాంధీజీ యిలా సమాధానంయిచ్చారు. "అటువంటి వ్యక్తులను శిక్షించవలసిందే. అయితే ప్రభుత్వమో, దైవమో మాత్రమే ఆపని చేయగలుగుతారు. మీరు, నేను చట్టాన్ని చేతులలోకి తీసుకొని వారిని శిక్షించడం జరుగకూడదు". పాకిస్తాన్ కనుక దుష్టవిధానాలనే అనుస రించదలుచుకుంటే భారత పాకిస్తానులమధ్య యుద్ధం చెలరేగటం అనివార్యం అని కూడ ఆయన అన్నారు.

పాకిస్తాన్‌కు రు. 55 కోట్లు యివ్వవలసిందిగా ప్రభుత్వాన్ని ప్రతిమాల డానికై గాంధీజీ నిరశనదీక్షకు పూనుకొన్నప్పుడు, దీక్ష విరమించవలసిందిగా చేసిన విజ్ఞప్తిపై ఆర్.యస్.యస్. తరపున లాలా హంసరాజ్‌గుప్త సంతకం చేశారు.

కాని ఏనాటికైనా సంఘం తమకు గట్టి పోటీగా తయారవుతుందని భావించిన పలువురు కాంగ్రెసు వ్యక్తులుమాత్రం ఆర్.యస్.యస్.ను ఏవిధంగా

సైన్యా ఆణచివేయాలని సంకల్పించారు. అధికారాన్ని "వశపరుచుకొనగల" ఒకో సంస్థ "వశపరుచుకొనకుండా" ఉంటుందంటే – వారికది నమ్మశక్యంగాని విషయం. భారత స్వాతంత్ర్యం–దేశవిభజన నాటి కష్టపు దినాలలో మొదట ఢిల్లీ ఏరియా కమాండరు జనరల్ రాజేంద్రసింగ్, తరువాత జనరల్ తిమ్మయ్య బారాకంబా రోడ్డులోని 20వ నెంబరు భవనంలో శ్రీ గురూజీని కలుసుకున్న విషయం ప్రభుత్వానికి తెలిసేవుంటుందికాని, ఈ కాంగ్రెసు పెద్దలకు బహుశః తెలిసివుండకపోవచ్చు. పరిస్థితిని అదుపులోకి తీసుకొని రావడంలో గురూజీ యొక్క సహకారాన్ని ఆ సైనికాధికారులు అభ్యర్థించారు. జనరల్ తిమ్మయ్య చివరిలో అన్నమాటలివి. "మనం మరీ ముందుగాకాని, మరీ ఆలస్యంగాకాని దెబ్బతీయకూడదు. సరియైన సమయంలో మాత్రమే దెబ్బతీయాలి. చర్యతీసుకొనవలసిన ఆ సమయం రావడం సంభవమే". ఈ రెండు సమావేశాలలో గురూజీతో పాటు వసంతరావు ఓక్ తప్ప యింకెవరూ లేరు.

శ్రీ గురూజీ వారిమాటలను నిశ్శబ్దంగా ఆలకించారు, కాని సమాధానం ఏమీ యివ్వలేదు. బొమికెముక్కను దౌడలమధ్య యిరికించుకున్న కుక్కను చూచేవిధంగా తప్ప, రాజకీయాలను, రాజకీయాధికారాన్ని ఎక్కువగా చూడలేదు శ్రీ గురూజీ. "అంతరంగిక విషయాలలో మనమధ్య స్పర్థలు వుంటే వుండవచ్చుకాని దేశానికి ఏదైనా విపత్తు వాటిల్లితే మనం 'నూటఅయిదు మందిమి' (వయం పంచాధికం శతం)" అని కాంగ్రెసువారికి గురూజీ అభయమిచ్చారు.

కాని కాంగ్రెసువారుమాత్రం సంఘాన్ని అసూయ, అనుమానాలతోనే చూస్తూవచ్చారు. ఆర్.యస్.యస్.ను నిషేధించాలని వారు పట్టుదల వహించారు. అయితే నిషేధాన్ని అమలుపరచడం తమకు సాధ్యంకాకపోవచ్చుననే భయంతో వారు అందుకు తెగించలేదు. ఆర్.యస్.యస్.ను నిషేధిస్తూ 1948 ఫిబ్రవరి 4న ప్రభుత్వం జారీచేసిన పత్రంలో రాష్ట్రాల ప్రధానులు, హోంమంత్రి న్యూఢిల్లీలో సమావేశమై 1947 నవంబరులో ఆవిషయాన్ని చర్చించినట్లు అంగీకరించబడింది. "అయితే సంఘాన్ని ఒక సంస్థగా పరిగణించి చర్యతీసుకోదగిన

దశ యింకా రాలేదని అప్పట్లో ఏక గ్రీవంగా అంగీకరించడం జరిగింది" అనే నిజాన్ని కూడ ఆ పత్రంలో స్పష్టంగా ఒప్పుకున్నారు. మరోవిధంగా చెప్పా లంటే... సంఘాన్ని గాయపరచడానికయితే కాంగ్రెసు ప్రభుత్వం సిద్ధంగా వున్నది కాని గట్టిగా దెబ్బతీయడానికి భయపడుతూవుంది.

ఇంతలో మహాత్ముని హత్యజరగటంతో కాంగ్రెసులోని నెహ్రూవర్గానికి ఎంతగానో వారు ఎదురుచూస్తున్న అవకాశం లభించినట్లయింది.

ఈ ఘాతుకకృత్యం జరిగినట్లు జనవరి 30న వార్తవచ్చిన సమయంలో శ్రీ గురూజీ మద్రాసులో వున్నారు. వారు వెంటనే తమ కార్యక్రమాలనన్నిటిని రద్దుచేసుకుని, మరునాడు ఉదయమే విమానంలో నాగపూర్ చేరుకున్నారు. హత్యను ఖండిస్తూ, నేరస్థులకు కఠినదండన విధించాలనికోరుతూ వారొక పత్రికా ప్రకటనచేశారు. (ఈ ప్రకటన 'హిందూస్తాన్ టయిమ్స్'లో ప్రచురణకాగా, అందుకు బాధ్యుడైన ఉపసంపాదకుణ్ని సంజాయిషీ కోరారు. ఈ ఘోర కృత్యాన్ని గురూజీ ఖండించినట్లు దేశానికి తెలియకూడదని వారి ఆరాటం!) అదేవిధంగా నెహ్రూకు, పటేలుకు వ్రాసిన లేఖలో ఆ దురంతాన్ని మరొకమారు ఖండిస్తూ, దేశసౌకమ సంక్షుభితసంద్రంలో సురక్షితంగా వారు నడుపగలరనే ఆశాభావాన్ని శ్రీ గురూజీ వ్యక్తపరిచారు.

నెహ్రూ, అతని మిత్రులుమాత్రం యిదంతా పట్టించుకోలేదు. సంఘం మీద దాడి జరపడానికి గాంధీజీమరణం వారికొక కుంటిసాకు అయింది. ఆలస్యం లేకుండా ఆర్.యస్.యస్.ను నిషేధించారు. దాదాపు 17,000 మంది ఆర్. యస్.యస్. కార్యకర్తలను, నాయకులను నిర్బంధించారు. "హత్యకు కుట్ర పన్నారు" అని శ్రీ గురూజీ, బాలాసాహెబ్ దేవరస్‌తోసహా చాలమందిమీద అభి యోగం మోపబడింది. మహారాష్ట్రలో బ్రాహ్మణులను, ప్రత్యేకంగా ఆర్. యస్.యస్. కార్యకర్తలను హత్యచేయడానికి, లూటీచేయడానికి తలపడిన గుంపు లకు కాంగ్రెసువారు నేతృత్వం వహించారు.

రక్తపాతపు సంఘర్షణలు నివారించే ఉద్దేశంతో శ్రీ గురూజీ సంఘాన్ని తాత్కాలికంగా రద్దుచేశారు. తిరుచ్ జిల్లా ప్రచారక్ అయిన యస్.యస్. ఆప్టే

మొదలుగా, హెబియస్‌కార్పస్ పిటీషన్లు పెట్టుకున్నవారి నందరినీ న్యాయస్థానాలు విడుదలచేసినై.

హిందూ మహాసభకు చెందిన కొద్దిమంది తీవ్రవాదులకు మాత్రమే గాంధీజీ హత్యతో సంబంధం వున్నట్లు స్పష్టమైన తరువాతకూడా ఆర్.యస్.యస్.ను కేసులో యిరికించాలని నెహ్రూ ప్రయత్నంచేసారు. 1948 ఫిబ్రవరి 26న పటేలుకు యిలా వ్రాశాడు. "బాపూని గాడ్సే హత్యచేసిన విషయమై యిక్కడ నేకాక బొంబాయి మొదలైనచోట్లకూడ పరిశోధన కొనసాగుతూనే వున్నప్పటికీ, కుట్రయొక్క విస్తృతత్వాన్ని వెలికితీయడంలో మాత్రం సరియైన ప్రయత్నం లోపించినట్లు కనిపిస్తున్నది. బాపూజీ హత్య ఏదో చెదురుమదురు సంఘటనవంటిదికాదని, ప్రధానంగా ఆర్.యస్.యస్. వారు నిర్వహించిన విస్తృతమైన ప్రచారంలో యిదొక భాగమని, రానురాను నాకు గట్టిగా నమ్మకం కలుగుతున్నది. చాలమంది ఆర్.యస్.యస్. వారిని నిర్బంధించడం జరిగింది. వారిలో అధిక సంఖ్యాకులు అంతోయింతో అమాయకులే అయివుండవచ్చు. కాని ఆర్.యస్.యస్. ముఖ్యవ్యక్తులు ఎంతోమంది యిప్పటికీ విదేశాలలోనో, అజ్ఞాతవాసంలోనో వుంటున్నారు. కొందరు బహిరంగంగానే యథేచ్ఛగా సంచరిస్తున్నారు. వీరిలో చాలమంది మన కార్యాలయాలలోను పోలీసు శాఖలోను వున్నారు. వీరికి తెలియకుండా ఏవిషయాన్నయినా దాచి వుంచటం ఎంతమాత్రం సాధ్యంకానిపని. రహస్యంగా సోదాలు జరపడం సాధ్యపడటంలేదని, ఎందుకంటే ఆయావ్యక్తులకు యీసంగతి ముందే తెలిసిపోతున్నదని సీనియర్ పోలిస్ అధికారి ఒకరు మొన్న నాతో అన్నారు.

"ఢిల్లీ పోలీసు వ్యవస్థలో ఆర్.యస్.యస్. సానుభూతిపరులు చాలమంది వున్నట్లున్నారు. వారందరి పని పట్టాలంటే అంత తేలికయిన విషయం కాదు. అయితే యింతవరకు జరిగినదానికంటె మరికొంత ఏదైనా చేయాలని నేను భావిస్తున్నాను. ఆర్.యస్.యస్. సంస్థ యింకా ఎన్నోవిధాల సచేతనంగానే వున్నదని, అవకాశం వచ్చినపుడు ఎదురుదెబ్బ తీస్తుందనడంలో నాకెంత మాత్రం సందేహంలేదు".

1948 ఫిబ్రవరి 27న పటేలు నెహ్రూకు యిలా సమాధానం యిచ్చారు. "బాపు హత్యకేసు పరిశోధన ఏవిధంగా సాగుతున్నదో ఏరోజుకారోజు తెలుసుకుంటూనే వున్నాను. ప్రతిరోజు ఈ విషయం సంజీవితో చర్చించడానికే సాయంకాలాల్లో ఎక్కువసమయం వెచ్చిస్తున్నాను అవసరమైన విషయాలలో తగు సూచనలు యిస్తూవున్నాను. ప్రధాన నిందితులందరూ తమ కార్యకలాపాల గురించి సుదీర్ఘంగా వివరణాత్మకమైన ప్రకటనలు యిచ్చారు. ఒకరి విషయంలో అట్టి ప్రకటన టైపుచేస్తే 90 పేజీలు వచ్చింది. వారి ప్రకటనలనుబట్టిచూస్తే కుట్రకు సంబంధించిన కార్యకలాపాలు ఢిల్లీలో ఎంతమాత్రం జరగలేదని స్పష్టమవుతున్నది. పూనా, బొంబాయి, అహ్మద్‌నగర్, గ్వాలియర్‌లలో కార్యకలాపాలు కేంద్రీకరించబడినై. వారి కార్యక్రమంలో ఢిల్లీ తుదిమెట్టు అయిందిగాని, కేంద్రంగామాత్రం పనిచేయలేదు. పైగా వారు ఎన్నడూ ఒకటిరెండు రోజులకు మించి ఢిల్లీలో గడిపినట్లు కనిపించదు-అదైనా జనవరి 19-30లమధ్య రెండు సార్లు మాత్రమే జరిగింది. ఇందులో ఆర్.యస్.యస్.కు ఏమాత్రం సంబంధం లేదనే సంగతికూడా వారి ప్రకటనలను పరిశీలిస్తే స్పష్టంగా వెల్లడి అవుతున్నది."

ఆరునెలల నిర్బంధం తరువాత శ్రీ గురూజీని విడుదలచేయగానే, ఆర్.యస్.యస్. పైనిషేధం తొలగించమని నెహ్రూ, పటేలులను అడగటానికి ఢిల్లీ వచ్చారు. "ప్రజాశ్రేయస్సు దృష్టిలో వుంచుకొని పరిశీలిస్తే జాతివ్యతిరేకము సంకుచితము అయిన కార్యకలాపాలలో ఆర్.యస్.యస్. నిమగ్నమైయున్నదని నిరూపించడానికి కావలసినన్ని ఆధారాలు మావద్ద ఉన్నా"యని ప్రభుత్వం వాదించింది.

ఆ ఆధారాలు ఏమిటో ప్రభుత్వం చూపించాలని, లేదా అన్ని ఆరోపణలు ఉపసంహరించుకోవాలని శ్రీ గురూజీ 1948 నవంబరు 3న నెహ్రూకువ్రాశారు. "ముజఫర్ నగర్‌జిల్లాలోనీ ఒక్కకేసు ఆధారంగా యు.పి. ప్రభుత్వం 'చార్జిషీట్' అనే గొప్పకథనం రూపొందించిందిగాని, యిదంతా నిజానికి గతవారంలో నిర్ణయించబడింది. దానిపై యివ్వబడిన వివేకవంతము, న్యాయవంతముఅయిన

తీర్పు ఒకింత పరిశీలిస్తే 'కొందరు ఆర్.యస్.యస్. సభ్యుల'కు వ్యతిరేకంగా వున్న "దొరికినవని చెప్పబడిన ఆధారాలన్నీ" తప్పులతడకఅని ఋజువవు తున్నది" అనేకూడా గురూజీ అన్నారు.

నెహ్రూ 1948 నవంబరు 10న సమాధానం వ్రాస్తూ "పైకి చెప్పుకునే లక్ష్యాలకు పొంతనలేదు. ఆర్.యస్.యస్‌తో సంబంధంవున్న వ్యక్తులు వివిధ రూపాల్లో నిర్వహిస్తూవున్న కార్యకలాపాలుకూడా అందుకు విరుద్ధంగానే కని పిస్తున్నాయి. ఆర్.యస్.యస్. అసలు లక్ష్యాలు భారతపార్లమెంటు నిర్ణయాలకు ప్రకటించనున్న భారతరాజ్యాంగపు పరిచ్ఛేదాలకు పూర్తిగా వ్యతిరేకంగా వున్నట్లు కనిపిస్తున్నది" అని ఆరోపించారు.

తిరిగి 1948 నవంబరు 12న శ్రీ గురూజీ లేఖవ్రాశారు. "నాకు తెలిసి నంతవరకు ఆర్.యస్.యస్. లక్ష్యాలలో భారతపార్లమెంటుకు అభ్యంతరకర మైనవిగాని, యింతవరకు ప్రచురితమైన రాజ్యాంగ నిర్ణయాలకు విరుద్ధమైనవి గాని ఏవీలేవు. ఇకపోతే 'ప్రకటించనున్న రాజ్యాంగంయొక్క పరిచ్ఛేదాలను వ్యతిరేకించడం' విషయానికివస్తే మా ప్రధానమంత్రిఅయిన మీరు ఆ వాక్యం వ్రాయకుండావుంటేనే బాగుండేది. ఏడాది తరువాత ఎప్పుడో పుట్టబోయే వ్యక్తి మీద హత్యాప్రయత్నం చేసినందుకు ఒక మనిషిని శిక్షించబూనుకోనటం ఎంత అసందర్భంగావుంటుందో యిదీ అంతే."

సర్దార్ పటేలుకుకూడ యిదేవిధమైన లేఖవ్రాయగా 1948 సెప్టెంబరు 11న జవాబిస్తూ, "కాంగ్రెసుకు దూరంగా వుంటూనో లేక దానిని వ్యతిరేకిస్తూనో గాక, కాంగ్రెసులో చేరటం ద్వారామాత్రమే ఆర్. యస్. యస్. వారు తమ దేశభక్తియుతమైన కార్యకలాపాలను కొనసాగింపగలుగుతారని నా ప్రగాఢమైన విశ్వాసం" అని సమాధానమిచ్చారు.--శ్రీ పటేల్.

నిషేధాన్ని ఎత్తివేసే విషయమై హోంమంత్రిని అడగమని ప్రధాని, ప్రధానమంత్రిని సంప్రదించమని హోంమంత్రి చెప్పినందుకు వారిద్దరికి వ్రాసిన లేఖలలో శ్రీ గురూజీ ఆక్షేపణ తెలియచేశారు. అదేవిధంగా ప్రాంతాలను సంప్ర

ఁిండమని కేంద్రం సలహాయివ్వగా, కేంద్రాన్నే అడగమని ప్రాంతాలు సూచిం చినై, ప్రభుత్వంనుంచిమాత్రం కదలికలేదు. నెహ్రూ సంతోషిస్తాడని భావించిన గూఢచారిశాఖవారు ఆర్. యస్. యస్. కార్యకలాపాలమీద, ఉద్దేశాలమీద అన్ని రకాల కట్టుకథలతో నివేదికల దొంతర్లు తయారుచేశారు. చాలమంది కాంగ్రెసు వారు స్వప్రయోజనకరమైన స్వంత నివేదనలతో వీటికి సమర్థన యిచ్చారు- వీటన్నిటికి మించి-కాంగ్రెసును గుడ్డిగా సమర్థిస్తూ, ఆర్. యస్. యస్. మీద గుడ్డిగా దాడిచేస్తూ పత్రికలలో వార్తలువచ్చినై. ఈ పరిస్థితిలో ప్రభుత్వానికి చేయవలసిందేమీ కనిపించలేదు.

1948 నవంబరు 13న శ్రీ గురూజీని ఢిల్లీలో అరెస్టుచేసి నాగపూరుకు తరలించారు. ఆతరువాత 1948 డిసెంబరు 9 నుంచి దేశవ్యాప్తంగా సత్యా గ్రహం ప్రారంభమయింది. తరువాత రానున్న రెండునెలల్లో 500 మంది సత్యాగ్రహం చేయవచ్చునని ప్రభుత్వం అంచనావేసింది. వాస్తవానికి తొలి రెండుదినాలలోనే 1500 మందిని అరెస్టుచేయవలసి వచ్చింది.

తదుపరి రెండునెలలకాలంలో 16 సంవత్సరాలవయస్సునుండి 75 సం॥ల వయస్సులో వరకు ఉండిన 60,000 మంది వరకు సత్యాగ్రహులు అరెస్టు అయిభారు. అంతకుముందెన్నడూ ఏ సత్యాగ్రహంలోను - 1921లో గాని, 1930-32లో గాని, 1942 లోగాని యింతమంది పాల్గొనలేదు. చలి ఎక్కువగా వుండేరోజులు అయినప్పటికీ, యింతమందిని అదుపుచేయడానికి కావలసిన సరంజామా జైళ్లలో లేకపోయినప్పటికీ స్వయంసేవకులు సంయమనంతో, క్రమ శిక్షణతో చలిశిక్షను అనుభవించారు. ఆ రోజుల్లోనే తెలంగాణా ఉద్యమం కార ణంగా జైళ్లపాలయిన చాలమంది కమ్యూనిస్టులు వీరినిచూచి "రత్నాలవంటి వ్యక్తులు వీరు" అని అంటుండేవారు.

ప్రశాంతచిత్తులయిన అరవైవేలమంది సత్యాగ్రహుల నైతికశక్తిముందు శక్తివంతమైన భారతప్రభుత్వం తలవంచకతప్పలేదు. కనుక మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న ఇండియన్ లిబరల్ ఫెడరేషన్ అధ్యక్షు శ్రీ టి.ఆర్.వి. శాస్త్రిని

పిలిచి ప్రభుత్వం ఆర్. యస్. యస్. కు ఒక నిబంధనావళి వుండాలని తెలియ జేసింది. అందుకు ఎవరికీ అభ్యంతరం వుండనక్కరలేదు. ఆర్. యస్. యస్. వంటి పెద్దసంస్థ నిబంధనావళి అంటూ లేకుండా పనిచేయదు. అయితే వ్రాత రూపంలో ఆ నిబంధనావళిలేదు. సియోని జైలులోవున్న శ్రీ గురూజీవద్దకు మౌళిచంద్రశర్మ వ్రాతప్రతిని తీసుకొనివెళ్ళియివ్వగా ఆది చదువకుండానే శ్రీ గురూజీ దానిపై సంతకంచేశారు. బయటవున్న తన సహకార్యకర్తలమీద తనకు పరిపూర్ణ విశ్వాసమున్నదని వారు అన్నారు. 1885 నుంచి 1899 వరకు కాంగ్రెసుకుకూడా ఏ రకమైన నిబంధనావళిలేకపోవడం యిక్కడ చెప్పుకోదగిన విశేషం. 1908లో మాత్రమే కాంగ్రెసు ప్రాంతీయకమిటీలను ఏర్పాటుచేసు కుంది. జన్మించిన 36 సంవత్సరాల తరువాత-1921లో గాని సక్రమమైన నిబంధనావళి రూపొందించడం జరుగలేదు.

ఆర్. యస్. యస్. నిధుల విషయంలో ప్రభుత్వం అభ్యంతరం లేవ దీసింది. శ్రీ టి. ఆర్. వి శాస్త్రి యీ సంగతి శ్రీ గురూజీకి తెలియజేయగా వారు సమాధానం యిస్తూ "మే మెన్నడూ ప్రజలను యాచించడానికి పోము. లెక్కల పుస్తకాలున్నాయి. సంబంధితులు-సంస్థ సభ్యులు ఎవరయినా - ఎప్పు డయినాసరే వాటిని చూడవచ్చు. మా కుటుంబపు లెక్కలవిషయం బయటివారికి అనవసరం. అయినా సర్దార్‌పటేల్ అంత పట్టుదలతోవుంటే ముందుగా ప్రజల నుంచి కాంగ్రెసువసూలుచేసిన నిధులఖాతాలు ప్రకటించమని దయవేసి వారితో చెప్పండి. తిలక్‌స్వరాజ్ నిధితో మొదలుపెట్టమనండి. ఆ తరువాతనే మాలెక్కలు ప్రకటించమని ఆయన నన్ను అడగవచ్చు" అని వ్రాశారు.

ఆ తరువాత సంఘనిధుల విషయమై ఎవరూ నోరెత్తలేదు.

ఆర్. యస్. యస్.మీద ప్రారంభించిన యుద్ధానికి యింతకంటె బలమైన కారణాలున్నాయని ప్రజలను నమ్మించవలసిన అగత్యం ప్రభుత్వానికి ఏర్ప డింది. అందుకని జాతీయరాజ్యాంగాన్ని, జాతీయపతాకాన్ని ఆర్. యస్. యస్. ఆమోదించే విషయంమీద దుమారంలేపింది. హోంశాఖ కార్యదర్శి హెచ్.వి.ఆర్. అయ్యంగార్ 1949 మే 3న లేఖవ్రాస్తూ సర్‌సంఘచాలక్‌ను నామినేట్ చేయడం

మీద, సంఘంలోని చాల ముఖ్యపదవులన్నీ" ఒకానొక ప్రత్యేక ప్రాంతంలోని ఒకానొక ప్రత్యేకవర్గానికిచెందిన వ్యక్తులు "(మహారాష్ట్ర బ్రాహ్మణుల)" ఆధీనంలో వుండటంమీదకూడ అభ్యంతరం తెలియజేశారు. జీవితాంతం పాలించవలసిన ఆర్.యస్.యస్. ప్రతిజ్ఞ రహస్యసంస్థల పద్ధతిని పోలివున్నదని అన్నారు. సంరక్షకుల వ్రాతపూర్వకమైన అనుమతిమీద మాత్రమే మైనారిటీల ప్రవేశం యివ్వాలనికూడ ఆ లేఖలో పేర్కొన్నారు.

రాజ్యాంగాన్ని, జాతీయపతాకాన్ని ఆర్. యస్. యస్, ఎప్పుడూ గౌరవిస్తుందని శ్రీ గురూజీ తమ జవాబులో తెలియజేశారు. ఆర్. యస్. యస్ నిబంధనావళి నిజానికి కాంగ్రెసు ఫక్కీలోనే రూపొందించబడినదని గుర్తుచేశారు. "సంఘనిబంధనావళి ముసాయిదాను మీరు పరిశీలిస్తే అది స్థూలంగా భారతజాతీయ కాంగ్రెసు నిబంధనావళికి అనుసరణగావున్న విషయం గమనించవచ్చు. అఖిల భారతీయ ప్రతినిధిసభ పూర్తిగా ఎన్నుకొనబడిన ప్రతినిధులే. దీనిని అఖిల భారత కాంగ్రెసు కమిటీ (AICC) తో పోల్చవచ్చు. అదేవిధంగా ప్రాంతీయ ప్రతినిధి సభలు అన్ని ప్రాంత కాంగ్రెసుకమిటీలతరహాలో రూపొందించబడ్డాయి. కాంగ్రెసు అధ్యక్షునివలెనే సర్‌కార్యవాహను ఎన్నుకొనబడిన అఖిలభారతీయ ప్రతినిధి సభ-ఎన్నుకుంటుంది. ఇతడు (సర్ కార్యవాహ) కాంగ్రెసు అధ్యక్షునివలె తన కార్యాచరణ సంఘాన్నంతటిని నియమిస్తాడు. దీనిని కేంద్రీయ కార్యకారీమండల్‌గా వ్యవహరిస్తారు. ఇది అఖిలభారత కాంగ్రెసు వర్కింగుకమిటీతో పోల్చదగినట్టిది. అదేవిధంగా ప్రాంత కార్యకారీ మండల్ కూడా ప్రాంతకాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ తరహాలో వుంటుంది. సంఘంయొక్క విధానాన్ని, కార్యక్రమాన్ని అ.భా.ప్ర.స. నిర్దేశిస్తుంది. కార్యకారీ మండలులు కేవలం విధానానికి కార్యరూపాన్ని యిస్తాయి. ఈ విధంగా నిబంధనావళిఅంతా ఎన్నికసూత్రంమీదనే రూపు తీర్చబడిందని మీరు గమనించగలరు"

ప్రతిజ్ఞ విషయానికివస్తే, "ఆర్. యస్. యస్. కార్యక్రమానికి హిందూ సంస్కృతే భూమికగావున్నది. హిందూసంస్కృతిలో ప్రతిజ్ఞఅనేది ఆజీవన వ్రతంగానే వుంటుందితప్ప తాత్కాలిక ఒప్పందం మోస్తరుగావుండదు".

ప్రభుత్వం ఇంకా తన సలహాలు, అభ్యంతరాలతో కాలంగడుపుతూ వుండగా 1949 జూలై 11న శ్రీ టి. ఆర్. వి. శాస్త్రి ఒక ప్రకటన చేశారు. అనేక ఇతరవిషయాలతోపాటు శ్రీ శాస్త్రి సర్‌సంఘచాలక్ పదవిగురించి ప్రస్తావించారు. "సంస్థకు అధిపతి అయిన సర్‌సంఘచాలక్‌ను అతని పూర్వపు అధికారి నియమించడం ఒకప్రధానమైన అభ్యంతరంగా చెప్పబడుచున్నది. ఈపద్ధతి ప్రజాస్వామిక విరుద్ధమని, ఫాసిస్టుధోరణిలో వున్నదని అంటున్నారు. ఈ అభ్యంతరం నాకు తట్టిన ఊహకాదని అంగీకరిస్తున్నాను. సంస్థయొక్క తీరుపట్ల అవగాహన లోపించడంవల్లనే అభ్యంతరం వస్తున్నది. ఒక ప్రభుత్వాన్నో, రాజ్యాన్నో అయితే ఫాసిస్టుగా పేర్కొనవచ్చు. కాని ఒక స్వచ్ఛంద సంస్థను అలా అనలేము. ఎందుకంటే అందులో చేరమని ఎవరూ ఎవరినీ బలవంతం చేయరు కనుక".

ఆధ్యాత్మిక రంగంలో ప్రజలు ఎన్నుకొనడమనేది ఎక్కడాలేదు. ఇదే ఎన్నికకు సంబంధించిన సమస్యగా తయారయితే అధినేతతో పోటీచేసేవాడికి ఘోరపరాజయం తప్పదు. ఏదిఏమైనా ఈ ప్రశ్న అనుచరులు నిర్ణయించుకొనవలసిందేతప్ప ఎవరో బయటివారు జోక్యం చేసుకొనవలసిందికాదు" అని కూడ శ్రీ శాస్త్రి అన్నారు.

"మైనరులను చేర్చుకునే విషయంలో కాంగ్రెసు స్వచ్ఛందసేవాదళానికి తల్లిదండ్రుల వ్రాతపూర్వకమైన అనుమతి అక్కరలేనంతవరకు, అలాంటి నియమాన్ని ఆర్.యస్.యస్.కు వర్తింపజేయాలనుకొనడం సహేతుకం అనిపించుకోదు" అని ఆయన పేర్కొన్నారు.

మతతత్వం (కమ్యూనలిజం) సంగతికివస్తే "చెల్లాచెదరుగా పడివున్న హిందూసమాజాన్ని సంఘటితంచేసే ప్రయత్నంలో ఆర్.యస్.యస్. చక్కని కృషిచేసిందని నేను గట్టిగా భావిస్తున్నాను. మన కనుల ఎదుటనే తాండవిస్తున్న అనేక దురాచారాలను అరికట్టడంలో, ప్రభుత్వం ప్రత్యేకంగా శ్రద్ధవహించదగిన విషయాలలోకూడ ఆర్.యస్.యస్. కార్యక్రమం ఎంతో సహాయకారిగా వుండగలదు" అని కూడా ఆయన స్పష్టంచేశారు.

"తమది రాజకీయాలకు అతీతమైన సంస్థ అని చెప్పుకుంటున్నప్పటికి ఏదో ఒకనాడు అకస్మాత్తుగా వీరంతా ఒక రాజకీయపక్షంగా మారే అవకాశం వుందని యింకొక వ్యాఖ్య నా దృష్టికి వచ్చింది. అలా జరుగవచ్చుకూడాను. ఈ విధంగా వారొక రాజకీయపక్షంగా మారినా అదొక నేరంకాదు. అయితే అలాంటి పొరపాటు వీరుచేయరని, వీరికి మంచి విజ్ఞతవున్నదని నేను గట్టిగా చెప్పగలను. దీనిని రాజకీయ సంస్థగా మార్చడానికి ప్రయత్నిస్తే, అందువల్ల యీ సంస్థ విచ్ఛిన్నమై కకావికలు అవుతుందని వారికి తెలుసు. ఈ కారణం చేతనే వీరు ఏ రాజకీయవర్గంలోనయినా చేరడానికి విముఖత కనబరుస్తున్నారు. గత ఎన్నికలలో వీరు దాదాపు మొత్తంగా కాంగ్రెసుకే ఓటువేసినట్లు, ఈ సంస్థ తన పక్షానికి బొత్తిగా సహకారం అందించలేదని హిందూమహాసభ అధిక్షేపించి నట్లు నాకు తెలియవచ్చింది. ఆర్. యస్. యస్. మీద ప్రభుత్వంవారు తీసు కుంటున్న చర్యయొక్క ప్రభావం, రానున్న ఎన్నికలమీద ఏవిధంగా ఉంటుందో నేను చెప్పలేను" అంటూ ఆ ప్రకటన ముగించారు శ్రీశాస్త్రి.

సరిగా అదేరోజు–1949 జూలై 11న – ప్రభుత్వం బేషరతుగా ఆర్. యస్. యస్. మీద నిషేదాన్ని ఎత్తివేసింది.

అవస్థల పర్వం సుఖాంతమైంది. కాంగ్రెసు వారి అసూయ సంగతి అలా వుంచి, నెహ్రూ–పటేలుల స్పర్ధలకు కూడా ఆర్.యస్.యస్. బలి అయినట్లు కనిపిస్తుంది. కాంగ్రెస్–ఆర్.యస్.యస్.ల మధ్య అఖాతాన్ని పూడ్చడానికి గాంధీజీ హత్యకు పూర్వం లక్నో, జయపూర్ ప్రసంగాలతో పటేలు ప్రయత్నించాడు. "హిందూ సమాజానికి ఆర్.యస్.యస్. సేవచేసిందనడంలో సందేహానికి ఆస్కారం లేదు. సహాయ సహకారాలు అవసరమైన ప్రాంతాలలో ఆర్.యస్. యస్. యువకులు స్త్రీలను, బిడ్డలను రక్షించి ఎంతో కృషిచేశారు" అని పటేలు 1949 సెప్టెంబరు 11న శ్రీ గురూజీకి వ్రాసిన లేఖలో ప్రశంసించారు.

ఆర్.యస్.యస్.ను అణచడానికేగాక, సర్దార్ పటేలును కూలద్రోయ డానికి కూడ నెహ్రూవర్గం గాంధీ హత్య సంఘటనను వినియోగించుకున్న విష యం గమనార్హం. గాంధీజీ మరణించిన కొంతకాలం తరువాత పటేలును ఆర్. యస్.యస్. నాయకుడు వసంతరావు కలుసుకున్నప్పుడు, "ఈ ఘాతుక

కృత్యంలో మీకు ఎంత మాత్రం సంబంధంలేదని నాకు తెలుసు. అయితే మిమ్మునిందిస్తున్న పెద్ద మనుషులే నన్ను కూడా నిందిస్తున్నారు!" అన్నారు-పటేలు.

నిషేధాన్ని ఎత్తివేసే విషయంలో సంప్రదింపులు జరపడానికి, మధ్యవర్తులకు అవసరమైన తోడ్పాటు యివ్వడానికి శ్రీ ఏకనాథ్ రానడేను నాగపూర్ నుంచి ఢిల్లీ పంపించారు. వారుకూడా, 1949లో సర్దార్ పటేలుతో విచిత్రమైన అనుభవాలు ఎదుర్కొన్నారు.

మొదటి సారిగా ముస్సోరిలోని బిర్లా భవనంలో శ్రీ రానడే సర్దారును కలుసుకున్నారు. ఆ సమయంలో జి. డి. బిర్లా కూడా అక్కడేవున్నారు. పటేలు కొంచెం దురుసుగా ప్రవర్తించడం ఏకనాథ్‌జీ గమనించారు. అన్నిరకాల హింసాకృత్యాలకు ఆర్.యస్.యస్. పాల్పడింపని అంటూ, పటేలు పదినిమిషాల పాటు ఏకధాటిగా ఆర్.యస్.యస్. మీద దుమ్మెత్తి పోశారు.

అంతా విని... మీరు చేసిన నిందలన్నీ నిజంగానే మీరు నమ్ముతున్నారా? అని ఏకనాథ్‌జీ ఆయనను అడిగారు. 'మహాత్ముని హత్యతో ఆర్.యస్.యస్.కు ఏ కొంచెమైనా సంబంధం వున్నదని నిజంగా మీరు నమ్ముతున్నారా అని కూడా అడిగారు. అందుకు పటేలు "లేదు లేదు కాని ఆర్.యస్.యస్. సృష్టించిన మానసిక వాతావరణం కారణంగానే హింసాకృత్యాలు జరపడం సాధ్యమయింది. ఆ మేరకు ఆర్.యస్.యస్.దే బాధ్యత" అన్నారు.

ఏకనాథ్‌జీ యిలా సమాధానమిచ్చారు. "ఆర్.యస్.యస్.లో వుండే మాకు అఖండ హిందూస్థానంలో నమ్మకముంది. దేశ విభజనను మేము వ్యతిరేకించాం. ఇదే గనుక హింసకు అవకాశమిచ్చే మానసిక వాతావరణాన్ని సృష్టించడంగా భావించేటట్లయితే, ఆ నేరానికి మా బాధ్యతను అంగీకరిస్తున్నాము.''

1942లో "క్విట్ఇండియా" ఉద్యమంతో పాటు దేశమంతా హింసాకాండా చెలరేగిందని, మనుషులు సజీవంగా దహనం చేయబడ్డారని, ఏకనాథ్‌జీ చెప్పుకు పోయారు. కనుక, అదే ప్రాతిపదిక మీద, కాంగ్రెసు కూడా హింసకు దారితీసిన ఒక "మానసిక వాతావరణాన్ని" సృష్టించి నందుకు బాధ్యత వహించవలసి వుంటుందని అన్నారు.

మహాత్ముని హత్యా నంతరం శ్రీ గురూజీతో సహా వేలాది మంది ఆర్. యస్.యస్. కార్యకర్తలను అరెస్టుచేసి, వారిమీద హత్యానేరం మోపారని, దీని ఫలితంగానే, ప్రత్యేకించి మహారాష్ట్రలో, విస్తృతంగా దౌర్జన్యం, లూటీలు, దహనాలు, హత్యలు జరిగినవని కూడా ఏకనాథ్‌జీ అన్నారు. కనుక భారత ప్రభుత్వం కూడా అదే ప్రాతిపదిక మీద "మానసిక వాతావరణాన్ని" సృష్టించి హింసను ప్రోత్సహించినందుకు బాధ్యత వహించవలసి వుంటుందని వారన్నారు.

సర్దార్ పటేలు సమాధానం యివ్వలేదు. శ్రీ బిర్లా మాత్రం ఏకనాథ్‌జీ మాటలకు సహనం కోల్పోయినట్లు కనిపించారు. అందువల్ల ఆయన ఏకనాథ్‌జీ వైపు తిరిగి "ఎవరితో మీరు మాట్లాడుతున్నారో తెలుసనుకుంటాను" అన్నారు.

తను ఏదయినా అనుచితంగా మాట్లాడివుంటే యింకేమీ మాట్లాడదలచుకోలేదని, యిక వెళ్ళివస్తానని ఏకనాథ్‌జీ అన్నారు.

వారు వెళ్లబోయే ముందు "విషయాన్ని సుదీర్ఘంగా పరిశీలించి నన్ను మళ్ళీ కలుసు కొనండి" అని సర్దార్ పటేల్ చెప్పారు.

మళ్లీ ముస్సోరిలోనే ఏకనాథ్‌జీ కలిసినపుడు సర్దార్ పూర్తిగా మారిన వ్యక్తిగా కనిపించారు. వారి ప్రస్తుత ధోరణి చాల విభిన్నంగా వుంది. తాను రానడే కోసం నిరీక్షిస్తూ వున్నట్లు చెప్పారు. సంభాషణ ప్రారంభిస్తూ "ఈ సంగతి ఆలోచించారా? ఆర్.యస్.యస్‌మీద నిషేధం వుంది. అయితే యీ నిషేధాలు ఎల్లకాలం వుండేవికావు. కాంగ్రెసుమీద సైతం ఒకప్పుడు నిషేధం వుండేది. ఏమైనా యీ నిషేధాలతో ఏ సంస్థనూ హతమార్చలేరు. కనుక ఆర్.యస్.యస్.మీద వున్న యీ నిషేధం నేడో రేపో తొలగిపోవడం తథ్యం. తరువాత ఏమిటనేది ప్రశ్న" అన్నారు పటేల్.

సంఘంయొక్క దృక్పథాన్ని ఏకనాథ్‌జీ వివరించారు. హిందూ సంఘటనలో హిందూ సంస్కృతిలో సంఘానికి విశ్వాస మున్నదని వారు స్పష్టం చేశారు. "నా భావాలు అందుకు విభిన్నమని మీరు భావిస్తున్నారా?" అని పటేలు అనగా కాంగ్రెసువారంతా ఆ విధంగా ఆలోచించటంలేదని ఏకనాథ్‌జీ పేర్కొన్నారు.

"నేను ఈ రోజు అనే మాటలను కాంగ్రెసు మొత్తం రేపు అంటుంది. సంఘటన, సంస్కృతి అంటేనే ఒళ్లుమండే నెహ్రూ వంటి వారు కొద్దిమంది వున్నారు.

అయితే వారు కూడా దారికి వస్తారు. మీరు నాకు చేయూత యిస్తారా అనేది సమస్య" అనే పటేలు అనగా అదే నిజమయితే, వారితో చేతులు కలపడానికి తమకు సంతోషమేనని అంటూ" అయితే ముందుగా మీరు కాంగ్రెసువారి మన సులోవున్న ఆర్.యస్.యస్. వ్యతిరేకత అనే విషాన్ని తొలగించాలి. అప్పుడే ఏ రకమైన సహకారమైనా సాధ్యపడుతుంది" అన్నారు. ఏకనాథ్‌జీ.

ఆర్.యస్.యస్.కు ఆదర్శాలలోనే తప్ప అధికారంలో ఆసక్తి లేదని ఏకనాథ్‌జీ స్పష్టం చేశారు. తమకు వారిపై ఎంతో గౌరవాభిమానాలు వున్నాయని కూడా చెప్పారు.

"అయితే అంతా మంచిగానే జరుగుతుంది" అన్నారు పటేలు. తాను శ్రీ గురూజీని కలిసి అన్ని విషయాలు మాట్లాడవలసి వుందని చెప్పారు.

పేరు చెప్పకుండానే కమ్యూనిస్టుల గురించి ప్రస్తావిస్తూ- అరాచకాన్ని, అవ్యవస్థను సృష్టించడమే పనిగా పెట్టుకున్నవారు కొందరున్నారని, కనుక ఒకే విధమైన ఆలోచన కలవారంతా కలిసిపనిచేయవలసిన అవసరం వుందని పటేల్ అన్నారు. "మీరేమి ఆందోళన చెందకండి. త్వరలోనే అంతా చక్కబడుతుంది" అంటూ ముగించారాయన.

అన్నట్లే పరిస్థితి చక్కబడింది. త్వరలోనే 1949 జులై 11న నిషేధం తొలగించ బడింది. శ్రీ గురూజీ ఎక్కడకు వెళ్లినా అక్కడ బ్రహ్మాండమైన స్వాగతం లభించింది. "భారతదేశంలో ఒక్క నెహ్రూ మాత్రమే యింతటి జన సమూహాన్ని ఆకర్షించ గలవారు... శ్రీ గోళ్వాల్కర్ రాజకీయ ప్రాముఖ్యాన్ని గాని, వారి సంస్థ యొక్క శక్తినిగాని నేడు ఎవరూ తక్కువగా అంచనా వేయ లేరు" అని సుదూరంలోని బి.బి.సి వ్యాఖ్యానించింది.

శ్రీ కె.యం. మున్షీ ఒక ప్రత్యేక వ్యాసంలో యిలా వ్రాశారు. "ఆర్.యస్. అధినేత శ్రీ గోళ్వాల్కర్ యావద్భారతం పర్యటిస్తున్నారు. ప్రతిచోట వారు పొందుతున్న అపూర్వ స్వాగత సత్కారాలను-ఉదాహరణకు ఢిల్లీ యిచ్చిన ఘన స్వాగతాన్ని- చూస్తే ఆర్.యస్.యస్. స్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నదని తెలుస్తుంది. ఈ వాస్తవాన్ని నిర్లక్ష్యం చేసి ప్రయోజనంలేదు."

అదే వ్యాసంలో ఆర్.యస్.యస్.ను భారతకమ్యూనిష్టుపార్టీతో పోల్చుతూ "సోవియట్ రష్యా రథచక్రాలకు అనుబంధించబడివున్న సి.పి.ఐ. భారతీయ జాతీయ వాదానికి శత్రువు. ఆర్.యస్.యస్. ప్రాచీన భారతంనుంచి మాత్రమే స్ఫూర్తిని స్వీకరిస్తూ, ఉచ్చతమ భావావేశంతో భారతమాతను అర్చించే ప్రఖర జాతీయతావాది. ఏదో విప్లవం సాధిద్దామనుకుంటూ సువ్యవస్థితమైవున్న జీవనపు పునాదులను త్రోసిపుచ్చాలని చూస్తుంది. సి.పి.ఐ. విప్లవానికి సౌందర్యం ఆపాదిస్తూ- ప్రమాదకారులుగా చెప్పదగిన ప్రమదల సాహచర్యాన్ని యిచ్చి, సాధారణ అనుశాసన బద్ధ జీవనం నుంచి వైదొలగి వర్తించే విశృంఖలతను ఎరగా చూపి, యువకులను సి.పి.ఐ. ఆకర్షిస్తుంది. ఆర్.యస్.యస్. సంఘటిత జీవనపు వైభవాన్ని ఆకర్షణగా చూపి, హైందవేతరమైన ధోరణిపట్ల తీవ్ర వైముఖ్యతను కలిగిస్తూ యువజనులను ఆకర్షిస్తుంది. భారతదేశంలోని యువతులను సభ్యులుగా చేర్చుకునే ప్రయత్నం ఆర్.యస్.యస్. ఎప్పుడయినా చేసిందేమో నాకు తెలియదు. లెనిన్, స్టాలిన్, సోవియట్ యూనియన్‌లను తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మలు (Father, Son and Holy Ghost)గా పరిగణిస్తుంది- సి.పి.ఐ. ఆర్.యస్.యస్.కు భారతభూమి దివ్యజనని. ఆమె పాదాలవద్ద రాలిపోవడమే వారికి ధన్యత. సి.పి.ఐ.కి సోవియట్ యూనియన్ ఎలాంటిదో, ఆర్.యస్.యస్‌కు ప్రాచీన భారతవర్షం అలాంటిది. భౌతికవాదమే సి.పి.ఐ వారి మతం. ప్రాచీన పరంపరకు అనుగుణమైన ధర్మమే ఆర్.యస్.యస్‌వారి అభిమతం"

ఒరిస్సా అసెంబ్లీ మాజీ శాసనసభాపతి శ్రీ నీలకంఠశాస్త్రి యిలా అన్నారు : "జగన్నాథ్‌ను మలినంచేసి ధ్వంసంచేయాలని ముస్లిములు యత్నించినపుడు నాగపూరుకు చెందిన భోంసలేలు ఆదుకొని కాపాడారు. చేడు మళ్ళీ జీవనరక్ష నాగపూరునుంచే వచ్చింది. ఈసారి ఆర్.యస్.యస్ పిలుపు ఒక్క ఉత్కళ దేశాన్ని మాత్రమేకాదు, మొత్తం భారతవర్షాన్ని రక్షించనున్నది".

ఇంతగా ప్రశంసలవర్షంకురిసినా శ్రీ గురూజీ విచలితులుకాకుండా ఎప్పటివలెనే సౌమ్యంగా, స్థిరచిత్తులుగావున్నారు. ప్రభుత్వం చేతులలో ఆర్.యస్.యస్ అనుభవించిన బాధలపట్ల వారి ఉపన్యాసాలలో ఎక్కడా ఆగ్రహపు ఛాయలే కనిపించలేదు. అగ్నిపరీక్షకు తట్టుకుని విజయులై నిలిచిన స్వయంసేవకులను ప్రశంసిస్తూనే, మనసులో ఎట్టి విద్వేషాన్ని పెంపొందనీయవద్దని వారికి ఉపదే

శించారు. "మనపళ్లు ఒక్కొక్కప్పుడు నాలికకు గాటుకలిగించవచ్చు. అంత మాత్రాన పళ్లు రాలగొట్టుకోముగదా" అన్నారు.

భుసావల్ రైల్వేస్టేషనులో శ్రీ గురూజీమీద కురిసిన పూలవాన ఎంత దట్టంగావున్నదంటే "నామీద పడుతున్నది పూలవానకాదు, పూలదెబ్బలు" అని వారు చమత్కరించారు. ప్లాట్‌ఫారంఅంతా పూలతోనే నిండిపోయింది. గురూజీ చిన్న ప్రసంగం చేశారు. వారు జనసమూహాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూవుండగానే ఒక పోర్టరువచ్చి యిటు ప్లాటుఫారం ఊడ్చటం మొదలుపెట్టాడు. "ఈ పని చేయడానికి ఇతనికి యిప్పుడేతప్ప యింకోవేళలేదా ?" అని ఎవరో కోపంగా గొణిగినారు. "దేవుడికివేసిన పూలను మన కాళ్ళతో త్రొక్కకూడదని యీ పూలన్నిటిని పోగుచేస్తున్నాను!" అని ఆ పోర్టరు వివరణయిచ్చాడు.

కొద్దికాలం తరువాత 1949 నవంబరు 20న డాక్టర్ జాకీర్‌హుస్సేన్ మాంఘీర్‌లో ముస్లింల పర్వదినసమావేశంలో ప్రసంగిస్తూ, 'ముస్లింలకు వ్యతిరేకంగా హింసావిద్వేషాలను పురికొల్పుతున్నదని ఆర్.యస్.యస్ మీద చేయబడుతున్న ఆరోపణలు వట్టి కట్టుకథలు. పరస్పరప్రేమ, సహకారం, సంఘటనల పాఠాలను ఆర్.యస్.యస్ నుంచి ముస్లింలు నేర్చుకోవాలి" అన్నారు.

దేశ సమస్యలు

1950 జనవరి 26 న భారతదేశం గణతంత్ర రాజ్యంగా ప్రకటించబడి నప్పుడు, ఈ మహత్తర సంఘటనను శ్రీ గురూజీ స్వాగతిస్తూ, ప్రజలందరిని వేడుకలు జరపమని కోరారు. సముచిత రీతిలో ఉత్సవాలు నిర్వహించవలసిం దిగా దేశంలోని సంఘశాఖ లన్నిటికి సూచనలు పంపబడినై. ఇందులో అగ్ర గామిగా ఇండోరు శాఖ నగరంలోని వేలాదిమంది పేదలకు అన్న దానం చేసింది.

రెండు దేశాలలోని అల్ప సంఖ్యాకులకు న్యాయం చేకూర్చడానికంటూ, 1950 లో నెహ్రూ - లియాకత్ ఒప్పందం కుదిరింది. ఇది మంచి ప్రయ త్నంగా శ్రీ గురూజీ హర్షించారు. "నెహ్రూ - లియాకత్ ఒప్పందం విఫలం కాకూడదని అభిలషిస్తున్నాను"అన్నారు. ఈ ఒప్పందానికి ప్రత్యామ్నాయాలేవ యినా వున్నాయా అని అడుగగా "ప్రత్యామ్నాయాల గురించి మాట్లాడినందువలన ప్రజల మనస్సులలో సందేహాలు కలగడం తప్ప ప్రయోజనం వుండదు. ఇతర విషయాల గురించి ప్రజలు ఆలోచించడం మొదలు పెట్టారంటే, అది ఒప్పం దపు వైఫల్యానికి తోడ్పడటమే అవుతుంది. అటువంటి పరిస్థితి నేను కలిగించ దలుచుకో లేదు" అని వారు సమాధానం ఇచ్చారు.

లిఖితపూర్వకమైన నిబంధనావళి ఆమోదించక ముందు కూడా ఆర్. యస్. యస్. ఇప్పటి మాదిరిగానే పనిచేస్తుండేది. ఎప్పుడూ కేంద్రీయ కార్య కారీ మండలి వుంటూనే వుండేది. సంఘం నిర్మాణం చేయవలసిన బృహత్కార్యం గురించి ఎప్పటికప్పుడు తీర్మానాలు జరుగుతూనే వుండేవి. అయితే అప్పట్లో లాంఛనప్రాయంగా తీర్మానాలను ఆమోదించటమన్నది ఉండేదికాదు. తర్వాత తర్వాత మాత్రమే మౌలిక జాతీయ సమస్యల మీద క్రమబద్ధంగా ఎప్పటి కప్పుడు తన భావాలను సంఘం ప్రకటించడం ప్రారంభించింది. ఉదాహరణకు

తూర్పు పాకిస్తాన్ (నేటి బంగ్లాదేశ్) లోని హిందువుల భద్రత విషయంలో భారతదేశం తన బాధ్యత తప్పించుకోజాలదని సంఘం ప్రకటించింది. బెరుబరీని పాకిస్తాన్‌కు అప్పగించడం పట్ల అభ్యంతరం తెలిపింది. సింధు జలాల ఒడంబడికలో భారతదేశానికి అన్యాయం జరిగిందని భావించింది. 1965 యుద్ధం తరువాత, ప్రత్యేకించి సరిహద్దు ప్రాంతాలలో ఆస్తి, ప్రాణనష్టాలకు పరిహారాన్ని కోరింది. హాజీపీర్ కశుమ మొదలైన కీలక ప్రాంతాలను పాకిస్తాన్‌కు తిరిగి ఇప్పించిన తాష్కెంటు ప్రకటన పట్ల అసంతృప్తి వ్యక్తం చేసింది. బంగ్లాదేశ్ సంక్షోభం కోటిమంది శరణార్థుల ప్రవాహాన్ని భారతదేశంలోకి పంపినప్పుడు, పాకిస్తాన్‌కు త్వరగా గుణపాఠం చెప్పాలని ప్రభుత్వాన్ని కార్యకారీ మండలి ఒత్తిడి చేసింది.

చైనా విషయంలో, ఆ దేశానికి మనం టిబెట్‌ను కట్టబెట్టినప్పుడే, విద్రోహానికి నాంది పలికినట్లయిందని కార్యకారీమండలి భావించింది. చైనా పాకిస్తాన్‌లు రెండింటిని నిరోధించడానికి, అణుపాటవం పెంపొందించ వలసిన ఆవశ్యకత గురించి పేర్కొన్నది.

రాజ్యాంగం లోని 370 వ అధికరణాన్ని రద్దుచేసి, పాక్ ఆక్రమిత కాశ్మీరును తిరిగి సంపాదించడమే కాశ్మీరు సమస్యకు ఏకైక పరిష్కారమని ప్రకటించింది.

ఈశాన్య భారతదేశం గురించి ప్రస్తావిస్తూ, ముస్లింల ఓట్లకోసం కాంగ్రెసు ఆ ప్రాంతాన్ని ముస్లిం వలస దారులకు బలి చేస్తున్నదనే భయాన్ని వ్యక్తం చేసింది.

గోవా, పాండిచేరి మొదలయిన ప్రాంతాలను మ్యూజియంలోని వస్తువుల మాదిరిగా, విడి విడిగా వుంచడంలో అర్థం లేదని అభిప్రాయ పడింది.

అన్ని భారతీయ భాషలూ జాతీయ భాషలేనని కార్యకారీ మండలి తన అభిప్రాయం వెలిబుచ్చుతూ, ప్రతి భారతీయుడు తన మాతృభాషతో పాటు కనీసం మరొక భారతీయ భాషను నేర్చుకోవాలని కూడ కోరింది. కేంద్ర పబ్లిక్

సర్వీసు కమిషన్ పరీక్షలను గుర్తించబడిన అన్ని భారతీయ భాషలలోను నిర్వ హించాలని కోరింది.

గోసంరక్షణకు మద్దతుగా 1952 లో ఆర్. యస్. యస్. ఒక మహోద్యమాన్ని తలపెట్టింది. తక్షణమే గోహత్యా మీద పూర్తి నిషేధాన్ని విధించాలని కోరుతూ నెల రోజుల ప్రచారకాలంలో దేశమంతటి నుండి 1,75,39,813 సంతకాలను సేకరించింది. సంతకాలు చేసిన వారిలో లక్షలాదిమంది ముస్లిములు కూడా వున్నారు. ఒరిస్సా గవర్నరు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అయిన శ్రీ ఫజల్ అలీ యీ ఉద్యమంలో బహిరంగంగా కృషి చేశారు.

దేశంలో మతకలహాలు జరుగుతుండటం పట్ల కార్యకారిమండలికి ఎంతో బాధకలిగింది. దేశానికి అపకీర్తి, నష్టం కలిగిస్తున్న యిట్టి దురాగతాలను తల పెడుతున్నవారు జాతి వ్యతిరేకులని స్పష్టంచేసింది.

1967 ఎన్నికల ఫలితాలకు ఓటర్లను అభినందించింది. సంయుక్త విధాయక్ దళ్ మంత్రివర్గాల ఏర్పాటును స్వాగతించింది.

1974-75 లో జె. పి. ఉద్యమం ప్రభంజనంగా మారినపుడు, ప్రజల తిరుగుబాటును గుర్తించమని, ఆర్.యస్.యస్.ను నిందించవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. 1977 మార్చిలో జనతా విప్లవం వెల్లివిరిసినపుడు జయప్రకాశ్‌కు నమోవాకాలు తెలిపి, ఆ మహత్తరవిజయానికి బాధ్యులయిన యితర నాయకులను, రచయితలను, కళాకారులను, స్వయంసేవకులను అభినందించింది.

శ్రీ గురూజీ తమ సంభాషణలలోను, బహిరంగ ఉపన్యాసాలలోను వందలకొలది విషయాలమీద విజ్ఞానదాయకమైన వ్యాఖ్యలు చేస్తూ, దేశానికి సరియైన మార్గదర్శనంచేశారు. భారతవర్షానికి సరియైన సరిహద్దులుగా పరిగణించదగినవేవి అని ఈ రచయిత శ్రీ మల్కానీ ఒక మారు అడుగగా శ్రీ గురూజీ యిచ్చిన సమాధానం: "జవాబు యివ్వడం కొంచెం కష్టమే. సరిహద్దులెప్పుడూ గందరగోళంలోనేవున్నాయి. తార్కికంగా ఆఫ్ఘనిస్తాన్‌ను భారత్‌లోభాగంగానే పరిగణించవచ్చు. వేదకాలంనాటి ఆర్యులకు ఆఫ్ఘనిస్తాన్ సంస్కృతి కేంద్రంగా

వుండేది. కౌరవులతల్లి గాంధారి నేడు కాందహార్‌గా పిలువబడుతున్న గాంధారానికి చెందినది. టిబెట్టు, బెలూచిస్తాన్‌లతోసహా హిమాలయ ప్రాంతాలన్నిటినీ కలిపి అక్కడనుంచి దక్షిణంలోని సముద్రాలవరకువున్న భూభాగమంతా భారతదేశమే నని పురాణాలు చెప్తున్నాయి. "ఇరాన్" కూడా "ఆర్యన్" దేశమే. ఇరాన్ చివరి రాజవంశీకులయిన పెహ్లావీలు ఇస్లాంకంటే ఆర్యవాదానికే ప్రాముఖ్యత యిచ్చారు. జెండ్ అవెస్తా దాదాపు ఋగ్వేదమే. ప్రాచీనకాలపు బ్రహ్మదేశమే బర్మా. మహా భారతంలో యుద్ధంలో పాల్గొన్న ఐరావతం (ఏనుగు) యొక్క ప్రస్తావన కని పిస్తుంది. అదే నేడు ఆ్రావదీలోయగా వుంది. రెండువేల సంవత్సరాల క్రిందట మనకు 56 రాజ్యాలు వుండేవి. బెలూచిస్తాన్, బంగ్లాదేశ్‌లవంటి సుదూర భాగాలలో పార్వతియొక్క 51 శరీర ఖండాలు పడినట్లు చెప్పేకథ దేశం యొక్క ఈ ఏక త్వానే ఉద్ఘాటిస్తున్నది."

ఆర్యుల ప్రస్తావన కొందరు దక్షిణాది మిత్రులకు ఆగ్రహం కలిగించే అవకాశం వున్నది గదా అని అడిగినప్పుడు, "నేటి ఆర్య - ద్రావిడ వివాదం యిటీవలే తలెత్తిన అత్యంత కృత్రిమవాదం. ఇదొక ఆధునిక మూఢ విశ్వాసం. స్వచ్ఛమైన జాతులంటూ లేవు. ఈ దేశంలో తొలుతగా నివసించిన జాతిలో వైవిధ్యత ఏదయినా వుంటే అది కాలానికి, పరిస్థితులకు లొంగి నామరూపాలు లేకుండా పోయింది. రెండువేల యేండ్ల క్రిందట పంచగౌడ, పంచ ద్రావిడ విభాగాలుగా దేశం సంఘటితమై వుండేది. దక్షిణాది వారు ఎప్పుడూ ఆర్యులు గానే పరిగణించ బడ్డారు. భారతదేశంలో ఆర్య పదం ఎప్పుడూ సంస్కృతికే సంకేతంగా వుండేది తప్ప, జాతి పేరుగా లేదు. పౌరాణిక సాహిత్యంలో ఎక్కడ చూచిన భార్యలు తమ భర్తలను "హే ఆర్య! అని సంబోధించడం కనిపిస్తుంది. అంత మాత్రాన భార్యలంతా అనార్యులని అర్థం కాదు కదా! ఆర్యుడంటే ఉదాత్త పురుషుడని మాత్రమే అర్థం.

ఉత్తర - దక్షిణాల వివాదం నేటి కాలపు అధికార రాజకీయాల ఎత్తు గడ తప్ప వేరుకాదు. అందరు దేవులను, దేవతలను సమ్మతించి హిందూమతానికి విశాల భూమిక నిర్మించారు - మన ఋషులు. అన్ని సంప్రదాయాల వారిని సమైక్యం చేసే వుద్దేశంతో శివుడు, విష్ణువు, శక్తి, సూర్యుడు, గణపతులను ఆరాధించే పంచాయతన పద్ధతిని రూపొందించారు.

రాక్షసులను నిరుతి గా వ్యవహరించేవారు. అంటే నైరుతి ప్రాంత వాసులు. వారు సముద్రాల్లో (ద్వీపాల్లో) దాగివుండేవారని కూడా చెప్పబడింది. దీనివలన రాక్షసులంటే శ్రీలంక వాసులుగాని లేక దాక్షిణాత్యులుగాని కాదని, మరేదో అన్య ప్రాంత వాసులని స్పష్టమవుతున్నది." అని వివరించారు శ్రీ గురూజీ.

మీ అభిప్రాయాలను ముస్లిం పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్‌లు ఏ విధంగా మన్నించగలరని ప్రశ్నించగా "చారిత్రకంగా మనమంతా ఒకటే. మహాభారత కాలంనుంచి మరాఠాకాలంవరకు ఆఫ్ఘనిస్తాన్ భారత్‌లో భాగంగానే వున్నది. శల్యుడు అక్కడివాడే. మతంపట్ల సరియైన అవగాహన లేకపోవడంవలననే ఒకరి పట్ల ఒకరికి అసహనం పెంపొంది ప్రజలమధ్య మతప్రాతిపదికమీద విభేదాలు ఏర్పడుతున్నాయి. నిజమైన మతం విడదీయదు. వాస్తవము సమగ్రమునైన సహన భావాన్ని తిరిగి నెలకొల్పవలసిన అవసరం ఎంతయినావుంది" అని చెప్పారు.

శ్రీలంకగురించి ప్రశ్నించినపుడు వారి సమాధానమిది. "లంకకు భారత దేశంతో ఎప్పుడూ సన్నిహిత సంబంధాలు వుండేవి. రామ-రావణ యుద్ధాన్ని ఆర్య-ద్రావిడ సంఘర్షణగా కొందరు తలపోస్తున్నారు. నిజానికి దాని స్వభావం వేరు. రావణుడు స్వయంగా గొప్ప సంస్కృత విద్వాంసుడు, శివభక్తుడూను. అతడు సామవేదానికి స్వరకల్పన చేసినట్లుగాకూడ చెప్తుంటారు. అతని తండ్రి విశ్రవసు, తాత పులస్త్యుడు బ్రాహ్మణులే. మహాఅయితే రావణుడు దక్షిణాన్ని కొంచెం పీడించివుండవచ్చు. అతని పీడనుంచి ప్రజలను రాముడు విముక్తం చేసి వుంటాడు. రావణుడు తన అన్న అయిన కుబేరుణ్ని పడత్రోసి సింహాసనం ఆక్రమించుకున్నవాడు".

సింగపూర్ అసలుపేరు 'శృంగపురం'. అంటే కొమ్మునుపోలిన పట్టణం.

ఆఫ్ఘనిస్తాన్ నుంచి ఇండోనేషియావరకు వున్న దేశాలు "ఆసియా సమాఖ్య"గా ఏర్పడవచ్చునని తిలక్ ఆశించినట్లు గురూజీ చెప్పారు.

రానున్న కాలంలో భారత-పాకిస్తానులు తొలుత మిత్రరాజ్యాలుగా, తరువాత ఒక సమాఖ్యగా ఏర్పడి చివరకు ఒకటి అవడం సంభవమని వారు భావించారు.

భారత రాజ్యాంగం "అతుకుల బొంతగా రూపొందించబడినట్లుందని" వారొకసారి వ్యాఖ్యానించారు. తొలుత వున్న పవిత్రత కాస్తా, అదేపనిగా చేయబడిన సవరణలతో, కృశించిపోతున్నదని హెచ్చరించారు.

భారతదేశానికి ఏకాత్మక శాసనమే (Unitary State) శ్రేయస్కరమని, దీనివల్ల పొదుపుతోపాటు, సమైక్యత కలుగుతుందని అభిప్రాయపడ్డారు. అట్టి ఏకాత్మక రాజ్యాన్ని అనేక పరిపాలక విభాగాలుగా విభజించవచ్చు. ప్రదేశాలను నియోజకవర్గాలుగా తీసికొనడంవలన శాసనసభలలో ప్రజలకు సరియైన ప్రాతినిధ్యం ఉండడంలేదని భావించారు. వ్యవసాయమే ప్రముఖంగా వున్న ప్రదేశాల నుంచి ఎన్నికయిన శాసనసభ్యులు వ్యవసాయంగురించి అసలేమీ తెలియనివారు కావడం ఎన్నోమారులు సంభవిస్తున్నదని, కనుక ప్రస్తుతంవున్న ప్రదేశ ప్రాతినిధ్యతకు తోడుగా వృత్తి ప్రాతినిధ్య విధానాన్ని కూడ ప్రవేశపెట్టాలని శ్రీ గురూజీ సూచించారు.

తమకు యిష్టమైన వారికి ఓటువేసి, ప్రచారం చేసుకునే హక్కు స్వయంసేవకులకు వున్నదని వారు చెప్తుండేవారు. 1967లో కాంగ్రెసు అభ్యర్థి జనరల్ తోరట్ కు అనుకూలంగా కొందరు స్వయంసేవకులు పనిచేయగా, మరికొందరు స్వయంసేవకులు అతని ప్రత్యర్థి అయిన కొల్హాపూరు రాజమాత తరఫున పనిచేయడాన్ని ఒక ఉదాహరణగా వారు చెప్పారు. "ఏమయినా సైనికాధికారులు ఏదో పార్టీ టికెట్లమీద పోటీచేయడం నాకు నచ్చదని మాత్రం చెప్పక తప్పదు. వారు మొత్తం దేశానికి చెందినవారు" అన్నారు.

కొందరు స్వయంసేవకులు 1967లో సంయుక్త విధాయక్ దళ్ ప్రభుత్వాలలో మంత్రులయినప్పుడు ఒక విలేఖరి అడిగిన ప్రశ్న : కాంగ్రెసేతర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన రాష్ట్రాలలో ఆర్. యస్. యస్. కార్యక్రమం శరవేగాన్ని అందుకున్నదా?" అని. పిడుగుపడినట్లు వెంటనే శ్రీ గురూజీ సమా

ధానం యిచ్చారు. "ఇది అసంబద్ధమైన ఆలోచన. తన పనికోసం సంఘమెప్పుడూ ప్రభుత్వంమీద ఆధారపడటం జరగలేదు. ప్రభుత్వాలు వస్తుంటాయి, ప్రభుత్వాలు పోతుంటాయి. కాని ప్రభుత్వపు ఆగ్రహానుగ్రహాలకు చలించకుండా, లక్ష్యం సాధించేవరకు సంఘం ముందుకు సాగిపోతూనేవుండాలి. పైగా కాంగ్రెసు వారికి కాంగ్రెసేతరులకు మధ్య సంఘం తేడా చూడదు. ఈ జాతిలో వుంటూ ఈ జాతి కోసమే వుండేవారు ఎవరయినాసరే వారంతా మావారే".

1967లో మంత్రులుగా పదవులు స్వీకరించిన స్వయంసేవకులకు హితవు బోధిస్తూ "భారత దేశపు ఉత్తర రాష్ట్రాలలో చాలమంది మిత్రులు నేడు రాజకీయ అధికార పదవులలో వున్నారు. తాము స్వచ్ఛంగా వుండగలమని, అవినీతికి దాసులం కామని ఎవరూ అనుకోవద్దు. ఎంతవారికైనా అవినీతిలోకి లాగగలశక్తి ఆధికారానికి వుంది. అధికారులు వ్యక్తిత్వానికి గ్రహణంపడితే అ తరువాత ప్రజలకు ముఖం చూపలేని స్థితి ఏర్పడుతుంది. ఇంకా స్త మెరుగయిన వ్యక్తులు వారి స్థానంలోకి వస్తారు.

"ప్రజలకు అవసరమైన సమస్యల గురించి తప్ప, మరి ఏవిధమయిన యితర పనులు చేయించుకొనడానికి ఎవరూ అధికారంలోవున్న మీ మిత్రులవద్దకు ఎన్నడూ పోవద్దని స్వయంసేవక సోదరులకు, స్నేహితులకు మనవి చేస్తున్నాను" అన్నారు.

1965 యుద్ధం అయిపోయి చాలకాలం అయినా యింకా అత్యవసర పరిస్థితిని, డి. ఒ. ఆర్.ను కొనసాగించడంపట్ల అభ్యంతరం వ్యక్తంచేస్తూ........ "మొదట రాష్ట్రాలలో ప్రజాభద్రతా చట్టాలు చాల చేశారు. తరువాత ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాలు చేశారు. గత మూడు సంవత్సరాలకుపైగా దేశరక్షణ నిబంధనలు (**Defence of India Rules**) అమలు చేస్తున్నారు. అసాధారణ అధికారాలు ఎన్ని వీలయితే అన్ని చేజిక్కించుకునే ధోరణి అధికారపక్షంలో కనిపిస్తున్నది. ప్రజాస్వామిక వ్యవస్థలో యిది అంతగా ఆరోగ్యకరమైన పరిస్థితి కాదు.

"ప్రపంచ యుద్దంలో ఇంగ్లాండు పోరాడింది. ఆ సమయంలో డిఫెన్స్ ఆఫ్ రెలమ్స్ చట్టాన్ని చేస్తూ, యుద్ధం ముగిసిన ఆరునెలలకు ఈ చట్టం దానం

తట అదే రద్దవుతుందని ముందుగా ఆ చట్టంలోనే హామీ యిచ్చింది. 1939-1945లో చేయబడిన భారత రక్షణ నిబంధనల చట్టం కూడా సంఘర్షణలు ముగిసిన పిమ్మట, ఆరునెలలకు, దానంతట అదే రద్దు అయింది. అయితే యిప్పటి డి. ఐ. ఆర్. మాత్రం కనుచూపుమేరలో ముగింపు కనిపించకుండా, కొనసాగుతున్నది" అన్నారు.

"శత్రువులున్న దేశం మనది ఒక్కటేకాదు. యుద్ధ భీతితోనే కాలంగడుపుతున్నది. అయితే పోరాటంలేని సమయాల్లో కూడ, అత్యవసర స్థితిని కొనసాగించే చట్టాలున్న ప్రజాస్వామిక దేశం మాత్రం మనది ఒక్కటే" అంటూ ప్రకటన ముగించారు.

శ్రీమతి గాంధి నియంతృత్వపు పోకడల గురించి 1970 లోనే శ్రీ గురూజీ హెచ్చరించారు. బహిరంగ స్థలాలలో ఆర్. యస్. యస్. శాఖల మీద ఢిల్లీ ప్రకటించిన నిషేధం 1930 లో గాంధీ టోపీలు పెట్టుకోనడం మీద గుంటూరులోని యింగ్లీషు కలెక్టరు విధించిన నిషేధాన్ని జ్ఞప్తికి తెస్తున్నదన్నారు శ్రీ గురూజీ.

ఆర్థిక విషయాల పట్ల వారు చేసిన వ్యాఖ్యలలో కూడ ఇట్టి వివేకమే మనకు కనిపిస్తుంది. 1965 లో దుర్భిక్ష పరిస్థితిని వినియోగించుకొని ఆహార ధాన్యాల వ్యాపారులు లాభాలు ఆర్జించడం చూచి డిమాండు - సరఫరాల సూత్రం పేరుమీద ధరలు పెంచిపారేయడంలో న్యాయం లేదని శ్రీ గురూజీ అన్నారు. అది అర్థశాస్త్రం అనిపించుకోదు. అనర్థశాస్త్రం అనిపించుకుంటుంది" అని వారు వ్యాఖ్యానించారు.

'ఋణ సహాయ చికిత్స'కు శ్రీ గురూజీ వ్యతిరేకి. విదేశాలు అందించే సహాయం ఆయా దేశాల ప్రయోజనాలకే తప్ప, మనలను ఉద్ధరించడానికి కాదు అనే వారు. విదేశీయుల ఒత్తిడికి తలఒగ్గి, ప్రభుత్వం రూపాయి విలువ తగ్గించడంపట్ల విచారం వ్యక్తం చేశారు. దుస్తులు, పంచదారవంటి వాటిని తక్కువ ధరలకు ఎగుమతి చేయడం అవివేకమని వ్యాఖ్యానించారు. దేశం యొక్క ఆర్థిక

సమైక్యతను విచ్ఛిన్నం చేసే ఆహార మండలాల ఏర్పాటుకు వారు బద్ధ వ్యతిరేకి. పంజాబు గోధుమలు సంపాదించుకొనడం కంటె అమెరికా గోధుమలు తెప్పించుకొనడం తమకు సులభంగా వున్నదని మద్రాసు ప్రజలు తనతో అన్నట్లు చెప్పారు. ఉత్తరప్రదేశ్ నుంచి తమకు పంచదార, పటిక బెల్లం, ఖాద్యతైలాలు వస్తే తప్ప తాము గోధుమలు వారికి పంపించం అని పంజాబ్ వారు మొండి కేశారు. వస్తువుల స్వేచ్ఛా రవాణా మీద నిర్బంధాలు విధించడం వల్లనే ఇట్టి పరిస్థితి ఏర్పడిందని శ్రీ గురూజీ అన్నారు.

భిలాయి కర్మాగారాన్ని నిర్మించడానికై మేలిరకపు వరి పండే 100 చ మైళ్ళ క్షేత్రాన్ని స్వాధీనం చేసుకొనడం పట్ల విచారం తెలిపారు. అక్కడకు 30 మైళ్ళ దూరంలో వున్న బంజరు నేలకు తరలించడం సులభమని, చేరువ లోనే ముడి ఇనుము కూడా దొరుకుతుందని అన్నారు.

ధాన్యంలో రెండు శాతం రాళ్ళు ఉండవచ్చునని మద్రాసు ప్రభుత్వం అనుమతించడం పట్ల ఆశ్చర్యం ప్రకటించారు. ఇలా కొంచెం సందు యిస్తే దీనిని వ్యాపారులు ఇరవై శాతం రాళ్ళు మేరకు తేలికగానే పెంచగలరని వ్యాఖ్యానించారు.

15 ఎకరాల లోపు భూమి కలిగి వుండటం ఆర్థిక పెత్తందారీతనం కాదని, 30 ఎకరాల లోపు వ్యవసాయం చేయడం ఎవరికీ ఆనందదాయకం కాదని అన్నారు.

రష్యనుల ఉద్దేశాల పట్ల శ్రీ గురూజీ ఎప్పుడూ అనుమానంగానే వుండే వారు. భారత - సోవియట్ మైత్రి ఒప్పందాన్ని రాజకీయ వాదులందరూ గుడ్డిగా సమర్థించడం పట్ల ఆశ్చర్యం వెల్లడించారు. రష్యా సంగతికి వస్తే వారి ఎలుగుబంటి తత్వం ఎలాంటిదో మనకందరికీ తెలుసు. అది ముందు మిమ్మ చక్కిలిగింతలు పెడుతుంది, తరువాత కౌగిలించుకుంటుంది, ఆపైన మీరు ఊపిరి విడిచేదాకా వదలదు. ఎలుగుబంటి వలనే రష్యాకూడ తీయ తీయని మాటలతో మనకు చక్కిలి గింతలు పెడుతూ వచ్చింది. ప్రస్తుతం కౌగిలిలోకి లాగుతుం

మున్నది. ఇక మనకు మూడో దశ ఎప్పుడు రానున్నదో చెప్పలేను" అని హెచ్చరించారు.

పారిశ్రామికంగా పురోగమించిన పాశ్చాత్య దేశాలలో కాకుండా, వెనుకబడిన రష్యాలో మాత్రమే కమ్యూనిజం పెల్లుబుకినపుడు, అది సిద్ధాంత రీత్యా విఫలమయినట్లు తేలిపోయింది. రష్యా తనకు కావలసిన ఆహారాన్నయినా సమకూర్చుకొనలేక పోవడం చూస్తే కమ్యూనిజం ఆచరణలో కూడా విఫలమయినట్లు స్పష్టమవుతున్నది. రెండవ ప్రపంచ యుద్ధం నాటి క్లిష్ట దినాలలో మన పవిత్ర రష్యా, మన తల్లి రష్యా అంటూ స్టాలిన్ ప్రజలను మేలుకొలప యత్నించడం గమనార్హం. కమ్యూనిజం కంటె జాతీయవాదమే మరెంత శక్తివంతమయిన సిద్ధాంతం అని శ్రీ గురూజీ పేర్కొన్నారు.

మన దేశపు కమ్యూనిస్టులు మాస్కో-అనుకూలురుగా, పీకింగ్-అనుకూలురుగా విడిపోయారని, వారిలో భారత్-అనుకూలురు ఒక్కరయినా లేరని శ్రీ గురూజీ విమర్శించారు. బెర్ట్రాండ్ రస్సెల్ "మరణంకన్నా అరుణంమిన్న" (Better Red than dead) అని ప్రతిపాదించడాన్ని శ్రీ గురూజీ పరిహసిస్తూ "పౌరుషానికి బదులుగా నిరాశాతత్వాన్ని ఉద్బోధించే యీాయన ఏమి తత్వవేత్త ?" అని ప్రశ్నించారు. భారత జాతీయవాదానికి పుష్టినిస్తే భారతదేశం చైనా పాకిస్తానులు రెండింటినీ ఎదుర్కొనగలదని వారి నిశ్చితాభిప్రాయం "మనం గనుక సంఘటితంగావుంటే, ఒకటి కాదు, పది చైనాలను పరాజితం చేయగలం" అని ఎన్నోమారులు అంటుండేవారు.

రష్యా కానీ, అమెరికా కానీ భారతదేశానికి సహాయపడజాలవని, స్వయంకృషిలో భారతదేశం తనను తాను సముద్ధరించుకోవాలని వారి ఉద్దేశ్యం.

ప్రత్యేకంగా పంజాబ్ రాష్ట్రాన్ని నిర్మాణం చేయడాన్ని వారు వ్యతిరేకించారు. అయితే పంజాబ్‌లోని మోనాలు (శిఖులు కానివారు) పంజాబీ, జనసంఘ్ హిందీ ఉద్యమాన్ని నడుపుతున్న రోజులవి. వారి వ్యాఖ్యలవల్ల జనసంఘ్ దెబ్బతినవచ్చునని ఒకరు అనగా "నేను దేశమంతా పర్యటించేటప్పుడు జనసంఘ్

గురించి ఆలోచిస్తుంటానని అనుకుంటున్నారా? నా ఆలోచన ఎల్లప్పుడూ జాతి గుర్చి మాత్రమేనని జవాబిచ్చారు.

అతిముఖ్యమైన భాషా సమస్య విషయానికి వస్తే, అన్ని భారతీయ భాషలు వర్ధిల్లవలసిందేనని వారి అభిప్రాయం. అన్ని భాషలూ సమానంగా జాతీయ భాషలేనని, కాని ప్రాంతాలమధ్య సమాచార సంబంధాల దృష్ట్యా మనకు హిందీ వుండాలని చెప్తుండేవారు.

1957 లో యీ రచయితతో వారు అన్నారు: "ఉన్నత విద్యాభ్యాసం, పరిశోధనలకోసం మనందరికీ ఒకే సామాన్య భాష ఉండాలనే విషయంలో నాకు మరో అభిప్రాయం లేదు. ఇందుకు తొలిమెట్టుగా సంస్కృతజన్యమైన సమాన సాంకేతిక పదాల నిర్మాణానికి మనం పూనుకోవాలి. పవిత్ర గ్రంథాలతోవున్న నిత్యానుభవం దృష్ట్యాను, శబ్ద సంపన్నత దృష్ట్యాను మనకు ఒకే బోధనాభాషగా సంస్కృతం ఉపయోగపడగలదని భావిస్తున్నాను. సంస్కృతంలో నిత్య వ్యవహారానికి అవసరమైన పరిజ్ఞానం సంపాదించడం ఎంతో తేలిక. ఈ విధమైన సామాన్యభాష అంటూలేకపోతే ప్రాంతాల మధ్య సంబంధాలకు అవకాశం లేక దేని దారి అదే విడిపోయే ధోరణులు తలెత్తుతాయి. జాతీయ సమైక్యతకోసం సంస్కృతం మనకు తప్పనిసరి.

"ఈ విషయంలో హిందీకూడా ఉపయోగకరమే. సగానికిపైగా జనాభా అర్థం చేసుకొనగలగడం దీనికివున్న అదనపు ప్రయోజనం అయితే సంస్కృతం వలె కాకుండా కేవలం ప్రాంతీయభాష అయివుండటం దీని అనర్హత. సంపన్నతనుబట్టి, సాహిత్య విలువనుబట్టిచూస్తే సంస్కృతంతో యిది సరిపోలదు.

"పైగా యితర ప్రాంతీయభాషలకంటె హిందీ ప్రాచీనమైనదికాదు. వాటిలో కొన్ని దీనికంటే సుసంపన్నంగా వున్నాయి 2500 సంవత్సరాల క్రిందటనే తమిళం గొప్ప కావ్య భాషగా వుండేది. కనుక మిగతా భాషలకంటే హిందీ ఏదో గొప్పదయినట్లు వాదించడంలో పసలేదు. మన భాషలన్నీ సమానంగానే జాతీయభాషలని నా అభిప్రాయం. ఇవన్నీ సమానంగానే మన జాతీయ పరంపరాను గతమైన సంపద. వీటిలో హిందీ కూడా ఒకటి. కాని సంఖ్యాగతంగా హిందీ మాట్లాడేవారు ఎక్కువగనుక దీనిని రాజ్యభాషగా స్వీకరించడం జరిగింది.

హిందీ మాత్రమే జాతీయ భాష అని, మిగతావి ప్రాంతీయభాషలని పేర్కొనడం పొరపాటవుతుంది."

కొంత కాలం క్రిందట డా॥ సి.పి. రామస్వామి అయ్యర్ న్యూ ఢిల్లీలో ఒక బహిరంగసభలో ప్రసంగిస్తూ హిందీని అపహాస్యంచేశారు. హిందీలో రెండుగొప్ప గ్రంథాలున్నాయని-ఒకటి 'తులసీదాస్ రామాయణం' కాగా "రైల్వేటైంటేబులు" అని ఆయన అన్నారు. డా॥సి.పి. చెప్పిన విషయాన్ని అదే సభలో సర్దార్ పణిక్కర్ పునరుద్ఘాటించారు.

దీనిపై వ్యాఖ్యానిస్తు శ్రీ గురూజీ యిలా అన్నారు: "హిందీ భాషోన్మాదుల వైఖరి ఎంత తప్పో, యీ దోరణికూడా అంతే తప్పు. హిందీ తెలియని వారు మాత్రమే అ విధంగా అపహాస్యంచేస్తారు. కొంత కాలం క్రిందట ప్రముఖ మరాఠీ నాటక రచయిత రామ్‌గణేశ్ గడ్కరీ ఒక పాత్రచేత యిలా వ్యాఖ్యానింప జేశాడు: 'దక్షిణాది వారిభాష ? ఒక రేకుడబ్బాలో కాసిని గులకరాళ్లు వేసి దానిని వేగంగా, పలురకాలుగా ఆడించండి, ఆ భాషలు మీకు వినిపిస్తాయి.' ఇదంతా వినోదం కోసంచేసిన వ్యాఖ్య అనటంలో సందేహంలేదు. కాని యిలాంటి బేధభావాలను రేకెత్తించే వినోదం దేశానికి మంచిదికాదు. అవివేకపు, అపహాస్యాలకు స్వస్తి చెప్పాలి."

హిందీ వ్యాప్తి చెందితే తమ మాతృభాష మట్టిలో కలుస్తుందని కొందరు అనుకుంటుంటారు. వారి భయాలను పోగొడుతూ శ్రీ గురూజీ "ఆ విధంగా జరుగుతుందని నేను అనుకోను. ఇంగ్లీషు విజృంభించిన కాలంలో కూడ బెంగాలీ, తమిళం, మరాఠీ, తెలుగు భాషలు అభివృద్ధి సాంధించగలిగినై. హిందీ వ్యాప్తి చెందితే యీ భాషలు కూడ మరింత వృద్ధిచెందుతాయి, వీటిలో హిందీకూడ సంపన్నమవుతుంది. బెంగాలీ భాష హిందీగా మారిపోతుందని బెంగాలీలు ఎందుకు భయపడాలి ? గత 20 సంవత్సరాలుగా బెంగాలీ ఉర్దూగామారుతూవచ్చింది. 'ఉదయం' అనడానికి 'ప్రభాత' అనడంపోయి 'ఫజర' అనడం ఎక్కువయిపోయింది. ఈ విషయంలో బెంగాలీలు యింతవరకు అభ్యంతరం చెప్పలేదు. మరి వారికి హిందీ అంటే అంత సరిపడకపోవటం దేనికో ?

"ఉర్దూ అంటే నాకేమీ వ్యతిరేకతలేదు. వివిధభాషలలో సహజంగా చోటుచేసుకున్న అన్యపదాలన్నా నాకు వ్యతిరేకతలేదు. మరాఠీని శుద్ధిచేయాలని

కొంతకాలం క్రిందట వీరసావర్కార్ ప్రతిపాదించారు. సాధారణ వ్యవహారంలో వున్న ఉర్దూ పదాలను సంస్కృత తత్సరూపాలను రూపొందించారు. 'జరూరీ' అని వున్నచోట 'ఆవశ్యక్' అనాలన్నారు. అయితే "అన్ని వున్నచోట" అనడానికి "ఎవజీ" అనే ఉర్దూ పదాన్నే ఆయన వాడవలసివచ్చింది. కనుక నా అభ్యంతరం మల్లా ఒకపథకం ప్రకారం చొప్పించబడుతున్న విదేశీ పదాలకేతప్ప, సహజంగా కలిసిపోయిన పదాలకు కాదు.

"అమధ్య మధురలోని ఒక న్యాయవాది నాతోమాట్లాడుతూ హిందీ వల్ల తమిళం దెబ్బతింటుందని అన్నాడు. ఏవిధంగా అనిఅడిగితే వివరించలేకపోయాడు. జిల్లా కోర్టులో తమిళం ఉపయోగించవచ్చునని అనుమతివున్నా మీరు ఇంగ్లీషు వాడటానికి కారణమేమిటని అడిగాను. దీనికి కూడ ఆయన సమాధానం చెప్పలేక పోయాడు. తమిళానికి శత్రువు హిందీ కాదని, యీ రెండు భాషలకు యింగ్లీషే శత్రువనటం సముచితమని ఆయనతోచెప్పాను."

మాతృభాష, హిందీ, సంస్కృతం, యింగ్లీషు-నాలుగు భాషలు నేర్చు కొనడమంటే తలప్రాణం తోకకు వస్తుందని, విద్యార్థి కాలమంతా దీనికే సరిపో తుందని చాలామంది అభిప్రాయపడుతుంటారు.

దీనిపై శ్రీ గురూజీ "అది నిజమే, కాని యీ నాలుగింటిలో యింగ్లీషును మనం వదిలించుకోవచ్చు. ఇంగ్లీషును నిర్బంధం చేయరాదు. ప్రస్తుతపు గందర గోళం తగ్గడం, చివరకు సమసిపోవడం జరుగుతుంది. కాని యిది జరగాలంటే ప్రభుత్వం దృఢమైన నిర్ణయాన్ని తీసుకొని దానికి కట్టుబడాలి. త్వరగా దాన్ని అమలుచేయాలి. ప్రస్తుతం ప్రభుత్వం ఏ నిర్ణయానికి రాలేకపోయినందున ఇంగ్లీ షనే బలపరిచినట్లవుతున్నది. వెనుకటి కాలంలోకంటె యీనాడు మరింత ఎక్కువ మంది పిల్లలు యింగ్లీషు మీడియం స్కూళ్ళకు పోతున్నారు. వెనుకటి మధ్య ప్రదేశ్‌లోని విద్యాశాఖ అన్ని వ్యవహారాలు హిందీ, మరాఠీలలోనే నిర్వహిస్తుం డేది. కాని సంయుక్త మహారాష్ట్ర నిర్మాణం జరిగిన తరువాత నాటి మధ్య ప్రదేశ్‌లోని మరాఠీ ప్రాంతాలలో యింగ్లీషు వాడకం మొదలయింది!

"బొంబాయిలోని హైస్కూలు విద్యార్థులను సైన్సుకావాలో, సంస్కృతం కావాలో ఎన్నుకోమంటున్నారు. మంచి విద్యార్థులంతా సహజంగానే సైన్సు కోరు

కొనడం-కొంతమంది బాలికలు మాత్రమే సంస్కృతం చదవడానికి మిగలడం జరుగుతున్నది. ఈ రకమైన ఎంపిక విధానం మంచిదికాదు. సైన్సునూ, సంస్కృతాన్ని రెండింటినీ విద్యార్థి అధ్యయనంచేయాలి. సంస్కృత విద్యాభ్యాసంలోని జాతీయ సమైక్యతా ప్రయోజనాన్ని ఎవరూ గుర్తిస్తున్నట్లులేదు" అని వ్యాఖ్యానించారు.

హిందీ ప్రాచుర్యంపొందితే హిందీ మాతృభాషగావున్నవారితో సమానంగా రాణించలేక హిందీయేతరులు నష్టపోతారని కూడ చెప్పబడుతున్నది. దీనికి శ్రీ గురూజీ ప్రత్యుత్తరం యిస్తూ, "ఈ అభ్యంతరానికి కారణం అపార్థమేనని చెప్పవచ్చు. వాస్తవమేమిటంటే 'హిందీ'గా పరిగణనపొందిన ఖారీ-బోలీ భాష ఢిల్లీ-మీరట్ ప్రాంతంలోని కొద్దివేలమందికి మాత్రమే మాతృభాషగావుంది. 'హిందీవాళ్లు'గా చెప్పబడుతున్న మిగతావారిలో చాలమంది తమ యిళ్ళలో 'ఖారీ బోలీ' మాట్లాడరు. పహారీ, రాజస్థానీ, అవధీ, మాగధీ, బ్రిజ్, భోజ్‌పురి, మైథిలి మొదలైన వేరువేరు భాషలు వారు మాట్లాడుతారు. ఒక బెంగాలీవ్యక్తిగాని, మహారాష్ట్రీవ్యక్తిగాని, లేక ఆంధ్రుడో, మళయాళీయో ఏవిధంగా హిందీ నేర్చుకొనవలసి వున్నాడో ఆ 'హిందీవాళ్ళు'కూడ అలాగే హిందీ నేర్చుకొనవలసినవాళ్ళే!"

అధికారభాష బిల్లుపైన శ్రీ గురూజీ అభిప్రాయమేమిటి? ఇంగ్లీషునుంచి హిందీకి మారే విషయంలో ప్రతి రాష్ట్రానికి యీ బిల్లు వీటో అధికారం యిచ్చింది. అందుపై శ్రీ గురూజీ వ్యాఖ్యానిస్తూ "ఈ ప్రకారంగానే ప్రతి పౌరుడికి వీటో అధికారం ఎందుకు యివ్వకూడదు? కొద్దిమంది వ్యక్తులు బహు సంఖ్యాకుల మీద ప్రయోగిస్తున్న క్రూరత్వమిది. భారతీయ వాణిజ్యవేత్తల ఆధ్వర్యంలో వున్న యింగ్లీషు పత్రికలు భారతీయ భాషలపట్ల యింత విద్వేషాన్ని కలిగివుండటం నాకు చాల ఆశ్చర్యం కలిగిస్తున్నది. విదేశీ సంస్థలతో వీరి వాణిజ్య సహకార సంబంధాలకు యిదికూడా దోహదం చేసేతీరు కాబోలు" అని విమర్శించారు.

ముస్లిం భారతీయుల విషయంలో శ్రీ గురూజీకి స్పష్టమైన అభిప్రాయాలు వుండేవి. తమ మతాన్ని వారు పాటించడానికిగాను, తమ సాంస్కృతిక వ్యక్తిత్వాన్ని పరిరక్షించుకొనడానికిగాను ఎవరికీ అభ్యంతరం వుండనక్కరలేదు. కాని ఈ దేశాన్ని, ఇక్కడి పరంపరను మాత్రం అసందిగ్ధంగా వారు గౌరవించాలి.

'సెక్యులరిజం' గురించి మాట్లాడేవారు ముందుగా అదంటే ఏమిటో స్పష్టంగా నిర్వచించాలని శ్రీ గురూజీ అనేవారు. అన్ని మతాలపట్ల సమానమైన మన్నన నెరపడమే సెక్యులరిజం అయితే, అందుకు వారు పూర్తి సమర్థన యిస్తారు. అలాకాక అన్నిమతాలపట్ల ఒకే విధమైన అగౌరవాన్ని చూపడం, ఒక మతంమీద మరొకమతం దాడిచేయడం అయితే దానిని వారు పూర్తిగా వ్యతిరే కిస్తారు. 'సెక్యులర్' అనే మాటకు డిక్షనరీలో యివ్వబడిన అర్థంయిది-"ప్రస్తుత ప్రపంచమునకు సంబంధించినది; లేక ఆధ్యాత్మికము కానివాటికి సంబంధించినది; పౌరసంబంధితము; సామాన్యము ! మతమునకు చెందనిది; మతాల నిబం ధనలకు విబంధమైనది"-ఈ యూరోపియను భావన వెనుక కొంత చరిత్రవుంది. పదిహేనవ శతాబ్దంవరకు సామాన్యమైనవికాని, మత సంబంధమైనవికాని-అన్ని విషయాలమీద చర్చిదే పెత్తనంగా వుండేది. తర్వాత పునరుజ్జీవనం వచ్చింది. ప్రాచీన గ్రీసును గురించిన క్రొత్త అవగాహన, దానివలన పెల్లుబికిన నవీన ఉత్తేజము-అదే 'పునరుజ్జీవనం'. స్వర్గానికి భూమికి నడుమ రోమన్ చర్చికంటె గొప్పగా పరిగణించదగిన యితర అంశాలు కొన్ని వున్నాయని ప్రజలు గ్రహిం చారు. దీనితో 'సంస్కరణ'కు దారి ఏర్పడింది. చర్చి సంస్కరించబడింది. లూథర్, కాల్విన్ వచ్చారు. చర్చిమాత్రం అటు 'పునరుజ్జీవనాన్ని' తనలో యిముడ్చుకొనడంగాని, లేక 'సంస్కరణకు' అనువుగా మార్పు అంగీకరించడం గాని జరగలేదు. ఫలితంగా చర్చికి, ఉత్తేజంపొందిన ప్రజలకు మధ్య అగాధం ఏర్పడింది.

సరిగా యీ కాలంలోనే ఐరోపాలోని ఫ్యూడల్ వ్యవస్థ రాచరికంగా పరిణమించింది. అన్ని విషయాల్లోను చర్చివారి అజమాయిషీకి తలలూపే స్థితిలో లేరు-రాజులు. అఖిల ఐరోపా రోమన్ చర్చికి భిన్నంగా జాతీయ చర్చీల ఏర్పా టుకు రాజులు ప్రోత్సాహమిచ్చారు. వీటన్నిటికిమించి వైజ్ఞానిక విప్లవం అడుగు పెట్టింది. చర్చిలోని మూఢనమ్మకాలన్నటిని సైన్సు వమ్ముచేసింది.

ఈ పరిస్థితిలోనే ఐరోపాలో అనేకచోట్ల చర్చి, రాజ్యం అనేవి వేరుపడ టం జరిగింది. అయినా ప్రభుత్వమే మతాచార్యులను నియమించి వేతనాలు యిస్తుండటంవలన ఇంగ్లండులో మాత్రం యింకా "ప్రతిష్ఠిత చర్చి" (Established Church) నిలిచేవుందని శ్రీ గురూజీ పేర్కొంటూవుండేవారు. ఎనిమిదవ ఎడ్వర్డు

పదవిని పొందలేకపోవడానికి కారణం అతడు మిసెస్ సింప్సన్‌ను వివాహమాడ దలచడం మాత్రమేకాదు. ఆవిడ కాథలిక్ అయివుండటమే చర్చికి మరింత అభ్యం తరకరమైన విషయం.

"భారతదేశపు పరిస్థితి యిందుకు పూర్తిగా విభిన్నమైనది. హిందూ ధర్మం వట్టి మూఢనమ్మకాల ప్రోగుకాదు. అదొక ధార్మినిక అనుభూతి. ఆధ్యా త్మికత లోతులను తరిచి చూడడానికై హిందువులందరికి పరిపూర్ణమైన స్వేచ్ఛను వారి ధర్మం యిస్తుంది. కనుకనే బుద్ధుడు, మహావీరుడు, గురునానక్ వంటివారి సంస్కారణోద్యమాలు ఆగ్రహపూరితమైన నిరసనోద్యమాలుగా మారలేదు. హిందూఆలోచనను, జీవనాన్ని అవి మరింత సుసంపన్నం చేసినై.

"పిడివాదాలు లేనందున మీరు ఒకే దేవునిలో నమ్మకముంచినా అసలు దేవుడేలేడన్నా వేలాదిమంది దేవతలున్నారని విశ్వసించినా మీరు హిందువుగానే వుంటారు. సైన్సు భగ్నంచేయగలిగిన మూర్ఖవాదాలు హిందూ ధర్మంలో లేనేలేవు లేకపోగా, కొన్ని హిందూభావనలను సైన్సు ధృవీకరించినట్లు కనిపిస్తున్నది. భారతం సచేతనంగా కొనసాగుతూనేవచ్చింది. కనుక దానినిగురించి క్రొత్తగా వాస్తవాలు బయటపడటంగాని, ఆ వాస్తవాలవల్ల మన అసమగ్రపు వర్తమాన స్థితి డోలాందోళనలో పడటంగాని జరిగే అవకాశమేలేదు. మనకు వ్యవస్థితమైన మతపీఠం (Organised Church) అంటూ లేదుకనుక హైందవభారతంలో రాజ్యము, మతవ్యవస్థలు ఒకదానిని ఒకటి లోబరుచుకునే ప్రయత్నాలు ఎన్నడూ జరగలేదు. ఎప్పుడూ పరస్పర సహకారమేవుందితప్ప సంఘర్షణ చెలరేగే పరిస్థి తులు మనకు కలుగలేదు.

"ఈ పరిస్థితిలో మత వ్యతిరేకమైన సెక్యులరిజంగాని, నిస్సారమయిన సెక్యులరిజంగాని భారతదేశానికి అనుగుణ్యంగా వుండదు. రాజ్యానికి కొంత నైతిక సలహా లభిస్తూవుండాలని మాత్రమే హిందుత్వం ఆశిస్తుందికాని, తక్కిన విషయాలలో రాజకీయము, మతము తమతమ క్షేత్రాలలో సార్వభౌమికంగానే వుండాలని కోరుతుంది.

కనుకనే ముస్లిములు ఇస్లామును అనుసరించినా, తమ ప్రత్యేక అస్తిత్వా న్ని నిలుపుకున్నా మనకు అభ్యంతరంలేదు. 1972 లో న్యూ ఢిల్లీలో దీనదయాళ్

పరిశోధనా సంస్థకు ప్రారంభత్స్వం చేస్తూ-రాజ్యాంగ విధానానికి సంబంధించిన ఆదేశిక సూత్రాలలో చెప్పబడిన ఒకే న్యాయచట్టం పర్తింపజేయకుండా ముస్లిం న్యాయచట్టాన్ని ప్రత్యేకంగా కొనసాగించవచ్చునని వరకు శ్రీ గురూజీ వెల్లారు.

ఒకే న్యాయచట్టంవలన జాతీయ సమైక్యత పెంపొందుతుంది గదా అని తరువాత అడుగగా: "జరుగేతీరుతుందని అనలేము. భారతదేశంలో అనంతమైన వైవిధ్యత ఎప్పుడూ వుంటున్నదే. అయినా అనేక యుగాలుగా మనం శక్తివంతమైన సమైక్యమైన జాతిగా నిలిచాం. సమైక్యత కోసం సామరస్యంకావాలిగాని ఏకరూపత కాదు" అని జవాబిచ్చారు.

పాశ్చాత్యదేశాలలో శాసనాల ఏకీకరణ ద్వారా, నెపోలియన్, జాతుల ఏకీకరణను సాధించిన విషయం గుర్తుచేయగా శ్రీ గురూజీ యిలా అన్నారు: "చరిత్రదృష్ట్యా, నాగరికతదృష్ట్యా యూరోపు యింకా బాల్యావస్థలోనే వున్నదన్న విషయం మరువకండి. యూరోపు నిన్న వుండేది కాదు. రేపు వుంటుందని చెప్పలేము. అతిగా మూసపోసినట్లు వుండే విధానాలను ప్రకృతి భరించదని నా అభిప్రాయం. ఏకరూపతవలన పాశ్చాత్యనాగరికత రానున్న కాలంలో ఏమవుతుందో యిప్పుడే చెప్పలేము. ఇక్కడ ఇప్పుడు-అనిమాత్రమే కాక ప్రాచీన చరిత్రలోనికి, సుదూర భవిష్యత్తులోకి కూడ మనం చూడగల్గాలి. ఎన్నో చర్యలవలన చరిత్రలో చాల ఆలస్యంగాను, పరోక్షంగాను పరిణామాలు సంభవించినై. ఈ దేశంలో మనకు లక్షల సంవత్సరాల అనుభవం వున్నది. అన్ని కాలాలకు నిలిచిన జీవన విధానం మనది. వైవిధ్యత, ఏకత్వం అనేది కలిసివుండగలవని, మన అనుభవం చెప్తున్నది."

తమ ప్రత్యేక అస్తిత్వాన్ని నిలుపుకొనడం కోసం మాత్రమే ముస్లిములు సమానన్యాయచట్టాన్ని వ్యతిరేకిస్తున్నారు కాదా? అని ప్రశ్నించినపుడు-"తమ ప్రత్యేక వ్యక్తిత్వాన్ని నిలుపుకొన దలిచిన ఏ వర్గంతోను, పంథాలోను నాకు తగాదాలేదు. అయితే ఆ ప్రత్యేకత వలన వారు దేశప్రేమకు దూరంకావడం జరుగకూడదు. ముస్లింలు నలుగురు స్త్రీలను వివాహం చేసుకునే హక్కు వున్నందున వారి జనాభా అనుచితమైన నిష్పత్తిలో పెరిగిపోతుందేమోననే భయంవలననే, కొందరు, సమానన్యాయశాసనం కోసం పట్టుపడుతున్నారు. సమస్యకు యిది వ్యతిరేకాత్మక దృక్పథంతో సూచించబడుతున్న పరిష్కారమని నాకనిపిస్తున్నది.

"అసలు సమస్య ఏమంటే హిందూ-ముస్లిముల మధ్య సహోదర భావన లేక పోవడం. లౌకిక వాదులమని చెప్పుకునేవారు కూడ ముస్లింలను ప్రత్యేక వర్గంగా భావిస్తున్నారు. ముస్లిం వర్గపు ఓట్లను కొల్లగొట్టుకొనడానికి వారిని బుజ్జగించటమే 'లౌకికవాదుల' పద్ధతి. ఇతరులు కూడా వారిని ప్రత్యేకంగానే భావిస్తున్నారు కాని, వారి ప్రత్యేక అస్తిత్వాన్ని లాగివేసి ఏ ప్రాముఖ్యం లేకుండా చేయటం వీరి ఉద్దేశం. ముస్లింలపట్ల లౌకికవాదులుగాని, యితరులుగాని చూపుతున్న యీ రెండు రకాల దృక్పథాలలో అట్టేతేడాలేదు. ఎందుకంటే వారు, వీరు కూడ ముస్లింలను ప్రత్యేక వర్గంగాను, యిమిడిపోలేనివారుగాను భావిస్తున్నారు.

"మా దృక్పథం యిందుకు పూర్తిగా విభిన్నమైనది. ఈ దేశాన్ని, దీని సంస్కృతిని ప్రేమిస్తున్నంత వరకు ముస్లింలు తమ జీవన విధానన్ని అనుసరించడం అంగీకారయోగ్యమే. ముస్లింలను తప్పుదారి పట్టించడంలో రాజకీయవాదులదే పూర్తి బాధ్యత. కేరళలో ముస్లింలీగు పునరుజ్జీవనం పొందడానికి, తద్వారా దేశవ్యాప్తంగా ముస్లింల మతోన్మాదం పెరగడానికి కాంగ్రెసే కారణమయింది." అని శ్రీ గురూజీ అన్నారు.

1950-ఆ ప్రాంతాలలో ఒక ఉర్దూకాలేజికి చెందిన అయిదుగురు మౌల్వీలు చిదంబరంలో శ్రీ గురూజీని కలుసుకున్నారు. వారిలో సంభాషిస్తు శ్రీ గురూజీ- "భగవంతుడు ఖురానును మాత్రమే యిష్టపడతాడని' గీతను ద్వేషిస్తాడని మీ నమ్మకమా ? 'అల్లా' అని పిలిస్తేనే ఆయన మీవద్దకు వస్తాడని, 'రామా !' అని పిలిస్తేరాడని మీ నమ్మకమా ? దేవుడికి ఉర్దూతప్ప మరో భాష తెలియ్యదని మీరు అనుకుంటున్నారా ?"

"తనకు నచ్చిన రీతిన తనకుయిష్టమైన రూపాన్ని ప్రతివ్యక్తి ఆరాధించవచ్చునని హిందువులమైన మీ నమ్మకం. ప్రయత్నంలో చిత్తశుద్ధి, నిజాయితీ వుంటే ప్రతిఒక్కరు భగవంతుని చేరుకొనగలరు. అందుకే హిందూ ధర్మం మతాంతరీకరించే మతంకాదు. నాదొక్కనిదే 'నిజమైన' విధానమని, యితరులందరు యీ దారిలోకి వచ్చితీరాలని భావించడంలోనే, మతంమార్పిడి చేయాలనే ఆలోచన పుడుతుంది." అని వారితో అన్నారు.

"కాని హిందువులుకూడా యిప్పుడు ముస్లింలను, క్రైస్తవులను మతం మార్పిడి చేస్తున్నారుగదా" అని ఒక మౌల్వీ ప్రశ్నించాడు. శ్రీ గురూజీ జవా

బిస్తూ 'హిందూధర్మంలోకి మతంమార్పిడి అనేది లేనేలేదు. గతంలో పరిస్థితుల ప్రోద్బలంవల్ల తమ నమ్మకాన్ని మార్చుకున్నవారిని, తిరిగి వారి పూర్వీకుల విశ్వాసానికి మరలివచ్చే అవకాశాన్ని కల్పించడంమాత్రమేఅది. బయటినుంచి మనదేశానికి వచ్చిన ముస్లింలు వ్రేళ్ళమీద లెక్కపెట్టదగినవారేననడం నిజం కాదా ? తతిమావారంతా మతంమారడానికి కారణాలు అందరికీ తెలిసినవే. మన పూర్వీకుల విశ్వాసాన్ని తిరిగి అవలంబించడానికివస్తే, అది మతాంతరీకరణం కానేకాదు. అది పునరాగమనంమాత్రమే"అని వివరించారు.

కొన్ని సంవత్సరాలపిమ్మట, 1971లో అరబ్బీ విద్వాంసుడు, పత్రికా రచయిత అయిన డా॥ సయిఫుద్దీన్‌జీలానీతో కలకత్తాలోమాట్లాడుతూ శ్రీగురూజీ యిలా చెప్పారు : నేడు పాకిస్తాన్‌గా చెప్పబడుతున్న ప్రదేశంలో జన్మించిన పాణినియొక్క 5000వ జయంత్యుత్సవాలను పాకిస్తాన్ నిర్వహించింది. తమ విఖ్యాత పూర్వజులలో పాణిని ఒకరని పాకిస్తాన్ అంగీకరించగాలేనిది యిక్కడి మన హిందూముస్లిములు (వారిని "హిందూముస్లిములు" అనే నేనంటాను)పాణిని, వ్యాసుడు, వాల్మీకి, రాముడు, కృష్ణుడు మొదలయినవారిని తమ విఖ్యాత పూర్వజులుగా ఎందుకు అంగీకరించకూడదు ? రామ, కృష్ణాదులను మత నాయకులుగా భావించనక్కరలేదు, రుస్తుంసొహ్రాబ్‌లను యిరానీయులు గౌరవించినట్లుగా వట్టినాయకులుగా పరిగణించాలి''.

హిందువులతో, హిందూస్తాన్‌తో పార్శీలు ఏ విధంగా కలిసిపోయారో, వారినిచూచి ముస్లింలు నేర్చుకొనాలని శ్రీ గురూజీ సలహాయిచ్చారు. లేకుంటే నెహ్రూవంటి గొప్ప లౌకికవాదులుకూడ తమ సహనాన్ని కోల్పోగలరు. నెహ్రూ మాటలేయివి: 'లౌకికరాజ్యంగురించి నేను మాట్లాడుతున్నానంటే దానిఅర్థమేమిటి? మద్రాసులో ముస్లింలీగుకుచెందిన ఫలానామనిషి ఒప్పుకోనంతమాత్రాన మన సాంస్కృతిక వ్యవస్థలకు తిలోదకాలిస్తామా ? అతడు యిక్కడనుంచి వెళ్ళిపోవాలి. ఎంత త్వరగాపోతే యీ దేశానికి అంత మంచిది. భారతదేశంలోని ముస్లింలు యింకా ఆ వెనుకటి ముస్లింలీగుసిద్ధాంతాలనే నమ్ముకుంటూవుంటే, వారికి పాకిస్తానే పితృభూమి, మాతృభూమి మరింక ఏదయినా. భారతదేశం మాత్రం వారిదికాదు. ఖలీనుజ్జమాలకు, సుహ్రావర్దీలకు, లారీలకు భారతదేశంలో స్థానంలేదనిమాత్రం నేను నిస్సంశయంగా చెప్పగలను"

అరేబియారాజు సవూద్ భారతదేశాన్ని సందర్శించినపుడు యిక్కడి ముస్లింలయోగక్షేమాల గురించి నెహ్రూను అడిగితే వారిని యిక్కడ బాగానే చూస్తున్నామని నెహ్రూ హామీయిచ్చారు. దానిపై శ్రీ గురూజీ ఆశ్చర్యం వెలిబుచ్చారు. "ముస్లింభారతీయులు భారతజాతీయులా లేక సవూదీ సంతానమా? అసలు సవూద్అడగటందేనికి - నెహ్రూ జవాబివ్వటం దేనికి ?"

1950లలో మద్రాసు భారతీయజనసంఘ అధ్యక్షులయిన బారిస్టర్ వి. వి. జాన్‌గారి ఆదర్శాన్ని గురించి ఎన్నోమార్లు చెప్తుండేవారు. తమిళనాడులో చక్కని మార్గదర్శనంచేసినవ్యక్తి శ్రీ జాన్. కొందరు పెద్దలతో కలిసి శ్రీ జాన్ ఒకమారు శ్రీ గురూజీని చూడటానికివచ్చారు. "తనను మద్రాసు రాష్ట్ర జనసంఘం అధ్యక్షపదవికి ఆహ్వానించినట్లు శ్రీ జాన్ నాతో అన్నారు. నేను ఎంత తీవ్ర హిందువునో శ్రీ జాన్‌కూడా క్రైస్తవంలో అంత తీవ్ర విశ్వాసంవున్న వ్యక్తి. జనసంఘం ఆర్.యస్.యస్.వారి ప్రాబల్యంలో వున్నదనే ఆరోపణ గురించి మీకు తెలుసునా అని ఆయనను అడిగాను. అందుకు శ్రీ జాన్ యిలా సమాధానంయిచ్చారు : "ఏమయినా యిది హిందూరాష్ట్రమేకదా. ఈ పచ్చినిజాన్ని ప్రతి ఒక్కరూ ఒప్పుకొనవలసిందే. కనుకనే బాగాఆలోచించి యీ పదవిని అంగీకరించాలనే నిర్ణయించుకున్నాను". హిందూరాష్ట్రాన్ని గురించి మాకున్న అభిప్రాయంకూడా సరిగాయిదే."

సునిశితమైన ఛలోక్తులు

జాతి సమైక్యత, అఖండత్వం, స్వాతంత్ర్యం, దేశపు రాజ్యాంగం, దేశ రక్షణ, విదేశాంగనీతి, భాషావిధానం, ఆర్థిక పరిస్థితి వంటి క్లిష్ట సమస్యల వరకు మాత్రమే గురూజీ పరిమితులై వుండలేదు. వారి నిశిత పరిశీలనకు, చలాకీ వ్యాఖ్యలకు ఏ విషయమూ దాటిపోయినది కాలేదు; అల్పమైనదీ కాలేదు.

హిందూ కోడ్ బిల్లును ఆమోదించినపుడు దాని అంతర్యాన్ని గురించి మాత్రమే వ్యాఖ్యానించారుకాని ఏ ప్రత్యేక అధికరణం పట్ల అభ్యంతరం తెలుపలేదు. మనుస్మృతిలో వున్న ప్రాచీన సంబంధాలను హిందూ న్యాయశాస్త్రం తెగతెంపులు చేసుకొనవలసిన అవసరమేమి వచ్చిందో తనకు అర్థం కావటం లేదన్నారు. ఏదిఏమైనా సగటు ప్రజలకు మాత్రం "ఆచారమే అధిపతి"గా వుంటుందని అన్నారు. యుగయుగాలుగా న్యాయనిబంధనలు అసంఖ్యాకంగా మనం రూపొందించుకున్నాం– ఆ విషయంలో మాత్రం మనమెప్పుడూ వెనుకబడి లేము– ఇటీవలి వరకు కేరళలో మాతృస్వామ్య వ్యవస్థ వుండేది. అందులో తప్పేముంది? శాసనం మీద ఆచారమే నిలుస్తుందని, నిలవాలని శాసన కర్తలందరూ–ప్రాచీనులూ, ఆధునికులూ–అంగీకరించిన విషయమే. "శాస్త్రం రూఢి వర్ధతే" (శాస్త్రాలకంటె ఆచారమే ఎక్కువ ఫలితం చూపుతుంది) అని శాస్త్రాలు అంటున్నాయి. ఆచారమనేది స్థానికంగా లేక ఒక వర్గానికి వర్తించే న్యాయనిబంధన స్థానిక ఆచారం లేక సంప్రదాయానికి వుండే విలువను, ప్రాముఖ్యాన్ని అన్ని సమాజాలు గుర్తిస్తాయి" అని వివరించారు.

షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు జాతులగురించి మాట్లాడుతూ వారి నొక ప్రత్యేక పీఠం మీదకి ఎక్కించవలసిన పనిలేదన్నారు. అస్సాంలో 'జాతులు'గా గుర్తింపు పొందగలిగిన లక్షాధికారులను స్కూలుఫీజులు, ఆదాయపు పన్నుల నుంచి మినహాయించడం పరిహాసాస్పదని పేర్కొన్నారు. వారుకూడ జాతిలో అవిభాజ్యమైన భాగమే. "గిరిజనులు"గా వ్యవహరింప బడుతున్నవారే రాణా ప్రతాప్, శివాజీల సేనలకు వెన్నెముకలా నిలిచారు.

"జంతువులను పూజిస్తున్నంత మాత్రాన గిరిజనులను "అహిందువులు"గా పేర్కొనడం అనుచితమని, హిందువులంతా జంతువులను ఆరాధించే వారేనని అన్నారు. "రావిచెట్టును, నాగుపామును నేనూ ఆరాధిస్తాను. ఆ మేరకు హిందువులంతా జంతు పూజారులే అనవచ్చు. ఈ దేశంలోని మనం అన్నింటిలోను భగవంతుని దర్శించి అన్ని ప్రతీకలలోను ఆ భగవానుని ఆరాధిస్తాము. సుబ్రహ్మణ్యుని దేవాలయాలలో నెమళ్ళను, శివాలయాలలో సర్పాలను, విష్ణ్వాలయాలలో వానరాన్నో, గరుడుణ్నో-యిలా ఎన్నో ఉదాహరణలు యివ్వవచ్చు. ఏదో ఒక రూపంలో హిందువులు ప్రతీకలను పూజిస్తారు. జీవితాన్ని, ప్రకృతిని ఆరాధించే ప్రతి ఒక్కడూ జంతుపూజారే. మన హిందూ పంచాంగం ప్రకారం నాగపంచమి నాగు పామును ఆరాధించే పర్వదినం. కాని క్రైస్తవ ఫాదరీల సలహాకు చెవి ఒగ్గి, హిందూ నాగాల పట్ల అన్ని విషయాలలో విచక్షణ చూపుతూ, వారిని "అహిందువులుగా" పరిగణిస్తున్నారు.

"జంతు ఆరాధనలో విచిత్రమేమున్నది ? నిరసించదగిన దేమున్నది ? జ్ఞాన విజ్ఞాన భాండాగారాలైన మన వేదాలలో యమ, వరుణ, వాయు, సూర్య, అగ్ని మొదలైన దేవతల పూజా, ప్రార్థనాదుల విధానాలు పొందు పరచబడి వున్నాయి. వేదర్షులు వీటిని విశిష్ట పదార్థాలుగా, యివే దేవతలుగా భావించారనుకుంటే పొరపాటు. వాస్తవమేమంటే యీ వైదిక మహర్షులే వివిధ దేవతలను ప్రార్థిస్తూ, విభిన్న నామరూపాలు, చిహ్నాలు, ప్రతీకల వెనుక నున్న పరమసత్యం ఒక్కటేనని సంశయానికి తావులేకుండా ఎలుగెత్తి చాటారు.

"దేవుడు ఒక్కడేననే వాదాన్ని, అద్వైత తత్త్వాన్ని ప్రతిపాదించిన భగవాన్ శంకరాచార్యునివంటి మహావేదాంతి కూడా శివుడు, విష్ణువు, సూర్యుడు గణపతి, శక్తి అనే పంచ దైవతాల ప్రత్యేక ఆరాధనకు తలవంచక తప్పలేదు. అతడే ఆ అయిదుగురు దైవాలను ఒకే పీఠం మీదవుంచి దానిని పంచాయతన మని అన్నారు. మనదేశంలో 'పంచాయతన' ఆరాధనా విధానానికి నాందిపలికాడు. అన్ని రూపాలకు, వస్తువులకు వెనుకవుండే సత్యం-ఒకటేనని మన ప్రాథమిక విశ్వాసం. భగవంతుడిని రాళ్లలో, చెట్లలో, నదులలో, విగ్రహాలలో, ఆదర్శాలలో-ఎక్కడ దర్శించే వారయినా తమకు నచ్చిన పద్ధతిలో ఆరాధించే మన ప్రజలందరిలో ఆ ఏకతను సాధించాలి."

కృత్రిమంగా జనాభాను నియంత్రణచేసే విధానం మీద శ్రీ గురూజీ వ్యాఖ్యానిస్తూ అట్టి అవసరమే లేదన్నారు. 1958లోనే యీ రచయితకు యిచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో "మనిషికి భద్రత కల్పిస్తే ఎక్కువ సంతానాన్ని కన డనే సంగతి జగత్ప్రసిద్ధం" అన్నారు. అందుకు పరిష్కారం అతని కుటుం బాన్ని పరిమితం చేయడం కాదని, అతనికి పని కల్పించడమేనని చెప్పారు. లొంగని వ్యాధులతో పీడింపబడుతున్న వారికి, క్రూరమైన నేరస్థులకు సంతాన నిరోధపు ఆపరేషను చేయడంలో అర్థంవున్నదికాని పేదలను సంతానం కనవద్దనటం దేనికో నాకు అర్థంకాదు. పేదలై వుండటం నేరంకాదు."

"జననాలను నియంత్రణ చేయాలంటున్నారు. ఆత్మనిగ్రహం గురించి మాత్రం మాట్లాడటంలేదు. ఎంతకు మించి పిల్లలను పెంచడానికి తాము శ్రద్ధ వహించడం ఇష్టంలేదో, ఆంతకు మించి పిల్లలు కలగనంత వరకు లైంగిక ప్రకృతి ఎంత విశృంఖలంగా తయారయినా, వారికి అభ్యంతరంలేదు. అందు వల్ల కుటుంబనియంత్రణ భ్రూణ హత్యను అనుమతించడమే అవుతున్నది. అట్టి సమాజంలోని ప్రజలు నీతిమాలిన రక్కసులుగా మాత్రమే తయారవుతారు"

యాంటీ- బయాటిక్స్ మొదలైన వాటిద్వారా మరణాలరేటును తగ్గించి, జనాభా పెరుగుదలకు సైన్సు ద్రోహం చేస్తున్నది కనుక, జననాలను నియంత్రణ చేయడానికి కూడ సైన్సును ఉపయోగించ వచ్చునని సూచించగా" జనాభా దానంతట అదే నియంత్రణ చేయబడుతుంది. ప్రకృతి తన పద్ధతిలో పనిచేస్తూనే వుంటుంది. ప్రతి యుద్ధానికి ముందు, ఆ తరువాత జననాల రేటు విపరీతంగా పెరుగుతుందని నిరూపించబడింది. మానవ జాతి అంతరించే ప్రమాదం ముంచు కొచ్చినపుడు మానవుడు అసంకల్పితంగా ప్రతిస్పందించే తీరు అది. అదే విధంగా పరిస్థితులు మెరుగుపడి, మానవులు మరింత భద్రతను అనుభూతి చెం దితే, జననాల రేటు తనకు తానుగా పడిపోవటం జరుగుతుంది.

ఈ ప్రపంచంలో ఎంత జనాభా పెరిగినా, వారందరికి తగినంత స్థలము, కావలిసి నంత ఆహారము ఉన్నాయనే నామటుకు నేను అభిప్రాయపడుతున్నాను. ఉన్న యిబ్బంది ఏమంటే భూమాతమీద ప్రజలందరికి స్వతంత్రంగా, సమానంగా భాగస్వామ్యంలేదు. పెద్దపెద్ద గోడలు కట్టి భూములమీద కొందరు గుత్తాధిపత్యం చెలాయిస్తున్నారు. విస్తారమైన ఖాళీ స్థలాలు ఎన్నో వున్నాయి. కాని అవసరమైన

భూమిని ఆక్రమించుకొనడానికి కాకుండా, దేశజనాభాను పరిమితం చేయడానికి ప్రభుత్వం ఆలోచిస్తున్నది. అసలు వైఖరిలోనే బాగుపడే లక్షణాలు లేవు. ఇప్పటికే విదేశాలలో స్థిరపడి దిక్కు కోల్పోయిన భారతీయులతో మనం సంబంధాలు సరిగా వుంచుకొలేక పోతున్నాము. ఇక క్రొత్త అవకాశాలు కల్పించే సంగతి చెప్పేదేముంది ! వారి కోసం మనం చేస్తున్నదేమీలేదు– ఈ పరిస్థితిలో వలసపోయేందుకు ఎవరు సాహసిస్తారు ?"

ప్రవాస నిబంధనలలోని జాతి పక్షపాత వలన జాతుల మధ్య యుద్ధాలు జరిగే ప్రమాదమున్నదని భయం వ్యక్తం చేయగా "ఆ విషయం నాకు తెలియదు ఆలా జరగదనే ఆశిస్తాను. ఒకవేళ అలాంటి యుద్ధమే జరిగితే, పౌరుషం ఎక్కువ వున్నవారే గెలుస్తారు" అని సమాధానం యిచ్చారు.

పది సంవత్సరాల తరువాత మరొక ప్రత్యేక యింటర్వ్యూలో మాట్లాడుతూ శ్రీ గురూజీ యిలా అన్నారు: "ఈ కార్యక్రమాన్ని 'కుటుంబ యోజన' అని ఎందుకంటున్నారో నాకు అర్థం కావడంలేదు. కుటుంబాలను నియంత్రణ చేసుకొనడానికి మాత్రమేగాక, సంతానహీనులు సంతానం పొందడానికికూడా యిది తోడ్పాటు యివ్వగలిగితే అప్పుడు దీనిని 'యోజన' అనవచ్చు. అలాంటిదేమీ యీ కార్యక్రమంలో లేదు.

"ఎక్కువమంది పిల్లలు అని భయపెట్టే ప్రచారం వెనుక అసలయిన వుద్దేశం చాలా దురుద్దేశపూరితమైయున్నది. తన వైఫల్యాలు అన్నింటికి "మితిమీరిన జనాభా" మీద నిందమోపి తమ బాధ్యత నిరాకరించడంలో ప్రభుత్వానికి యిదొక అనువైనసాకుగా పనికివస్తుంది. భారతదేశజనాభా ఏ విధంగానయినా తగ్గించాలని విదేశశక్తులు మరీఆసక్తితోవున్నాయి. జనసంఖ్యలోవుండే సామర్థ్యము తద్వారా సాధించుకొనగలశక్తి ఎటువంటిదో వారికి తెలుసు.

"పైగా యీ కృత్రిమసాధనాలు చాల ప్రమాదకరమైనవి. గ్రంథులలో నిలువవుండే జీవరసాయనాల విషయంలో జోక్యం చేసుకునే వేసక్టమీవలన హార్మోనుల సంతులనంచెడిపోయి, దానివలన వ్యక్తియొక్క ఆరోగ్యము,మానసిక స్థితి బాగా దెబ్బతింటాయి. ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా లక్షలాది ప్రజల శారీరక మానసిక ఆరోగ్యంతో, సుఖసంతోషాలలో చెలగాటమాడుతున్నదో

చూస్తుంటే, నాకు దిగ్భ్రాంతికలుగుతున్నది. "వేసక్టమీ చేయించుకున్న వ్యక్తులు కొంత మానసికపటుత్వాన్ని కోల్పోవడం కనిపించిందని వారు అన్నారు.

కనీసం సాంఘిక, మతపరమైన ఉత్సవాలలోనయినా మనం విదేశీ వేష ధారణను మానివేయాలనే విషయంలో శ్రీ గురూజీ చాల పట్టుదలతో వుండేవారు. వివాహమహోత్సవాలలో ప్యాంటు, కోటు వేసుకున్నవరుడు కనిపించగానే అనేక సందర్భాలలో శ్రీ గురూజీ కళ్యాణమండపంలో అడుగయినా పెట్టకుండా తిరిగి వెళ్లిపోయారు.

1945లో శ్రీ గురూజీ జైపూర్‌నుంచి ఢిల్లీ వెళుతున్నారు. ఢిల్లీ స్వయం సేవక్ ఒకరు రేవారీస్టేషనులో వారిని చూడటానికివచ్చారు. శ్రీ గురూజీ అతనికి ప్రతినమస్కారంచేస్తూ సూటు, నెక్‌టై వేసుకున్న మీరు గొప్ప ఇంగ్లీషుదొర కాబోతున్నట్లున్నారు" అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. తాను స్థానికకాలేజీలో గణితశాస్త్రంలో లెక్చరర్‌గా నియమించబడ్డానని ఆ ఢిల్లీ స్వయంసేవక్ వివ రణయిచ్చారు. దానిపై శ్రీ గురూజీ "గణితంలో లెక్చరర్‌గానా లేక విదేశీ వేషంలో ప్రదర్శకుడిగానా ?" అన్నారు.

ఒకమారు తమ అనుభవాలు వివరించారు. "మూడేండ్లు బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడుగా వున్నాను. నేను ధోవతి కట్టుకున్న కారణాన నా జంతుశాస్త్ర పాఠాలు అర్థం కాలేదని విద్యార్థులెన్నడూ ఆరోపించ లేదు. ఒకరోజు నాగపూరు కోర్టులో ఒకరి తరఫున న్యాయవాదిగా హాజరయాను. నన్ను చూచి నావేషధారణ సరిగాలేదని న్యాయమూర్తి అన్నారు. నా వేషధారణ సరిగానే వున్నదని, నాచొక్కా, నా ఉత్తరీయం, నా ధోవతి, నా చెప్పులూ అన్నీ వున్నాయని ఆయనతో అన్నాను. మళ్ళీ ఎన్నడూ ఆయన నా వేషధారణ మీద వ్యాఖ్యానించ లేదు.

పార్లమెంటు సభ్యులు క్రికెట్ పోటీలో పాల్గొన్నప్పుడు వారు కబడ్డీ ఆట ఎందుకు ఆడకూడదని ఆశ్చర్యం ప్రకటించారు.

అల్లోపతి గురించి మాట్లాడుతూ "అల్లోపతిలో నా నమ్మకం సన్నగిల్లి పోతున్నది. ఈ యాంటీబయాటిక్స్ రోగాన్ని మాత్రమేగాక రోగిని కూడా చంపేస్తున్నాయి" అన్నారు.

మిలటరీ ఆదేశాలగురించి ప్రస్తావిస్తూ: "మూడోవంతు సంస్కృతంలో ఒక మూడోవంతు ఇంగ్లీషులో మిగిలిన మూడోవంతు పర్షియన్‌లో వున్నాయి. దేశ సమైక్యతకు యిదొక విచిత్రవిధానంగా కనిపిస్తున్నది" అని ఒకసారి చమత్కరించారు.

జాతీయ క్రమశిక్షణా పథకానికి చెందిన అధికారి ఒకరు శ్రీ గురూజీని కలుసుకున్నారు. వీధిలోకి వచ్చినపుడు తమవాళ్లు తక్కిన ప్రజలకన్న క్రమశిక్షణా రహితులుగా ప్రవర్తిస్తున్నారని ఆ అధికారి చెప్పారు. క్రమశిక్షణ పెంపొందించడానికి ఆర్.యస్.యస్. ఏమి చేస్తున్నదో తాను తెలుసుకొనగోరుతున్నానని అన్నారు. "ఆదర్శం" అని ఒక్కమాటలో శ్రీ గురూజీ సమాధానం యిచ్చారు. తమ విషయంలో, మాతృభూమి పట్ల ప్రేమే ఆదర్శమని చెప్పారు.

ప్రకటనలలో సెక్సును వినియోగించుకొనడాన్ని వారు నిరసించారు. "ఒక స్త్రీని చూపితే తప్ప ఏ ప్రకటనా సమగ్రం కాదల్లేవుంది. రేజర్‌బ్లేడు ప్రకటనలో స్త్రీని చూపించారు. అవసరమేమిటి ? రేజర్‌బ్లేడులు స్త్రీ ఏమిచేసుకుంటుంది? మనం ఎంతగా పతనంచెందామో యిది సూచిస్తున్నది. దీనికి వ్యతిరేకంగా మహిళలు ఉద్యమం నిర్వహించాలి. అని వారు పిలుపుయిచ్చారు.

ప్రయోగాలలో బలి పశువులుగా వినియోగించడానికై కోతులను ఎగుమతి చేస్తున్నట్టు తెలియవచ్చినపుడు శ్రీ గురూజీ దిగ్భ్రాంతులైనారు. "మానవుడు ఎంతగా పశుప్రాయుడైనాడు ! అంతుకేని తన ఆకలి తీర్చుకొనడానికి, భగవంతుని సృష్టి నంతటిని దుర్వినియోగం చేసుకునే హక్కు తనకు వుందని అనుకుంటున్నాడా ? జీవంలో పవిత్రత వున్నదనే వాక్కు వ్యర్థమై పోతున్నది. భగవంతుని సృష్టి అంతా పవిత్రమే. ఒక చీమకయినా నావలన పొరపాటున హాని కలిగితే నామటుకు నేను ఎంతో బాధపడతాను."

"జనగణమన" ను సరిదిద్దాలని కొందరు ప్రయత్నాలు ప్రారంభించారు. "మనం అదే పనిగా మన సరిహద్దులు కుంచింపజేస్తూ వస్తున్నాము. దీని వలన మన సంస్కారాలు పరిమితం జేసుకొనటం అవుతుంది" అని ఆ సందర్భంలో శ్రీ గురూజీతో హెచ్చరించాడు. బొంబాయి ప్రముఖులు కొందరు "జనగణమన" లోని "పంజాబ్, సింధు, గుజరాత్, మరాఠా, ద్రావిడ, ఉత్కళ, వంగ" అనే

పంక్తిలో నుంచి "సింధు" పదం తొలగించిన విషయాన్ని వారు ప్రస్తావించి "ఈ దురంతాన్ని పండిత నెహ్రూ ఖండించి ఆ పదాన్ని తిరిగి జాతీయ గీతంలో చేర్పించి సముచితంగా వ్యవహరించారు" అని గుర్తు చేశారు.

పాల కొరత వున్నదనే నెపంతో ఒకప్పుడు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం "సంధేశ్' (మిఠాయి) తయారు చేయడాన్ని నిషేధించింది. ఈ నిషేధం గురించి చెప్పవలసింది ఏమీ లేదు, ఇది వట్టి అర్థం లేని ఉత్తరువు. పాలు ఆహారమే కదా. పైగా అది సంపూర్ణ ఆహారం, ఆహారపు కొరత ఏర్పడినపుడు పాల ఉత్పత్తిని పెంచడానికి మించిన గొప్ప పరిష్కారంలేదు. కాని ఆ విషయం ఎవరూ ఆలోచించడం లేదు. చిన్న వయసులో వున్న గోవులను పంజాబ్ నుంచి కలకత్తాకు తీసుకుపోయి, పాలిచ్చే ఋతువు ఒక్కటి గడిచిన వెంటనే వాటిని వధిస్తున్నారు. ముఖ్యమంత్రి సేన్ గారిని పశువధ నిషేధించమనండి. బెంగాల్‌కు కావలసినన్ని పాలు దొరుకుతాయి – ఔను, 'సందేశ్' చేసుకొన డానికి కూడాను" అని శ్రీ గురూజీ చమత్కరించారు.

1963 లో 14 కేరట్ల బంగారం మీద వ్యాఖ్యానిస్తూ "ఇక బంగారాన్ని కూడా మనం కత్తిరి చేయవలసిందేనా ?" అని ప్రశ్నించారు. కసాయివారి ఉద్యోగ భద్రత కోసం ప్రభుత్వం గోవధను సమర్థిస్తున్నదని ఒకరు అనగా, "ఎంత వైపరీత్యం ! స్వర్ణ నియంత్రణ ఉత్తరువుతో వేలాదిమంది స్వర్ణకారు రను కుప్పకూలినపుడు చీమకుట్టినట్లయినా బాధ చెందని యీ ప్రభుత్వానికి గోహత్య మీద బ్రతుకు తున్న వారి మీద యింత వాత్సల్యమా ?" అన్నారు.

ఆర్. యస్. యస్. రహస్యం గురించి కొందరు విమర్శకులు మాట్లాడు తుండగా శ్రీ గురూజీ యిలా అన్నారు. "మొన్న ఒక పత్రిక ఆర్. యస్. యస్. అసలు రహస్యం అనే శీర్షికతో ఏదో వ్రాసింది. విద్యావంతులుగా కనిపి స్తున్నవారు కూడా రహస్యాల గురించి, అద్భుతాల గురించి మాట్లాడటం చూస్తే ఆశ్చర్యమవుతున్నది. ఒక విషయం మీకు అర్థం కానంతవరకే అదొక రహ స్యంగా కనిపిస్తుంది.

"30 సంవత్సరాల క్రిందట డాక్టర్‌సాహెబ్‌ను కలవడానికి స్వయం సేవకుల బృందంతో అకోలా స్టేషనుకు వెళ్ళాను. ఛుక్ ఛుక్ మని రైలు వచ్చి

ఆగగానే ఒక గ్రామస్తుడు ఆదరా బాదరా యింజనువైపు పరుగెత్తడం మొదలు పెట్టాడు. ఏమయిందయ్యా, ఏమి కావాలి నీకు అని అడిగాను. ఇంజను లాగడానికి ఎన్ని ఎద్దుల్ని యింజనులో పెట్టారో చూద్దామనుకుంటున్నానని అతడు జవాబిచ్చాడు. పాపం అతడు అంతకు ముందెన్నడూ రైలు చూసి ఎరగడు. గుర్రాల గురించి కూడ తెలిసినట్లు కనిపించలేదు. అపూర్వ రహస్యాల అంతు కనుక్కొందామని బయలుదేరే యీ పెద్దమనుషులంతా ఆ గ్రామస్థుణ్ని తలపింప జేస్తున్నారు. ఆ పిచ్చి గ్రామస్థుడికున్న అమాయకత్వం వీరికి లేదు - అదొక్కటే తేడా" అని వివరించారు.

ఆర్. యస్. యస్. రహస్య సంస్థ అని, నిజాలు దాచిపెడుతుందని కొందరన్నారు. బహిరంగ స్థలాల్లో కార్యక్రమాలు నిర్వహించే ఆర్.యస్.యస్. అంతటి బహిరంగంగా పనిచేసే సంస్థ మరొకటి లేదని శ్రీ గురూజీ చెప్తుండే వారు. అది పనిచేసే తీరు వేరు-నెమ్మదితో పని చేస్తుంది-హిందూ సంస్కృతి అలాంటిది కనుక. ఉదాహరణకు ఒక వ్యక్తి దూర ప్రయాణానికి బయలుదేరితే అతని భార్య నవ్వు గాని ఏడుపుగానీ లేకుండా ప్రశాంతంగా నిశ్శబ్దంగా చూడటం తప్ప మరేమీ చేయదు. కాకపోతే కాలి బొటనవ్రేలుతో నేలమీద గీస్తుందేమో మహాఅయితే. కాని పాశ్చాత్య స్త్రీలు మాత్రం అందరు విభిన్నంగా, అట్టహాసంగా ప్రవర్తిస్తారు.

స్వయంసేవకులు తనను ఎంతగా గౌరవిస్తున్నా, శ్రీ గురూజీ వారి పట్ల ఎంతో వాత్సల్యంగా, నొప్పించకుండా వ్యవహరించేవారు. ఒక రోజు వేదిక మీద వారు బూట్లు తొడుక్కుంటూ వుండగా ఒకటి జారి క్రింద పడిపోయింది. వెంటనే ఆ బూటు తీసుకుని ఒక స్వయంసేవక్ వారి వద్దకు పరుగెత్తుకు పోయి అందించాడు. "ఎవరి బూట్లు గాని మోయడం స్వయంసేవకుని కార్యంలో భాగం కాదు. అతని ఒకే ఒక్క కార్యం - భారతమాతను సేవించడం" అని శ్రీ గురూజీ స్పష్టం చేశారు.

ఒక రోజు సంఘస్థాన్‌లో ఒక స్వయంసేవక్ ఒంటరిగా కూర్చొని మూలుగుతుండటం శ్రీ గురూజీ చూశారు. ఏమయిందని గురూజీ అడిగితే కాలిలో ముల్లు గుచ్చుకుందని అతడు చెప్పాడు. గురూజీ అతని ప్రక్కనే

కూర్చొని, ఏమి జరుగుతున్నదో అతడు తెలుసుకొనేలోగా, చిటికెలో ముల్లు లాగి పారేశారు.

గురూజీ 50 వ జన్మదినోత్సవం నాడు వారి అభిమానులు "గురూజీ కీ జై" అంటూ ఢిల్లీలోని ఓఖ్లా స్టేషనులో స్వాగతం చెప్పారు. వ్యక్తిగతమైన నినాదాలు చేయవద్దని గురూజీ చెప్పినా వారు అర్థంచేసుకోలేదు. అందువల్ల వారు కంపార్టుమెంటులోకి వెళ్ళి బయటికి రావడానికి నిరాకరించారు. తనకు ఫోటో తీసినప్పుడల్లా తన జీవితంలో కొంతభాగం తగ్గించినట్లే నని వారు అనే వారు. పత్రికా ప్రచారం, ఫొటో ప్రచారం పట్ల వారి కున్న విముఖత అలాంటిది.

వారి పట్ల నెహ్రూ ఎప్పుడూ అనుచితంగా వ్యవహరించినా, (ప్రత్యేకించి 1947 - 48 లో మరింత కటువుగా ప్రవర్తించినా) గురూజీ మాత్రం నెహ్రూ పట్ల సద్భావననే చూపారు. అధికారం సక్రమమైన పద్ధతిలో బదిలీ చేసినందుకు నెహ్రూను అభినందించారు. నెహ్రూకు వ్యతిరేకంగా కొందరు భారతీయులు లండనులో ప్రదర్శనలు నిర్వహించారు. ఒక విదేశంలో అట్టి ప్రదర్శనలు జర పడం తీవ్రంగా అభ్యంతరకరమైన విషయమని గురూజీ మందలించారు.

సింహగడ్ మీద శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించడానికి నెహ్రూ వెళ్ల నుండగా 'సంయుక్త మహారాష్ట్ర' సమస్య మీద ఆయనకు వ్యతిరేకంగా ప్రద ర్శనలు జరపాలని కమ్యూనిస్టులు తలపెట్టారు. నెహ్రూజీని అందరూ స్వాగతించి ఉత్సవానికి విఘ్నాలు జరుగకుండా చూడాలని గురూజీ అన్నారు.

నెహ్రూ ఎక్కడకు వెళ్లినా తన కుమార్తెను వెంటతీసుకొని పోతుండటం మీద కొందరు విమర్శించగా గురూజీ "దానిపై అంతగా కొందరు ఆగ్రహించడం దేనికో నాకు నిజంగా అర్థం కావడంలేదు. పండితనెహ్రూకు యీ జీవనశిబిరంలో వారి ఏకైక పుత్రిక కాస్త మనశాంతిని, ప్రశాంతతను కలుగచేస్తుంది. అయినా తనదిగా చెప్పుకొనదగినది ఏమి మిగిలినాయి గనుక? నా కుటుంబమంటూ లేక పోయినా నెహ్రూ భావాలను నేను అర్థం చేసుకొనగలను. గృహస్థులయి వున్నావారు యీ మాత్రం అర్థం చేసుకొనలేకపోవడం ఆశ్చర్యం కలిగించడం లేదా?" అంటూ నెహ్రూ ప్రవర్తనను సమర్థించారు-శ్రీ గురూజీ.

నెహ్రూజీ తన కుమార్తెను దేశం నెత్తిన రుద్దడానికి ప్రయత్నిస్తున్నా డేమోఅని కొందరు అన్నారు, "బాగుంది. తన బిడ్డలు పైకిరావాలని ఏ తండ్రి అయినా వాంఛించడం సహజమే. అందులో తప్పేముంది ? జవాహర్లాల్‌ను పైకి తీసుకురావడానికి పండిత్ మోతిలాల్ నెహ్రూ ఎంతో శ్రమించారు. ఇక నాయకత్వం సంగతి అంటారా, శక్తి వుండేనే తప్ప ఎవరూ ప్రజాజీవన రంగంలో నిలద్రొక్కుకొనలేరు" అని శ్రీ గురూజీ వ్యాఖ్యానించారు.

అటు తరువాత చాలా సంవత్సరాలకు, పెద్దప్రచారంతో, ఇందిరాగాంధీ తిరుపతి యాత్రకు బయలు దేరినప్పుడు, కొందరు ఆవిడకు రాజకీయ ఉద్దేశాలను ఆపాదిస్తూ విమర్శించారు. గురూజీ మాత్రం "ఈ విమర్శ మరీ అక్రమంగా కనిపిస్తున్నది. రాజకీయ ఉద్దేశాలతో కాక భక్తిభావనతోనే ఆమె యాత్ర చేస్తున్నదని నేను భావిస్తున్నాను. సాధారణంగా అధికారము, దర్పము, అట్టహాసాల ప్రాపంచిక జీవనంలో తలమునకలుగా వుండే ఏ వ్యక్తి అయినా జీవితంలో కొన్ని సమయాలలో వాటిని అతిక్రమించి అంతర్ముఖుడవుతుంటాడు. అన్ని రకాల మానసిక ఒత్తిళ్ళనుంచి విముక్తుడై, తన సృష్టికర్తతో అంతరంగిక సంబంధాన్ని జాగృతంచేసి, అపారమైన ప్రశాంతతను అనుభూతి చెందుతుంటాడు. ఆ ప్రేరణ, హృదయాంతరములోని ఆ ఆకర్షణ మనందరిలో నెలకొనివున్నవే. కనీసం క్షణికంగానయినా ఆ నిగూఢ సంస్కారాలు ఉత్తేజితమై మన యధార్థ తత్వపు అనుభూతిని రుచిచూపుతాయి.

ఇందిరాజీకి అట్టి పవిత్ర సంస్కారాలు గాఢంగా చిన్ననాటినుంచే వున్న సంగతి మనందరికీ తెలిసినదే. ఆమె తల్లి కమలానెహ్రూ అపూర్వసంస్కారవతి అయిన హైందవ వనిత. కలకత్తా వెళ్ళినప్పుడల్లా తప్పనిసరిగా బేలూరుమఠాన్ని సందర్శిస్తూ వుండేది. తనతోపాటు, పసివయసులోవున్న ఇందిరనుకూడ ఆశ్రమానికి తీసుకొని వెళుతూవుండేది. ఈ విషయాలు ముఖ్యులైన స్వాముల వార్లలో పలువురికి తెలుసు. ఇట్టి పూర్వరంగం వున్న ఇందిర అత్యంత ప్రసిద్ధమైన పుణ్యక్షేత్రాన్ని దర్శించబూనటంలో అంతగా అసహజం ఏమున్నది ? ఇందులో ఎవరుమాత్రం రాజకీయ దురుద్దేశాలను చూడవలసిన పనేమిటి ?" అని విమర్శకులలో ఆలోచనలను కలుగజేశారు.

ఆదే విధంగా ముస్లింలపట్ల గాంధీజీ విధానంలో కొన్ని విషయాల మీద తనకు భేదాభిప్రాయాలు వున్నప్పటికి, గాంధీజీని అపారంగా గౌరవించారు శ్రీ గురూజీ.

గాంధీ శతజయంతి సందర్భంగా యిలా అన్నారు. "గాంధీజీ కార్యక్రమా లలో ఒక్కగానొక్కటి అయినా కాంగ్రెసు అమలు చేయడంలేదు. తమ బాగు కోసం ఖద్దరుకడుతున్నారు తప్ప గ్రామంలోని చేనేతపని వారిని ఉద్ధరించడానికి కాదు. మరో ఏడు సంవత్సరాల తరువాత మద్యనిషేధం అమలు జరుపుతామని స్వాతంత్ర్యం వచ్చిన ఇరవై సంవత్సరాల తరువాత వారు ప్రకటించడం ఆత్మ వంచన చేసుకొనడం తప్ప వేరు కాదు. నేడు సత్యమెక్కడుంది ? అహింస ఎక్క డుంది ? స్వదేశీ ఎక్కడున్నది ? రామరాజ్యం గురించే చెప్పేదేమున్నది ? కనీసం గ్రామరాజ్యమైనా రాలేదు మనకు. వెనుకటి పంచాయితీలలో వివిధవర్గాలలోని వివేక వంతులయిన పెద్దలు వుండేవారు. క్రొత్త పంచాయితీలన్నీ కులరాజకీయా లకు ఆట పట్టులయినాయి.

"ఈ నాడు గాంధీజీ కార్యక్రమాలు ఏవయినా- ఆది గోరక్షణకానీ, హిందీ వ్యాప్తిగాని అమలు జరుపుతున్నవారు ఎవరయినా వుంటే- మేము మాత్రమే"

భారత స్వాతంత్ర్య సముపార్జనలో గాంధీజీ నిర్వహించిన పాత్ర గురించి వివరిస్తూ "గాంధీజీ పాత్ర స్వాతంత్ర్య చరిత్రలో అత్యద్భుతమైనది. స్వేచ్ఛా సందేశాన్ని మారుమూల గ్రామాలకు సైతం వినిపింపజేశారు వారు. బ్రిటిష్ వారిని పారద్రోలాలని బోధించారు. జైళ్ళకు పోయేందుకు ప్రజలను సహాయ త్తం చేశారు. స్వాతంత్రోద్యమానికి సాధారణ ప్రజల మద్దతు సాధించారు. అసం పూర్తిగా మిగిలిపోయిన తిలక్ కార్యాన్ని ఆశ్చర్యం కలిగించే తక్కువ సమ యంలో పూర్తిచేశారు" అని ప్రశంసించారు.

ఆర్.యస్.యస్.కు వ్యతిరేకంగా గాంధీజీ ఎన్నడయినా ఒక్కమాట అన్నారా అని అడుగగా- "నాకు తెలిసినంత వరకు ఎన్నడూ అనలేదు. ఒక మారు అసఫ్ అలీ గాంధీజీకి పెద్ద ఫిర్యాదు పంపిన సంగతి నాకు జ్ఞాపకమే. దానిని హరిజన్‌లో ప్రచురించి- ఆ ఫిర్యాదులోని విషయం నిజమైతే చాలా దుర దృష్టకరమని, కాని ఆర్.యస్.యస్.మీద అటువంటి ఆరోపణలు నిజమని తాను నమ్మజాలనని గాంధీజీ తన వ్యాఖ్యకూడా దానిక్రింద ప్రచురించారు." అని గురూజీ చెప్పారు.

గాంధీజీ, గురూజీలు ఒక్కమారు మాత్రమే కలుసుకున్నారు-1947 చివరలో గురూజీని చూడాలని గాంధీజీ అభిలషించగా గురూజీవెళ్ళి కలుసు

కున్నారు. ఆ సమావేశాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ శ్రీ గురూజీ యిలా అన్నారు" అంతటా ఏర్పడివున్న భయానక పరిస్థితుల గురించి గాంధీజీ ఆ సమావేశంలో ఆవేదనతో ప్రస్తావించారు. ఇది మన దురదృష్టం. తాము భారతదేశ తీరాలు వదిలిపోగానే మనలో మనం సిగపట్లకు సిద్ధపడతామని బ్రిటిషువారు అంటుండే వారు. వారి మాటలు నిజమని రుజువు చేసే విధంగా మనమిప్పుడు ప్రవర్తిస్తున్నాము. ఏది ఏమయినా యీ అస్తవ్యస్త స్థితికి యింతటితో మనం స్వస్తి చెప్పాలని అన్నాను నేను. వారితో నేను మాట్లాడిన మాటలను ఆనాటి సాయంకాలం ప్రార్థనా సమావేశంలో గాంధీజీ ప్రస్తావించి, ఆ విషయంలో నా భావాలను అందరికీ వివరించారు. దేశానికి వున్న మంచిపేరును పాడుచేయవద్దని వారందరికి విజ్ఞప్తి చేశారు.

ఇట్టి ఆలోచనా సరళి, కార్య విధానము 'సంఘ సంస్కృతి'లో భాగమయినై. ఇవి ఆలోచనలను రేకెత్తించి అందరి ప్రశంసలను చూరగొన్నాయి. కనుకనే ఒకవంక సంఘాన్ని అప్రతిష్ఠ పాలుచేయడానికి ప్రభుత్వం ప్రయత్నాలు కొనసాగిస్తున్నా, దేశంలోని మహోన్నత వ్యక్తు లెందరో సంఘం చాల గొప్పదని, దీని అవసరం దేశానికి ఎంతో వున్నదని ప్రస్తుతించారు. గొప్ప సంగీత కళాకారుడయిన పండిట్ ఓంకార్‌నాథ్ గుజరాతీ యువకులందరినీ ఆర్.యస్.యస్.లో చేరవలసిందిగా 1949 లోనే విజ్ఞప్తి చేశారు. దాద్రా, నాగర్-హవేలీలను విముక్తం చేయడానికై ఆర్.యస్.యస్. కార్యకర్తలకు కొంత డబ్బు అవసరంకలుగగా లతామంగేష్కర్ సంతోషంతో వారికోసం పూనాలో ఉచిత కార్యక్రమం యిచ్చింది. శంకరాచార్యులందరితోపాటు. యితర సాధు సంతులు సంఘాన్ని ఆశీర్వదించారు.

పలువురు సైనికాధికారులు సంఘాన్ని అభినందించారు. వారందరిలో అగ్రగణ్యులైన జనరల్ కరియప్ప "ఏమి చేయాలని నాహృదయం ఆరాటపడుతున్నదో, ఆర్.యస్.యస్. అదేపని చేస్తున్నది." అని 1959లో మంగళూరు శాఖలో చెప్పారు. "ముస్లింలు యిస్లాంను ఆకాశాని కెత్తుతుండగాలేనిది, ఆర్.యస్.యస్. హిందూధర్మాన్ని ప్రస్తుతిస్తే తప్పేమిటి ?" అని ఆయన ప్రశ్నించారు. "నాప్రియ యువకులారా, స్వప్రయోజన పరుల నిందా వ్యాఖ్యలకు చలించకండి. ఈ మహాసంస్థను రూపొందించిన మహనీయుడు డా॥ హెడ్‌గెవార్-

మాతృభూమిని నిస్వార్థభక్తితో సేవించే ఉజ్జ్వలమైన ఆదర్శాన్ని మీ ముందు నిలిపారు. ముందుకు చూడండి! ముందుకు! దేశం మీ నుంచి మాత్రమే సేవ లను కోరుతున్నది" అని కరియప్ప ఉద్బోధించారు.

భారతీయ చరిత్రకారులలో అజేముత్యా మనదగిన డా॥ ఆర్.సి. మజుం దార్ 1960లో కలకత్తాలో జరిగిన ఆర్.యస్.యస్. హేమంత శిబిరంతో ప్రసంగిస్తూ "ఉన్నతమైన లక్ష్యంతో సరైన మార్గంలో రాష్ట్రీయస్వయంసేవక సంఘ కార్యక్రమాలను, కార్యకలాపాలను స్వర్గీయ డా॥ హెడ్గెవార్ యోజన చేశారు. డాక్టర్జీ పట్లనాకు అపారమైన గౌరవ ప్రపత్తులున్నాయి. ఒక గొప్ప దృశ్యాన్ని మనసులో వుంచుకొని వారు కార్యాన్ని ప్రారంభించారు. యథార్థ మైన జాతీయ భావనను ప్రేరేపించి, జాతిని శక్తివంతంగా, బలోపేతంగా రూపొందించాలని ఆయన భావించారు. మహత్తర దేశంలో హిందువులే నిజమైన రాష్ట్రీయులనే సత్యాన్ని, ధైర్యంగా ఆయన ప్రకటించారు. ఇది సత్యమని తెలిసినప్పటికీ యీ వాస్తవాన్ని అంగీకరించడానికి చాలమంది సిగ్గుపడు తున్నారు. హిందూచరిత్ర, హిందూ సంస్కృతి, హిందూ నాగరికతే యీ దేశా నికి గర్వకారణమని మనం ధైర్యంగా అంగీకరించితీరాలి. ఈ దేశపు మహో న్నత గత వైభవం గురించి, మహత్తర సంస్కృతి గురించి మాట్లాడే వారంతా అది హిందూ వైభవము, హిందూ సంస్కృతి అని చెప్పడానికి ఎందుకు సిగ్గు పడతారో నాకు అర్థం కాదు." అన్నారు.

పాకిస్తానులో తొలి భారత హైకమిషనరుగా పనిచేసిన శ్రీ శ్రీప్రకాశ డెహ్రాడూన్ సంఘ శాఖ గురుదక్షిణోత్సవంలో మాట్లాడుతూ "కల్చర్" అంటే "గానాబజానా" కాదని, "సంస్కృతి" అని, సర్వజన శ్రేయస్కరమైన స్ఫూర్తి నిచ్చే భావన అని వివరించారు. భారతీయ విలువల పట్ల ఆర్.యస్.యస్.కు వున్న గౌరవభావనను ఆయన ప్రశంసించారు. "మనదేశ స్వాతంత్ర్యానికి తీవ్రమైన ప్రమాదాన్ని కలిగించే దుష్టశక్తులు మనచుట్టూ పొంచి వున్నాయి. భాష, ప్రాంతం, వర్గం మొదలైన వాటిపై వివాదాలు దేశాన్ని తునాతునకలు చేసేట్లు కనిపిస్తున్నాయి. కాని సంఘంలోని మీరు మాత్రం సమైక్యతను కాంక్షి స్తున్నారు. ఈ సమస్యలను అర్థం చేసుకొనండి. దేశ సమైక్యతను నిలపడంలో మీరు విజయం పొందాలని, దేశ స్వాతంత్ర్యాన్ని సర్వదాపరిరక్షించే సామర్థ్యం మీకు కలగాలని నా ఆశీస్సులు అందిస్తున్నాను" అని శ్రీ ప్రకాశ అన్నారు.

భారత ప్రధాన న్యాయమూర్తిగా పదవీవిరమణ చేసిన తరువాత శ్రీ కోకా సుబ్బారావు 1968లో బెంగుళూరులో జరిగిన గురుదక్షిణోత్సవంలో ప్రసంగించారు- "జాతీయ సమైకత అనేది యిటీవలి నినాదం. పత్రికలు, వేదికలు, రేడియో మొదలైన అన్ని ప్రచారసాధనాలద్వారాను, శాసనాలద్వారాను సమైక్య భావం వ్యాప్తిచేయాలని చూస్తున్నారు. కాని ఆర్.యస్.యస్ 1925 లోనే దీని ప్రాముఖ్యాన్ని గుర్తించింది..... ఆర్.యస్.యస్ ఉద్యమాన్ని చాల మంది అపార్థంచేసుకున్నారు- వాస్తవమేమంటే అసలు 'సెక్యులర్' అనే పదమే రాజ్యాంగంలో ఎక్కడా లేదు- మన ఆలోచనలో, జీవన విధానంలో హిందూ ధర్మం నిండివున్నది".

"ఈనాడు ఆర్.యస్.యస్ అంటే – దేశమంతటా యింటింటా తెలిసిన మాట. ఈ దేశానికి స్వయంసేవకులు చేస్తున్న నిస్వార్థసేవను ప్రతిఒక్కరు గుర్తించారు- కనుక వారికి విజయంకలగాలని నేను అకాంక్షిస్తున్నాను" అంటూ శ్రీ సుబ్బారావు తమ ప్రసంగం ముగించారు.

1973లో శ్రీ కె.యస్. హెగ్డే (తరువాత లోక్‌సభస్పీకర్) "ఆర్.యస్. యస్. కార్యసరళిగురించి నాకు కొంచెం పరిజ్ఞానంవుంది- సంఘంలోని అకుంఠిత దేశభక్తి, క్రమశిక్షణ, మన సంస్కృతిపట్ల శ్రద్ధాభక్తులు యీ మూడు ఉన్నత లక్షణాలు నన్నెంతో ముగ్ధుణ్ని చేసినై - కాని నేటి వైపరీత్యం చూడండి- ఆర్. యస్.యస్‌లో దేశభక్తి చాలినంతలేదని, యిదొక జాతీయసంస్థకాదని, జాతీయ ఉద్యమంపట్ల వీరికి శ్రద్ధలేదని, నేటి పాలకులు భావిస్తున్నారు. ఒక విదేశంనుంచి నాయకత్వంకోసం, మార్గదర్శనంకోసం ఎదురుచూస్తూ, ఆ విదేశీ ప్రభుత్వానికి ఏజెంట్లుగా వ్యవహరించే సభ్యులున్న ఒక రాజకీయపక్షంలో దేశభక్తివున్నట్లు భావిస్తూ, వారితో చేతులుకలపడానికి ఆ పాలకులు ఉత్సుకత చూపుతున్నారు- అర్.యస్.యస్ వారికంటె కమ్యూనిస్టులు మరెంత గొప్ప దేశభక్తులని మన పాలకులు భావించడం విడ్డూరం కాక మరేమిటి?" అని ప్రశ్నించారు-

నెహ్రూ ప్రభుత్వంలో హోంమంత్రిగా, రక్షణమంత్రిగా పనిచేసిన డా॥ కట్జూ 1963లో అలహాబాద్‌లో జరిగిన ఆర్.యస్.యస్ సమావేశంలో మాట్లాడుతూ తాను గతంలోకూడ ఆర్.యస్.యస్ శిబిరాలను, సమావేశాలను సంద

త్రించడం జరిగిందని చెప్పారు. "చైనా దురాక్రమణలవలన దేశంలో సమైక్యత సరించిన స్ఫురణవచ్చింది. అయితే సమరంలోనూ, శాంతిలోనూ-శాశ్వతంగా ఈ సమైక్య భావనను పరిరక్షించవలసిన అవసరం వుంది. ఇట్టి ఐక్యతను నిర్మాణం చేయాలనే ఆర్.యస్.యస్ సంస్థాపకులు సంకల్పించారు" అని అన్నారు. "ఇది హిందూరాష్ట్రం కాదని ఎవరంటున్నారు? దీనిని ఆర్.యస్. సూక్ష్మరూపంలో సందర్శింపడం నాకు ఆనందంకలిగిస్తున్నది" అని కూడా శ్రీ కట్జూ అన్నారు.

మాజీ హైకోర్టు న్యాయమూర్తి 67లో పంజాబుముఖ్యమంత్రి అయిన సర్దార్ గుర్నాంసింగ్ 1968లో - ఒకసారి లూధియానాశాఖ నిర్వహించిన గురుదక్షిణోత్సవానికి అధ్యక్షత వహించారు. "భారతమాతను ఆరాధిస్తూ, ఆమె కోసం ఎట్టి త్యాగంచేయడానికైనా వెనుదీయని ప్రతిఒక్కడూ హిందువే". అంటూ "సైనికులు యుద్ధంచేయడానికి వెళ్ళేటప్పుడు సాదాదుస్తులలో వెళ్ళరు. తమకు నిర్ణయించబడిన ప్రత్యేక యూనిఫారం ధరించి వెళ్తారు. ప్రత్యేక వేషం ధరించినంతమాత్రాన వారిని ప్రత్యేకవర్గమని వెలివేయలేము. అదే విధంగా హిందూసమాజంమీద జరుగుతున్న దారుణాలను అరికట్టడానికి గురుగోవిందసింగ్ యోధుల దళాన్ని నిర్మించి ఆ యోధులందరూ పంచ'క'నారాలను ధరించాలని నియమం విధించారు. అంతమాత్రాన శిఖ్ఖులు ప్రత్యేకవర్గంగా రూపొందలేదు. ఆర్యసమాజీయులు మొదలైనవారు ఎంతగా హిందువులో, శిఖ్ఖులుకూడా అంతే" అని శ్రీ గుర్నామ్‌సింగ్ అన్నారు. "గురుగోవిందసింగ్ సంత్-సిపాహీలను (సాధు-యోధులను) తయారుచేశాడు. శాంతికాలంలో త్యాగంద్వారా భగవంతుని పొందడానికి కృషిచేస్తూనే అన్యాయం, అత్యాచారాలు సమాజానికి క్లేశం కలిగించే తరుణంలో కృపాణహస్తులయి ధర్మరక్షణ చేయడం సంత్‌సిపాహీల విధానం. ఆర్.యస్.యస్ కూడ అట్టి సంత్-సిపాహీలను నిర్మాణంచేస్తున్నందుకు నాకు ఆనందంగావున్నది" అని శ్రీ గుర్నామ్‌సింగ్ మెచ్చుకున్నారు.

1970లో ఆర్.యస్.యస్‌ను నిషేధిస్తామని ప్రభుత్వం బెదిరింపులకు దిగినపుడు బొంబాయినగరపు ప్రముఖమేధావులు ఆ ప్రతిపాదనను గట్టిగా నిరసించారు. "దేశంలో జరుగుతున్న మతకలహాలకు సంఘానిదే బాధ్యత అని ఎప్పుడూ నిందిస్తున్నారు. కాని ఒక హిందువు, ఒక ముస్లిం, ఒక క్రైస్తవుడు

సభ్యులుగా ఉన్న దయాళ్ కమీషన్‌కూడ సంఘంమీద చేయబడిన ఆ ఆరోపణలను నిరాధారమని కొట్టివేసింది" అని సెక్యులర్ ఫోరమ్‌కు చెందిన శ్రీ ఎ. బి. షా అన్నారు. కమ్యూనిస్టులను, వారి సహచరవర్గంలోని శ్రీమతి సుభద్రాజోషి వంటివారిని బహిర్గతంచేస్తూ – వీరంతా ఆర్.యస్.యస్.మీద నిషేధం మోపాలని డిమాండుచేస్తూనే తమీర్-ఎ-మిలాత్, ఇత్తెహాదుల్ ముసల్మాన్, కాశ్మీరులోని ప్లెబిసైట్ ఫ్రంటు మొదలయిన పచ్చి మతోన్మాదసంస్థల గురించి మాత్రం అవసరమైనంతమేరకు పోతారని" శ్రీ షా విమర్శించారు.

"ఆర్.యస్.యస్. మీద నిషేధం విధించడమంటే, జాజ్వల్యమానమైన దేశభక్తిని నిషేధించడం; క్రమశిక్షణను నిషేధించడం; జాతి సముద్ధరణకై శ్రద్ధగా జరుగుతున్న కృషిని నిషేధించడం" అని స్వతంత్ర పార్టీకి చెందిన శ్రీ మధుమెహతా అన్నారు. ఆర్.యస్.యస్.ను నిషేధించాలని ప్రయత్నిస్తే అది బెడిసి కొడుతుందని, ఎందుకంటే నిషేధంవల్ల సంఘ సభ్యత్వం పెరుగుతుందే తప్ప సంఘం బలహీనం కాదని ఆయన హెచ్చరించారు.

తన అభిప్రాయంలో సంఘం దేశభక్తికీ, త్యాగభావనకు ప్రతీకమని "ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్" సంపాదకుడు శ్రీ జి. ఎమ్. లాడ్ అన్నారు. తాను 'స్వచ్ఛమైన సువర్ణమని' 1947 లోను, 1965 లోను సంఘం ఋజువు చేసుకున్నది అని కూడా అన్నారు.

ఆర్.యస్.యస్.ను ఎంతో కాలం వ్యతిరేకిస్తూ వచ్చిన జయప్రకాశ్ నారాయణ్ కూడ 1960లో ఘాజీపూర్ శాఖలో ప్రసంగిస్తూ, "సంఘం గురించి అంతా తెలుసునని నేననుకొనడంలేదుగాని, ఇటీవల శ్రీ గురూజీతో నేను జరిపిన సంభాషణ, దానితోపాటు సంఘంలో వున్న అనేక సద్గుణాలు – నన్ను సంఘం వైపు ఆకర్షించినై. లోపాలు ఎన్నడం నా ప్రవృత్తి కాదు కూడాను. సంఘ ఉద్యమము, సర్వోదయ ఉద్యమము రెండూ రాజకీయాలకు దూరంగా వుంటూ సమాజంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొని రావడానికి, సమాజాన్ని మరల చైతన్యవంతం చేయడానికి కృషి చేస్తున్నాయి. ఇది ఒక బృహత్తరమైన కార్యం. అభిప్రాయాలలో విభేదం వున్నంత మాత్రన ఒక విషయాన్ని అర్థం చేసుకొనడంలో అది ఆటంకం కానక్కరలేదు. నిష్పక్షపాతమైన దృష్టికోణం వుంటేనే సత్యం సాక్షాత్కారం సంభవమవుతుంది" అన్నారు.

వరదలు వచ్చినా, క్షామం వచ్చినా, యుద్ధమో మరో సవాలో ఎదురయినా ప్రజలకు సేవలు అందించడంలో ఆర్.యస్.యస్. ఎల్లప్పుడు అగ్రగామిగా నిలిచింది. 1962లో భారతదేశం మీద చైనా దండెత్తినపుడు ఆర్.యస్.యస్. మనస్ఫూర్తిగా తన మద్దతును ప్రభుత్వానికి యిచ్చింది. సంఘసేవా నిరతిని దర్శించిన నెహ్రూ "ఉత్సాహమేవుంటే 'లాఠీ' చాలు మనకు బాంబులను ఓడించ డానికి" అనడం ఆర్.యస్.యస్.కు నీరాజనమయింది. 1963 జనవరి 26న జరిగిన రిపబ్లిక్ దినోత్సవ విన్యాసాలలో పాల్గొనడానికి ఆర్. యస్. యస్. దళాన్ని నెహ్రూ ప్రత్యేకంగా ఆహ్వానించారు. మూడురోజుల ముందు మాత్రమే పిలుపు అందినప్పటికి ఢిల్లీకి చెందిన 20,000 మంది పైగా స్వయంసేవకులు- తెల్లచొక్కా, ఖాకీనిక్కరు, బెల్టు, నల్లటోపీ, ఫుల్ బూటు వేసుకుని - తమ పూర్తి యూనిఫారంలో కవాతులో పాల్గొని కార్యక్రమానికే వన్నె తెచ్చారు. ఈ కవాతు దళానికి వెనుక, అద్భుతమైన శంఖారావం మొదలైన వీరవాద్యాల సమ్మిళితమైన వాద్యదళం- అదీ ఆర్.యస్.యస్. వారిదే-నడిచింది.

రిపబ్లిక్ దినోత్సవ కవాతు కార్యక్రమంలో ఆర్.యస్.యస్. పాల్గొన్న విషయం మరునాడు-జనవరి 27-జరిగిన కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీ సమా వేశంలో కొందరు ఎం.పి.లు ఒక సమస్యగా లేవనెత్తారు. పౌరులందరిని పాల్గొన వలసిందిగా పిలవడం జరిగిందని కనుక ఆర్.యస్.యస్. కూడ పాల్గొనడం జరిగిందని నెహ్రూ వారికి నచ్చజెప్పారు. దీనితో కాంగ్రెసు ఎం.పి.ల మధ్య క్రింది విధంగా ఆసక్తి కరమైన సంభాషణ నడిచింది. వివరాలు అన్ని పత్రిక లలో వచ్చినయి.

ఒక సభ్యుడు : పెరేడులో ఢిల్లీ కాంగ్రెసు సేవాదళ్ కూడా ఎందుకు పాల్గొనలేదు? ఢిల్లీకి చెందిన ఒక సీనియర్ కాంగ్రెస్ ఎం.పి: పాల్గొనివుండే వారమే. కాని మనకు యూనిఫారాలకు సంబంధించి యిబ్బంది వున్నది.

ఇంకొక సభ్యుడు : ఏమిటా యిబ్బంది?

ఢిల్లీ నాయకుడు : బావుంది, మనకు వున్నది 250 యూనిఫారాలు మాత్రమే. ఆర్.యస్.యస్‌వారి బలగం యింతకంటె ఎంతో ఎక్కువగా వుంటుం దని ఎలాగు తెలుసుగనుక, వారితో పోలిస్తే సేవాదళ్ ప్రదర్శనం పేలవంగా వుంటుందని భావించాం.

మొదటి ఎంపి: ఆర్.యస్.యస్ యూనిఫారాలు యివ్వదు. ప్రతి స్వయంసేవక్ తన యూనిఫారం తనే కొనుక్కుంటాడు.

1965లో భారతదేశం మీద పాకిస్తాన్ దండెత్తిన సమయంలో శ్రీ లాల్ బహదూర్‌శాస్త్రి ప్రధాన మంత్రిగా వున్నారు. 1965 సెప్టెంబరు 5న సాంగ్లిలో వున్న గురూజీకి ఆయన ప్రత్యేకంగా ఫోన్ చేసి, ఢిల్లీలో మరునాడు ఉదయం 10 గంటలకు జరుగతున్న అఖిల పక్షనాయకుల సమావేశానికి రావలసిందిగా అభ్యర్థించారు. బొంబాయినుంచి ఉదయం బయలుదేరే విమానంలో ప్రయాణానికి టికెట్టు ముందే బుక్ చేయించానని కూడా శ్రీ శాస్త్రి గురూజీకి తెలియజేశారు.

ఆర్.యస్.యస్. తరపున శ్రీ గురూజీ తమ సంపూర్ణ సహకారాన్ని ప్రకటించారు. దేశమంతటా స్వయంసేవకులు గాలన్లకొద్దీ రక్తాన్ని ఇచ్చారు. పోలీసులు మరింత ముఖ్యమైన విధులు నిర్వహించడానికి వీలుకల్పిస్తూ, ఢిల్లీలో కొన్ని పోలీసు బాధ్యతలను స్వయంసేవకులకు బదిలీ చేయడం జరిగింది. సరి హద్దులవైపు సాగిపోతున్న జవాన్‌లకు పండ్లు అందించ బడినాయి. యుద్ధం ముగి సిన పిమ్మట జనరల్ కుల్వంత్‌సింగ్ పంజాబ్ శాసనసభలో భారతీయ జనసంఘ సభ్యుడయిన కృష్ణలాల్ మెయిసీతో మాట్లాడుతూ భారతదేశానికి పంజాబ్ కృపాణహస్తం ఆర్.యస్.యస్. అని ప్రశంసాపూర్వకంగా అభివర్ణించారు.

అట్టివారు – శ్రీ గురూజీ ! వారి చేతులలో సంఘం ఆ విధంగా రూపు దిద్దబడింది ! శ్రీ గురూజీతో ఒక్క గంట మాట్లాడితేచాలు – అదే గొప్ప అధ్యయనం. ఎక్కడకువెళ్ళినా వారు మాధుర్యాన్ని, మహా విజ్ఞానదీప శిఖలను పంచారు. కంటినిండుగా నవ్వు, ముత్యాలదొంతరల హాసం "తవానా బువాద్ హర్‌కీదానా బువాద్" (జ్ఞాని ఎప్పుడూ చైతన్యమయంగానే వుంటాడు) అని పర్షియన్ లోకోక్తి. గురూజీ ఎల్లప్పుడూ చైతన్యమయులై వుండేవారు. కాన్స రులో కూడ వారి సునిశిత హాస్యస్వభావం చెరగలేదు. వారి గుండెకు శస్త్ర చికిత్స జరిగిన కొద్దిరోజులకు టాటా కాన్సర్ హాస్పిటలులో తనను చూడటానికి వచ్చిన పంజాబ్ ఆర్.యస్.యస్ కార్యదర్శి ధర్మవీరను చిరునవ్వుతో "కీ గాల్ అయే బాద్‌షాహ" అంటూ, పంజాబీతరహాలో స్వాగతిస్తూ, తాను అద్భుతంగా వున్నానని – తన వట్టి ఎముకలమీద పది పౌనుల బరువు పెరిగిందికూడానని అన్నారు.

1973 జూన్ 5న వారు దివంగతులయినప్పుడు, "వారి భావాలతో ఏకీభవించడం నావల్లకాదు" అనే ప్రధానమంత్రి "శ్రీ గురూ జీ తమవ్యక్తిత్వపు ప్రభావంతో, తన భావాలపట్లవున్న అచంచలశ్రద్ధతో జాతీయజీవనంలో ఒక గౌరవప్రదమైన స్థానాన్ని నిలుపుకున్నారు" అని వ్యాఖ్యానించారు. ఎన్నడూ పార్లమెంటుసభ్యులుకాని శ్రీ గురూజీనిర్యాణానికి అపూర్వమైన సంప్రదాయంతో పార్లమెంటు సంతాపం వ్యక్తంచేసింది

వారి నిర్యాణం తరువాతనే తెరిచి చదువబడిన వారి మూడు హిందీ లేఖలలో-సర్ కార్యవాహగా వున్న బాలాసాహెబ్ దేవరస్‌ను సర్ సంఘచాలక్‌గా సూచించారు; తన గౌరవార్థం స్మారకాలు నెలకొల్పవద్దని విజ్ఞప్తి చేశారు; తాను ఎవరికైనా పొరపాటున బాధకలిగించి వుండవచ్చునని అంటూ ఆట్టి స్వయం సేవకులందరిని "ముకుళిత హస్తాలతో" క్షమాపణ అభ్యర్థించారు. మనకాలపు ఒక మహా చైతన్యమూర్తి మన హృదయాలను కదిలిస్తూ యిచ్చిన వీడుకోలు అది. "డా॥ హెడ్‌గెవార్ యొక్క చైతన్యానికి ప్రతిరూపమే వీరు" అని 1942లో తాను ఏ సహచరుడిని అయితే అభివర్ణించారో, వారినే తన వారసునిగా మనకు అందించారు-శ్రీ గురూజీ.

ధర్మం జయించిన వేళ

డా॥ హెడ్గెవార్ ఎలాంటివారో మీరు తెలుసుకొనదలిస్తే, ఈ యువకుణ్ని చూడండి చాలు. డా॥ హెడ్గెవార్‌కు ప్రతిరూపమే యితడు."

సంఘ సంస్థాపకుని దర్శించే మహద్భాగ్యం పొందని స్వయంసేవకులకు, వారి శిక్షణ తరగతులలో, బాలా సాహెబ్ దేవరస్‌ను పరిచయంచేస్తూ 40లలోనే శ్రీ గురూజీ పైవిధంగా అంటూవుండేవారు.

మధుకర దత్తాత్రేయ దేవరస్ 1915 నవంబరు 5న నాగపూరులోని ఒక సంపన్న కుటుంబంలో జన్మించారు. తొమ్మిదిమంది సంతానంలో ఆయన ఎనిమిదవవారు. వారి కుటుంబీకుల పూర్వనామం-దేవరాజులు-అని వుండేది. కొన్ని తరాల క్రిందట వారు ఆంధ్రప్రదేశ్‌నుండి నాగపూరుకు తరలివచ్చారు. వారికి వ్యవసాయ భూములు వుండేవి. బాలాసాహెబ్ తండ్రి ప్రభుత్వోద్యోగం చేస్తుండేవారు బాలాసాహెబ్ చిరుప్రాయంలో వుండగా అతని కనుబొమలు అకస్మాత్తుగా నెరవటం మొదలయింది. తండ్రి అతనిని తన గురువు వద్దకు తీసుకుపోగా ఆయన చూచి యీ బాలుడు భవిష్యత్తులో చాల గొప్పవాడవుతాడని జోతిష్యం చెప్పాడు సహజంగా తన కుమారుడు పెద్ద ప్రభుత్వాధికారి అవుతాడని ఆ తండ్రి భావించాడు.

మానవుడొకటి తలుస్తే భగవంతుడు వేరొకటి తలుస్తాడుగదా! మధుకర్ 12 ఏండ్ల వాడుగా వున్నపుడే డా॥ హెడ్గెవార్‌తో పరిచయం ఏర్పడింది. తండ్రికి మధుకర్‌మీద మిక్కుటమైన వాత్సల్యం. ఇప్పుడు డా॥ హెడ్గెవార్ కూడ ప్రత్యేక దృష్టితో యితనిపై శ్రద్ధవహిస్తున్నారు. న్యూయింగ్లిష్ స్కూలులో మెట్రిక్యులేషన్ పూర్తి చేసిన తరువాత నాగపూర్‌లోనే మారిస్ కాలేజిలో చేరాడు. శ్రీ మధుకర్‌జీ సంఘంలో కుశపథక్ (బృందము)లో చాలా ఉత్సాహవంతంగా ఉండేవారు. వారు విప్లవ కార్యకలాపాలలో చురుకుగా పాత్ర నిర్వహించేవారు. వారిలో కొందరు బాంబుల తయారీ కూడా తెలిసినవారు కాని

డాక్టర్‌జీ విప్లవకారులుగా తన అనుభవాల ఆధారంతో ఆ బృందానికి పదిరోజుల పాటు సుదీర్ఘమైన చర్చలు జరిపి, జాతి నిర్మాణంలో వారు అవలంబిస్తున్న విధానం సరియైనది కాదని నచ్చజెప్పగలిగారు.

1935లో సంస్కృతము, తత్త్వశాస్త్రాలలో బాలాసాహెబ్ పట్టభద్రులయినారు. రెండు సంవత్సరాలపిమ్మట న్యాయశాస్త్రంలో కూడా ఉత్తీర్ణులయినారు. పట్టాకూడా తీసికున్నారు. నల్లగౌనుకూడా కుట్టించుకున్నారు. ఆఖరికి 'బోర్డు' కూడా వ్రాయించడం జరిగింది. కాని అదెన్నడూ తగిలించబడలేదు. ఇంతకంటె మహత్తర కార్యక్రమాన్ని శ్రీ బాలసాహెబ్‌జీ చేయవలసి వున్నది.

ఆ సంవత్సరమే వారు అనాథ విద్యాగృహంలో నెలకు రు. 25ల 'గొప్ప' వేతనంతో అధ్యాపకవృత్తి చేపట్టారు. సంపాదన వారి ధ్యేయంకాదు. యువకులతో పరిచయాలు ఏర్పరచుకొనడమే వారి ఆశయం.

1939లో బాలాసాహెబ్ బెంగాలుకు ప్రచారక్‌గా వెళ్ళాలని నిశ్చయమైంది. వారి తండ్రి ఆగ్రహోదగ్రులయినారు. ఏమయినాసరే తన కుమారుడు ప్రచారక్ కారాదని, కలకత్తాకు వెళ్ళకూడదని ఆయన తీర్మానించారు. అయినా అనుకున్ననాటికి బాలాసాహెబ్ కలకత్తాకు బయలుదేరివెళ్ళారు. ఆరోజు వారికోసం వారి తండ్రి రైలులోనూ బయటా అంతటా గాలించి చూసినా, లాభంలేకపోయింది. బాలాసాహెబ్ పైనున్న బెర్తుపై ఒక ప్రక్కచుట్టలో ముడుచుకొని దాగివున్నారు. కొడుకును ప్రేమించే ఆ తండ్రి ఆగ్రహం ఎంతటిదో ఆరోజు ఆయననుచూసినవారికి యిప్పటికీ జ్ఞాపకమే. ఆరోజు ఆయన డాక్టర్‌జీని తిట్టని తిట్టులేదు; ఆయన చేయగలిగింది అదేకదా!

1940లో డాక్టర్‌జీ పరమపదించిన తరువాత బాలాసాహెబ్ నాగపూర్ తిరిగివచ్చి నగర కార్యవాహ అయినారు. తరువాత సహసర్ కార్యవాహ అయి, 1965లో సర్ కార్యవాహ ఆయినారు. 1973 జూన్ 5న శ్రీ గురూజీ దివంగతులయినమీదట ఆ మరునాడు బాలాసాహెబ్ దేవరస్‌ను సర్‌సంఘచాలక్‌గా నిర్ణయించటం జరిగింది.

ఈ విషయమై శ్రీ గురూజీ గతంలో ఎన్నడయినా ప్రస్తావించారా అని తరువాత అడుగగా : "లేదు. ఆ ప్రకటన నాకు పూర్తి విస్మయాన్ని కలిగిం

చింది. నాటి (జూన్ 6) సాయంకాలం గం. 5-30లకు శ్రీ గురూజీ వ్రాసిన లేఖను తెరిచి అక్కడ సమావేశమైవున్న ప్రజలకు చదివి వినిపించినప్పుడు మాత్రమే నాకు తెలిసింది. శ్రీ గురూజీ ఆ విషయాన్ని ప్రాంత సంఘచాలకులతో చర్చించినట్లు, నాకు యిప్పుడు తెలుసు. అయితే నాతోమాత్రం ఎన్నడూ వారు ఆ సంగతి ప్రస్తావించనేలేదు".

"పోతే. వారితో ఆ విషయం ప్రస్తావించాలని నేనే ఎన్నిమార్లు అనుకున్నానుకాని, అది మరీ ఎబ్బెట్టుగా అనిపించి మానుకున్నాను. 33 సుదీర్ఘ సంవత్సరాలు శ్రీ గురూజీ నిరంతరాయంగా ఎంత శారీరక శ్రమకు ఓర్చుకున్నారో నేను చూశాను. అంత కఠోర శ్రమకు తట్టుకునే ఆరోగ్యం నాకు వున్నదా అని నాకెప్పుడూ సంశయంగానే వుండేది.

శ్రీ గురూజీ చేసిన నిరంతర ప్రయాణాలు సంఘానికి అత్యంత అవసరం. ఎందుకంటే ఒకానొక ప్రత్యేక ప్రదేశాన్ని వారు సందర్శిస్తేనేచాలు దాని వల్ల సంఘకార్యాభివృద్ధికి నిజంగానే ప్రేరణ లభించేది. నేను అంత అనివార్యమైన వ్యక్తిని కాననుకుంటాను. నాకంటే అనుభవజ్ఞులయిన యితర కార్యకర్తలు వివిధ ప్రాంతాలలో సంఘకార్యాన్ని నిర్వహిస్తూ అక్కడ అనివార్యంగా వున్నారుకనుకనే, అంత 'తప్పనిసరి' కాని నన్ను సర్ సంఘచాలక్ పదవికి ఎంపిక చేసినట్లు స్పష్టంగా తెలుస్తున్నది". అని బాలాసాహెబ్ వివరించారు.

శ్రీ గురూజీవలెనే మీరుకూడా ఆధ్యాత్మికదృక్పథం వున్నవారా అని అడుగగా "నా మనసుకు ఆధ్యాత్మికతవైపు ఏ మాత్రం మొగ్గులేదనే అనుకుంటున్నాను" అని నిర్మొగమాటంగా ప్రత్యుత్తరమిచ్చారు.

సంఘంకాక యితర విషయాలలో ఏమయినా ఆసక్తి వున్నదా అని అడుగగా తనకు వ్యవసాయంలో అభిరుచి వున్నట్లు బాలాసాహెబ్ చెప్పారు. "నేను మంచిరైతును. ఆ విషయంలో చక్కగా పనిచేసి కొన్ని బహుమతులుకూడా అందుకున్నాను. అందులో నాకు నిజమైన శ్రద్ధవుంది. వ్యవసాయంలో క్రొత్త విధానాల గురించి నేను చాలా చదివాను. అత్యంత ఆధునిక పద్ధతులే అవలంబిస్తుంటాను" అని చెప్పారు.

ట్రాక్టర్లు వాడుతున్నారా అని ప్రశ్నించగా "ట్రాక్టర్లు మాత్రంలేవు. మంచి పాత ఎద్దులున్నాయి. వాటినే ఉపయోగిస్తున్నాను. అయితే ఎలక్ట్రికల్

పంపు, స్ప్రేయర్లు, డస్టర్లు, క్రొత్త విత్తనాలు, హైబ్రిడ్ తరగతులకు చెందిన విత్తనాలను గురించిన చక్కని పరిజ్ఞానం-యివి వున్నాయి. ప్రతి ఋతువులోను తొలుత జొన్నలు వేసి ఆ తరువాత గోధుమలు వేస్తున్నాను. గ్రామీణజనులు నా మార్గదర్శనం అడుగుతుంటారు. నాదగ్గర ఎప్పుడూ విత్తనాల నిలవ సిద్ధంగా వుంటుంది. నా సహచరులందరకు కొంత వుపయోగ పడుతున్నాననే నమ్ముతున్నాను." అని అన్నారు.

పత్రికారంగంలో కూడ బాలాసాహెబ్‌కు ఆసక్తివున్నది. నాగపూర్ నుంచి 'తరుణభారత్' (మరాఠీ), 'యుగధర్మ' (హిందీ) పత్రికల సముదాయాన్ని వెలువరించే నరకేసరి ప్రకాశన్‌కు అనేక సంవత్సరాలు మేనేజింగ్ డైరెక్టరుగా వారు పనిచేశారు.

మంచి పరిపాలకుని గురించి మీ కల్పన ఏమిటని 1974లో అడుగగా-ప్రతి మంచి పరిపాలకునికి ముఖ్యంగా మూడు లక్షణాలుండాలని శ్రీ బాలా సాహెబ్ చెప్పారు. "ముందుగా, అతడు చేసేది ఏదయినా దేశం కోసమేనా లేక తన కోసమా అనేది మొదటి ప్రశ్న. మీ ఆలోచనలు నిజం అయ్యేట్లు చూడటానికి అధికారం ఉపయోగపడుతుందని నేను అంగీకరిస్తాను. కాని ఎప్పుడూ అలా జరిగి తీరుతుందనలేము. సాధారణంగా పరిపాలకుడు తన అధికారంతో,తన భద్రతతో సతమతమై వుంటాడు. రెండో ప్రశ్న. అతడు తన అనుచరులనుంచి మంచితనం, యోగ్యత, ప్రజ్ఞ వున్న క్రొత్త నాయకులను తయారు చేశాడా అనేది. సమర్థులైన ద్వితీయశ్రేణి నాయకత్వాన్ని రూపొందించడం మంచి నాయకుని కర్తవ్యం. ఏ నాయకుడూ శాశ్వతంగా జీవించివుండడుకదా ! ఇక మూడోది, అతని పరిపాలన వలన సామాన్య మానవుడు ఏమయినా ప్రయోజనం పొందాడా అది సాంఘిక న్యాయమనండి లేదా ప్రజా సంక్షేమం అనండి-ఈ ప్రయోజనం యొక్క పరిమాణం ప్రత్యక్షంగా నాయకుని ఉదాత్తతను అనుసరించివుంటుంది" అని వివరించారు.

1958 నుంచి మధుమేహంతో బాధపడుతున్నా ! వర్షఋతువు మినహా మిగతా సంవత్సరమంతా, బాలాసాహెబ్ విస్తృతంగా పర్యటిస్తుంటారు.

సర్ సంఘచాలక్ అయిన తరువాత వారు మొదటగా కలుసుకున్న ప్రముఖులలో ఆచార్య వినోబా భావే ఒకరు. వినోబాజీ వారిని ఆశీర్వదించారు.

హిందీలో "నాగరికతగల" అనే అర్థాన్ని యిచ్చే "సభ్య" పదాన్ని, గుజరాతీలో "సభ్యుడు" అనే అర్థాన్నిచ్చే అదే పదాన్ని వినోబాజీ వినోదంగా ఉపయోగిస్తూ " మైఁ సంఘకా అసభ్య సభ్య హూఁ " (నేను సంఘంలో గౌరవ సభ్యుణ్ని) అన్నారు.

1973లో బాలాసాహెబ్ ఢిల్లీ సందర్శించి 'కాన్‌స్టిట్యూషన్ క్లబ్' లో సమావేశమైన ప్రముఖ పౌరుల సమావేశంలో మాట్లాడుతూ "మహనీయులయిన డా॥ హెడ్గెవార్, గురూజీ గోళ్వాల్కర్‌ల తరువాత నేను సర్‌సంఘచాలక్ అయ్యాను. నా శక్తియుక్తులేమిటో నాకు బాగా తెలుసు. గోళ్వాల్కర్ అద్భుత నాయకత్వంలో నేను సమర్థుడైన నిర్వాహకుడిగా పనిచేశానని, ముందు ముందు ఎలా నిర్వహించగలుగుతానో అని, నా గురించి స్టేట్స్‌మన్ వ్రాసింది. 'స్టేట్స్‌మన్' వ్రాసింది 'స్టేట్స్‌మన్' సందేహాలు సరైనవే. కాని సంఘం నాయకుడి మీద ఆధారపడి నడచే సంస్థకాదు. ఆదర్శంమీద ఆధారపడి వుండే సంస్థ. అందు చేతనే డాక్టర్‌జీ తర్వాత కూడ వృద్ధిచెందుతూనే వచ్చింది. ఆకారణం చేతనే గురూజీ తరువాత కూడా సంఘకార్యం దినదినాభివృద్ధి చెందుతుందని మేమంచ రము విశ్వసిస్తున్నాము.

"ఆర్.యస్.యస్.లో వుండే మేము యిది హిందూరాష్ట్రమని నమ్ముతున్నాము. అందులో మత తత్వం లేదు. ఇటీవల రామేశ్వరంలో అర్చన జరిపిన తరువాత ప్రధానమంత్రి పత్రికల వారితో మాట్లాడుతూ, రామేశ్వరం మన సమైక్యతకు సంకేతం అని భావిస్తున్నాను అన్నారు. ఆమె చెప్పింది ఎంతో నిజం. అనేకవేల సంవత్సరాలుగా మనం ఒకే జాతిగా వుంటున్నాము.

"శ్రీ గురూజీ నిర్వహించిన కార్యం సంకుచితంకాదని, మతతత్వ పూరితముకాదని, వారు ముస్లింలను జాతీయ ప్రధానవాహినిలోకి తీసుకొనిరావడానికి కృషిచేశారని - గురూజీ గతించినపిమ్మట - ఆచార్య వినోభా, జయప్రకాశ్‌జీ, ధర్మాధికారిజీ అంతా అన్నారు.

"నేడు హిందువులు బలహీనంగా ఎవరికివారుగా వున్నారు. హిందువులు శక్తివంతులై సమైక్యత సాధిస్తే దేశంకూడా శక్తివంతమై సమైక్యంగావుంటుంది. శక్తివంతమైన సమాజమే శక్తివంతమైన ప్రభుత్వాన్ని ఏర్పరుచుకుంటుంది.

శక్తివంతమైన సైన్యాన్ని రూపొందించుకుంటుంది. ఇంగ్లాండు శక్తివంతంగా వున్నందువలననే ఒక ఛాంబర్లేన్‌ను త్రోసిపారేసి, ఒక చర్చిల్‌ను సృష్టించి పరాజయపు కోరలనుంచి ఘనవిజయాన్ని సాధించుకున్నది.

"సాపుశత్యాబ్దంగా మనం స్వతంత్రులమై వున్నాము. కాని మనం సాధించిన దేమిటి ? దేశవిభజన జరిగిందని, శరణార్థులు వచ్చారని, నాలుగు యుద్ధాలు, కరువులు ముంచుకొచ్చినై అని - అంటున్నారు. ఇజ్రాయల్‌కుకూడ యీ సమస్యలన్నీ వున్నాయి. విభజనతోనే మొదలయింది ఆ దేశం కథ కూడ. వారి జాతీయులంతా దాదాపుగా శరణార్థులే. ఇజ్రాయల్ ఎడతెగకుండా యుద్ధం చేస్తూనేఉంది. లేదా యుద్ధప్రమాదంలో జీవిస్తూవచ్చింది. వారి దేశం ఎక్కువ భాగం ఎడారి. అయినా ఆ చిన్నదేశం ఎంతో శక్తివంతంగా వుంది. వారిసమాజం శక్తివంతంగా వుండటమే దీనికి కారణం. ఇక్కడకూడా మన సమస్య మనిషి- మనం అతనిని జాగృతంచేయాలి, సంఘటితపరచాలి, శక్తివంతం చేయాలి- హిందూసంఘటనయొక్క హేతుబద్ధత యిదే" అన్నారు శ్రీ బాలాసాహెబ్.

తరువాత ప్రముఖులనుంచి వచ్చిన ప్రశ్నలకు సమాధానమిస్తూ "సంఘం పట్టణాల్లో వున్నంత బలంగా గ్రామాలలో లేకపోవచ్చు. కాని గ్రామాల్లోకూడ సంఘం వున్నది. నేను ఇప్పుడే తూర్పు ఉత్తరప్రదేశ్ నుండి వస్తున్నాను. అక్కడ గోరఖ్‌పూర్, కాశీ రెండు జిల్లాలలోనే ఒక్కొక్కదానిలో వందేసిశాఖలు పైగా వుండటం నేను గమనించాను. వీటిలో ఒక అరడజను పట్టణాలలోనివి కాగా మిగతా శాఖలన్నీ గ్రామాలలోనివే. ఏమైనా గ్రామీణ ప్రాంతాలకు పట్టణాలు కేంద్రంగా వుంటున్నాయి.

ఆర్. యస్. యస్. ఉత్తరాన బలంగా వుంది. దక్షిణాన బలహీనంగా వున్నట్లుకూడ ఒక దురభిప్రాయం వున్నది. ఇది కూడ నిజంకాదు. మంగళూరు, కాలికట్, ఎర్నాకుళం - వీటిలో ఒక్కొక్క జిల్లాలో వందకు మించి శాఖ లున్నాయి. అని చెప్పారు: "తమకు నచ్చిన రాజకీయ పార్టీలో చేరే స్వేచ్ఛను స్వయంసేవకు లందరికి ఆర్. యస్. యస్. యిస్తుంది: ఆ స్వేచ్ఛ వారు వినియోగించుకుంటారనే ఆశిస్తాను".

"ఏమయినా స్వయంసేవకులలో ఎక్కువమంది జనసంఘంలోనే చేరుతున్నారని మీరు అనవచ్చు. అందుకు కారణం వుంది. 1946 లో మీరట్

సమావేశంలో కాంగ్రెసు ఆర్. యస్. యస్. ను నిరసించింది. 1948 లో మహాత్మాగాంధి హత్యకు ఆర్. యస్. యస్. మీద నింద మోపాలని ప్రయత్నించింది. శ్రీ గురూజీని, నాతో సహా వేలాదిమంది సంఘ కార్యకర్తలను ఐ. పి. సి. 302 సెక్షను (హత్య) క్రింద అరెస్టు చేయడం జరిగింది. ఒక వారం తరువాతనే దానిని ప్రివెంటివ్ డిటెన్షన్ గా మార్పు చేశారు.

ఆర్. యస్. యస్. అగ్ని పరీక్షకు గురి చేయబడిన యీ విషమ సమయంలో ఏ రాజకీయ పక్షమూ సానుభూతి వచనం పలుకలేదు. కనీసం పార్లమెంటులో ఒక ప్రశ్న అడిగే ఎం. పి. అయినా కనిపించలేదు. ఈ రకమైన పరిస్థితి ఏమీ బాగాలేదని మాకు అనిపించింది.

"సంఘ కార్యకర్తలు కాంగ్రెసులో చేరాలని సర్దార్ పటేల్ ఎంతో ఉత్సుకత చూపించారు. అలా జరిగితేనే జాతీయ ప్రయోజనాలు నెరవేరుతాయని ఆయన గురూజీకి వ్రాశారు. కాని కాంగ్రెసులోని కొన్ని శక్తులు, ప్రత్యేకించి సోషలిస్టులు దీనిని వ్యతిరేకించారు. కనుక అది సాధ్య పడలేదు. ఈ కారణంచేతనే, జనసంఘం ఏర్పడినపుడు పలువురు స్వయంసేవకులు సంతోషంతో అందులో చేరి, దాని నేటి స్థితికి కారకులయ్యారు.

ఏమయినా, రాజకీయ అస్పృశ్యత అంతరించినపుడు స్వయంసేవకులు తమ అభిరుచుల ననుసరించి విభిన్న పార్టీలలో చేరాలనేదే మా ఆకాంక్ష. మొరార్జీభాయి, కృష్ణమీనన్, సుభద్రా జోషీలు ఒకే పార్టీలో పనిచేయ గలిగినపుడు, యితరులు మాత్రం అలా ఎందుకు చేయలేరు?" అని బాలాసాహెబ్ వివరించారు.

మరో ప్రశ్నకు సమాధానం యిస్తూ "ఆర్. యస్. యస్. లో కంటె ఎక్కువగా స్వేచ్ఛాయుతమైన చర్చలు జరిగే సంస్థ వున్నట్లు నాకు తెలియదు. అయినా కొందరు ఆ వ్యవస్థనే ప్రజాస్వామ్యంగా అనుకొంటున్నట్లున్నారు. క్రమ శిక్షణను నియంతృత్వంగా వారు పరిగణిస్తున్నారు. ఆర్. యస్. యస్. కు ప్రజాస్వామ్యంలో నమ్మకముంది. క్రమ శిక్షణలోనూ నమ్మకముంది." అని చెప్పారు.

జె. పి. ఉద్యమం విస్తరించడం మొదలయినప్పుడు, సంస్థగా ఆర్. యస్. యస్. అందులో చేరలేదు. కాని అందులో పాల్గొనడానికి స్వయంసేవకులు తమ స్వేచ్ఛ వినియోగించుకున్నారు. బీహారులో పెద్ద సంఖ్యలో స్వయంసేవకులు అందులో చేరారు.

పాట్నా సచివాలయం ఎదుట నిరాయుధులైన ప్రదర్శకులపై, పోలీసులు కాల్పులు జరిపినపుడు ప్రజల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. విద్యార్థి పరిషత్‌కు చెందిన శ్రీ రామ్‌బహదూర్ రాయ్, అదే సంస్థకు చెందిన విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం అధ్యక్షుడు శ్రీ సుశీల్ మోడి - జె. పి. ని కలుసుకొని, పెల్లుబుకుతున్న ప్రజా ఉద్యమానికి నేతృత్వం వహించమని అభ్యర్థించారు. కొన్ని రోజులపాటు జయప్రకాశ్ అందులోని ఉచితానుచితాలను వితర్కించుకున్నారు. అన్ని పరిస్థితులలోను పూర్తి అహింసకు కట్టుబడి వుంటామని హామీ యిచ్చిన మీదటనే ఆయన నాయకత్వం వహించడానికి అంగీకరించారు. బీహారు శాసన సభ్యులంతా తమ స్థానాలకు రాజీనామా యివ్వాలని ఆయన పిలుపు యిచ్చారు. చాలామంది ఆ పిలుపుకు ప్రతిస్పందించారు. ఆ విధంగా జె. పి. ఉద్యమం ముందుకు సాగింది.

బాలాసాహెబ్ జె. పి. ఉద్యమాన్ని ప్రశంసించారు. 1974 డిసెంబరులో ఢిల్లీలో మాట్లాడుతూ అవినీతి, యితర బలహీనతల నుంచి రాజకీయ క్షేత్రాన్ని ప్రక్షాళనం చేయడానికి మాత్రమే జయప్రకాశ్‌జీ ప్రయత్నిస్తున్నారన్నారు- "ప్రాచీన కాలంలో మన సన్యాసులు అన్నింటికి అతీతంగా వుంటూ కూడ పరిపాలకులు అపమార్గాలు త్రొక్కినపుడు ప్రజలకు నాయకత్వం వహించడానికి వెనుదీయలేదు. ఆ కోవకు చెందినవారే జయప్రకాశ్‌జీ. అధికార ప్రలోభాలకు లొంగక ప్రజలను నిస్వార్థంగా సేవించడమే ధ్యేయంగా పెట్టుకున్న మహాత్మా గాంధీ. వినోబాభావే, గురూజీ గోళ్వాల్కర్‌ల వంటి ఉదాత్త నాయకులు తలపెట్టిన కార్యాన్ని జె. పి. కేవలం పరిపూర్తి చేస్తున్నారు," అన్నారు.

తరువాత బొంబాయిలో మాట్లాడుతూ, "జాతీయ భావనతో శక్తివంతమై వున్న ప్రజలలో విదేశీ భావాలపై ఆధారపడే సిద్ధాంతాలు అభివృద్ధి చెందటం సాధ్యం కాదు గనుకనే ఆర్. యస్. యస్. మీద నిషేధం విధించాలని కమ్యూనిస్టులు కోరుతున్నారు" అని చెప్పారు. తమ మార్గంలో ఆర్. యస్. యస్.

ప్రధానమైన అడ్డంకిగా కమ్యూనిష్టులు గుర్తించారు. అందుకే ప్రభుత్వం చేత ఎలాగయినా సంఘాన్ని నిషేధింప జేయాలని వారి ప్రయత్నాలు.

జె. పి. ఉద్యమం ప్రభంజనంగా మారడంతో ప్రభుత్వం స్థిమితాన్ని కోల్పోయి కమ్యూనిష్టుల అభీష్టం మేరకు కక్ష సాధింపులకు దిగింది. జాతీయ అత్యవసర పరిస్థితి ప్రకటించి, ఆర్. యస్. యస్. ను నిషేధించింది. ఎమర్జన్సీ ప్రకటించిన మొదటి కొద్ది రోజులలోనే బాలాసాహెబ్ సహా అయిదువేలమంది ఆర్. యస్. యస్. క్రియాశీలక కార్యకర్తలను మీసా కింద నిర్బంధించింది. తరువాత నెలలలో మరో 25,000 మందిని మీసా క్రింద అరెస్టు చేసింది. మొదట్లో దిగ్భ్రాంతి పొందినా, ఆర్. యస్. యస్. ఆ షాక్ నుంచి తేరుకుని, అపూర్వమైన ఆత్మ విశ్వాసంతో పరిస్థితిని ఎదుర్కొని నిలిచింది. మాధవరావు మూలే, ప్రొ॥ రాజేంద్రసింగ్, భావురావు దేవరస్, మోరోపంత్ పింగళే, బ్రహ్మదేవ్, బాపూరావు మోఘేలు ఆర్. యస్. యస్. అధిష్ఠాన వర్గంగా రూపొంది, అన్ని కార్యకలాపాలకు వ్యూహ నిర్మాతలుగా వ్యవహరించారు. యాభైవేలమంది ఆర్. యస్. యస్. కార్యకర్తలు అజ్ఞాతవాసంలోకి వెళ్లారు. వారందరిపై వారంట్లు వున్నప్పటికీ ఎవరి ఆచూకీ దొరకలేదు. దాదాపుగా వారంతా ధోవతి, చొక్కాలు మానేసి, పాంట్లు, బుష్ షర్టులు వేసుకొనడం మొదలు పెట్టారు. జుట్టు పెంచడం, జుట్లుకు రంగు వేసుకొనడంలో అవతారాలు పూర్తిగా మారిపోయినై. ఉదాహరణకు సుబ్రమణ్యస్వామి సర్దార్ అయినాడు. కాని ఆయనకు పంజాబీ రానందున 'కెనాడా నుంచి శిఖ్ఖు' గా చెలామణి అయ్యాడు. నానాజీ దేశ్ముఖ్‌కు కళాకారుడు నానా వాఘ్ చేసిన మేకప్ ఎంత చక్కగా కుదిరిందంటే, వారిని వారి ఫోటోగ్రాఫులతో పోల్చి చూసిన పోలీసు అధికారులు, అతడే నానాజీ అంటే అసలు నమ్మలేదు.

ఎమర్జెన్సీని బహిరంగంగా ధిక్కరించి, తద్వారా ప్రజలలోని భీతావహ స్థితిని పోగొట్టాలని, ఎట్టి పరిస్థితులలోను హింసాకాండ జరుగనీయరాదని నిర్ణయించబడింది. ఈ రెండు లక్ష్యాలలోను ఆర్. యస్. యస్. సమంగానే విజయం సాధించింది. జార్జి ఫెర్నాండజ్ ప్రేరేపణతో జరిగిన కొద్దిపాటి సంఘటనలు మినహాయిస్తే-ఎక్కడా హింస తలయెత్తలేదు. అదేసమయంలో ప్రతిఘటనా జ్వాలను జ్వాజ్వలమానంగా నిలపడం జరిగింది.

1975 జూలైలో పార్లమెంటు ప్రారంభమైన రోజున దశాలవారీగా ఆర్. యస్. యస్. కార్యకర్తలు ఢిల్లీ మొదలైనచోట్ల సత్యాగ్రహం చేశారు. ఢిల్లీలో సత్యాగ్రహం చేసినవారిలో దీర్ఘకాలం ఢిల్లీమేయరుగా పనిచేసిన లాలాహంసరాజ్ గుప్తకూడ వున్నారు. తరువాత కొద్దిరోజులలో 25,000 మంది వ్యక్తులు (వారంట్లువున్నవారు కాదు) జైళ్ల భర్తీచేశారు. ఇలా పెద్దయెత్తున అరెస్టులు జరిగినప్పటికి, కొద్ది వారాలలోనే బాలాసాహెబ్ నిర్బంధంలోవున్న యరవాడ నుంచి, ఆర్.యస్.యస్. శాఖ వున్న చిన్నగ్రామంవరకు, అజ్ఞాతంగానే, పూర్తి వారైా సంబంధాలు ఏర్పాటయినై.

1965 అక్టోబరులో న్యూఢిల్లీలో కామన్వెల్తు పార్లమెంటరీ సదస్సు జరిగింది. ఎర్రకోటలో అ సందర్భంగా యివ్వబడిన విందు కార్యక్రమంలో ఆర్. యస్.యస్. కార్యకర్తల దళం ఒకటి నినాదాలుచేసి అజ్ఞాత సాహిత్యాన్ని పంచిపెట్టారు. ఈ పనిచేసిన బాలురను చావచితకదన్నారు. కాని ఇందిరమ్మ ఎమర్జెన్సీ లోపభూయిష్టమైనదని ప్రపంచ వార్తాసంస్థలకు తెలిసిపోయింది. బ్రిటిష్ పార్లమెంటు సభ్యులు తాజ్‌ను చూడడానికి అగ్రా వచ్చినపుడు వారికి "భారతదేశంలో మెరుగయిన పరిస్థితులు" అనే దొంగ శీర్షికతో ప్రతిపక్షాల కరపత్రం ఒకటి లందజేయబడింది. వారు భోజనానికి కూర్చున్న సమయంలో ప్రతి తువ్వాలుక్రింద మరింత ప్రతిపక్షాల ఉద్యమ సాహిత్యం వారికి దొరికింది.

శ్రీమతి గాంధి పాపం పూర్తిగా నిరుత్సాహపడింది. 1975 డిసెంబరు 27న చండీఘర్ కాంగ్రెసు మహాసభలో మాట్లాడుతూ "ఆర్.యస్.యస్. అంటే ఏమిటో యింతవరకు తెలియని చోట్లకూడ అర్.యస్.యస్. గట్టిగా పాదుకొనిపోయింది. నిషేధం తరువాత దాని కార్యక్రమాలు ఆగిపోలేదు. వారు నేడు సంఘటితంగా అజ్ఞాతంగా పనిచేస్తున్నారు. కేరళవంటి ప్రాంతంకూడ ఆర్.యస్. యస్.కు స్థావరంగా తయారయింది"...

ఆక్స్‌ఫర్డు ప్రొఫెసరు అయిన డేవిడ్ సెల్‌బర్న్‌కు శ్రీమతి గాంధీతో విచిత్రమైన అనుభవం కలిగింది. ఆమెను ఎమర్జెన్సీ దినాల్లో కలుసుకొనగలిగిన కొద్దిమంది విద్వాంసులలో ఆయన ఒకరు. ఆర్.యస్.యస్.ను మీరు 'ఫాసిస్టు'గా అభివర్ణించడంలో అర్థమేమిటని ఆయన ప్రశ్నించగా వారు ఫాసిస్టులు కనుకనే

తనకు వ్యతిరేకంగా నిందాప్రచారం చేస్తున్నారని ఆమె జవాబిచ్చారు. "ఇది ఫాసిజానికి సరిక్రొత్త నిర్వచనంలా వుంది" అని తరువాత సెల్‌బర్న్ ఆశ్చర్యం వ్యక్తంచేశాడు.

ఆర్.యస్.యస్. మీద మోపబడిన అభియోగాలన్నీ అబద్ధాలని, వెంటనే నిషేధం ఎత్తివేయమని కోరుతూ ఎమర్జెన్సీ మొదలైన రెండు నెలలకు శ్రీమతి గాంధికి శ్రీ బాలాసాహెబ్ లేఖ వ్రాశారు.

సమాధానం రాలేదు. మరో మూడు నెలలు గడిచిన తరువాత ఆమె ఎన్నిక సక్రమమేనని తీర్పువచ్చినందుకు ఆమెను అభినందిస్తూ, దేశంలో అనైక్యత తాండవిస్తున్నంతకాలం సమాజ సముద్ధరణ కార్యం నెరవేరటం అసంభవమని కనుక అసహజమైన ఆపోహలు మాని సంఘం మీద నిషేధం ఎత్తివేయమని అభ్యర్థిస్తూ బాలాసాహెబ్ యింకొక లేఖ వ్రాశారు.

మరి రెండు లేఖలు వినోబాజీకి వ్రాస్తు, శ్రీమతి గాంధికి విషయాలన్ని నచ్చజెప్పి నిషేధం ఎత్తివేయించేందుకు తోడ్పడవలసిందిగా కోరారు.

ఎమర్జెన్సీలో కొందరు బి. ఎల్. డి. (భారతీయ లోక్‌దళ్) నాయకులు ఆర్. యస్. యస్. రాజీధోరణికి వచ్చిందనే దురభిప్రాయం కలుగజేయడానికి సుదీర్ఘమైన యీ లేఖలలోని మొదటి, చివరి పేరాలను కరపత్రాలుగా వేసిపంచి పెట్టారు. కాని వాస్తవమేమంటే బి.ఎల్.డి. తో కూడివున్న లోక సంఘర్ష సమితి ఇందిరాగాంధి ఎన్నికను సక్రమంగా ప్రకటించినతీర్పును శిరసావహిస్తు, అంతకు ముందు ఆమె రాజీనామాకోసం చేసిన డిమాండును లాంఛనంగా ఉపసంహరించింది. పైగా అంతవరకు సంయుక్తంగా నిర్వహించిన పోరాటాన్ని ఏకపక్షంగా ఉపసంహరిస్తూ బి.ఎల్.డి. ఒక తీర్మానం ఆమోదించింది!

తాను ఆ లేఖలు వ్రాసిన కారణాలను వివరిస్తూ అందులో ఎటువంటి తప్పులేదని బాలాసాహెబ్ అన్నారు. "ఎమర్జెన్సీ ఖైదీలలో ఎనభై శాతంమంది ఆర్.యస్.యస్. కార్యకర్తలే. వారికి, వారి కుటుంబాలకి నేను చేయవలసింది ఏమీ లేదా? గౌరవప్రదమైన పరిష్కారం కోసం అధికారులతో చర్చలు ప్రారంభింపజేయాలని నేను ప్రయత్నించడంలో తప్పేమిటి?"

ఆసక్తికలిగించే విశేషమేమంటే గాంధీజీ ఏ ఉద్యమం మొదలుపెట్టినా వెంటనే వైస్రాయికి లేఖ వ్రాస్తుండేవారు-సంభాషణలకు సానుకూలత కలిగించడానికి 'క్విట్ ఇండియా' సందర్భములోనయితే తాను జైలుకి చేరిన వారం రోజులకే గాంధీజీ వైస్రాయికి లేఖ పంపారు.

మరింత ఆసక్తికలిగించే విశేషం-సరిగా యీ సమయంలోనే ఆర్.యస్.యస్. సత్యాగ్రహపథకాలు తుదిమెరుగులు దిద్దుకుంటున్నాయి. బాలాసాహెబ్ 1975 నవంబరు 10న శ్రీమతి గాంధికి రెండవ లేఖ వ్రాశారు. తరువాత సరిగా నాలుగురోజులకే ఆర్.యస్.యస్. నిర్వహించిన బ్రహ్మాండమైన సత్యాగ్రహం ద్వారా దేశం మొత్తం మీద 80,000 మంది జైళ్లకు వెళ్లి ఎమర్జెన్సీ పాలనకు పునాదులు కదిలించారు. బాలాసాహెబ్ ఎవరితోనో ఏదో విషయంలో రాజీపడ చూశారనడం ఎంత అసంబద్ధమో దీనివలన అర్థమవుతుంది. ప్రభుత్వం గౌరవప్రదంగా తనపట్టుదల సడలించుకొని వెనుకకు తగ్గడానికి అవకాశం కల్పించడానికి మాత్రమే వారు ప్రయత్నించారు.

మొదట్లో ప్రజలను భయభ్రాంతులను చేసి నోరెత్తకుండా చేయడంలో ప్రభుత్వం విజయవంత మయింది, రైళ్ళు సకాలంలో నడుస్తున్నాయి అంటూ విదేశాలలో ఎమర్జన్సీకి ప్రతిష్ఠ కల్పించారు. కాని అనతి కాలంలోనే యీ ప్రచార ఉధృతి ప్రభుత్వానికే ఎదిరి కొట్టింది! 'సత్య సమాచార్' వంటి అసంఖ్యాకమైన ప్రచురణలు దేశమంతటా వెలువడటం మొదలయింది. (మహారాష్ట్రంలో "వందేమాతరం" మొదలైన పత్రికలు వెలువడినై.

'సత్యవాణి' తొలి సంచిక కోసం పార్లమెంటు భవనంలోనే స్టెన్సిల్సు తయారు చేయబడినవని యిప్పుడు స్పష్టంగా చెప్పవచ్చు. ఓంమెహతాకు ఎంత అనుమానం వచ్చిందంటే, పార్లమెంటులోని ప్రతిపక్ష నాయకుల గదులన్నీ గాలించాలను కున్నాడు కాని నాటి స్పీకర్ బలీరాం భగత్ అందుకు ససేమిరా ఒప్పుకోలేదు. దానికాయన ఎంతో అభినందనీయులయినారు.

"ఇందిరమ్మ యిరవై అబద్ధాలు" అనే ప్రచురణలో 20 సూత్రాల కార్యక్రమం గుట్టు రట్టు చేయబడింది. ఎల్. కె. అద్వానీ రచించిన రెండు ఎమర్జెన్సీల కథ లో 1975 జూన్ 26 నాటి శ్రీమతి గాంధి కుట్రకు, జర్మనీలో

హిట్లరు ఆకస్మాత్తుగా జరిపిన కుట్రకు ఉన్న విచిత్రమైన పోలికలు నిరూపించబడినై. శ్రీమతి గాంధి "కృత్రిమమైన ఎమర్జెన్సీ" ప్రకటించనున్నదని 1975 జనవరి 26 న "మదర్లాండ్" పత్రికలో చెప్పబడిన జోస్యపు పునర్ముద్రణలు ఎంతో ప్రసిద్ధి చెందాయి.

ఈ సాహిత్యమంతా ప్రచురిస్తున్నదెవరో తేల్చుకోవాలని ఢిల్లీలో పలువురు పత్రికా రచయితలను తీవ్రంగా కొట్టారు. ప్రచురణ కర్తలందరి మీద వైరం పూనారు. కాని అసలయిన ప్రచురణ కర్తలను పట్టుకొనలేక పోయారు.

ప్రచార యుద్ధం దేశంలోనే గాక విదేశాల్లో సహితం విజయవంతమయింది. భారతదేశంలో కొనసాగుతున్న అజ్ఞాత ఉద్యమాన్ని "ప్రపంచంలోని ఏకైక కమ్యూనిస్టేతర విప్లవశక్తిగా" అభివర్ణిస్తూ లండన్‌కుచెందిన ప్రతిష్ఠాత్మకమైన 'ఎకనామిస్ట్' పత్రిక 1976 డిసెంబరు 4 సంచికలో వ్రాస్తూ "వేలాదిమంది ఆర్.యస్.యస్. కార్యకర్తల ఆధ్వర్యంలో యిది సాగుతున్నది...ప్రస్తుతానికి వీరి ఒకే లక్ష్యం–భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని పునఃప్రతిష్ఠించడం"

ఈ ఉద్యమానికి ప్రజలందరి పూర్తి మద్దతు లభిస్తున్నది. 60,000 నుంచి 70,000 మంది నుంచి చిన్న మొత్తాల చందాలతో ఆర్థిక సహాయం పొందుతున్నది. వారంట్లు వున్నవారి జాబితాలోని 30,000 మంది పూర్తి రక్షణ పొందుతున్నారు. రహస్య సమాచారం అందజేసే వారులేక ఒక్కరు కూడా పట్టుబడలేదు. అసలైన సమాచారాన్ని యిచ్చే సాహిత్యం భారతదేశమంతటా ముద్రించ బడుతూ అందరికీ అందజేయ బడుతున్నది. ఆ విధంగా రాజకీయ చైతన్యం ఉప్పొంగడంతో, నేడు ఒక్క అగ్నికణం పడినా విప్లవ మహాజ్వాల్ల భగ్గుమనేట్లు వున్నది" అని వ్రాసింది.

మార్క్సిస్టు ఎం. పి. ఎ. కె. గోపాలన్ కూడా ఉద్యమానికి చలించి "ఇంతటి సాహస కార్యాలను, బలిదాన సంసిద్ధతను ప్రేరేపించ గలగడానికి ఏదో మహత్తరమైన ఆదర్శం వుండి వుండాలి." అని ఆర్. యస్. యస్. గురించి వ్రాశారు.

నిర్బంధితుల కుటుంబాలను బయటివారు ఆదుకున్న తీరు ఎమర్జెన్సీ నాటి మహత్తర విశేషాలలో ఒకటి. ఒక దశలో నలభై వేల కుటుంబాల యోగ

క్షేమాలు జాగ్రత్తగా చూడటం జరిగింది. ఈ కుటుంబాల కోసం తమ ప్రావిడెంటుఫండు సొమ్మును పూర్తిగా విరాళంగా యిచ్చివేసిన ప్రభుత్వోద్యోగులు వున్నారు. కొందరు కాంగ్రెసు వాదులు కూడా ముందుకు వచ్చి ఆర్. యస్. యస్. వారి యీ పథకానికి చేయూత అందించారు.

ఆర్. యస్. యస్. కు యితర సంస్థలతో - ప్రత్యేకించి జమాత్-యి-యిస్లామీ నిర్బంధితులలో మైత్రీ సంబంధాలు పెంపొందించడం జైలు జీవితంలో ఒనగూడిన ప్రయోజనాల్లో ఒకటి. ఆర్.యస్.యస్. వారు యమకింకరులవంటి వారని అంతవరకు ముస్లింలకు నూరిపోయడం జరిగినా, జైలులో వారు పూర్తి సామరస్యంతో ఒకరితోఒకరు కలిసి జీవిస్తూ, భుజిస్తూ, సంభాషిస్తూ, ఆట పాటల్లో పాల్గొంటూ గడిపారు. రాష్ట్రపతి ఫక్రుద్దీన్ యీ సంగతివిని దిగ్భ్రాంతులయినారు. తన చెవులను తాను నమ్మలేకపోయారు. కాంగ్రెసుకు అనుకూలంగా ఉండే జమియత్-ఉల్-ఉలేమా వారు మాత్రం ఆర్.యస్.యస్. వారిని, జమాత్ వారిని నిర్బంధంలో వేరువేరుగా వుంచాలని కోరారు. పాపం వారి దురదృష్టం వల్ల హిందువులకు, ముస్లింలకు వేరువేరు వార్డులు దొరకలేదు.

అనేకమంది ప్రభుత్వాధికారులు సానుభూతి వ్యక్తపరచడం ఎమర్జెన్సీనాటి ఆసక్తికరమైన అంశాలలో ఒకటి.ఎమర్జెన్సీ ప్రకటనమీద రాష్ట్రపతి సంతకం చేయడానికి కొద్ది గంటలముందుగా, ఉన్నతస్థాయికి చెందిన పోలీసు అధికారి ఒకరు ఆర్.యస్.యస్.-జనసంఘానికి చెందిన ఒక నాయకుడికి ఫోనుచేస్తూ, దేశమంతటిలోనూ ఒక ప్రమాదం ఏర్పడబోతున్నదని, వారంతా అజ్ఞాతంలోకివెళ్తే శ్రేయస్కరమని సూచనప్రాయంగా చెప్పాడు. ప్రభుత్వంలో అత్యున్నత స్థాయిలో జరుగుతున్న పరిణామాలగురించి, నిర్ణయాలగురించి కొందరు ఉన్నతాధికారులు అజ్ఞాతంలోవుంటున్న ఆర్.యస్.యస్. నాయకులకు తెలియజేస్తూ వచ్చారు. సుబ్రహ్మణ్యస్వామి దేశంవదిలిపోయి, తిరిగివచ్చి, మళ్ళీ వెళ్ళిపోయి కూడా ఎక్కడా పట్టుబడకుండా వుండగలగడానికి-యిదొక కారణం.

సుబ్రహ్మణ్యస్వామి నాటకీయంగా రాజ్యసభలో ప్రత్యక్షమవడం, మళ్ళీ అంత నాటకీయంగానూ అక్కడినుంచి అంతర్ధానమవడం ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో నిజంగానే ఒక పెద్ద మలుపు. దేశమంతటా ఈ సంఘ

టిన ప్రభుత్వ సమర్థతను అపహాస్యంపాలు చేసిదిం. తన పరిపాలనా నౌకకు ఎక్కడో బెజ్జం పడినట్లు శ్రీమతి గాంధికి తెలిసిపోయింది. ప్రతిపక్షాన్ని నిర్దాక్షిణ్యంగా అణచివేయాలంటే తాజాగా ప్రజల మద్ధతు సంపాదించవలసివుందని ఆమెకు అర్థమయింది. అటుపై ఎలాగయినా ఎన్నికలు నిర్వహించాలనే నిర్ణయానికీ వచ్చింది-తీరా నిర్వహించడంతో, ఎన్నికలలో ఘోరపరాజయం కలిగింది.

నియంతృత్వాన్ని ప్రతిఘటించడంలో అగ్రగామిగా నిలిచిన ఆర్.యస్.యస్., జనతా పతాకానికి విజయం చేకూర్చే కృషిలో కూడ అగ్రగామిగా నిలిచింది. రాష్ట్రీయ స్వయంసేవక సంఘానికి విజయ రేఖాపర్వం యిదే.

కనుకనే 1977 ఫిబ్రవరి చివరి వారంలో శ్రీమతిగాంధి ఆర్. యస్. యస్.తో సంభాషణలు ప్రారంభించారు. అజ్ఞాత ఆర్.యస్.యస్. నాయకులలో ముఖ్యులైన అయిదుగురిని కలవడానికై ఒక అత్యున్నతాధికారి పంపబడ్డారు. ఆర్.యస్.యస్. తన కార్యకర్తలను జనతా తరపున ప్రచారంలో పాల్గొనకుండా ఉపసంహరించడానికి ఒప్పుకుంటే నిషేధాన్ని తొలిగించి, యింకా జైళ్ళలోనే వున్న 30,000 మంది ఆర్.యస్.యస్. వారిని శ్రీమతి గాంధీ విడుదల చేయిస్తుందని చెప్పారు. ఈ ప్రతిపాదనను ఆర్.యస్.యస్. నిర్ద్వంద్వంగా తిరస్కరించింది.

ఆ దశలోకూడా తనే ఎన్నికలలో గెలుస్తానని ఆమె అనుకుంటూవుంది. కాని ఎన్నికల రంగంనుండి ఆర్.యస్.యస్. ఉపసంహరించుకొని తన యిబ్బంది కాస్త తగ్గిస్తే బావుండునని మాత్రమే ఆమె కోరిక.

ఆమె అప్పటికే మితిమీరి వ్యవహరించినట్లు ఆర్.యస్.యస్. నాయకులు ఆరోపించారు. సర్ సంఘచాలక్ తనకు లేఖలు వ్రాసినపుడు కనీసం అవి అందినట్లయినా, మర్యాదపూర్వకమైన సమాచారం పంపలేదు. కనుక స్వయంసేవకులు సమస్యను ఎన్నికలద్వారానే అమీతుమీ తేల్చాలని పట్టుదలతో వున్నారు. ఒకవేళ ఆవిడ ఎన్నికలతో గెలిచినా, మరింత విస్తృతమైన పోరాటాన్ని చేపట్టి ఆమెను గద్దెదింపడానికి సంఘం కృతనిశ్చయమైవుంది. నిషేధాన్ని తొలగించినందుకు ఆమెకు ఏదో ఒక ప్రత్యుపకారం చేయాలని ఆమె పంపిన దూత వాదించాడు.

ఆవిడ చేసిన తప్పు సరిదిద్దుకున్నందుకు–అయినా ఆలస్యంగా చేసినందుకు బహుమతులు కోరే యోగ్యత ఆమెకు ఏ మాత్రంలేదని ఆర్.యస్.యస్. నాయకులు వాదిస్తూ "వేలాది కుటుంబాలను మీరు నాశనం చేశారు. మరిన్ని వేల మందికివున్న జీవనభృతి లాగిపారేశారు. లెక్కలేనంతమంది కార్యకర్తలను చిత్రహింసలపాలుచేశారు. కనుక యిప్పుడు మీరు నిషేధం తొలిగించి, అమాయకులను నిర్బంధంనుంచి విడుదలచేస్తే ప్రస్తుతపు కటువైన భావనలు కొంతవరకైనా తొలగి పోవడానికి, బాధితులకు కాస్త ఓదార్పు కలగడానికి కొంత ఆశయింకా మిగిలివుంటుంది" అన్నారు.

ఈ మాటలు విని "మీ వాళ్లు 21 నెలలుగా జైళ్ళలో మగ్గుతున్నారు. కొద్ది కాలంలో వీరు యిప్పుడున్నంత మాత్రంగా వుండలేక పోతారు. ఎంత కాలం యీ పరిస్థితి మీరు కొనసాగనిస్తారు ?" అని ఆ అధికారి అడిగాడు.

జైళ్ళలో వున్నవారికి, బయటి వారికి మధ్య నిరంతరాయంగా సంబంధాలు కొనసాగుతూనే వున్నాయని, జైళ్ళ లోపల వున్నవారు అమితమైన స్థైర్యంతో వున్నారని, అజ్ఞాత వుద్యమం నీరుకారిపోయే ఆవకాశం లేదని. కనుక మరో మూడు నాలుగు సంవత్సరాలు పోరాడటం కష్టం కాదని ఆ పెద్దమనిషికి తెలియపర్చ బడింది.

తమ త్యాగాలు నిరర్థకమై, జైలునుంచి విడుదలయిన పిమ్మట తలలు ఎత్తుకుని తిరగలేక, జాతీయ పునర్నిర్మాణ కార్యంలో తమ పాత్ర నిర్వహించలేని స్థితి కల్పించే విధంగా నిరంకుశత్వంతో ఏ విధమైన రాజీకి పాల్పడటం జరిగినా, దానిని జైళ్ళలోని స్వయంసేవకులు సహించరని కూడా ఆ అధికారికి చెప్ప బడింది.

ఒప్పందం ఉభయ పక్షాలకు గౌరవ ప్రదంగా వుండాలని, నిషేధాన్ని ఎత్తి వేసే అధికారిక ప్రకటనలో అర్. యస్. యస్. ను నిరసించే ఒక్క మాట అయినా వుండకూడదని, కానట్లయితే రెండు పక్షాల మధ్య శాశ్వతమైన అఖాతం సృష్టించినట్లు అవుతుందని సంఘ నాయకులు చెప్పారు. వారి మధ్య సర్దుబాటు జరగాలంటే ప్రభుత్వోద్యోగాల నుంచి తొలగించబడిన వారి నందరిని

తిరిగి సర్వీసులో చేర్చుకోవాలని, స్వాధీనం చేసుకున్న అన్ని ఆస్తులను, సంస్థలను ఎవరివి వారికి అప్పజెప్పాలని కూడా వారు అన్నారు.

ఈ దశలో చర్చలు విఫలమయినై. దూతగా వచ్చిన అధికారి మాత్రం తాను ఆర్. యస్ యస్. నాయకత్వం నుంచి సరిగా అట్టి గౌరవ ప్రదమైన వైఖరినే ఊహించానని చెప్పారు. నిషేధం తరువాత కూడ ఆర్. యస్. యస్. సంస్థ దెబ్బ తినకుండా నిలిచిన మాట వాస్తవమని, ఆ కారణంచేత వారు కనబరచిన వైఖరి చాల సహజమని కూడ ఆయన అన్నారు.

''జైళ్ళలోవున్న వారిలో అధిక సంఖ్యాకులు వృద్ధులు కాగా, చైతన్యవంతులయిన యువక కార్యకర్తలు మాత్రం ఎమర్జెన్సీయే లేనట్లు మామూలుగా తమ పని కొనసాగిస్తున్నారు. 'మీసా' నిర్బంధితుల కుటుంబాల యోగక్షేమాలు బాగానే చూస్తున్నారు. మీ నాయకులు దేశమంతా పర్యటిస్తున్నారు. ఎమర్జెన్సీ మిమ్ములను ఏవిధంగాను అణచివేయలేకపోయినందున, నేను సరిగ్గా మీరు యిప్పుడిచ్చినటువంటువంటి సమాధానాన్నే ఆశించాను" అని ఆ అధికారి అన్నారు.

పిల్లగాలిగా మొదలయిన ఎన్నికల ప్రచారం యిప్పుడు ప్రచండ వాయువై ఎమర్జెన్సీ ప్రభుత్వాన్ని కూకటి వేళ్ళతో పెల్లగించి చరిత్ర చెత్తకుప్పమీదకి విసిరేసింది. సంఘం యింకా నిషేధంలోనే కొనసాగినా జనతా ఎన్నికల విప్లవానికి స్వయంసేవకులు రథసారథులు అయినారు.

ఆ తరువాత వచ్చిన ప్రశంసల ప్రభంజనం కొంచెం తక్కువ శ్రేణి మానవుడికయితే గర్వం కలిగించి వుండేదికాని బాలాసాహెబ్‌లో గర్వంకాని, అతిశయం కాని లేశమాత్రమైనా కనిపించలేదు. "మన్నించు – మరిచిపో" అని తమ వైఖరి స్పష్టం చేశారు. "మన పళ్ళు మన నాలికను కొరికినంత మాత్రాన ఆ పళ్ళు ఊడబెరుకుతామా!" అని 1949 లో బేషరతుగా నిషేధం తొలగించిన నాటి మహా విజయపు తరుణంలో శ్రీ గురూజీ అన్నమాటలనే బాలాసాహెబ్ వైఖరి తలపుకు తెచ్చింది.

వర్తమానంలో...ఆర్.యస్.యస్

ఆర్. యస్. యస్. కోరుకుంటే, ఎమర్జెన్సీ తరువాత, హైందవేతరులకు కూడ లాంఛనంగా తలుపులు తెరిచివుండేది. అంతకంటె సులువైనపని మరొకటి లేదు. మిగిలిన కొద్దిమంది విమర్శకులు అంతటితో ఖచ్చితంగా నోరుమూసుకుని వుండేవారు. కాని ఆర్.యస్.యస్. పద్ధతి అలాంటిదికాదు. 'ప్రేక్షకుల కోరిక ప్రకారం' ఆడేతత్వంకాదు-సంఘానిది.

సహప్రసమాసజీవి అయిన స్వాతంత్ర్యయోధుడు, నాగపూర్ విశ్వవిద్యాలయం వారి గాంధీభవన్‌కు సంచాలకుడు అయిన శ్రీ ఎమ్.జె. కనిత్కార్ యీ విషయంపై తన అభిప్రాయం వెల్లడిస్తూ "హైందవేతరులను సంఘంలో ప్రవేశించనీయాలా, వద్దా అనేది చాల సున్నితము, ముఖ్యము అయిన ప్రశ్న. దానికి ఏదో ఒక నిస్సారమైన అస్పష్టమైన సమాధానం యిచ్చి ప్రయోజనంలేదు. సమాధానం అసందిగ్ధంగాను, పరీక్షకు నిలిచేదిగాను, తర్కబద్ధమైనదిగాను వుండాలి. "వద్దు" అనేదే దీనికి నేనిచ్చే స్పష్టమైన సమాధానం" అన్నారు. దానిని యింకా వివరిస్తూ, "అన్ని ధర్మాలకు సమానస్థాయి కల్పించాలనేది-మన అంతిమ లక్ష్యం. వివిధ ధర్మీయుల మధ్య సంబంధాలు, సహకారం, చిత్తశుద్ధి, పరస్పర అవగాహనపై ఆధారపడి మధురంగా వుండటానికి యీ ఆదర్శంవుంటే అదే పదివేలు. మతపరమైన దృక్పథం ప్రకారంలో సంస్థ ప్రత్యేకంగా వున్నంత మాత్రాన యీ ఆదర్శానికి విరుద్ధంగా వున్నట్లుకాదు. ఈ మతపరమైన ప్రత్యేకతను మనం నిలుపుకుంటూనే, అందరిపట్ల ఆత్మీయతా భావాన్ని పెంపొందించడానికి తగినంత ఉన్నతస్థాయి మానవతాభావం సాధించాలి. అదే సమాజ సముద్ధరణకు అత్యంత శ్రేయస్కరంగా వుంటుంది. వ్యవస్థను మార్చవలసిన అవసరమే లేదు. వైఖరి మార్చుకుంటే సరిపోతుంది" అన్నారు.

"ప్రస్తుతంలో...సర్‌సంఘచాలక్, ఉన్నతస్థాయికి చెందిన ముస్లింమతాధిపతులు కలిసి ఎన్నోమార్లు ఒకరి భావాలు ఒకరు తెలియజేసుకొని, తద్వారా మనసులోని అపోహలు తొలిగించుకున్నారు. దీనితో హిందూ-ముస్లిముల

ఐక్యతకు ఒక మార్గం ఏర్పడింది. ఈ ఐక్యతకోసం మహాత్మాగాంధీ తమ జీవితమంతా పరిశ్రమించి, అవహేళనకు, అపార్థానికి గురియై చివరకు ప్రాణాన్నే అందుకు ధారపోశారు. కనుక హిందూ-ముస్లిముల ఐక్యతకు ప్రస్తుతం ఏర్పడిన చక్కని అవకాశాలకు ఆనందించని గాంధేయులు ఎవరుంటారు ?" అనికూడా శ్రీ కనిత్కర్ అన్నారు.

ఆర్.యస్.యస్. ఒక సాంస్కృతిక సంస్థ. జమాత్-యి-యిస్లామీలోనో జమియత్-ఉల్-ఉలెమాలోనో చేరడానికి హిందువులు ఎంత తొందరగా వరసలో నిలబడతారో, ఆర్. యస్. యస్.లో చేరడానికి అంత ముస్లింలు అంతకంటె తొందరగా వరుసలో నిలబడరని ఆర్. యస్. యస్.కు తెలిసినసంగతే ! చపకబారు ప్రచారాలకు పూనుకోకుండా సాంస్కృతిక సంస్థలు సాంస్కృతికంగానే వుండిపోతే ఎంతోమంచిది. విభిన్నవర్గాలు యాంత్రికంగా సన్నిహితమై లాభంలేదని, పరస్పర విద్వేషభావాలకు స్వస్తిచెప్పడం ముఖ్యమని వారికి తెలుసు. యజమానులను కార్మిక సంఘాలలోకి, కార్మికులను యజమానుల సంస్థలోకి చేరమని బలవంతంచేయడంలో ఎంత అర్థమున్నదో ముస్లింలను హిందూ సంస్థలలోకి, హిందువులను ముస్లిం సంస్థలలోకి బలవంతంగా చేర్పించడంలోకూడ అంతే అర్థమున్నది. కనుక ప్రస్తుతానికి వివిధవర్గాల నాయకులకు ఒకేవేదిక కల్పించడానికి మాత్రం ఆర్.యస్.యస్. నిశ్చయించింది. రక్షాబంధన్, హోళీ, విజయదశమి మొదలయిన పర్వదినాలలో ఆర్.యస్.యస్. చేసిన యిట్టి ఏర్పాట్లు దేశమంతటా గణనీయంగా విజయాన్ని సాధించినాయి.

జైళ్లలో ఆర్.యస్.యస్., ముస్లిముల మధ్య ఏర్పడిన సత్సంబంధాలను చెడగొట్టడానికి రాజకీయ కుటిలమతులు అదేపనిగా కృషి మొదలుపెట్టారు. అయితే ఆర్.యస్.యస్. మీద జరిగిన దాడులన్నీ ఒకానొక రాజకీయ వర్గంవారు జరిపినవేతప్ప, ముస్లింలు తలపెట్టినవి కాకపోవడం విశేషం. హైందవేతరులకు ఆర్.యస్.యస్ తలుపులు తెరవాలని డిమాండుచేసినవారుకూడ ఆరాజకీయ వర్గంవారే కావడం, ముస్లింలు కాకపోవడం, గమనించదగ్గ మరో విశేషం. కారణం ఊహించడం తేలిక. తమ ప్రత్యేక అస్తిత్వాన్ని నిలుపుకొనాలనే కాంక్ష హిందువులలోకంటె ముస్లిములలో ఎక్కువ. ఏ అఖిలభారత సంస్థలో సభ్యత్వం తీసుకున్నా దానివలన హైందవేతరులు భారతీయకరణను (అనగా హైందవీకరణను) పొందినట్లవుతుంది.

నిబంధనావళిలో లాంఛనంగా మార్పుచేయడం, హైందవేతరులకు సాంకేతికంగా సభ్యత్వాన్ని ప్రారంభించడం, వారిలో కొందరిని "జాతీయ ముస్లింలు" అంటూ మెచ్చుకోనడం, ఆ తరువాత వారిగురించి మొత్తం మరచిపోవడం - యీపొరపాట్లు జరగకుండా, అటువంటి ప్రలోభానికి లోనుకాకుండా ఆర్.యస్.యస్. నిలిచింది. ఇందుకు బదులుగా హిందూ-ముస్లిం వర్గాలమధ్య, సంస్థల మధ్య సంబంధాలను మెరుగుపరచడంపైన దృష్టి కేంద్రీకరించింది.

ఆదేసమయంలో క్రమక్రమంగా, సహజమైన తీరులో హైందవేతరుల ఆర్.యస్.యస్.లో ప్రవేశించడాన్ని అనుమతించింది. ఈనాడు వందలాదిమంది ముస్లిములు శాఖకు హాజరవుతున్నారు. బొంబాయిలో మరాఠామందిర్ స్కూలులో అధ్యాపకుడుగా పనిచేస్తున్న సంస్కృత-అరబిక్ విద్వాంసుడు గులాంద స్తగిర్, అతని కుమారులు 1977 నుంచి శాఖకు హాజరవుతున్నారు. ఎమర్జెన్సీకి చాల కాలంముందే నేటి కేంద్రమంత్రి జాఫర్ షరీఫ్ కర్ణాటకలో ఆర్.యస్.యస్.లో చేరారు. ఆయన మూడు సంవత్సరాలు శాఖకు హాజరవడంమాత్రమేకాక, ఒక శిక్షణ తరగతిలోకూడ చేరారు. కొందరు ముస్లిం పెద్దమనుషులు ఒత్తిడిచేస్తుండటంవలనమాత్రమే ఆయన శాఖకు వెళ్ళడం మానివేయవలసివచ్చింది. నేటికీ ఆయన ఆర్.యస్.యస్. పాటలు ఆలాపిస్తుంటారు. అయితే ఆర్.యస్.యస్. లోనివారు ఎవరూ తమ సెక్యులరిజానికి నిదర్శనంగా యీ విషయమై ఆర్భాటం చేయడం అవసరమనిగాని, సముచితమనిగాని భావించలేదు.

రాజస్థాన్‌లోని బన్స్వారాలో బి.కాం. చదువుతున్న అజీజ్ హుస్సేన్ ఆర్.యస్.యస్. నిర్వహించే నెలరోజుల శిక్షణతరగతికికూడ హాజరయినాడు. ఆసక్తితోవచ్చిన పత్రికలవారితో అజీజ్ యిలా చెప్పాడు. "మా తండ్రి దుబాయిలో వుంటారు. మార్చిలో (1978) ఆయన యిక్కడకు వచ్చినపుడు కొందరు ముస్లిం పెద్దమనుషులు నాగురించి ఆయనకు ఫిర్యాదుచేశారు. ఆయన నన్ను ఆ విషయమై ప్రశ్నించినపుడు మా తల్లి జోక్యం చేసుకొని, (స్థానిక ప్రచారక్ అయిన) మాన్‌ఫూల్‌జీ సహృదయంగురించి, నేను సంఘంలో చేరింతరువాత నాలోవచ్చిన సంతోషకరమైన మార్పుగురించి చెప్పింది. తరువాత మాన్‌ఫూల్‌జీ మా కోరికమన్నించి మా యింట్లో భోజనానికి వచ్చారు. ఆ సమ

యంలో మా తండ్రిగారు వారితో అనేక విషయాలు చర్చించారు. ఆ తరువాత మా తమ్ముడు ఇల్యాస్‌కూడ శాఖకు వెళ్ళడానికి మా తండ్రి అనుమతించారు."

కేరళలోకూడ కొందరు ముస్లిములు ఆర్. యస్. యస్. లో చేరారు. 1979లో కనన్‌గడ్‌వద్ద కొత్తప్పురాలో జరిగిన ఆర్.యస్.యస్. హేమంత శిబిరంలో రాత్రిపూట గస్తీ విధులు నిర్వర్తించిన యిద్దరు స్వయంసేవకులూ ముస్లిములే-అబ్దుల్లా, అబ్దుల్ రహ్మాన్.

ముస్లిములు, క్రైస్తవులు గణనీయమైన సంఖ్యలో ఆర్.యస్.యస్.లో చేరనవిషయం యిటీవల శ్రీ బాలాసాహెబ్ వెల్లడించారు. అయితే ఆ విషయాన్ని సంఘం బడాయిగా చెప్పుకోదని ఆయన అన్నారు. సంఘానికి ప్రచారపద్ధతిలో నమ్మకంలేదని, నిశ్శబ్దంగా రాష్ట్రనిర్మాణకార్యం కొనసాగించడంలో మాత్రమే నమ్మకమున్నదని అన్నారు.

1979 ఏప్రిల్‌లో ఒక చిన్నవార్త పత్రికలలో వచ్చింది. "వారణాసి, ఏప్రిల్ 24 : ఇక్కడ గోదాలియా చౌరస్తావద్దవున్న రామమందిరంలో నగరానికిచెందిన ముస్లిములు కొందరు నిన్న నమాజుచేశారు.

"పూర్వభారత్ ఆర్.యస్.యస్. ప్రచారక్ శ్రీ కె. యస్. సుదర్శన్ యీ నమాజుకు ఏర్పాట్లుచేశారు.

"దేవాలయంలో ఆర్.యస్.యస్. ఏర్పాటుచేసిన ఒక సమావేశంలో పాల్గొనడానికి ముస్లిములు వచ్చారు.

"హిందూధర్మం, యిస్లాములలోని వివిధఅంశాలగురించి చర్చ జరుగుతుండగా నమాజువేళ అయింది.

"ఆర్.యస్.యస్. కేంద్ర కార్యాచరణసమితిలో సభ్యులయిన శ్రీ సుదర్శన్ వెంటనే తమ కార్యకర్తలను పిలిచి, దేవాలయప్రాంగణంలోనే ఒక గదిలో నమాజుకు ఏర్పాట్లుచేయవలసిందిగా ఆదేశించారు."

ఏమయినా యిందులో క్రొత్తదనమేమీలేదు. సందర్శించడానికి వచ్చిన ముస్లింనాయకులు ఆర్.యస్.యస్. కార్యాలయాల్లో సహితం నమాజ్ చేయడం

పరిపాటే. కొన్ని సంవత్సరాలక్రిందట 'ఆర్గనైజరు' కార్యాలయంలో వారు నమాజు చేశారు.

1960 లోనే, డా॥ హెడ్గెవార్ గౌరవార్థం సమాధి నిర్మించ తలపెట్టి నపుడు ముఖ్య 'సంగ్-తరాష్'గా రాజస్థాన్‌కుచెందిన ఒక ముస్లిం శిలాలంకరణ నిపుణుడు హకీమ్‌భాయిని- ఎంపికచేయడానికి ఎట్టి సంశయమూ కలగలేదు. గురూజీ ఆ నిర్మాణస్థలాన్ని దర్శించడానికి వెళ్లినపుడల్లా హకీమ్‌భాయిని పలకరించి అతని యోగక్షేమాలు విచారిస్తుండేవారు. నిర్మాణం పూర్తిఅయినపుడు, అతని పనికి ప్రశంసాసూచకంగా గురూజీ ప్రత్యేకంగా ఒక శాలువా బహూకరించారు.

ఆర్. యస్. యస్.- ముస్లింలమధ్య క్రొత్తగా ఏర్పడుతున్న మైత్రీ సంబంధాలకు ఆశ్చర్యపడవలసిందేమీలేదు. నిజానికి ఆర్.యస్.యస్. ఎన్నడూ ముస్లింలకు వ్యతిరేకంకాదు. భారతదేశపు సమైక్యతకు, సమగ్రతకు భంగంకలిగించేవారికి మాత్రమే అది వ్యతిరేకం. 1940 లో 'పాకిస్తాన్‌వాలాలను' ఆర్. యస్.యస్. ప్రతిఘటించిందంటే అందుకు కారణం వారు ముస్లిములు అయివుండటంకాదు-వారు భారతమాతను ఖండించాలని ప్రయత్నాలు సాగిస్తూవుండడమే. స్వయంసేవకులు ఏదో అవతారాన్ని ఆరాధించేవారుకాదు. భారతమాతే వారి ప్రాణాధిక దైవం. మరొక రెవరయినా మరోవిధంగా భారతదేశాన్ని విభజించాలని ప్రయత్నించివుండినట్లయితే వారినికూడా ఆర్.యస్.యస్. అదేవిధంగా తీవ్రంగా ప్రతిఘటించివుండేది.

భారతదేశపు సమైక్యతకు, సమగ్రతకు హానికలిగించే ఎవరినయినాసరే ఆర్.యస్.యస్. వ్యతిరేకిస్తుంది. భారతదేశ విభజన కోరినవారిని వ్యతిరేకించడానికి కారణమిదే. ఈ కారణంచేతనే గోవా విముక్తి ఉద్యమంలోను, భారత భూభాగంలో చైనా దురాక్రమణను ప్రతిఘటించడంలో అగ్రగామిగా నిలిచింది. బెరూబరీని తూర్పు బెంగాలుకు యివ్వడాన్ని మాత్రమేకాదు. కచ్చదీవును శ్రీలంకకు ధారాదత్తం చేయడాన్నికూడ సంఘం వ్యతిరేకించింది.

దేశవిభజన జరిగిన-చాల సంవత్సరాలవరకుకూడ భారతదేశంలో చాల మంది ముస్లింలు అసంతుష్టిగా వుండిపోయారు. పాకిస్తాన్‌గనుక భారతదేశంమీద

దాడిచేసి కొన్ని భారతభూగాలను "విముక్తం" చేసివున్నట్లయితే వారిలో కొందరికి సంతోషం కలిగివుండేది. ఈ పరిస్థితిలో హిందూ-ముస్లిముల మధ్య ఉద్రిక్తత నెలకొనివుండటం అనివార్యం. కాని 1967, 1971 యుద్ధాలలో పాకిస్తాన్‌కు దాని స్థానమెక్కడో చూపటం జరిగింది. పాకిస్తాన్‌పట్ల వెనుక వున్నంతమోజు నేటి ముస్లిం భారతీయుడికి లేదు. కొద్దికాలంలో ఈజిప్టు, టర్కీల పట్లవుండే ఆసక్తికంటే ఎక్కువ ఆసక్తి పాకిస్తాన్‌పట్ల అతడికి వుండక పోవచ్చు. ఈ కారణంచేతనే హిందూ-ముస్లింల సామరస్యం సాధ్యమయింది. జైళ్లలో కలిసి ఉండడంవలన యీ పరస్పర అవగాహన మరింత వేగంగా జరిగింది.

ఆర్.యస్.యస్. నాడు ముస్లిం వ్యతిరేకికాదు, నేడు ముస్లింలను సమర్థించేదీకాదు. ముస్లిం మాత్రమే తన ధోరణిలో మార్పు తెచ్చుకున్నాడు. ఆర్.యస్.యస్. మాత్రం తన ధ్యేయమార్గంలో తాను సాగిపోతూనే వున్నది.

వివిధరకాలయిన దాడులు జరుగుతున్నా బాలాసాహెబ్ ప్రతి స్పందన మాత్రం ఎప్పుడూ అతిశయంలేకుండా, వినమ్రంగా వున్నది. "వ్యతిరేకులు వ్యతిరేకిస్తూనే వుంటారు. కార్యకర్తలు మాత్రం కార్యనిమగ్నులై వుండాలి" అన్నారు. "సంఘమెన్నడూ ప్రభుత్వపు చేయూతవల్ల పెంపొందలేదు. ప్రభుత్వపు విమర్శలవల్ల అణిగిపోలేదు" అనికూడా అన్నారు.

1978 ఏప్రిల్‌లో ఢిల్లీలో మొదటిసారిగా ముఖ్యమైన ప్రసంగంచేస్తూ, "డాక్టర్ హెడ్గెవార్ కాలంలో సంఘం రాజకీయ తత్వం కలిగివుండేది. గురూజీ ఆధ్వర్యంలో సాంస్కృతిక పునరుద్ధరణమీద ప్రత్యేక శ్రద్ధ కనబరచడం జరిగింది. నేటి క్రొత్త పరిస్థితిలో సంఘం సరికొత్త కృషికి పూనుకుంటుంది. సంఘపథకాలన్నీ సాంఘిక దృష్టికోణంతో మలచడం జరుగుతుంది" అని బాలా సాహెబ్ ఉద్ఘాటించారు.

సంఘం యిప్పటికే పెద్దయెత్తున వయోజనవిద్యాపథకాన్ని చేపట్టింది. సంఘం వివిధరంగాలలో "చొరబడుతున్నది" అంటూ రాజకీయవాదులు చేస్తున్న ఆరోపణను బాలాసాహెబ్ పరిహసిస్తూ, మేము సైన్యంలోకి, ప్రభుత్వోద్యోగాలలోకి, సమాచార యంత్రాంగంలోకి, అది యిది అనక అన్నిటిలోకి చొరబడు

తున్నామని అంటున్నారు. ఇది వట్టి పరిహాసాస్పదమైన ఆరోపణ. స్వయం సేవకులు 'ఉద్యోగాలకు దరఖాస్తులు పెట్టుకొనకూడదా? వృత్తులు ఏవీ అవలంబించకూడదా? స్వయంసేవకుల పని యింటికి, శాఖకు తిరుగుతూ వుండటమేనా?

"మేము ప్రాబల్యానికి ప్రయత్నిస్తున్నామనికూడ అంటున్నారు. ప్రాబల్యం అంటే ఒకరి అధికారాన్ని తొలగించి మరొకరు చేజిక్కించుకొనడం. నిజానికి మా విమర్శకులనుకూడ మేము కాబోయే స్వయంసేవకులుగా పరిగణిస్తాము.

"మేము దేనిలోకీ చొరబడటంలేదు-ఎవరిమీదా ప్రాబల్యానికి యత్నించడం లేదు. కాని పర్వత ప్రాంతములలోనూ, వనవాసులు, జాలరులలో సహితం పని చేస్తున్న బృహత్తరమైన సంస్థయిది. ప్రతివిషయంలోను, ప్రతివ్యక్తిమీద దీని ప్రభావం ప్రసరించడం మాత్రం నిశ్చయం.

"కేవలం 'దక్ష-ఆరమ' చేయడమేనా మనపని అని డాక్టర్ సాహెబ్‌ను మేము అడుగుతూ వుండేవారం. లేదు లేదు! సంఘం ఒక విద్యుత్కేంద్రం. అది విడుదలచేసే విద్యుత్తు దీపాలు వెలిగించడానికి, వేడిచేయడానికి, చల్లబరచడానికి యంత్రాలను నడిపించడానికి మరెన్నింటికో ఉపయోగిస్తుంది' అని డాక్టర్ సాహెబ్ చెప్తుండేవారు. జాతీయ శ్రేయస్సుకోసం ఒక విద్యుత్కేంద్రంవలె పని చేయడం-ఇదే సంఘంచేస్తున్నపని. ఇంతవరకు చేసినది, యికముందు చేయనున్నది యిదే" అని స్పష్టంచేశారు.

తమ వివరణ కొనసాగిస్తూ, "సంఘం రంగు, రుచి, వాసన, ధైర్యము లేని సంస్థ అని నాగపూర్ పత్రిక ఒకటి అభివర్ణించింది. మేము దుడుకుగా వుంటున్నామని కొందరు అంటుంటే, నీరసంగా వ్యవహరిస్తున్నామని మరికొందరు అనడం చాల తమాషాగావున్నది.

"మేము యధాతథ వాదులమని యింకొందరు భావిస్తున్నారు. మేము అటు వంటివారం కానేకాదు. రోగగ్రస్తమైవున్న యీ సమాజాన్ని ఆరోగ్యవంతంగా, సంతోషంగా, దృఢంగా వుండేట్లు నిర్మించాలనే దివ్యమైన తపన, ఆవేదన మాలో

వుంది". అసంతోషః శ్రియోమూలం" (సంతృప్తి లేకపోవడమే సంపదలకు మూలం) సంస్కృత సూక్తివున్నది. మేము కోరుతున్న మార్పు వినాశనంకాదు. మహాభారతంలో అన్నట్లు ఆ వ్యవస్థవలన సమస్యలు పరిష్కారంకావు. "అరాజకేషు రాష్ట్రేషు ధర్మోన పరస్పరం తస్మాదిగ్రాజకం సంతిష్ఠతే" (ప్రజలు ఒకరితో ఒకరు తగవులాడుకునే అరాచక ప్రదేశంలో ధర్మం నిలువజాలదు. కనుక అరాచకాన్ని ఒక శాపంగా భావించాలి).

"మార్పు రాజ్యాంగబద్ధంగా, ప్రశాంతంగా వుండాలి. ఇతరుల ఆర్భాటాన్ని అనుకరించి లాభంలేదు. గొంతులు చించుకొనడంలో మేము పోటీకి దిగబోము.

"నేడు విశ్వవిద్యాలయ పరీక్షలలో దాదాపు సగంపరీక్షలు వాయిదా పడటం నేను గమనించాను. వైస్-ఛాన్సలర్లు ఘెరావ్ చేయబడుతున్నారు. 'పఢాయీ కేసాథి లడాయీ' (చదువుతూనే పోరాటం) అని కొందరు విద్యార్థులు అంటున్నారు. దానివలన ప్రయోజనం వుండదు. మనపని చదువుకొనడమే తప్ప పోరాడటంకాదు" అన్నారు.

"మన వ్యక్తిగత జీవితాన్ని, కుటుంబ జీవితాన్ని, సాంఘిక జీవితాన్ని సంఘం ప్రభావితంచేయాలి. స్వయంసేవకుడు ఏదిచేస్తున్నా ఉత్తమవ్యక్తిగా వుంటూనే, ఉత్తమ పౌరుడుగా కూడ వుండాలి. సంస్కృతిగురించి మాట్లాడుతూ, యింటికి వ్రాసే వుత్తరాలుకూడ యింగ్లీషులోనే వ్రాస్తూవుండే సాధించేదిలేదు. మనం మాట్లాడటం తగ్గించి చక్కగా పనిచేయాలి. సమస్యలను ఏకరువుపెట్టడంతో సంతృప్తిపడకూడదు. వాటి పరిష్కారాలను సాధించడానికి మనం పరిశ్రమించాలి. సంఘానికి శక్తినిస్తున్న మూలం సంఘశాఖేనని మనం ఎన్నడూ మరువకూడదు. మన శాఖలను పెంచుదాం. మరింత పెద్దశాఖలుగా మరింత చక్కని శాఖలుగా రూపుదిద్దుదాం" అంటూ బాలాసాహెబ్ తమ ఢిల్లీ ఉపన్యాసంలో ఉద్బోధించారు.

తరువాత బొంబాయిలో మాట్లాడుతూ హిందువులకోసం పనిచేయడంలో లేదని అన్నారు. జస్టిస్ రనడే, డా॥ అంబేద్కర్, మరెందరో మహా

సీయులు హిందువులకోసం మాత్రమే పనిచేసిన విషయాన్ని వారు గుర్తుచేశారు వారినిగాని, వారి కార్యక్రమాలను మతోన్మాదంగా ముద్రవేస్తే పరిహాస్పద మవుతుందన్నారు.

హిందువులకు లౌకికవాదంలో యోగ్యతాపత్రం యివ్వవలసిన అవసరం లేదని బాలాసాహెబ్ అంటారు. "ప్రపంచంలో అందరికంటె మనమే గొప్ప లౌకికవాదులం". ముస్లింలు, క్రైస్తవులు భారతదేశాన్ని పరిపాలించడం మొదలు పెట్టడానికిముందే వారు తమ పవిత్ర స్థలాలు నిర్మాణం చేసుకొనడానికి భారత దేశం అనుమతించింది. తమ మాతృభూమిలో తమ మతంపై జరిపినదాడిని తట్టుకొనలేక వచ్చిన పార్సీలను భారత్ ఆదరించి ఆశ్రయమిచ్చింది. పోతే హిందువులుమాత్రం యీ యిరవయ్యో శతాబ్దంలోకూడ అరేబియా మొదలైన ముస్లిందేశాలలో తమ దేవాలయాలు నిర్మించుకునే స్థితిలోవారు. ఈ మతతత్వాన్ని నిరసించిన లౌకికవాది లేడు.

ఆర్.యస్.యస్.లో మహారాష్ట్ర బ్రాహ్మణుల ప్రాబల్యం వున్నదనే ఆరోపణను ప్రస్తావిస్తూ, "ఆర్.యస్.యస్. పుట్టింది నాగపూర్‌లోనే కనుక సంఘంలోని సీనియర్ నాయకులంతా నాగపూర్ ప్రాంతీయులే అయివుండటంలో విశేషంలేదు. ఆ మాటకు వస్తే రామకృష్ణ మిషన్‌లోని సన్యాసులంతా బెంగాలీలే అయివుండటానికికూడా అదేకారణం. కాని యీ రెండు సంస్థల విషయంలో[3] అలాంటి ప్రాబల్యానికి ప్రత్యేకమైన యితర కారణాలేమీ లేవు.

సంఘవ్యతిరేకులు, ఎంతటి పరిహాసాస్పదమైన ఆరోపణలు చేస్తున్నా రంటే, వారి విమర్శలను ఖండించే పనిపెట్టుకుంటే వారికి గౌరవం యిచ్చినట్లవు తుందని-బాలాసాహెబ్ అంటారు. ప్రధానకార్యదర్శి (సర్‌కార్యవాహ) పదవి గురించి ఆ వ్యతిరేకులు ప్రచారంచేసిన అబద్ధాలను యిందుకు ఉదాహరణగా వారు పేర్కొన్నారు. మాధవరావు మూలే ఆరోగ్యం క్షీణిస్తూవుండగా 1978 మార్చిలో ప్రొ॥ రాజేంద్రసింహాజీ సర్ కార్యవాహ పదవి స్వీకరించారు. కాని సంఘవ్యతిరేక పత్రికలుకొన్ని మాధవరావుజీ నిజంగా అనారోగ్యంగా లేరని, ఆయనను తొలగించడానికి యిదొక కుట్ర అని పచ్చి అబద్ధాలు ప్రచారం చేసినవి.

"ఇట్టి అబద్ధపు, అల్లరిపుకార్లను నేను ఖండించడం అవసరమని కొందరు అనుకుంటారు. మేము ఏమిచేయాలి ? మెడికల్ సర్టిఫికెట్ చూపించాలా ? లౌడ్ స్పీకర్లు అమర్చిన జీపులో మాధవరావుని కూర్చొనబెట్టి ఊరంతా త్రిప్పుతూ వారి అనారోగ్యంగురించి చాటిచెప్పాలా ?

"కనీసం ఆ విధంగానయినా వీరు నమ్ముతారనగలమా ? 'ఈ మనిషి జబ్బుపడివున్నమాట నిజమే, కాని వీరు మాధవరావేనని యింకొకరుకాదని ఎలా నమ్మడం అని అప్పటికీ వారు అనవచ్చు.

"నిజానికి ఢిల్లీనుంచి వెలువడే 'లింక్' పత్రిక మాధవరావుకు అనారోగ్యమేమీలేదని, బ్రాహ్మణేతరుడయిన రజ్జూభయ్యాను నియమించడంవలన మహారాష్ట్రలోని సంఘప్రముఖులలో కలవరాన్ని రేకెత్తించిందని, సర్‌సంఘచాలక్ కు వ్యతిరేకంగా మహారాష్ట్ర బ్రాహ్మణులు తిరుగుబాటు చేయనున్నారని వ్రాసింది.

"ఇలాంటి దుష్ప్రచారాన్ని ఖండించవలసిన పనివున్నదా ? వీటిని గమనించవలసిన పనివున్నదా?

"1978 సెప్టెంబరు 30 న మాధవరావు దివంగతులయినప్పుడు సంతాపం తెలిపే కనీసమర్యాదయినా యీ పత్రికలు చూపలేదు."

1979 మార్చిలో ఢిల్లీలో మరొక ముఖ్యమైన ప్రసంగంచేస్తూ హిందువు జన్మతః లౌకికవాది అని చెప్పారు. "ఏకం సత్, విప్రాః బహుధావదంతి" (అనేక విధాలుగా అభివర్ణించబడినప్పటికీ సత్యం ఒకటే) అని అతడు నమ్ముతాడు. హిందువునకు లౌకికవాదం బోధించడమంటే సూర్యుడికి దివ్వెచూపడమే అవుతుంది.

తాను ఒక బ్రాండుకుచెందిన సబ్బు అమ్ముతుండగా, యితర బ్రాండుల వాటిని మంచివని పేర్కొనడం అసాధ్యమని, అదేవిధంగా అన్నిమతాలు మంచివేనని తాను అనలేనని కార్డినల్ గ్రేషియస్ అన్నారు. హిందువులు అలాంటివారు కాదని బాలాసాహెబ్ అన్నారు.

ఆర్.యస్.యస్.ను ఒక సమస్యగా చిత్రిస్తున్నవారు అల్పసంఖ్యాకుల ఓట్లను కొల్లగొట్టుకొని, ఏదో ఒక విధంగా ఎన్నికలో గెలవాలనే వుద్దేశంతో

మాత్రమే అలా చేస్తున్నారు. "వారు రానున్న ఎన్నికలవరకేతప్ప యింకా ముందుకు దృష్టిసాగించలేని చవకబారు రాజకీయవాదులు. రానున్న తరాల గురించి ఆలోచించగల రాజనీతిజ్ఞుల అవసరం నేడు ఎంతయినా వుంది."

ఆంధ్ర, తమిళనాడులలో తుఫానువచ్చినపుడుగాని, ఢిల్లీలో వరదలు వచ్చినపుడుగాని సంఘం ముస్లిములకు, క్రైస్తవులకు నిజమయిన సహాయం అందించింది. కాని ఆర్.యస్.యస్.ను మతోన్మాదసంస్థగా ప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్నవారు అల్పసంఖ్యాకులకు మాటసానుభూతి మాత్రమే అందించారు. ఢిల్లీలో ముస్లిములు రంజాన్ ప్రార్థనలు జరుపుకొనడానికి ఆర్. యస్. యస్. సహాయశిబిరాలలో ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయబడినై. ఆంధ్రలో దీన దయాళపురంపేర చేపట్టిన పునరావాస పథకంలో ముస్లింలకు ప్రాధాన్యత ఇవ్వ బడింది. మద్రాసులో వరదలసందర్భంగా ఆర్. యస్. యస్. ప్రారంభించిన ఆరోగ్యకేంద్రాలలో యివ్వబడిన వైద్యసహాయాన్ని క్రైస్తవులు ప్రశంసించారు. కృతజ్ఞతాభావంతోనిండిన హృదయాలతో నాకు తమచర్చిలో సన్మానం ఏర్పాటు చేస్తామని నన్ను బలవంతం చేశారుకూడా."

ఒక వ్యక్తి మతం మార్చుకున్నంతమాత్రాన ఆతని జాతీయత మారదని బాలాసాహెబ్ అన్నారు. ఇండోనేషియాలో అత్యధిక సంఖ్యాకులు ముస్లిములుగా మారినా శ్రీరాముడు కేంద్రంగా పరిఢవిల్లిన తమ జాతీయసంస్కృతినిమాత్రం వారు ఎంతో జాగ్రత్తగా పరిరక్షించుకుంటున్న విషయాన్ని ఉదాహరణగా పేర్కొన్నారు.

ఫ్రాన్సు, జర్మనీలు సన్నిహితంకాగాలేనిది, భారత్, పాకిస్తాన్, బంగ్లా దేశ్‌లు మొదట ఒక వాణిజ్యకూటమిగా ఏకంకావటం ప్రారంభించి, క్రమంగా ఎందుకు సన్నిహితంకాలేవని వారు ప్రశ్నించారు.

ఈ రచయితతో మాట్లాడుతూ "నాకు తెలిసిన మరియేయితర ప్రజాసంస్థ కన్నా ఆర్.యస్.యస్. మరింత గొప్ప గాంధేయవాది" అన్నారు. "ముస్లింల పట్ల గాంధీజీ వైఖరిని మేము హర్షించనిమాట నిజమే. కాని ఉత్తమస్నేహితుల

మధ్య నిజాయితీతోకూడిన అభిప్రాయాలు వుండవచ్చు. గ్రామఫోను రికార్డులు మాత్రమే ఒకదానితోఒకటి నూటికి నూరుశాతం ఏకీభవిస్తాయి" అన్నారు.

గాంధీజీ సంఘాన్ని ఎన్నడూ విమర్శించపోవడం సంఘనాయకులు గాంధీజీని విమర్శించపోవడం గమనించదగిన విశేషం. "1934లో డా॥ హెడ్గె వారితో గాంధీజీ చాలసేపు యిష్టాగోష్ఠిగా సంభాషించిన విషయం మీకు తెలిసినదే. శ్రీ గురూజీకూడ 1947లో గాంధీజీని కలుసుకున్నారు. మా మధ్య పరస్పర సద్భావన, గౌరవాదరాలు విశేషంగా వున్నాయి."

విధానాలు, కార్యక్రమాలు, సాధారణ జీవనదృక్పథంలో ఆర్. యస్. యస్.కు గాంధీజీకిమధ్య ఎంతో పోలిక వున్నదనిఅంటూ బాలాసాహెబ్ యిలా వివరించారు. "నిశ్శబ్దంగా నిర్మాణాత్మక కార్యక్రమం కొనసాగించాలని గాంధీజీ నొక్కిచెప్తుండేవారు: ఆర్.యస్.యస్. కార్యపద్ధతిఅదే. పేదలు, బడుగువర్గాల వారికోసం కృషిస్తూ స్వయంసేవకులు యిప్పటికే వేయికిపైగా నిర్మాణాత్మక కార్యక్రమాలలో నిమగ్నులై వున్నారు. రెండు ఉదాహరణలు చెప్పాలంటే, ఆర్.యస్.యస్. చేపట్టిన తుఫానుబాధితులసహాయకార్యక్రమాలగురించి అందరూ వినివున్నారు. సాంగ్లీవద్ద మహీసర్‌లోని హరిజనులకోసం మా మధుదేవల్ సాధించినది అద్భుతమనకతప్పదు.

"అహింసలో గాంధీజీకి వున్నంతనమ్మకం ఆర్.యస్.యస్.కు వున్నది. శ్రీమతి గాంధిని అతి స్వల్పకాలం నిర్బంధంలోవుంచగా దానివలన విపరీతమైన హింసాకాండ చెలరేగింది. బస్సులు తగలబెట్టడం, రైళ్లు పడగొట్టడం జరిగింది. ప్రయాణీకులు సజీవంగా దహనం చేయబడ్డారు. ఒక విమానాన్ని సైతం దారి మళ్ళించడం జరిగింది. కాని ఆర్.యస్.యస్. విషయంలో అలా ఎన్నడూ జరగలేదు. 1948-49 లలోను, తిరిగి 1975-77 లలోను రెచ్చగొట్టేవిధంగా ఎంత దుర్భరమైన పరిస్థితులకు గురిచేసినా దౌర్జన్యాన్ని ఆర్.యస్.యస్. అహింసాత్మకంగానే ఎదుర్కొన్నదితప్ప ప్రాణాలకు ఆస్తులకు ఎన్నడూ భంగం కలిగించలేదు."

1979 మార్చిలో భారతీయ పత్రికల సంఘాన్ని, విదేశీ పత్రికా విలేఖరుల సంఘాన్ని ఉద్దేశించి బాలాసాహెబ్ ప్రసంగించారు.

ఆర్.యస్.యస్. కార్యకలాపాలు "రాజకీయాలను పోలివుంటాయని" పేర్కొనబడిన అఫిడవిట్ గురించి ప్రశ్నించగా, అందులో ఆభ్యంతరకరమైన దేమి తనకు కనిపించడంలేదన్నారు. 1947కు ముందు భారత స్వాతంత్ర్య సముపార్జనకు ఆర్.యస్.యస్. దీక్షవహించివుంది. కాని ఎప్పుడూ దేశపు "సర్వాంగీణ ఉన్నతి"కోసం కృషిచేస్తూనే వచ్చింది. ఈ లక్ష్యాలను రాజకీయంగా భావించవచ్చు".

తాను ఎక్కడికి వెళ్ళినా ముస్లిం పెద్దలనేకాక, యువకులైన ముస్లిం ఉపాధ్యాయులను, డాక్టర్లను, లాయర్లనుకూడ కలుసుకున్నానని చెప్పారు. వారిలో చాలమంది మాతో ఏకీభవించారు. కొందరు శాఖకు రావడంకూడ మొదలు పెట్టారు".

మైనారిటీ కమీషన్ గురించి మాట్లాడుతూ, దాని పరిధిని విస్తృతంచేసి మానవ హక్కుల సంఘంగా చేస్తే బావుంటుందని అన్నారు. ఆ విధంగాచేస్తే బాధితజనులు ఆకమీషన్‌నుంచి సహాయాన్ని కోరవచ్చునని చెప్పారు. ఆర్. యస్.యస్.ను 'మతోన్మాది'గా ముద్రవేసేవారికి ముస్లింలీగు 'లౌకికవాది'గా కనిపించడంగురించి, వారు ఆశ్చర్యం వ్యక్తంచేశారు.

ఆర్థిక సమస్యలగురించి ప్రశ్నించగా, ఆర్.యస్.యస్ వద్ద సర్వరోగ నివారిణి లేదని స్పష్టంచేశారు. "అభిప్రాయాల మధ్య తీవ్రమైన విభేదాలున్నాయి అసలు ఆస్తి అనేదే రద్దుచేయాలని ఒక ప్రాచీన సిద్ధాంతపు అనుయాయులు వాదించారు. గాంధీజీ ప్రతిపాదించిన ధర్మకర్తృత్వ భావనకూడ ఆలోచించ దగినదే".

ఎమర్జన్సీ తొలగించిన తరువాత ఆర్.యస్.యస్. కార్యం 30 శాతం వృద్ధిచెందిందని బాలాసాహెబ్ పత్రికలవారికి వివరించారు. అంతకుముందు 9,500 శాఖలు వుండగా యిప్పుడు 13,000 శాఖలున్నాయి. కేరళలో సంఘం వేగంగా పురోగమిస్తున్నదని చెప్పారు.

చిరకాలంగా కమ్యూనిస్టులకు కేరళ కంచుకోటగా వుంటూ వచ్చినందున యిది విశేషంగా చెప్పుకొనదగిన అంశం, ఆర్.యస్.యస్. పెరుగుదలకు మీరు

తోడ్పడుతున్నారంటె కాదు మీరేనని అక్కడ సి.పి.ఐ., మార్క్సిస్టు పార్టీల వారు ఒకరినొకరు నిందించుకొనడం ఓ గమ్మతు. కాని, ప్రస్తుతపు ముఖ్యమంత్రి, అప్పటి ప్రతిపక్ష నాయకుడు అయిన శ్రీ కరుణాకరన్ మాత్రం "మార్క్సిస్టుల హింసను ఎదుర్కొనడానికి ప్రజలు ఆర్.యస్.యస్. పట్ల మొగ్గుచూపవలసిన పరిస్థితి ఏర్పడింది" అన్నారు.

కమ్యూనిస్టు పార్టీకి చెందిన "దేశాభిమాని" దినపత్రికకు మాజీ సంపాదకుడయిన శ్రీ ఇందుచూడన్, ఆల్వేయిలో బ్రహ్మాండమైన ఆర్.యస్.యస్. ప్రదర్శనకు అధ్యక్షతవహిస్తూ కమ్యూనిస్టులు, ప్రభుత్వంవారు ఆర్.యస్.యస్.ను వ్యతిరేకించడంపట్ల తీవ్ర నిరసన వ్యక్తంచేశారు. దీనితో కేరళలో వీస్తున్న మార్పులగాలి ఎలాంటిదో స్పష్టమయింది.

ఢిల్లీ జమామసీదుకు చెందిన షాహియిమాం 1978 ఫిబ్రవరి 23న తనంతటతాను పంజాబ్‌లోని ఫజిల్కా శాఖను సందర్శించారు. "ఆర్.యస్.యస్. ఏమిచేస్తున్నదో నాపనికూడా అదే-నిరంకుశత్వం ఎక్కడ ఏ రూపంలో వున్నా దానితో పోరాడటమే" అన్నారు. బ్రిటిషువారు, కాంగ్రెసువారు కూడ 'విభజించి పాలించే' సిద్ధాంతాన్ని అనుసరించారని, కాని ఎమర్జెన్సీలో ఒకేవిధంగా బాధలు పడటంవలన హిందూ-ముస్లిం సంబంధాలు పటిష్ఠమైనాయనికూడా అన్నారు.

దీపావళి సందర్భంగా ఆర్.యస్ యస్. నిర్వహించిన వివిధమతాలవారి సమావేశంలో బొంబాయి యిమామ్ అయిన మౌలాం జిలానీనద్వీ మాట్లాడుతూ భారతీయులంతా సోదరులుగా మెలగాలన్నారు. అదే సమావేశంలో ఫాదర్ ఆర్లాండో రోడ్రిగ్స్ ప్రసంగిస్తూ "భారతదేశంలో మనకు ఎన్నో మతాలున్నాయి కాని సంస్కృతి ఒకటే" అన్నారు,

1980 నవంబరులో ఆర్.యస్.యస్. 'జన సంపర్కపక్షం' నిర్వహించింది. లక్షమంది కార్యకర్తలు యీ కార్యక్రమంలో పాల్గొని దాదాపుగా తొంభై అయిదువేల గ్రామాలను సందర్శించారు. నగరాల్లో ప్రతి పేట, ప్రతి వీధిని సందర్శించారు. సుమారు ఒకకోటి కుటుంబాలను కలుసుకొని, దేశంలోని అన్నిభాషలలో దాదాపుగా అదే సంఖ్యలో కరపత్రాలు పంచి ఆర్.యస్.యస్. ఆశయాలను, లక్ష్యాలను ప్రజలకు వివరించారు.

అన్నిచోట్ల తమకు లభించిన ఆదరణకు స్వయంసేవకులు సంతోషంతో కూడిన ఆశ్చర్యం పొందారు. వ్యతిరేకత వ్యక్తంచేయబడిన కొద్దిచోట్లమాత్రం అక్కడివారు తమకు వ్యక్తిగతంగా ఆర్.యస్.యస్. పట్ల ఎట్టి వ్యతిరేకత లేదని, కాని ఆవిధంగా వ్యతిరేకించాలని తమ పార్టీలు ఆదేశాలు యిచ్చినాయని చెప్పారు. "ఓట్లు అడగటానికి కాకుండా, అంతటా దిగజారిపోయిన పరిస్థితుల కారణాలను వివరించడానికి వచ్చింది మీరు ఒక్కరే" అని ప్రజలు అన్నారు. తమ ప్రాంతాలలో వీలయినంత త్వరగా శాఖలు ప్రారంభించాలని వారిలో అనేకులు తమ అభిలాష వ్యక్తంచేశారు. ఈ సమావేశాలలో వివిధ దృక్పథాలకు చెందిన రచయితలు, మేధావులు, సాంఘిక కార్యకర్తలు తమ అభిప్రాయాలు వెల్లడించారు. పలుచోట్ల ప్రసంగీకులలో ముస్లిం, క్రైస్తవ మిత్రులుకూడ వున్నారు.

1980 మార్చిలో కేరళలో రోమన్ కాథలిక్కులు మినహా తక్కిన చర్చినాయకులతో బాలాసాహెబ్ సుదీర్ఘమైన సంభాషణలు జరిపారు. ఇష్టాగోష్ఠిగా జరిగిన యీ కార్యక్రమంలో మాట్లాడుతూ "ఏ మతానికి చెందినవారు అయి నప్పటికి యీ దేశానికి చెందినవారంతా హిందువులుగానే మేము పరిగణిస్తాం". అని, "ఈనాడు సెక్యులరిజం నెలకొనివున్నదంటే కారణం రాజ్యాంగం వున్నందు వలన కాదు, హిందువుల ఆలోచనా సరళివలన మాత్రమే" అని బాలాసాహెబ్ ప్రకటించారు.

చర్చలు ముగిసినపుడు ఆ చర్చినాయకులు "మీ సంభాషణద్వారా అనేక విషయాలు తెలుసుకున్నాం "అని," మా అపోహలు తొలిగిపోయినై "అని," యితర రాష్ట్రాలలోకూడ మావారిని యిలాగే కలుసుకొనండి "అని," మన మంతా చేతులుకలిపితే అద్భుతాలు సాధించవచ్చు "అని" వాఖ్యానించారు.

1979లో జమ్మూలో షేక్ అబ్దుల్లాను బాలాసాహెబ్ కలుసుకున్నారు. తరువాత 1980 ఏప్రిల్‌లో జమ్ము మేయరు పదవికి జరిగిన ఎన్నికలో భారతీయ జనతాపార్టి అభ్యర్థికి షేక్ అబ్దుల్లాగారి నేషనల్ కాన్ఫరెన్సు మద్దతు యిచ్చింది, ఆర్.యస్.యస్. పూర్వరంగం వున్న జనసంఘీయులను షేక్ సమర్థించడాన్ని కాంగ్రెస్-ఐ వారు విమర్శించగా, "జనసంఘీయులు భారతీయులు కాదా ! వాళ్లు మనుషులు కారా ?" అని షేక్ త్రిప్పిగొట్టారు.

"మమ్మల్ని భయపెట్టడానికి యికముందు ఆర్.యస్.యస్. బూచిగురించి ప్రస్తావించి లాభంలేదు" అని ముస్లింలీగుకు చెందిన కేరళ మాజీ ముఖ్యమంత్రి సి. హెచ్. మహమ్మద్ కోయా 1980 మార్చి 26 న రాష్ట్ర అసెంబ్లీలో అన్నారు. మార్క్సిస్టుల నేతృత్వంలోని ప్రభుత్వాన్ని పడగొట్టడానికి కాంగ్రెస్-ఐ తో ఆర్.యస్.యస్. కుమ్మక్కు అయిందన్న ఆరోపణకు సాక్ష్యాధారాలు చూపడానికి ప్రభుత్వం తిరస్కరించినందుకు నిరసనగా అదేరోజున ముస్లింలీగు, యితర ప్రతిపక్షాలవర్గం శాసనసభనుంచి వాకౌట్ చేసినై.

పేరు తెలుపడం యిష్టంలేని "సవ్యాక్ష" అనే రిటైర్డు దౌత్యాధికారి 'ఆర్గనైజరు'లో ఒక వ్యాసం (9-9-1979) వ్రాస్తూ.... ఆర్.యస్.యస్. గురించి రాజకీయవాదులు తమ అభిప్రాయాలు మార్చుకుంటున్నారని, పోతే ఆర్.యస్.యస్. గురించి నిజంగా భయపడుతున్నవారు ఎవరంటే "పూర్తిగా పాశ్చాత్యీకరణకు లోనయిన భారత పాలకపక్షంవారేనని-వ్రాశారు. హిందూ ధర్మంమీద ఆలోచనారహితమైన దుర్మార్గపు దాడులన్నింటిని ప్రారంభించేది అనుమతించేది-యీ పాలకవర్గమే. భారతీయ సాంస్కృతిక విప్లవపు తేజోవంతమైన వైభవం ఏనాడు కాంతులు విరజిమ్ముతుందోనని నిరంతరభీతితో గడుపుతున్నది యీ వర్గంవారే. అందుకే దీనిని 'హిందూ తిరోగమనవాదం'గా ముద్ర వేసి మొగ్గలోనే త్రుంచివేయదలుస్తున్నదీవర్గం" అన్నారు.

"హిందువు మనస్సును కల్లోలపరుస్తున్న యీ వాదనను మొత్తంమీద నిశ్శబ్దంగానే వస్తున్న యీ మార్పును 'తిరోగమనం' అని అభివర్ణించడం సముచితంకాదు. భారత ప్రజానీకపు స్వాభిమాన జాగృతి దేనిని అభిలషిస్తుందో అట్టి సాంస్కృతిక విప్లవానికి బీజక్షేత్రంగా యీ మానసిక మార్పును పేర్కొవడం సముచితమని నా అభిప్రాయం. ఈ దృష్ట్యా ఆర్.యస్.యస్. యొక్క ప్రాధాన్యత స్పష్టమవుతున్నది. కులము, వర్గము, రంగు, భాష మొదలైనవాటి ఆధారంగా వివక్షతచూపడాన్ని హిందూధర్మం అనుమతించదని ఆర్.యస్.యస్. ఆచరణద్వారా ఋజువుచేసింది. నిస్వార్థ ప్రజాసేవకు కావలసిన సంసిద్ధత హిందూధర్మంలో వున్నదని నిరూపించింది. హిందూధర్మం తన విశ్వజనీన దృక్పథంచేత వైవిధ్యతకు నెలవై, బహువిధాల మత విశ్వాసాలకు ఆలవాలమై వున్నప్పటికి, ఆత్మరక్షణ చేసుకునే సామర్థ్యం కలిగివున్నదని నిరూపించింది.

క్షిప్తంగా చెప్పాలంటే హిందూ ఆలోచనను సాంఘిక ఆచరణ రూపంలో నిజం చేయడానికి ఒక సాధనంగా ఆర్.యస్.యస్. దోహదం చేస్తున్నది". అని 'సవ్యాక్ష' అన్నారు.

మేధావి, సాహితీకారుడు, జ్ఞానపీఠ బహుమతిగ్రహీతఅయిన శ్రీ సచ్చిదానంద వాత్స్యాయన్ (అజేయ) 'సాప్తాహిక హిందూస్తాన్'లో (న్యూఢిల్లీ, 1980 ఏప్రిల్ 20) వ్రాస్తూ ఈ విషయాన్నే స్పష్టంచేశారు. శ్రీమతిగాంధీ దేవ్‌బంద్, దారుల్ ఉలూమ్‌తో మాట్లాడుతూ "భారతదేశం ప్రపంచంలో పెద్దదయిన ముస్లింలదేశాలలో రెండవది" అన్నారని, ఆ లెక్కన తీసుకుంటే "భారతదేశం ప్రపంచంలోకెల్లా పెద్దదయిన హిందూరాష్ట్రం"అని ఆయన అన్నారు. అయినా రాజకీయవాదులు యీ వాస్తవం పేర్కొనడానికి సిగ్గుపడుతున్నారు. "హిందూ ధర్మంమీద ఆధారపడిన లౌకిక దృక్పథంతో ప్రపంచంలోకెల్లా పెద్దదయిన హిందూదేశంగా భారతదేశాన్ని ప్రతిష్ఠించడం నేటి అవసరం. అప్పుడే యీదేశం గొప్ప జనాభాగల దేశంగామాత్రమేకాక గొప్పజీవనవిధానంకూడ కలిగివున్న గొప్ప దేశంగా మన్ననపొందుతుంది" అంటూ ఆయన వ్యాసం ముగించారు.

కంచికామకోటి శంకరాచార్య మాట్లాడుతూ "ఆర్.యస్.యస్. నైతిక విలువలను బోధిస్తున్నది; వ్యక్తిగత శీలాన్ని తీర్చిదిద్దుతున్నది; శారీరక, బౌద్ధిక, ఆధ్యాత్మికశక్తికి ప్రాధాన్యత యిస్తూ, మానవాళికి నిస్వార్థసేవచేస్తూ మాతృభూమిపట్ల భక్తిభావనను ప్రేరేపిస్తున్నది. ఇందులో తప్పేమిటి? ప్రభుత్వచిహ్నంలో వ్రాయబడినవిధంగా–సత్యంవద, ధర్మంచర: అనేకదా ఆర్.యస్.యస్. యువకులను ఉద్బోధిస్తున్నది! నేడు ప్రజలు ఆశేషమైన శక్తిని సాధించవలసిన సమయం ఆసన్నమయింది. ఇలాంటి సంస్థలు మరెన్నో మనకు కావాలి" అన్నారు.

చవుకబారు రాజకీయవాదులు కొందరు ఆర్.యస్.యస్.పై బురద చల్లడం ప్రారంభించగా భారతీయ సోషలిస్టు ఉద్యమపు కురువృద్ధుడు శ్రీ అచ్యుత పట్వర్థన్, "ఆర్.యస్.యస్: సువ్యవస్థీకృతమై, అనుశాసనబద్ధమైన,కార్యకర్తల మీద ఆధారపడినసంస్థ. అకుంఠిత దేశభక్తులుగా నేనెప్పుడూ పరిగణిస్తాను.

"ఆర్థిక విషయాలలోగాని, రాజకీయవిషయాలలోగాని ప్రభుత్వం తలపెట్టిన పథకాలలోని హేతుబద్ధతకు ఆర్.యస్.యస్. వ్యతిరేకమనే ఆరోప

జకు ఎట్టి ఆధారాలు వున్నట్లు కనిపించడంలేదు. ఆర్.యస్.యస్. ఫాసిస్టు అంటూ ఆదేపనిగా ఇందిరాగాంధి, భారతకమ్యూనిస్టుపార్టీవారుచేసిన దుష్ప్రచారంవల్ల వారి అజ్ఞానమే వెల్లడిఅయింది. సి.పి.ఐ.కి చెందిన దుర్నీతి పరులతో కలిసి ఆదేవిషయాన్ని మధులిమయే తన విచక్షణజ్ఞానానికి అన్యాయం చేసుకుంటున్నాడు.

"ఆర్.యస్.యస్. రాజకీయసంస్థకాదు. హైందవసంస్కృతీ పునరుద్ధరణకు అవేదన చెందుతున్నవారందరకూ ప్రాతినిధ్యంవహిస్తూ మొదటినుంచి సమాజాన్ని విద్యావంతంచేసేశక్తి నిర్మాణకేంద్రంగా వుంటూవచ్చింది. సౌశీల్యానికి, గౌరవాస్పదమైన ప్రవర్తనకు సంబంధించిన నైతిక నియమావళికి గొప్ప విలువనిచ్చిన యీ దేశంలో అలాంటి కార్యకర్తలే సంపదగా గలిగిన ఒకే ఒకసంస్థ ఆర్.యస్.యస్. కనుక సంస్కృతిక పునరుజ్జీవన కార్యాన్ని తమ భుజస్కంధాలమీద వహించడానికి వారే సంసిద్ధులు కావాలి" అన్నారు.

సంఘానికి అందరికంటె శ్రేష్ఠమైన యోగ్యతాపత్రాన్ని యిచ్చినవారు లోక్‌నాయక్ జయప్రకాష్. 1940 నుండి ఆర్.యస్.యస్. పట్ల జె.పి. వ్యతిరేకత చూపడం మొదలుపెట్టారు. కాని ఆర్.యస్.యస్. కార్యకర్తలతోను శ్రీ గురూజీతోను వారికి ఏర్పడిన పరిచయాల ఫలితంగా వారి ఆలోచనలో మార్పు మొదలయింది. 1966 లో బీహారులో కరువు సందర్భంగా ఆర్.యస్. యస్. కార్యకర్తలు అందరికంటె ఎక్కువ నిధిని సేకరించడం, సేకరణ విషయంలో పెద్దగా ఖర్చులు చేయకపోవడం, నిధిని అనుమానాలకు తావులేకుండా చక్కగా ఆర్తులకు పంచగల్గడం దీనితో జె.పి. ఎంతగానో ముగ్ధులయినారు. ఆ తరువాత ఆర్.యస్.యస్.తో వారి సంబంధాలు పెరుగుతూవచ్చినై. 1975 మార్చిలో ఢిల్లీలో జరిగిన భారతీయ జనసంఘ మహాసభలో ఆయన ప్రసంగిస్తూ "జనసంఘం మతోన్మాది అయితే నేనూ మతోన్మాదినే" అన్నారు. (దీనిపై కలకత్తాలో మార్క్సిస్టులు ప్రతిస్పందిస్తూ "జె.పి.-జనసంఘ్ ఏక్ ఆఛే"-'జె.పి. జనసంఘాలు ఒకటే' అనే పోస్టర్లు వేశారు.) భారతీయ జనసంఘ్‌ను, ఆర్. యస్.యస్.ను ఒకటిగా భావిస్తూ రెండింటిని మతోన్మాదులుగా చిత్రిస్తూ వచ్చిన వారికి యిది తగిన సమాధానం అయింది.

ఎమర్జెన్సీ తరువాత 1977 నవంబరు 3వ పాట్నాలో జరిగిన బ్రహ్మాండమైన ఆర్.యస్.యస్. శిక్షణశిబిరంలో జె.పి. ప్రసంగిస్తూ "ఆర్.యస్.యస్. ఒక విప్లవసంస్థ. ఈ దేశంలో దీని దరిదాపులకు చేరగలిగిన మరొకసంస్థ లేనే లేదు. ఈ సమాజంలో మార్పు తీసుకొని రాగలిగిన సామర్థ్యము, కులతత్వాన్ని రూపుమాపడానికి, పేదల కన్నీటిధారలను తుడవడానికి, సామర్థ్యంవున్న ఒకే ఒకసంస్థ ఆర్.యస్.యస్. దాని పేరులోనే "రాష్ట్రీయ" వున్నది. మిమ్మల్ని పొగడడానికి యీ మాటలు అనడంలేదునేను. ఒక చరిత్రాత్మకమైన భూమికను నిర్వహించవలసివున్నారని నేను విశ్వసిస్తున్నాను" అన్నారు,

ప్రపంచంలో భారతదేశం నిర్వర్తించవలసివున్న చారిత్రాత్మక పాత్రను గురించి జె.పి. అంచనావేస్తూ కుల, వర్గ విభేదాలను అతిక్రమించి మనం దేశాన్ని పటిష్టం చేయాలని అన్నారు. "నవీనభారతాన్ని సృష్టించే సవాలును స్వీకరించిన యీ విప్లవాత్మకసంస్థమీద నాకు గొప్ప ఆశలువున్నాయి. మీ మహత్కార్యానికి నా హృదయపూర్వకమైన ఆశీస్సులు. కొన్ని సమయాలలో మీకు నా సలహా యిచ్చాను. మరికొన్ని సందర్భాలలో మిమ్ము విమర్శించానుకూడా. కాని అదంతా మీ శ్రేయోభిలాషి హోదాలోనే. ఎందుకంటే మీ శక్తి నాకు తెలుసు. మీకు సాటిరాదగిన మరొకసంస్థ ఈ లోకంలో లేనేలేదు."

"మీరు "హిందూస్వయంసేవకసంఘ్" అనికాక "రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్" అని పేరుపెట్టుకున్నారు. ఎంతో ఆలోచించినమీదటనే యీ పేరు నిర్ణయించారు.-కనుక భారతదేశంలో ఒక విప్లవాన్ని తీసుకొనిరావడంలో మీరు సాధనంగా పనిచేయాలనేది నా అభిలాష. మీరు తీసుకొనివచ్చిన విప్లవానికి అపూర్వమైన ఆదరణ లభిస్తుంది. ఎందుకంటే బ్రాహ్మణ, క్షత్రియులవంటి వర్గాలలో మీ వంటివారికివున్న ప్రాబల్యం కారణంగా యిదిమరింతగా ఆమోదాన్ని పొందుతుంది. ఏ ఛాత్రసంఘర్షసమితివారో యిందుకు పూనుకుంటే-కనీసం హిందూ సమాజానికి సంబంధించినంతవరకు – అలాంటి బహుళజనామోదం లభించదు" అన్నారు.

పేదల దుస్థితిగురించి మాట్లాడుతూ "ఆర్థిక పరివర్తనాన్ని సాధించడం ఎలా, గ్రామాలతో పరివర్తనం తీసుకొనిరావడం ఎలా అని రాష్ట్రీయ స్వయం సేవకసంఘం ఆలోచించవలసివుంది. మహాత్మాగాంధీసహా మన నాయకులంతా యిందుకై శ్రమించారు. మహాత్మాగాంధీనికూడా మీ ప్రాతఃస్మరణంలోచేర్చారు

వారు నిజంగా అనుదినం స్మరించదగినవారు. ఈ విషయమై మిమ్ము అభినందించాలి. మరికొద్దికాలం ఆయన జీవించివున్నట్లయితే హిందూసమాజంలోని అస్పృశ్యత మొదలయిన దురాచారాలను తొలగించడానికి మనకు మరికొంత మార్గదర్శనం చేసివుండేవారు. నేడు మార్గం స్పష్టంగా కనిపిస్తున్నది. నాకంటె ఎక్కువగా మీరే యీ కార్యాన్ని నెరవేర్చడానికి సమర్థులైవున్నారు. మన పరంపర, మన సంస్కృతి, మనధర్మం గురించి వివిధ అంశాలమీద మీరు నిరంతరం చర్చిస్తూ ఆలోచిస్తూవున్నారు".

తమ ప్రసంగం ముగిస్తూ జె.పి. యిలా అన్నారు. "ఈ సమాజము, దీని వైభవోపేతమైనచరిత్ర, మన పూర్వీకులు అందించిన పరంపర, ఈదేశనిర్మాతల త్యాగాలు, వారి విజయాలు, మనం సంపాదించుకున్న స్వాతంత్ర్యము-వీటన్నిటికి మీరు వారసులు. వీటిని చక్కగా వినియోగించుకొనవలసినవారుమీరే. మిమ్ములను పొగడటానికి యీ మాటలు చెప్పడంలేదు నేను. వాస్తవ పరిస్థితిని మీ దృష్టికి తెస్తున్నాను. మీ మాటకు అపురూపమైన ప్రభావం ఉన్నది. మీ వెనుక బ్రహ్మత్వపు శక్తి, అనేక వేల సంవత్సరాల మన ప్రాచీనసంస్కృతి వున్నాయి. మీ కనులఎదుటనే సాగుతున్న యీ సామాజికపరివర్తనోద్యమ్యంలో మీరు అగ్రగాములుగా నిలిచివున్నారు. ఈ మార్పు యొక్క ఫలితాలు కూడా మీ యిష్టానుసారమే వుంటాయి.

'మిత్రులారా! దేశ సమస్యల గురించి ఆలోచిస్తున్నప్పుడు నాకు ఆవేదన కలుగుతున్నది. ఎంతోకాలం నేను జీవించనని నాకు తెలుసు. యాంత్రికంగా పొడిగించబడిన ఆయుష్షుతో నేను జీవిస్తున్నాను. మృత్యువుకు సన్నిహితంగా వున్నాను. అయినప్పటికీ నా దేశానికి, నా సమాజానికి, నా ప్రజలకు, ఈ దేశపు పేదలకు, నిర్భాగ్యులకు నాశక్తియొక్క ఆఖరి కణం దహించబడేవరకు, నా శరీరం తుదిశ్వాస విడిచేవరకు సేవచేయడానికే నేను దీక్షాబద్ధుణి అయివున్నాను సేవ, వైరాగ్యము, త్యాగము-అనే ఆదర్శాలను మీకు అందిస్తున్నాను. ఇప్పటికే మీలో యీ ఆదర్శాలు నెలకొనివున్నాయని, మీరు ఆత్మ-త్యాగ స్వభావము, ఉదాత్త ప్రవర్తనకల వ్యక్తులని అనడంలో నాకు ఎలాంటి సందేహములేదు. విశాలమైన యీదేశపు కార్యక్షేత్రం మీకోసం ఎదురుచూస్తున్నది. భగవంతుడు మీకు సామర్థ్యాన్ని ప్రసాదించాలని, మీ ఆశా-ఆకాంక్షలను మీరు సఫలీకృతం చేయాలని కోరుకుంటున్నాను".

సంఘము - రాజకీయాలు

ఎమర్జెన్సీ ప్రకటించిన కొద్ది దినాలతరువాత జైల్లో ఒక బడా నాయకుడు అన్నమాటలు "ఆర్.యస్.యస్సా? ఎవరువాళ్లు? ఏమిటి వారు చేసేపని? తేలిగ్గా కాల్చిపారేయవచ్చు? అని.

మరి తొమ్మిది నెలల తదుపరి అదే నాయకుడు అదే జైలులో చేసిన ప్రకటన : "నాకు ఆర్.యస్.యస్. ను యివ్వండి – యీ దేశాన్ని విముక్తం చేసి మీకు యిస్తాను" అని అందుపై ఒక జనసంఘ్ నాయకుడు (తరువాత రోజుల్లో ముఖ్యమంత్రి అయినారు)" అయితే మీరు ఆర్.యస్.యస్. లో చేరవచ్చు" అని సలహా ఇచ్చారు.

దానికి బడానాయకుడి జవాబు: "అలాంటిదేమీ జరగదు. వారు నన్ను తమలో కలిపేసుకుంటారు. నన్ను ఆర్. యస్. యస్. కు అర్పించుకోను. ఆర్.యస్.యస్. ను మీరు నాకు యివ్వండి. ఈ నియంతృత్వంనుంచి దేశాన్ని విముక్తం చేస్తాను".

ఈ బడా నాయకుడు మొరార్జీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశాడు. ఆ తరువాత చరణ్‌సింగ్ మంత్రివర్గంలోనూ పనిచేశాడు.

అచ్చమైన రాజకీయ నాయకుడితడు. ఆర్.యస్.యస్. పట్ల రాజకీయ వాదులు అవలంబించే వైఖరి దాదాపుగా యిదే: ఆ సంస్థను తాము ఉపయోగించుకోవాలని అనుకుంటారు. అది సాధ్యం కానపుడు దాని అంతం చూడాలనుకుంటారు. ఆర్.యస్.యస్‌ను లొంగదీయడంగాని, అణచడం కాని చేతకానప్పుడు వారు ప్రవర్తించే అసభ్యపు తీరుకు పరిమితి కనిపించదు.

ఆర్.యస్.యస్. ను స్థాపించడానికి ముందు డా॥ హెడ్గెవార్, వారి మిత్రులు క్రియాశీలురైన అతివాద కాంగ్రెసు కార్యకర్తలుగా వుండేవారు. స్వాతంత్ర్యానికి ముందు కాంగ్రెసు మరోవిధంగా, ఎంతో మెరుగుగా వుండేది.

అయినప్పటికీ బ్రిటిషు వారితో పోరాడటానికి గానీ, మనం కలలుగనే భారత దేశాన్ని పునర్నిర్మించడానికి గాని కాంగ్రెసు యోగ్యమైన సాధనం కాదని డా॥ హెడ్గెవార్ భావించారు. రాజకీయాలు అధికార రాజకీయాలకు ఆలంబన మయితే జాతి నిర్మాణానికి, సౌశీల్య నిర్మాణానికి సాధనం కాదని వారు గమనించారు. ఆర్.యస్.యస్. కు జాతీయ సమస్యలపట్ల ఎంతో ఆసక్తి వుంది. 1957 లోను, 1962 లోను జరిగిన ఎన్నికల సందర్భంగా ఓటు చేసే విధానం గురించి ప్రజలకు శ్రీగురూజీ సలహా ఇచ్చారు కూడాను. అయినా ఆర్.యస్. యస్. మాత్రం ఎప్పుడూ రాజకీయాలకు అతీతంగానే వుంటూవచ్చింది.

రాజకీయాలపట్ల, రాజకీయవాదులపట్ల శ్రీగురూజీకి అంతగా సదభిప్రాయం లేదు. అన్ని జీవనరంగాలలోను రాజకీయాల దుష్ప్రభావం ప్రసరిస్తున్నది. రాజకీయ నాయకులే సమాజానికి మూలస్థంభాలయినట్లు ధోరణి కనిపిస్తున్నదని వారు అభిప్రాయపడ్డారు. దీనివల్ల నైతిక విలువలు దిగజారిపోయి అన్ని జీవన రంగాలలో అవినీతి చోటుచేసుకుంది. ఇదంతా తలక్రిందుల వ్యవహారమని గురూజీ భావించారు. పదవిలోవున్న రాజకీయ నాయకులకు యివ్వబడుతున్న మితిమీరిన ప్రాముఖ్యాన్ని పరిహసిస్తూ "గుడిగోపురంమీద కూచున్నంత మాత్రాన కాకి ప్రపంచంలోని పక్షులన్నింటిలో గొప్పదికాదు" అని ఒకసారి అన్నారు.

ఆర్.యస్.యస్. మీద మొదటి రాజకీయదాడి 1934 లోనే జరిగింది. హిందువులకు వ్యతిరేకంగా ముస్లిములను, బ్రాహ్మణులకు వ్యతిరేకంగా బ్రాహ్మణేతరులను రెచ్చగొట్టడానికి బ్రిటిషువారు ప్రయత్నాలు చేస్తున్న రోజులవి. స్వాతంత్ర్యోద్యమంలో చీలిక తేవాలని మధ్యప్రాంతం, బేరారులలో బ్రాహ్మణులకు వ్యతిరేకంగా బ్రాహ్మణేతరులను సమర్థించారు. ఆర్.యస్.యస్. చేత ప్రభావితులయినవారు యీ బ్రిటిషువారి వంచనకు వ్యతిరేకంగా నిలిచారు. దానితో ప్రభుత్వం జిల్లా స్థానికబోర్డుల ఉద్యోగులు ఆర్.యస్.యస్. లో చేర రాదని ఉత్తరువు జారీ చేసింది. అప్పటికి అటువంటి ఉద్యోగులు అరడజను మంది మాత్రమే శాఖకు హాజరవుతున్నారు. ఆనాటికి ఆర్.యస్.యస్. యింకా శైశవంలోనే వున్నా, ప్రాంతీయ శాసనసభలోని జాతీయవాద శక్తులను సమీకరించి, ఆ విషయంలో ఒక కొత్త తీర్మానంద్వారా ప్రభుత్వాన్ని పరాజితం చేయించగలిగింది.

జమ్నాలాల్ బజాజ్‌ను గాంధీజీ తమ కుమారునివలె చూచుకొనేవారు. జమ్నాలాల్‌జీ కాంగ్రెసు కార్యాచరణ సమితి సభ్యులుగాను. పార్టీ కోశాధికారి గాను కూడా వుండేవారు. ఆర్.యస్.యస్. ను చూడటంతోనే ఆయన ఎంతగా ముగ్ధు లయినారంటే అది కాంగ్రెసులో అంతర్భాగంగా చేరిపోతే బాగుండునని ఆయనకు అనిపించింది. అందువల్ల లోగడ పి.సి.సి. కార్యదర్శిగావుంటూ రాష్ట్ర సంఘచాలక్‌గా మారిన అప్పాజీని కలిసి తనను డా॥ హెడ్గెవార్ వద్దకు తీసు కొని పొమ్మని కోరారు. రాజకీయాలపట్ల డాక్టర్‌జీ దృక్పధమేమిటో అప్పాజీకి బాగా తెలుసు. కనుక పథకం ప్రకారం నెరవేరే అవకాశాలు లేవని అప్పాజీ నచ్చచెప్పడానికి ప్రయత్నించారు. సంస్థను రాజకీయాలకు పార్టీ తత్వాలకు పూర్తిగా అతీతంగా వుంచాలని డాక్టర్‌జీ ఆశయం. అందువల్ల పనిగట్టుకుని యీ విషయమై డాక్టర్‌జీ వద్దకుపోయి తీరా ఆయనచేత కాదనిపించుకొనడం బాగుండ దని బజాజ్‌జీతో చెప్పారు. కానీ బజాజ్‌జీపట్టు వదలలేదు. అప్పాజీ బుద్ధిపూర్వ కంగానే డాక్టర్‌జీతో సమావేశం జరగకుండా అడ్డుపడుతున్నారని బజాజ్‌జీ అపార్థం చేసుకున్నారు. స్వతంత్రంగానే డాక్టర్‌జీనిచూడడానికి ఆయన ఏర్పాట్లు చేసుకున్నారు. రెండురోజుల తరువాత 1934 జనవరి 31 న డాక్టర్‌జీకి మిత్రు లయిన శ్రీ గణపతిరావు టికేకర్‌తోపాటు జమ్నాలాల్‌జీ డాక్టర్‌జీని చూడటానికి వెళ్లారు. సంస్థను కాంగ్రెసు ఆధ్వర్యంలో నడపమని కోరారు. ఆ విధంగా చేస్తే సంఘానికి అన్నిరకాల సహాయం లభిస్తుందని, డబ్బుకు సంబంధించిన యిబ్బంది యేమీ వుండదని, పైగా డాక్టర్‌జీ అభిలషించిన విధంగా అనతికాలంలోనే అఖిల భారత స్థాయికి సంఘం చేరుకుంటుందని డాక్టర్‌జీకి హామీయిచ్చారు.

కాంగ్రెసు మహత్తరమైన రాజకీయ సంస్థ అని, తాను దాని సభ్యుణ్ణని డాక్టర్‌జీ అంగీకరిస్తూనే. ఆర్.యస్.యస్. స్వతంత్రంగా స్వయంగా తన ఆంతరిక సంఘటనా సామర్థ్యంతోనే వికసించాలని నా దృఢమైన ఆకాంక్ష, మహావృక్షాల నీడలో చిన్నమొక్కలు ఎన్నడూ పెరగవని మన అనుభవం. రాజ కీయవాదుల చిత్తానుసారం వారి ఎత్తుగడలకు వలంటీర్లను తయారుచేయడం నా అభిమతంకాదు. స్వయంసేవకులు ఎవరో పైవారి అడుగులకు మడుగులొత్తాలని సంఘం కోరటంలేదు. మన జాతీయజీవనపు అన్ని అంశాల గురించి ఆలోచించ కలిగేవారుగాను, తమ స్వశక్తితో జాతిని ప్రగతిపథాన నడిపించగలిగేవారు గాను, స్వయంసేవకులను నిర్మాణం చేయడం నా ఉద్దేశ్యం. ఈనాటి ఏ రాజకీయ

నాయకుడి ద్వారాగాని, పార్టీద్వారా గాని ఈ పని జరగడం కల్ల. ఇది స్వయం కృషిమీద ఆధారపడి జరుగుతుంది. తమ కఠోర పరిశ్రమద్వారా, త్యాగాలద్వారా స్వయంసేవకులు దీనిని సాధించాలి. ఇతరులనుంచి డబ్బుగాని, మరేవిధమైన సహాయాన్నిగాని మేము స్వీకరించం. అలాచేస్తే వారిమీద మేము ఆధారపడ వలసివస్తుంది. మేము స్వతంత్రంగానే నిలుస్తాము. అదే మా నిశ్చయం కనుక మీతోనేను ఏకీభవించలేను" అని సమాధానమిచ్చారు.

సేఠ్ జమ్నాలాల్ జీ నిరాశతో మరలి వచ్చారు.

శ్రీ అప్పాజీ యిలా వ్రాశారు. "తరువాత జమ్నాలాల్ జీ వివిధ వ్యాయామశాలలకు బ్యాండు వాద్యాలు మొదలైనవి విరాళంగా యిస్తూ వాటిని పోషించడానికి ప్రయత్నించారు. రెండు సంవత్సరాలపాటు మాకు అదొక తలనెప్పిగా పరిణమించింది. కాని దానివల్ల వారు అనుకున్నది నెరవేరలేదు. ఒక సంఘటనను నిర్వహించడమంటే తమాషాకాదని ఆయన గ్రహించారుకూడాను. సేఠ్ జమ్నాలాల్ జీ ఉదార హృదయము, ఉత్తమ సంస్కారము గలవ్యక్తి. మా వలన వారికి నిరాశ కలిగినా. వారికి అసలు ఆగ్రహమే కలుగలేదు. తమ జీవితాంతం మమ్మలను ప్రేమిస్తూ, మాకు సహాయం చేస్తూనే వచ్చారు. కాని కాంగ్రెసు, దాని నుంచి పుట్టిన వివిధ సోషలిస్టు వర్గాలు యీ మహా సంస్థను తమ సంకుచిత రాజకీయ ప్రయోజనాలకు దుర్వినియోగం చేసుకునే అవకాశం కలుగనందున సంఘాన్ని ద్వేషించడం మొదలు పెట్టినాయి. వారిలో చాలామంది ఆర్.యస్.యస్. తరహాలో దళాలు. సేనలు, సంఘాలు సృష్టించడానికి ప్రయత్నించారు గాని, విజయం సాధించలేక పోయారు. మా విమర్శకులు మా మీద ఆగ్రహం వెళ్ళగక్కుతున్నారంటే అందుకు కారణం–సంఘాన్ని తమ స్వంత ప్రయోజనాలకు వినియోగించుకునే అవకాశం లేకపోవడం. సంఘం దినదినాభివృద్ధి చెందుతూ వుండటమేతప్ప సిద్ధాంతపరమైన విభేదాలు మాత్రంకాదు. సంఘం ఎవరినీ ద్వేషించక పోయినా, సంఘాన్నిమాత్రం కొందరు వ్యక్తులు ద్వేషిస్తూ వుండటానికి ప్రధాన కారణం యిదే."

కాంగ్రెసుకు నిరాశ కలిగితే, హిందూమహాసభకు మరింత నిరాశ కల్గింది. హిందూమహాసభ, ఆర్. యస్. యస్. రెండూ హిందుత్వాన్నే వరించి సంస్థలు కనుక రాజకీయ రంగంలో ఆర్. యస్. యస్. తనను మద్దతుగా నిలుస్తుంది

'మహాసభ' ఆశించింది. మహాసభ నాయకుడు డా॥ బి.యస్. మూంజే అనేక దశాబ్దాలపాటు డా॥ హెడ్గెవార్‌తో సోదరునివలె మెలిగారు. గనుక వారు పెద్దఆశలు పెట్టుకొనడంలో ఆశ్చర్యంలేదు. డా॥ మూంజే కాంగ్రెసులో వున్నంత కాలం సమస్య తలయెత్తలేదు. కాని ఆయన కాంగ్రెసుకు రాజీనామాచేసి హిందూ మహాసభలో చేరడంతోనే పెద్దసమస్య తయారయింది. కాంగ్రెసుకు వ్యతిరేకంగా ఆర్.యస్.యస్. వారు మహాసభకు మద్దతు యివ్వాలని వారు ఒత్తిడిచేశారు.

అప్పాజీ యిలా వ్రాశారు : "నేడు కాకుంటే రేపు వారెక స్పష్టంగా 'కాదు' అని సమాధానం యివ్వవలసిన సమయం వస్తుందని మాకు ముందే తెలుసు. ఆ సమయం రానే వచ్చింది. అప్పుడు డాక్టర్‌జీ స్పష్టంగా చెప్పారు : 'సంఘం రాజకీయాలకు పూర్తిగా దూరంగా వుండే సంస్థ. కనుక అది ఏ రాజకీయ పార్టీకోసం పనిచేయదు. ఏ రాజకీయపార్టీలోనయినా చేరడానికి, దానికోసం పనిచేయడానికి సంఘం స్వయంసేవకునికి స్వేచ్ఛవుంది. అతడు ఎన్నికల కార్యక్రమంలో కూడ చురుకుగా పాల్గొనవచ్చు. కాని సంస్థ మాత్రం అతని యిష్టప్రకారం నడవదు. అది పార్టీలకు దూరంగా వుంటుంది. ఏ పరిస్థితిలోను యీ విధానం నుంచి వైదొలగదు."

ఇలా నిర్మొగ మాటంగా చెప్పడంతో మహాసభ మిత్రులకు కోపం వచ్చిందనే అనుకోవచ్చు. "రామసేన" అనే క్రొత్త సంస్థను వారు ప్రారంభించారు. కాంగ్రెసు పార్టీకి ఒక "వానరసేన" అప్పటికే నాగపూరులో వుంది. ఇలా రెండు వ్యతిరేకపక్షాలు భగవాన్ రాముని పేరుమీద (తమ స్వప్రయోజనాలకు) సేనలు తయారుచేసినై! తరువాత రామ సేనకు, సంఘానికి మధ్య కొన్ని కొట్లాటలు జరిగినై. ఇదంతా చూసి డాక్టర్‌జీకి ఎంతో బాధకలిగింది. అప్పాజీ డా॥ మూంజే వద్దకు వెళ్ళి సంఘదృక్కోణాన్ని వివరించి, తమకు చేతనయినమేరకు ఆయనను శాంత పరచడానికి ప్రయత్నించారు.

సంఘ లక్ష్యాలు, ఆదర్శాలు,విధానాలలో ఏమాత్రం విభేదించని హిందూ మహాసభవంటి హిందుత్వవాద సంస్థకూడ సంఘాన్ని తమ చిత్తానుసారం వినియోగించుకొనే అవకాశం లేకపోవడమే దీనికి ముఖ్యకారణం. అనేక సంవత్సరాల పిమ్మట అప్పాజీ వ్రాశారు." హిందూమహాసభవారు 'డాక్టర్‌జీ చాల మంచివారు

కనుకనే హిందూ మహాసభకు అనుకూలంగా వుంటుండేవారు" అంటూ ప్రస్తుత సంఘ నాయకత్వాన్ని (శ్రీ గురూజీని) నిందిస్తున్నారు. కాని నాటి హిందూమహాసభవారి పత్రిక అయిన "వందేమాతరం" పాత సంచికలు చూస్తే నేడు గురూజీని నిందిస్తున్నవారే ఆ పత్రికద్వారా డాక్టర్‌జీ మీద సహితం ఎంత విషాన్ని కక్కారో తెలుసుకోవచ్చు."

హిందూమహాసభకు చిరకాలం అధ్యక్షులుగా పనిచేసిన వీరసావర్కార్ కూడ తన రాజకీయ కార్యకలాపాలకు ఆర్.యస్.యస్. చేయూత యివ్వనందుకు చాల అసంతృప్తిచెందారు. ఆ సంఘ స్వయంసేవకుల సమాధులమీద "ఇతడు జన్మించెను; ఆర్.యస్.యస్.లో చేరెను; మరణించెను."-అని వ్రాయవలసి ఉంటుందని సావర్కార్ ఒకసారి వ్రాశారు. రాజకీయాలకు దూరంగా వుండాలని ఆర్.యస్.యస్. తీసుకున్న నిర్ణయం మంచిదని, సరియైనదని ఎన్నో సంవత్సరాల తరువాతగాని సావర్కార్ అంగీకరించలేదు.

1937లో కాంగ్రెసు అధికారంలో వచ్చిననాటికి ఆర్.యస్.యస్. పనిచేయడం ప్రారంభించి పన్నెండు సంవత్సరాలయింది. అంతవరకు వారు ఆర్. యస్. యస్.ను ఒక్క మాట అయినా అని యెరుగరు. నిజానికి చాలమంది కాంగ్రెసువాదులు సంఘంలో క్రియాశీల కార్యకర్తలుగా వుంటుండేవారు. కాని అధికారంలోకి రావటంతోనే ఏనాటికయినా తమకు రాజకీయ ప్రత్యర్థి కాబోయే సంస్థగా ఆర్. యస్.యస్.ను వారు పరిగణించడం మొదలుపెట్టారు. మధ్యప్రాంతం, బీరారు పి.సి.సి. కార్యదర్శి ఇ. యస్. పట్వర్ధన్ డా॥ హెడ్గెవార్‌కు ఒక లేఖ వ్రాస్తూ సంఘ లక్ష్యాలు, ఆదర్శాలు ఏమిటో తెలపాలని, కాంగ్రెసుపట్ల దానివైఖరికూడ స్పష్టంచేయాలని కోరాడు. తమ సహచరులను సంప్రదించిన మీదట డాక్టర్‌జీ సమాధానం వ్రాస్తూ ఆర్. యస్.యస్. చాల పాత సంస్థ కనుక ఆ ప్రాంతంలోని ప్రతి రాజకీయ కార్యకర్తకు దానిని గురించి బాగా తెలుసునని అన్నారు. కాంగ్రెసుపట్ల ఆర్.యస్.యస్.కు వ్యతిరేకత ఏమీలేదని, చాలమంది క్రియాశీల కాంగ్రెసువాదులు సంఘసంస్థలోనూ క్రియాశీల కార్యకర్తలుగా వున్నారని కూడా డాక్టర్‌జీ తెలిపారు.

ఈ సమాధానాలు తనకు "సంతృప్తికరంగా లేవు" అంటూ పట్వర్ధన్ మళ్ళీ వ్రాశాడు. ఈసారి ఆర్.యస్.యస్. నుంచి సమాధానాలు రాబట్టడానికి

పెద్ద ప్రశ్నల జాబితా ఒకటి పంపించాడు. డాక్టర్జీ ఆయనకు సమాధానం యిస్తూ ఆర్.యస్.యస్.వారు విద్యాలయాలువదిలి చాల సంవత్సరాలయిందని, ప్రశ్నపత్రాలకు అవిధంగా సమాధానాలు వ్రాసే అలవాటు వారు మరిచిపోయా రని వ్రాశారు. మరికొద్దికాలానికే కాంగ్రెసు మంత్రివర్గాలు రాజీనామా చేసినై.

తరువాత పది సంవత్సరాలకాలంలో దేశంలోని మూలమూలలకు ఆర్.యస్.యస్. విస్తరించింది. ఆర్.యస్.యస్.కు వ్యతిరేకంగా కాంగ్రెసు ఒక్క మాట అనలేదు. కాని 1947లో అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్. యస్. యస్.ను తమ కాబోయే రాజకీయ ప్రత్యర్థిగా మళ్ళీ పరిగణించడం మొదలు పెట్టారు. అందువలన ఆర్.యస్.యస్.ను నిషేధించాలని కాంగ్రెసు వర్కింగ్ కమిటీ కాంగ్రెసు ప్రభుత్వాన్ని కోరింది. ఆర్.యస్.యస్.ను అకాలీదళ్‌ను నిషేధించమని కోరుతూ పంజాబ్ ముఖ్యమంత్రి డా॥ గోపీచంద్ భార్గవకు పండిట్ నెహ్రూ లేఖ వ్రాశారు కూడాను. వివేకం ప్రదర్శించడంలోనే గొప్ప సాహసం యిమిడివుందని పంజాబ్ ప్రభుత్వం భావించినట్లుంది-ఆర్. యస్. యస్.ను గాని అకాలీదళ్‌నుగాని దేనినీ నిషేధించలేదు. తరువాత మూడు సంవత్సరాలపాటు కాంగ్రెసు, ఆర్.యస్.యస్.ల మధ్య సహకారం కోసం సర్దారు పటేలు ఆశించగా, అదేసమయంలో ఆర్.యస్.యస్.ను అణచివేయాలని పండిట్ నెహ్రూ ప్రయత్నించారు. ఆర్.యస్.యస్.అనుకూల శక్తులు తనమీద ప్రాబల్యం సంపాదిస్తే తాను విదేశాలకు వెళ్ళి అక్కడినుంచి యీ శక్తులమీద పోరాటం జరుపుతాననేవరకు నెహ్రూ వెళ్లారు. అలాచేయడం జాతీయ వ్యతిరేక కార్యకలాపం అవుతుందని ఆయన గ్రహించినట్లు కనిపించదు. గాంధీజీ హత్య తరువాత ఆర్.యస్.యస్.ను అణిచివేయడానికి నెహ్రూ పడనిపాట్లులేవు, కాని అంతా వ్యర్థమే అయింది.

1949 సెప్టెంబరులో బీహారు పి.సి.సి. పంపిన ఒక ప్రతిపాదనను పరిశీలించిన కాంగ్రెసు కార్యవర్గం ఆర్.యస్.యస్. కార్యకర్తలు కాంగ్రెసులో చేరవచ్చునని తీర్మానించింది. (ఇందులో ఆశ్చర్యపడవలసిందేమీలేదు. ఆ మధ్య 1974లో బీహారు పి.సి.సి. అధ్యక్షుడు అన్నట్లు, జనసంఘంలోకంటె కాంగ్రెసు లోనే ఎక్కువమంది సంఘంవాళ్ళు వున్నారు). ఆ తరువాత కాన్పూరులో కాంగ్రెసు కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ కాంగ్రెసు అధ్యక్షుడు పట్టాభి

సీతారామయ్య "ఆర్. యస్.యస్. కాంగ్రెసుకు శత్రువుకాదు. అది మతోన్మాద రాజకీయసంస్థ కాదు" అన్నారు.

కాంగ్రెసు వర్కింగ్ కమిటీపై నిర్ణయాన్ని తీసుకున్న సమయంలో, పండిట్ నెహ్రూ పెద్దవిదేశీ పర్యటనలో వున్నారు. ఆయన తిరిగివచ్చిన తరువాత కాంగ్రెసు సేవాదళ్ మినహా యితర వలంటీరు సంస్థలకు చెందిన సభ్యులెవరినీ కాంగ్రెసులో చేర్చుకొడానికి కాంగ్రెసుపార్టీ నిబంధనలు ఒప్పుకొనవని ప్రకటిం చారు. కాంగ్రెసుసేవాదళ్ నామమాత్రంగానే వున్నసంగతి, ఆర్. యస్. యస్. వీరో బాయ్‌స్కౌట్సు, సేవాదళ్‌ల వంటిసంస్థకాని విషయం, కాంగ్రెసు నాయకులు పలువురు ఆర్యవీరదళ్ వంటి వాటికి కూడ నాయకులై వున్న విషయం-ఈ వాస్త వాలన్నింటిని నెహ్రూ పట్టించుకోలేదు.

జమియత్-ఉల్-ఉలెమా, ముస్లింలీగ్‌లకు చెందినవారుకూడా కాంగ్రెసులో చేరినప్పుడు ఆర్.యస్.యస్. వారు చేరడానికి అభ్యంతరమెందుకని అడిగితే ఆయన జవాబు యివ్వలేదు. ఈ వ్యవహారం అంతటిలోను గమ్మత్తయిన విషయ మేమంటే రామలీలా మైదానంలో 1949 నవంబరు 20నాటి నెహ్రూ సభను ముస్లిం సంస్థ అయిన అహిర్స్‌కు చెందిన ఎర్ర యూనిఫారపు వలంటీర్లు నిర్వహించడం.

ఇదంతా చూస్తే కాంగ్రెసు వారి ద్వంద్వ ప్రమాణాల గురించి స్వామి శ్రద్ధానంద వెల్లడి చేసిన అనుభవాలు తలపుకు వస్తున్నాయి: "మల్కానా రాజ పుత్రులను తిరిగి హైందవ ధర్మంలో చేర్చుకునే ఉద్యమానికి నాయకత్వం వహించమని 1923 ఫిబ్రవరి 13 న నన్ను పలువురు రాజపుత్రులు కోరారు... బహిరంగంగా 'తబ్లీగ్' (మతాంతరీకరణ) ను పనిగా పెట్టుకున్న మహమ్మదీయ నాయకులను కాంగ్రెసు విధానాలకు మార్గదర్శనం చేయడానికి, కాంగ్రెసుకు గౌర వనీయ ప్రతినిధులుగా పని చేయడానికి ఒక వంక అనుమతిస్తూ, హిందూ సమా జాన్ని అవిచ్ఛిన్నత నుండి కాపాడే పనిలో నిమగ్నమైవున్న వారినిమాత్రం అస్పృ శ్యులనుచేసి కాంగ్రెసు కార్యాచరణ సమితిలోనికి అనుమతించకపోవడం చూచి నాకు అమితమైన ఆశ్చర్యం కలిగింది."

సర్దార్ పటేలు అనారోగ్యంగా వున్నందున కాంగ్రెసులో స్వయంసేవకు లకు సభ్యత్వం యిచ్చే విషయంమీద చివరిదాకా పోరాడటానికి వీలుకాలేదు.

కావి పురుషోత్తమదాస్ టాండన్ అయితే కాంగ్రెసు, ఆర్. యస్. యస్. లను సన్నిహితం చేయగలుగులాడనే ఆశతో ఆయనను కాంగ్రెసు అధ్యక్షుడుగా ఎన్నికయేట్లు జేయడంలో సర్దార్‌పటేల్ కృతకృత్యుడయినాడు. సోషలిస్టులు కాంగ్రెసును వదిలి ప్రత్యేక పార్టీని ఏర్పాటు చేయడం నిజానికి నెహ్రూ సలహా మీదనే జరిగిందని, ఒకవేళ కాంగ్రెసులో పటేలువర్గానిదే పైచేయిగా తయారయితే తానుకూడా సోషలిస్టులతో చేరిపోదామని నెహ్రూ ఆలోచించాడని నమ్మబడు తున్నది కాని సంవత్సరం తిరిగే సరికి పటేలు స్వర్గస్థులయినారు. అదే అదనుగా నెహ్రూ టాండన్‌ను త్రోసివేసి తనే కాంగ్రెసు అధ్యక్షుడై, సోషలిస్టుల మాట మరిచిపోయారు.

ఆర్.యస్.యస్. కు యిదంతా వినోదంగా అనిపించింది. కాంగ్రెసు తన తలుపులను ఆర్.యస్.యస్. వారికి మూసివేయడంపై ఆర్.యస్.యస్.కుచెందిన బాబాసాహెబ్ ఆప్టే వ్యాఖ్యానిస్తూ "మూసివేయడానికి మాకు తలుపులే లేవు మరి. ఆమాటకు వస్తే గోడలుకూడా లేవుమాకు. మేము బహిరంగ స్థలాలలో ఆడుకుంటూ వుంటాం" అని ఢిల్లీ విశ్వవిద్యాలయ విద్యార్థులతో అన్నారు.

ఆర్.యస్.యస్. పట్ల యీ వ్యతిరేకోన్మాదం నెహ్రూకు మాత్రమే పట్టలేదు. పాకిస్తానుకుకూడా అంతపిచ్చివుంది. 1953 లో తూర్పు బెంగాలులో భాషా సమస్యమీద కలహాలు జరిగినపుడు "డాన్" పత్రిక అందుకు ఆర్.యస్. యస్., కమ్యూనిస్టులే కారకులని నిందమోపింది. 1954 తూర్పు పాకిస్తాన్ ఎన్నికలలో హక్-సుహ్రావర్ది-ముజీబ్‌ల సయోధ్యవల్ల ముస్లింలీగు ఘోర పరాజయం పొందితే-"పాకిస్తాన్ సిద్ధాంతపు గోడ"ను ఫజులుల్‌హక్ పడగొట్టి ఆర్. యస్. యస్. పంచమాంగదళ జలప్రవాహాన్ని రానిచ్చి పాకిస్తాన్‌ను ముంచివేస్తున్నట్లు 1954 మే 18 న "డాన్" ఒక కార్టూన్ ప్రచురించింది!

1948 లో సుమారు 17,000 మంది సంఘకార్యకర్తలను విచారణ లేకుండా అన్యాయంగా నిర్బంధంలో వుంచడం జరిగింది. తరువాత 60,000 మంది పైగా సంఘ కార్యకర్తలు సత్యాగ్రహం జరిపారు. తమపట్ల జైళ్ళలో చూపబడిన అమర్యాదకు కారణంగా వేలాదిమంది కొన్నివారాలపాటు ఆహారం ముట్టుకోలేదు. ఈ అత్యాచారాలన్నీ జరుపబడుతున్నా ఈ విషయమై దేశంలో

ఎక్కడా ఒక్కగానొక్క పార్లమెంటు సభ్యుడుగాని, శాసనసభ్యుడుగాని ఒక్క ప్రశ్న అడిగిన పాపానపోలేదు. ఆర్.యస్.యస్. ను అణచడమే ధ్యేయంగా పెట్టుకున్న కాంగ్రెసు వాదులు, వారి భజనపరులతోనే పార్లమెంటు, శాసన సభలు నిండి వున్నాయి. రాజకీయ క్షేత్రంలో ఈ విధమైన అరణ్యన్యాయమే చెల్లుబాటుగా వుండే ప్రశాంతంగా సంఘం తన కార్యం కొనసాగించగలుగ లుందా, ఏదయినా ఒక రాజకీయ రక్షణ కవచాన్ని నిర్మించుకొన వలసిన అవ సరం లేదా అని కార్యకర్తలలో ఆలోచన మొదలయింది. కాని తాము చేరడానికి యోగ్యమైన రాజకీయ పక్షం దేశంలో లేదు. నెహ్రూ కాంగ్రెసు రొంపిలోవుంది. సోషలిస్టులు, స్వయంసేవకుల దృక్పథాలు ఏకీభవించవు. సి.పి.ఐ. ప్రస్తావన లేనేలేదు. హిందూమహా సభ అస్తిత్వమే ప్రశ్నార్థకంగా వున్నది. ఈ దశలో, అంతవరకు హిందూమహాసభలోవున్న డా॥ శ్యామప్రసాద్ ముఖర్జీ తూర్పు బెంగాలులోని హిందువులపట్ల ప్రభుత్వం జూపుతున్న నమ్మకద్రోహానికి నిరస నగా నెహ్రూ మంత్రివర్గం నుంచి రాజీనామా చేశారు. ఒక కొత్త పార్టీని స్థాపిం చాలనికూడా ఆయన ఆలోచిస్తున్నారు. ఒకే వైపుగా సాగిన సంఘ కార్యకర్తల ఆలోచనా ప్రవాహం, డా॥ ముఖర్జీ ఆలోచనా ప్రవాహం కలిసి భారతీయ జన సంఘ ఆవిర్భావానికి దారితీసింది. ఈ కొత్తపార్టీకి డాక్టర్ ముఖర్జీ అధ్యక్షులు కాగా, అర్.యస్.యస్. నాయకుడయిన డా॥ భాయిమహవీర్ ప్రధానకార్యదర్శి అయినారు.

తొలి సాధారణ ఎన్నికలలో తగినన్ని ఓట్లు సంపాదించుకొని జనసంఘం అఖిల భారతీయ పక్షంగా గుర్తింపు సంపాదించింది.

భారతీయ జనసంఘం అభివృద్ధి చెందడంతో దానికి ఆర్.యస్.యస్. తో వున్న సంబంధాలగురించి పత్రికలు అనేక ప్రశ్నలడగటం ప్రారంభించారు. "ఆర్గనైజరు పత్రికలో (1956 జూన్ 25) ఒక వ్యాసంరాస్తూ శ్రీ గురూజీ అన్ని విషయాలు స్పష్టంగా వివరించారు. ప్రభుత్వంనుంచి రాజీనామా చేసిన తరువాత డాక్టర్ ముఖర్జీకి ఆనాడువున్న పార్టీలేవీ యోగ్యమైనవిగా కనిపించ లేదని, అందువల్ల ఒక కొత్త పార్టీస్థాపించాలనే నిర్ణయానికి వచ్చారని, తన సలహాలను, సహాయ సహకారాలను డా॥ ముఖర్జీ కోరారని గురూజీ చెప్పారు. "ఆ కారణంగా మేము చాలామార్లు, కలిసి దానికి సంబంధించిన అన్ని

విషయాలు చర్చించాం. జాతియొక్క నిజమైన, అనగా సాంస్కృతిక పునరుద్ధరణకే పూర్తిగా అంకితమైవున్న ఏ సంస్థ అయినా రాజకీయ పక్షాలకు అనుబంధంగా రూపొంది నట్లయిన విజయవంతంగా పనిచేయ జాలదని... కనుక ఆర్.యస్.యస్. రాజకీయాల్లోకి దిగడం గాని, ఏ రాజకీయ పక్షానికి గాని మరొక విధమైన సంస్థకుగాని అది ఉపాంగంగా తయారవడంగాని జరిగేపని కాదని... సహజంగానే నేను డా॥ ముఖర్జీని హెచ్చరించవలసి వచ్చింది.

"ఈ పరిస్థితిని ఆయిన అర్థం చేసుకుని నేను చెప్పినది సత్యమని అంగీకరించారు. అదే సమయంలో క్రొత్త రాజకీయపక్షం కూడా మరియే యితర సంస్థకు అనుబంధం"గా రూపొందించే వీలులేదని, అప్పుడే అది సక్రమంగా వృద్ధిచెంది వికసించ గలుగుతుందని ఆయన అన్నారు. తాను తలపెట్టిన క్రొత్తపార్టీకి ఆర్.యస్.యస్ కు మధ్య వుండవలసిన సంబంధాల గురించి యీ ప్రాథమిక అంశాలమీద అంగీకారం కుదిరిన పిమ్మట, కొత్తపార్టీ స్వీకరించే ఆదర్శాన్ని గురించి నిర్ణయించ వలసి వచ్చింది. ఆర్. యస్. యస్. కు సంబంధించినంత వరకు ఖచ్చితమైన నిర్దిష్టమైన ఆదర్శాలు, కార్య పద్ధతి వున్నాయి. కనుక యీ సంస్థయొక్క ఏ సభ్యుడి సహకారం కోరినాఆ పార్టీ యొక్క రాజకీయ వ్యక్తిత్వంలో కూడ ఆదర్శవాదం వుంటేనే అది లభిస్తుంది.

"ఈ విషయంలో కూడ పూర్తి అంగీకారం కుదిరింది. అయితే హిందూ మహాసభ హిందూ రాష్ట్రాన్ని నమ్ముతుంది కనుక అది మతోన్మాద సంస్థ అని ఒక పత్రికా సమావేశంలో విమర్శించే వరకు డా॥ ముఖర్జీ వెళ్ళారు.అప్పుడు నేను ఆర్.యస్.యస్. వారిమైన మేము కూడా హిందూరాష్ట్రమైన భారతరాష్ట్రాన్ని అంతగట్టిగా నమ్ముతామని హిందూ మహాసభను దూరంగా త్రోసినట్లే ఆర్. యస్.యస్. ను కూడా దూరంగావుంచవలసి వస్తుందని, అట్టిపరిస్థితిలో నా సానుభూతిగాని ఆర్.యస్.యస్.వారి హిందురాష్ట్ర భావనను దృఢంగా నమ్మి, దానిని స్థాపించడానికి నిర్విరామంగా పనిచేసిన (క్రొత్త పార్టీలోచేరిన)కార్యకర్తల సహకారండా. ముఖర్జీఆశించడానికి వీలులేదని స్పష్టంగా చెప్పాను.తాను పొరపాటున అట్టి ప్రకటనచేసినట్లు ఆయన ఒప్పుకున్నారు.హిందూరాష్ట్ర భావనపట్ల తనపూర్తిఅంగీకారాన్నివ్యక్తంచేస్తూ,రాజ్యాంగం భారతజాతీయతనుస్పష్టంగాగ్రహించినిర్వచించ

లేకపోయిందని. హిందూరాష్ట్రాన్ని పూర్వవైభవాన్ని పునః ప్రతిష్ఠించే లక్ష్యానికి ఆధునిక ప్రజాస్వామిక భావనతో వైరుధ్యం వచ్చే అవకాశం లేదని కూడా అన్నారు. హైందవేతరులు ఎలాంటి జాతీయ వ్యతిరేక కార్య కలాపాలకు తల పడనంతవరకు, అధికారం హస్తగతం చేసుకొని తద్వారా జాతిని దాని మహోన్నతవైభవ పీఠం నుంచి కదిలించాలని సాహసించనంత వరకు, వారికి కూడ హిందూరాష్ట్రం పూర్తి పౌరస్వేచ్ఛకు, దేశజీవనంలో సమానమైన రాజకీయ, మత, సాంస్కృతిక హోదాకు హామీయిస్తుందని అన్నారు. ఈ సత్యాన్ని తన రాజకీయ పక్షపు ఆశయాదర్శాలలో స్పష్టంచేయడానికి కూడా ఆయన సంసిద్ధత వ్యక్త పరచారు.

"ఆ విధంగా ఏకాభిప్రాయం కుదరటంతో నేను నా సహచరులలో దీక్షా దక్షులు, పరీక్షలకు నిలిచినవారు, క్రొత్త రాజకీయ పక్షాన్ని స్థాపించే బాధ్యతను నిస్వార్థంగా తమ భుజస్కంధాలమీద వహించగలవారు, దాని ఉన్నతికి విస్తృతమైన అచంచలమైన పునాదులువేసి దానిని పునరుద్ధరణగల గౌరవనీయమైన అఖిలభారత రాజకీయ పక్షంగా తీర్చిదిద్దగల సమర్థత గలవారు అయిన వ్యక్తులను కొందరిని ఎంపిక చేశాను. ఆ విధంగా డా॥ ముఖర్జీ మనోరథం ఫలించి భారతీయ జనసంఘం అవతరించింది."

శ్రీ గురూజీ యింకా యిలా వివరించారు : "డా॥ ముఖర్జీకి మంచి కార్యకర్తల బృందాన్ని యిచ్చిన తరువాత, నేను మాత్రం నా దృఢవిశ్వాసానికి అనుగుణంగా జనసంఘం యొక్క తదుపరి కార్యకలాపాలతో ఎట్టి ప్రమేయం పెట్టుకోకుండా దానిపట్ల నిరాసక్తంగావుంటూ హిందువుల సాంస్కృతిక సంఘటనను నిర్మించే ఆర్.యస్.యస్. కార్యంలోనే పూర్తిగా నిమగ్నమైనాను. కాని అప్పుడప్పుడు డా॥ ముఖర్జీ నన్ను కలుసుకొనడం తటస్థించినపుడల్లా జనసంఘ పురోగతిగురించి వారు తలపెట్టనున్న కార్యక్రమాలు, ఉద్యమాలగురించి నాకు చెప్తుండేవారు. నేనుకూడ ఆర్.యస్.యస్ కార్యక్రమంలో డా॥ ముఖర్జీ సహాయ సహకారాలను అభ్యర్థించడం జరిగేది. మా కార్యకర్తలకు ఎప్పుడు ఎక్కడ అవసరమయినా ఆయన అన్యథా భావించకుండా అందుబాటులోవుండేవారు. ప్రజా జీవనంలో సాధారణమైత్రిని అధిగమించిన సన్నిహిత ప్రేమానుబంధం మామధ్య వికసించి రోజురోజుకు అది దృఢతరం కాసాగింది. మేమిద్దరం ఒకరిపనిలో

ఒకరు జోక్యంచేసుకొనకుండా, ఒకరిసంస్థపై మరొకరిసంస్థ అజమాయిషీలేకుండా చాలా జాగ్రత్త తీసుకుంటూనేవున్నా, మా సంస్థలు, మా కార్యక్షేత్రాలలో ఏ ముఖ్య నిర్ణయం జరిగినా ఒకరినొకరం సంప్రదించుకొనకపోవడం ఎప్పుడోగాని జరిగేది కాదు".

ఆ విధంగా ఆర్. యస్. యస్., జనసంఘ్‌లు పరస్పర విభిన్నమైన రెండు ప్రత్యేక సంస్థలు. ఒకటి సాంస్కృతికము, మరొకటి రాజకీయము. ఆర్. యస్.యస్.లో ఏ పదవిలోనయినా వున్నవారు ఏ రాజకీయపక్షంలోను పదవులు చేపట్టకూడదని ఆర్.యస్.యస్. నిబంధనావళిలో పేర్కొనడం జరిగింది కూడ.

రాజకీయాలపట్ల ఆర్. యస్. యస్. వైఖరి 50 సంవత్సరాల క్రిందట ఏ విధంగా వుండేదో ఈనాడుకూడ అదే విధంగా వుంటున్నది. అది రాజకీయా లలో లేదు. అధికారంకోసం ప్రాకులాడటం లేదు. ఆర్.యస్.యస్. తలుచు కొనివుంటే 1940లలో మధ్యభారత్‌లోని అనేక ప్రజామండలులను కైవసం చేసుకొని, అనేక సంస్థానాలలో సునాయాసంగా అధికారంలోకి వచ్చిఉండేదని ఆర్.యస్.యస్.కు దీర్ఘ కాలం సర్‌కార్యవాహ (ప్రధానకార్యదర్శి)గా పనిచేసిన భయ్యాజీదాణీ అంటూవుండేవారు కాని ఆర్.యస్.యస్. ఆ పని చేయలేదు. సౌశీల్య నిర్మాణకృషిలోను, రాష్ట్ర నిర్మాణ కార్యంలోను అది నిమగ్నమైవుంది. దానికి దేశ సమస్యలపట్ల ఎంతో ఆసక్తివుంది. ఈ సమస్యల గురించి లోతుగా ఆలోచనచేసి ఎప్పటికప్పుడు నిష్పక్షపాతమైన, నిరాసక్తమైన అభిప్రాయాలను అది ప్రకటిస్తూవుంటుంది.

వ్యాస, వశిష్ఠులకాలంనాటి ప్రాచీన భారతీయ పరంపరకు యిది అను గుణ్యంగా వుంది. ఇటీవలి చరిత్రలో శివాజీకి సమర్థ రామదాస్ గురువుగా వ్యవహరించారు. ఆధునిక కాలాన్ని పరిశీలిస్తే జాతీయోద్యమంలో గాంధీజీ నిర్వహించిన పాత్ర, జనతాఉద్యమంలో జయప్రకాశ్ పాత్ర యిలాంటివే. పండిత నెహ్రూ సహితం ఆచార్య వినోబాభావేను నైతికనాయకునిగా పరిగణిస్తూ వుండేవారు.

జనసంఘంతో ఆర్.యస్.యస్.కు వున్న సంబంధం సరిగా యిలాంటిదే. ఆశయాదర్శాలు, లక్ష్యాలు, నాయకత్వాలు, నియమనిబంధనలు. పతాకాలు,

సూత్రాలు, విధానాలు, కార్యక్రమాలు – అన్నీ వేరువేరుగా ఉన్నా రెండు విభిన్న సంస్థలు యివి- భారతీయజనసంఘ నాయకులు తమకుయిష్టమైనపుడు ఆర్.యస్ యస్. నాయకుల అభిప్రాయాలు తెలుసుకుంటుండేవారు. కాని వారిదారివారిదే. ఉదాహరణకు కృత్రిమ సాధనాలద్వారా కుటుంబనియంత్రణకు శ్రీ గురూజీ వ్యతిరేకికాగా, జనసంఘానికి ఆ వ్యతిరేకత లేదు. పంజాబీ హిందువులంతా పంజాబీనే తమ మాతృభాషగా అంగీకరించాలని శ్రీ గురూజీ సలహా యిచ్చారు. కాని చాలమంది జనసంఘ కార్యకర్తలు హిందియే తమభాషఅని మొండిపట్టు పట్టారు- భారత-సోవియట్ ఒప్పందాన్ని శ్రీ గురూజీ వ్యతిరేకించగా, జన సంఘం ఆ ఒప్పందంపట్ల హర్షం ప్రకటించింది-

"అన్నిచోట్లకంటె నాగపూరులో సంఘం అత్యంత పటిష్టంగావుంది- కాని అక్కడ ఒక్క ఎన్నికలోనయినా జనసంఘం గెలవలేకపోయింది- ఈ రెండు సంస్థల స్వభావంలోను, ఆశయాలలోను వున్న విభేదాలు ఎలాంటివో దీనినిబట్టి తెలుసుకొనవచ్చు" అని శ్రీ గురూజీ చెప్తుండేవారు.

కాని ఆర్.యస్.యస్.ను నిందించడమే పనిగాపెట్టుకొని తమ అప జయాలకు దానిని నిందించే రాజకీయవేత్తలు, దానిని రాజకీయసంస్థఅని అంటూనే వున్నారు–రాజకీయం కావడమేదో గొప్ప అపరాధమయినట్లు ! ఆర్.యస్.యస్. రాజకీయాలలోకి రానివ్వకుండా తామే అడ్డుపడినట్లుగా వారు భావిస్తుంటారు.

ఈ ఆర్.యస్.యస్. వ్యతిరేకోన్మాదమే 1964–65లలో ఒక అంత ర్జాతీయ దుస్సంఘటనకు దారితీసింది. కొయిరాలాను డిస్మిస్‌చేసిన తరువాత, భారత–నేపాల్‌ల మధ్య సంబంధాలు బొత్తిగా బాగాలేవు. నేపాల్‌లోకి న్యూఢిల్లీ సాయుధదళాలను పంపుతుండేది- దానితో ఖాట్మండుఆగ్రహించి చైనా,పాకిస్తాన్ లకు సన్నిహితంకావడం మొదలు పెట్టింది.

1963లో శ్రీ గురూజీ నేపాల్‌లోని పశుపతినాథ్‌ను సందర్శించడానికి వెళ్లారు- అక్కడ రాజునుకూడ కలిసి హిందువులు, హిందూధర్మం ఎదర్కొంటున్న సమస్యలను చర్చించి, భారత్‌లో జరుగనున్న ఆర్.యస్.యస్ కార్య క్రమానికి రావలసిందిగా ఆహ్వానించారు- ఆహ్వానాన్ని రాజు మన్నించారు.

భారత్‌కు తిరిగిరాగానే శ్రీ గుహాజీ విషయమంతా ప్రధానమంత్రి నెహ్రూకు లేఖద్వారా తెలియజేశారు. ఉత్తరం అందిన నెహ్రూ వెంటనే ప్రత్యుత్తరం పంపారు.

రాజు మహేంద్ర 1965 జనవరి 14న నాగపూర్‌లో ఆర్.యస్.యస్ మకరసంక్రాంతి ఉత్సవానికి హాజరుకావాలని నిర్ణయించుకున్న విషయం 1964 డిసెంబర్ 25న రేడియో నేపాల్ ప్రకటించింది. చైనా, పాకిస్తానులకు దిగ్భ్రమ కలిగించిన నిర్ణయమది. భారత-నేపాలల సంబంధాల మెరుగుదలకు సంకేతంగా పరిగణిస్తూ దీనిని న్యూఢిల్లీ స్వాగతించివుండవలసింది. నిజానికి రావల్‌పిండీ – పీకింగులకంటె న్యూఢిల్లీకే యిది ఎక్కువ కంపరం కలిగించింది. నేపాల్ రాజు రాకవల్ల ఆర్.యస్.యస్., జనసంఘ్‌లకు బలంవస్తుందనేభయంతో, భారత్‌కు రావద్దని రాజుకు భారత ప్రభుత్వం సలహాయిచ్చింది!

నేపాల్ ప్రధాని తులసిగిరి బహిరంగంగానే తమ ఆశ్చర్యం యిలా వెల్లడించారు: "రాజుగారు ఆర్.యస్.యస్. సభలో ప్రసంగిస్తే నేరమేమిటి? బొంబాయిలో యూకరిస్టు సభలలో పోప్ మాట్లాడితే ఎవరూ తప్పుపట్టలేదు. మరి ఒక హిందూరాజు ఒక హిందూసంస్థయొక్క సభలో మాట్లాడి తద్వారా హిందూత్వపు ఏకత్వాన్ని ప్రకటించడానికి ఎవరికిమాత్రం అభ్యంతరం ఎందుకు వుండాలి?"

వాటికన్ రాజ్యానికి అధిపతిఅయిన పోప్ వచ్చినపుడు స్వాగతం చెప్పడానికి రాష్ట్రపతి, ప్రధాని యిద్దరూ బొంబాయికి పరిగెత్తారు. కాని నేపాల్ హిందూ రాజ్యాధినేత ఒక హిందూసభలో ప్రసంగించదలిస్తే ఆ కార్యక్రమం రద్దుచేసుకోవడానికై ఆయనపై ఒత్తిడితేవడం జరిగింది.

హైందవ ధార్మికవ్యవస్థలో నేపాల్ మహారాజుకు విశిష్టమైన స్థానం వున్నది. పూరీజగన్నాథ్‌లోని వజ్రసింహాసనాన్ని ఆయన ఒక్కరే అధిరోహించగలరు. జగన్నాథ మందిరానికి అధిపతిఅయిన పూరీమహారాజుకుకూడా అలభ్యమైన సింహాసనం అది. రామేశ్వరం గర్భగుడిలో పూజచేయగల ముగ్గురు వ్యక్తులలో ఆయన ఒకరు. ప్రధాన పూజారి, శృంగేరి శంకరాచార్యులు అట్టి పూజ చేయగల తక్కిన యిద్దరువ్యక్తులు. కాని యిదంతా "లౌకిక" భారత

ప్రభుత్వానికి లెక్కలోకే రాలేదు. జనవరి 11న శ్రీ గురూజీకి వ్రాసిన లేఖలో హిందూ ఉత్సవానికి సాధ్యపడనందుకు తాను ఎంత బాధ అనుభవించారో రాజు తెలియజేశారు. ప్రపంచంలో హిందువులపాత్రనువిశ్లేషిస్తూ, అందులో ఆర్.యస్ యస్. సేవలను కొనియాడుతూ ఒక సుదీర్ఘమైన సందేశాన్ని సభలో చదవ దానికి పంపించారు.

"రాజకీయాలు - ఆర్. యస్. యస్." విషయంమీద 1964 నవంబరు 27న రాజ్యసభలో మరొక ఆసక్తికరమైనప్రశ్న వచ్చింది. ఆర్.యస్.యస్.ను రాజకీయపక్షంగా ఎందుకు ప్రకటించలేదో తాను తెలుసుకొనగోరుతున్నానని శ్రీ ఆబిద్‌ఆలీ అన్నారు. దేశీయాంగశాఖ సహాయమంత్రి శ్రీ జైసుఖ్‌లాల్‌హాథీ సమాధానంయిస్తూ యీ జాబితాలను ఎన్నికల సంఘంవారు, లోక్‌సభ స్పీకరు తయారుచేశారని, కాని రెండు జాబితాలలోను ఆర్.యస్.యస్. పేరు లేదని అన్నారు. అందుకు ఆర్.యస్.యస్. దరఖాస్తుపెట్టనిదే దానిని రాజకీయ పక్షాల జాబితాలో చేర్చడం ఎలా సాధ్యపడుతుందని శ్రీ జి. రామచంద్రన్ ఆశ్చర్యం ప్రకటించారు. తరువాత దేశీయాంగమంత్రి జి. యల్. నందా ఆర్.యస్.యస్. దాని నియమ నిబంధనలమేరకు "రాజకీయాలతో ప్రమేయంపెట్టుకోని సాంస్కృతిక సంస్థ" అని ధృవీకరించారు.

కాని అధికారపక్షంమాత్రం ఆర్.యస్.యన్.మీద యుద్ధం కొనసాగిస్తూనే వుంది.

ఆర్.యస్.యస్.- జనతా

ఆర్.యస్.యస్. పట్ల జనతా ప్రవర్తించిన తీరు కాంగ్రెసు ప్రవర్తన కంటె మెరుగుగా లేకపోవడం ఆశ్చర్యం కలిగించేవిషయం.

జైళ్లకు వెళ్ళినపుడు. ఎన్నికలలో సహాయపడినప్పుడు మాత్రం ఆర్.యస్.యస్. ఎంతోమంచిది. కాని ఒకానొకవ్యక్తి ప్రధానమంత్రి అవడానికి తోడ్పడక పోతే అది "మతోన్మాది", "ఫాసిస్టు" అవుంది. మొరార్జీభాయి శ్రీ చరణ్‌సింగ్‌ను తొలగించగానే-ఆయనచేసిన మొదటిపని ఝుండేవాలాలోని ఢిల్లీ ఆర్.యస్.యస్. కార్యాలయానికి ఫోనుచేయడం శ్రీ బాలాసాహెబ్ ఎక్కడున్నారో కనుక్కుందామని. సర్‌సంఘ చాలక్‌తో అప్పటికప్పుడు ఏదో మాట్లాడాలని ఆయన ఉబలాటం. బాలాసాహెబ్ సరిగా అప్పుడే విమానాశ్రయానికి బయలుదేరారని, వారు మళ్ళీ ఢిల్లీ సందర్శించినపుడు కలుస్తారని ఆయనకు తెలియజేయబడింది. అదేవిధంగా బాలాసాహెబ్ తరువాత కలిశారుకూడాను.

ఎమర్జెన్సీ సమయంలో చరణ్‌సింగ్ కాంగ్రెసుతో మాత్రమే కలవాలని అనుకున్నట్లే, ఎమర్జెన్సీ ముందురోజుల్లో జనసంఘ్‌తో మాత్రమే కలవాలని ఆరాటపడ్డారు. 'ది పీపుల్ బిట్రేయిడ్'లో శ్రీ ఎల్.కె. అద్వానీ యిలా వ్రాశారు "మేము ఒప్పుకోనప్పుడు ఆయన లక్నోనుంచి కాన్పూరుకు కారులో దూసుకుపోయి ఆర్.యస్.యస్. అధినేత బాలాసాహెబ్‌ను కలుసుకొని, జనసంఘంమీద తమ పలుకుబడిని ఉపయోగించి, తన ప్రతిపాదనను వారిచేత ఒప్పించేట్లు చూడమని కోరారు. అటువంటి విషయాల్లో ఎప్పుడూ చూపిన వైఖరినే దేవరస్ వ్యక్తంచేస్తూ సూటిగా జనసంఘంతోనే చర్చలు జరిపితే మంచిదని చరణ్‌సింగ్‌కు సూచించారు".

కాని జనతా వ్యవహారాల్లో ఆర్.యస్.యస్. జోక్యం చేసుకుంటున్నదంటూ, యీ చరణ్‌సింగే నిందాప్రచారం సాగించారు. నిజానికి యీ వ్యవహారమంతా ఆర్.యస్.యస్. వ్యవహారాల్లో యీ నాయకుల జోక్యానికి సంబంధించినది మాత్రమే.

భూసంస్కరణలు అమలుచేయడంలోను, భూమిని పంచివేయడంలోను ప్రభుత్వానికి ఆర్.యస్.యస్. విలువయిన సహకారాన్ని అందిస్తున్నదని 1977 అక్టోబరు 20న ఢిల్లీలో పత్రికలతో చెప్పిన కర్పూరీ ఠాకూర్ ఆర్.యస్.యస్. 'ప్రతిక్రియాత్మకమైనదని యిప్పుడు కనిపెట్టారు.

తాను జైలునుంచి ఆర్.యస్.యస్. యూనిఫారంలో వస్తే తనమిత్రులు ఆశ్చర్యపోనక్కరలేదని జైలునుంచి తన భార్యకు వ్రాసిన శ్రీ లిమయేకు రష్యా పోయివచ్చినతరువాత "శ్రీమతి గాంధికంటె ఆర్.యస్.యస్. మరింత హీనమైనది"గా కనిపించింది. నిజానికి 1977 మే 15న జనసంఘం మొదలయిన పార్టీలు జనతాలో విలీనమైన రోజున "భావసారూప్యంగల మిత్రులతో లిమయే మాట్లాడుతూ "ఆర్.యస్.యస్.ను రద్దుచేయించి జనసంఘ్ అంతు చూడటమే" తన క్రొత్తవ్యూహమని చెప్పాడు.

జనతా భాగస్వామ్య పక్షాల "వలంటీరు సంస్థలతో" విలీనమై పొమ్మని ఆర్.యస్.యస్.ను లిమయే కోరినప్పుడు ఆయన అంతరంగంలోని ఆలోచన అదే. చరణ్‌సింగ్ నిష్క్రమణ తరువాత మొదటిసారిగా జనతా కార్యాచరణ సమితి సమావేశంలో రామధన్ మాట్లాడుతూ తనతో యింతకుముందు లిమయే "ఏమిటి మీరు చేస్తున్నది ? చరణ్‌సింగ్‌ను, బి.యల్.డి.ని బహిష్కరించడమా? మనం త్రోసిపారేయవలసిన అసలుశత్రువు ఆర్.యస్.యస్." అని అన్నట్లు చెప్పారు. అప్పుడు అక్కడేవున్న లిమయే చాల యిబ్బందిపడుతూ, అప్పటికి ఏమీ అనలేక మూగనోము పట్టాడు.

"మార్క్సిస్టుపార్టీ కంటెకూడ ఆర్.యస్.యస్. ఎంతో ప్రగతిశీలకమైన సంస్థ" అన్న రాజ్‌నారాయణ్ సంజయ్‌గాంధితో దోస్తీ కట్టాడు. అంతటితో సంతృప్తి కలుగక తనను హత్యచేయడానికి అర్.యస్.యస్. కుట్రపన్నిందని ఆరోపించాడు. "వారణాసి, ఢిల్లీ, మిర్జాపూర్‌లలో ఏ పట్టణంలో నన్ను హత్య చేయాలో ఆర్.యస్.యస్. కుట్రదారులు యింకా నిర్ణయానికి రాలేదని", యింతవరకు తనపై హత్యాప్రయత్నం జరుగక పోవడానికి అదే కారణమని అన్నాడు. ('నేషనల్ హెరాల్డ్' 31-1-1979).

శ్రీ బనార్సిదాస్ ఉత్తరప్రదేశ్ శాసన సభాపతిగా వున్నపుడు 1979 జూన్‌లో సంభాల్‌లో జరిగిన ఆర్.యస్.యస్. శిబిరానికి అధ్యక్షత వహించారు.

ఆ సందర్భంగా మాట్లాడుతూ : "మీవంటి దేశభక్తులు, సేవాతత్పరులకు కలిసే అవకాశం యీనాడు నాకు యిచ్చినందుకు యిదొక గౌరవంగా నేను భావిస్తున్నాను. గత 30 సంవత్సరాలుగా అధికారంలో వున్న కాంగ్రెసు వారు, అదే పనిగా సంఘ కార్యంగురించి ప్రజలను తప్పుత్రోవ పట్టించడానికి ప్రయత్నించి, ఆర్.యస్.యస్.ను తమ శత్రువుగా ముస్లింలచేత నమ్మించడానికి ప్రయత్నాలు జరిపారు. కాని దేశ పునర్నిర్మాణంకోసం అన్నివర్గాల ప్రజలను తనతో తీసుకొనిపోవడానికి ప్రయత్నించే సంస్థ దేశంలో సంఘం ఒక్కటేనని నాకెప్పుడో తెలిసిన విషయమే; అదే విషయం నేడు స్పష్టంచేస్తున్నాను" అన్నారు.

ప్రసంగాన్ని కొనసాగిస్తూ, "కొద్దినెలలక్రిందట సంభాల్‌లో మతకలహాలలో ఆర్.యస్.యస్. ముస్లిం–వ్యతిరేకి అనే ఆరోపణ ఎంత నిరాధారమో అసత్యమో ఆ సందర్భంగా ఋజువయింది. అధికారం పోగొట్టుకున్నవారు హిందూ–ముస్లిముల మధ్య కలతలురేపి ముస్లింలలో భయోత్పాతాన్ని సృష్టించి, ఏవిధంగా రాజకీయ ప్రయోజనాలు సాధించుకొన జూస్తారో కూడా అప్పుడు రుజువయింది" అని అన్నారు.

స్థానిక ఆర్.యస్.యస్. నాయకుడు శ్రీ అంబాదత్‌తోపాటు శాసన సభ్యులయిన శ్రీ ముఫిసుర్ రహ్మాన్‌కూడ వేదికపై ఆసీనులయివుండటం యీ సత్యానికి నిదర్శనమనికూడ శ్రీ బనార్సీదాస్ అన్నారు.

కాని యిదే బనార్సీదాస్ ముఖ్యమంత్రి అయినతర్వాత భారతీయ జనసంఘంవారు "మతోన్మాద, ఫాసిస్టు" ఆర్.యస్.యస్.లో సభ్యత్వం కలిగి వున్నారనే నెపంతో వారిని మంత్రివర్గంలో చేర్చుకొనడానికి నిరాకరించారు.

ఉత్తరప్రదేశ్ మంత్రి, రాజనారాయణ్‌కు కుడిభుజం అయిన శ్రీరామ శంకర్‌కౌశిక్ 1978 జూన్‌లో చందౌసీలో జరుగుతున్న ఆర్.యస్.యస్. శిబిరాన్ని తనంతట తానువచ్చి సందర్శించడం–ఆసక్తికలిగించిన సంఘటన. ఆ సమయంలో ప్రసంగిస్తూ "సంఘకార్యాన్ని వీలయినంత త్వరగా విస్తరింపజేసి పల్లెపల్లెలోనూ శాఖలు ఏర్పాటుచేయండి" అంటూ ఉద్బోధించారు. తరువాత యీ మంత్రి మహాశయుడే రాష్ట్రంలో ఆర్.యస్.యస్. వ్యతిరేక లాబీకి నాయకుడైనాడు !

ఈ రాజకీయవాదుల అవకాశవాదాన్ని బహిర్గతంచేస్తూ మైనారిటీల కమిషన్‌కు చెందిన ప్రొ॥ వి.వి. జాన్. "సెక్యులరిజం గురించి ఒక అవాస్తవిక కల్పనను స్వీకరించి దీనిని ఎన్నికల నినాదంగా నేడు వాడుతున్నారు. ఒకవంక మతోన్మాద పార్టీలతో ఒప్పందాలు చేసుకుంటూ, మతవర్గాలనుంచి రాజకీయ సమర్థనను కోరుతూ మరొకవంక రాష్ట్రీయ స్వయంసేవక సంఘాన్ని నిరసించడం ద్వారా సెక్యులరిస్టులుగా చెలామణి అవ్వడం సాధ్యమని భావించడం కనిపిస్తున్నది" అన్నారు.

జనతాలోనే 'ద్వంద్వ సభ్యత్వం' పేరుతో వివాదాన్ని లేవదీశారు. ఆర్.యస్.యస్. ఒక రాజకీయపార్టీ అని, కనుక మాజీ జనసంఘంవారంతా ఆర్.యస్.యస్.తో తెగతెంపులు చేసుకోవాలని, లేదా వారిని జనతానుంచి బహిష్కరించాలని వాదించారు. ఒక బాలికను వివాహంచేసుకొని ఆమె యికమీదట తన తల్లిదండ్రులను మరిచిపోవాలని ఆశించినట్లుంది.

డా॥హరేకృష్ణ మెహతాబ్ అన్నట్లు యీవాదం ఇద్దరు ముగ్గురు సంతానం కలిగినతరువాత భార్యను నీకులమేమిటని అడిగినట్లుగా వుంది.

ఆర్.యస్.యస్. "స్వతంత్రమైన సాంస్కృతిక సంస్థ" అని వివరించడానికి నాటి ప్రధాని మొరార్జీభాయి ప్రయత్నించి విఫలమైనారు. శ్రీ జగజీవన్ రామ్‌కూడ యిలా వివరించారు. "ఒక రాజకీయపార్టీయొక్క సిద్ధాంతాలను, విధానాలను అంగీకరించి, దాని కార్యక్రమాలను అమలుచేయడానికి సిద్ధపడేవారిని ఆ పార్టీలో చేర్చుకొనడం జరుగుతుంది. పార్టీ కార్యక్రమాన్ని ఆమోదిస్తూ ప్రకటనమీద సంతకంచేసిన తరువాత అట్టి సభ్యుడి గతాన్నిగురించి విచారించవలసిన అవసరంలేదు. రాజకీయాల్లో ఒక పార్టీ సభ్యత్వాన్ని ఒకవ్యక్తి ఆమోదించినమీదట ఆతడిమీద ద్వంద్వసభ్యతపు నేరాన్ని బనాయించడం నిరర్థకం. ఎవరికిమాత్రం జనతాపార్టీ తన తలుపులు ఎలా మూసివేయగలదు? ఆ ప్రశ్నకే తావులేదు".

జనతాపార్టీ ఆదర్శాలలో సంఘ స్వయంసేవకులకు నమ్మకంలేదనే ఆరోపణలో తనకు ఆధారాలేమీ కనిపించలేదనికూడా శ్రీ జగజీవన్‌రామ్ అన్నారు". "నాకు అలాంటి అనుభవం కలుగలేదు" అని ఆయన చెప్పారు.

ఆర్.యస్.యస్.-జనసంఘ్‌లవారు ఫాసిస్టులుగాని మతోన్మాదులుగాని కారని శ్రీ సికిందర్ భక్త్ అంటూ "ఆర్.యస్.యస్. ఏ వ్యక్తిని స్పృశించినా అతని హృదయంలో దేశభక్తి రగిలేటట్లు ఎలా చేయగలుగుతున్నదో చూస్తే నాకు ఆశ్చర్యం కలుగుతున్నది" అన్నారు. ఎమర్జెన్సీలో అందరికంటె వారే ఎక్కువగా బాధలు అనుభవించారని ఆయన చెప్పారు.

1979 ఏప్రిల్‌లో ఆర్.యస్.యస్.పై మహారాష్ట్ర అసెంబ్లీలో జరిగిన సుదీర్ఘమైన చర్చలో పాల్గొంటూ ఆర్.యస్.యస్.పై నిషేధాన్ని కోరుతూ ప్రతి పక్షనాయకుడు శ్రీ మెహితే "ఆర్.యస్.యస్.కు సంబంధించినంతవరకు వారి నిష్కళంకస్వభావం మాత్రం అనుమానించదానికి వీలులేదని నాకు తెలుసు"అని ఒప్పుకున్నారు. పూర్వం సోషలిస్టుపార్టీలోవున్న శ్రీగులాబ్‌రావుపాటిల్ మాట్లాడుతూ తాను 19 సంవత్సరాలపాటు ఆర్.యస్.యస్ శాఖ దగ్గర నివసించానని "వారివలె అలాంటి అఖిలభారతీయసంస్థను నిర్మించడంలో మనం కృతకృత్యులం కాలేకపోయినపుడు సంఘాన్ని తప్పుపట్టి ప్రయోజనంలేదు"అని అన్నారు.

"సంఘం రహస్యకార్యకలాపాలు సాగిస్తున్నదని ఆరోపించబడింది కనుక, బహిరంగస్థలాల్లో వారు డ్రిల్లుచేయడాన్ని నిషేధించాలని శ్రీ మెహితేకోరుతూ-వారిని అజ్ఞాతానికి నెట్టగోరడం విడ్డూరంగావుంది" అని కూడా శ్రీ పాటిల్ అన్నారు.

గురుదక్షిణద్వారా నిధులు సమకూర్చుకుంటున్నందుకు సంఘాన్ని అభినందించాలి. "మీకు ఎన్నికలనిధులు కావలసివచ్చినపుడల్లా మాతాజీ కృపకోసం చూడాలి" అంటూ కాంగ్రెసువారిని ఆయన ఎత్తిపొడిచారు.

1952లో మహారాష్ట్రలో కరువు ఏర్పడినప్పుడు ఆర్.యస్.యస్.వారు చౌకగాఆహారపొట్లాలు అందజేశారు. బాధితులైన గ్రామీణులంతా సహజంగానే అందుకు హర్షించారు" "30 సంవత్సరాలుగా మీరు విందులుగుడుస్తూ, సంఘసేవ అంటూ జపించారు. మీ చేతుల్లో అధికారంవుంది. యువకకాంగ్రెసుదళ్, రాష్ట్ర సేవాదళ్ అప్పుడు ఎక్కడున్నాయి ? గొడ్డుమోతుఆడది పిల్లలతల్లిపై అట్టవర్షం కురిపించినట్లుంది" అన్నారు.

ఆదాయపు పన్ను కేసులో ఆర్.యస్.యస్. ఒక అఫిడవిట్ దాఖలుచేస్తూ తన కార్యకలాపాలు "రాజకీయాలనుపోలి" వుంటాయని ప్రకటించిందని ఆర్.యస్.యస్. వ్యతిరేకులు సరికొత్తవివాదం లేవనెత్తారు. ఈ ఆరోపణద్వారా రెండు నేరాలు మోపదలిచారు: తాను రాజకీయసంస్థనని ఆర్.యస్.యస్.ఒప్పుకున్నదని, ఆదాయపుపన్ను ఎగవేతకు అది ప్రయత్నిస్తున్నదని.

కాని యీ వ్యవహారంలోని వాస్తవాలు పూర్తిగా విభిన్నమైనవి. ఆ అఫిడవిట్‌ను ఆదాయపుపన్ను విచారణసంఘం ఎదుట దాఖలుచేయడం జరగలేదు. ఆర్.యస్.యస్. కార్యకలాపాలు మతపరమైనవిగాని, రాజకీయమైనవిగాని కాదని అంతకుముందే ఆదాయపుపన్నుల కమిషనరు ప్రకటించారు. "డాక్యుమెంట్లు, నోటిమాటలరూపేణ నమోదయిన సాక్ష్యాధారాలనుబట్టి ఆర్.యస్.యస్ దేశసేవాసక్తిగలిగివున్నదని యిది మతసంస్థగాని, ధర్మసంస్థగాని కాదని తెలుస్తున్నది. ఆర్.యస్.యస్. సంస్థయొక్క లక్ష్యాలు మతసంస్థల లేదా ధర్మసంస్థల లక్ష్యాలవలెకాక "రాజకీయలక్ష్యాలను పోలివున్నాయి" అని 1974 మే 22 న నాగపూర్ డిప్యూటీ ఛారిటీ కమిషనర్‌కూడ అభిప్రాయపడ్డారు.

ఏమయినా పై అభిప్రాయాన్ని జాయింట్ ఛారిటీకమిషనర్ నిరాకరించారు. ఆర్.యస్.యస్. నాగపూర్ జిల్లాజడ్జికి అప్పీలుచేసింది. "ఆర్. యస్. యస్. కార్యకలాపాలు మతపరమైన లేదా ధర్మసంస్థల కార్యకలాపాలవంటివి కావు. మతసంస్థల, ధర్మసంస్థల లక్ష్యాలకు విభిన్నంగా దీనిలక్ష్యాలు సాంస్కృతికమై, దేశసేవాతత్పరత కలిగినట్టివి. ఆర్.యస్.యస్. ప్రస్తుతానికి రాజకీయపక్షం కానప్పటికీ, లక్ష్యాలు రాజకీయఉద్దేశాలను పోలినట్టివి" అని ఆర్.యస్.యస్. పేర్కొన్నది. యీ కోర్టులో దాఖలుచేసిన అఫిడవిట్‌లోనే లోకమాన్య తిలక్ గొప్పరాజకీయవ్యక్తిగనుక పూనాలో వారు స్థాపించిన 'కేసరి' పత్రిక లక్ష్యాలు రాజకీయాలను పోలివున్నట్లు పేర్కొనబడిన విషయాన్ని యీ సందర్భంగా ఉదహరించింది. ఆర్.యస్.యస్. విషయంలో, దాని స్థాపకుడయిన డా॥ హెడ్గెవార్‌కూడ ప్రముఖ రాజకీయనాయకుడుగా వుండేవారు.

ధర్మసంస్థలు, దేశసేవాసంస్థల ఆశయాలమధ్య విభేదాన్ని విశ్లేషిస్తూ "ధర్మసంస్థలకు యిచ్చేకానుకల విషయంలోనయితే. అలాంటి కానుకలు యిష్ట

సిరే ప్రయోజనం పొందలేనివారికి ప్రయోజనం కలుగచేయాలనే కోరికే దాతలకు వుంటుంది. అదేవారి ముఖ్యమైనఉద్దేశం. సేవ ఏదేశంవాడికో ఆదేశ్రేయస్సుకు చేయూతయివ్వడం-యిదే దేశభక్తి ఆశయంగావున్న సందర్భంలో - కానుకలివ్వడంలోని ముఖ్యమైన ఉద్దేశం. ఈ రెండు ఉద్దేశాలు విభిన్నమైనవి" అంటూ డిల్లీ కేసులో (1923) లార్డ్ హాల్డేన్ అన్నమాటలనుకూడ యీ అఫిడవిట్ లో ఉదహరించడం జరిగింది.

ఆర్.యస్.యస్. దేశసేవాతత్పరతవున్న సంస్థేతప్ప ధర్మసంస్థకాదు. రాజకీయ కారణాలకోసం ఆర్.యస్.యస్.ను 'రాజకీయం'గా ముద్రిస్తూ వచ్చిన వారే న్యాయసంబంధమైన గొడవలవల్ల దానిని "రాజకీయాలను పోలినది"గా పేర్కొంటే అందుకు ఒప్పుకొనకపోవడం విచిత్రంగావుంది. కారణం చాలా చిన్నది. వీరంతా సత్యాన్ని అన్వేషిస్తున్నవారుకాదు: ప్రభుత్వాన్ని పడగొట్టడమే పనిగాపెట్టుకున్నవారు. జనతా సోషలిస్టు యం.పి. శ్రీ సమర్ గుహ అన్నట్లు యీవిషయంలో ఆర్.యస్.యస్. శిఖండిమాత్రమే; అసలుగురిచూసినది జనతాప్రభుత్వాన్ని. జనతాప్రభుత్వాన్ని పడద్రోయడంలో వారు కృతకృత్యులైనారుకూడ.

ఈ వ్యవహారమంతటివెనుక విదేశీహస్తం వుండటం యిందులో విచారకరమైన అంశం. ఏ దేశంలోనయినా బలమైన జాతీయోద్యమం పెల్లుబికితే, యితర దేశాలను తమ ప్రభావంలోకి తెచ్చుకొనజూచే ఏ అగ్రరాజ్యమూ చూస్తూ పూరుకోదు. అందుకే అమెరికాకుగాని, సోవియట్ యూనియన్‌కుగాని ఆర్. యస్. యస్. పట్ల ఏవగింపు! అయితే సంఘాన్ని నాశనంచేయాలని అమెరికా ఎన్నడూ ప్రయత్నించలేదు. సోవియట్ యూనియన్ మాత్రం దశాబ్దంపైగా ఆర్.యస్. యస్. మీద దాడిచేయడం ఒకపనిగా పెట్టుకుంది. దీనితో ఒకేదెబ్బకు నాలుగు పిట్టలను కొట్టినట్లవుతుందని వారి ఆశ - సి.పి.ఐ.కి సహాయం చేసినట్లవుతుంది; భారతదేశంలోని మతోన్మాద ముస్లిములకు సంతోషం కలుగుతుంది; భారత్‌లో ఆర్.యస్.యస్.కు వ్యతిరేకమైన అధికారపక్షపు కోరిక తీర్చినట్లవుతుంది; పోతే తమదేశంలోని ముస్లిములను, అరబ్బుదేశాలవారిని వారి తరపున విదేశాల్లో జీహాదులు (మతయుద్ధాలు) నడిపిస్తున్నామని మురిపించవచ్చు.

1966 నవంబరులోనే, సుభద్రాజోషి, కె.డి. మాలవీయలవంటి మాస్కో భక్తులు ఢిల్లీలో ఒక సదస్సు నిర్వహించారు. ప్రధాని శ్రీమతి గాంధి, నాటి దేశీయాంగమంత్రి శ్రీ వై.బి. చవాన్‌లు వెళ్లి ప్రసంగాలు చేశారు. ఆర్.యస్.యస్.ను ఒక రాజకీయపక్షంగా ప్రకటించాలని యీ మతోన్మాదులు - కమ్యూనిష్టుల సంయుక్తమహాసభ తీర్మానించింది. "చట్టంద్వారా ఒక వ్యక్తి సెక్సు మార్చినట్లువుంది" అని ఆసమయంలో ఒకరు వారిని హేళనచేశారు.

శ్రీ చవాన్ తన ప్రత్యేకమాటల గారడీతో సరిగా అంతపనిచేయబో యారు. 1968 జులై 31న రాజ్యసభలో ఒక కమ్యూనిస్టు సభ్యుని ప్రశ్నకు సమాధానమిస్తూ "వారిని రాజకీయ పార్టీగా పరిగణించడంలేదని చెప్తున్నాను. కాని వారికి తప్పకుండా ఒక రాజకీయ సిద్ధాంతం, రాజకీయ దృక్పథం వున్నాయి. కనుక ఆర్.యస్.యస్. కార్యకలాపాల్లో పాల్గొనడం ఒక రాజకీయ సంస్థలో పాల్గొనడమే అవుతుంది" అన్నారు- శ్రీ చవాన్.

మాస్కోకు చెందిన "రేడియో పీస్ అండ్ ప్రోగ్రెస్" గతంలో గాంధీజీని, సుభాష్‌చంద్రబోస్‌ను నిందించిన విధంగానే యిప్పుడుఆర్.యస్.యస్.ను కూడా ఫాసిస్టుఅని, సామ్రాజ్యవాదుల ఏజెంటుఅని దాడిచేయడం మొదలు పెట్టింది. "15,000 మంది ఆర్.యస్.యస్. గూండాలతో స్త్రీలను అవమానించి ఆస్తులు లూటీచేస్తానని బెదిరించాడు" అని ప్రకటించింది. జె.పి. ఉద్యమం వృద్ధి చెందుతున్నకొద్దీ ఆర్.యస్.యస్.పై సోవియట్ యూనియన్ ఎక్కువమార్లు, ఎక్కువ తీవ్రతతో దాడులు జరిపింది. ఎమర్జన్సీ విధించబడినప్పుడు మాస్కో ఆనందంగా ప్రకటించింది ఆర్.యస్.యస్. మీద నిషేధాన్ని ఎన్నటి తొలగించ డం జరగదు" అని సమాచారమంత్రి శుక్లా భారతదేశంలోని మాస్కో భక్తులకు హామీయిచ్చాడు.

ఎమర్జెన్సీ తరువాత విదేశాంగ మంత్రి వాజపేయి తలపెట్టిన చైనాపర్య టనకు విఘాతం కలిగించాలని వారు ప్రయత్నించారు. బంగ్లాదేశ్ పాకిస్తాన్‌లు రెండింటితోను మన సంబంధాలు మెరుగుపడినప్పటికి యిక్కడి మాస్కో భక్తులు మాత్రం "ఆర్.యస్.యస్. పునసుజ్జీవనంవల్ల రెండు ముస్లిం రాజ్యాలతో సాధారణ సంబంధాల పునరుద్ధరణ కృషికి ఆటంకం ఏర్పడింది" అనడం మొదలుపెట్టారు,

మాస్కో ఎత్తుగడ గ్రహించడం ఏమంత కష్టంకాదు. తన ఏజెంట్లచేతగాని అనుకూల పత్రికల చేతనో ఆర్.యస్.యస్. పై దాడులు చేయిస్తుంది-ఆ తరువాత వీటిని భారతీయ పత్రికల అభిప్రాయానికి, భారత ప్రజల అభిప్రాయానికి మచ్చుతునకలుగా పేర్కొంటూ తన రేడియో ద్వారా ప్రసారంచేస్తుంది!

బిజూపట్నాయక్‌ను సాకుగా ఉపయోగించుకుని "ఆర్.యస్.యస్. సైనిక సంస్థగా, పచ్చి హిందూమతోన్మాది సంస్థగా" ప్రకటిస్తూ రష్యా వార్తాసంస్థ "టాస్" తన పరిమితులను అతిక్రమించింది, "ఆర్.యస్.యస్. విద్రోహ చర్యలు" అనే శీర్షిక క్రింద 1975 ఫిబ్రవరి 9 నాటి ప్రచురణలో అలీఘర్, బెనారస్ కాన్పూరులలో జరిగిన సంఘర్షణలకు ఆర్.యస్.యస్. ను నిందిస్తూ "ఫలితంగా వందలాది ప్రజలు కోల్పోవడమో. గాయపడటమో, జరిగింది, అనేక యిళ్లు, కార్యాలయాలు దహనకాండలో నాశనమయినై" అని పేర్కొన్నది టాస్.

ఆర్.యస్.యస్. నాయకులు శ్రీబాపూరావ్ దేవరస్ సోవియట్ నిందా ప్రచారాన్ని ప్రస్తావిస్తూ "నిస్వార్థ సామాజిక కార్యకర్తల జాతీయ శక్తిని నిర్మాణం చేసే పనికి అఘాతం కలిగిస్తూ యింతవరకు దేశంలో మాత్రమే పరిమితమై వున్న ఆర్.యస్.యస్. వ్యతిరేక కుట్ర-యిపుడుఅంతర్జాతీయస్థాయిలో జరుగుతున్నది అని ఉజ్జయినిలో అన్నారు.

వారి మాటలు నిజమేనని తదుపరి సంఘటనల వరస స్పష్టమయింది.

సంజయ్, సోవియట్ రష్యా, యిద్దరూ తమతమ కారణాలవల్ల జనతా ప్రభుత్వాన్ని తొలగించాలని ఆర్.యస్.యస్. పై అన్నివైపులనుంచి దాడి జరిపితే తప్ప అది తొలగిపోదని నిర్ణయించారు.' మొరార్జీ ప్రభుత్వపు తుదిరోజులు' అనే గ్రంథంలో బరున్ సేన్‌గుప్తా యీ విషయాన్ని ఎంతో స్పష్టంగా వివరించారు. "జనసంఘ్-ఆర్.యస్.యస్. మీద జనతాలో మీరు కలవరం రేపితే, మీతో సోషలిస్టులు, సంస్థాకాంగ్రెసువారు భారీ సంఖ్యలో చేరతారు" అని రాజ్ నారాయణ్‌తో సంజయ్ అన్నాడు. మరొక సందర్భంలో ఎప్పుడూ మొరార్జీ మీద మాత్రమే దాడిచేయవద్దని, మొరార్జీ, జనసంఘ్ యిద్దరి మీద ఒకేమారు దాడి చేయాలని" లేకుంటే మొరార్జీని దించడం అసాధ్య మవుతుంది" అని కూడా ఆతడు రాజ్‌నారాయణ్‌కు చెప్పాడు.

రష్యన్ల పద్ధతి కూడా సరిగా అలాగే సాగింది. అమెరికా సోవియట్ రష్యాలు రెండింటికీ సమానదూరంలో భారత ప్రధానిని కొనసాగనివ్వడం. మాస్కోకు నచ్చలేదు. పైగా భారత విదేశాంగమంత్రి ఆర్.యస్.యస్., జన సంఘాల పూర్వరంగంతో గొప్ప జాతీయవాది అయివుండటం వారికసలే రుచించ లేదు. అందుకే 1977 ఎన్నికల తరువాత మాస్కోవాది లిమయే ఆర్.యస్.యస్ పోవడమో, జనతావిచ్ఛిన్నంకావడమో జరగాలని ప్రకటించాడు.

సేన్ గుప్త యిలావ్రాశారు. "మధులిమయే వాదంకూడ సంజయ్‌పక్కి లోనే వుంది: ఆర్.యస్.యస్ జనసంఘ్‌లమీద దాడి జరిపి, వారిని ఏకాకులను చేస్తే తరువాత మొరార్జీచేత రాజీనామా చేయించడం చాల సులభమవుతుంది. దీనితో సంతృప్తిపడిన రాజ్‌నారాయణ్ తాను ఇక ఆర్.యస్.యస్ - జనసంఘ్ వర్గంమీద దాడుల కేంద్రీకరిస్తానని సంజయ్‌కు తడుముకోకుండా మాటయిచ్చాడు. (పేజి 83). ఆర్.యస్.యస్ మతోన్మాద ఫాసిస్టుసంస్థ అయివుండటమేగాక, నేపాల్‌నుంచి కొన్ని కోట్ల రూపాయలు స్వాహాచేసినట్లు, చైనానుంచి ఆయుధాలు పొందుతున్నట్లుకూడా రాజ్‌నారాయణ్ కనిపెట్టాడు. ఇవన్నీ పచ్చి అబద్ధాలని తెలిసికూడా "భావప్రకటనాస్వేచ్ఛ" పేరుతో భారతీయ పత్రికలు పాఠక ప్రజల వినోదంకోసం యథాతథంగా ప్రచురించినై. పత్రికలకు వినోదం కలిగించిన విషయాలే జనతాకు మరణంకలిగించినాయి.

"ఆంతరంగిక, విదేశీయ కారణాలు రెండింటివల్ల" సంక్షోభం ఏర్పడిందని సేన్‌గుప్తతో మాట్లాడుతూ భూపేష్‌గుప్త స్పష్టంగా అంగీకరించాడు. కనుకనే 17వ భారత రాజకీయరంగంలోని రష్యా అనుకూల శక్తులన్నింటికీ లిమయే అధ్యక్షతవహించి జనతాను కూలద్రోసే మహాకార్యానికి నడుంకట్టాడు. కాని జనతాలోని అమాయకులు ఈ ఎత్తుగడల అంతరార్థాన్ని అర్థంచేసుకోలేదు.

"రామమూర్తి, సుర్జీత్ (మార్క్సిస్టులు) జనతాప్రభుత్వం కూల్చివేతకు మధులిమయేతో చేతులుకలిపేవరకు ఎందుకువెళ్లారనేది ఒక రహస్యం. యీ యిద్దరు మార్క్సిస్టు నాయకులలో ఎవరూ మూర్ఖులుకాదు పైగా యిద్దరూ రాజకీయాలలో రాటుదేలినవారు; మేధాసంపన్నులుగా పరిగణింపబడుతున్నవారు మార్క్సిస్టు పార్లమెంటు సభ్యులలో చాలమంది మొరార్జీ ప్రభుత్వాన్ని పడగొట్ట

డానికి గట్టి పై ముఖ్యం చూపుతున్న విషయం తెలిసినదే. లోక్‌సభలోని మార్క్సిస్టు సభ్యులలో అతి ముఖ్యులలో ఒకడయిన జ్యోతిర్మయిబోసు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులలో దాదాపుగా అందరివద్దకుపోయి జనతా ప్రభుత్వం పతనమైతే దానివల్ల కలుగనున్న విషపరిణామాలగురించి హెచ్చరించాడు... మార్క్సిస్టులతో మొరార్జీ సంబంధాలు అద్భుతంగా వున్నాయి. వారి ప్రభుత్వాలకు ఆయన ఎన్నడూ యిబ్బంది కలిగించలేదు. జ్యోతిర్మయిబోసు సలహామీద టి.ఎన్. సింగ్‌ను పశ్చిమ బెంగాలు గవర్నరుగా నియమించడానికి కూడ ఆయన అంగీకరించారు. మరి మార్క్సిస్టుల పొలిట్ బ్యూరో ఆయనను అమర్యాదకరంగా దించివేయాలని ఎందుకు నిర్ణయించింది? ఈ ప్రశ్నకుకూడా తర్కబద్ధమైన సమాధానం లభించడంలేదు" అని బరున్ సేన్ గుప్త ఆశ్చర్యం వెల్లడించారు.

ఇది తర్కానికి అతీతంగానే కనిపిస్తున్నదికాని, రష్యన్ తర్కానికి మాత్రం అతీతమైదికాదు. జనతా ప్రభుత్వం చైనాతో సాధారణ సంబంధాలను పునరుద్ధరించడానికి ప్రయత్నిస్తున్నందుకు, కంపూచియాలో ఏర్పడిన క్రొత్త కీలుబొమ్మ ప్రభుత్వానికి గుర్తింపు యివ్వనందుకు, ఈజిప్ట్-ఇజ్రాయెల్ శాంతి ఒప్పందాన్ని నిరసించనందుకు ఆ ప్రభుత్వాన్ని శిక్షించితీరాలని రష్యన్లు దృఢ సంకల్పంతో ఉన్నారు. భారతదేశంలోని కమ్యూనిస్టులగతి ఏమవుతుంది అనే విషయంకంటే, తమ విదేశాంగ విధానపు లక్ష్యాలు సాధించడమే వారికి అత్యంత ముఖ్యం. "మార్క్సిస్టులకు సంబంధించినంతవరకు వారుచాల కాలం మధులిమయే, బహుగుణ, బిజు పట్నాయక్‌లతో చర్చలుజరిపారు. చాలమార్లు రామమూర్తి, సుర్జీత్‌లు యిద్దరూ బిజూపట్నాయక్ యింట్లో కనిపించారు" అని బరున్‌సేన్ గుప్తతో కాంగ్రెసు యం.పి. సౌగత్ రాయ్ చెప్పాడు. ఈ యిద్దరు మార్క్సిస్టు నాయకులు తమ పొలిట్ బ్యూరోతోకంటె, జ్యోతిబసు, జ్యోతిర్మయి బోసుల వంటి తమ పార్లమెంటరీ సహచరులతో కంటె మాస్కోతోనే మరింత సన్నిహితంగా వుండేవారని స్పష్టమవుతున్నది.

లోక్‌దళ్ వారు ఇందిరకు వ్యతిరేకంగా, సోవియట్-అనుకూల వైఖరి అవలంబిస్తున్నారేమిటని రాజ్‌నారాయణ్‌ను సంజయ్ గద్దించగా, దానికంతటికి కమ్యూనిస్టేతర పక్షాలలో సోవియట్ నిలిపిన త్రిమూర్తులు బహుగుణ, మధు లిమయే, చంద్రజిత్ యాదవ్‌లే-కారణమని వారిమీదే రాజ్‌నారాయణ్ పూర్తి

నింద మోపాడు. "ఈ రష్యా అనుకూలుర మాటలకే చౌదరి సాహెబ్ ఎక్కువ విలువ యిస్తుంటే నేనేమి చేయగలను?" అని సంజయ్‌ముందు వాపోయాడు.

1979 జులై 15నాటి 'సోవియట్ భూమి' సంచికలో ప్రధాని మొరార్జీ వర్ణచిత్రం ఒకటి వేయవలసివుంది. కాని అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించిన జులై 9వ తేదీన మొరార్జీచిత్రానికి బదులు కంపూచియా సహకార క్షేత్రపు చిత్రమొకటి ప్రచురించవలసిందిగా ఆజ్ఞలు పంపారు? ఇక్కడి పార్లమెంటు నాయకుడుగాని, ప్రతిపక్షనాయకుడుగాని సోవియట్ల దుర్మార్గం పసిగట్టలేని తరుణంలో, సోవియట్ వారికి మాత్రం ఈ ప్రభుత్వం కూలిపోనున్నదని స్పష్టంగా తెలుసన్నమాట!

భారతదేశపు ఎన్నికలలో కోట్లాది రూపాయల విదేశీధనం వచ్చిపడింది. ప్రపంచపు బ్లాకుమార్కెట్‌లో సాధారణంగా కొంత తగ్గింపుధరకు అమ్ముడు పోయే రూపాయి యిప్పుడు హెచ్చుధరకు అమ్ముడుపోవడం మొదలయింది. జనవరి 4 నాటికి డాలరుకు అధికారికంగా రు.7-97లు ధరవుండగా అనధికారికంగా రు. 8.20లకు ధర పెరిగిందని 1980 ఫిబ్రవరి 11న 'స్టేట్స్‌మన్' వెల్లడించింది. "నగదు వాణిజ్యంపై నివేదికలు రూపొందించేవారు బ్లాకుమార్కెటులో భారతీయ కరెన్సీకి అకస్మాత్తుగా విలువపెరగడానికి కారణం రూపాయికివున్న అంతర్గత సామర్థ్యంకాదని, కొందరు అజ్ఞాత కొనుగోలుదారులు-వీరిలో విదేశీ ప్రభుత్వాలుకూడా వున్నట్లు నమ్మబడుతున్నది-భారతదేశంలోని తమ సైద్ధాంతిక మిత్రపక్షాలకు, స్నేహితులకు ఎన్నికల కోసం నిధులకు తరలించాలని గట్టి ప్రయత్నాలు చేస్తూవుండటమే ప్రధాన కారణమని చెప్తున్నారు." ఎన్నికల తరువాత ఫిబ్రవరి మొదటి వారంలో డాలరుకు మళ్ళీ రు. 8లు విలువ వచ్చింది.

కాని ఎన్నికల ఫలితాలు మాత్రం రష్యాకు ఆనందం కలిగించినట్లు చెప్పలేము. తానొకటి తలిస్తే వేరొకటి జరుగునుకదా!

తమ కీలుబొమ్మగా నడిపించడానికి వీలయే విధంగా-రష్యా అనుకూల లోక్‌దళ్ ప్రభుత్వమో, బలహీన మిశ్రమ ప్రభుత్వమో ఏర్పడుతుందని రష్యా వారు కట్టిన గాలిమేడలు కూలిపోయినాయి.

జనతా కూడ అంతకంటె తక్కువ దెబ్బతినలేదు. "ద్వంద్వ సభ్యత్వపు" పెనుకీటం దాన్ని కాటువేసింది.

సంఘంలో ఒక పదవిలోవున్న ఏ వ్యక్తి అయినా ఏ రాజకీయపక్షంలోను పదవి స్వీకరించకూడదని అదేవిధంగా రాజకీయ పదవుల్లో వున్నవారు సంఘంలో పదవులకు అనర్హులని ఆర్.యస్.యస్. నిబంధనావళిలో చేర్చబడింది. అయితే "పదవుల్లో వున్నవారు" అనే పదానికి విస్తృతమైన నిర్వచనాన్నియిచ్చి, పార్లమెంటు సభ్యులను, శాసన సభ్యులను అందులో చేర్చాలని జనతా పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆర్.యస్.యస్.కు విజ్ఞప్తి చేశారు. ఎమర్జెన్సీనాటి మిత్రులు, రాజకీయ విషాదపు పరిస్థితుల్లో చిక్కుకున్నారని...వారికి సాయం యివ్వడానికి ఆర్.యస్.యస్. ప్రధాన కార్యదర్శి ప్రొ॥ రాజేంద్రసింహ సిద్ధపడ్డారు, మార్చి 1980లో జరగనున్న ఆర్.యస్.యస్. ప్రతినిధిసభ సమావేశంలో ఆ విషయాన్ని పరిశీలనకు సమర్పించడానికి ఆయన అంగీకరించారు. జనతాలో పదవుల్లో వున్నవారు, శాసన సభ్యులు ఆర్.యస్.యస్. నిత్య కార్యక్రమాలలో పాల్గొనకుండా ఆర్.యస్.యస్. నిషేధించాలని కూడా చంద్రశేఖర్ కోరారు. ఆర్.యస్.యస్. ఇది చేయాలి, అదిచేయాలి అంటూ జనతా కోరడం విడ్డూరం. అయినా వెనుకటి స్నేహాన్ని దృష్టిలో వుంచుకొని రజ్జూభయ్యా దీనిని కూడ ప్రతినిధిసభముందు వుంచడానికి అంగీకరించారు. అది 1979 జులై 14

అయినా యీ ద్వంద్వ-సభ్యత్వం సమస్యను లేవదీసిన వారికి సమస్యలను పరిష్కరించే ఆసక్తి అసలె లేదు. ఎప్పటికప్పుడు సరిక్రొత్త సమస్యలను సృష్టించడంలోనే వీరి ఆసక్తి వుంది. జనతా ప్రభుత్వాన్ని పడగొట్టిన వీరు యిక జనతా పార్టీనికూడ విచ్ఛిన్నంచేసిగాని నిద్రపోదల్చుకోలేదు ఈ ఘనకార్యంలో బంట్లుగా ఉపయోగపడేందుకు ఉవ్విళ్ళూరుతున్నవారికి కొదువలేదు జనసంఘంవర్గం వారికి 1977లో కంటె 1980లో ఎన్నికల మరింతతక్కువగా జనతా టిక్కెట్లు యిచ్చారు. నిజానికి బి. యల్. డి. నిష్క్రమణవల్ల వీరివంతు పెంచివుండవలసింది వీటన్నిటికిమించి ఆర్.యస్.యస్‌ను నిందించడమే వృత్తిగాపెట్టుకున్న కృష్ణకాంత్ వాంటివారు ఆర్.యస్.యస్ కార్యకర్తల సంగతి చెప్పేదేముందివాళ్ళ తాతలుకూడా నాకోసం పనిచేయాల్సిందే చేయకతప్పదు - లేకపోతే జనతా విచ్ఛిన్నంకాక తప్పదు అనడం వినవచ్చింది.

జనతా అంతఃకలహాలు వల్ల ప్రజలకు అసహ్యంవేసింది. కాంగ్రెసు—ఐ దుష్ప్రచారంనుంచి జనతా ఆత్మరక్షణకు పూనుకొనవలసివచ్చింది. ఆర్.యస్. యస్.పై జనతానాయకుల దాడులు జనతా కార్యకర్తలకు అయోమయం కలిగించినై. ఇకపోతే ఏకసభ్య ఎన్నికల సంఘ యొక్క ఆవకతవక విధానం మిగతా పని పూర్తి చేసింది. మరి జనతా ఓడిందంటే ఆశ్చర్యమేముంది? ఎటొచ్చి మరీ అంత ఘోరంగా ఓడిపోతుందని మాత్రం ఎవరూ ఊహించలేదు.

కనీసం యీ పరాజయంతోనయినా జనతానాయకుల్లో పరివర్తనవచ్చి, విభేదాలు ఏమయినావుంటే విస్మరించి పార్టీ పునర్నిర్మాణానికి సమైక్యంగా కృషి చేసివుండవలసింది. కాని తమ ఘోర పరాజయానికి ఆర్.యస్.యస్.ను నిందించడానికి వారు పూనుకున్నారు. ఆర్.యస్.యస్. తమకోసం పనిచేయలేదు కనుకనే జనతా ఓడిపోయిందని జగజీవన్‌రామ్ అన్నారు. కాంగ్రెస్—ఐ విజయానికి ఆర్.యస్.యస్. వారు పనిచేశారని ఆరోపించడానికి కూడా ఆయన సిద్ధపడ్డారు. ఇదొక విచిత్రమైన పరిస్థితి; సంఘ స్వయంసేవకులు జనతాకోసం పనిచేస్తే దానిమీద ప్రాబల్యం చెలాయిస్తున్నారని అంటున్నారు. పనిచేయకపోతే దానిని వెన్నుపోటు పొడుస్తున్నారని ఆరోపిస్తున్నారు.

ఈ పరిస్థితినంతటినీ శ్రీ బాలాసాహెబ్ ప్రశాంతంగా పరిశీలించారు. "ప్రజలు కేంద్రంలో సుస్థిరమైన, పటిష్ఠమైన ప్రభుత్వంకోసం ఓటు చేశారని స్పష్టమవుతున్నది" అన్నారు.

జనతా నాయకులు ఆర్.యస్.యస్.ను బలిపశువుగా చేస్తున్న విషయాన్ని వారి దృష్టికి తీసుకొనిరాగా "విజయానికి ఎందరో తండ్రులు వుంటారు: కాని అపజయం అనాథ" అని ఋషిలా వారు వ్యాఖ్యానించారు.

1977లో దేశంలో అసాధారణమైన ఏమర్జెన్సీ పరిస్థితి నెలకొనివున్న ఒకే ఒక సందర్భాన్ని మినహాయించి, ఆర్.యస్.యస్. ఒక సంస్థగా ఎన్నడూ ఎన్నికలలో పాల్గొనలేదని వారు స్పష్టం చేశారు. అయితే స్వయంసేవకులు వ్యక్తిగత హోదాలో తమకు నచ్చిన అభ్యర్థులకు, తమకు నచ్చిన ఉద్యమాలకు ఎప్పుడూ మద్దతుయిచ్చే స్వేచ్ఛ కలిగివున్నారు.

ఆర్.యస్.యస్. శక్తులు మరుకుగా పాల్గొనకపోవడమే లోక్‌సభ ఎన్నికలలో జనతాపార్టీ చిత్తుగా ఓడిపోవడానికి ప్రధాన కారణంగా చెప్పబడుతున్నది" అని లండన్‌నుంచి వెలువడే "టైమ్స్" పత్రికతో చాలమంది ఏకీభవించారు. మరికొందరు మాత్రం ఆర్.యస్.యస్. మద్దతువున్నా జనతా ఓడిపోయిందంటే ఆర్.యస్.యస్. వట్టి "కాగితం పులి" అని తేలిపోయిందని భావించారు.

గతాన్ని గుర్తుకు తెస్తూ శ్రీ బాలాసాహెబ్, ఎమర్జెన్సీ విధించి ఆర్.యస్.యస్.ను నిషేధించినప్పుడు ఎట్టి ప్రతిస్పందనగాని, ప్రతిఘటనకాని లేకపోగా అప్పుడుకూడా ఆర్.యస్.యస్.ను "కాగితం పులి"గా అభివర్ణించారని, "అయితే ఆమాట అన్నవారే తమ అభిప్రాయాన్ని పూర్తిగా మార్చివేసుకొనడానికి ఎంతో కాలం పట్టలేదు" అని అన్నారు.

తాను ఏదో ఒక పులినని ఆర్. యస్. యస్. ఎన్నడూ చెప్పుకోలేదు. ఆర్.యస్.యస్.కు ప్రతీకగా ఏదయినా జంతువును సూచించవలసివస్తే గోవును సూచించాలి. అదెంతో నెమ్మదిగా వుంటుంది. మరీ ఎక్కువైన నెమ్మదితనం, కాని దానికి వాడి కొమ్ముల జత దానికివుంది. తననుబాధించేవారికోసం.

అసలు సంగతి ఏమంటే ఆర్.యస్.యస్. కార్యకర్తలలో ఎన్నికలపట్ల ఆసక్తివున్నవారుమాత్రం జనతా అభ్యర్థులకోసం కృషిచేశారు – వారితో తమకు ప్రత్యేకించి ఎమర్జెన్సీలో ఏర్పడిన అనుబంధం కారణంగా. కాని వారిలో చాలమందిని జనతా 30 నెలల ఎడతెగని దురుసుతనంతో దూరంచేసుకున్నది. చాలమంది జనతా నాయకులు సంఘ స్వయంసేవక్ అంటే గొడుగుగా భావిస్తున్నట్లు కనిపించారు. ఎండలో, వానలో గొడుగును ఉపయోగించి, ఆ తరువాత దానిని ముడిచి ఏదో మారుమూలపడేసి దుమ్ముకొట్టుకోనిస్తారు. ఈ రకమైన నిర్లక్ష్యాన్ని ఏ రాజకీయ కార్యకర్తా సమ్మతించడు. వారిలో పలువురు అన్యమనస్కంగా పనిచేయడమో, అసలే పనిచేయకపోవడమో జరిగిందంటే ఆశ్చర్యపడవలసినదేమున్నది ?

ఆర్.యస్.యస్.ఎప్పుడూ రాజకీయపక్షాలకు విభిన్నంగానే వ్యవహరిస్తూ వచ్చింది. రానున్న ఎన్నికలమీదకాక, రానున్న తరాలమీదనే దాని దృష్టి వున్నది. అధికార రాజకీయాలలోకాక భారతదేశపు సమైక్యత, సమగ్రతలతో

దానిని శక్తివంతం, సుసంపన్నం చేయడంలో అది ఆసక్తికలిగివుంది. ఆ కారణంచేతనే 1977 ఎన్నికల తరువాత జాతీయస్థాయిలో సామరస్యం సాధించే దృష్టితో "మన్నించు-మరచిపో" విధానాన్ని అవలంబించమని విజ్ఞప్తి చేసింది. ఆ కారణంచేతనే మళ్ళీ 1980 ఎన్నికల తరువాతకూడ కొత్త ప్రభుత్వాన్ని అయిదేండ్లకాలం ప్రశాంతంగా పదవిలో కొనసాగనివ్వాలని బాలాసాహెబ్ విజ్ఞప్తి చేశారు.

"ఆర్. యస్. యస్., శ్రీమతి గాంధీలమధ్య సహకారానికి ఏమయినా అవకాశం వుందా?" అని 1980 ఫిబ్రవరి 12న అహమ్మదాబాద్‌లో పాత్రికేయుల సమావేశంలో బాలాసాహెబ్‌ను ప్రశ్నించారు. వారు సమాధానంయిస్తూ "అన్ని విధాల అవకాశంవుంది. దేశశ్రేయస్సుకోసం ఎవరితోనయినా మేము సహకరించగలం" అని చెప్పారు. 1947-48లో కాశ్మీరుపై దాడిజరిగినపుడు, ఆ తరువాత 1962, 1965, 1971, లలో జరిగిన యుద్ధసమయాలలోను, ఇటీవలి ఆంధ్ర తుఫాను, మోర్వీ వరదలతోసహా అన్ని సహాయ, పునరావాస కార్యక్రమాలలోను ఆర్.యస్.యస్. ఏ విధంగా ప్రభుత్వానికి సహకారంయిచ్చిందో వివరించారుకూడాను.

ఆర్.యస్.యస్ యొక్క రాజకీయేతర, నిష్పాక్షిక వైఖరిని ప్రశంసించడానికి మారుగా కొందరు దీనిలో "ఆర్.యస్.యస్. - కాంగ్రెస్ (ఐ)ల రహస్యసహకారాన్ని" చూశారు. కొందరు జనతానాయకులు ఆర్.యస్.యస్‌పై యింకా పెద్ద యుద్ధం సాగించాలని తమ వివేకానికి తగిన నిర్ణయం తీసుకున్నారు. సంఘంతో ఏమీ ప్రమేయం పెట్టుకోవద్దని తమ సభ్యులకు వారు సూచించారు. ఈ స్థితిలో 1980 మార్చి 21న సమావేశమయిన అఖిలభారత కార్యకారీమండలి సమావేశంలో ఆర్.యస్.యస్. ప్రధానకార్యదర్శి తాను 1979 జూలై 24నాటి ప్రకటనను ఏ పరిస్థితులలో ఎట్టి సదుద్దేశంతో చేసినది వారికి వివరించారు. దానిపై తగినచర్చ జరిపినమీదట ఆ విషయంలో చేయవలసింది ఏమీ లేదని కార్యకారీమండలి అభిప్రాయపడింది. 1980 మార్చి 2తేదీన ఆ విషయాన్ని అఖిల భారతీయ ప్రతినిధిసభముందు వుంచగా కార్యకారీమండలి నిర్ణయాన్ని దానిని ఆమోదిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించింది.

ఆర్.యస్.యస్.కు సంబంధించినంతవరకు "ద్వంద్వసభ్యత్వం" సమస్య ఆ విధంగా పరిష్కృతమైంది. జనతా తన యిష్టంమేరకు ఎంతకాలమైనా యీ సమస్యను నెమరువేయవచ్చు.

"జనతాపార్టీ అంతరిస్తుందా ?" అని ఫిబ్రవరి 12న బాలాసాహెబ్‌ను అహమ్మదాబాద్‌లో ఒక పాత్రికేయుడు ప్రశ్నించగా, "జనతాపార్టీని నడపటం మా బాధ్యత కాదు. అది జనతానాయకులపని. పరస్పర వివాదాలతోనే ఎల్లకాలం గడపడం జనతానాయకుల అభీష్టమైనపుడు ఎవరుమాత్రం ఏమిచేయగలరు ?" అని బాలాసాహెబ్ ప్రత్యుత్తరం యిచ్చారు.

"ఆర్ యస్.యస్. రాజకీయాల్లో ఎందుకు ప్రవేశించదు ?" అనే ప్రశ్న తరచుగా వినిపిస్తూవుంటుంది. ఇది మంచిఉద్దేశంతోనే అడిగినప్రశ్న. కాని రాజకీయాల స్వభావాన్ని, ఆర్. యస్. యస్. ఆశయాదర్శాల లక్ష్యాలను గమనించని కారణంగానే యీ ప్రశ్న వస్తున్నది. నీరు, నూనె కలిసిపోవడం జరుగదు.

కొద్ది సంవత్సరాల క్రిందట ఆర్.యస్.యస్.ను "రాజకీయపక్షం"గా ప్రకటించడానికి కాంగ్రెసు ప్రభుత్వం బెదిరిస్తూవుండగా "ఆ పని మీరుచేస్తారనే ఆశిస్తున్నాను" అని రాజస్థాన్ జనసంఘ నాయకుడు భైరాన్‌సింగ్ రాష్ట్ర శాసనసభలో అన్నారు. నాటి ముఖ్యమంత్రి శ్రీ సుఖాడియా "ఆ పొరపాటు మేమెప్పుడూ చేయం" అని జవాబిచ్చారు.దీనిలోని ఉద్దేశం స్పష్టమవుతూనేవుంది. ఆర్.యస్.యస్. తన ప్రస్తుత కార్యాన్ని ప్రక్కనపెట్టి రాజకీయాలకు అంకిత మైపోతే అధికారపక్షానికి నిజంగానే పెద్ద యిబ్బందిగా పరిణమిస్తుంది. అయితే ప్రభుత్వానికి వ్యవహారాలు సులువు చేయడంగాని, కష్టాలు కల్పించడంగాని ఆర్. యస్. యస్. ఆశయంకాదు. పూర్తిగా విభిన్నమైన కార్యంలో రాష్ట్ర నిర్మాణం, శీలనిర్మాణం అనే రెండు పనులలో అది నిమగ్నమైవుంది. ఈ కార్యానికి స్వస్తిచెప్పే సంఘంయొక్క అస్తిత్వహేతువే లేకుండా పోతుంది. అనతికాలంలోనే అది మరొక రాజకీయపక్షంగా దిగజారిపోతుంది. బైబిలు ప్రవచించినట్లు : "మీరు యీ భూమికి ఉప్పు. కాని ఉప్పే తన ఉప్పదనాన్ని కోల్పోతే, మరి దేనితో దానికి ఉప్పదనం చేకూర్చగలం?"

జనతాలోని జనసంఘం వారిగురించి ప్రజలు ఎంతో మంచిగా చెప్పు కున్నారు. ఏ విధంగా చూసినా వారు చాల బాగా పనిచేశారని, ఎంతో హుందాగా వ్యవహరించారని అంగీకరించబడింది. కారణమేమిటి ? వారు సంఘ సంస్కారాలు కలిగిఉండటమే. రాజకీయాలకంటె సంస్కారాలు అత్యంత ప్రధానమైనవి. నాలుగు

దశాబ్దాలుగా కాంగ్రెసు వర్ధిల్లగలిగిందంటే అందుకు గాంధీజీ యిచ్చిన నైతిక సంస్కారమే కారణం. చాలమంది యితరులకన్న జనసంఘంవారు చక్కగా ప్రవర్తిస్తున్నారంటే సంఘంతో సంపర్కంద్వారా వారు పొందిన నైతికసంస్కారమే కారణం.

ఆర్.యస్.యస్. ప్రతీ విషయాన్ని, ప్రతీవ్యక్తిని ప్రభావితంచేయాలని చూస్తున్నదని నెహ్రూజీ ఒకమారు అన్నారు. తరువాత కొద్దిరోజులకు నాటి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ రవిశంకర్‌శుక్లా శ్రీ గురూజీని కలుసుకొనడం తటస్థించింది. రాయపూర్‌లో ఆర్.యస్.యస్. ప్రతిజ్ఞ తీసుకున్న వ్యక్తులలో శుక్లాజీ మొదటివారు. "మీరు ప్రతీవ్యక్తిని ప్రభావితం చేయాలని ప్రయత్నిస్తారట. నిజమేనా ?" అని శ్రీ గురూజీని ఆయన ఆ సమావేశంలో అడిగారు. శ్రీ గురూజీ నవ్వి, "తప్పకుండాను. మిమ్ముకూడా ప్రభావితం చేయడానికే ప్రయత్నిస్తున్నాను" అన్నారు. దానిపై వారిద్దరూ హృదయపూర్వకంగా నవ్వుకున్నారు.

తన బోధనద్వారా, ఆదర్శంద్వారా నిజంగానే ఆర్.యస్.యస్. అన్ని విషయాలను, అందరు వ్యక్తులను ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తున్నది – ఒక్క రాజకీయాలనుమాత్రమేకాదు, లేక జనతా రాజకీయాలనుమాత్రమే కాదు. ప్రజాస్వామిక సమాజంలో నిజానికి ప్రతి సంస్థా యిందుకే ప్రయత్నిస్తున్నది. తేడామాత్రం ఒక్కటేవుంది. తమ సిద్ధాంతం మిగతావాటికంటే ఉన్నతంగా ఉండినందున కొన్నిసంస్థలు మిగతాసంస్థలకంటె మరింతగావిజయాన్ని సాధిస్తాయి.

నీడలు - నిజాలు
(మతకలహాలు-వాస్తవాలు)

ఎప్పుడు ఎక్కడ ఘర్షణ జరిగినా, ఒక ప్రత్యేక తరగతికి చెందిన రాజకీయవాదులు తక్షణమే ఆలోచించనుకూడా ఆలోచించకుండా ఆర్.యస్.యస్. మీద నింద మోపేస్తూ వుంటారు. వాస్తవమేమిటంటే ప్రభుత్వం ఆర్.యస్.యస్. వ్యతిరేకుల చేతుల్లో నడుస్తున్నప్పటికి ఏ ఆర్.యస్.యస్. కు చెందిన ఏ వ్యక్తినీ ఏనాడూ అట్టినేరాల క్రింద శిక్షించడం లేదు.

1947 నాటి హత్యలను వట్టి ఘర్షణలనడానికి వీలులేదు. ప్రజల ఆమోదం లేకుండా, కోట్లాది ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా భారతరాజ్యం వంటి సచేతన ప్రాణిని విభజించడం జరిగింది. ఈ దేశం ఒక కేకు అయినట్లు మౌంట్ బాటెన్ ముక్కలు కోశాడు. పెద్ద శస్త్రచికిత్సలలో జరిగినట్లే ఇందులోనూ అపరిమిత రక్తస్రావం అనివార్యమయింది. ఏదోకొన్ని సంస్థలకు మరికొన్ని సంస్థలతో జరిగిన ఘర్షణ కాదది. హిందూ ప్రజలకు, ముస్లిం ప్రజలకు మధ్య జరిగిన పోరాటమది సంస్థగా ఆర్.యస్.యస్. కు యీ ఘర్షణలతోఎట్టి సంబంధమూ లేదు. వ్యక్తులుగా వారు ఆపదలో చిక్కుకున్న ముస్లిం వ్యక్తులను సైతం రక్షించడానికి ప్రయత్నించారు.

1947 లో ఢిల్లీలో వున్న తమిళనాడు ప్రభుత్వ మాజీ ఆర్థిక సలహాదారుడు డా॥ బి. నటరాజన్ యిలా వ్రాశారు. "నాకు ఒక ముస్లిం సేవకుడు వుండేవాడు ప్రశాంతత, నైపుణ్యము, పరిశ్రమ మూర్తీభవించినవాడు. అతనిని రక్షించే ఉద్దేశంతో అతనికి హిందువుల పేరు పెట్టాము. ఇదికూడా బయటివారికి తెలిసి పోవడంతో అతని జీవితం ప్రమాదంలో పడింది. కాని నా మిత్రుడొకడు అత్యంత దయాసముద్రుడు. అతడుఆర్ యస్.యస్.నాయకుడు.హిందూ పేరుతోనే అయినా యీ ముస్లింసేవకుణ్ని నా వద్దనే ఉంచుకొనడం ఎంత ప్రమాదకరమో చెప్తుండేవాడు. అతనిని రక్షించడానికి అంగీకారం తెలిపాడు.

ఒకరోజు ఆ మిత్రుడే సైనిక దుస్తులలో జీపులోవచ్చి యీ ముస్లిం సేవకుణ్ని ఎక్కించుకుపోయి ఉత్తర ప్రదేశ్‌లోని తన స్వగ్రామానికి చేర్చాడు. ఆ విధంగా యీ ముస్లిం ప్రాణం కాపాడబడింది-అదీ ఆర్.యస్.యస్. మిత్రులవలన. మానవ కారుణ్యక్షీరవాహినిని మతోన్మాదపు అడ్డుగోడలు ఆపలేవని నేను గ్రహించాను."

నిజానికి 1947 సెప్టెంబరు 9 న ఢిల్లీలో పెద్దయెత్తున హింసాకాండ చెల రేగినప్పుడు నాటి ఢిల్లీ ఆర్.యస్.యస్. కార్యదర్శి, నేటి ఢిల్లీ సంఘచాలక్ అయిన శ్రీ ప్రకాశ్ దత్త భార్గవ సెప్టెంబరు 11 న ఒక ప్రకటన విడుదల చేస్తూ యిలా అన్నారు.

"ఢిల్లీలో జరిగిన అల్లర్లు పశ్చిమ పంజాబ్‌లో హిందువులపై (శిఖులతో పాటు) జరిపిన అత్యాచారాలకు, ముస్లిములు అపారంగా అక్రమ ఆయుధాలు కలిగి వుండటానికి ప్రతిక్రియగా జరిగినట్లు కనిపిస్తున్నది. శాంతిభద్రతల పరి రక్షణకు ఢిల్లీ అధికారులు చేసిన ప్రయత్నాలను ముస్లింలు ప్రతిఘటించడం వలన పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారయింది.

"ఏమయినా, పరిస్థితిలో చెప్పుకోదగిన మెరుగుదల వచ్చింది. అక్రమ ఆయుధాలన్నీ స్వాధీనం అయేటట్లు, ప్రభుత్వం చూస్తుందని, అమాయిక ప్రజ లపై వాటిని ఉపయోగించే అవకాశం రానివ్వదని మేము విశ్వసిస్తున్నాం.

సహనం వహించవలసిందిగా హిందూ ప్రజలకు మా విజ్ఞప్తి. శరణార్థు లను తరలించి వారికి పునరావాసం కల్పించే ప్రయత్నాలకు యీ అల్లర్లవల్ల విఘాతం కలుగుతుందని కూడా మరిచి పోవద్దని వారికి మేము మనవి చేస్తున్నాం.

ఈ విషయమై ఆర్.యస్.యస్. అధికారులు శుక్రవారం నాడు మహాత్మా గాంధి, సర్దార్‌పటేల్, డా॥ శ్యామప్రసాద్ ముఖర్జీలను కలిసి తమఅభిప్రాయాలు వెల్లడించి వున్నారు,"

1947 మారణకాండకు సంబంధించి ప్రభుత్వం ఒకే ఒక ఘర్షణ కేసును దాఖలు చేసింది. ఇది ఉత్తర ప్రదేశ్‌లో ముజఫర్‌నగర్‌లోని కాండ్లా గ్రామానికి చెందిన ఆర్.యస్.యస్. కార్యకర్తలపై బనాయించబడిన కేసు. ఆర్.యస్.

యస్. పై ఇంకా నిషేధం వుండగానే (1948 అక్టోబరులో) దీనిపై తీర్పు వచ్చింది. ముద్దాయిలనందరిని నిర్దోషులుగా న్యాయమూర్తి ప్రకటించి గౌరవంగా వారిని విడుదల చేశారు, 1947 మారణకాండలో ఆర్.యస్.యస్. పాత్రఅంతే!

అనేక సంవత్సరాల తరువాత 1975 మే 9 న దేశీయాంగ శాఖమంత్రి బ్రహ్మానందరెడ్డి రాజ్యసభలో ఒక వివరణయిస్తూ-హింసాకాండలకు సంబంధించిన సంఘటనలలో కమ్యూనిష్టులు నేరస్థులుగా నిర్ణయించబడిన సందర్భాలెన్నో వున్నాయి. కాని ఒక్కొగానొక్క సందర్భంలో కూడ ఆర్.యస్.యస్. కు సంబంధం లేదని-ప్రకటించారు.

ఇన్ని సంవత్సరాలుగా స్వతంత్ర భారతంలో ఎన్నో సంఘర్షణలు జరిగినై జబల్పూర్, జంషెడ్‌పూర్, రాంచీ, అహమ్మదాబాద్‌లలో జరిగిన సంఘటనలు వీటిలో తీవ్రమైనవి. ఈ సంఘర్షణలపై విచారణ జరపడానికి నియమించబడిన సంఘాలలో ఏ ఒక్కటీ ఆర్.యస్.యస్. ను తప్పు పట్టలేకపోయింది.

రాంచీ సంఘర్షణలపై విచారణకు నియమించబడిన సంఘంలో ముగ్గురు సభ్యులు-ఒక హిందువు, ఒక ముస్లిం, ఒక క్రైస్తవుడు-వుండటం గమనించ తగ్గది. తెల్లిచెరి సంఘర్షణలపై సమర్పించబడిన ఒక నివేదికలో-కాంగ్రెసు, జనసంఘం, కమ్యూనిష్టులతో సహా-అన్ని పార్టీలు కులాల వారీగా చీలిపోయి సంఘర్షణల్లో పాల్గొన్నట్లు వెల్లడిచేయబడింది. భివాండీలో శివసేనదే బాధ్యత అని విచారణసంఘం నిర్ణయించింది. కాని నాటి అధికార పక్షం శివసేనతో మైత్రికొనసాగింది. 1968 లోను, 1969 లోని మొదటి మూడు నెలలలోను జరిగిన మొత్తం 23 సంఘర్షణలపైపరిశీలన చేయగా, వీటిలో 22 సందర్భాలలో ముస్లిములే ఘర్షణలు ప్రారంభించినట్టు తేలిందని దేశీయాంగ మంత్రిత్వశాఖ 1969 మేలో జాతీయ సమైక్యతా మండలికి వెల్లడించింది. ఎ. ఆర్. షెర్వానీ అన్నట్లు-యీ ఘర్షణలవల్ల ముస్లిములకంటె హిందువులే ఎక్కువ నష్టపోయారు. పైగా డబ్బున్న వారికంటె, లేనివారే ఎక్కువ దెబ్బతిన్నట్లు కూడా చెప్పవచ్చు.

1970లో సీనియరు పత్రికా సంపాదకుల ప్రశ్నలకు సమాధానమిస్తూ శ్రీ గురూజీ యీ విషయంపై వాస్తవపరిస్థితి స్పష్టం చేశారు: "భారతదేశంలో హిందూ-ముస్లిములమధ్య ఉద్రిక్తత నెలకొనివుండడానికి ముఖ్యకారణం భారతీయ

ముస్లిం భారతదేశంతోను, దాని ప్రజలతోను, సంస్కృతితోనూ పూర్తిగా తాదాత్మ్యం చెందే స్థితికి యింకా చేరుకొనకపోవడమే. ఇది నా దేశమని, వీరంతా నా ప్రజలేనని ముస్లిం భావించి ప్రకటించనీయండి-ఆపైన సమస్యేవుండదు. అతడి మనస్తత్వం మారుతుందా అనే దానిమీదనే-యిది ఆధారపడివుంది.

"ఆర్.యస్.యస్. నాయకుడు ఎక్కడికి వెళితే అక్కడ సంఘర్షణ చెలరేగుతుందని అంటున్నారు. మేము ఎప్పుడూ దేశమంతటా పర్యటిస్తూనే వుంటాము. ఆ కారణాన దేశంమొత్తం అన్నివేళలా భగ్గుమని మండుతూ వుండాల్సింది. గత రెండు నెలలలోనే నేను ఆరుమార్లు ఢిల్లీ సందర్శించాను. ఢిల్లీలో ఆరు సంఘర్షణలు జరిగివుండాల్సింది. బాధ్యతాయుతులనబడేవారి బాధ్యతారాహిత్యం నాకు ఆశ్చర్యం కలిగిస్తున్నది" అని శ్రీ గురూజీ అన్నారు.

"ముస్లిములు అన్ని దేశాలలోను వున్నారు" కాని మత కల్లోలాలు భారతదేశంలో మాత్రమే జరుగుతున్నాయి" అని ఒక సంపాదకుడు వ్యాఖ్యానించగా, శ్రీ గురూజీ "అది వాస్తవంకాదు. రష్యాలో ముస్లిం సమస్య వుంది. చైనాలో ముస్లిం సమస్య వుంది. బాల్కన్స్‌లోనూ ముస్లింసమస్య వుంది. ముప్పయిసంవత్సరాల క్రిందట సింకియాంగ్‌లో చైనావారికి, ముస్లింలకు మధ్య పెద్ద ఘర్షణ జరిగిన విషయం నాకు జ్ఞాపకంవున్నది. ముస్లిములే యీ ఘర్షణ రెచ్చగొట్టినట్లు చెప్పబడింది. చైనీయులు గట్టిగానే ఎదురుదెబ్బ తీసినట్లు వార్త వచ్చింది. మొత్తంమీద పదిలక్షలమందిదాకా హతులైనారు. గతవారంకూడా సింకియాంగ్‌లో పెద్ద సమస్య తలయెత్తినట్లు వార్తలు వచ్చినై.

"నేను చెప్పదలిచేది అతిసాధారణవిషయం. రుస్తుంవంటి ముస్లిమేతరుణ్ని ఇరానులోని ముస్లిములు తమ నాయకుడుగా గౌరవిస్తూవుండగా భారతీయ ముస్లిములు రాముణ్ని ఆ విధమైన నాయకుడుగా ఎందుకు పరిగణించకూడదు ? ఇండోనేషియాలోని ముస్లిములుకూడా రాముణ్ని తమ మహానాయకుడిగా గౌరవిస్తున్నారు మరి !

"మనమంతా ఒకే ప్రజ అని, మనందరి రక్తనాళాల్లో ఒకే రక్తం ప్రవహిస్తూ వుందని ముస్లిములు గ్రహించితీరాలి. వారు అరబ్బులో, టర్కీవారో, మంగోలులో కాదు, మతంమార్చుకున్న భారతీయులుమాత్రమే. భారతదేశాన్ని ముస్లిం బలవంతంగా విభజన చేయించాడు కనుకనే, ముస్లిమును హిందువు అను

మానంతో చూస్తున్నారు. ఈనాటికీ భారతదేశంలోని ముస్లింలు "పాకిస్తాన్ జిందాబాద్" అని నినాదంచేస్తున్నారు. "భారత్‌మాతాకీ జై" అని వారిలో ఎంతమంది అంటారు ? భారతీయ ఆటగాళ్ళమీద పాకిస్తానీయులజట్టు గెలుపు సాధించిందని చెపితే రేడియో సెట్లకు పూలమాలలువేసే భారతీయముస్లింలగురించి నాకు తెలుసు". అన్నారు.

మరొక సంపాదకుడు అడిగాడు : "హిందువులు ఉన్నతస్థాయికి రావాలని మీ అభిలాష; దానికోసం రాజ్యాంగ సవరణ జరగాలనుకుంటున్నారా ?" అని దానికి శ్రీ గురూజీ "హిందువులు ఇప్పటికే ఉన్నతస్థాయిలో వున్నారు. ప్రజాస్వామిక వ్యవస్థతో వారు పైకిరావడం తప్పదు. నేను కోరేది ఆరోగ్యవంతమైన సమాజం కావాలనిమాత్రమే. రాజ్యాంగాన్ని సవరించవలసిన పనిలేదు. అందరికి సమాన హక్కులు యిస్తున్న రాజ్యాంగం మనది. హిందువు జన్మతః సెక్యులర్ స్వభావం వున్నవాడు అన్నిమార్గాలు భగవత్ సాక్షాత్కారానికి దారితీస్తాయనే సత్యాన్ని అతడు అంగీకరిస్తాడు. కాని ముస్లిమేతరులంతా నరకానికి పోతారని భావించేవాడు ముస్లింమాత్రమే" అని ప్రత్యుత్తరం యిచ్చారు.

ఇస్లామ్‌కు మౌలానాఆజాద్ ఆధునికమైన క్రొత్తనిర్వచనం యిచ్చాడని ఎవరో వ్యాఖ్యానించారు.

కాని ఆజాద్‌ను అనుసరించడానికి ఎందరు ముస్లింలు సిద్ధపడ్డారు? హిందువులు సెక్యులర్ ఆయివుంటం సహజం, మతోన్మాది అయివుండటం అరుదు. కాని ముస్లిములలో మతోన్మాది అయివుండటం సాధారణంకాగా, సెక్యులర్ అయి వుండటం అరుదుగా కనిపిస్తున్నది. ఉన్నతేడా యిది." అని శ్రీ గురూజీ వివరించారు.

మరొక సంపాదకుడి ప్రశ్న "ముస్లిములు పాకిస్తాన్ సహాయం కోసం చూస్తున్నారని మీరు నిరసిస్తున్నారు. మరి ఎందరో హిందువులు చైనా, రష్యాల సహాయం కోసం చూస్తున్నారు గదా!" శ్రీ గురూజీ సమాధానం "వారిని కూడా అంత తీవ్రంగానే నేను నిరసిస్తున్నాను."

తరువాత ప్రశ్న "కాని మనమేమిచేయగలం? సమస్యను ఎలా పరిష్కరించగలం? ఆరుకోట్లమంది ముస్లిములున్నారు. దేశంలో" శ్రీ గురూజీ జవాబు

"ఈ దేశాన్ని, దీని ప్రాచీన సంస్కృతిని తమదిగా చేసుకొని ముస్లిములే యీ సమస్యను పరిష్కరించగలరు. పరిష్కరించాలి. భారతదేశ చరిత్ర మహమ్మద్ గజనీతో మొదలుకాలేదు."

ఇంకొక సందేహం: "మీరు హిందువుల గురించి మాట్లాడుతారు తప్ప హిందూస్తానీలగురించి మాట్లాడరేమి? మీ కార్యంలో ముస్లిములను చేర్చుకోరెందుకు.

"మహాత్మాగాంధీ నాయకత్వంలో హిందువు హిందుస్తానీగానే తయారయి నాడు. కాని ముస్లింలో స్పందన వచ్చిందా? అతడు హిందూస్తానీ అయినాడా? ముస్లింలలో ఎంత అధముడైనా, మహాత్మాగాంధీతో సహా, హిందువులలోని మహా నుహులకన్నా గొప్పవాడు అని మౌలానా మహమ్మదాలీ ప్రిప్పికొట్టాడు!

"ముస్లింల ఓట్లకోసం దాదాపు అన్ని పార్టీల వారు ముస్లింలలో వేర్పాటు వాదాన్ని ఎప్పుడూ ప్రోత్సహిస్తూవున్నారు. ఇదేనా వారిని హిందూస్తానీలు గానే మార్చే పద్ధతి? చరిత్రను తిరిగివ్రాసే ప్రయత్నం మనం మానుకుంటే మంచిది. చరిత్రను చదివి దాని పాఠాలు నేర్చుకుందాం. మన చరిత్రను ఉన్నదున్నట్లుగా స్వీకరించేస్థాయికి మనం ఎదుగుదాం" అన్నారు గురూజీ.

హిందువులు సంఘటితమవుతే ముస్లిములు కూడా సంఘటితమౌతారు కదా, అన్న ప్రశ్నకు ఇప్పటికే ముస్లిం సంఘటితమై యున్నాడని సమాధానం గురూజీని అడిగిన చివరిప్రశ్న "ఈ దేశంలో దీని సంస్కృతితో పూర్తిగా తదాత్మ్యం చెందాలని ముస్లింలకు ఎవరు బోధిస్తారు?" అని. "మీరు మేము—మనమందరం" అని శ్రీ గురూజీ చెప్పారు.

యిది యిలావుండగా భారతదేశంలో కొన్నిచోట్ల మత కలహాలు అప్పుడప్పుడూ సంభవిస్తూనే వున్నాయి ఎందువల్ల?

వీటన్నిటికి మూలకారణంగా చరిత్రవుంది. తాను పరాక్రమ వంతుడినని యిదివరలో భారతదేశాన్ని జయించానని, మళ్ళీ పరిపాలించగలనని ముస్లిం భావిస్తాడు. భారతీయ ముస్లిములు ఎవరితో తాదాత్మ్యాన్ని పొందుతున్నారో, ఆ మధ్య ఆసియా ముస్లిం దండయాత్రికులంటే హిందువుకు అపరిమితమైన విరోధభావం వుంది.

ఖిలాఫత్‌కు కాంగ్రెసు యిచ్చిన మద్దతు వినాశకరంగా పరిణమించింది. దానితో ముస్లింల మతోన్మాదం పెచ్చుపెరిగి పోయింది. నాలుగో పానిపట్టు యుద్ధం జరిపి, హిందూ ముస్లిం సమస్యకు అంతు తేల్చాలని, నాటి మతోద్రేకపు వాతావరణంలో షౌకతాలీకి ఆలోచన తట్టింది. ప్రశాంతంగా వుండే మాలవ్యాజీ కూడా రెండు వర్గాల మధ్య ఉద్రిక్తత, కొనసాగనీయడం కంటె ఒక్కసారే అమీతుమీ తేల్చే యుద్ధమేదయినా జరిగితే బావుండునని అభిప్రాయ పడ్డారు.

బ్రిటిష్‌పాలన ఏర్పడేవరకు ముస్లిం పరిపాలకుడుగానే కాక, (అదృష్టం గల) సైనికుడుగా, భూస్వామిగాకూడా వుండేవాడు. హిందువు "బాబు"గా వర్తకుడుగా, పండితుడుగా వుండేవాడు. బ్రిటిషు పరిపాలనలో ముస్లిం భూములను హిందువు కొనివేస్తూవచ్చాడు. జమీందారీల రద్దు వచ్చినపుడు హిందూ జమీందారీలతో పోల్చగా, ముస్లిం జమీందారులే ఎక్కువగా రద్దుఅయినై. అదే సమయంలో క్రొత్త యుద్ధవిధానాల వల్ల పాతకాలపు కోరలునూరే పద్ధతులు వెనుకబడినై. ఈ పరిస్థితిలో కండలేకపోయినా గుండెవున్న హిందువు ఉద్రేక స్వభావి అయిన ముస్లిం కంటె రైఫిలును నేర్పుగా ఉపయోగించ గలిగేవాడు అయినాడు.

ఆ పైన ప్రజాస్వామ్యం వచ్చి మనిషికొక వోటు లభించింది. తలలు పగుల గొట్టి ప్రభుత్వాలు ఏర్పరచే రోజుల్లో ముస్లిం అగ్రగామిగా వుంటుండేవాడు. ఇపుడు తలలు లెక్కపెట్టి ప్రభుత్వం ఏర్పరచే రోజులు. ఇందులో హిందువు ఎంతో అగ్రగామిగా వున్నాడు. అదే సమయంలో హిందువు విద్యా వ్యాపార రంగాలలో తన వెనుకటి ప్రతిభను-నిలుపుకున్నాడు బహుశా ప్రతిభ పెంచుకున్నాడు కూడాను. ఈపరిస్థితిలో ముస్లిముకు బాధ అనుభవమవుతూనే వుందిగాని, దాని స్వభావం అతనికి బొత్తిగా అర్థం కావటంలేదు. ప్రజాస్వామ్యం, సోషలిజపు భావనలు, వ్యవస్థల మధ్య తాను చిక్కు పడివున్న విషయం అతడు అర్థం చేసుకొనటం లేదు. అతడికి కనిపిస్తున్నది హిందువు తన-సమస్యలన్నిటికీ ఆ హిందువు మీదనే నిందవేస్తున్నాడు.

ఈ పరిస్థితిలో స్వప్రయోజన పరుడై హిందూ రాజకీయవాది ఒకడు వస్తాడు. అతడి బాధలన్నిటికి దుర్గార్గుడైన హిందువే కారణమని చెప్తాడు. దీనితో అతని నమ్మకం బలపడుతుంది. అటుపై అరబ్ దౌత్య నిపుణుడువస్తాడు-భారత దేశంలో జరుగుతున్న మారణహోమం గురించి మాట్లాడటానికి.

నెహ్రూ కుటుంబంవారి ఉర్దూదిన పత్రిక లక్నోనుంచి వెలువడే 'కౌమీ ఆవాజ్"కు సంపాదకుడైన హయాత్ అన్సారీ 1960 జూలై 13న వ్రాసినట్లు" కాంగ్రెసును,భారతదేశాన్ని,హిందువులను అప్రతిష్టపాలుచేసి ముస్లిములను నిరాశా నిస్పృహలకు గురిచేసే దుష్టవిధానాన్ని 'సహా-ఏ-మిల్లత్' అనుసరిస్తున్నది. ఈ విధానాన్ని అనుసరించి ముస్లింలను రెచ్చగొట్టడం, రచయితకు ముస్లింలపట్ల అపారమైన సానుభూతి వున్నట్లు కనిపింపజేయడం తేలిక. ఇది ఎంత బాగా చెలామణిలో వున్న విధానమంటే భారతదేశంలోని ముస్లిం పత్రికలన్నీ దీనినే పాటిస్తున్నాయి. వారు అదేపనిగా ఆ రకమైన చెత్తనే ప్రచురిస్తూ వుంటారు, వారి పాఠకులు అదే చదువుతూ మెచ్చుకుంటూ వుంటారు. ఈ పాఠకులలో యిదంతా తప్పు అని చెప్పేవారు అరుదుగా వున్నారు. అసలు వున్న పరిస్థితి యిది."

అలాగే ఇందిరా ప్రభుత్వంలో ఒక దశలో "న్యాయ" మంత్రిగా పని చేసిన యూనస్ సలీం కూడ, 1948 నాటి హైదరాబాద్ పోలీసు చర్యలో "లక్ష మంది ముస్లింలు హత్యచేయబడ్డారు." అని గట్టిగా నమ్మాడు. ఉర్దూవార పత్రిక "షబిస్తాన్"కు (1969 మే) యిచ్చిన యింటర్వ్యూలో ముస్లింలకు కాంగ్రెసు ఉపయోగం చాలవున్నదని కాంగ్రెసుకు ముస్లింలు మాత్రమే రక్షించ గలరని తాను నమ్ముతున్నానని అన్నాడు. సిద్ధాంత పరంగా కాంగ్రెసును ముస్లింలు అంగీకరించలేదని ఒప్పుకుంటూ, ఆ కారణంవల్ల కాంగ్రెసుతో ముస్లిముల సంబంధం 'అవకాశవాదంతో' కూడివున్నదని అన్నాడు. అది ప్రయాణికులకు రైలుబండితో వుండే సంబంధం వంటిది మాత్రమేనని వివరించాడు.

ఇబ్బంది ఆరైలుబండి వారిని ఎక్కడకూ చేర్చేది కాకపోవడమే. ఎందుకంటే హమీద్ దల్వాయి అంటూవున్నట్లు కాంగ్రెసు, కమ్యూనిస్టు, సోషలిస్టు, జనసంఘం మొదలైన ఏ రాజకీయ రంగువారిలో చేతిలోవున్న, భారతదేశ ప్రభుత్వం ఎప్పుడూ హైందవంగానే వుంటుందనే వాస్తవాన్ని ముస్లిం అర్థంచేసుకుని, అంగీకరించితీరాలి. హిందువుల అభిప్రాయానికి అగౌరవం కలిగించకుండా ఏ భారత ప్రభుత్వమైనా ముస్లింలకు సహాయం అందించడం జరిగేపనికాదు. "ఆర్గనైజరు" కంటె 'టైమ్స్ ఆఫ్ యిండియా' హీనమైనదిగా ఉన్నదా ? జనసంఘం వారు ఎంత ఉర్దూ వ్యతిరేకులో జయప్రకాష్ కూడ అంతే వ్యతిరేకులని ముస్లిం పత్రికలు దిగ్భ్రాంతి ప్రకటించడానికి కారణం అదే. పోరాడుతున్నది

జనసంఘంతోనో. జె.పి. తోనోకాదని, ప్రజాస్వామ్యానికీ సోషలిజానికి వ్యతిరేకంగా నిలిచివున్నామని గ్రహించలేని స్థితిలో నేటి భారతీయ ముస్లింలు ఉన్నారు.

ఇస్లాం ప్రమాదంలో వున్నదని 1947 లో అరచినవారే నేడు "సెక్యులరిజం ప్రమాదంలోవున్న" దని కేకలువేయడం హిందువులుచూస్తున్నారు-అందుకే వారు యీ నినాదానికి మోసపోవడంలేదు.

ఏ అల్లరిజరిగినా స్వప్రయోజన పరులైన రాజకీయవాదులు ఆర్.యస్.యస్. మీద నింద మోపుతున్నారు; కాని ఆర్.యస్.యస్. కార్యకర్తల మీద శారీరకంగా దాడిచేస్తున్నవారు వేరే వ్యక్తులు అయి వుండటం విశేషం. గాంధీజీ హత్యానంతరం దక్షిణ మహారాష్ట్రలో బ్రాహ్మణులమీద, ప్రత్యేకించి సంఘ కార్యకర్తల మీద కాంగ్రెసువారు, సోషలిస్టులు పెద్దయెత్తున హింసాకాండ నిర్వహించారు. 1948 నిషేధానికి ముందు, ఆ తరువాత ఆర్.యస్.యస్. మీద దాడి చేయడంలో సోషలిస్టులు; రాష్ట్రీయ సేవాదళ్ (ఆర్.యస్.డి.) వారు చురుకుగానేవున్నారు. జె.ఎ. కురన్ మాటలలోచెప్పాలంటే "ఆర్.యస్.డి.లో అనవసరంగా ఘర్షణలు తలయెత్తకుండా జాగ్రత్తలు తీసుకొనడంలో ఆర్.యస్.యస్. వారు కృతకృత్యులలైనప్పటికి, సోషలిస్టు పార్టీ సాధారణ సభ్యులు మాత్రం ఆర్.యస్.యస్. కార్యకలాపాలకు విఘ్నం కలిగించడానికి ప్రయత్నించారు."

1967 డిసెంబరు 3 న ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలులో ఆర్.యస్.యస్. వారి పథసంచలనం (రూట్ మార్చ్) మీద కొందరు ముస్లింలు దాడిచేశారు. ఈ ఆర్.యస్.యస్. కార్యక్రమానికి జిల్లా పోలీసు సూపరింటెండెంటు శ్రీ సత్తార్ ముందుగానే వ్రాత పూర్వకమైన అనుమతి యిచ్చారు. కేసు దాఖలు చేయడం జరిగింది. చట్టవిరుద్ధంగా గుమికూడిన వారితో వున్నందుకు, స్థానిక ఆర్.యస్.యస్. చట్టబద్ధంగా నిర్వహించిన రూట్‌మార్చిని విచ్ఛిన్నం చేసే దృష్టిలో ఘర్షణలకు పూనుకున్నందుకు వివిధ ఏ.పి.సి సెక్షనుల (147, 148, 323, 324, 341 క్రింద) ఆరోపణలు మోపబడినై. కర్నూలు పట్టణ ముస్లింలు పదిమందికి సంబంధించిన యీ కేసులో అయిదుగురిపై నేరాన్ని ధృవీకరించారు.ఒక్కొక్కరికి 80లకు మించి 200 ల వరకు జరిమానా,అది చెల్లించనిపక్షంలో మూడు నుండి ఆరు నెలలవరకు కఠిన జైలు శిక్షవిధిస్తూ-కర్నూలు ప్రిన్సిపల్ మున్సిఫ్ మేజిస్ట్రేటు తీర్పుయిచ్చారు.

క్రమశిక్షణతో, నిగ్రహంతో సాగిపోతున్న ఆర్.యస్.యస్. ఊరేగింపుకు మూడుమార్లు-ప్రతిసారి ఒక మసీదువద్ద-ఆటంకం కలిగించారని, ముద్దాయిలలో కొందరు "పాకిస్తాన్ జిందాబాద్" "కాఫిరోంకోమారో" వంటి నినాదాలు చేశారని ప్రాసిక్యూషన్ ఆరోపించింది. మసీదులముందు వాద్యసంగీతాలతో ఆర్.యస్. యస్. జరిపిన రూట్‌మార్చి వలన ఆటంకం కలిగిందన్న డిఫెన్సు వాదాన్ని మేజిస్ట్రేటు త్రోసిపుచ్చారు.

ప్రత్యేకించి ఆ సమయంలో మసీదులో ప్రార్థనలేవీ జరగనప్పుడు, పైగా వాద్యాన్ని తమంతగా ఆపివేసే ఒప్పందమేదీ ఉభయ పక్షాల మధ్య లేనప్పుడు వాద్య సంగీతాల వినియోగం నేరంకాదని మేజిస్ట్రేటు అభిప్రాయపడ్డారు. ఈ సంగతి అటుంచినా: వాద్యసంగీతాన్ని ఉపయోగించే హక్కును నిరోధించే వీలు లేదని మేజిస్ట్రేటు భావించారు. ఆర్.యస్.యస్. స్వయంసేవకులు లాఠీలు ధరించివున్నారని, కనుక వారిది చట్టవిరుద్ధమైన ఊరేగింపు అనే వాదనను కూడా త్రోసిపుచ్చడం జరిగింది. ఆర్.యస్.యస్. యూనిఫారం లాఠీకూడా ఒక భాగమని, "అది చట్టవిరుద్ధమైన ఆయుధం కాదని" మేజిస్ట్రేటు అన్నారు.

1968 ఫిబ్రవరిలో తెలంగాణాలో సంఘ కార్యకర్తల మీద కొందరు ప్రముఖ కమ్యూనిస్టులు దాడిచేశారు. 5 గ్రామాలనుంచి వచ్చిన 200 మంది స్వయంసేవకులు నల్గొండ జిల్లాలోని తొండ గ్రామంలో సమావేశమైనారు. ప్రార్థన తరువాత అందరు వెళ్లిపోయి 15 మంది మాత్రమే మిగిలివున్న సమయంలో 250 మంది పైగా వ్యక్తులువచ్చి లాఠీలతో వారిమీద దాడిచేశారు. జిల్లా ప్రచారక్ శ్రీ రామమూర్తితోసహా అయిదుగురు స్వయంసేవకులు అస్పత్రిలో చేరవలసివచ్చింది. ఆంధ్రప్రాంత ప్రచారక్ శ్రీ సోమయ్య కూడ గాయపడ్డారు.

రెండు రోజుల తరువాత మరో గ్రామంలో 50 మంది స్వయంసేవకుల మీద 200 మంది వ్యక్తులు దాడిచేశారు. నలుగురు స్వయంసేవకులకు ఎముకలు విరిగి గాయపడ్డారు. పోలీసులు 18 మందిని అరెస్టు చేశారు-అంతా అతివాద కమ్యూనిస్టులే. తప్పించుకొని తిరుగుతున్న ఒక అతివాద సి.పి.ఐ. శాసనసభ్యుడి అరెస్టుకు వారంటు జారీచేయబడింది.

ఆర్.యస్.యస్. నాయకులు ముఖ్యమంత్రిని కలుసుకోగా రక్షణ కల్పిస్తానని హామీ యిచ్చారు. శాంతి భద్రతలను యింకా కట్టుదిట్టంగా పరిరక్షించా

దానికి లోగడ కమ్యూనిస్టులకు కంచుకోటలుగా వుండిన గ్రామాలలో నాలుగు క్రొత్త పోలీసు స్టేషనులను నెలకొల్పారు.

1970 ఏప్రిల్ 19 న, పోలీసుల అనుమతితో నిర్వహించిన సంఘ రూట్ మార్చిమీద మైసూరులోని చామరాజనగర్‌తో కత్తులతో 300మంది ముస్లింలుదాడి చేశారు. కనకపూరాలోని ఒక మసీదులో గుమికూడిన ఈ గుండాలు ఊరేగింపు బహిరంగ సభాస్థలికి చేరుకోనుండగా కొద్ది నిమిషాలముందు, అకస్మాత్తుగా విరుచుకుపడ్డారు. ఆత్మరక్షణకోసం నలభై నిమిషాలు పోరాడిన తరువాత మళ్ళీ ధ్వజంతో ఊరేగింపుగా సాగిపోనున్న స్వయంసేవకులు తమ దారికి గుండాలతో అడ్డంకులు కల్పించబడివుండడం చూశారు. నగరమంతా పూర్తి హర్తాళ్ జరిగింది.

1974 జూన్ 5న ఒరిస్సాలోని కలహండీలో ఒక ఆడిటోరియంలో బాలాసాహెబ్ దేవరస్ రాక కోసం నిరీక్షిస్తున్న ఆర్.యస్.యస్. కార్యకర్తల మీద అకస్మాత్తుగా యూత్ కాంగ్రెసు రౌడీలు దాడిచేశారు. రౌడీలు ఉత్కళ ప్రాంత ప్రచారక్ శ్రీ పాల్ధీకర్‌ను గాయపరిచి కొన్ని ఫోటోగ్రాఫులను ధ్వంసం చేసి పోలీసులు వచ్చేసరికి పారిపోయినారు.

మంగుళూరు నుంచి వెలువడే కన్నడ దినపత్రిక 'దివ్యవాణి' సంపాదకుడు ఆర్.యస్.యస్.కార్యకర్తఅయిన రాఘవేంద్ర నాగోరిని 1977 సెప్టెంబరు 25 అతని కార్యాలయంలోనే కత్తితో పొడచి చంపారు. నాగోరి గతంలో 'మీసా' డిటెన్యూగా వున్నారు.

ఎమర్జెన్సీ ఎత్తివేసినప్పటినుంచి కేరళలో మార్క్సిస్టులు డజన్లకొద్ది సంఘకార్యకర్తలను హత్యచేశారు. హతులలో అధిక సంఖ్యాకులు-హరిజనులు!

1980 జూలై 25 న ఇద్దరు మార్క్సిస్టు శాసన సభ్యులు-కేరళలోని తెల్లిచెర్రికిచెందిన ఎం.వి. రాజగోపాలన్, పాండిచేరిలోని మాహేకు చెందిన కె.వి. రాఘవన్, మరి పదిమంది మార్క్సిస్టులకు తెల్లిచెర్రిజిల్లా సెషన్సు జడ్జి శ్రీ ఎ. ఆంటోనీ యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పుయిచ్చారు. వారంతా 1978 నవంబరు 25న తెల్లిచెర్రిలోని ఎన్నయనూర్‌లో ఆర్.యస్.యస్. కార్యకర్త కె. రవీంద్రన్‌ను హత్యచేసినట్లు ఋజువయింది.

పోతే, ఆర్.యస్.యస్. మాత్రం సంఘర్షణలను అదుపు చేయడానికీ, శాంతి భద్రతలను పునరుద్ధరించడానికి తన శక్తి మేరకు చేయగల్గినదంతా చేసింది. 1968 జూన్ 9న నాగపూర్‌లో బుద్ధ జయంతి సందర్భంగా జరిగిన ఊరేగింపుపై రాళ్లురువ్విన ఫలితంగా ముస్లింలకు బౌద్ధులకు మధ్య పెద్ద ఘర్షణ చెలరేగింది. సుమారొక 29 మంది ప్రాణాలు కోల్పోయారు. పరిస్థితి అదుపు చేయడానికి ఆర్.యస్.యస్. నాయకులు బచ్‌రాజ్ వ్యాస్, సుందర్‌లాల్ రాయ్‌లు జోక్యంచేసుకొని, ఎంతో కృషిచేశారు. స్థానిక భారతీయజనసంఘ కార్యాలయంలో అఖిలపక్ష శాంతి సమావేశం జరిగింది. శాంతి సామరస్యాలను పునరుద్ధరించడంలో సహాయ పడినందుకు స్థానిక అధికారులు ఆర్. యస్. యస్. వారికి కృతజ్ఞతలు తెలియచేశారు.

1969 మే లో లక్నోలో షియా-సున్నీ కలహాలు చెలరేగి 13 మంది బలియై ఇమామ్ బరాన్ కూడ అవమానించబడినసందర్భంలో, రక్షణకోసం షియాలు ఆర్.యస్.యస్. వారివద్దకు పరిగెత్తుకు రాగా, వారికి రక్షణ కల్పించడం జరిగింది. షియాల నాయకుడు మౌలానా అలీ నసీర్ సయ్యద్‌తోపాటు నానా దేశ్‌ముఖ్ నగరమంతా తిరిగారు. శాంతి, న్యాయాలకోసం విజ్ఞప్తిచేస్తూ వారిరువురు పత్రికల సమావేశంలో సంయుక్తంగా ప్రకటన చేశారు.

ప్రభుత్వం మాత్రం ఆర్.యస్.యస్.ను అప్రతిష్ఠపాలు చేయడమేకాక ప్రభుత కార్యాలయాలలోను, బయట ఆర్.యస్.యస్. సభ్యులను ఇబ్బంది పెడుతూ వచ్చింది. హైకోర్టులన్నీ వరుసగా యీ నిరంకుశ ప్రభుత్వ చర్యలను తిరస్కరిస్తూవచ్చినాయి.

మందసౌర్‌లో వ్యవసాయశాఖలో గుమాస్తాగావున్న కిషన్‌లాల్ సేఠీని, అతడు ఆర్.యస్.యస్. సభ్యుడనే మిషమీద ఉద్యోగంనుంచి తొలగించారు. అది న్యాయవిరుద్ధమని 1955లోనే ఇండోరు-మధ్యభారత్ హైకోర్టుకు చెందిన న్యాయమూర్తులు వి. ఆర్. నెవాస్కర్, ఎస్. యం సాంవత్సర్ తీర్పు యిచ్చారు.

భారతదేశ విభజనకు, దేశంలో గోవధ కొనసాగుతూవుండటానికే ప్రధానమంత్రిదే బాధ్యత అన్నందుకు-1955లో ఆర్.యస్.యస్., జనసంఘ్, గోహత్యానిరోధ సమితిలలో సభ్యుడైన సీతారామ్ కిషోర్యూరియాను ప్రివెంటివ్ డిటె

ష్టేన్ చట్టం క్రింద అరెస్టుచేశారు. పాట్నా హైకోర్టుకు చెందిన న్యాయమూర్తులు సహాయ్, మిశ్రాలు అతనిని విడుదలచేస్తూ ఉత్తరువులిచ్చారు.

ఆర్.యస్.యస్. కార్యకర్త, పాట్నానుంచి వెలువడే 'హవధా' పత్రిక సంపాదకుడు అయిన శ్రీ ప్రభాకర శర్మ 19౬౬లో గోసంరక్షణను సమర్థనగా తీవ్రమైన వ్యాసం వ్రాశారు. క్రింది కోర్టు అతనికి ౬ నెలల కఠిన కారాగారశిక్ష రు. 500ల జరిమానా విధించింది.అతని విజ్ఞప్తిని స్వీకరించి పాట్నా హైకోర్టుకు చెందిన జస్టిస్ నక్వీయిమాం అతనిని విడుదలచేస్తూ యిలా అన్నారు: "ఇటువంటి ప్రజాస్వామిక దేశంలో కొంత వాక్స్వాతంత్ర్యం వుండటం అవసరం. రచయిత అభిప్రాయంలో అధికారులు (ప్రభుత్వంకాదు) దురుసుగా ప్రవర్తించి వుంటే ఆ విషయం వెల్లడించడానికి అతనికి పూర్తి హక్కు వున్నది. అతడు ఉపయోగించిన పదజాలం ఎక్కడయినా ఔచిత్యపు హద్దులు అతిక్రమించి వుంటే, పట్టించుకొనవలసింది ఆ పదాలనుకాదు. ఆ వ్యాసం, దాని శీర్షికతోపాటు మొత్తంగా కలగజేస్తే ప్రభావాన్ని మాత్రమే గమనించాలి. కనుక, రాజద్రోహకరమైన చర్య ఏమీలేదని నాకు సంతృప్తికలిగింది."

దీనిపై పాట్నాకు చెందిన సెర్చిలైట్ పత్రిక (మార్చి 10) "న్యాయం స్వయంగానే బహిర్గతమవుతుంది" అనే శీర్షికలో ప్రముఖంగా వ్యాసం ప్రచురిస్తూ "న్యాయమూర్తి యిమాం నిజంగానే ప్రభుత్వంయొక్క పరువు కాపాడారు. ఖైదీయే కనుక విజ్ఞప్తి సమర్పించివుండకపోతే ప్రజలదృష్టిలో ఆ పరువు పోయేదే. ఆ వివాదాస్పదమైన వ్యాసంలో జనరల్ డయ్యర్ గురించి, జలియన్ వాలాబాగ్ దురంతం గురించి ప్రస్తావించడం ప్రభుత్వ భావాలను గాయపరిచే వుంటుంది. కాని ఆ పోలిక అభిప్రాయానికి సంబంధించినది మాత్రమే" అని వ్రాసింది.

నాగపూరులో మధ్యప్రాంతం-బీరారు అకౌంటెంట్-జనరల్ కార్యాలయంలో శ్రీ భాస్కర గోవింద కేదార్ 1944 నుంచి యు. డి. గుమాస్తాగా పనిచేస్తున్నారు. 1948లో వారి ఉద్యోగాన్ని ధృవీకరించారు. అతనికి ఆర్.యస్.యస్.తో సంబంధాలు వున్నాయనే నెపంతో-1960లో-బలవంతంగా పదవీ

విరమణ చేయించారు. బొంబాయి హైకోర్టుకు చెందిన న్యాయమూర్తులు కొత్వాల్ అభ్యంకర్‌లు యీ ఉత్తర్వులను "చెడ్డవి"గా పేర్కొంటూ కొట్టివేశారు.

చింతామణ్ నర్గావ్‌కర్ 1957 నుంచి పూనాలో తపాలాశాఖలో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. అతడు విద్రోహచర్యలలో పాల్గొంటున్నాడంటూ 1961లో అతని ఉద్యోగాన్ని తీసివేశారు. ఆ విద్రోహ కారణాలు ఏమంటే-

1. నాగపూర్ తిలక్ విగ్రహంవద్ద సబ్-పోస్టుమాస్టరుగా వుంటున్న శ్రీ నర్గావ్‌కర్ ఆర్.యస్.యస్-తో సంబంధం కలిగివుండి దాని కార్యకలాపాలలో చురుకుగా పాల్గొంటున్నాడు;

2. 1957 నవంబరు 17న నాగపూర్ స్టార్కీ పాయింటువద్ద ఆర్.యస్.యస్. వారి విహారానికి (trip) హాజరయినాడు;

3. 1960 జనవరి 15న నాగపూర్ మెహితే మైదానంవద్ద ఆర్. యస్. యస్. వారి "సంక్రాంతి మహోత్సవం"లో పాల్గొన్నాడు; మరియు

4. 1960 జనవరి 28న నాగపూర్ ఆర్.యస్.యస్. కార్యాలయాన్ని సందర్శించాడు.

ఇటువంటి కారణాలమీదనే కాశీనాథ్ డిడోల్కర్‌ను కూడా ఉద్యోగం నుంచి తీసివేశారు.

బొంబాయి హైకోర్టు న్యాయమూర్తులు అభ్యంకర్, పాలేకర్‌లు సంయుక్తంగా తీర్పు యిస్తూ (1962 స్పెషల్ సివిల్ అప్లికేషను నెం. 22) ఆర్.యస్.యస్. న్యాయవిరుద్ధమైన సంస్థగా ప్రకటించబడలేదని అన్నారు. ఆర్.యస్.యస్.లో పాల్గొనటం, దానితో సంబంధాలు పెట్టుకొనడం విద్రోహచర్యలుగా పరిగణిస్తూ ఆరోపణలు చేసినవారు ఆ ఆరోపణలో ఆర్.యస్.యస్. కార్యకలాపాలేమిటో వెల్లడించలేదని అన్నారు.

"1957 నవంబరు 17న స్కార్కీ పాయింటు అనబడే చోట ఆర్.యస్.యస్. నిర్వహించిన విహారం (trip)లో చింతామణ్ పాల్గొన్నాడని తదుపరి

ఆరోపణ. ఈ ఆరోపణలో కూడ వివరాలు లేనందువలన ఆ ప్రిప్పు ఉద్దేశం ఏమిటో, ఒక పిక్నిక్‌కు హాజరయినంతమాత్రాన లేక దానితో సంబంధం పెట్టుకున్నంత మాత్రాన, లేక కేవలం స్టార్కీ పాయింటును సందర్శించినంతమాత్రాన అది విద్రోహ చర్య ఎందుకు అవుతుందో మాకు అర్థం కావటంలేదు.

"1960 జనవరి 14వ నాగపూర్ మెహితే మైదానంలో ఆర్.యస్.యస్. వారి సంక్రాంతి మహోత్సవంలో పాల్గొన్నాడని మూడో కారణంగా చెప్పబడింది. ఆ మాటకువస్తే ప్రతి హిందువు ఈ సామాజిక ఉత్సవాన్ని జరుపుకొనడమో అందులో పాల్గొనడమో చేస్తాడు. హిందువులు జరిపే యిలాంటి ఉత్సవాలు ఎంతో సెక్యులర్ స్వభావం కలవిగా వుంటాయని, యితర వర్గాలకు చెందినవారుకూడ యిందులో పాల్గొంటారని తెలిసినసంగతే. ఇలాంటి సంశయాతీతమైన సామాజిక మహోత్సవంలో పాల్గొనడం విద్రోహచర్యగా ఎందుకు భావించబడుతున్నదో అర్థంచేసుకొనడం నిజంగా చాల కష్టంగావుంది.

"చివరి కారణంగా 1960 జనవరి 23న నాగపూర్ ఆర్.యస్.యస్. కార్యాలయాన్ని సందర్శించాడని చెప్పబడింది. ఒక సంస్థయొక్క కార్యాలయాన్ని కేవలం సందర్శించినంతమాత్రాన అది విద్రోహచర్య అని నిర్ధారణకు రావడం ఎలా జరిగిందో యిక్కడకూడ అర్థం చేసుకొనడం కష్టంగా వుంది" అన్నారు.

రెండు పిటీషన్లను ఖర్చులతో అనుమతించడం జరిగింది.

జైకిషోర్ మెహ్రోత్రా, ఎం. కాం., 1953 నుంచి ఉత్తరప్రదేశ్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయంలో యు.డి.సి.గా పనిచేస్తున్నాడు. 1958లో అతని ఉద్యోగం ధృవీకరించబడింది. కాని అతడు "ఆర్.యస్.యస్. లో ఆరితేరిన సభ్యుడు" అనే విషయంమీద 1961 లో అతనిఉద్యోగాన్ని తీసివేశారు.

ఈ ఉత్తర్వులను 1963 లో త్రోసిపుచ్చుతూ అలహాబాద్ హైకోర్టుకు జస్టిస్ ఎస్.ఎస్. ద్వివేదీ యిలా అన్నారు : "రాష్ట్రీయ స్వయంసేవక సంఘం విద్రోహచర్యలలో నిమగ్నమైవున్నదని గాని, లేక సహేతుకంగా ఆ విధంగా అనుమానించ దగివున్నదని కాని లేక విద్రోహ చరలకు పాల్పడుతున్న యితరులతో సంబంధం కలిగివున్నదని గాని ఆరోపణలో ఎక్కడా చెప్పబడకపోవడం

గమనించవలసివుంది. అది చట్ట విరుద్ధమైన సంస్థ కాదని అంగీకరించబడింది. పిటిషనరు రాష్ట్రీయ స్వయంసేవక సంఘంలో సభ్యుడని భావించినాకూడ ఆ సంఘంలో సభ్యత్వం కలిగివున్నంతమాత్రాన అతడు విద్రోహచర్యలలో పాల్గొంటున్నాడనిగాని లేదా అలాపాల్గొన్నవారితో సంబంధం కలిగివున్నటనిగాని నిర్ధారించడానికి అవకాశంలేదు. అతడు 1957 నుంచి 1961 వరకు పాల్గొన్న సమావేశాలలో విద్రోహచర్యలు తలపెట్టబడినట్లు గాని, అందుకు పథకం వేయబడినట్లు గాని వివరాలలో ఆరోపించడమే జరగలేదు."

దీని తరువాత జోధ్‌పూర్‌లోని హైకోర్టు న్యాయమూర్తులు దావే, కాన్ సింగ్‌లు కూడా ఆర్.యస్.యస్. కార్యకలాపాలలో పాల్గొంటున్న ఆరోపణలపై కేదార్‌లాల్ అగ్రవాల్‌ను డిస్మిస్‌చేసిన ఉత్తర్వులు చెల్లవని తీర్పు యిచ్చారు. (రాజ్యాంగం 226 వ అధికరణం క్రింద 164 నాటి డి.బి. సివిల్ మిసిలేనియస్ రిట్ పిటిషన్ నెం. 393.)

మనోహర్ అంబోకర్ నాగపూర్ తంతి తపాలశాఖలో ఎల్.డి.సి. గా 1945 నుంచి పనిచేస్తున్నాడు. ఆర్.యస్.యస్. నాయకుడైన శ్రీ దత్తోపంత్ ఠేంగ్డే సభకు హాజరయినందుకు, గురుపూజా ఉత్సవంలో పాల్గొన్నందుకు. నాగపూర్ ఆర్.యస్.యస్. కార్యాలయాన్ని సందర్శించినందుకు బలవంతంగా అతని చేత పదవీ విరమణచేయించారు.

నర్గావ్‌కర్ కేసులో బొంబాయి హైకోర్టు తీర్పు యిచ్చిన కారణాలతోనే పంజాబ్ హైకోర్టులో జస్టిస్ హెచ్.ఆర్. ఖన్నా (వీరు తరువాత లాకమీషన్‌కు ఛైర్మను అయినారు) ఆ పదవీ విరమణ ఉత్తర్వులు చెల్లవని త్రోసిపుచ్చారు.

కర్ణాటక రాయచూరు జిల్లాలోని యెల్బుర్గకు చెందిన న్యాయవాది రంగనాథాచార్ 1965లో మున్సిఫ్‌గా ఎంపికయినారు. కాని ఆర్.యస్.యస్‌తో అతనికి సంబంధంవున్నదనే నెపంతో అతనికి నియామకపు ఉత్తరువులు యివ్వలేదు. "ఆర్.యస్.యస్. విధానాలు, సిద్ధాంతాలు విద్రోహకరమైనవని, రహస్యమైనవని, సెక్యులరిజానికి, రాజ్యాంగరీత్యా ఆమోదించబడిన భారత విభజనకు వ్యతిరేకమైనవని" కారణంగా చెప్పబడింది.

దీనిపై న్యాయమూర్తులు సదాశివయ్య, తుకోల్ యిలా అన్నారు : "పిటిషనరు తరఫున ఆర్.యస్.యస్. రాజకీయ సంస్థ కాదని, పూర్తిగా సాంస్కృ

తిక సంస్థ మాత్రమేనని అభిప్రాయం వ్యక్తం చేయబడింది. దీనికి సమర్థనగా రాజ్యసభలోని ప్రశ్నలు-సమాధానాల కాపీ ఒకటి చూపించారు. (1965 నవంబరు 27 నాటి రాజ్యసభ ప్రొసీడింగ్సు). ఎన్నికలలో పాల్గొనే ఏ రాజకీయపక్షలలో ప్రభుత్వోద్యోగులు చేరకూడదో అట్టి పార్టీల జాబితాలను ఎన్నికల కమిషనరు, లోక్‌సభ స్పీకరు తయారుచేశారని వాటిలో ఆర్.యస్.యస్. పేరులేదని దేశీయాంగ వ్యవహారాల శాఖలోని మంత్రి శ్రీ హాథీ చెప్పిన విషయం అందులో వుంది. ఆర్.యస్.యస్. కార్యకలాపాలలో రహస్యమైనదేమీ లేదని, హిందూ సంస్కృతిని వికసింపజేయడానికే దాని ఆశయాలు, లక్ష్యాలు ఉద్దేశించబడినవని, అది రాజకీయపక్షం కాదని, హైందవేతర సంస్థలపట్ల దానికి ఎట్టి విద్వేషము లేదని పిటిషనరు తరఫున న్యాయవాది వెల్లడించారు. ఆర్.యస్.యస్. నిబంధనావళిలోని 4వ అధికరణంలో సంఘానికి రాజకీయాలతో సంబంధంలేదని, సాంస్కృతిక కార్యానికి మాత్రమే అంకితమైవుంటుందని స్పష్టంగా పేర్కొనబడిందన్నారు. హింసాత్మకమైన, రహస్యమైన విధానాలు అవలంబించే ఏ రాజకీయ పక్షంలోను చేరకూడదని 4 (బి) అధికరణంలో స్వయంసేవకులను నిర్దేశించినట్లు అట్టి విధానాలను విశ్వసించటం లేక అందుకు విధేయులుగా వుండే వ్యక్తులెవరికీ సంఘంలో చోటులేదని స్పష్టంచేసినట్లు కూడ చెప్పబడింది. జాతీయ పతాకానికి విధేయుడై వుండటం, దానిని గౌరవించడం ప్రతిపౌరుని కర్తవ్యమని 5వ అధికరణంలో స్పష్టంగా పేర్కొన్న విషయాన్ని కూడ మా దృష్టికి తెచ్చారు. సంఘంవారి నిబంధనావళి ననుసరించి వారు ప్రకటించిన ఆశయాలు, లక్ష్యాలనుబట్టి చూస్తే ఆర్.యస్.యస్. కార్యకలాపాలు, సిద్ధాంతం విద్రోహకరమైనవని, రహస్యమైనవని, సెక్యులరిజానికి వ్యతిరేకమని కౌంటర్-అఫిడవిట్‌లో చేయబడిన ఆరోపణకు ఏవిధమైన ఆధారమూలేదని భావిస్తున్నాం."

ఎంపిక అయిన అభ్యర్థి కమ్యూనిస్టుఅని తరువాత తెలిసిన ఒక కేరళ కేసు విషయం ప్రాసిక్యూషన్ ప్రస్తావించింది. కాని ఒక కమ్యూనిస్టుకు అతని దేశంపట్ల వుండే సాధారణ విధేయతకంటె అతని కమ్యూనిజపు విశ్వాసం ప్రబలంగా వుంటుంది. ఆతడు ఏదయినా రహస్య సమాచారాన్ని కమ్యూనిస్టుకో, విదేశీ కమ్యూనిస్టు శక్తికో అందచేయడం సముచితంగా భావిస్తాడని నమ్మడానికి ఆస్కారంవుంది. ఇంగ్లండులో ప్రీవీ కౌన్సిలర్ల కాన్ఫరెన్సు కనుగొన్న పై పైనాన్ని న్యాయమూర్తులు ప్రస్తావించారు. ప్రభుత్వానికి విధేయత అత్యంత

ముఖ్యావసరంగా భావించబడే ఒకానొక ఉద్యోగంలో ఒక కమ్యూనిస్టు సిద్ధాంతాలను విశ్వసించేవారిని నియమించడం మంచిది కాదని ప్రభుత్వం నిర్ధారణకు వస్తే ఆ నిర్ణయాన్ని కోర్టు మార్చడంలోగాని, నియామకానికి ఉత్తర్వు చేయడం లోకాని ఔచిత్యంలేదనికూడ వారు అన్నారు. పైగా ఆ కేసులో సదరు అభ్యర్థికి సంబంధించిన ఫైలును న్యాయమూర్తుల ముందు వుంచగా దానిని పరిశీలించిన మీదట ప్రభుత్వ నిర్ణయానికి అసంబద్ధమైన కారణాలేవీ లేవని వారు సంతృప్తి చెందారు.

"మా ముందు వుంచబడిన ఆధారాలనుబట్టి చూస్తే కేరళ కేసులో ఒక కమ్యూనిస్టుకు వ్యతిరేకంగా చెప్పబడిన అంశాలు ప్రస్తుత పిటీషనరు విషయంలో వర్తిస్తాయని చెప్పలేము. పిటిషనరుయొక్క ప్రవర్తనలోగాని, అతని గత జీవనంలోగాని లోపంగా చెప్పదగినది మరొకటి ఏదయినా వున్నట్లు పేర్కొనబడలేదు.

"పైన పేర్కొన్న దానినిబట్టి చూస్తే, మున్సిఫ్ ఉద్యోగానికి పిటిషనరు అనర్హుడని ప్రభుత్వం భావించడానికి అతడు ఆర్.యస్.యస్. సభ్యుడయివుండటం, తన పట్టణంలో దాని శాఖను నెలకొల్పడంలో పాత్ర వహించడంవంటి అసంబద్ధ అంశాలమీద ఆధారపడిన అభిప్రాయం తర్కబద్ధంకాదు. కనుక అది కోర్టువారికి ఆమోదకరం కాదు".

1966 ఆగస్టు 31న ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు అప్పీలు చేసుకొనడానికికూడ ఈ యిద్దరు న్యాయమూర్తులు అనుమతి నిరాకరించారు.

రామ్ ఫాల్ పంజాబ్‌లోని జింద్‌లో ట్రెజరీ గుమాస్తాగా వుండేవాడు. అతడొక ఆర్‌యస్‌యస్ ర్యాలీలో పాల్గొన్నందుకు ఉద్యోగంనుంచి తొలగించారు. కేదార్‌లాల్ అగ్రవాల్ కేసులో రాజస్థాన్ హైకోర్టు తీర్పుయిచ్చిన కారణంమీదనే యీ కేసులో కూడా పంజాబ్ హైకోర్టుకు చెందిన జస్టిస్ పి.డి. శర్మ తొలగింపు ఉత్తరువులను కొట్టిపారేశారు. "ఆర్.యస్.యస్. రాజకీయ సంస్థఅని 3వ ప్రతివాది స్పష్టంగా పేర్కొని వుండవలసింది. పిటిషనరు ఆర్.యస్.యస్. లో సభ్యుడుగా వుండటం ద్వారా 22 వ నిబంధన క్రింద శిక్షార్హుడైన విధంగా అతడు

భారతదేశంలోని ఏ రాజకీయ ఉద్యమంలోనయినా పాల్గొంటున్నాడని, అందుకు సహాయంగా ఏదయినా చేస్తున్నాడనికాని నిర్ణయానికి రావడానికి దోహదంచేసిన ఆధారాలను కూడా ఆ ప్రతివాది వెల్లడించి వుండవలసింది." అని ఆయన తీర్పులో అన్నారు.

గుజరాత్ తలాజ లోని సివిల్ జడ్జి కోర్టులో గుమాస్తాగా పనిచేస్తున్న డి.బి. గోహెల్‌ను ఆర్.యస్.యస్. క్రియాశీల సభ్యుడైన కారణంమీద 1967 లో ఉద్యోగంనుంచి తొలగించారు. ఈ విషయంలో 1970 డిసెంబరు 4 న జస్టిస్.ఎ.డి. దేశాయి, జస్టిస్ ఎస్. హెచ్. సేత్ లు తీర్పుయిస్తూ "రూల్ 30 (i) (i) మేరకు ఆర్.యస్.యస్, రాజకీయ ఉద్యమమని నిరూపించబడితే తప్ప పిటిషనరు ప్రవర్తనకు ఆ క్లాజును వర్తింపజేయడం సాధ్యంకాదన్నారు. "సంస్థ యొక్క సిద్ధాంతాలను. ఆదర్శాలను, కార్యకలాపాలను పరిశీలించినమీదట అది రాజకీయ సంస్థో, కాదో నిర్ధారించగల విచారణాధికారి వద్దగాని, సంబంధిత అధికారి వద్దగాని అలా నిరూపించే ఆధారాలులేవు. ఆరకమైన పరిశీలన వారు చేయలేదు. ఈ కేసులో నమోదయిన సాక్ష్యాలప్రకారం ఆర్.యస్.యస్. రాజకీయ సంస్థగా నిరూపించబడలేదని అభిప్రాయపడుతున్నాం" అన్నారు.

ఆర్.యస్.యస్.తో సంబంధంకలిగివున్నాడనే మిషమీద ఉత్తరప్రదేశ్ లో రేవత్ ప్రకాశ్ పాండే అనే అసిస్టెంటు టీచరును డిస్మిస్‌చేసిన ఉత్తర్వులను అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తులు ఎస్. ఎస్. ద్వివేదీ, హెచ్.సి.పి. త్రిపాఠీలు 1974 జనవరి 19 న కొట్టివేశారు.

కె. దక్షిణామూర్తి కేసులో (ఎ.ఐ.ఆర్. 1967 పేజి 392) మద్రాసు హైకోర్టు యిలా అభిప్రాయపడింది. "వాది వ్రాసిన వివాదాస్పదమైన లేఖవలన అతని మనసులోని ఆంతరిక స్థితికి–అనగా ఒక రాజకీయ పక్షంపట్ల తీవ్రమైన మొగ్గుదల వున్నదనడానికి–'క్లూ' దొరికినట్లు ఆరోపణ చేయబడింది. ప్రజాస్వామిక వ్యవస్థలో తన దేశానికి ఒక ప్రత్యేకమైన రాజకీయపక్షం మంచి ప్రభుత్వాన్ని యివ్వడానికి అర్హత కలిగివున్నదనే ఆంతరిక విశ్వాసాన్ని ప్రభుత్వోద్యోగి కలిగి వుండకూడదని నిషేధించే నిబంధనయేదీ మాకు చూపించలేదు. తన విశ్వాసానికి అనుగుణంగా అతడు ఎన్నికలలో ఓటు చేయవచ్చు. ప్రజాస్వామిక

రాజ్యంలో రాజకీయ విశ్వాసం కలిగివుండే స్వేచ్ఛ పౌరుని ప్రాథమికహక్కు. ఆ రాజ్యానికి చెందిన ప్రభుత్వోద్యోగికి కూడ ఆ స్వేచ్ఛ వుంటుంది. కాకుంటే అతడికుండే ప్రత్యేక బాధ్యతల కారణంగా ప్రభుత్వానికి విధేయుడైన సేవకుడుగా అతడు నిర్వర్తించే అధికారిక బాధ్యతలకు ఆటంకం కలిగే విధంగాగాని తన అధికారిక హోదావలన అట్టి ప్రభుత్వోద్యోగం లేని పౌరులకంటే తనకు అనుచితమైన విశేష ప్రాధాన్యం కలిగేవిధంగా కాని తన విశ్వాసాలను అతడు బహిరంగంగా వ్యక్తం చేయడం నిషిద్ధం. పైన చెప్పిన ప్రవర్తనా నిబంధనలలో యీసూత్రంలోని విషయం యిమడ్చబడింది. కాని మళ్లీ స్పష్టంగా చెప్పాలంటే ప్రవర్తనా నిబంధనలలో అభ్యంతరకరంగా పేర్కొనబడిన ఏ పద్ధతిలోనయినా వ్యక్తం చేయబడనంత వరకు ఏ రాజకీయ పక్షంపట్ల నయినా ప్రభుత్వోద్యోగి మానసికంగా సానుభూతి కలిగివుండటాన్నేగాని, దానికి అనుకూలంగా మొగ్గు కలిగివుండడాన్ని నిషేధించే అంశమేదీ నిబంధనలలో లేదు".

అంతకు ముందు శ్రీ. గురూజీనే ప్రాసిక్యూట్ చేయడానికి ప్రభుత్వం ప్రయత్నించింది. 1954లో దర్భాంగాటౌన్‌హాలులో ఒక ప్రసంగం చేసినందుకు దర్భాంగా మున్సిఫ్ మేజిస్ట్రేటు కె.పి. సిన్హా ఐ.పి.సి. సెక్షన్ 153 ఎ క్రింద శ్రీ గురూజీకి రు. 500ల జరిమానా, చెల్లించని పక్షంలో ఆరునెలలు సాధారణ ఖైదు విధించాడు. దర్భాంగా సెషన్సు జడ్జి కె.కె. దత్తా యీ శిక్షను ధృవీకరించాడు. విషయాన్ని పాట్నా హైకోర్టుకు నివేదించడం జరిగింది. 1961 నవంబరు 24 న న్యాయమూర్తులు జి.ఎన్. ప్రసాద్, యు.ఎన్. సిన్హాలు పై తీర్పుకు వ్యతిరేకంగా యీ విధంగా ప్రకటించేరు : "భారత దేశపు విభిన్న వర్గాల పౌరుల మధ్య-ఒక హిందువులు మరొవంక ముస్లింలు, క్రైస్తవులు-వీరిమధ్య శత్రుత్వం లేక విద్వేషపుభావాలను రెచ్చగొట్టాలని వక్త ఉద్దేశించినట్లుగాని, లేక ఆ భావాలను రెచ్చగొట్టే యత్నం చేసినట్లుగాని కన్పడడం లేదని, ప్రసంగం యొక్క పూర్తిపాఠాన్ని పరిశీలించిన మీదట మేము అభిప్రాయపడుతున్నాం."

ఆర్.యస్.యస్. కార్యకర్తలకు వ్యతిరేకంగా ప్రభుత్వం తీసుకున్న చర్యలను యింతవరకు ఒక డజను హైకోర్టులు కొట్టివేసినప్పటికి, అందరూ కోర్టులకు వెళ్ళలేరని, వెళ్ళినా న్యాయం చేకూరడానికి కొన్ని సంవత్సరాలు పడుతుందని తెలిసిన ప్రభుత్వం తన ఉద్యోగులను యిబ్బందులకు గురిచేస్తూనే వుంది.

సేవలో స్వయంసేవకులు

సంవత్సరమంతా అహర్నిశలూ శాఖానిర్మాణంలోనే సంఘం నిమగ్నమై వుంటుంది సర్వసాధారణంగా. కాని దేశానికి ఎట్టి విపత్తు వాటిల్లినా-అది ప్రకృతి భీభత్సం కావచ్చు, మానవకృతం కావచ్చు-సహాయం అందించడంలో సంఘమే సర్వప్రథమంగా నిలుస్తున్నది.

1947-పాకిస్తానుగా మారనున్న ప్రాంతంనుంచి-ఆగస్టు 15కు ముందే శరణార్థుల ప్రవాహం బయలుదేరడంతో సంఘం తొలిసారిగా పెద్దయెత్తున సహాయకార్యక్రమాలకు నడుం బిగించింది. "ఆర్.యస్.యస్. హిందూసహాయతా సమితి"ని నెలకొల్పి ప్రభుత్వం కదలిరావడానికిముందే ఢిల్లీలో వేలాదిమంది శరణార్థులకు భోజన, వసతిసౌకర్యాలు కల్పించింది. వారి పునరావాసానికి సహాయపడేకృషిలో భాగంగా శరణార్థులందరికి ఒక ప్రశ్నావళికూడ యిచ్చి వారి గత జీవనంగురించి, వారుపొందిన శిక్షణగురించి వివరాలు సేకరించింది.

1950 తొలిరోజులలో తూర్పుపాకిస్తానునుండి శరణార్థులు ప్రవాహంగా వచ్చినపుడు ఆర్.యస్.యస్. వస్తుహార సహాయకసమితి నెలకొల్పి 30,000 శిబిరాలు నిర్వహించింది. శరణార్థులకోసం నిత్యం 'ముష్టిదానం' సేకరించడానికై కలకత్తాలో 5,000 కుండలు యిండ్లవద్ద ఏర్పాటుచేసింది.

1952లో రాయలసీమ తీవ్రమైన అనావృష్టికి గురిఅయింది. అక్కడ ప్రజలకు ఆహారదినుసులు సరఫరాచేయడానికి యాభైఆరు శిబిరాలు ఏర్పాటు అయినై. తరువాత ఈ సహాయకార్యక్రమాల నిర్వాహక ప్రముఖుడు శ్రీ అనంతాచారి నాటి మద్రాసు ముఖ్యమంత్రి రాజాజీని కలుసుకొన్నప్పుడు ఆసక్తికరమైన సంభాషణ జరిగింది:

రాజాజీ: ఇది హిందూసభవారి సహాయకార్యక్రమం, అవునా?

అనంతా: కాదండి మాకు హిందూమహాసభతో ఏవిధమైన సంబంధమూలేదు.

రా : మంచిది. మరి యీ కార్యక్రమం మీ రెందుకు చేపట్టినట్లు ?

అ : మా సోదరులు కష్టాల్లోవున్నారు. మేము సహాయం అందించేస్థితిలో వున్నాము. కాబట్టి పనిచేయడానికి సిద్ధంగాఉన్న అనేకమంది యువకుల అండవుండటం మాకున్న గొప్ప అదృష్టం. దాదాపుగా వందమంది ఆర్.యస్.యస్. కార్యకర్తలు తమ పూర్తిసమయాన్ని కేటాయించి యీ ప్రాంతంలో సహాయకార్యక్రమం నిర్వహిస్తున్నారు.

రా : కనుక వారికి పనియివ్వడానికి యీ కార్యక్రమం చేపట్టారన్నమాట.

అ : అది కారణంకాదు. ఈ పనిచేస్తూనే దీనితోపాటు మా మామూలు నిత్య కార్యక్రమాలు నిర్వహిస్తుంటాము. మా అసలుపని అదే.

రా : ఏమిటి మీరు నిర్వహించే కార్యక్రమాలు ?

అ : మేము ప్రతిరోజు బృందాలుగా సమావేశమవుతూంటాము. అప్పుడప్పుడు శిక్షణతరగతులుకూడ నిర్వహిస్తుంటాము.

రా : బాలురకు మీరు అనుదినం బోధించేదేమిటి ? కెమిస్ట్రీయా ? బాంబులు చేయడం కూడానా ?

అ : లేదులేదు. అది వట్టి మూర్ఖమైన అపోహమాత్రమే.

రా : మరి మీ నిత్యసమావేశాల్లో మీరు చేసేదేమిటి ?

అ : జీవితంపట్ల సాంఘికదృష్టి అలవరచడానికి దోహదంచేసే వివిధమైన శారీరక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటాము."

రా : సాంస్కృతిక కార్యక్రమాలా ? సంస్కృతి అంటే ఏమిటి ? కొంచెం వివరించండి.

అ : భారతదేశపు మౌలికసంస్కృతి ఉపనిషత్తుల వేదాంతమేనని నిరూపించిన వ్యక్తికి సంస్కృతిఅంటే ఏమిటో వివరించడం-నాబోటివారికి ఏవిధంగానూ సులభంకాదు.

(ఈ ప్రస్తావనకు రాజాజీ చిరునవ్వునవ్వారు. 'భారతదేశ మౌలిక సంస్కృతి : ఉపనిషత్తుల వేదాంతము' అనే గ్రంథానికి వారు రచయిత)

రా ; అయితే ఉపనిషత్తులు బోధిస్తారన్నమాట.

అ : అవునవును. ఉపనిషత్తులు. రామాయణ, మహాభారతాలలోని కథలు, జాతీయ మహాపురుషుల జీవితసంఘటనలు వివరిస్తుంటాం. స్వయంసేవకుల జాతీయ, వ్యక్తిగత సౌశీల్యాన్ని పెంపొందించడమే మా ప్రధాన ఆశయం.

రా : అయితే దేశంలోని చాల రాజకీయపార్టీలలో మీదీ ఒకటన్నమాట?

అ : మాది రాజకీయపార్టీకాదు. మేము వేరేవిధమైన పద్ధతిలో పనిచేస్తాం.

రా : ఏ రాజకీయపార్టీని మీరు సమర్థిస్తారు?

అ : ఫలానా పార్టీ అనిలేదు. మన సంస్కృతీ వికాసానికి దోహదంచేయని నియంతృత్వశక్తులకుమాత్రం మేము వ్యతిరేకులం. ఉదారవాదులైన ప్రజాస్వామికశక్తులను మేము ఆదరిస్తాం.

రా : ఈ రోజుల్లో ఏదయినా ప్రజాస్వామ్యంగానే చెలామణి అవుతున్నది. ఏమయినా మీ మాటలకు అర్థం మీరు కమ్యూనిస్టులకు వ్యతిరేకమని. అవునా?

అ : కమ్యూనిస్టు సిద్ధాంతానికి, వారి జీవనవిధానానికి మా ఆలోచన, జీవన విధానం వ్యతిరేక ధృవంవంటిదని అందరికి తెలిసిన విషయమే.

రా : ఈ ప్రాంతాల్లో మీకు తగిన బలం వున్నదా?

అ : ఆంధ్రలో మాకు బాగానే బలం వున్నది.

రా : శ్రీ గోళ్వాల్కర్ స్వయంగా యిచ్చిన సూచనలను అనుసరించే యీ సహాయకార్యక్రమాలను దిగారా?

అ : శ్రీ గురూజీ సమ్మతితోనే ఆంధ్ర ఆర్. యస్. యస్. యీ కార్యక్రమం చేపట్టింది.

1955లో పంజాబ్ వరదలకు గురియై విపరీతంగా నష్టపోయింది. తాము పంజాబీసుబా అడిగినందుకు ఆరుజిల్లాలను మొత్తంగా జలమయంచేయడానికి ప్రధాని నెహ్రూ బుద్ధిపూర్వకంగా కొన్ని ఆనకట్టలకు గండ్లువేయించారని అకా

లీలు నమ్మారు. కాని ఆర్. యస్. యస్. వారు మాత్రం సైన్యంకూడ చేరుకోన దానికిముందే యిక్కడ సహాయకార్యక్రమం ప్రారంభించింది. కర్నాల్‌లో గండ్లుపడిన పదికొండు ఆనకట్టలకు మరమ్మతుచేయడమేకాక, పానిపట్‌కు వరదలురాకుండా 15,000 ఇసుకబస్తాలు అడ్డువేశారు.

1955 చివరలో తమిళనాడును తుఫాను తాకి ఒక్కతంజావూరుజిల్లాలోనే 300 మందిని పొట్టనపెట్టుకుంది. మూడురోజులపాటు 2,000 కుటుంబాలకు ఆర్. యస్. యస్. భోజనవసతి కల్పించి 15,000 దుస్తులు పంచి యిచ్చింది.

1956లో కచ్ ప్రాంతంలోని అంజర్‌లో భూకంపం వచ్చింది. ఆర్. యస్.యస్. సహాయం యివ్వడానికి వెళ్ళింది. కొద్దిరోజుల తరువాత కొందరు కాంగ్రెసువారుకూడ వచ్చారు. 'ఇండియన్ న్యూస్ రివ్యూ'వారి కెమెరామన్ వచ్చినపుడుమాత్రమే వారు పనిచేస్తున్నట్లు ప్రదర్శన యిచ్చారు. అలా ఎందుకు చేస్తున్నారని అడిగితే వారు యిచ్చిన సమాధానం "ప్రజల జ్ఞాపకశక్తి తక్కువ కనుక రేపో, ఎల్లుండో మీ సహాయం వారు మరిచిపోతారు. కాని ఫొటోలవల్ల మాపేరు ఎప్పుడూ నిలుస్తుంది" అని.

1977లో ఆంధ్ర కోస్తాప్రాంతాన్ని భయంకరమైన తుఫాను తాకి 20,000 మందిని బలిగొన్నది. వందలకొలదీ శవాలు కుళ్ళిపోతు వివిధ దశలలో వున్నాయి. "ఆర్.యస్.యస్." పేరుకు ఎంతప్రాచుర్యం వచ్చిందంటే సహాయం కోరవచ్చిన గ్రామీణులను ఆకర్షించడానికి స్థానిక సి.పి.ఐ. కూడ ఒకదశలో తన శిబిరానికి "ఆర్.యస్.యస్." అని పేరు పెట్టింది.

శ్రీమతి గాంధీ ఆ ప్రాంతాన్ని సందర్శించినపుడు అక్కడ ఆర్.యస్. యస్. వారుమాత్రమే పనిచేస్తుండటంచూసి యిరకాటంలో పడిపోయారు. 1977 నవంబరు 27న భావదేవరపల్లి గ్రామంనుంచి 'సమాచార్' యిలా పేర్కొన్నది. "బాధితులను ఓదార్చడానికి శ్రీమతీ గాంధీ యిక్కడకు వచ్చారు. ఆమెకు, యితర కాంగ్రెసు ప్రముఖులకు యిక్కడ కనిపించిన విశేషం దిగ్భ్రిమ కలిగించి వుంటుంది. శవాలను, జంతు కళేబరాలను తీసి దహనంచేస్తూ ఆర్.యస్. యస్. వలంటీర్లు మాత్రమే కనిపించారు. ఆ ప్రాంతానికి చెందిన కాంగ్రెసు

సేవాదళ్ వారిలో ఒక్కరుకూడా అక్కరలేదు. 'వారంతా సురక్షితమైన ప్రదేశాల్లో తీరికలేకుండా వున్నారు' అని ఒక యూత్ కాంగ్రెసు కార్యకర్త చెప్పాడు".

"సేవా కార్యక్రమాలలో నిజమైన ధీరులు" అని మద్రాసుకు చెందిన 'ద హిందూ' పత్రిక. ఆర్.యస్.యస్. కార్యకర్తలను ప్రస్తుతించింది. ఆంధ్ర ప్రదేశ్ సర్వోదయ నాయకుడు శ్రీ ప్రభాకర్ ఎంతగా చలించిపోయారంటే "ఆర్.యస్.యస్. అంటే 'Ready for Selfless Service' (నిస్వార్థసేవకు సర్వదా సంసిద్ధులు) అని అభివర్ణించారు.

తుఫాను పీడితులకోసం ఆర్.యస్.యస్. ప్రేరణతో దీనదయాళ్ పురం పేర ఆదర్శ గ్రామాన్ని నిర్మించినపుడు ఆంధ్ర ముఖ్యమంత్రి డా॥ చెన్నారెడ్డి "ఆర్.యస్.యస్. కార్యకర్తల శ్రద్ధకు, సేవాతత్పరతకు" ఘనంగా నివాళులర్పించారు.

ఆర్.యస్.యస్. శిక్షణలోని విశిష్టత కారణంగా యీనాడు చాలమంది స్వయంసేవకులు తమకుతాముగా చిన్నవో, పెద్దవో సంక్షేమ పథకాలు చేపడుతున్నారు. 'టైమ్స్ ఆఫ్ ఇండియా'లో (1977 డిసెంబరు 2) మహాత్మగాంధి మనుమడు అరుణ్ గాంధి నివేదికలోఒక మంచి ఉదాహరణ వెలుగులోకివచ్చింది. "సాంగ్లీ జిల్లాలోని మహిసాల్ గ్రామంలో నిజంగానే సిలికన్నుల చిత్‌పావన్ బ్రాహ్మణుడొకరు హరిజనులకోసం పరిశ్రమిస్తున్నారు. తాను గాంధేయుణ్నని అతడు చెప్పుకొనడంలేదు. వాస్తవానికి కాలేజి చదువుకాగానే అతడు రాష్ట్రీయ స్వయంసేవక సంఘంలో చేరాడు.

"త్రింబక్ మహదేవ్ దేవల్-మహిసాల్ గ్రామంలో భూస్వామి. చదువు పూర్తిచేసుకుని తన అనువంశిక ఆస్తులను చూచుకొనడానికి తిరిగివచ్చిన అతడు హరిజనుల దారిద్ర్యంచూచి చలించిపోయాడు. వారికి సహాయం కావాలి. ఆ సహాయం యివ్వడానికి అతడు నిశ్చయించాడు. హరిజనులకోసం పనిచేయమని గాంధీజీ చెప్పారు కనుక కాదు. తన అంతరాత్మ ప్రబోధానికి తలవంచి మాత్రమే".

స్థానిక హరిజనులకోసం భూమి సంపాదించడానికి, వారు యిండ్లు కట్టుకొనడానికి, వారికోసం పశుశాల నిర్మించడానికి ఏవిధంగా శ్రమించాడో అరుణ్ గాంధీ సుదీర్ఘంగా వివరించారు. 1969లో రు. 44,000లు వున్న హరిజనుల ఆదాయం యీ కృషిఫలితంగా నేడు రు. 4,00,000 లకు మించి పెరిగింది. పదిహేను సంవత్సరాలలో యీ ప్రాంతం "నమ్మశక్యంకానివిధంగా రూపాంతరం పొందింది" అన్నాడు అరుణ్‌గాంధి ముగిస్తూ.

"మహాత్మాగాంధికి మహిసాల్ నిజమైన స్మారకంకాదా ? మనకు గాంధేయుల వర్గం ఒకటి కావలసివుండగా శ్రీ దేవల్ స్వచ్ఛమైన మచ్చుతునక కాదా ?" అని ప్రశ్నించారు.

సహాయ, పునరావాస కార్యక్రమాలకోసం శాశ్వత ప్రాతికమీద ఏర్పాట్లు చేసే వుద్దేశంతో ఇటీవలనే ఆర్.యస్.యస్. "సేవాభారతి" వ్యవస్థను స్థాపించింది.

'ఇలస్ట్రేటెడ్ వీక్లీ' సంపాదకుడు శ్రీ ఎమ్.వి. కామత్ ఇలా వ్రాశారు; "ఆర్.యస్.యస్. గురించి మీరు ఏమి అన్నా అనవచ్చు కాని, తమ జాతీయ సోదరులను సేవించవలసి వచ్చినపుడు వారు సంతోషంతో నడుంకట్టి పనికి దిగడానికి సంసిద్ధులుగా వుంటారు. అందుకు ప్రతిఫలం ఏమీ ఆశించరు 'వీక్లీ'లో ఫొటో అయినా వారు కోరుకోరు. అన్నివిధాలా వాళ్ళను నిందించండి, కాని అప్పుడప్పుడు మాత్రం కాస్త నిందించడం ఆపి, వారు చేసినదానికి కృతజ్ఞతలు చెప్పండి".

ఆర్తులకు సహాయ పునరావాసాలు కల్పించడానికి మాత్రమే ఆర్.యస్.యస్. సేవలు పరిమితం కాలేదు. స్వాతంత్ర్యంవచ్చిన తరువాత మనం పోరాడిన నాలుగు యుద్ధాల సమయంలో పోరాడుతున్న సైనికులకు అపార సహకారాన్ని అందించడంలో ఆర్.యస్.యస్. అగ్రగామిగా నిలిచింది.

1947 అక్టోబరులో కాశ్మీరు మహారాజు, షేక్ అబ్దుల్లా కూడా కాశ్మీర్ లోయ వదలిపోగా ఆర్.యస్.యస్. కార్యకర్తలు మాత్రం అక్కడే నిలిచిపోయారు. వారే జమ్మూ విమానాశ్రయాన్ని నిర్మించారు. శ్రీనగర్ విమానాశ్ర

యాన్ని విశాలం చేశారు. సైనికులకు కావలసిన మందుగుండు సామగ్రి తడవకుండా వీపులమీద మోస్తూ మధోపూర్‌వద్ద రావీనదిని దాటారు. కొన్నిచోట్ల పాకిస్తానీలు పెట్టిన అవరోధాలను తొలగించడంలో జవాన్‌లకు సహాయంచేశారు కూడాను.

గోవా విముక్తికోసం జరిగిన పోరాటంలో పాల్గొన్న సంఘనాయకులు శ్రీ వసంతరావు ఓక్ తుపాకి కాల్పులకు గాయపడ్డారు. శ్రీ జగన్నాథరావుజోషి పాంజిమ్ జైలులో అనేక సంవత్సరాలు బాధలు అనుభవించారు.

1954 ఆగస్టులో నానా కద్రేకర్, సుధీర్ ఫడ్కేల నేతృత్వంలో 200 మంది ఆర్.యస్.యస్. కార్యకర్తలు పోర్చుగీసుల స్థావరాలుగావున్న దాద్రా, నాగర్ హవేలీలను విముక్తంచేసి, రైఫిళ్ళు, బ్రెన్-గన్‌లు, స్టెన్-గన్‌లు కలిగివున్న 175 మంది సైనికులతో పోరాడారు.

1971లో పాకిస్తానీ విమానాలు బాగా దిగువకువచ్చి ద్వారకవద్ద ఓఖా రేవుపై బాంబులువేయాలని ప్రయత్నించినపుడు రెండు శాబర్ జెట్‌లను శ్రీ గణపతిభాయి లక్ష్మణభాయిభట్ కూల్చివేశారు. ఆహమ్మదాబాద్ సహార్ బజార్‌కాంప్‌వద్ద హనుమాన్ శాఖకు ముఖ్యశిక్షక్ అయిన గణపతిభాయి ఓఖాలో రాష్ట్ర రవాణా సంస్థ వర్క్‌షాపులో పనిచేస్తున్నారు. అంతకుముందు టెరిటోరియల్ ఆర్మీలో ఎయిర్ డిఫెన్స్ రెజిమెంట్ శిబిరంలో శిక్షణ పొంది వున్నారు. తనను అందరూ అభినందించగా "నా విద్యుక్తధర్మం నేను నెరవేర్చాను" అని యీ స్వయంసేవక్ వినయంగా అన్నారు. తరువాత ఆర్.యస్.యస్. కార్యకర్తలు పాకిస్తానీ విమానాలు రేపిన అగ్నిజ్వాలలను ఆర్పివేశారు.

సంఘం ఒక శక్తి ఉత్పాదనకేంద్రం అవుతుందని డా॥ హెడ్గెవార్ అన్నారు. విశుద్ధసౌశీల్యము, అకుంఠిత దేశభక్తి కలిగివుండే వ్యక్తులను అది రూపొందిస్తుంది. తాము ఏ కార్యక్రమంలో నిమగ్నమైవున్నా దానికొక క్రొత్త దిశను, శ్రేష్ఠతను చేకూర్చడం యీ వ్యక్తులవంతు అవుతుంది. కనుకనే సంఘం నుంచి స్ఫూర్తిని స్వీకరించిన అనేకమంది వ్యక్తులు వివిధ జీవనరంగాలతో సంబంధంకలిగిన అనేకరకాల సంస్థలను ప్రారంభించి వాటిలో నిమగ్నులై

వున్నారు. అయితే యీ సంస్థలన్నీ ఆర్.యస్.యస్.పై ఆధారపడకుండా స్వతంత్రంగా కొనసాగే సంస్థలు-హరిజనసేవక్ సంఘ్, ఖాదీ-గ్రామోద్యోగ సంఘ్. నయీతాలిమ్ మొదలైన సంస్థలు గాంధీజీనుంచి స్ఫూర్తి స్వీకరించినప్పటికీ కాంగ్రెసుమీద ఆధారపడకుండా పూర్తిగా స్వతంత్రంగా నడిచినట్లు.

బహుశా వీటన్నింటిలో పాతది రాష్ట్రీయ సేవికా సమితి అనవచ్చు. ఇది ఆర్.యస్.యస్. తరహాలో స్త్రీలకోసం ఏర్పడిన సంస్థ. "మౌసీజీ"గా పేరు పొందిన శ్రీమతి లక్ష్మీబాయి కేల్కర్ 1936లో డా॥ హెడ్గేవార్‌ను సంప్రదించారు. ఆమె కుమారుడు సంఘ స్వయంసేవక్. ఆర్.యస్.యస్.లో తమకు కనిపించినదానికి ఆమె ఎంతో ముగ్ధురాలయి వారు, స్త్రీలకుకూడా అలాంటిసంస్థ వుండాలనుకున్నారు. ఆ ప్రతిపాదనకు డాక్టర్‌జీ చాల సంతోషించారు. కాని స్త్రీలను సంఘటితం చేయడంలో ఆమె కుమారుడి సహకారాన్ని అయినా డాక్టర్‌జీ ఆమెకు అందనివ్వలేదు. ఎప్పుడు ఏ అవసరంవచ్చినా పెద్దవారయిన అప్పాజీ జోషీని మాత్రమే సంప్రదించవలసిందిగా ఆమెకు చెప్పారు. డాక్టర్‌జీ ఆమెతో అన్నారు :" సంఘము—సమితి సమాంతరరేఖలలోనే పనిచేయాలి. అఖరికి రైలుపట్టాల మాదిరిగా అనంతదూరంలోకూడా అవి ఎన్నడూ కలుసుకోకూడదు".

స్వాతంత్ర్యం వచ్చినతరువాత, ఆర్.యస్.యస్. నిజానికి నిషేధంలోనే వుండగా, సంఘస్ఫూర్తిపొందిన వ్యక్తులు స్థాపించిన మొట్టమొదటి సంస్థ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్. ఇండియాను 'భారత్' అని మాత్రమే పిలవాలని, హిందీని రాష్ట్రభాషగా ఆమోదించాలని, వందేమాతరాన్ని జాతీయగీతంగా స్వీకరించాలని కోరుతూ 50,000 మంది విశ్వవిద్యాలయ విద్యార్థులు సంతకంచేసిన విజ్ఞాపనపత్రాన్ని రాజ్యాంగ శాసనసభకు సమర్పించడంతో దాని కార్యక్రమం మొదలయింది. సంవత్సరాలు గడిచినకొద్దీ అది యెంత శక్తివంతంగా తయారయిందంటే ఎమర్జెన్సీ విధించబడేనాటికి ఢిల్లీ, బెనారస్, ఆంధ్ర-అలహాబాద్, బెంగుళూరువంటి ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాలతో సహా దేశంలోని సగానికి పైగా విశ్వవిద్యాలయాల సంఘాలను కైవసం చేసుకుంటూ నిలిచింది. 1977లో యింకా ఘనతరమైన విజయాలు సాధించింది. అయితే కొన్ని సంవత్సరాలపాటు

నివిధమైన ఎన్నికలలో పాల్గొనకూడదని ఆ మహాసభ సంవత్సరం నిర్ణయించింది. ఎన్నికలవల్ల విద్యార్థులలో విభేదాలు ఏర్పడటమేగాక మరింత ముఖ్యమైన కార్యాలపట్ల శ్రద్ధవహించడానికి వీలులేకుండా పోతున్నదని భావించింది.

1974-74 లలో గుజరాత్, బీహార్ ఉద్యమాలు రెండింటిలోను ఎబివిపి ప్రముఖపాత్రవహించవలసిందిగా జయప్రకాష్‌ను కోరి ఒప్పించింది. ఎమర్జెన్సీ కాలంలో 450 మంది ఎ.బి.వి.పి. కార్యకర్తలను, 'మీసా' క్రింద నిర్బంధించారు. మరో 4000 మంది సత్యాగ్రహంచేసి డి.ఐ.ఆర్. క్రింద అరెస్టు అయినారు.

"అంతరాష్ట్రజీవనంలో విద్యార్థుల అనుభవం" అనే కార్యక్రమాన్ని ఎ.బి.వి.పి. నిర్వహిస్తున్నది. ఆగ్నేయభారతంనుంచి ఎందరో గిరిజన విద్యార్థులకు బొంబాయి మొదలైన నగరాలకు తెచ్చి "భారతదేశమే నాయిల్లు" అనే కార్యక్రమంక్రింద వారిని స్థానిక కుటుంబాలతో కలిసిమెలిసి జీవించేటట్లు చేస్తున్నది. ప్రథమశ్రేణిలో ప్రథములుగా వచ్చినవారికి విద్యార్థిపరిషత్ బహుమతులిస్తున్నది. బుక్ బ్యాంకులు, రక్తనిధులు నిర్వహిస్తున్నది. దానికి అనుబంధంగా వృత్తిమార్గదర్శన విభాగం, సెలవుల వినియోగ విభాగం, విద్యార్థుల గ్రామ పునర్నిర్మాణపథకం వున్నాయి.

ఈనాడు విద్యార్థిపరిషత్ దేశంలోకెల్లా పెద్దదయిన విద్యార్థిసంస్థ. పైగా విద్యార్థి సంస్థలన్నిటిలో అత్యుత్తమమైనదికూడా. కొంతకాలంక్రిందట ఎ.బి.వి.పి. ప్రముఖకార్యకర్తలు కొందరు తమ ఉత్సవం ఒకదానికి అధ్యక్షతవహించమని మీరట్ విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్‌ను ఆహ్వానించారు. ఆ వైస్‌ఛాన్సలర్ ఏమంత స్నేహపాత్రుడుకాదని అందరూ అనుకుంటుండేవారు. కాని ఎ.బి.వి.పి వారు అడిగినదే తడవుగా అందుకు ఆయన సమ్మతించారు. "ఈరోజుల్లో విద్యార్థినాయకులు ఎంతో దురుసుగా వుంటున్నారు. కాని మీ విషయంవేరు. మీరెంతో మధురస్వభావం కలవారు, వినయశీలురు. తప్పకుండా వస్తాము" అన్నారు.

ఆర్. యస్. యస్. నుంచి ప్రేరణపొందిన మరొక మహాసంస్థ భారతీయ మజ్దూర్‌సంఘ్. కేరళ, బెంగాల్‌లలో అంతకుముందు ఆర్.యస్.యస్. ప్రచారక్‌గా పనిచేసిన దత్తోపంత్ ఠేంగ్డే దీనిని నిర్వహిస్తున్నారు.

ఐ.ఎన్.టి.యు.సి. నాగపూర్ శాఖలో పనిచేసిన రోజుల్లో శ్రీ ఠేంగ్డే ట్రేడ్ యూనియన్ నిబంధనలలోని మెలుకువలు ఆపోశనపట్టారు. తరువాత ఐ.ఎన్.టి.యు.సి. నాగపూర్ శాఖను వదలివేసినపుడు వారికి హృదయపూర్వకమైన వీడ్కోలు యివ్వబడింది.

ఆటుపై ఉత్తరప్రదేశ్‌కుచెందిన కార్మికమహానాయకుడు దాదా వినయ కుమార్ ముఖర్జీ, రామనరేష్‌సింగ్, ఎన్.సి. గంగూలీ, బి.యన్. సాఠే, తదితరులతో కలిసి భారతీయ మజ్దూర్‌సంఘ్‌ను స్థాపించారు.

బి.యమ్.యస్. ఆందోళన విధానాలకు మాత్రమే పరిమితం కాలేదు. కార్మికుల సమస్యలగురించి మౌలిక పరిశోధనకు పూనుకున్నది. ఉదాహరణకు శ్రీ ఠేంగ్డే సంకలనంచేసిన "ప్రాచీన భారతంలోని కార్మికశాసనాలు" ఆధునిక గ్రంథాలతో సరితూగే అభ్యుదయకరమైన గ్రంథంగా గుర్తించబడింది.

మే 1కి బదులుగా విశ్వకర్మ జయంతిని కార్మికదినంగా పరిగణిస్తూ బి.యమ్.యస్. కార్మికోద్యమానికి జాతీయదృక్పథాన్ని యిచ్చింది. ఐ.ఎన్.టి. యు.సి., ఎ.ఐ.టి.యు.సి.లు వచ్చిన ఎన్నో సంవత్సరాల తరువాత రంగప్రవేశం చేసినప్పటికీ భారతీయ కార్మికప్రపంచంలోని ప్రముఖసంస్థగా నేడు బి.యమ్. యస్. స్థానం సంపాదించుకున్నది.

ఆదేవిధంగా శ్రీ గురూజీనుండి స్ఫూర్తిపొందిన శ్రీ రమాకాంత్ కేశవ దేశపాండే మధ్యప్రదేశ్‌లోని జాష్‌పూర్‌లో వనవాసులకోసం కళ్యాణఆశ్రమం ప్రారంభించారు. నేడు కళ్యాణ ఆశ్రమానికి కొన్నివందల కేంద్రాలు వున్నాయి. శ్రీ దేశపాండేతోపాటు ఉద్దండుడైన రామ్‌భావు గోడ్బోలేతోసహా వందలాదిమంది కార్యకర్తలు యీ కార్యక్రమంలో నిమగ్నమైవున్నారు.

1977లో గిరిజన ప్రాంతాలను సందర్శించిన ప్రధాని మొరార్జీదేశాయి ఆశ్రమం చేస్తున్న పనినిచూసి ఎంతగానో ముగ్ధులయినారు.

కళ్యాణ ఆశ్రమం కేవలం విద్య, వైద్యాలకుమాత్రమే పరిమితమై పని పనిచేయడంలేదు. పట్టణవాసులపట్ల నమ్మకం లేకపోవడం వనవాసుల ఏకైక

ప్రధాన సమస్య అని శ్రీ గోడ్‌బోలే భావిస్తున్నారు. పట్టణవాసులు ఋణదాతలుగా, అధికారులుగా తమను అన్నివిధాలా మోసం చేయడం వారికి అనుభవం. చట్టప్రకారం గిరిజనేతరులకు లభ్యంకాని భూమికోసం కొందరు గిరిజనబాలికలను తమ రెండవ భార్యలుగా స్వీకరించి గిరిజన భూములను కొనివేయడం ఆశ్రమం వారి దృష్టికి వచ్చింది. పోతే విదేశీ మిషనరీల బెడద వుండనే వుంది. ఈ సవాళ్లు అన్నిటిని సంఘటిత కృషిద్వారా ఎదుర్కొనడానికి కళ్యాణ ఆశ్రమం ప్రయత్నిస్తున్నది.

హిందూమతంలో చర్చి వ్యవస్థవంటిది లేదు. కాని ఆచారాలను, కర్మకాండలను పునఃపరిశీలించవలసిన అవసరం అప్పుడప్పుడు ఏర్పడుతూనేవుంటుంది. అందువలన శ్రీ గురూజీ సలహా ననుసరించి ధార్మిక నాయకులు, సంస్కర్తలు కలిసి వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా దాదా అప్టే సహకారంతో విశ్వహిందూ పరిషత్ స్థాపించారు.

1979 జనవరిలో విశ్వహిందూ పరిషత్ ప్రయాగలో నిర్వహించిన విశ్వ హిందూ సమ్మేళనం బహుశా ఎన్నడూ, ఎక్కడాజరగనంత పెద్ద హిందూ సమావేశం అనవచ్చు. 25 దేశాలనుంచి ప్రతినిధులు, హిందూ ధార్మిక నాయకులు అందులో పాల్గొన్నారు. వచ్చిన వారిలో సనాతనులు, ఆర్యసమాజ్ వారు, శిఖ్ఖులు, జైనులు, బౌద్ధులు, లింగాయతులు మొదలయినవారు వున్నారు. ఉదయపూర్‌కు చెందిన మహారాణా భగవత్‌సింగ్ అధ్యక్షత వహించారు. అంటరానితనానికి వ్యతిరేకంగా ఈ సమ్మేళనం తీర్మానం అమోదించడం హిందూ ధార్మిక చరిత్రలోనే అపూర్వ విప్లవం అనదగి వుంది.

ఈ తీర్మానంపై కర్నాటక పెజావరు మఠానికిచెందిన స్వామి విశ్వేశ్వర తీర్థ మాట్లాడుతూ "జగద్గురువులు 'జగత్తు'పట్ల శ్రద్ధ వహించాలి. 'జగత్తు'లో హరిజనులు కూడా వున్నారు." అన్నారు. స్వామి చిన్మయానంద మాట్లాడుతూ "హిందువులను హిందూత్వంలోకి మారుద్దాం, ఆపైన అంతాసవ్యంగానే వుంటుంది. అన్నారు. "ఇంతవరకు ఎన్నడూ ఎవరూ చేయని మహాకార్యాన్ని విశ్వహిందూ పరిషత్ చేస్తున్నది" అని బద్రీనాథ్ జ్యోతిషపీఠ జగద్గురువు స్వామి శాంతానందులు ప్రశంసించారు.

సమ్మేళనంలో పాల్గొన్న ధర్మాచార్యులు హిందువులందరి కోసం ఒక సర్వత్రా ఆచార సంహితను (నియమావళిని) రూపొందించారు.

అన్ని వర్గాలకు చెందిన హిందువులు సూర్యప్రణామం చేయాలనీ, భగవద్గీత చదవాలని, అనుదినం ప్రార్థన చేయాలని ఈ సంహితలో ఆదేశించారు.

ఇళ్లలో తమ ఇష్టదైవం యొక్క చిత్రాన్నో, మూర్తినో వుంచుకొనవచ్చునని అనుమతించడం జరిగింది. 'ఓం' చిహ్నన్ని (గొలుసులోనో, త్రాడులోనో) వారు ధరించాలని. తమడైరీలోను, విజిటింగ్ కార్డులమీద, తాము వ్రాసే లేఖం మీద, 'ఓం' వ్రాయాలని ఆదేశించారు.

చివరి ఆదేశంగా హిందువులంతా తమ ఇళ్లలో తులసి మొక్కను పెంచాలని కోరారు.

నేడు విశ్వ హిందూ పరిషత్ అభాగ్య, పీడిత జనానీకం యొక్క ఉపయోగానికై 300 పైగా సంఘ సేవా కేంద్రాలను నడుపుతున్నది. ఈ కార్యక్రమాన్ని ప్రధాన కార్యదర్శి రాజభావు దిగ్వేకర్, సేవాతత్పరులైన వారి సహకార్యకర్తల బృందం పర్యవేక్షిస్తున్నారు.

వివేకానంద శతజయంతి సమీపించినపుడు, దానిని చిరస్మరణీయంగావిస్తూ పెద్ద యెత్తున ఉత్సవం జరపాలని నిర్ణయించబడింది. ఆ ప్రకారమే ఆర్.యస్.యస్.కు చిరకాలం సర్ కార్యావాహగా పనిచేసిన శ్రీ ఏకనాథ్ రానడే సంఘటనా కార్యదర్శిగా పార్టీలతో సంబంధం లేని "వివేకానంద శిలా స్మారక సమితి" ఆవిర్భవించింది. స్వామీజీ చికాగో విశ్వమత మహాసభకు వెళ్లే ముందు భారతమాత భవిష్యత్తు గురించి కన్యాకుమారివద్ద ఏ శిలపై ధ్యాన నిమగ్నులయినారో, ఆ శిలపై ఘనమైన స్మారకాన్ని 'సమితి' నెలకొల్పింది.

అక్షరాలా లక్షలాది మంది విద్యార్థుల నుంచి ఒక్కొక్క రూపాయి వంతున నిధిని సేకరించడం ఈ స్మారక నిర్మాణంలో ఒక విశిష్టమైన అంశం. అమెరికాలో లిబర్టీ విగ్రహానికి వున్నంతగా భారతదేశంలో ఈ స్మారకం ప్రాధాన్యత సంతరించుకున్నది.

ఇటీవల తన కార్యకలాపాలను సమితి విస్తరించింది. చక్రాని శి
పొందిన తరువాత తమ జీవితాలను ప్రధానంగా హరిజన, గిరిజన, వనవా
సేవలో ప్రశాంత నిర్మాణాత్మక కృషితో ధారపోసే వందలాది మంది స్త్రీ
షులను ప్రతి సంవత్సరం నిర్మాణం చేస్తున్నవి.

అన్నిటికి మించి ఆర్.యస్.యస్. నుంచి స్ఫూర్తి పొందిన ప్రజా
తత్పరులు విద్యారంగంలో గుణాత్మకమైన అభివృద్ధి సాధించడానికి తమ సమ
యాన్ని, శక్తులను సమర్పిస్తున్నారు. విద్యాభారతికి అనుబంధంగా 70 శిశు
మందిరాలను నేడు వారు నడుపుతున్నారు. వీరిలో కొందరు కురుక్షేత్ర,
ఢిల్లీ, బెంగుళూరులలో నడుపుతున్న పాఠశాలలలో ఎంత ప్రతిష్ఠ గడించి
వీటిలో ప్రవేశానికి మంత్రులు రికమండేషన్ చీటీలు పంపుతున్నారు. 1978
అంతర్జాతీయ బాలల సంవత్సరంలో దేశమంతట నుంచి వచ్చిన 9-11 సం
రాల వయసు గలిగిన 15000 మంది బాలలతో 'విద్యాభారతి' ఢిల్లీలో 'శి
మం' నిర్వహించింది. కనుల పండువు కలిగిస్తూ, క్రమశిక్షణతో జరిగిన, అంత
బృహత్తరమైన కార్యక్రమం ఎన్నడూ చూచి యెరుగం.

ఆర్.యస్.యస్. వారు చేపట్టిన మరొక పెద్ద సంస్థ-దీనదయాళ్ పరి
శోధనా సంస్థ. "పరిపూర్ణ స్వయంసేవక్" అని బాలాసాహెబ్ దేవరస్ చేత
కొనియాడబడిన పండిత దీనదయాళ్ ఉపాధ్యాయ పవిత్ర స్మృతికి సంస్థ
స్మారకంగా రూపొందింది. భారతీయ జనసంఘ్‌కు అధ్యక్షుడుగావుండగా 1968
ఫిబ్రవరిలో అనుమానాస్పదమైన పరిస్థితిలో పండిట్ జీ మరణించారు.

ఈ సంస్థ నేడు ఆలోచన రేకెత్తించే 'మంథన్' అనే పత్రికను ఇంగ్లీషు,
హిందీ భాషలలో ప్రచురిస్తున్నది. వీరి వివేకానంద మెడికల్ మిషన్ ఆధ్వర్యంలో
లోని ఔషధనిధి నుంచి దేశమంతటాగల 35 సంస్థలకు మందులు సరఫరా అవు
తున్నాయి.

ఆంధ్రలో పెనుతుపాను తరువాత మూలపాలెం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా
పూర్తిగా పునర్నిర్మించి దీనదయాళ పురమని పేరు పెట్టింది. ప్రస్తుతం ఉత్తర
ప్రదేశ్‌లోని గోండా జిల్లాలో ఒక బ్రహ్మాండమైన పథకంలో నిమగ్నమైవుంది.

వివిధ నిర్మాణాత్మక కార్యక్రమాల ద్వారా అయిదు సంవత్సరాలలో స్థానికుల నికర ఆదాయాన్ని ద్విగుణీకృతం చేయాలని తలపెట్టింది. రెండు సంవత్సరాల కాలంలోనే జిల్లాలో 25,000 గొట్టపు బావులు త్రవ్వింది.

కార్యదర్శిగా డా॥ జె. కె. జైన్, డైరెక్టరుగా శ్రీ పరమేశ్వరన్‌ల సమర్థవంతమైన సహకారంతో ఈ దీనదయాళ పరిశోధనా సంస్థను నానా దేశ్ ముఖ్ పర్యవేక్షిస్తున్నారు

1978లో ఆర్.యస్.యస్. పెద్ద యెత్తున వయోజన విద్యా పథకాన్ని చేపట్టి, దీనికి తోడుగా 'రాష్ట్రీయ సంస్కార, సేవాయోజన'ను చేర్చింది. దేశమంతటా యిప్పటికే 1500 కేంద్రాలను యిది నడుపుతున్నది.

దీనికై ప్రభుత్వం నుంచి 200 కోట్ల రూపాయలను ఆర్.యస్.యస్. స్వీకరించిందని వ్యతిరేకులు అన్నారు. నిజానికి ప్రభుత్వం నుంచి ఒక పైసా సహాయాన్నయినా ఆర్.యస్.యస్. అడగటం గాని, వారు యివ్వడంగాని జరుగలేదు, "చదవటం వ్రాయటం మేము నేర్పుతున్న మాట నిజమే. కాని అంతటితో ఆగటం లేదు. వారికి పరిశుభ్రత గురించిన ప్రాథమిక అంశాలు బోధిస్తున్నాం. వారిలో దేశభక్తిని మేలుకొలుపుతున్నాం. తమ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకొనడం ఎలాగో చెప్తున్నాం. మా లక్ష్యం అక్షరాస్యులుగా చేయటం మాత్రమే కాదు. వారిలో ఆత్మ విశ్వాసాన్ని భవిష్యత్తుపట్ల ఆశను చిగురింపజేస్తున్నాం. అన్ని విధాలా వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలనేదే మా అభిలాష" అని ఈ కార్యక్రమానికంతటికీ నిర్వాహకుడుగా వున్న ప్రొ॥బి.యస్. వరాట్ పాండే అంటారు.

బిందుమాధవజోషి నాయకత్వంలో వినియోగదారుల ఉద్యమాన్నికూడ ఆర్.యస్.యస్. కార్యకర్తలు ప్రారంభించారు. వారి 'గ్రాహకపంచాయత్' యిప్పటికే పూనాలో అద్భుతమైన ఫలితాలుయిచ్చి యితరరాష్ట్రాలకుకూడ కార్యక్రమం విస్తరింపజేస్తున్నది. ఈ సంస్థ సేవలను జె.పి., చాగ్లా మొదలయిన నాయకులు ప్రశంసించారు.

చివరగా 1978లో శ్రీ దత్తోపంత్ ఠేంగ్డే స్థాపించిన భారతీయ కిసాన్ సంఘ్ గురించి చెప్పవలసివుంది. ఉత్తరప్రదేశ్‌లో అపర్యసహకార క్షేత్రాన్ని నడుపుతున్న శ్రీ పురుషోత్తమదాస్ భాటియా భారతీయ కిసాన్‌సంఘ్ తాలిసాధారణ మండలి సమావేశానికి (1979 మార్చిలో కోటలో జరిగినపుడు) అధ్యక్షత వహిస్తూ స్వాతంత్ర్యం వచ్చినతరువాత 25 సంవత్సరాలుగా వ్యవసాయరంగం ఏవిధంగా దెబ్బతిన్నదో వివరించారు. "1953, 1954లలో ఎన్నడూలేనంతగా ఆహారధాన్యాల ఉత్పత్తిపెరిగి వాటిధరలుతగ్గుముఖంపట్టినై. ఫలితంగా 1955లో గోధుమలధర 1950 నాటిధరలో మూడోవంతుకు పడిపోయింది. గోధుమలధర 1955తో ఆర్థికప్రయోజనానికి విరుద్ధమైన స్థాయికి పడిపోయినపుడు ఉత్పత్తికి తగిన గిట్టుబాటుధర రైతులకు లభించేటట్లు చూడటం ప్రభుత్వంయొక్క బాధ్యత. కాని ప్రభుత్వం యీ పనిచేయకపోగా అమెరికానుంచి పెద్దయెత్తున గోధుమలు దిగుమతిచేయడం మొదలుపెట్టింది. ఉత్పత్తిదశలోను, ఎగుమతిదశలోను రెండ్లుమార్లు అమెరికాలో సబ్సిడీపొందిన యీ గోధుమలను భారతప్రభుత్వం చౌకధరల దుకాణాలద్వారా అమ్మించి యింకొకమారు సబ్సిడీ యిచ్చింది. ఇది తలక్రిందు పద్ధతి. రక్షణవిధానంగావుంది. ఇది నిజానికి భారతీయరైతుల వెన్నెముకను విరిచి, భారతదేశంలో వ్యవసాయరంగానికి పెద్దనష్టానికి హేతువయింది."

గాంధీజీ 1935 మార్చి 1 నాటి "హరిజన" పత్రికలో "భారతీయ" ఆర్థిక నీతిగురించి చెప్పిన ఎన్నో విషయాలను శ్రీ భాటియా సభాసదులకు గుర్తుచేశారు: "ఆర్థిక సూత్రాలు గణితసూత్రాలవంటివికాదు. గణితసూత్రాలు సకాలంలోను, ఏ సమయంలోను మారేవికాదు. ఆర్థికనీతిలో అమెరికా విధానాన్ని జర్మనీకాని, జర్మనీ విధానాన్ని ఫ్రాన్స్‌గాని, ఫ్రాన్సువిధానాన్ని యింగ్లండుకాని ఆమోదించవు. ఒకవేళ ఆమోదిస్తే అది పొరపాటే అవుతుంది. ఖనిజాలుమాత్రమే ఉత్పత్తిచేస్తూ ఆహారధాన్యాలు ఉత్పత్తిచేయని దేశంయొక్క ఆర్థికవిధానం: ఆహారధాన్యాలు ఉత్పత్తిచేస్తూ ఖనిజాలుమాత్రం ఉత్పత్తిచేయని దేశంయొక్క విధానానికి విభిన్నంగా వుండితీరాలి. కనుక ఫ్రాన్సు, ఇంగ్లండు, అమెరికా జర్మనీల ఆర్థిక విధానాలను భారతదేశంఅవలంబించడంవల్ల కానిపని. భారతదేశం ఒకప్పుడు బంగారునేల.- చాలా బంగారం ఉత్పత్తిచేసిందనికాదు-బంగారంలాంటి కళలకు నిలయంగా వుండేది. భారతదేశం ఎంతశ్రేష్టమైన వస్త్రాలను, వస్తువులను ఉత్పత్తి

చేసిందంటే వీటికిఅన్యదేశాలవారు బంగారంతో వెలకట్టి తీసుకునేవారు. ఈ గౌరవ ప్రదమైన స్థానాన్ని నేడు మనం కోల్పోయి నేడు వట్టి కట్టెలు కొట్టేవాళ్లం, కావళ్లమోసేవాళ్లంగా తయారయినాం. మన సహజవనరుల కారణంగా, చైనా తప్ప మరేదేశానికిలేనంత మానవసంపద కారణంగా, నేటికీ మనం మన వెనుకటి గౌరవనీయస్థానాన్ని తిరిగి సంపాదించుకొనగల స్థితిలో వున్నాం. కోట్లాది మానవులే సంపదగా గలిగినమనం-వారందరి శ్రమను వినియోగించుకొనడానికి మారుగా యంత్రాలను వినియోగించుకొనగలగడం ఎలాసాధ్యం ? అలాచేస్తే వారంతా నిరుద్యోగులై నిర్భాగ్యులవుతారు."

గ్రామీణప్రాంతాలలో పేదలు ధనవంతులమధ్య అగాధం మరింత పెరిగిందనికూడా కిసాన్‌సంస్థ నాయకులు అన్నారు. భారతీయ రిజర్వుబ్యాంకి వారి సర్వేప్రకారం 1977 నాటి గ్రామీణజనాభాలో 30 శాతంమంది మొత్తం గ్రామీణ సంపదలో 82 శాతానికి అధిపతులుగా వున్నారు.

శ్రీ భాటియా తమ ప్రసంగం ముగిస్తూ "స్వాతంత్ర్యంవచ్చిన గత 32 సంవత్సరాలలో ఏర్పడిన అత్యంత హానికరము, విచారకరమైన పరిణామమేమంటే గ్రామీణప్రాంతాలలో యిప్పటికేవున్న కుల, వర్గవైషమ్యాలకుతోడుగా రాజకీయాలుకూడా శక్తివంతమైన విచ్ఛిన్నకరశక్తిగా తయారుకావడం. పార్టీ రాజకీయాల వినాశనకర ప్రభావంనుంచి రైతులను రక్షించడానికి చర్యలు తీసుకొనవలసిన సమయం ఆసన్నమయింది. కనుక రైతు ప్రయోజనాలకు దోహదకరమైన విధంగా వారిని సంఘటితంచేయాలని కిసాన్‌సంఘ్ అభిలషిస్తున్నది. రైతులను ఏ రాజకీయపక్షానికయినా అనుబంధం చేయజూచేవారి ప్రయత్నాలనన్నిటిని నిశ్చయాత్మకంగా ప్రతిఘటిస్తుంది" అన్నారు.

సంఘంనుంచి ప్రేరణస్వీకరించిన వ్యక్తులు తమ కార్యకలాపాలను భారత వర్షానికిమాత్రమే పరిమితం చేయలేదు. తాము ఎక్కడకు వెళ్ళినా ఆర్.యస్.యస్. జ్యోతిని తమవెంట తీసుకొనిపోయారు. ప్రపంచంలో ఎక్కడ పదిమంది భారతీయులున్నా అక్కడ నేడు హిందూ స్వయంసేవక సంఘమో, భారత స్వయం సేవక సంఘమో వున్నది. వీటిలో సంఘం శాఖలను నడపడంమాత్రమేకాదు కీర్తనలు, సంస్కృతపాఠశాలలు, గ్రంథాలయాలు, చారిత్రక నాటకాలు, యోగ

కేంద్రాలు నిర్వహిస్తున్నది. కెన్యాలో ఆ దేశస్వాతంత్ర్యపితగా పేర్కొనదగిన జోమోకెన్యాటాకు సంఘకార్యకర్తలు ఎప్పుడూసహాయంచేస్తూవచ్చారు. కెన్యాలో ఆయన ఎన్నోమార్లు తమకుటుంబంతోపాటు సంఘశిబిరాలు సందర్శించారు.

1979లో కెన్యా పెద్దయెత్తున వరదపీడితులు, క్షామపీడితులకు సంఘం సహాయకార్యక్రమాలునిర్వహించింది. ఈకార్యక్రమాలను 200మంది కార్యకర్తలు పూర్తిసమయం వినియోగించేట్లు సంఘం ఏర్పాట్లుచేసింది. కెన్యాశాసనమండలికి స్పీకరు, కెన్యావరద-క్షామసహాయసమితికి ఛైర్మను అయిన శ్రీ హంఫ్రీస్లాడే భారతీయ స్వయంసేవకసంఘ కేంద్రకార్యాలయాన్ని సందర్శించారు. స్వయంసేవకులను ఆయన హృదయపూర్వకంగా అభినందిస్తూ యువతరంలో సౌశీల్యము క్రమశిక్షణ, సేవ, త్యాగంవంటి మౌలిక సద్గుణాలను ఉత్తేజితం చేస్తున్నందుకు సంఘం నిజంగా మెచ్చుకోదగినదని అన్నారు. హిందూధర్మం ప్రబోధించే విశ్వమానవ సౌభ్రాతృత్వభావన ఈ మానవతా కార్యంద్వారా ఆచరణలో పెట్టబడిందని, సహాయకార్యక్రమాలలో పనిచేస్తున్న వివిధ ప్రజాసంస్థలలో సంఘం చేసినంత తీవ్రంగా, సమర్థంగా కృషిచేసినసంస్థ మరొకటి తాను చూడలేదని అన్నారు.

అమెరికా, బ్రిటన్ దేశాలు విరాళంగా పంపిన వేలాదిటన్నుల జొన్నలు, పాలపొడిగురించి ప్రస్తావిస్తూ "ఈభూరివిరాళాలలోపోల్చినపుడు మీరుచేసిన సహాయం పౌనులు షిల్లింగులు-పెన్నీలలో కొలిస్తేలెక్కకురానంత స్వల్పమేకావచ్చు. కాని మీ ప్రయత్నాలలో ఒక అపూర్వలక్షణంవుంది. సాధారణ మానవుడి స్థాయిలో అతడికి అందుబాటులో వుంటూకూడ యింతవరకు వ్యర్థమైపోతూవచ్చిన వనరులను మీరు క్రమబద్ధంచేసి వినియోగంలోకి తీసుకొనిరావడమే ఆ విశేషం" అన్నారు

బ్రిటన్ మొత్తంమీద 32 శాఖలలో నేడు 2000 మంది స్వయంసేవకులు వున్నారు.

విదేశాలలోని సంఘకార్యాన్నంతటిని శ్రీ యల్.యస్. భిడే పర్యవేక్షిస్తున్నారు.

ఎమర్జెన్సీరోజుల్లో విదేశాల్లోని స్వయసేవకులు కీలకపాత్ర నిర్వహించారు. ప్రజాస్వామ్యభావాలుగల యితర విదేశ సంస్థభారతీయుల సహకారంతో ప్రపంచ

మంతటా శాఖలతో "ఫ్రెండ్స్ ఆఫ్ యిండియా సొసైటీ యింటర్నేషనల్"ను స్థాపించారు. బ్రిటన్‌లో శ్రీ జగదీష్‌సూద్, అమెరికాలో డా॥ జితేంద్ర, వివిధ దేశాల్లో వున్నవారి యితర సహచరులు, డా॥ కె.బి. హరదాస్, రత్నాకర్‌భారతి ప్రభృతులతో కలిసి ఆయాదేశాలు సందర్శించవచ్చిన ఎమర్జెన్సీ మంత్రులకు జీవితం దుర్భరంచేశారు. వీరే ఆ దేశానికివచ్చిన రోక్‌ష్నాస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, రాజపాల్ పూరి, మకరందదేశాయి, కేదార్‌నాథ్‌సాహనీ, రామ్‌జెత్‌మలానీ తదితర భారతీయ ప్రముఖులకు ఆశ్రయమిచ్చి వారి సభలకు ఏర్పాట్లుచేశారు. బ్రిటిష్ యం.పి.లు, ఎడిటర్లను, అమెరికన్ సెనేటర్లు, గవర్నర్లను వివిధదేశాల్లో ఆమ్నెస్టీ యింటర్నేషనల్ వారిని కలిశారు. అంతవరకు "ఎమర్జెన్సీ అనుశాసనాన్ని" అభినందిస్తున్న పాశ్చాత్యప్రజాభిప్రాయాన్ని అనతికాలంలోనే మార్చి ఎమర్జెన్సీ అత్యాచారాలపట్ల నిరసనకలిగేవిధంగా మార్చడంలో వారు కృతకృత్యులైనారు.

స్వదేశంలోని స్వయంసేవక్ నిర్వహించినంత వీరోచితపాత్రను విదేశాలలోని స్వయంసేవక్ కూడ నిర్వహించాడు. విచారణలేకుండా జైలుకుపంపబడే గౌరవంలో తనకు భాగంలేకపోవడంమాత్రమే అతనికి విచారం కలిగించింది.

డా॥ హెడ్గేవార్ అన్నమాట అక్షరాలా సత్యం. శిశుమందిరాలు నడపటంమొదలు జాతీయ ఎమర్జెన్సీతో పోరాడేటంతవరకు అనేకవిధాల బృహత్కార్యాల నిర్వహణకు అవసరమైన శక్తిని ప్రసాదించే ఒకమహత్తరశక్తి ఉత్పాదనకేంద్రాన్ని రాష్ట్రీయ స్వయంసేవక సంఘరూపంలో వారు నెలకొల్పారు.

సామాజిక దృక్పథం

"అంటరానితనం నేరం కాకపోతే ప్రపంచంలో మరేదీ నేరంకాదు." అన్నారు సర్‌సంఘచాలక్ బాలాసాహెబ్-

"స్త్రీలను 'వంట ఇంటికీ' 'చంటిపిల్లలకూ' పరిమితం చేయడంకూడా నేరమే" అన్నారు.

"పురాణమిత్యేవ న సాధు సర్వం" పాతదంతా బంగారమే అనుకోకూడదు అని వారు స్పష్టంచేశారు.

తాతస్య కూపోయమితి బ్రువాణాః.

క్షారం జలం కాపురుషాః పిబంతి

(మా తండ్రి, తాతలు యీ బావి త్రవ్వారు. నీళ్లు ఉప్పగా వున్నాయి. అయినా వాళ్ళు యివేత్రాగి బ్రతికారు. కనుక మేముకూడా యివేత్రాగుతాము) అనేవారిని ఆయన అపహాస్యంచేశారు.

ఈ రకమైన మూర్ఖనమ్మకంవలన ఎవరికీ మేలుకలగదని హెచ్చరించారు. అట్టివ్యక్తులు సత్పురుషులుకాదని, కాపురుషులని సూక్తి చెప్తున్నది. ఆ తీరులో మూర్ఖంగా ఆలోచించడం ఒక అపరాధం.

హిందూత్వం మార్పులేనిది కాదని నిత్యచైతన్యశీలియని వారంటారు. ఫలానా అవతారమే అంతిమమని, చివరిప్రవక్త అని మనం నమ్మటంలేదు అని 1974లో పూనాలో వసంత వ్యాఖ్యానమాలలో చెప్పారు. అమెరికాలో ఒక ఉపాధ్యాయుడు డార్విన్ జీవపరిణామసిద్ధాంతాన్ని బోధిస్తే అది బైబిలులో చెప్పిన మానవసృష్టి సిద్ధాంతానికి వ్యతిరేకంగా వున్నదనే నెపంతో 1925లో ఒక అమెరికన్ కోర్టు అతనికి శిక్షవిధించింది. ("ది ట్రయల్ దట్ రాక్‌డ్ ది వరల్డ్, 'రీడర్స్ డైజస్ట్' జులై 1962). భారతదేశంలోనయితే అటువంటిచర్య తీసుకొనే ఆలోచన ఏ కాలంలోనూ కలుగదని శ్రీ బాలాసాహెబ్ వ్యాఖ్యానించారు. క్రొత్త వాస్తవాలు, క్రొత్తగా కనుగొన్న విషయాల ననుసరించి ఎప్పటికప్పుడు మనం

గ్రంథాలను పునర్వ్యాఖ్యానిస్తూ, మన ఆచారాలను సరిదిద్దుకుంటూ వుంటాం. ఈ కారణచేతనే ఆలోచనా వికాసాన్ని ప్రతిబింబించే అసంఖ్యాకమైన 'స్మృతులు' మనదేశంలో వెలిసినై. ఈ కారణంగానే ప్రాచీనదేవతలైన వరుణ, వాయువుల స్థానంలో శివుడు, విష్ణువులవంటి దేవతలను, ఆ తరువాత వీరికికూడా ప్రాధాన్యత తగ్గించి శ్రీరాముడు, శ్రీకృష్ణులకు స్థానం యివ్వబడింది. ఈ కారణంగానే ఆదిశంకరులు తనకు అద్వైతంలో నమ్మకం వున్నప్పటికి-శివుడు, విష్ణువు, సూర్యుడు, గణపతి, శక్తి-అనే అయిదుగురు దేవతలను సంయుక్తంగా ఆరాధించే పంచాయతన విధానాన్ని ప్రవేశపెట్టారు. శైవ, వైష్ణవులమధ్య చిరకాలంగా సాగుతూవచ్చిన వివాదాలకు స్వస్తిపలికించి వారిద్దరిని సమైక్యంచేయడానికి ఆయన ప్రత్యేకంగా శ్రమించారు.

ఆర్.యస్.యస్. కులాన్ని గుర్తించదు. ఇందులో ఎవరూ మరొకరి కులంగురించి అడుగగనే అడగరు. అయినా 'జాత్-పాత్ తోడక్ మండల్' (కులాలను విచ్ఛిన్నంచేసే సంఘం) తరహాలో అది కులాలమీద యుద్ధం ప్రకటించి ఆర్భాటంచేయదు. ప్రాచీనభారతీయ వ్యవస్థలో అసలు మంచి అనేదే లేనేలేదని భావించే వర్గంవారి కోవకుకూడా ఆర్.యస్.యస్. చెందదు. దాని నిర్ణయం దృఢమైనది, అయినా దానికృషి ప్రశాంతంగా నిర్మాణాత్మకంగా సాగుతుంది. బుద్ధుడు, మహావీరుడుకూడ కులంమీద దాడిచేయకపోవడం గమనించదగ్గవిశేషం. తన చరిత్రాత్మకపాత్రను నిర్వహించిన చారిత్రక వ్యవస్థగా కులాన్ని ఆర్.యస్.యస్. పరిగణిస్తుంది. అయితే నేటి కాలానికి యీ వ్యవస్థ అనుగుణ్యం కాదని, యిది తప్పనిసరిగా తొలగిపోవలసిన వ్యవస్థఅని భావిస్తున్నది.

ఋగ్వేదకాలంలో కులమనేదే తెలియదు. మానవులందరిని "అమృత పుత్రులారా !" అనే వేదఋషి సంబోధిస్తాడు. శ్రీకృష్ణుడు గీతలో అన్నాడు :

"చాతుర్వర్ణ్యం మయాసృష్టం గుణకర్మవిభాగశః" (IV 13)

("వ్యక్తుల అభిరుచుల వృత్తులవైవిధ్యాన్ని బట్టి నాలుగురకాల కులాలను నేనే రూపొందించాను." వంశపారంపర్యతనుబట్టికాదని గమనించవలసివుంది). వేదాలుచదివే శూద్రుడిగొంతులో కరిగించిన లోహం పోయాలని మనువు అన్నాడని చెప్పడం శుద్ధఅబద్ధమే. ఆయన చెప్పినదల్లా వేదాలను "పరిహసించే"

వ్యక్తికి వైదికవిజ్ఞానం అందచేయదగదనిమాత్రమే (II.114). మిగతావారిగురించి ఆయన చెప్పినదేమంటే "శ్రద్ధాన్వితుడైనవ్యక్తి హీనకులజుడివద్దనయినాసరే విశుద్ధజ్ఞానాన్ని స్వీకరించవచ్చు"నని. తనగుణాల ఆధారంగా "శూద్రుడు బ్రాహ్మణత్వాన్ని, బ్రాహ్మణుడు శూద్రత్వాన్ని పొందుతాడు." అనికూడా మనువుచెప్పాడు (X. 65)

జాతులు, మతాలు, భాషలవల్ల ఏర్పడిన గందరగోళంలో ఒక క్రమబద్ధమైన సమాజాన్ని నిర్మించవలసిన ఆగత్యం ఏర్పడటంతో కులవ్యవస్థ రూపొందినట్లు కనిపిస్తున్నది. ప్రతి ప్రాచీనదేశంలోను కులాలు పుండటానికి కారణం యిదే. అరబ్బులలోను మసీదులలో ప్రవేశించే అర్హతలేని అస్పృశ్యులున్నారు. ఇరాన్‌లో 'దాహులు' ఉన్నారు. జపాన్‌లో అంటరాని 'ఏటా', 'హినిన్' వర్గాలవారున్నారు. ఆధునిక అమెరికాలో కూడా కులాల తారతమ్యంవంటిది వున్నట్లు కనిపిస్తున్నది. అమెరికన్‌లలో 'వాస్ప్' అనబడే శ్వేత ఆంగ్లో-శాక్సన్ ప్రొటెస్టెంట్లు అగ్రవర్ణంగా వున్నారు. ఆతరువాత అవరోహణక్రమంలో కేథలిక్కులు, యూదులు, మెక్సికన్లు, నీగ్రోలు, రెడ్‌ఇండియన్‌లు వున్నారు.

కాని ప్రపంచంలో మరేయితర దేశంలోకంటె భారతదేశంలో మరింత ఎక్కువగా కులాలు-ఉపకులాలు, మరింత దీర్ఘకాలంగా వుంటూవచ్చినాయి. దీనికి రెండు కారణాలున్నాయి జాతి, మతం, తదితర అంశాలనుబట్టి అల్పసంఖ్యాక వర్గంఅయినవారిని సాధారణంగా విదేశాలలో చేసినవిధంగా మనంమనదేశంలో చంపిపారేయలేదు. ఔదార్యంకల్గిన భారతీయమనస్సు యీసమస్యనంతటిని "తార్కికమైన" నిర్ణయాన్ని అనుసరించే పరిష్కరించ ప్రయత్నించినట్లు కనిపిస్తున్నది. అయితే శాసనంలో ఎంత తెలివితక్కువతనానికి అవకాశంవుందో, తర్కంలోను అంత అవకాశముంది. భారతీయుల వైఖరి పూర్తిగా ఈ దేశపు భౌగోళిక, వైసర్గిక స్థితులనుబట్టి నిర్ణయమయినట్లు కనిపిస్తున్నది. అనంత వైవిధ్యతగల జంతు, వృక్షజాలంలో సుసంపన్నంగా వృద్ధిచెందిన ప్రకృతిపట్ల గౌరవభావన పెంపొంది పరస్పర వైరుధ్యం కూడా వున్నట్లు కనిపించే వివిధ శక్తుల మధ్య విజయవంతంగా సహజీవనం కొనసాగటం సంభవమేనని ఋజువయింది. ఫలితంగా అన్ని జీవులపట్ల గౌరవ భావన, వట్టినే జీవించడం కాక తమ వ్యక్తిత్వాన్ననుసరించి జీవించే ప్రజాస్వామిక హక్కుకు గుర్తింపు ఈ దేశంలో వికసించింది.

వట్టి యిసుక ఎడారుల్లోనో, మంచు నేలల్లోనో జీవించే వారిలో ఈ రకమైన అలోచనా పద్ధతి పెంపొందే అవకాశం లేదని స్పష్టమవుతున్నది.

నిజానికి అనేక శతాబ్దాల పాటు కులవ్యవస్థ బాగానే పనిచేసినట్లు కనిపిస్తున్నది. మధ్యయుగాల్లో మధ్య ఆసియా దురాక్రమణదారులు దేశంమీద విరుచుకుపడినప్పుడు స్వయం ప్రతిపత్తిగల కులవ్యవస్థ, పంచాయతీవ్యవస్థ ప్రజలను సమైక్యంగా వుంచి యిరాన్‌కు పట్టిన గతి ఈ దేశానికి పట్టకుండా కాపాడినై. (ఇరాన్‌లో రాచరిక వ్యవస్థ కుప్పకూలిన తరువాత మరి యే సంస్థ ఆ దేశాన్ని కాపాడలేక పోయింది.

కవి మాటలతో చెప్పాలంటే ... సైనిక సమూహాలను
సాగిపోనిచ్చారు, ఓర్పుతో తీవ్రంగా నిరసించారు.

మార్పుకుండానే సామరస్యంగా వుండే సమాజంగా భారతదేశంలోని తెగలన్నిటిని ఏకీకృతం చేసిన మన ప్రాచీన భారత నిర్మాతలు ఆ సమాజాన్ని అత్యంత ప్రయోజనదాయకంగా నిర్మించడానికి శ్రద్ధతీసుకున్నారు. ఈ నిర్మాణ కార్యంలో భారత దేశపు ప్రధాన వ్యవస్థగా 'కులం' వికసించింది. ఒక కారణమేమంటే ఈజిప్టులోనో, చైనాలోనో వున్నంత స్థిరంగా; ప్రధానంగా భారతదేశంలో రాజ్యవ్యవస్థవుండేదికాదు. దీర్ఘ కాలంపాటు రాజ్యమేలేకుండా పోయింది కూడాను. ఈ పరిస్థితుల్లో సమాజానికి అవసరమైన శాంతిభద్రతలు కులవ్యవస్థపలన, కుల పంచాయతీలవలన సురక్షితంగా నిలిచినై. దేశాని కంతటికి వర్తించే సార్వజనీన రాజ్యానికి మారుగా, కులం చుట్టూ అల్లుకున్న సార్వజనీన సమాజాన్ని మనం నిర్మించుకొనడం జరిగింది.

గాంధీజీ మాటలతో కులమనేది "ఒకరికొకరు సహకరించుకొనే ప్రాతిపదికమీద ఏర్పడింది తప్ప, ఒకరిపై ఒకరు ప్రాబల్యం వహించే ప్రయత్నంగా ఏర్పడలేదు." శ్రీకృష్ణుడు, అశోకుడు, శివాజీ వంటివారు మొదటి మూడు కులాలకు చెందినవారు కాకపోయినా మహోన్నత వ్యక్తులుగా, భారతీయ యితిహాస ద్రష్టలుగా రూపొందగలిగారనే వాస్తవాన్ని పరిశీలిస్తే కుల వ్యవస్థ ప్రజల ఔన్నత్యానికి సాధనంగా యోజనచేయబడిందే తప్పవారిఅణచివేతకు యంత్రంగా కాదని స్పష్టమవుతున్నది.

ప్రాచీన ఋషి - బ్రాహ్మణుడిని బాగా ఆటపట్టించాడు. చాందోగ్య ఉపనిషత్తులో చాదస్తపు బ్రాహ్మణులను "ఓం తిందాం, ఓం త్రాగుదాం" అని అరుస్తూ ఒకదానితోక ఒకటిపట్టుకొని సాగిపోయే కుక్కల ఊరేగింపుతో పోల్చటం జరిగింది. సంస్కృత నాటకంలో సరదాగా వుంటూనే అభివృద్ధి నిరోధకంగా వుండే విదూషకుడెప్పుడూ బ్రాహ్మణుడే. బ్రాహ్మణులపై దాడిచేయడం వారి ఉద్దేశంకాదు. మరింత శ్రేష్టతరమైన బ్రాహ్మణులు కావాలని మాత్రమే వారు అభిలషించారు.

నిజానికి కొందరు సాంఘికతత్వవేత్తలు యీ వ్యవస్థలో యెంతో వివేకం వున్నట్లు భావించారు. "మనిషి ఊరికే ఆలోచించేవాడుమాత్రమేకాదు. పని చేసేవాడుకూడాను. అతనికి భావాలుమాత్రమేకాదు, విలువలుకూడా వున్నాయి. ఒక విలువను ఆమోదించడమంటే ఒక వంశానుగత వ్యవస్థను ప్రవేశపెట్టడం, విలువలపట్ల కొంత ఏకాభిప్రాయాన్ని కూడగట్టడం అన్నమాట. కొన్ని భావాలు, విషయాలు, ప్రజల వంశానుగత వ్యవస్థలు సామాజిక జీవనానికి అనివార్యం అవుతాయి." అని తన "హోమోహేరార్కినస్" అనే గ్రంథంలో లూయీ డ్యూకూమాంట్ అంటాడు.

అమౌరి డి రీన్‌కోర్ట్ మాటల్లో "నిజానికి భారతదేశంలో ఎప్పుడూ వుంటూవచ్చిన శ్రేష్ఠమైన సహనభావమనుంచే కులం పుట్టింది. అంతులేని వైవిధ్యతగల జాతులను భాషలను, వీటితోపాటు విభిన్నమతాచారాలను,సాంస్కృతిక సంప్రదాయాలను. అత్యంత విభిన్నమైన భౌగోళిక పరిసరాలవల్ల, శీతోష్ణస్థితుల వల్ల ఏర్పడిన మానసిక దృక్పథాల వైవిధ్యతను ఆయావ్యక్తుల స్వేచ్ఛాభావన ఆత్మగౌరవాలకు భంగం కలుగనివిధంగా, వారి ఆరాధనా, భావస్వాతంత్ర్యాలకు దెబ్బతగులని విధంగా వారి విశిష్టమైన జాతిసంబంధమైన వ్యక్తిత్వాలు రూపుమాయని విధంగా సమ్మిళితంచేసే సమస్యకు మరొక విధమైన పరిష్కారంలేదు. ఇతరదేశాల నాగరికతలలో వైవిధ్యతగల అన్యవర్గాలవారిని చంపివేయడంద్వారా లేక దానిసలుగా చేసివేయడంద్వారా సమస్య పరిష్కారమయింది. అక్కడ ఐక్య దృక్పథాన్ని బలవంతంగా ఆమోదింపజేయడం జరిగింది. భారతదేశంలో మాత్రం ఆ విధంగా జరగలేదు... బలహీనులు తమ వర్గంలోనే సౌభ్రాతృత్వపు సమైక్యతద్వారా శక్తివంతులయినారు. అల్పసంఖ్యాకు లందరికి రక్షణలభించింది.

మానవుడు యోజనచేసుకున్న సాంఘికనిర్మాణాలన్నింటిలో కులవ్యవస్థ స్వతహాగా అత్యంతశ్రేష్ఠమైనదిగానే వుండేది" ("ది సోల్ ఆఫ్ యిండియా")!

కౌంట్ కీసర్లింగ్ యిలా అంటాడు : "వృత్తి ప్రధానంగావుండే వర్గీకరణను నిరాకరించే మన (యూరోపియ) వ్యవస్థకంటె ఏ విధంగా చూసినా కులవ్యవస్థే వ్యక్తియొక్క యిష్టానుగుణ్యమైన జీవనానికి దోహదం చేస్తుందనే అభిప్రాయం రానురాను నాలో దృఢపడుతున్నది. మనలో ప్రతివ్యక్తి తనలోని శ్రేష్ఠతను యోజకత్వాన్ని గుర్తించగలిగి దానిని జీవితంలోస్వేచ్ఛగాఅభివ్యక్తం చేయగలిగితే మనవే అత్యుత్తమంగా యోజనచేయబడిన సిద్ధాంతం అవుతుంది; కాని తన యోజకత్వం గుర్తించిన అవగాహనలేని యూరోపియన్లు కులవ్యవస్థయొక్క పూర్వ నమ్మకాలకంటె మరింత నష్టదాయకమైన అస్పష్ట విధానాలను అనుసరిస్తున్నారు. యూరోపియన్ తాను కేవలం "మానవుడుగా" రూపొందాలనుకుంటున్నాడు. కాని అలాంటి "మానవుడు" నిజంగా వుండడని అతనికి తెలియదు. ఈ కారణంగా అతనిలో పెరుగుతున్న ఐక్యతాభావన స్వేచ్ఛమైనది కాక ఉపరితలపు సమైక్యతగా మాత్రమే తయారవుతున్నది." భారతీయులలో కంటె యూరపియన్లలో ఐక్యతాస్పృహలోతుగా వెళ్లాలడం గాని విస్తృతంగా వర్ధిల్లటంగాని జరుగలేదు. ఆ విధంగా ఆధునిక పాశ్చాత్యుల వ్యక్తి కేంద్ర సమాజంకంటె వ్యక్తి కేంద్రిత విధానంతో సమ్మకంలేని భారతీయ సమాజం బహుముఖమై సుసంపన్నమైన వైవిధ్యత కలిగివుంది".

కులం నిర్వహించిన అపూర్వమైన చారిత్రక పాత్రను ఆర్.యస్.యస్. ప్రశంసిస్తూనే వున్నది. అయితే బాలాసాహెబ్ అన్నట్లు "మనలోని సాంఘిక అసమానత్వమే మన పతనానికి ఒక కారణమయింది" అనడంలో సందేహంలేదు. వర్ణవ్యవస్థ కాలక్రమేణ క్రిందటనే వర్ణ-అవ్యవస్థగా మారిందని వారు అన్నారు. అన్ని వర్గాలను రద్దుచేసే కమ్యూనిజంలోకూడ పార్టీ పెత్తందారుల "నవీనవర్గం" ఒకటి పైకి వచ్చిందని జిలాస్ పేర్కొన్నాడు.

ముఖ్యమైన విశేషమేమంటే హిందూభారతం కులతత్వాన్ని రూపుమాపడానికి కృతనిశ్చయమైవుంది. సంఘం ఏ కులాన్నీ గుర్తించదని శ్రీ గురూజీ చాల కాలం క్రిందటనే స్పష్టంచేశారు. కులంలోకంటె ముందుగా హిందుత్వంలోనే ప్రతిఒక్కరు సభ్యత్వం కలిగివున్నారు. "ప్రజలను అధిక సంఖ్యాకులుగా,

అల్పసంఖ్యాకులుగా, షెడ్యూల్డు కులాలుగా, షెడ్యూల్డు జాతులుగా, కొండ తెగలుగా, ఆటవిక తెగలుగా, వెనుకబడిన వర్గాలుగా, యిలా సవాలక్ష చీలికలు తెచ్చినవాళ్లు జాతీయ సమైక్యతావాదులా? జాతీయ సమైక్యతపట్ల యింతకు మించిన విజాతీయ దృక్పథం వుండదు. ఈ దేశంలోని యితర పేదలవలెనే బ్రాహ్మణులు కూడా అంతగా పేదవారే అయివున్న విషయం వీరికి తెలియదు. వారిలో కొంతశాతం మంది రెండుపూటలా కడుపునిండా భోజనం చేయలేని స్థితిలో వున్నారు."

"ఒకానొకప్పుడు కులం మహత్తరమైన వ్యవస్థగానే వుండేది. కాని నేడు దీనికి కాల దోషం పట్టి తన స్థానం కోల్పోయింది. అవసరాలకు అనుగుణ్యం (flexible)గా మారనిది. అనేకకాలంలో అవశేషం (fossil) గా మారుతుంటుంది. అంటరానితనం శాస్త్రంలోనేకాక నా హృదయంలో కూడ రూపుమాసి పోవాలని నా కోరిక. ఇది సాధ్యపడాలంటే ధార్మిక నాయకులందరు కలిసి అంటరానితనాన్ని రూపుమాపడానికి ధార్మిక నిర్ణయాన్ని ప్రకటిస్తే నేనెంతో ఆనందిస్తాను.

"ఆధిక్యం, అధమత్వం గురించి ఆలోచించక, తమ సామర్థ్యం మేరకు తమ విధ్యుక్త ధర్మాలను– అవి ఏవయినాసరే–ఆచరించడమే మానవుడి నిజమైన 'ధర్మం' అని నా అభిప్రాయం. పనిచేయడమే పరమార్థానికిదారి, కనుక పనినే ఆరాధనగా భావిస్తూ చేయాలి.

"కులం ప్రాచీన కాలపు రక్షణ కవచమని, దాని రోజుల్లో అది బాగానే తన ధర్మం నిర్వర్తించిందని, కాని ప్రస్తుత కాలానికి వర్తించే స్థితిని కోల్పోయిందని నేను భావిస్తున్నాను. పశ్చిమ పంజాబ్, తూర్పు బెంగాల్–యీ రెండు ప్రాంతాల్లో కులం బలహీనంగా వుండేది కనుకనే యివి యిస్లాంకు తల ఒగ్గినై. కనుక కులమనేది ఎవరో స్వప్రయోజనపరులు మోపిన దుర్వ్యవస్థ అని అజ్ఞానంతో నిరసించడానికి నేను సిద్ధంగాలేను. తన రోజుల్లో తక్కిన వ్యవస్థ అంతా కుప్పకూలి పోతుండగా సమాజాన్ని సేవించి దానిని సంఘటితంగా నిలిపివుంచిన మహత్తర వ్యవస్థ అది".

సంఘంలో కులం లేకపోవడమనేది 1925లో ఆర్.యస్.యస్. ఆవిర్భవించినప్పటినుంచి వున్న వాస్తవమే. 1936లో పూనాశాఖ నిర్వహించిన మకర

సంక్రాంతి ఉత్సవానికి బాబాసాహెబ్ అంబేద్కర్ ఆధ్యక్షతవహించారు. ఆర్. యస్.యస్. సభ్యులంతా బ్రాహ్మణులేనా అని ఉత్సవ సందర్భంగా అక్కడే వున్న డా॥ హెడ్గేవార్‌ను ఆయన ప్రశ్నించారు. స్వయంసేవకులు-తమ మనస్సును ఉపయోగించి తమ ఆదర్శాలను విస్తరింపజేస్తున్నప్పుడు, క్రొత్త సభ్యులను చేర్పిస్తున్నప్పుడు వారు బ్రాహ్మణులు, తమ దైనందిన శారీరక అభ్యాసాలు చేసేసమయంలో వారు క్షత్రియులు. సంఘంకోసం నిధులు, యితర వ్యావహారిక విషయాల్లో మునిగివున్నపుడు వైశ్యులు, వివిధ శిబిరాలు, శాఖలలో పరిశుభ్రత, తదితర పనులకు పూనుకొన్నపుడు వారే శూద్రులు-అని డా॥ హెడ్గేవార్ సమాధానంయిచ్చారు. హిందూ సమాజాన్ని విభజించిన నాలుగు సాంప్రదాయక వర్గాలను ప్రస్తావించడంద్వారా కులానికి అర్థంలేదని నిరూపించే ప్రయత్నం ఆర్.యస్.యస్. చేస్తున్నదని డాక్టరుజీ స్పష్టం చేశారు.

మహారాష్ట్రలోని ఛాందసుల క్షేత్రంలో ఆర్.యస్.యస్. యొక్క కుల రాహిత్యానికి డా॥ అంబేద్కర్ ఎంతగానో ముగ్ధులయినారు.

1947లో ఢిల్లీలో ఆర్.యస్.యస్. కార్యకర్తలనుద్దేశించి ప్రసంగిస్తూ గాంధీజీ తాను గతంలో చాల సంవత్సరాలక్రిందట ఒక ఆర్.యస్.యస్.శిబిరాన్ని సందర్శించిన సంఘటనను గుర్తుచేస్తూ "మీ క్రమశిక్షణ, మచ్చుకైనా లేని అంటరాని తనం మీ కఠోర నిరాడంబర జీవనం" నన్ను మురిపింపజేసినై." అన్నారు.

ఉపన్యాసాలుగాని, విమర్శలుగాని చేయకుండానే, దైనిక జీవనాదర్శం ద్వారా సంఘంలో యిది సాధ్యపడింది.

1937 శీతాకాలంలో డా॥ హెడ్గేవార్ రత్నగిరివద్ద కాగల్‌లో వున్నారు. క్రొత్త అర్.యస్.యస్. శాఖకు వారు భగవాధ్వజం బహుకరించవలసివుంది. స్థానిక దేవాలయంలో ఉత్సవానికి ఏర్పాట్లు జరిగినై. కొందరు హరిజన స్వయంసేవకులు లోపలికి రావడం గమనించిన దేవాలయ అర్చకులు వారిని అడ్డగించారు. డాక్టర్‌జీ అక్కడకు రాగానే అర్చకులతో వాదించారుకాని లాభంలేకపోయింది. అయితే డాక్టర్‌జీ వారిని ఒప్పించడానికి వాదించారేతప్ప వివాదం ప్రారంభించడంగాని, ధర్నాకు కూర్చోడంగాని చేయలేదు. ఏదోఒక నాటికి ఆ అర్చకులు కూడా సంఘం చేరుతారని వారు ఆశించారు. కనుకనే.

డాక్టర్‌జీ "మనకు హిందువులంతా ఒక్కడే" అంటూ అన్ని కులాల స్వయం సేవకులు పరిపూర్ణ సమానత్వంలో మరొక స్థలానికి కార్యక్రమం మార్చారు. ఇది స్వయంసేవకులకు, అర్చకులకు కూడ గుణపాఠం.

సంఘం తొలిసారిగా నిర్వహించిన శిక్షణశిబిరంలో తాను పాల్గొన్న విష యాన్ని బాలాసాహెబ్ గుర్తుకుతెచ్చుకుంటూ, ఆ శిబిరంలో పట్టుపురు మహర్ ["అంటరాని"] స్వయంసేవకులు పాల్గొన్న విషయం చెప్పారు. భోజన సమ యంలో వారితోపాటు కూర్చోనడానికి కొందరు స్వయంసేవకులు తటపటా యించారు. వారిజీవితంలో అంతకుముందెన్నడూ ఒక మహర్‌తో కలిసి కూర్చొని వారు భోజనం చేయలేదు. తమ సమస్యను వారు డాక్టర్‌జీముందు వుంచారు. డాక్టర్‌జీ శిబిర అనుశాసనాన్ని వారిపై బలవంతంగా రుద్దలేదు, వారినిబయటకు పొమ్మని కూడా అనలేదు. "కలిసి కూర్చోడమే మనపద్ధతి. అలాగే చేద్దాం" అని మాత్రమే అన్నారు. నాటి సంఘటనను బాలాసాహెబ్ గుర్తుకు తెచ్చుకుంటూ యిలా చెప్పారు. "మాలో ఎక్కువమందిమి భోజనానికి కలిసే కూర్చున్నాము. కాస్త తటపటా యింపువున్నవాళ్ళు మాత్రం వేరే పంక్తిలో కూర్చున్నారు. కాని వారే తదుపరి భోజన సమయంలో డాక్టర్‌జీ వద్దకువచ్చి క్షమాపణకోరి తమంత తాముగా మా అందరికోపాటు కలిసి కూర్చున్నారు. ఒకవేళ మొదట్లోనే వారిపై డాక్టర్‌జీ క్రమశిక్షణచర్య తీసుకొనివుండే, లేదా వారిని బయటకు పంపివుంటే వారిలో యీ మార్పు వచ్చివుండేదేకాదు."

భారతీయజనసంఘ అధ్యక్షుడిహోదాకు చేరుకున్న శ్రీ బచ్‌రాజ్‌వ్యాస్‌కు సంబంధించి తెలుసుకొనవలసిన సంఘటన ఒకటి వుంది. బాలాసాహెబ్ ముఖ్య శిక్షకులుగా వున్న సంఘ శాఖలో ఆయన స్వయంసేవక్. అత్యంత ఆచార పరాయణులైన మార్వాడీ బ్రాహ్మణకుటుంబంలో పుట్టినందున ఆయన బాలా సాహెబ్ యింట్లోనయినా భోజనంచేసేవారుకారు. ఆయన మొదటిసారిగా ఒక సంఘశిబిరంలో పాల్గొన్నప్పుడు వారి భోజనం విషయం పెద్ద సమస్య అయింది. అందరి కోసం తయారుచేసి వడ్డించిన భోజనం ఆయన తీసుకునేవారుకాదు. బాలాసాహెబ్ ఆనాటి విశేషం యిలా వివరించారు : "ఈ సమస్య నేను డాక్టర్ జీకి వివరించాను. అయితే బచ్‌రాజ్ శిబిరానికి రాకుండా నిరోధించే శిబిరనియమ మేదీ డాక్టర్‌జీ ఉటంకించలేదు. అతనిలో అభిలషణీయమైన మార్పు తప్పకుండా వచ్చితీరుతుందని వారి దృఢ విశ్వాసం. బచ్‌రాజ్ గొప్ప సమర్థత, ఔన్నత్యం

గల వ్యక్తి అని వారికి తెలుసు. 'అతనిని శిబిరానికి రానీయండి. అతనికి కావల సిన గిన్నెలు, చెంబులు, దినుసులు ఇద్దాం. తనవంట తనే వండుకోనిద్దాం' అన్నారు. మొదటి సంవత్సరమంతా అలాగే గడిచింది. మరుసటి సంవత్సరం శ్రీ బచ్‌రాజ్ స్వయంగా డాక్టర్‌జీతో అన్నారు. 'నేనూ మిగతా అందరితోపాటు భోజనం చేస్తాను' అని!"

శ్రీ గురూజీకూడా అంతే-బోధన ద్వారా కాక ఆదర్శం ద్వారా పరి వర్తన తెచ్చేవారు. ఒక యూనివర్సిటీ హాస్టలులో హరిజన విద్యార్థులను భోజ నానికి అనుమతించని విషయాన్ని 1969 మార్చిలో వారి దృష్టికి తీసుకొని రాగా "ఈ విషయం వినడానికి నాకు చాల విచారంగా వుంది. దాదాపు నలభై సంవత్సరాల వెనుక నేను బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో విద్యార్థిగా వుంటున్నపుడు ఒక పేద హరిజన విద్యార్థి నావద్దకువచ్చి భోజనం విషయంలో తాను పడుతున్న యిబ్బంది వివరించాడు. నాతోపాటు వంటచేసే తోటి మిత్రు లతో నేను మాట్లాడిన తరువాత అతనిని కూడా ఖర్చులులేకుండా మాతోపాటు భోజనంచేయడానికి వారు అనుమతించారు. ఇలా రెండు సంవత్సరాలపాటు మేము కలిసేవున్నాం."

శ్రీ గురూజీ యింకా యిలా వివరించారు : "కులతత్వంమీద చరుకబారు దాడులు చేయడంలో నాకు నమ్మకంలేదు. ఎవరి హృదయమూ గాయపడని విధంగా దానిని రూపుమాపాలి. గత వారమే కొచ్చిన్‌లో ఒక ఎజవాతోపాటు భోజనంచేశాను. అంతేకాదు సుమా, నాతోపాటు పెద్ద ఆచార పరాయణుడైన నంబూద్రి బ్రాహ్మణుణ్నికూడ వెంట తీసుకొనిపోయి ఆ పని చేయించాను. సమస్యను పరిష్కరించవలసిన పద్ధతి యిది. అంతే తప్ప గొంతులు చించుకుంటేచే పరిష్కారం కాదు."

పేదలగురించి శ్రద్ధ తీసుకొనడమే ముఖ్యమైన విషయమని శ్రీ గురూజీ అన్నారు. మనలో జాతీయభావన లేకపోవడం, పేదలను మనం నిర్లక్ష్యం చేయ డమే మన జాతి పతనానికి కారణమైందనీ, ధనికులు పేదవారి బిడ్డలపట్ల కొంత శ్రద్ధవహించాలని అన్నారు.

"ఇంతకాలంగా మనం 'మాతృదేవోభవ, పితృదేవోభవ, అతిథిదేవోభవ' అంటూ వల్లిస్తూ వున్నాం. అదేవిధంగా యికమీదట 'దరిద్ర దేవోభవ, అజ్ఞాని

దేవోభవ' అని ప్రకటించి హిందూ దారిద్ర్యాన్ని, అజ్ఞానాన్ని పారద్రోలే కార్యానికి అంకితమవుదాం" అని వివేకానందుడు చెప్పినమాటలను శ్రీ గురూజీ తరచుగా ఉదహరిస్తుండేవారు.

ఈ ఆదర్శం అన్ని స్థాయిలవారిని ప్రభావితం చేసింది. 1946లో న్యూఢిల్లీ భంగీకాలనీకి గాంధీజీ తరలి రావటానికి ముందే అక్కడ ఆర్. యస్. యస్. తన కార్యాలయం ప్రారంభించడం గమనించదగ్గ విశేషం.

ఇంకా ముందే-1946లో-ఢిల్లీలో ఆసక్తికరమైన సంఘటన ఒకటి జరిగింది. నాడు న్యూఢిల్లీలోని హిందూ మహాసభ భవన్‌లోని కొన్ని గదులలో ఆర్.యస్.యస్ కార్యాలయం వుండేది. ప్రాంత ప్రచారక్ శ్రీ వసంతరావు ఓక్ అక్కడవుండేవారు. ఒకరోజు వారు ఒక బైఠక్ (సమావేశం) నిర్వహించారు. అర్ధరాత్రిదాకా సమావేశం సాగింది. కనుక దూరం నుంచి వచ్చిన కార్యకర్తలు కొందరు ఆరాత్రి అక్కడే గడుపుదామని నిర్ణయించారు.

మరునాటి ఉదయం వారంతా అక్కడ వుండగానే గందరగోళంగా అరుపులు, కేకలు వినవచ్చినై. ఫర్లాంగుదూరంలో అప్పుడే పూర్తిఅయిన లక్ష్మీనారాయణ దేవాలయం (బిర్లామందిర్) వైపునుంచి యీ కేకలు వస్తున్నట్లు గమనించారు. అసలేమిటి జరుగుతున్నదో చూద్దామని వసంతరావు ఓక్, నారాయణరావు పురాణిక్, వేదప్రకాశ్ కోహ్లి, మరికొందరు హైరోడ్డువైపువున్న గోడ మీదికి ఎక్కికూర్చుని చూశారు.

అక్కడ కనిపించిన దృశ్యానికి వారు దిగ్భ్రాంతులయినారు. వేలాది మంది అక్కడ గుమికూడారు. దేవాలయానికి ప్రారంభోత్సవం చేయడానికి మహాత్మాగాంధి వచ్చారు. తనతోపాటు ఒక హరిజనబాలుణ్ణి లోనికి తీసుకొనిపోవాలని ఆయన కోరిక. కాని పాతకాలపు పండాలు అది పడనివ్వటంలేదు. పిల్లవాడు రానిదే తాను లోనికి పోదలచుకోలేదు-గాంధీజీ. ప్రసిద్ధివహించిన సనాతనుల నాయకుడు గణేశదత్త గోస్వామి విజ్ఞప్తి చేసినాకూడా పండాలు ఖాతరుచేయలేదు. ఒకరిమీద ఒకరు అరుపులు, కేకలు, త్రోసుకోడాలు, నెట్టుకోడాలు మొదలయినై.

అంతలోనే ఆదంతా ఒకఅ స్తవ్య స్తగందరగోళపరిస్థితిగా తయారయింది. గాంధీజీ కూడా త్రొక్కిసలాటలో చిక్కుకుపోయారు. వారి మిత్రులు ఆత్మ రక్షణలోనే సతమతమవుతూ గాంధీజీని రక్షించలేనిస్థితిలో వున్నారు. ఆ గుంపు మధ్యలో గాంధీజీ ఊపిరి పీల్చుకొనడానికి కూడా బాధపడుతున్నారు. చాల ఆందోళనకరమైన పరిస్థితి అది. అంతలోనే విచిత్రం జరిగింది.

గుడిలోకి వెళ్ళే మెట్లప్రక్కన వున్న గోడమీద వసంతరావు ప్రభృతులు అప్పుడు నుంచునివున్నారు. శ్రీ వి. పి. కోఫ్లీ తమ డైరీలో యిలావ్రాశారు. "అంతలోనే చిరుతపులి మాదిరిగా వసంతరావు క్రిందికి దూకారు. మూర్ఛిల్ల నున్నట్లువున్న గాంధీజీని తమ వీపుపై ఎక్కించుకుని చకచకా మెట్లమీదుగా పైకి వెళ్లారు." కోఫ్లీ ప్రభృతులు వారివెనుకనే వెళ్లి హరిజనబాలుణ్ని లోనికి తీసుకొనిపోయారు. ఆ తరువాత అందరూ పైకివచ్చారు. పండాలదుండగం పారలేదు. "మహాత్మాగాంధీకి జై" నినాదాలతో మందిరానికి అనుకున్న విధంగా ప్రారంభోత్సవం జరిగింది.

వివిధ మతవర్గాలు, విశ్వాసాలకు చెందిన మన సాంప్రదాయిక మతాధిపతులనందరిని "అంటరానితనం మన ధర్మంలో ఒక భాగం"కాదని విస్పష్టంగా ప్రకటించడానికి ముందుకు రావలసిందిగా శ్రీ గురూజీ ప్రార్థించారు.

1969 డిసెంబరులో ఉడిపిలో జరిగిన కర్ణాటక విశ్వహిందూ సమ్మేళనంలో జగద్గురువులు, ధర్మాచార్యులు హిందూప్రపంచానికి మొదటిసారిగా ఇట్టి చారిత్రాత్మకమైన పిలుపుయిచ్చారు. ఇటీవల మళ్ళీ 1979 జనవరిలో దేశమంతటినుండి వచ్చిన వందలాది మంది ధర్మాచార్యుల దివ్యసముక్షంలో ప్రయాగలోని త్రివేణీసంగమంవద్ద లక్షలాదిమంది హిందువులు సమావేశమైన విశ్వసమ్మేళనంలో యీ ధర్మవ్యతిరేకమైన, కాన్సరువంటి దురాచారానికి స్వస్తి చెప్పవలసిందిగా మరొకమారు పిలుపుయివ్వబడింది.

"ఆర్.యస్.యస్. ప్రాబల్యంలో వున్నట్లు చెప్పబడే జనసంఘంవారు 1977లో జనతాపార్లమెంటరీపార్టీ నాయకత్వానికి సర్వప్రథమ అభిలషణీయ వ్యక్తిగా బాబూ జగజీవన్‌రామ్ పేరును సూచించడం కాకతాళీయంగాజరగలేదు.

మీరాబాయి పట్ల వారికి తక్కువ గౌరవం ఉండటం వలనకాదు. “ప్రతిబాద్యే బాలికకు సౌధవాసమెప్పుడో అని గాంధీజీ కన్యకలకు ఒకరూపం ఇవ్వాలని వారు ఆకాంక్షించడమే దీనికి కారణం.

మహిళల స్థానం పట్ల కూడా ఆర్.యస్.యస్. యిటువంటి క్రియాత్మకమైన, సమగ్రావగాహనతో కూడిన వైఖరినే ప్రదర్శిస్తున్నది. భారతీయులు మహిళలను సరిగా చూడరని విదేశీ విమర్శకులు చాలాకాలంగా తప్పు పడుతూవున్నారు. సామ్రాజ్యవాదుల యితర ఏజంట్లు కొందరు హిందువులకు వ్యతిరేకంగా ముస్లిములను, ఒక కులంవారికి వ్యతిరేకంగా మరొక కులంవారిని ఉసిగొల్పిన విధంగానే మిస్ కేథరిన్‌మేయో భారతీయ పురుషులకు వ్యతిరేకంగా భారతీయ మహిళలను రెచ్చగొట్టడానికి కూడా ప్రయత్నించింది. కాని వాస్తవ విషయమేమంటే దేశం మొత్తం వెనుకబడి అణగారి వున్న కారణంగానే ఆ మేరకు భారతీయ మహిళలుకూడ వెనుకబడి అణగారివున్నారు. ఇది తప్పిస్తే ప్రపంచంలోని మరియే యితర దేశంలోకన్నా భారత దేశంలోనే మహిళలస్థాయి మెరుగ్గా వున్నట్లు చరిత్ర సాక్ష్యం యిస్తున్నది.

భార్యను కొట్టడానికి మనువు అనుమతించినట్లు మనను విమర్శించేవారు ఉన్నారు. “నేరం చేసినపుడు భార్య, కుమారుడు, దాసిస, విద్యార్థి, స్వంత సోదరుడు “ఎవరినైనా మరియే శరీరం భాగం పై కాక వీపుపైననే” కొట్ట వచ్చునని (VIII : 299-300) మనువు అనుమతించిన విషయం వారు విస్మరిస్తున్నారు. తనయులకు కూడా మనువు “వ్యతిరేకి” అనవలసిందేనా?

“కుమారునితో కుమార్తె సమానం” (X: 130 అనికూడ మనువు వ్రాసిన విషయం వారు విస్మరిస్తున్నారు. “స్త్రీలు గౌరవించబడే చోట దేవతలు ఆనందిస్తారు, వారిని గౌరవించనిచోట అన్ని కర్మలు నిష్ప్రయోజనం అవుతాయి” (III: 56) అనికూడా మనువు వ్రాశాడు. పరిపక్వత పొందిన మూడు సంవత్సరాలలోగా తమ కుమార్తెకు వివాహం చేయడంలో తల్లిదండ్రులు విఫలురైతే తనకు నచ్చిన వరుని చూచుకునే స్వేచ్ఛ ఆమెకువుంది: తనకు నచ్చిన వ్యక్తిని వివాహమాడే స్వయంవర విధానాన్ని స్త్రీలు తమస్వంత ఆస్తిగా వుంచుకొనదగ్గ స్త్రీ ధనాన్ని ఒక్క హిందూ సమాజం” మాత్రమే శాస్త్రబద్ధంగా అనుమతించింది.

ప్రపంచమంతా పితృస్వామ్య సూత్రం మీద లింగారాధన మాత్రమే చేయగా ఒక్క హిందువులు మాత్రమే మాతృస్వామ్య సూత్రంమీద యోన్యారాధన కూడా చేశారు. హిందూ దేవతలందరూ వివాహితులయి వుండటమే గాక, వారి పేర్లలో పత్నినామమే తొలుతగా ప్రస్తావించబడుతున్నది. కనుకనే సీతారామ అని రాధేశ్యామ్ అని లక్ష్మీనారాయణ అని అంటున్నాం మన మత కర్మలన్నీ భార్యతోపాటు కలిసి చేయవలసినవే. మన దేశాన్ని కూడా మనం మాతృభూమిగా, భారతమాతగా పరిగణిస్తున్నాం.

"వారు (హిందువులు) ఏ సలహా కావలసినా లేక ఏ అత్యావసరం ఏర్పడినా తమ భార్యల సలహా తీసుకుంటూ వుంటారు." అని గమనించిన మహామద్ గజనీ ఆస్థాన చరిత్రకారుడు ఆల్ బిరూనీ ఆశ్చర్యం పొందాడు.

ప్రాచీన గ్రీసు దేశంలో తత్త్వవేత్తలు స్త్రీలు పురుషులకంటె 'తక్కువ వారు' కనుక పురుషులకు వున్నన్ని దంతాలు-36-స్త్రీలకు వుండవని, వారికి యింకా తక్కువ దంతాలు-32-వుంటాయని నిర్ధారించారు. ఏ స్త్రీ దంతాలయినా లెక్కపెట్టేంత శ్రమకు వారు సిద్ధం కాలేదు. చైనావారు బాలికలకు జీవితమే దుర్భరం అయే విధంగా ఇనుపబూట్లు తొడిగేవారు. ఇక ముస్లింలు తమ స్త్రీలకు ఆపాదమస్తకం బురఖా తొడిగారు.

ఇంగ్లీషువారు మత యుద్ధాలకు వెళ్లినప్పుడు వారిలో చాలామంది తమ భార్యలను గట్టిగొలుసులతో కట్టివేసి వెళ్ళే వారు. ఏ ప్రియులతోనో కలిసి వారు లేచిపోకుండా. స్త్రీ అసలు మానవ జాతికే చెందదని "నిరూపిస్తూ" ఒక్క 1595 వ సంవత్సరంలోనే 50 సైద్ధాంతిక వ్యాసాల (డాక్టరేటు కోసం) జర్మనీలోని ప్రముఖ విశ్వవిద్యాలయమైన ఎడిమ్బరోలో సమర్పించడం జరిగింది. 'మంత్రకత్తె' అని ఆరోపణ మీద మధ్యకాలపు యూరోపు స్త్రీలను సజీవ దహనం చేశారు. పురుషుల నెన్నడూ ఆ విధంగా చేయలేదు.

శివాజీతో పోరాడటానికి అఫ్జల్ ఖాన్ బిజాపూరు వెళ్ళినపుడు, తాను ఒక వేళ తిరిగి రాలేకపోతే తన భార్యలు మరొకరిని పెండ్లాడకుండా చూడటానికి మొత్తం 700 మంది భార్యలను వధించాడు.

ఇలాంటి ఘోరాలు హిందూ సమాజంలో సాధ్యపడి వుండేవికావు. ఫ్రెంచి విప్లవం, రష్యన్ విప్లవం రెండూ స్త్రీలస్థాయిని తగ్గించివేసినై. నెపోలియన్ కోడ్‌లో స్త్రీ పురుషుడి యిష్టానికి లోబడి వర్తించాలని (213వ అధికరణం), అతడు ఎక్కడికి వెళ్ళినా ఆమె అనుసరించి తీరాలని (214 వ అధికరణం) అతని అనుమతిలేకుండా ఆమె ఆస్తుల లావాదేవీలు చేయకూడదని (237 వ అధికరణం) విధించడం జరిగింది. వ్యభిచారం చేసే స్త్రీకి జైలు శిక్ష విధించబడింది. కాని పురుషుడు ఆమెని పెండ్లాడకూడదని మాత్రమే ఆంక్ష విధించబడింది. (293 వ అధికరణం). ఈ నెపోలియన్ కోడ్‌ను యూరోప్‌లో అధికభాగం దేశాలు ఆమోదించినై. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత మాత్రమే దీనిని స్త్రీలకు అనుకూలంగా మార్చారు. నిజానికి నెపోలియన్‌ను ప్రపంచంలోకెల్లా గొప్ప స్త్రీ ఎవరని నాటి ఫ్రెంచి మహావనిత మదాం డిస్టేల్ అడిగినపుడు, "ఎక్కువ మంది పిల్లలను కన్న స్త్రీ" అని నెపోలియన్ హేళనగా సమాధానం యిచ్చాడు.

రష్యాలో విప్లవం తర్వాత "నైపుణ్యంలేని అపనవ్వ శ్రామికులుగా" స్త్రీలను పరిగణించారు. వారు శారీరక శ్రమ చేస్తారు; పురుషులు మాత్రం వారిని 'పర్యవేక్షిస్తూ' వుంటారు. అరవై సంవత్సరాల క్రిందట రష్యన్ స్త్రీలు రష్యన్ పురుషుల కంటే రెండు సంవత్సరాలు తక్కువ జీవించేవారు; నేడు ఎనిమిది సంవత్సరాల తక్కువ ఆయుర్దాయం కలిగివున్నారు. సోవియట్ యూనియన్‌లో అన్నిటికంటే తక్కువ జీతం చెల్లించబడే వైద్యవృత్తిలో మాత్రమే స్త్రీలు రాణించగలుగుతున్నారు. పార్టీ కేంద్ర కమిటీలో 3 శాతం మాత్రమే స్త్రీలున్నారు.

అమెరికాలో స్త్రీల ఆయుర్దాయం ఎక్కువగా వున్నందున పురుషులకంటే వారు ఆస్తులు కలిగివున్నప్పటికి, అక్కడకూడా వారి పరిస్థితి గొప్పగాలేదు. చాలకాలం క్రిందటనే స్వామి వివేకానంద అన్నట్లు-అమెరికన్ మహిళకున్న హక్కులు ప్రయోజన కరమైనవికావు. భారతీయ మహిళ ప్రయోజనకరమైన హక్కులు అనుభవిస్తున్నది".

భారతీయ మహిళ పొందుతున్న ఉన్నత గౌరవానికి ప్రాతిపదిక ఏమంటే- యిక్కడ సెక్సు పాతకం కాదు, కనీసం ఒక ఒప్పందం కూడా కాదు; అదొక పవిత్ర అనుబంధానికి చెందినది. మధురై, రామేశ్వరాలను సందర్శించిన తరువాత కౌంట్ కిసర్లింగ్ యిలా వ్రాశాడు;

"లైంగిక చర్యను ఏదో అపవిత్రమైనదిగా కాకుండా, పవిత్రమైనదిగాను, ప్రకృతిలోని దివ్యత్వానికి ప్రతీకంగాను ప్రదర్శించడం యిక్కడ నా జీవితంలో మొట్టమొదటిసారిగా తిలకిస్తున్నాను. తోలుబొమ్మల ప్రతీకంలో శివ–శక్తిల సంయోగాన్ని రామేశ్వర మహోత్సవంలో దర్శించవచ్చిన భక్తుల మనస్సులలో ఏ విధమైన జుగుప్సాకరమైన భావన లేదు. నేటి రాత్రి యిక్కడి లింగానికి ప్రణమిల్లిన మహిళలెవరూ స్పెయినులో దివ్యత్వంద్వారా గర్భం దాల్చగల ఆదర్శస్థితికోసం ప్రార్థించే దైవ సేవికలకు విభిన్నంగా కనిపించలేదు. ప్రతి హిందూ భక్తుడు ఇంద్రియ ప్రేమను దివ్య నిర్మాణశక్తికి ప్రతీకగా మార్చి, దానిని పవిత్ర త్యాగభావనకు సాధనంగా వినియోగిస్తాడు. ఈ విధంగా బ్రహ్మ తమ ద్వారా తన విధి నిర్వర్తిస్తున్నాడని భావించకుండా భార్యాభర్తలు పరస్పరం సమీపించరాదని శాస్త్రాలు బోధిస్తున్నాయి. ఒకరినొకరు ప్రేమించే సమయంలోనే భౌతిక సుఖాన్వేషకులుగాక, జీవితపు దివ్యత్వమే వర్షిస్తున్న అనుభూతితో పరస్పరం గౌరవించుకొనడం వారు నేర్చుకుంటారు. ఆ విధంగా పాశవిక తలంపులు దివ్యత్వ అభివ్యక్తీకరణగా పవిత్రీకరణ పొందుతున్నాయి."

హిందువు పెళ్ళిని పవిత్రంగా భావిస్తాడు కనుకనే విడాకుల గురించిన ఆలోచనే అతడికి భయానకంగా వుంటుంది. నెహ్రూగారి హిందూకోడ్‌లో ఏమి చెప్పినా, హిందు వివాహం జన్మాంతరం కాకపోతే కనీసం జీవనపర్యంతపు బంధంగానయినా వుంటుంది. హిందూమహిళకున్న గొప్ప అదృష్టం యింతే. తన భర్త మరొక ఆడదానిపై మోజు పడినంత మాత్రాన తాను గెంటివేయబడే ప్రమాదం ఆమెకులేదు. దీనివలన ఆమెకు భద్రత, నిండుతనం, గౌరవం లభిస్తున్నాయి. మహిళకు యింతకంటె గొప్పహక్కు మరొకటి వుండదు. ఈ కారణం చేతనే పలువురు విదేశీ యువతులు భారతీయులను వివాహమాడుతున్నారు. చాలా కొద్దిమంది భారతీయ యువతులు మాత్రమే విదేశీయులను వివాహమాడుతున్నారు

స్థిరమైన కుటుంబమే స్థిరమైన సమాజానికి ప్రాతిపదికగా వుంటుంది. సురక్షితమైన కుటుంబ కుల వ్యవస్థలే ప్రపంచాన్ని ఆశ్చర్యచకితం చేసే స్థిరత్వాన్ని భారతీయ సమాజానికి యిచ్చినాయి. "ఈ దేశపు అక్షరత్వానికి ఏదో హేతువు వుంది" (కుఛ్ బాత్ హైకి హస్తిమితి నహీం(హమారీ) అంటూ ఇక్బల్ అబ్బుర పడ్డాడు. చరిత్రలోని అత్యంత కల్లోల సమయాల్లో మనకుస్థిరపాయంగా

నిలిపినవి మన విస్తీర్ణత, జన సంఖ్యలేకాదు. ఆ 'ఏదో హేతువు' అనబడిన-కుటుంబం, కులవ్యవస్థకూడా.

హిందువుల కుటుంబజీవనంయొక్క పవిత్రతను ఆర్.యస్.యస్. ప్రశంసిస్తుంది. గాంధీజీమాటల్లో చెప్పాలంటే తమచుట్టూ ఎల్లప్పుడు "అరడజను మంది రోమియోలు" వుండాలని కోరుకునే ఆధునిక జూలియట్‌లంటే దానికి సానుభూతి లేదు. వుమెన్స్ "లిబ్బర్స్"ను మహిళాలోకానికి పరమశత్రువులుగా భావిస్తుంది. విశృంఖలవాదం ఏ సమాజానికయినా నిస్సంశయంగా వినాశం కలుగజేస్తుందని శ్రీ గురూజీ నమ్మారు. మొగలుపాలన అంతిమదినాలలో, మరాఠాపాలన అంతిమ దినాలలో రెండు సమయాలలోనూ - నైతిక విశృంఖలత తాండవించిందని, అది నాటి సాహిత్యంలోకూడ పూర్తిగా ప్రతిబింబించిందని శ్రీ గురూజీ అన్నారు.

ఈ విషయంలోకూడ ఆర్.యస్.యస్. ఉపన్యాసాలద్వారాకాక ఆచరించడం ద్వారానే ఎక్కువగా బోధిస్తున్నది. స్త్రీల హక్కులగురించి స్వయం సేవకులు నినాదాలతో ఆర్భాటంచేయరు, కాని అవి రక్షించబడేట్లు చూడటంలో వారే అగ్రగాములుగా వుంటారు.

డా॥ హెడ్గెవార్ కలకత్తాలో వైద్యవిద్యార్థిగా వుంటున్న రోజులలో విప్లవకారుల నాయకుడైన శ్యామసుందర చక్రవర్తి కుమార్తెకు సంబంధించిన సమస్య వచ్చింది ఆమెకు వివాహం కావలసివుంది. దీనికి కొంతడబ్బు అవసరం. ఆర్.యస్.యస్. సంస్థాపకుడు కానున్న డా॥ హెడ్గెవార్ ఆ సమయంలో కట్నం మొదలైనవాటిని సమస్యగా చేయలేదు. ఆయన నెమ్మదిగా చిన్న మొత్తం వసూలు చేసి పెండ్లిఅయేట్లు చూశారు.

ఒకప్పుడు డా॥ హెడ్గెవార్ తమ మిత్రుడు గోవిందరావు దేశపాండేతో ఆర్వీలో వున్నారు. గోవిందరావు గారి మేనకోడలి మంచి అప్పుడే ఒక లేఖ వచ్చింది. తనను ఒక వృద్ధుడికిచ్చి పెండ్లిచేయాలని తమ పినతండ్రివాళ్లు నిశ్చయించినట్టు అందులో తెలిపింది. గోవిందరావు చాల గాభరాపడ్డారు. అయితే కేశవరావుమాత్రం వారిని ఆందోళన పడవద్దని, చేయవలసినదంతా తాను చేస్తానని అన్నారు. సమయానికి పెండ్లి కొడుకు బృందంవారు వచ్చేసరికి అకస్మాత్తుగా డా॥ హెడ్గెవార్ అక్కడ కారులో ప్రత్యక్షమై, పెండ్లికుమార్తెను

అందులో ఎక్కించి కారులోనే అదృశ్యమైనారు. ఆపైన ఆ అమ్మాయికి నచ్చిన వ్యక్తితో వివాహం జరిపించారు. పాత "పెళ్లికొడుకు" ఆయనపై దావావేశారు. అయితేనేం, ఆ అమ్మాయిపై ఆ మాత్రం శ్రద్ధచూపకుండా వుండటం డాక్టరుజీకి సాధ్యంకానిపని.

మరొకసందర్భంలో ప్రఖ్యాత మరాఠీరచయిత శ్రీ మఖోల్కర్ ప్రేమలో పడ్డారు. వారి కుటుంబంవారు దీనికి ప్రతిఘటించారు. ఆయనను విచారపడవద్దని డా॥ హెడ్‌గెవార్ చెప్పారు. అతని పెండ్లి జరిపించారు. ప్రాచీన హిందూచట్టం కూడ "గాంధర్వ వివాహం" పేరుతో ప్రేమవివాహాలకు గుర్తింపు యిచ్చిన సంగతి మరువరానిది.

శ్రీ గురూజీ తమ తల్లిదండ్రులకు మిగిలిన ఏకైక సంతానం. కనుక వారిని పెండ్లిచేసుకొమ్మని బలవంతం చేశారు. ఒకసారి ఒక అమ్మాయిని చూడటానికి వారిని తీసుకొనివెళ్లారు. తిరిగి వచ్చినతరువాత అమ్మాయి ఎట్లావుందని అడిగితే తానసలు చూడనేలేదని, అంతసేపూ కళ్ళుమూసుకునే వున్న సంగతి చెప్పారు. అనేక సంవత్సరాల తరువాత 1969లో పూనాలో అమరేంద్రగాడ్గిల్ వ్రాసిన "మాతృపూజన గ్రంథ్"ను ఆవిష్కరిస్తూ శ్రీ గురూజీ "అమ్మాయిని చూడటమా? అమ్మాయిఅంటే నాటకమా మీదుపోయి 'చూడటానికి'?" అని ఆశ్చర్యం వ్యక్తంచేశారు.

స్త్రీలనందరిని మాతృసమానులుగా శ్రీ గురూజీ భావించారు. మాత ద్వారానే తప్ప మానవుడు భగవంతుని చేరుకోలేడు. ఈ విషయంలో వారు రామకృష్ణ పరమహంస జీవితంలోని ఒక సంఘటన చెప్తుండేవారు. అద్వైతివి అయివుండికూడా కాళీమాతను యింకా ఎందుకుఅర్చిస్తున్నావు అని రామకృష్ణుణ్ని అతని తొలిగురువు తోతాపురి ఆశ్చర్యంగా అడిగారు. అంతలోనే తోతాపురికి తీవ్రమైన విరేచనాలవ్యాధి పట్టుకుంది. ఈ దుర్భరవేదన పడలేక ఒక దశలో గంగలోదూకాలని నిశ్చయించారు. కాని సరిగా మునిగేందుకయినా చాలినంత నీరు గంగలో కనిపించలేదు. అట్టిస్థితిలో వారికి జగన్మాత దర్శనం కలిగింది. "భగవంతుణ్ని నా ద్వారానే చేరుకోగలవు. బ్రహ్మన్ని నా ద్వారానే అర్థం చేసుకోగలవు" అని మాత చెప్పింది. ఆటుపైన తోతాపురికూడా మాతృఅర్చన ప్రారంభించారు.

క్రైస్తవ మతానికి ఔన్నత్యాన్ని చేకూర్చడంలో మెడోనా (శిశువైన జీససును ఎత్తుకున్న మేరీమాత) గొప్ప పాత్రవున్న విషయం శ్రీ గురూజీ ఉటంకిస్తూ ఉండేవారు.

వ్యక్తిగత జీవితంలో పవిత్రతపట్ల ఆర్.యస్.యస్.కు విశ్వాసముంది. లైంగిక పవిత్రతలో దానికి నమ్మకముంది. వేలాదిమంది యువకులు ప్రచారకులుగా మారారు. ప్రచారకులు తప్పనిసరిగా బ్రహ్మచర్యం అవలంబిస్తారు. కాని ధార్మిక మతాలవలెనే ఆర్. యస్. యస్. సంస్థలోకూడ ఎన్నడూ అనైతికత తలయెత్తలేదంటే ఆర్.యస్.యస్.యొక్క నాయకత్వపు ఆదర్శం ఎటువంటిదో సంఘం సిద్ధాంతంలో సభ్యులను పవిత్రీకరించే సామర్థ్యం ఎంతగా వున్నదో అర్థమవుతుంది.

ఆధునిక దృక్పథం ప్రకారం ఆర్. యస్. యస్. పద్ధతులు పాతవనే చెప్పాలి. సెక్సును పవిత్రంగాను, వివాహాన్ని పవిత్రానుబంధంగాను పరిగణించే హిందూ ఆలోచనావిధానంయొక్క అత్యున్నత మూల్యాలను నిలిపివుంచడానికి అది కటిబద్ధమైవుంది.

రాష్ట్రీయ సేవికాసమితి స్థాపనకు డాక్టర్‌జీ ఆశీస్సులందించారంటే అందుకు కారణం లేకపోలేదు. కాని అది రాష్ట్రీయ స్వయంసేవకసంఘంతో ఏ మాత్రం సంబంధంలేకుండా నడవాలని విధించారు. సమితిని నడపడంలో వృద్ధ సౌజన్యమూర్తిఅయిన అప్పాజీజోషినుంచి మాత్రమే తప్ప, తన తనయుడినుంచి అయినా ఎట్టి మార్గదర్శనం తీసుకొనరాదని మౌసీజీతో ఖండితంగా చెప్పారు. రెండు సంస్థలూ సమాంతరంగానే వున్నా రైలుపట్టాలవలె వేరుగా వుండాలన్నారు. ఈ పట్టాలు కలుసుకొనడం సంభవించినట్లయితే, సంఘం సమితుల రూపంలో ప్రాతినిధ్యంవహిస్తున్న జాతీయోద్యమం ఏనాడో పట్టాలు తప్పిఉండేది. మానవనైజాన్ని, హిందూసంస్కృతిని రెండింటిని సంఘంచక్కగా అర్థంచేసుకున్నది కనుకనే అట్టి పొరపాటు జరుగలేదు.

చరిత్ర పరిచిన బాటలో...
(భవిష్యత్సూచిక చరిత్ర)

మృత్యు శయ్యమీద వున్న నెపోలియన్ అంటాడు. "నా కుమారుడు చరిత్ర చదవాలని నా కోరిక. ఎందుకంటే అదే అసలైన మార్గాన్ని సూచిస్తుంది."

భారత దేశ చరిత్ర ఆర్.యస్.యస్ కు జీవన స్ఫూర్తి అయింది.

'మాతా భూమిః పుత్రోఽహం పృథివ్యాః' - "ఈ భూమి నా తల్లి, నేను ఆమెకు పుత్రుణ్ని" అని వైదిక ఋషి అన్నాడు.

ఉత్తరం యత్ సముద్రస్య దక్షిణం హిమవద్గిరేః!

వర్షం తద్ భారతానాం భారతీ యత్ర సంతతిః॥

'సముద్రాలకు ఉత్తరంగాను, హిమవత్పర్వతాలకు దక్షిణంగాను వున్న భూమి భారతభూమి, దీనిని మాతృభూమిగా పరిగణిస్తూ తాము యీ భూమికి తనయులుగా భావించుకునేవారు భారతీయులు'- అని పురాణాలు అంటున్నాయి.

ఈ ప్రపంచాన్ని అత్యంత వాస్తవంగాను, స్థిరంగాను, నిజానికి శాశ్వతమైనదిగాను భావించే సమాజం నిజంగా నిత్య చైతన్య శీలిగా వుండేసమాజం.

ధ్రువా ద్యౌః ధ్రువా పృథ్వీ ధ్రువాసః పర్వతా ఇమే।

ధ్రువం విశ్వమిదం జగత్ ధ్రువో రాజా విశామయం॥

"ఆకాశం శాశ్వతం; భూమి శాశ్వతం; ఈ పర్వతాలు శాశ్వతం; ప్రపంచమంతా శాశ్వతమే; ప్రజాసేవకుడైన ప్రభువుకూడా శాశ్వతుడే"

ఈ భూమిలోని అణువణువున్నూ, కణకణాన్ని ప్రజలు ప్రేమిస్తారు. ఈ భూమిని విష్ణుపత్నిగా భావిస్తూ, ఆమెపై పాదం మోపినందుకు క్షమాపణ

వేడుతారు. హిమాలయాన్ని "శివుని చిరునవ్వు"గా కాళిదాసు అభివర్ణిస్తాడు. అశ్వమేధ, రాజసూయ యజ్ఞాదులద్వారా సార్వభౌమాధికారం సంపాదించిన చక్రవర్తులు, రాజుల రాజ్యాలే కాక యీ దేశంలో గణతంత్ర రాజ్యాలు సభలు, సమితులు, రహస్య బాలెట్ కోరం యివన్నీ కూడా వుండేవి. వర్ణాశ్రమ ధర్మాలు యీ దేశాన్ని సామరస్య పూర్వకమైన వైవిధ్యత గల దేశంగా నిలిపి వుంచినాయి.

సార్వభౌమత్వం అనేది వ్యక్తిగా రాజులలో వున్న అధికారం కాదు. అనేక నియంత్రణలతో, సంతుకరణలతో సంస్థాబద్ధం చేయబడి మహర్షులు ప్రవచించిన ధర్మానికి విధేయంగా నెలకొల్పబడిన వ్యవస్థ అది.

బెలూచిస్తాలోని హింగ్లాజ్ నుంచి బంగ్లాదేశ్ లోని చిట్టగాంగ్ వరకు, యీ భూమి నాలుగు చెరగుల సుదూరంగా నెలకొల్పబడిన యాత్రాకేంద్రాలు యీ ప్రజలను సంతోషదాయకమైన పవిత్రాను బంధంతో సమైక్యం చేసినై.

ప్రజలు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి ఎప్పుడూ మారుతూనే వున్నారు. తప్ప "ఆర్యుల దండ యాత్ర" అనేది ఎన్నడూ జరుగలేదు. బ్రిటిషు వారుతాము యిక్కడికి వచ్చి పరిపాలించడంలోని న్యాయబద్ధతను నమ్మించడానికి యీ "దండ యాత్ర సిద్ధాంతం" కనిపెట్టారు. ఆర్యులు కాని, మొగలులు కాని, ఆంగ్లేయులు కాని ఎవరో ఒకరు విదేశీయులచేతనే భారతదేశం ఎప్పుడూ పరిపాలించబడుతూ వచ్చిందని నమ్మించడం వారిఉద్దేశం. డా॥ అంబేద్కర్ పేర్కొన్నట్లు యీ విషయంలో అత్యుత్తమమైన సాక్ష్యంగా గ్రహించదగిన వేదాలలో దీనికి సంబధించి ఒక్క మాటయినాలేదు.

శూద్రులు ఆర్యులేనని చాణక్యుడు అన్నాడు; అన్ని కులాలలోను దస్యులున్నారని మహాభారతం అంటున్నది. డా॥ అంబేద్కర్ చెప్పిన దానినిబట్టి క్రీ. శ. 400 వరకు యీ దేశంలో అస్పృశ్యత లేనేలేదు. క్రీ. శ. 400 ప్రాంతంలో బౌద్ధుల ప్రభావంలో పడిన గుప్తులు కొన్నిరకాల మాంసాహారాన్ని నిషేధించారు. కాని ఆ నిషేధాన్ని ఖాతరు చేయక తమ పద్ధతులు కొనసాగించిన వారు "విడిపోయిన ప్రజ" అయినారు. వారినెవరూ తాకలేదు.

మన జాతీయ సరిహద్దులు హిమాలయాలనుంచి సముద్రాల వరకే విస్తరించి వున్నప్పటికి మన ప్రభావం మాత్రం ఇరాన్, మంగోలియా, సైబీరియా

లనుంచి వియత్నాం, ఇండోనేషియాలు దాటి భిక్షుచమన్‌లాల్ చెప్పిందికూడా నిజమే అయితే బహుశః "హిందూ అమెరికా" వరకుకూడా ప్రసరించింది. అలెగ్జాండరు మొదలుగా ప్రతి సాహసికుడు దోచుకుందామని వచ్చేటంత సంపన్న వంతంగా దేశం వుండేది. కళలు శాస్త్రిల్లో మన మహత్తర ప్రతిభను గుర్తించి వివిధ దేశాలనుంచి జ్ఞానార్థులు వారణాసి, వైశాలి, నలంద తక్షశిలలకు వచ్చారు. భారత వర్షం 'జగద్గురువు' అయింది. భారతీయ చరిత్ర వ్రాసిన తొలి ముస్లిం అల్‌బిరూనీ "హిందువులు తమ దేశంవంటి దేశం, తను జాతివంటి జాతి, తమ రాజులవంటి రాజులు, తమ మతం వంటి మతం, తమ విజ్ఞానం వంటి విజ్ఞానం వేరే లేవని విశ్వసిస్తారు" అని వ్రాశాడు.

ప్రపంచంలోని మరొక మహానాగరికత గల చైనా "ఇంటూ"ను ప్రపంచంలో కేంద్ర రాజ్య (చుంగ్‌కువో) గా గుర్తించింది.

నేడు మన సరిహద్దులు ఎంతగా కుంచించుకు పోయినవంటే లాహోరు, ఢక్కా కూడా "విదేశ భూభాగాలు" అయినై "ఇండియా" అనే పేరు రావడానికి కారణమైన ఇండస్ కూడా నేడు భారత రాజ్యానికి వెలుపలనేవుంది. ఇప్పుడు మన దేశానికి వస్తున్న విదేశ విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడమేకాక వేలాదిగా మన విద్యార్థులే విదేశాలలో అధ్యయనం చేయడానికి తరలిపోతున్నారు.

క్రైస్తవులు ప్రపంచమంతటిలో ప్రాబల్యం సంపాదించుకొని వుండగా, ముస్లింలు రెండు డజన్ల దేశాలపై ఆధిపత్యం చెలాయిస్తూవుండగా, దాదాపుగా వారితో సమాన సంఖ్యలో వున్న హిందువులు హిందూస్తాన్‌లోనయినాఆదరణకు నోచుకోలేని అభాగ్యులైనారు.

ఆలోచనా పరుడైన ప్రతి భారతీయుడికి యీ పరిస్థితి బాధ కలిగిస్తున్నది. మన పతనానికి కారణభూతమైన అంశాలను విశ్లేషించి, దేశాన్ని దాని పూర్వపు ఔన్నత్యపు స్థితిలోకి తెచ్చి ప్రపంచంలో దాని న్యాయబద్ధమైన స్థానాన్ని పునరుద్ధరించడానికి, శతాబ్దాలుగా జరుగుతూ వచ్చిన అనేక బృహత్ ప్రయత్నాలలో ఆర్.యస్.యస్. ఒకటి మాత్రమే.

భారతదేశ పతనానికి అనైక్యతే కారణమని ఆర్.యస్.యస్. నిర్ధారిస్తున్నది. ఈ విషయం స్పష్టంగా తెలుస్తూనేవుంది. మన రాజుల మధ్య స్పర్థలే

లేకుంటే ఘజనీ కాని, ఘోరీకాని, క్లైవుగాని భారతదేశంపై కాలుమోపగలిగే వారు కాదు.

మన భారతీయులు అడ్డుకోలేని యితర శక్తులుకూడా కొన్ని మన పత నానికి కారణాలైనట్లు కనిపిస్తున్నది. ఆర్నాల్డ్ టాయన్‌బీ చెప్పిన ప్రకారం ప్రపంచంలో ఇండిక్ (భారతీయ) సినిక్ (చైనా), సిరియక్, గ్రీకో-రోమన్ అనే నాలుగు ప్రధాన నాగరికతలుంటూ వచ్చినై. ఈ నాగరికతలు ఒకదాని కొకటి ప్రతిస్పందిస్తూ వుండేవి. ఆయన చెప్పిన దానినిబట్టి అలెగ్జాండరు మొద లైన గ్రీకుపాలకులు పశ్చిమాసియాను గ్రీకో-రోమన్ నాగరికత క్రిందికి తేవా లని చూచినప్పుడు, దానికి సిరియక్ నాగరికత చూపిన ప్రతిక్రియే ఇస్లాం. ఇస్లాంయొక్క సవాలు కారణంగా అంతవరకు అనేక ఆదిమజాతి నమ్మకాలకు, ఆదిమజాతి దేవతలకు స్థానంగావుంటూవచ్చిన ఐరోపాలో క్రైస్తవులు ప్రారంభిం చిన మత యుద్ధాలవల్ల స్థానిక జాతీయవాదాలు తలయెత్తి స్థానిక క్రైస్తవులను, "పాగన్"లను, అధిక సంఖ్యాకుల మతమైన ఇస్లాంను ఆమోదించేట్లు చేసినై. మత యుద్ధాలు విఫలంకాగా ఇస్లాంపై తమ ఆధిక్యత ప్రదర్శించే ఉద్దేశంతో యూరోపియనులు గుడ్‌హోప్ అగ్రం మీదుగా అరేబియా సముద్రంలోకి చొచ్చుకువచ్చారు. అరేబియాసముద్రంలోని పోర్చుగీసువారిని, యితర క్రైస్తవు లను ఎదుర్కొనడానికై దారిలో ఈజిప్టును అణచివేస్తూ టర్కీ ముందుకు సాగి వచ్చింది. కాని యిక్కడ టర్కీ దురదృష్ట మేమంటే ఎర్ర సముద్రానికి ఆవల వైపుననే నిర్మాణానికి కావలసిన కలప దుర్లభమై క్రైస్తవ 'కాఫిర్లకు' సము ద్రంలో ప్రతిఘటన యిచ్చే ఎత్తు పారలేదు. ఒకదానికొకటి ప్రతిక్రియ చూపు తున్న యీ రెండు సామ్రాజ్యవాదాలమధ్య అడకత్తెరలో పోక చెక్క మాదిరిగా యిప్పుడు భారతదేశం చిక్కుకుపోయింది.

అంతటితో అయిపోలేదు. అనేక శతాబ్దాలుగా ఇరాన్, ఇరాక్, మొసుల్, ఖొరసాన్‌లలో భారతీయులు స్థిరపడివున్నారు. అజర్‌బైజాన్‌లో అగ్ని పూజా విధానం మొదలయినపుడు ఇరాన్ రాజు గుస్తావ్‌కు అది ఆగ్రహం కలిగించింది. ఆయన హిందువులందరిని బహిష్కరించాడు. దీనితో భారతదేశంలో పశ్చిమా శియాపట్ల తీవ్ర వ్యతిరేకత ప్రబలింది. కనుకనే తరువాత ఆవైపునుంచే యిస్లాం ఒక చేతిలో ఖడ్గం మరొకచేతిలో ఖురాన్‌తో వచ్చినపుడు భారతీయుల అసంతుష్టి ద్విగుణీకృతమైంది.

మహమద్ గజనీతోపాటు భారతదేశానికి వచ్చిన గొప్ప చరిత్రకారుడు అల్-బిరూని. "హిందువులు మాకు అన్నివిధాల విరుద్ధంగా వున్నారు. వారు నమ్మేదానిలో మాకుగాని, మేమునమ్మేదానిలో వారికిగాని నమ్మకం లేకపోవటాన వారికీ మాకు మతంలో ఎక్కడా పొంతనలేదు... మహాఅయితే వాళ్లు వాగ్యుద్ధం మాత్రం చేస్తారుకాని మతసంబంధమైన వివాదాలకు తమ ఆత్మనో, శరీరాన్నో, ఆస్తినో ఫణంగా పెట్టడంమాత్రం ఎన్నడూ చేయరు." అని వ్రాశాడు. "మహమూద్ యీ దేశాన్ని పూర్తిగా కొల్లగొట్టి తన దురంతాలతో హిందువులను గాలికెగిరిపోయి దూరంగా పడే దుమ్ముకణాలుగా మార్చాడు. అయితే విచ్ఛిన్నమైపోయిన వారి అవశేషాలలో ముస్లిములందరిపట్ల తీవ్రమైన, రాజీలేని వైముఖ్యత వుంది" అనికూడా వ్రాశాడు.

ఇదంతా చూచివుండినట్లయితే మహమ్మద్ ప్రవక్త భార్యలలో ఒకరికి "హింద్" అనే పేరువుంది. "ఈ హింద్‌ను, ఈపేరుతోవున్న దేశాన్ని అల్లా ఆశీర్వదించుగాక" అని ప్రవక్త అంటూవుండేవాడు.

జాతుల అదృష్టాలలోని చక్రగతి సంగతి అటుంచి, పతనస్థితికి చేరుకున్న బౌద్ధమతంవల్ల అనేక విధాలుగా అసమ్మతి ప్రబలి, దేశం బలహీనం కావటానికి కారణమైంది. పృథ్వీరాజ్ ఆస్థానకవి చాంద్‌బర్దాయి బౌద్ధులమీదనే పూర్తి నింద మోపాడు. నోబెల్‌బహుమతి గ్రహీత ప్రొ॥ కుజ్నెట్స్ అభిప్రాయం ప్రకారం సరిగా బౌద్ధమతం దేశంలో ప్రాబల్యంవహించిన శతాబ్దంలో దేశజనాభా బాగా పడిపోయింది. తత్వవేత్త కౌంట్ కీసర్లింగ్ "బుద్ధునిబోధనలు చదువుతున్నప్పుడు ఆయన మనుషుల్ని వృక్షజాతిలోకి మార్చదలుస్తున్నాడా అని నాకు తరచుగా సందేహం కలుగుతుండేది. అంతపనీ ఆయనచేశాడనటంలో సందేహంలేదు" అని వ్రాశాడు.

అదృష్టవశాత్తు భారతదేశం పూర్తిగా అణచివేయటానికిగాని, తుడిచివేయబడటానికిగాని సాధ్యంకానంత పెద్దదేశం, మనం గట్టిగానే రక్షణచర్యలకు పూనుకున్నాం. అమెరికన్ ఇండియన్లమాదిరిగా తుడిచివేయబడాలన్నా అందుకుకూడ వీలుకానంత పెద్దసంఖ్యలో మనం వుండటం–యిదికూడ మళ్ళీ అదృష్టమేఅనవచ్చు. మన సాంఘిక వ్యవస్థలుకూడ మనను కాపాడటంలో మంచిపాత్ర వహించినాయి. మన కులాలు, పంచాయితీలు, జనపదాలు మొదలైన వ్యవస్థలు మనకున్నాయి.

దాడుల ఉప్పెన తాకిడికి యివన్నీ అడ్డుకొని నిలిచినై. ఇరాన్‌లో యీ రకమైన ప్రజావ్యవస్థలు లేనందున వారి జాతీయ ఐక్యతకు ప్రతీకగా వున్న రాజును తొలగించడంతోనే ఆ దేశం లోబడిపోయింది. దండయాత్రీకుల అన్యాయపు ప్రభుత్వాన్ని ప్రతిఘటించడం యీ కారణాలన్నింటివలన మనకు సాధ్యపడింది. రాణా సంగా, హేము, ప్రతాప్, శివాజీ, గురుగోవిందసింగ్, విజయనగర కృష్ణ దేవరాయలు ఇస్లాం ఉప్పెనను అణచివేశారు.

విజేతలను పరాజితం చేయడం జరిగింది. "మిగతా ప్రపంచమంతా వట్టి ఖైదు కాగా భారతదేశాన్ని స్వర్గంగా ముస్లింలు పరిగణిస్తారు" అని కవి అమీర్ ఖుస్రూ వ్రాశాడు. "మక్కాయే దానికి (ఢిల్లీకి) భక్తితో ప్రదక్షిణలు చేస్తుంది; దేవతలే అనిపిస్తారు ధాని ప్రజలు" అని పాడాడు.

మార్క్స్ మాటల్లో "ఇండియాను ఒకరితరువాతఒకరుగా పాదాక్రాంతం చేసుకున్న అరబ్బులు, టర్కులు, మొగలులు అనతికాలంలోనే హైందవీకరణం పొందారు, చరిత్రయొక్క శాశ్వతసూత్రం ప్రకారం అనాగరిక విజేతలు పాలితుల శ్రేష్ఠతర నాగరికతచేత పరాజితులైనారు." భారతదేశీయుల ప్రస్తావన వచ్చినపుడల్లా మార్క్స్ వారిని "హిందువులు"గానే పేర్కొనడం గమనించ దగిన విషయం.

ఐరోపాపై యిస్లాం దాడులు ఆ ఖండంలో వేగంగా క్రైస్తవీకరణం తెచ్చిపెట్టినట్లుగా పశ్చిమాసియాలో క్రైస్తవులు ప్రారంభించిన మతయుద్ధాల వల్ల అక్కడ ఇస్లామీకరణం త్వరగా పూర్తిఅయినట్లుగా భారతదేశంపై ముస్లిం దాడులవలన దేశంలోని వివిధ ఆదిమజాతులవారిలో "సంస్కృతీకరణం" లేక "హైందవీకరణం" వేగంగా జరిగిపోయింది. ముస్లింలు పాలించిన 800 సంవత్స రాల కాలంలో యీ వర్గాలలో హిందూత్వం విస్తృతంగా వ్యాపించిందని మాక్స్ వెబర్ అంటాడు.

ఎక్కడోవున్న ఇండోనేషియా, మలేషియాలనుకూడ తన చెప్పుచేతల్లోకి తెచ్చుకోగలిగిన యిస్లాం భారతదేశంలో మాత్రం నిరోధించబడింది. ఉర్దూ

మహాకవి హాలి అంటారు :-

వహ్ దీనెయిలాహీకా బేబక్ బేడా
నిశాన్ జిస్‌కా అక్సాయి ఆలంమేపహుంచా
మజహిం హువా కోయీ ఖత్‌రా నా జిస్‌కా
నా "అమ్మాన్"మేం ధిత్‌కానా "కుల్జాం"మే ఝిఝుకా
కియే పస్సిపార్ జిస్‌నే సాతోం సమందర్
వహ్ డుబా దహనేమేం గంగాకా అకర్

(నిర్భీక యిస్లాం నౌక యొక్క పతాకం ప్రపంచ మంతటా రెపరెప లాడింది. "అమ్మన్" లోగాని, "కుల్జాం" లోగాని ప్రమాదాలకుఅది చలించలేదు. సప్త సముద్రాలు దాటివచ్చిన యీ నౌక గంగలోకివస్తూనే బుడుంగున మునిగి పోయింది.)

అయితే ఈ దశలో మనమూ ఎన్నో పెద్దదెబ్బలే చవిచూశాం. లక్షలాది మంది బానిసలుగా కొనిపోబడి, 'జిప్సీలు'గా ప్రపంచంలో తిరుగాడే పరిస్థితి ఏర్ప డింది. భారతభూమికి ఏర్పడిన సవాల్‌ను ఎదుర్కొనడానికై దేశాంతరాల్లో నివసి స్తున్న భారతీయులను యిక్కడకు రప్పించి సముద్రం ద్వారా వలస పోవడం ఆంక్షవిధించబడింది. దీనివల్ల ఆగ్నేయాసియాలో హిందువుల ప్రభావం కుప్పకూ లిపోయింది. అంతవరకు భారతీయుల సమర్థనతో నిలిచిన దక్షిణ వియత్నాంను చైనావారి సమర్థనతో ఉత్తరవియత్నాం ఓడించింది. చైనా యిక తనదే "కేంద్ర సామ్రాజ్యం" (చుంగ్‌కువో) గా ప్రకటించుకుంది.

అక్బరును శాకాహారిగా, దారాను సంస్కృత విద్వాంసునిగా మార్చగలి గినంతగా భారతదేశం యిక్కడకు వస్తున్న ముస్లిములను ప్రభావితం చేసింది. మొగలు చక్రవర్తులంతా "గంగాజలం" మాత్రమే త్రాగడం మొదలుపెట్టారు. ఇ. టి. హేవల్ మాటల్లో "తాజ్‌మహాలుకు, బీజాపూరులోని గొప్ప కట్టడాలకు స్ఫూర్తి ఎక్కడనుంచి వచ్చిందో తెలుసుకోవాలంటే మనం చదువ వలసింది- భారతీయకళనేతప్ప, అరబ్, పర్షియన్, యూరోపియన్ కళలనుకాదు. వీటిలోని భారతీయత సెంట్‌పాల్స్ కాథడ్రల్, వెస్మినిస్టర్ ఆబేలలోని యింగ్లీషు తనం కంటే ఎక్కువే.

కాని భారతదేశంపై పశ్చిమాసియా ప్రభావంకూడా ఘనమైనదే. శివాజీ సహితం మొగలు జమీందారు తరహాలో వేషధారణ చేశాడు. హిందువులనందరిని

సమైక్యం చేయడానికి పిలుపుయిస్తూ మీర్జా రాజా జయసింగ్‌కు అతడు వ్రాసిన లేఖ. పర్షియన్ భాషలోనేవుంది. ఇటీవల గాంధీజీ కుమారుడు, నెహ్రూసోదరి, కృపలానీ సోదరుడు యిస్లాం పుచ్చుకునేవరకు వారిలో యిద్దరూ తిరిగి స్వమతం లోకి వచ్చినప్పటికీ-మతాంతరీకరణల ప్రవాహం సాగుతూనే వచ్చింది.

1707 లో ఔరంగజేబు మరణించినాటికి మన పరిస్థితి మెరుగవుతూంది. భారతదేశం తన వ్యవహారాలు చక్కదిద్దుకోగలదని కూడ అప్పట్లో అనిపించింది. కాని 1761 లో ఆ ఆశ భగ్నమయింది. మరాఠా నాయకులలోని అనైక్యతవల్ల అట్టి ఆశకు తిలోదకాలు యివ్వవలసి వచ్చింది. రాజకీయంగా ముస్లిం ఇండియా మరణించిన విషయం అప్పటికి స్పష్టమైంది గాని, హిందూ ఇండియా శక్తి హీనమై పునర్జన్మించే స్థితిలో లేదు.

ఇంతలో బ్రిటిషువారు రంగప్రవేశం చేశారు. ప్లాసీ యుద్ధానికి 70 సంవత్సరాల ముందే 1687 లో ఈస్టిండియా కంపెనీ డైరెక్టర్లు మద్రాసులోని తమ వారికొకరికి ఒక లేఖ వ్రాస్తూ "భారతదేశంలో విశాలమైనది, దృఢంగా, సురక్షితంగా నిలిచేది, శాశ్వతమైనది అయిన ఆంగ్ల రాజ్యానికి పునాదిగా నిలువగల పౌర, సైనిక శక్తుల వ్యవస్థను స్థాపించడం, దీనికి కావలసిన భారీ నిధులను సమకూర్చుకొనడం" తమ ఉద్దేశాలని వ్రాశారు.

"సార్వభౌమాధికారం నేలపై పడిపోయింది, ఎవరైనా దాన్ని యిట్టేఏలుకోవచ్చు." అని అంతలోనే క్లైవు గ్రహించాడు. ప్లాసీ యుద్ధం (1757) జనవరి ఎనిమిది సంవత్సరాలలోపే మూడోపానిపట్టు యుద్ధంజరిగిన నాలుగేండ్లకే అతడు ప్రకటించాడు : మొగలుసామ్రాజ్యం మొత్తం మా చేతుల్లోనే వుందంటే అతియోశక్తి ఏమాత్రం లేదు" అని :

ముస్లిం పాలన భారతదేశంలో ఎన్నడూ ప్రజాదరణ పొందలేదు. దాని క్షీణదశలో అంతటా అవ్యవస్థ, శాసనధిక్కారం పెచ్చుమీరిపోయినై. బ్రిటిష పాలన అవతరిస్తూవున్న రోజుల్లో ముస్లింపాలన కంటె తక్కువ హానికరమైనది **(lesser evil)** గా దానిని భావించినట్లు కనిపిస్తున్నది. బ్రిటిషు వారు బాగానే మోసగించగలరు కాని ఎవరిభార్యనో, కుమార్తెనో లేవదీసుకుని పారిపోరు. బలవంతంగా తమ మతంలోకి మార్చరు. ఇదొక పెద్దఊరట.

బ్రిటిషు వారుకూడ "మూర్" (ముస్లిం) కంటె "గెంటూ" (హిందువు) పట్లనే ఎక్కువ సదభిప్రాయం కలిగిఉన్నట్లు కనిపిస్తున్నది, క్లైవు అందుకు కారణం చెప్పాడుకూడాను : బలిసిన దుబారా రాయుళ్ళయిన "మూర్లు" ప్రభుత్వఆదాయాన్నంతటిని సరదాలకు, వైభోగాలకు ఖర్చుచేస్తారు... కాని "గెంటూలు" ఎప్పుడు తమఆదాయంకంటె తక్కువ ఖర్చుపెడుతూ, ఆదాయంలో లోటు కనిపిస్తే పిలిచినపుడు వచ్చి అది పూరిస్తుంటారు కనుక "గెంటూలనే" ధనసంబంధమైన అన్ని పనుల్లో వినియోగిస్తే మంచిదని నా అభిప్రాయం".

1756లో కలకత్తాలో బ్రిటిషువారు ఓడిపోయి నగరం సిరాజుద్దౌలా చేతిలో పడినప్పుడు కలకత్తా హిందువులు ఎంత అసంతృప్తిచెందారంటే నగరాన్ని స్వతంత్రంగా వుంచడంలో విఫలమైనందుకు బ్రిటిషువారిని "ఖాన్ ఛోట్స్" అన్నారు. 1957 ఉద్యమం విఫలంకావడానికి ఒక పెద్ద కారణం-సిపాయిలు బహదూర్‌షాను భారతదేశానికి రాజుగా ప్రకటించడమేనని శ్రీ గురూజీ అన్నారు. సిపాయిలు మొగలుల ఆకుపచ్చ జెండాను ఎగురవేశారు. మొగలు పరిపాలనను పునరుద్ధరించడంలో భారతీయప్రజలకు అసలు ఆసక్తిలేదు. ఇలా బ్రిటిషువారి పట్ల, ముస్లింల పట్ల హిందువులు కనబరచిన వైఖరి బంకిం వ్రాసిన 'ఆనందమఠం' లో స్పష్టంగా విశదీకరించబడింది. 1765-1775 ప్రాంతంలో బెంగాల్‌లో ముస్లింల దుష్పరిపాలనకు వ్యతిరేకంగా విజృంభివచ్చిన హిందూ సన్యాసులదళానికి సంబంధించిన కథ 'ఆనందమఠం'. బక్సార్ యుద్ధం తరువాత నవాబుగారి పన్నువసూలు దారుల మీద బ్రిటిషు వారిచేత సైనికంగా జోక్యం కలిగించుకొనేటట్లుచేసి, తద్వారా బెంగాలు బ్రిటిషువారి స్వాధీనం అయేటట్లు చిత్రించబడిందీ నవలలో.

హిందూ తిరుగుబాటుదార్ల చేతిలో బ్రిటిషు సేన పరాజితం కావడంతో కథముగుస్తుంది. తిరుగుబాటు దార్ల నాయకుడు సత్యానంద యుద్ధం కొనసాగించ గోరుతాడు. కాని తిరుగుబాటుకు మార్గదర్శిగా, తత్వబోధకుడిగా వున్న అనామక వ్యక్తి యిక యుద్ధం ఆపి సాధారణ జీవితం కొనసాగించ వలసిందిగా సలహా యిస్తాడు. "ముస్లిం పాలన పోయినా యింకా హిందూపాలన ఆరంభం కాని మాట నిజమే. కాని బ్రిటిషువారు దేశాన్ని స్వాధీనం చేసుకోనిదే సనాతనధర్మ అవకాశం లేదు. ఆంగ్ల విద్యద్వారా లౌకిక తత్వాన్ని అవగాహన చేసుకుని

ఆధ్యాత్మికతవైపు మనం సాగిపోదాం. ఆ పైన సనాతన ధర్మ పరివ్యాప్తికి ఏ ఆటంకమూ వుండదు. నిజమైన ధర్మం మరొకమారు ఉదయించి కాంతులు చిమ్ముతుంది. అది జరిగే దాక, హిందువులు విజ్ఞాన వంతులు, విజయశీలురు, శక్తి వంతులు అయేదాక బ్రిటిషువారు పాలిస్తూనే వుంటారు" అంటాడు.

కారల్ మార్క్స్ కూడ యిదే అభిప్రాయాన్ని యీ మాటల్లో పేర్కొన్నాడు: "ఇంగ్లండు నేరం ఏమయినా అయివుండవచ్చుకాని ఆసియా సాంఘిక పరిస్థితిలో మౌలిక విప్లవాన్ని తీసుకొని రావడంలో అది అనుకోకుండా చరిత్రకు సాధనంగా పనిచేసింది.

ప్రాచీన ప్రపంచం కుప్పకూలి పోతున్న దృశ్యం మన వ్యక్తిగత భావాలకు కష్టమే కలిగించి వుండవచ్చుకాని చరిత్ర దృష్ట్యా గెర్టే పేర్కొన్న క్రింది మాటలతో గొంతు మనం కలపడం సముచితం.

ఇంతటి మహదానంద అనుభూతిని యిస్తూ వుండగా
ఈ అసౌఖ్యానికి మనం బాధ చెందడం సబబా?
ఘోర పాలన సాగించాడు గదా వాడు తైమూరు
వాడి పాలనలో వేలాదిగా చావలేదా మనవారు?"

ఇట్లా అనతి కాలంలోనే భారతదేశం తన స్వస్థానాన్ని పొందుతుందని కూడా మార్క్స్ గట్టిగా విశ్వసించాడు. "ఏదేశపు సౌజన్యమూర్తులయిన పౌరులలో నిమ్న వర్గాలవారు కూడ-సాల్టికోవ్ యువరాజు అన్నట్లు-అత్యంత ప్రశంసనీయులై వున్నారో; ఎవరు తాము ఓడినా ఒకవిధమైన ప్రశాంతతను కలిగి వున్నారో; ఎవరు స్వతహాగా శాంత స్వరూపులై వుండికూడ తమ సాహస పరాక్రమాలతో బ్రిటిషు అధికార్లలను చకితం చేశారో, ఎవరి దేశం మన భాషలకు, మన మతాలకు పుట్టినిల్లో ఏదేశపు కృషీవలుడు ప్రాచీన జర్మను సభలకు బ్రాహ్మణుడు ప్రాచీన గ్రీకు గుణాలకు ప్రతినిధులుగా వున్నారో;- అట్టి మహత్తరమైన అద్భుతమైనదేశం సుదూర కాలంలో-కొంచెం వెనుకా ముందుగా పునరుత్థానం పొందటం మనం చూస్తామని ఖచ్చితంగా ఆశించవచ్చు." అన్నాడు -మార్క్స్.

మార్క్స్ కాని, ఐంకింకాని ఆశించిన దానికంటె ఎంతో ముందుగానే అంటే యాభై సంవత్సరాలలో-భారతదేశం స్వతంత్రమయింది.

తాము ఎక్కడ వున్నామో, తమ అస్థిత్వం ఏమిటో జ్ఞప్తికి రావడంతోనే హిందువులు "స్వరాజ్యం" కోసం గళం విప్పారు. 1905 లో బెంగాలును విభజించడం ద్వారా బ్రిటిషు వారు దీనికి ఎదురుదెబ్బ కొట్టారు. సరిగా అప్పుడే 1906లో ముస్లిం లీగ్ ఆవిర్భవించడం బహుశా కాకతాళీయం కాకపోవచ్చు.

అప్పటి నుంచి హిందువు రెండు రంగాలలో పోరాటం కొనసాగించాడు- విదేశీ పాలనకు వ్యతిరేకంగా పోరాడాడు. ముస్లింలను బ్రిటిషు వారు బుజ్జగిస్తున్న విధానానికి వ్యతిరేకంగా పోరాడాడు. ప్రజల రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక హక్కులకోసం పోరాడాడు. దయానంద, బంకింలతో ప్రారంభమైన యీ పోరాటాన్ని అరవింద, వివేకానంద, తిలక్, గాంధీలు కొనసాగించారు. ఇదే నేడు ఆర్.యస్.యస్. అధినేతృత్వంలో కొనసాగుతువ్నది. సంఘంయొక్క ప్రాచీన వారసత్వం (వంశవృక్షం) యిదే.

బ్రిటిష ప్రభావంతో విస్తరిస్తున్న క్రైస్తవాన్ని అరికట్టడానికి బ్రహ్మ సమాజం ఆవిర్భవించింది. ముస్లింల సవాలు విషయం ఆర్యసమాజ్ చూసుకుంది. ప్రపంచ రంగంలో హిందూ ఆలోచన యొక్క విశిష్టతను వెల్లడిచేయడానికి దివ్యజ్ఞాన సమాజం ప్రయత్నించింది. పోతే హిందువులకు, హిందూస్థానానికి, హిందూసంస్కృతికి మొత్తంగా ఏర్పడిన సవాలును మొత్తంగానే స్వీకరించడానికి ఆర్.యస్.యస్. ఆవిర్భవం జరిగింది.

ఋషి బంకించంద్ర చటర్జీ "వందేమాతరం" మంత్రాన్ని మనకుఇచ్చారు. హిందూ సమాజాన్ని పెద్దఎత్తున సంస్కరించడానికి, దృఢతరం చేయడానికి స్వామి దయానంద యత్నించారు. ఆయన హిందీ, సంస్కృత జ్ఞానాన్ని వ్యాప్తి చేశారు; అస్పృశ్యతను రద్దుచేయమని కోరారు. స్త్రీలకు తగిన న్యాయం చేకూర్చమని గోవులను సంరక్షించమని అభ్యర్థించారు. 1873లో వైస్రాయి లార్డునార్త్ బ్రూక్ తో మాట్లాడుతూ భారతదేశపు "సంపూర్ణస్వాతంత్ర్యమే" తన ధ్యేయమని స్పష్టంచేశారు. స్వామిదయానంద

"వైస్రాయి : నిర్భయంగా మీరు యితర విశ్వాసాలవారిమీద చేస్తున్న దాడుల వల్ల మీపట్ల హిందువులు, ముస్లింలుకూడా ఆగ్రహించి విద్వేషంతో వున్నట్లు నాకు తెలియవచ్చింది. మీ శత్రువులనుంచి

మీకు వ్యక్తిగతంగా ఏదయినా ప్రమాదం జరిగే అవకాశం వున్నదని అనుమానిస్తున్నారా? ప్రత్యేకించి, ప్రభుత్వం నుంచి మీకు ప్రత్యేకమైన రక్షణ ఏమయినా అవసరమా?

"దయానంద: బ్రిటిషురాజ్యంలో నా విశ్వాసాన్ని వ్యాప్తి చేసుకొనడానికి పూర్తి స్వేచ్ఛ నాకు వుంది, నాకు వ్యక్తిగతంగా ప్రమాదమేది జరిగే అవకాశం కనిపించడంలేదు.

"వైస్రాయి: అలాగయితే, పండిత దయానంద్‌గారు మీ దేశానికి బ్రిటిషుపాలన ప్రసాదించిన వరాలపట్ల మీ ప్రశంసా భావాన్ని వ్యక్తం చేయడానికిగాని, మీ ప్రసంగాల ముందుచేసే ప్రార్థనలోగాని బ్రిటిషురాజ్యం స్థిరంగా కొనసాగాలని ప్రార్థన చేయడానికిగాని మీకు అభ్యంతరమా?

"దయానంద: అటువంటి సూచనను నేను ఎంతమాత్రం ఆమోదించలేను. ఎందు కంటే ప్రపంచంలో నా దేశీయుల హోదా పెరగలన్నా, నా మాతృభూమి గౌరవం పొందాలన్నా భారతవర్షం సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని సాధించితీరాలనేదే నా అచంచలవిశ్వాసం. ప్రభాత సమయంలో, సాయంకాలంలో నేను భగవంతుని ప్రార్థించినపుడల్లా నా దేశాన్ని విదేశీయుల ప్రాబల్యంనుంచి విముక్తం చేయడానికి అతని దివ్యానుగ్రహాన్ని అర్థిస్తూవుంటాను.

దీనిపై వైస్రాయి ఎంతగా దిగ్భ్రాంతుడయినాడంటే ఈ "తిరుగుబాటు దారుడైన ఫకీరు" మీద గట్టి నిఘాకు ఆజ్ఞ యిచ్చానని లండన్‌లోని ఇండియా ఆఫీసుకు సమాచారం పంపాడు. ఆరు దశాబ్దాల తరువాత దేశభక్తులకు మరొక తలమానికం అనదగిన మహాత్మాగాంధిని చర్చిల్ యిదేవిధంగా "దిగంబరఫకీరు" అని ఈసడించుకున్నాడు.

అరవిందునిలో రాష్ట్రం, ధర్మం ఒకటిగా మూర్తీభవించినై. రాజకీయ సన్యాసం స్వీకరించే ముందు తన ఉత్తరపారా ప్రసంగంలో ఆయన యిలా వెల్లడించారు: "యోగ సమాధిలో వుండగా నాకు దివ్యవాణి వినవచ్చింది."

ముందుకు సాగిపో. సనాతన ధర్మంకోసమే తమ సముద్ధరణ జరుగుతున్న విషయం నీ జాతికి వివరించు. ప్రపంచాన్ని సేవించడానికే వారికి స్వాతంత్ర్యం యివ్వబడుతున్నది. కనుక భారతదేశం మేలుకుంటున్నదంటే సనాతన ధర్మమే మేలుకుంటున్నదని, భారతదేశం ఔన్నత్యం పొందుతుందంటే సనాతన ధర్మమే ఔన్నత్యం పొందుతుందని, భారతదేశం విస్తరిస్తుందంటే ప్రపంచంలో సనాతన ధర్మమే విస్తరిస్తుందని అర్థం. ధర్మంకోసమే, ధర్మంచేతనే భారతదేశం జీవించి వుంది. మతాన్ని వర్ధిల్లజేస్తే దేశమే వర్ధిల్లుతుంది.

"ఈ హిందూరాష్ట్రం సనాతన ధర్మంతో పాటు ఆవిర్భవించింది. ఆ ధర్మంలోనే యిది నడుస్తుంది, దానితోనే వృద్ధిచెంది సనాతన ధర్మం క్షీణిస్తే భారతజాతే క్షీణిస్తుంది.సనాతన ధర్మం నాశనం కాగలిగితే దానితోపాటు భారతజాతికూడ నశించి పోతుంది. సనాతన ధర్మమే జాతీయత. నీకు నేను యివ్వవలసిన సందేశం యిదే"

పాండిచేరిలో అరవిందుని గదిలోవున్న ఒకే ఒక ఆరాధ్య దేవతా చిత్రం భారతమాతది అది భారతదేశ చిత్రపటం!

18 వ శతాబ్దంలో బెంగాలును విముక్తం చేయడానికి మరాఠాలు వెళ్ళినపుడు పరిణామాల గురించి భయపడిన ప్రజలు యిండ్లలో దాగి వున్నారు. "బోర్గి!" అనేభయంకరమైన పేరుచెప్పి రెండు శతాబ్దాలపాటు బెంగాలీలు తమ పిల్లలను భయపెట్టారు. కాని యిప్పుడు బెంగాల్ శివాజీని జాతీయ ముక్తి ప్రదాతగా గుర్తించింది. 1905 లో శివాజీకి చిరస్మరణీయంగా అంజలి ఘటిస్తూ ఠాకూర్ యిలాగానం చేశాడు. "ఆనాడు నీమాట మేము వినిపించుకోలేదు. కాని నేడు నీ ఆజ్ఞను వినమ్రములమై తలదాలుస్తున్నాం, భారతదేశంలో అందరమూ ముక్త కంఠంతో 'ఏక ధర్మజ్య హబశే ఆ భారతే' (భారత దేశంలో ధర్మ రాజ్యం ఆవిర్భవించుగాక) అన్ననీ ధ్యానమంత్రానికి, మహనీయ నినాదానికి కట్టుబడి వుంటాం.

"ఓ బెంగాలీలారా! మహారాష్ట్రులతో శ్రుతి కలిపి 'జయ శివాజి'! అని ఉద్ఘోషించండి! ఓ బెంగాలీలారా! మహారాష్ట్రులతో కలిసి మహోత్సవంలో పాల్గొనటానికి రండి! ఈ సమావేశంలోనే నేడు భారతదేశపు తూర్పు పడమరలు,

కుడి ఎడమలు ఒకటిగా ఒకే వైభవంలో ఒకే శుభనామంలో సంతోషాన్ని పంచుకొనుగాక!"

మహామహుడైన తమిళ కవి సుబ్రహ్మణ్య భారతి యిలా గానం చేశాడు, "హిందుత్వపు సిద్ధాంతాలను వ్యాప్తి జేయవలసిన తరుణం ఆసన్నమయింది. మానవాళిని సంరక్షించి దానిని సన్మార్గంలో నుంచగలిగింది హిందూ జాతితప్ప వేరొకటి లేదు," అయనే యిలా అంటాడు. "నేను యుద్ధోన్మాదిని కాను. శాంతి కాముకుణ్ణి మాత్రమే. ఎవరిమీదనో దాడి జరపడానికి కాక తమశాంతి ఫలితాలను అనుభవింప జేయడానికే యిలపై కోట్లమంది హిందువులను సంఘటితం చేయాలని నా సంకల్పం. నాకు శాంతి యొక్క సహకారం కావాలి. ఈ మహత్కార్య సాధనలో హిందువుల సహాయం, భగవంతుని సహాయం నాకుకావాలి. హిందువుల నందరిని ఒకే కుటుంబంగా సంఘటితం చేయాలని నా ఆకాంక్షను ఎవరిలో జాజ్వల్యమానంగా వున్నదో అతడు రాజకీయాది యితర కార్యకలాపాలకంటె దీనికే ప్రాధాన్యత యిచ్చి కృషిచేస్తాడు".

ఆధునిక భారతీయ నవలాకారులలో మహోన్నతుడైన శరత్‌చంద్ర ఛటర్జీ ముస్లింల మొండితనాన్ని వేర్పాటు వాదాన్ని నిరసిస్తూ "హిందూస్థానం హిందువుల భూమి కనుక దీనిని విదేశీయప్రాబల్య శృంఖలాలనుండి విముక్తం చేసే కర్తవ్యం నెరవేర్చవలసిన వారు హిందువులే. ముస్లింలు అరేబియా, టర్కీలవైపు ముఖాలు త్రిప్పుకుని యిక్కడ కూర్చొని వున్నారు. వారి హృదయం హిందూస్థానంలో లేదు. అది యిక్కడ లేనప్పుడు ఆ విషయం బాధ పడాల్సిన అవసరంలేదు. వారు విముఖులై వుండగా వారి వెంబడిపడి ప్రయోజనమేమిటి? ఈనేలకు పుత్రులమని, యీ దేశపుగాలితో, పంటతో. నీటితో వర్ధిల్లిన బిడ్డలమని వివేకవంతమైన వాక్కులను చెవిటివాని ముందు శంఖమూదినట్లు వినిపించడంలో ఔచిత్యమేముంది?

"మాతృభూమిని విముక్తం చేయడం హిందువుల కర్తవ్యం మాత్రమేనని. మరెవరిదీ కాదనే యీ ఒక్కవిషయాన్ని నేడు మనం విస్పష్టంగా, నిస్సందేహంగా అర్థంచేసుకోవలసివున్నాం. ముస్లింలు యింతమంది వున్నారే అని మనం ఆందోళన చెందనవసరం లేదు. ప్రపంచంలో సత్యమనేది సంఖ్యల మీద ఆధార

పడి వుండదు. సంఖ్యాపరమైన ఆధిక్యత గురించి పట్టించుకోని మహత్తర సత్యం ఒకటి వుంది."

శరత్ యింకా అంటాడు. "ఏ దేశపు స్వాతంత్ర్య సమరంలో నయినా ఆ దేశీయులంతా పాల్గొంటున్నారా? అది అసలు వీలవుతుందా. ఆచరణ సాధ్యమేనా, అసలు అంత అవసరమంటూవుందా? అమెరికన్లు తమ స్వాతంత్ర్యం కోసం పోరాడిన సమయంలో వారిలో సగం మంది పైగా బ్రిటిషు వారి వైపేవున్నారు. పోలిష్ విముక్తి పోరాటంలో నిజానికి వారిలో ఎందులో పాల్గొన్నారు? రష్యాను నేడు పాలిస్తున్న బోల్షివిక్ పార్టీ శక్తి దాని జనాభాలో ఒక శాతానికైనా చేరుకుని వుండలేదు.

"మనుషులు గొడ్లుకాదు: గుర్రాలూ కాదు. మంచి చెడ్డలను నిర్ణయించేది తలల లెక్కింపుకాదు. తపో తీవ్రతను బట్టి..ధ్యేయం పట్ల వున్న ఏకాగ్రచిత్తపు నిష్టనుబట్టి అది నిర్ణయమవుతుంది. ఈ దేశపు యువకులే ఆ తపస్సు నెరవేర్చవలసి వున్నారు"

తన సందేశం ముగిస్తూ హిందువుల ముందున్న సమస్య కృత్రిమ సమైక్యత కోసం సాధనోపాయాలను అన్వేషించడం కాదు. తాము సంఘటనగా రూపొందడం ఎలా అన్నదే వారిముందు సమస్య'' అన్నాడు.

స్వామి వివేకానంద 1897లో లాహోరు పౌరుల నుద్దేశించి చేసిన ప్రసంగంలో హిందువుల దృక్పథాన్ని సరియైన విధంగా వెల్లడించారు. "మనం హిందువులం. మనను ద్వేషిస్తున్న వారిలో పలువురు నేడు దీనికి విపరీత వ్యాఖ్యానం యిచ్చి మనకు చెడ్డపేరు ఆపాదించి వుండవచ్చు. కాని పేర్లలో ఏమీ లేదు. హిందూ అనేపేరు వైభవానికంతటికి, ఆధ్యాత్మికత కంతటికి ప్రాతినిధ్యం వహిస్తుందా లేక నిర్భాగ్యులను, కొరగాని వారిని సూచించే నిందాపదంగానే వుండిపోతుందా అనేది మనమీదనే ఆధారపడి వుంటుంది. నేడు హిందూపదానికి ఏదయినా చెడు అర్థంవుంటే అది పట్టించుకోవద్దు, ఏ భాషలోను యింతకంటె శ్రేష్టమైన పదం కనుగొన బడలేదని మన ఆచరణ ద్వారా నిరూపించడానికి సిద్ధమవుదాం.

ఈ పుణ్యభూమిమీద అనాగరికుల దండయాత్రలెన్నో అలలు అలలుగా వచ్చిపడినై. వందలాది సంవత్సరాలు 'అల్లాహో అక్బర్' నినాదాలు మిన్నుముట్టినై. ఏ క్షణంలో తాను వినాశనం కానున్నాడో తెలియనిస్థితిలో హిందువున్నాడు. ప్రపంచంలోని చారిత్ర దేశాలలో యింతకంటె వేదనలు అనుభవించినదేశం. యింతగా అణగద్రొక్కబడినదేశం మరొకటిలేదు. అయినా మనజాతి నిజంగానే సజీవంగా నిలిచివుండి; అవసరమైతే మళ్లీ మళ్లీ కష్టాలను ఎదుర్కొనడానికి సంసిద్ధంగా నిలిచివుంది. మనం దృఢంగావుండటమేకాక విస్తరించడానికి సిద్ధంగావున్న లక్షణాలుకూడ కనిపిస్తున్నాయి, ఎందుకంటే విస్తరించడమే జీవత్వానికి లక్షణం."

వివేకానంద యింకా యిలా ఉద్ఘోషించాడు; "హిందువు కష్టంలోవున్నా నీ కన్నకొడుకే కష్టంలోవున్నట్లు అనుభూతి చెందగలిగితే-అప్పుడే నీవు నిజమైన హిందువువు. నీ దేశీయులకు నీవు మేలుచేయదలిస్తే వారికోసం మహనీయుడైన గురుగోవిందసింగ్‌వలె ఎట్టి కష్టాలు అనుభవించడానికైనా నీవు సిద్ధంగావుంటే- అప్పుడే నీవు నిజమైన హిందువువు. మీ దేశీయులలో వేలాదిలోపాలు మీకు కనిపించవచ్చు. కాని వారిలోవున్న హిందూరక్తాన్ని గుర్తించండి. మీకు కష్టం కలిగించాలనేవారు అన్నిప్రయత్నాలుచేసినా, వారిలో ప్రతిఒక్కరూ మీమీద శాపవాక్కులే వర్షించినా, మీరుమాత్రం వారికి ప్రేమవాక్కులే వినిపించండి. వారు మిమ్మలను తరిమివేస్తే ఆ సింహసముడు గురుగోవిందసింగ్‌వలె నిశ్శబ్దంగా మరణించడానికి నిష్క్రమించండి. అట్టి వ్యక్తిమాత్రమే హిందువు అనదగి వున్నాడు. అట్టి ఆదర్శమే ఎల్లపుడూ మనముందు వుంచుకోవాలి; మన విద్వేషాన్నంతటిని భూస్థాపితం చేద్దాం; దేశాన్నంతటిని యీ మహత్తర ప్రేమవాహినితో ముంచెత్తండి.

"భారతదేశ పునరుద్ధరణగురించి మాట్లాడుతున్నవారిని వారి యిష్టంవచ్చినట్లు మాట్లాడనీయండి. కాని జీవితమంతా అందుకే పనిచేస్తూ, లేక కనీసం అందుకు ప్రయత్నిస్తూవున్నవ్యక్తిగా నేను మీకు చెప్పేదేమంటే మీలో ఆధ్యాత్మికత పెంపొందనిదే భారతదేశానికి పునరుద్ధరణలేదు. అంతేకాదు భారతదేశ పునరుద్ధరణమీదనే యావత్ప్రపంచంయొక్క సంక్షేమం ఆధారపడివుంటుందనికూడా నేను చెప్పవలసివుంది. ప్రపంచచరిత్రే మనకు సాక్ష్యం. ఒక్కొక్కజాతి

ఆవిర్భవించివై : మనిషి భౌతికపదార్థమే అంటూ భౌతికవాదం ఆధారంగా; మత గొప్పతనాన్ని ప్రవర్శించినై. పాశ్చాత్యుని పరిభాషలో మానవుడు తన ఆత్మ (ghost) ను వదిలివేస్తాడు; కాని మనభాషలో అతడు శరీరాన్ని మాత్రమే వదులు తాడు. పాశ్చాత్యమానవుడికి దేహం ప్రధానం, ఆ పైన అతడికొక ఆత్మవుంది; మనకు మానవుడంటే ఒకఆత్మ, ఆపైన అతడు ఒక శరీరం కలిగివుంటాడు ఇక్కడే బ్రహ్మాండమైనంత తేడావుంది.

"తొందరపాటువద్దు, మరెవ్వరిని మనం అనుకరించబూనుకోవద్దు. మనం గుర్తుంచుకొనవలసిన మరొక గొప్పగుణపాఠం యిది; అనుకరణ యెన్నడూ నాగరికతకాదు. నేనొక రాజుగారి దుస్తులు కిరీటం మొదలైనవి ధరించవచ్చు; అంతమాత్రాన నేనే రాజునవుతానా ? నిజానికది మనిషి తనను ఘోరంగా దిగ జార్చుకొనడానికి చిహ్నం. మనిషి తననుతాను అసహ్యించుకొనడం ప్రారంభిస్తే అదే అతనికి ఆఖరిపతనం అవుతుంది. మనిషి తన పూర్వీకులగురించి సిగ్గుపడ టం ప్రారంభిస్తే అతనికి అంత్యకాలం దాపురించినట్లే. హిందూజాతిలోని సామా న్యులలో ఒకణ్ని నేను; అయినా నాజాతినిగురించి నేను గర్విస్తున్నాను. నాపూర్వీ కులగురించి నేను గర్విస్తున్నాను; నేను హిందువునని చెప్పకొనడానికి గర్విస్తు న్నాను; మీ విలువలేని సేవకుల్లో నేనూ ఒకడినైనందుకు గర్విస్తున్నాను. మహ ర్షులకు వారసులైనవారు మీరు; ప్రపంచం యింతవరకు వీక్షించిన మహోన్నత మహిమోపేతులైన ఋషులకువారసులుమీరు; అట్టి మీలో ఒకసహదేశీయుడి నయినందుకు నేను గర్విస్తున్నాను. కనుక ఆత్మవిశ్వాసం కలిగివుండండి: మీ పూర్వీకులగురించి సిగ్గుపడక వారికి వారసులయినందుకు గర్వించండి. ఎన్నడూ అనుకరించవద్దు: అనుకరించనేవద్దు"!

"ప్రబుద్ధభారత్" 1899 ఏప్రిల్ సంచికలో ప్రచురితమైన ఒక యింట ర్వ్యూలో వివేకానంద పునరాగమనం (మాతృధర్మమైన హిందూమతంలోకి తిరిగి మతాంతరీకరించడం) పట్ల అనుకూలత వ్యక్తంచేస్తూ "లేకుంటే మనసంఖ్య తగ్గి పోతుంది. అంతేగాక హిందువులలోనుంచి ఒకవ్యక్తిపోవడంవల్ల మన సంఖ్య ఒకటి తగ్గడమేకాదు, శత్రువులసంఖ్య ఒకటి పెరుగుతుందికూడాను" అన్నారు.

'స్వామి వివేకానందా యిన్ అమెరికా: న్యూ డిస్కవరీస్'అనే గ్రంథంలో మిస్ కార్నర్ యిలా వ్రాసింది:"ఒకసారి ఆయన (స్వామీజీ) అమెరికాలో తన

జీవిత సమ్మోహినివుందని మా అమ్మమ్మతో అన్నారు. ఆయనను కాస్త ఏడిపించ దలచి 'ఎవరండీ ఆమె, స్వామీ?" అని ఆమె అడిగింది. ఆయన పెద్దగానవ్వి ఆమె ఓ వనితకాదు, వారిలోని సమైక్యతాభావం! అన్నారు.

'భారతదేశంలోనయితే ముగ్గురువ్యక్తులు అయిదు నిమిషాలపాటు కలిసి పనిచేయరు. ప్రతిఒక్కడు అధికారంకోసం ప్రాకులాడుతాడు, దానితో చివరికి సంఘటనే విషాదాంతమవుతుంది.భగవంతుడా! భగవంతుడా! అసూయపడకుండా వుండటం మేమెప్పుడు నేర్చుకుంటాం?" అని ఆయన వాపోయారు.

హిందువులకు పరస్పర సహకారాన్ని, ప్రేమాదరాలనునేర్పే సంఘటన అత్యవసరంగా కావాలి" అని స్వామీజీ ప్రార్థించారు.

రాష్ట్రీయ స్వయసేవక సంఘం చేస్తున్నది సరిగ్గా అదే "సంఘేశక్తిః కలౌయుగే"అని ఒక సంస్కృతసూక్తిలో చెప్పినట్లు ఇతరయుగాల్లో మీకు యితరగుణాలు అవసరం కావచ్చు కాని, ఈ కలియుగంలో మీకు కావలసింది సంఘశక్తి మాత్రమే.

జాతీయనాయకులుకూడ స్వాములు, సాధువులకంటె తీసిపోలేదు. ముస్లింల ఈద్, మొహరం ఊరేగింపులవలె హిందువులచేతకూడ సామూహిక ఉత్సవాలు జరిపించడానికి లోకమాన్యతిలక్ గణేశఉత్సవం, శివాజీ మహోత్సవం ప్రవేశ పెట్టారు.

"శక్తివంతమైన హిందూరాష్ట్ర" యొక్క ఆవశ్యకతగురించి వక్కాణిస్తూ తిలక్ "హిందూధర్మం నైతికంగా, సామాజికంగా కూడ ప్రజలను అనుబంధి స్తుంది. కనుక మనం గతంలోకిపోయి అది ఏవిధంగా పనిచేసిందో చూడాలి. మద్రాసులోనో బొంబాయిలోనోవున్న హిందువు, యిక్కడి (వారణాసి) హిందువు ఒకేవిధమైన వ్యక్తులు. సమైక్యంగా మన జాతి చాల గొప్పదిగా వుండేది. సంప్రదాయాల మధ్యవున్న వైవిధ్యాలను మనం విస్మరించి మనందరి సమాన పరంపర అయిన వేదాలు, గీత. రామాయణాలకు ప్రాముఖ్యతయిస్తే పరమేశ్వరుని కృపవలన అనతికాలంలోనే అన్నివర్గాలను మనం కూడగట్టి శక్తి వంతమైన హిందూరాష్ట్రంగా రూపొందగలం. ప్రతి హిందువుకు యిదే ధ్యేయం కావాలి. మన వైభవోపేతమైన విజయానికి మనం చేయవలసిందల్లా వివిధ

వర్గాలవారిని ఒకే వేదిక మీదికి తెచ్చి హిందూ ధర్మ ప్రవాహం ఒకే శక్తివంత మైన వాహినిగా సమైక్య, ఏకోన్ముఖ శక్తితో ప్రవహింపజేయటం" అన్నారు.

ఆర్.యస్.యస్. చేస్తున్నది. అదే "ఒకే వేదిక" మీద హిందువులనంద రిని సమైక్యం చేసి "శక్తివంతమైన హిందూ రాష్ట్రంగా వారిని సంఘటితం చేయడమే సంఘకార్యం:

తాను "పట్టుదలగల సనాతన హిందువు"నని గాంధీజీ ఎన్నోమార్లు తన గురించి చెప్పుకున్నారు. నేడు మన కళ్లు అశుద్ధంగా ఆలోచనలు మరింత అశు ద్ధంగా. దేహాలు అన్నిటికంటె అశుద్ధంగా వున్నాయంటే అందుకు కారణం మనం హిందూత్వాన్ని తృణీకరించడమే" అన్నారు.

"హిందూత్వం ఒక నిరంతర సత్యాన్వేషణ. నేడు మనం తిరోగమన వాదులుగా, జడంగా, అభివృద్ధిపట్ల స్పందన లేకుండా వుండటానికి మనలో ఏర్ప డిన గ్లానియే కారణం; ఈ గ్లాని తొలిగిపోగానే హిందూత్వం ప్రపంచంలో తిరిగి వెలుగులు చిమ్ముతుంది, బహుశ యింతకుముందెన్నడు లేనంత కాంతితో" అని కూడా గాంధీజీ అన్నారు.

"కాంగ్రెసును పూర్తిగా హిందువులే నిర్వహించినా నాకు అభ్యంతరం లేదు" అనేవరకు ఆయన వెళ్ళారు.

మరొక సందర్భంలో యిలా అన్నారు: "మహమ్మదు, జొరాస్టరు మోజేసులతో పాటు జీససుకుకూడా కావలసినంత చోటు హిందుత్వంలో వుంది." ముస్లింలను తమ పూర్వీకుల విశ్వాసానికి తిరిగి రమ్మని ఆహ్వానిస్తూ "భారత దేశంలోని ముస్లింలలో అధిక సంఖ్యాకులు పరిస్థితుల ప్రోద్బలంవల్ల హిందూ ధర్మంనుంచి ఆ మతంలోకి బలవంతంగా మారినవారే. అనేక మౌలిక విషయా లలో వారు యిప్పటికీ హిందువులుగానే వున్నారు. స్వతంత్ర్య సుసంపన్న, ప్రగతిశీల భారతదేశంలో తమ ప్రాచీన విశ్వాసానికి, జీవనవిధానానికి వారు తిరిగి వస్తే అదెంతో సహజంగా వుంటుంది" అన్నారు.

కనుక 'హిందురాష్ట్రం'గురించి సంఘం ప్రస్తావిస్తూవుండటంగాని, 'హిందూ త్వమే జాతీయత' అని చెప్తున్నపుడుకాని భారతీయ పునరుత్థానోద్యమపితలు చెప్పినదానినే సంఘం ప్రతిధ్వనిస్తున్నది.

తిలక్, గాంధీజీ. గురూజీలు హిందూరాష్ట్రంగురించి మాట్లాడారంటే, వారు ఉద్దేశించినది హైందవేతరులులేని హిందూరాష్ట్రంకాదు. హైందవేతరులకు సమాన హక్కులు యివ్వడం తప్ప తక్కువగా వారిని పరిగణించాలని ఎవరైనా సూచిస్తే వారు దిగ్భ్రాంతులయిపుండేవారు.

జనం బిభ్రతి బహుధా వివాచసాం
నానా ధర్మాణాం పృథ్వీ యదేకసం

(మన యీ మాతృభూమి వివిధ భాషలు మాట్లాడే ప్రజలకు, వివిధ భాషలు మాట్లాడే ప్రజలకు, వివిధ విశ్వాసాలను అనుసరించే వారికి ఒకే విధంగా ఆశ్రయమిస్తున్నది)-అని అధర్వవేదం చెప్తున్నది. వారు ప్రయత్నిస్తున్నదల్లా స్వీయ సంస్కృతిని గుర్తింపజేసి దాని సహజశీలాన్ని పునరుద్ధరించాలని మాత్రమే. ఇంగ్లండులో లక్షలాదిమంది క్రైస్తవేతరులు వున్నప్పటికి అది క్రైస్తవ దేశమే అయినవిధంగా, ఈజీప్టులో పదిశాతంమంది కాప్టిక్ క్రైస్తవులే అయినా అది ముస్లిం దేశమే అయిన విధంగా-యీ దేశం హిందూదేశమే అయి వుంది. హిందూత్వం ఒక మతంకాదు; అదొక ధర్మం అందుకే ఎమ్.సి. చాగ్లా వంటి ముస్లిం, రాజకుమారి అమృత కేర్‌వంటి క్రైస్తవ వనిత, ఎ.డి. గోర్వాలా వంటి పార్శీ తమను హిందువులుగా అభివర్ణించుకున్నారు. 1966లో ఢిల్లీలో సావర్కార్ స్మారక సమావేశంలో మాట్లాడుతూ "భారతదేశంలో నివసించే వారంతా, వారి మతం ఏదయినప్పటికీ, వారంతా హిందువులే అనడంలో సావర్కార్‌తో నేను ఏకీభవిస్తాను"అని డా॥రామమనోహర్ లోహియా అన్నారు

అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయాన్ని స్థాపించిన సర్ సయ్యద్ అహ్మద్ కూడా దాదాపు వంద సంవత్సరాలక్రిందటనే యిలా అన్నారు: "భారతదేశంలో నివసిస్తున్న యీ రెండు జాతులను నేను 'హిందు' అనే ఒక్కమాటలో పేర్కొంటాను. హిందూస్థాన్‌లో నివసించేవారని అ మాటకు అర్థం." "భౌగోళికంగా తాము హిందువులమని ముస్లింలు సహేతుకంగానే చెప్పకొనవచ్చు." అని యిటీవల జమాత్-ఇస్లామీ వారి 'రేడియన్స్' (1970 మార్చి 8) వ్రాసింది.

దశాబ్దాల క్రిందట కౌంట్ కీసర్లింగ్ వ్రాసినట్లు : "రానురాను భారతీయ తత్వం వైపే భారతదేశంలో యిస్లాం వికసిస్తుంది. కాలంగడిచినకొద్దీ నేటి రక్తం

మారిపోయింది. చాలాకాలం క్రిందట పర్షియాలో జరిగిన విధంగానే, ప్రతిసారి క్రొత్త మత నాయకుడు వచ్చినప్పుడల్లా వారి ప్రాచీన జాతీయ వారసత్వపు మహర్షుల లక్షణాలు రానురాను దృఢతరంగా వారిలో అభివ్యక్తమవుతాయి."

ఇది ముఖ్యమైన విషయం, 'హిందూ' అన్నా 'భారతీయ' అన్నా-అదే తమ జాతి అని గుర్తించినపుడే మన ప్రజలందరి సమైక్యత, సమగ్రత, భద్రత, శక్తి సాధించడం సాధ్యపడుతుంది. దీనితో మన జాతీయ జీవనపు వ్రేళ్లు ఏవో తెలిసివచ్చి, అవి దృఢతరం అవుతాయి. వృద్ధిలోకి రానున్న దేశానికి ఆ వేళ్లే అతిముఖ్యమైనవి.

ఇంగ్లండు ఎప్పుడూ-సత్యమైనవో, కల్పితమైనవో-"వెనుకటి సంప్రదాయాలను" "ప్రాచీనకాలపు స్వేచ్ఛలను" అనుసరిస్తూవచ్చింది. నేడు ఫ్రాన్స్‌వారి 'న్యూ రైట్' ఉద్యమం "ఐరోపావారి పాగన్ పూర్వజాతి వారసత్వానికి" ఆధారాలు అన్వేషిస్తున్నది. ఇటీవలనే వారి 'లే ఫిగారో' పత్రిక చాలభాగాన్ని యీ క్రొత్త ఉద్యమానికి కేటాయించిన ఈజిప్టు తన ఫరోవాలు, క్లియోపాత్రల కాలానికి పోతున్నది. కమ్యూనిజం అన్యాయంగా తమ దేశపు ప్రాచీన పరంపరను నిర్లక్ష్యం చేసిందని రష్యన్ అసమ్మతిదారులు తుకచెవ్‌స్కీ, సోల్జెనిట్సిన్ విమర్శిస్తున్నారు.

ముస్లిం ఇండోనేషియా రాముణ్ని ఎన్నడు మరువలేదు. 'పాకిస్తాన్ యిస్లామిక్ రిపబ్లిక్' కూడ యిస్లాం-పూర్వయుగపు వారసత్వాన్ని యిప్పుడిప్పుడు గుర్తిస్తున్నది. "పాకిస్తాన్ యొక్క అయిదువేల సంవత్సరాలు" గురించి వ్రాయడానికి సర్ మార్టిమర్ వీలర్ అనే పురాతత్వ పరిశోధకుణ్ని పాకిస్తాన్ నియమించింది. ఎన్.ఖాన్ వ్రాసిన "పాకిస్తాన్‌లో బౌద్ధ కళ, శిల్పం" అనే గ్రంథాన్ని యిటీవలే ప్రచురించింది. ఎనిమిదవ శతాబ్దంలో మహమ్మద్ బిన్ ఖాసిం దాడులకు గురియైన దేబల్ అనే రేవుపట్టణంలో పాకిస్తాన్ త్రవ్వకాలు జరిపించి, అక్కడ బయల్పడిన శివలింగాలను సగర్వంగా ప్రదర్శించింది. 'వైశాఖి' యే పంజాబ్ వారికి 'జాతీయ దినం' అని లాహోరు విద్యార్థులు అభిప్రాయపడుతున్నాయి.

ముస్లిం భారతీయుల తమ మతాన్ని పాటించడానికి ఎవరికి అభ్యంతరం లేదు; కాని అధికభాగం యిస్లాం-పూర్వ యుగానికి చెందివున్న తమ జాతీయత యొక్క వేళ్లను తమవిగా వారుగుర్తించాలి.

గాలిబ్ యీ వాస్తవాన్ని గుర్తించాడు. కాశీయే లేకపోతే ప్రపంచం తన అసమానతలవల్ల ఏనాడో మునిగిపోయి వుండేది. ఒక చక్కని పర్షియన్ కవిత వ్రాస్తూ ప్రపంచం యింతగా భ్రష్టమైపోతే యింకా వినాశకాలం రాలేదేమిటని ఒక దేవతను అడుగుతాడు. దానికి ఆ దేవత యిచ్చిన సమాధానం :

"సువా కాశీ బా అందాజె యిషారత్

తబస్సుమ్ ఖర్దో గుఫ్తయాన్ యిమారత్"

(ఆ దేవత కాశీని చూపిస్తూ నవ్వి 'అదివుండటం వలననే ప్రపంచం యింకా భగ్నం కాకుండా నిలిచివుంది' అని చెప్పింది).

తమ ప్రాచీన భారతీయ మౌలికతను ముస్లిం భారతీయులు గుర్తించనిదే వారు మనశ్శాంతిని గాని, యితరులతో సామరస్యాన్ని గాని అనుభవించలేరు. శ్రీ గురూజీ అన్నట్లు : "ఇక్కడ నివసించే ప్రతి హైందవేతరుడికి రాష్ట్రి ధర్మం (ద్వితీయ కర్తవ్యం), సమాజ దర్మం (సమాజంపట్ల కర్తవ్యం), కుల ధర్మం (పూర్వ్యజులపట్ల కర్తవ్యం) వుంటాయి. తన వ్యక్తిధర్మం (వ్యక్తిగత విశ్వాసం) లో మాత్రమే అతడు తన ఆధ్యాత్మిక అభీష్టానికి తృప్తికలిగించే ఏ మార్గాన్న యినా ఎన్నుకోవచ్చు."

తమ జాతీయ జీవనం యొక్క మౌలికతను గుర్తుంచు కొనవలసిందిగా ఆర్.యస్.యస్. నిజానికి ముస్లింలకంటే హిందువులనే మరింత ఎక్కుగా అభ్యర్థిస్తున్నది. తన పూర్వ్యజుల పరంపరలో సుస్థిరంగా నెలకొనివున్న వ్యక్తి మాత్రమే అన్నిరకాలైన స్థానిక, విదేశీయ ప్రభంజనాలకు తట్టుకొని నిలిచి అత్మ విశ్వసంతో భవిష్యత్తును నిర్మించగలుగుతాడు.

వాస్తవానికి భారతీయ మౌలిక విలువలు మనకేగాక, ప్రపంచానికంతటికి ప్రధానమైనవి. నేడు విజ్ఞానశాస్త్రమే వేదాంతసామ్రాజ్యంలో అడుగు పెడుతున్నది. భారతీయులమైన మనకు విజ్ఞానశాస్త్రం ఛేదించవలసిన మూఢ విశ్వాసాలు లేవు. హిందువు ఏ దేవుణ్నయినా(దేవుళ్లనయినా)నమ్మవచ్చు; అసలు దేవుణ్నే(దేవుళ్లనే) నమ్మకపోవచ్చు; అయినా అతడు హిందువుగానే వుంటాడు. మత విశ్వాసాలను ఆచారాలను, అవగాహనలను ఆయాకులాలకు అన్వయింప జేయడానికి, పునర్

వ్యాఖ్యానించడానికి ఎప్పటికప్పుడు సాధు సంతులు, అవతారపురుషులు జన్మిస్తూ వచ్చారు. వీటన్నిటికి మించి మన జీవనతత్వం యితరుల జీవనతత్వాలకంటేఎంతో మిన్నగావుంది. ప్రపంచంలోని అత్యుత్తమ వ్యక్తుల నందరిని ఆకర్షించగల భావనలు, విలువలు, అంతర్దృష్టి మనకు వున్నాయి. ఉదాహరణకు స్థిమితం కోల్పోయి బాధపడుతున్న వ్యక్తికి తిరిగి సమగ్రవ్యక్తిత్వాన్ని కలిగించవలసిన సమస్యను యోగం పరిష్కరిస్తుంది. మానవుడి అసంకల్పితస్థితిని, స్వప్నాలను ప్రతీకలను, శరీరక మానసికస్థితుల మధ్యనున్న సహజ సంబంధబాంధవ్యాన్ని మరి యే యితర సంస్కృతి యింతగా అర్థంచేసుకొని వుండలేదు. 'పాసేజ్ టు యిండియా' వ్రాసి కీర్తిగడించిన ఇ.ఎమ్. ఫార్‌స్టర్ మాటలలో : "జీవితంయొక్క బ్రహ్మాండమైన సంశయాందోళనలను వ్యక్తంచేయడంలోను, అవగాహనచేసుకొనడంలోను యిస్లాం, క్రైస్తవ మతాల కంటే హిందూత్వమే సన్నిహితంగా వస్తుంది. భగవద్గీత భారతీయ విప్లవకారులకు మాత్రమే కరదీపిక కాలేదు. టర్కీలోని విప్లవకారులకు, అరబ్బుదేశాలలోని సాధువులకు కూడ ప్రేరణాస్రోతస్సుగా ఉపయోగించింది. గీతను "రాజద్రోహకరమైన సాహిత్యం." గా కొంతకాలం క్రిందట టర్కీ నిషేధించింది.

ప్రపంచాన్ని హిందూత్వం ఆకర్షించడం నేడు కొత్తగాదు. క్రైస్తవ మిషనరీలు భారతీయులను మతాంతరీకరించాలను కున్నారు. ఈ పురాణకాలపు హిందూ మతం రూపుమాసిపోవాలి !" అంటు అమెరికా ఎ.బి.సి. ప్రచారకేంద్రం నుంచి యిటీవల 1954 లో కూడ బిల్లీగ్రాహం గావుకేక పెట్టాడు. కాని ఖడ్గంతో వారెవరూ ఆ పనిచేయలేక పోయారు. యికముందుకూడా చేయలేరు. కనుక వారు హిందూ పురాణేతిహాసాల అధ్యయనానికి పూనుకున్నారు-అవన్నీ అభద్ధాలనో, పిచ్చిప్రేలాపనలనో ఋజువు చేయాలని. నిజానికి దీనివల్ల వారికి జ్ఞానోదయము యింది. అక్కడక్కడ శాస్త్రిలకు విపరీత వ్యాఖ్యలు చేయడానికి వారిలో కొం ప్రయత్నించినా, మొత్తంమీద అధిక సంఖ్యాకులు చిత్తశుద్ధితోనే తమపని నిర్వ ర్తించారు. ఇండియా క్రైస్తవమయం అయితే సంతోషించివుండవలసిన మిషనరి మాక్సుముల్లర్ ఆ పనిచేయడానికి మారుగా 'భారతదేశంనుండి మనం నేర్చుకొనవలసిన విషయాలు' అనే గ్రంథం వ్రాశాడు. "భాష, మతము, పౌరాణిక సాహిత్యం, వేదాంతం ఏదయినా కానివ్వండి, ఆసనాలు-ఆచారాలు, ఆదిమ కళ, ఆదిమ విజ్ఞానం ఏదయినా కానివ్వండి-మానవ మేధస్సుకు సంబంధించిన ఏరంగంలోమీరు

ప్రత్యేకంగా అధ్యయనం చేయదలిచినా-మీరు భారత దేశానికి వెళ్లవలసిందే-యిష్ట మున్నా లేకపోయినా; ఎందుకంటే మానవేతిహాసపు అత్యంత విలువైన అత్యంత విజ్ఞానదాయకమైన ఆధారాలు అనేకం నిజంగా భరతదేశంలో మాత్రమే నిక్షిప్తం చేయబడి వున్నాయి" అని మాక్సుముల్లర్ అంగీకరించాడు.

1777 తో భారతదేశానికి వచ్చిన జనరల్ ఛార్లెస్ హిందువయినాడు. ఆయన 1822 లో పదవీ విరమణచేసి వెళ్ళిన తరువాత కలకత్తా వుడ్‌స్ట్రీట్ లోని అతనికి యింటి నిండా విగ్రహాలు లభ్యమయినై. సర్.సి. పి. రామస్వామి అయ్యర్ ఇంగ్లండు ప్రధాని రామ్‌సే మెక్‌డొనాల్డ్‌ను భోజనానికి ధోవతి ధరిం చేట్లు చేశారు. చాలమంది బ్రిటిషువారు తమకు పాదాక్రాంతమయిన దేశాల ప్రజ లలో మంచిని ఎంతమాత్రం గుర్తించ లేకపోయారు. కాని జర్మనులలో ఆలాంటి వ్యతిరేక దృక్పథంలేదు. హైందవ ఆలోచనా పద్ధతికి వారు ఆనంద పరవశులైనారు. అన్ని సద్విషయాలకు తొలిజాడలు "పవిత్రంగా నదీ తీరాల" వద్దనే లభ్యమవుతాయని తత్త్వవేత్త స్కాపెన్ హోవర్ అన్నాడు.

భారతీయ కమ్యూనిస్టులకు తెలియక పోవచ్చుగాని మార్క్సుయొక్క గతితార్కిక భౌతిక వాదానికి ఆధారపాఠంగానిలిచిన హెగెల్ 'గతితర్కం'బౌద్ధ మహాపండితుడైన నాగార్జునుని 'మాధ్యమికాల' నుంచి గ్రహించబడినట్లు అంగీక రించబడింది.

పాశ్చాత్యలోకంపై భారతీయ ఆలోచనా పద్ధతి యొక్క ప్రభావాన్ని తక్కువగా అంచనా వేయడానికి వీలులేదని మన స్తత్వ శాస్త్రజ్ఞుడు జంగ్ కొన్ని దశాబ్దాల క్రిందట వ్రాస్తూ నిజానికి యింతవరకు యూరోపులో మేధారంగపు ఉపరితలాన అతి స్వల్పంగా మాత్రమే యీప్రభావం కనిపిస్తున్నది. మానవ మహాసముద్రంలో అక్కడక్కడ పడివున్నట్లున్న చిరుద్వీపాలను మాత్రమేయిది మన తలపుకు తెస్తూ వున్నది, కాని యివి వాస్తవానికి యివి అ సముద్రాన మునిగి వున్న మహాపర్వత శ్రేణుల శిఖరాలవంటివి" అన్నాడు.

నేడు ఈ శిఖరాలేగాక "పర్వతశ్రేణులు" క్రమంగా బయల్పడు తున్నాయి. పాశ్చాత్యజీవన విధానంలో హిందువుల మతదృక్పథం, ఆచారవ్యవ

హారాలు నేడు భాగంగా మారినమాట వాస్తవం. స్టాలిన్ కుమార్తె స్వెట్లానా కూడ గంగానదీతీరాన చిన్నపూరింట్లో నివసించడానికిమించి మరేమీ కోరుకోలేదు. మీరు దేవుణ్ని నమ్ముతారా అని మేటి చరిత్రకారుడు టాయన్‌బీని ఎవరో అడిగారు. ఆయన కొంచెం ఆలోచించి "అవును, దేవుణ్ని హిందువులు నమ్మినట్లుగానే" అన్నారు.

ఇందులో ఆశ్చర్యపడవలసిందేమీలేదు. భగవంతుడంటే హిందువులకు వున్న కల్పన ఎంతో సహజము, ఎంతో మానవీయము ఎంతో వైజ్ఞానికము అయినట్టిది. జపాన్‌లోవున్న ఆర్.యస్.యస్. తరహాసంస్థ 'షోకాగక్కాయి' నాయకుడైన ఇకేడాతో టాయన్‌బీ సంభాషిస్తూ యీ విషయాన్ని విస్పష్టంగా వివరించారు. "జుడాయిక్ మతాల్లో (యూదు, క్రైస్తవ, యిస్లాం మతాలలో) విశ్వంలోని దివ్యత్వ శక్తినంతటిని విశిష్టుడై, సర్వశక్తివంతుడై వుంటూ, ప్రపంచానికి వెలుపలగావుండే సృష్టికర్తలో కేంద్రీకరించడం జరిగింది. ఈ విధంగా పరిమితం చేయబడిన దివ్యత్వంవలన-మానవ ప్రవృతితోసహా-మొత్తం ప్రకృతి యొక్క దివ్యత్వాన్ని, పవిత్రతను తొలిగించినట్లయింది. కాని పాశ్చాత్యప్రభావం ప్రసరించకముందు యిందుకు విరుద్ధంగా భారతదేశం, తూర్పు అసియాలలో వున్న దృక్పథాన్ననుసరించి యీ విశ్వమంతా, దీనిలో వున్నవన్నీ-మానవుడూ, మానవేతర ప్రకృతితోసహా దివ్యత్వస్వరూపంగానే పరిగణించబడుతూ, ఆ విధంగా, మానవుడిదృష్టిలో ఒక పవిత్రతను, గౌరవాన్ని కలిగివున్నాయి. ఫలితంగా మానవేతరప్రకృతిపట్ల దురాశాపూరిత హింసాచర్యకు తలపడేప్రవృత్తి మానవుడిలో అరికట్టబడింది.

"జుడాయిక్ మతం 'వ్యక్తిదైవం' **(monotheism)** దృక్పథానికి విభిన్నంగా, భారతీయుల, తూర్పుఆసియన్‌ల దృక్పథం 'విశ్వదైవం' **(Pantheism)** సిద్ధాంతం మీద ఆధారపడివుంది. 'విశ్వదైవం' సిద్ధాంతంలో దివ్యత్వం విశ్వంలో అంతర్గతంగావుంటూ, విశ్వాన్నంతటిని ఆవహించివుంటుంది. 'వ్యక్తిదైవం' సిద్ధాంతంలో దివ్యత్వం విశ్వంనుంచి ఉపసంహరించబడి విశ్వానికి బాహ్యంగా చేయబడింది.

'ప్రాచీన జగత్తు'పశ్చిమభాగంలోను, అమెరికా ఖండంలోనుకూడ అక్కడ స్థానికంగా వుంటూవచ్చిన తొలి సంస్కృతులు-మధ్య అమెరికా, పెరూవియన్, సుమేజయన్, గ్రీకో-రోమన్, ఈజిప్టియన్ సంస్కృతులు; వ్యక్తిదైవ వాదులు కాకముందు ఇజ్రాయేలీలు అవలంబించిన కేనానైట్ సంస్కృతి కూడా-పాశ్చాత్య ప్రభావం ప్రసరించేముందు సరిగా భారతీయ, తూర్పు ఆసియా సంస్కృతులనే పోలివుండేవి. జుడాయిక్ మతాలు ఆవిర్భవించడానికి పూర్వమే వున్న అన్ని సంస్కృతులలోను మతం 'విశ్వదైవం' భావననే అనుసరించి వుండేదితప్ప 'వ్యక్తిదైవాన్ని' కాదు. ప్రస్తుతం జూడాయిక్ 'వ్యక్తి-దైవ' మతాలను అనుసరిస్తున్నవారు, క్రైస్తవమతం తరువాత రోములలో జూడాయిక్ క్రైస్తవానికి ప్రత్యామ్నాయ మతాలు ఏర్పరుచుకున్నవారు-వీరంతా ఒకనాటి 'విశ్వదైవ' వాదులే. ఈ చారిత్రక వాస్తవం కారణంగా, వారంతా తిరిగి 'విశ్వదైవ' దృక్పథాన్ని అవలంబించే అవకాశం వున్నదనే ఆశ కలుగుతున్నది. ఎందుకంటే 'వ్యక్తిదైవ' విశ్వాసంలో ప్రకృతిపట్ల గౌరవం లోపించడంవల్ల ఏర్పడుతున్న విషమత్వాన్ని నేడు వారు గ్రహించారు."

ఈ శతాబ్దం ప్రారంభంలో డా॥ ఆనీబీసెంట్ చెప్పారు: "ప్రపంచంలోని గొప్ప మతాలన్నింటిగురించి దాదాపు నలభై సంవత్సరాలపైగా అధ్యయనం చేసిన తరువాత నాకు హిందూమతం అనబడుతున్న యీ మహా సిద్ధాంతం కంటె యింతగా పరిపూర్ణమైన, యింతగా వైజ్ఞానికమైన, యింతగా తాత్వికము, ఆధ్యాత్మికమునయిన మతం వేరొకటి కనిపించడంలేదు. దానిగురించి ఎంతగా తెలుసుకుంటారో అంతగా మీరు దానిని ప్రేమిస్తారు. దానిని అవగాహన చేసుకోవాలని ఎంతగామీరు ప్రయత్నిస్తారో అంతగా దానిపట్ల మీ గౌరవభావన పెరుగుతుంది."

ఆమె యింకా యిలా అన్నారు: "ఈ విషయంలో పొరపాటుపడకండి-హిందూమతంలేనిదే భారతదేశానికి భవిష్యత్తులేదు. హిందూమతపు మట్టిలోనే భారతదేశం వేళ్లు పాదుకొనివున్నది. హిందూ మతంనుంచి భారతదేశం వేరు చేయబడితే తన స్థానంనుంచి పెళ్ళగించబడిన వృక్షంవలె అది వాడిపోవటం తప్పదు. భారతదేశంలో ఎన్నో మతాలు, ఎన్నో జాతులు వర్థిల్లుతున్నాయి, కాని వాటిలో భారత చరిత్రోదయ కాలంనుంచి వున్నది, జాతిగా భారతదేశం నిలువగలగ

డానికి అవసరమైనది వేరొకటిలేదు. వచ్చిన ప్రతిజాతి అంతరించిపోవచ్చు కాని భారతదేశం నిలిచేవుంటుంది. కాని హిందూమతమే అదృశ్యమైతే ఆమె ఏమవుతుంది? గతంయొక్క భాగోళిక రూపంగా భ్రష్టమై భవానికి మందస్మృతిగా మిగులుతుంది. భారతీయ చరిత్ర! భారతీయ కళ, భారతీయ నిర్మాణాలు అన్నింటిలో హిందూ మతమే పరివ్యాపించివున్నది."

హిందూ మతాన్ని హిందువులే నిలుపుకొనలేకపోతే. మరెవరు రక్షిస్తారు? భారతమాత బిడ్డలే భారతీయ విశ్వాసానికి అంటిపెట్టుకొని వుండకపోతే మరెవరు దానిని సంరక్షిస్తారు? భారతదేశమే భారతదేశాన్ని రక్షించగలదు; భారతదేశము, హిందూమతము ఒక్కటే" అనికూడా ఆనిబీసెంట్ అన్నారు.

లోకమాన్యతిలక్ యిలా ఉద్బోధించారు: "క్రైస్తవులు భారతదేశంలో నేడు క్రైస్తవమతాన్ని బోధిస్తున్నతీరుగానే ప్రపంచమంతటా సనాతనధర్మాన్ని బోధించండి, ఎందుకంటే ఆధునిక విజ్ఞానం మనప్రాచీన వివేకాన్ని క్రమంగా త్రోసిపుచ్చుతూ తన ఆధిక్యతను స్థాపించడానికి యత్నిస్తున్నది. కనుక మనమంతా సమైక్యమై సనాతనధర్మాన్ని బోధిద్దాం. జాతిని పునఃసృష్టిచేసి, యుగనిర్మాతలమై, ప్రపంచాన్ని ఆర్యమయం చేద్దాం. నేడు దీనికై ఎవరూ ముందుకు రాకుంటే రేపటితరంవారైనా ఈపనిచేస్తారని ఆశిద్దాం".

వివేకానందుని అమెరికన్ శిష్యురాలు సోదరి నివేదిత "వ్యాపకశీల హిందూత్వం" కోసం విజ్ఞప్తిచేశారు. "హిందువులు ప్రతిరోజు పదినిమిషాలసేపు ఉదయమూ, సాయంకాలమూకలిసి సామూహికంగా ప్రార్థన చేయగలిగితేచాలు, వారు అజేయమైన సమాజంగా రూపొందగలరు" అని నివేదిత అన్నారు.

"సోదరి నివేదితయొక్క ఆ తీవ్ర ఆకాంక్ష నేడు రాష్ట్రీయ స్వయసేవక సంఘు దైనందిన శాఖరూపంలో ఫలించింది" అని శ్రీ గురూజీ అన్నారు.

ఫ్రాన్సుదేశపు తాత్విక-చరిత్రకారుడు ఆమౌరి డి రీన్‌కోర్ట్ వ్రాస్తారు: "ఈ విశ్వంలో యింకా నిలిచివున్న అన్నిప్రాచీన నాగరికతలవలెనే భారతదేశం-పైకి ఏ విధంగా కనిపించినప్పటికి-నిజానికి రానురాను తన సహజ మౌలికతకే తిరిగివస్తున్నది...ఆ ప్రాచీన నాకరికతయొక్క లోతులనుంచే భారతదేశం ఆధు

నిక ప్రపంచానికి అనుగుణ్యంగా మారడానికి అవసరమైన శక్తిని సమకుర్చుకుంటుండటానికి చాల అవకాశాలున్నాయి."

"అంతోయింతో ఆధునీకరణపొందినప్పటికీ కాలాతీతమైన హిందూత్వం నుండి ఆవిర్భవించినట్లు కనిపించే సంస్థను, సిద్ధాంతాన్ని మాత్రమే భారతీయ ప్రజానీకం హృదయపూర్వకంగా సమాదరిస్తుంది" అని ఆయన అంటారు. అది నిన్నటి గాంధీయిజం అయితే, రేపు "స్థైర్యశాలిఅయిన ఆర్.యస్.యస్." మాత్రమే కాగలదు.

భారతదేశానికి, ప్రపంచానికి ఆర్.యస్.యస్. యొక్క ప్రాముఖ్యత యిది. నేడు ఆర్.యస్.యస్. భారతదేశంలో మాత్రమే, అదీ హిందువులలో పనిచేస్తున్నది. కాని ప్రపంచాన్నంతటిని ప్రభావితంచేసే ప్రాముఖ్యత ఈ కార్యక్రమంలోవుంది. "పాశ్చాత్యప్రపంచానికి మనం మార్గదర్శకులం కావాలి" అని శ్రీ గురూజీ చెప్పారు.

ఇదే నేడు ఆర్.యస్.యస్.కు వున్న స్థానం.

